


జ్ఞాన యోగం

విచారణ

భగవదన్వేషణ-కొన్ని మంచి మాటలు




సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

నన్ను "నేను" చేరుకోవటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి. కనుక తమవంతుగా భక్తి,జ్ఞాన ప్రచారార్ధం మహానుభావులైన **మోహన్ పబ్లికేషన్స్** వెబ్ సైట్ వారు ఉచితంగా విలువైన గ్రంధాలను ఆన్ లైన్ ద్వారా eBOOK(PDF) రూపంలో అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in),మైక్రోసాఫ్ట్ సైట్(http://www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) **మోహన్ పబ్లికేషన్స్** వారి వెబ్ సైట్: http://www.mohanpublications.com/
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సాయి రామ్ సేవక బృందాన్ని
సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com
సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement
సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంధ వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt


ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.

SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

మోహన్ పబ్లికేషన్స్ వారి వెబ్ సైట్:

http://www.mohanpublications.com/



అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, ఓజసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

సహస్రాధిక ఉచిత తెలుగు
ఇ – గ్రంధములకు
వీక్షించండి...

WWW. MOHAN
PUBLICATIONS.COM

==========================

ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు, వైద్య,

మంత్రశాస్త్రాది గ్రంధములకు

మోహన్ పబ్లికేషన్స్,

కోటగుమ్మం,
అజంతాహోటల్ ఎదుట,
రాజమండ్రి – 533 101.
తూర్పుగోదావరిజిల్లా
ఆంధ్రప్రదేశ్ – ఇండియా.

ఆధ్యాత్మిక, జ్యోతిష, వాస్తు,వైద్య, మంత్రశాస్త్రాది గ్రంధములకు

భగవదన్వేషణ

(కొన్ని మంచి మాటలు)

శ్రీ మహాభాష్యం నరసింహారావు
విజయనగరం



ప్రకాశకులు : ☎ 246 2565

మోహన్ పబ్లికేషన్స్

అజంతా హోటల్ ఎదురుగా,
కోటగుమ్మం, రాజమండ్రి -1.

 2010 వెల : 200-00

భగవదన్వేషణ - కొన్నిమంచి మాటలు

రచయిత చిరునామా :
మహోభాష్యం నరసింహారావు
యం.ఐ.జి. - 90; శ్రీ శాస్త్రా నిలయం
అలకానందకోలనీ
విజయనగరం - 535 003.
ఫోను : 08922 - 231927
సెల్ : 9985014751

కవరుపేజీ, లోపల బొమ్మలు :
శ్రీ కె.వీ. భీమారావు, హైద్రాబాదు

ప్రకాశకులు :
మోహన్ పబ్లికేషన్స్
కోటగుమ్మం, రాజమండ్రి - 533 101.

నా మాట....

భగవదన్వేషణ ప్రారంభించి అరవై సంవత్సరాలైంది. పుస్తకం రాయాలని సంకల్పం కలిగేక ఈ రూపుతేవడానికి ఇరవై సంవత్సరాలు పట్టింది. దీనిని ఎలా ప్రారంభించి ముగించాలో తెలియక రెండుసార్లు వ్రాసి నచ్చక చించి చెత్తబుట్టలో పడవేసాను.ముచ్చటగా మూడవసారి చేసిన ప్రయత్నం ఫలించి పుస్తకం ఈ విధంగా రూపుదిద్దుకొంది. ఇంతకు ముందు నేను వ్రాసి ప్రచురించిన పుస్తకాలన్నీ 18-40 రోజుల మధ్యకాలంలో వ్రాసి పూర్తిచేసినవే. ఇంకా నేను తెలుసుకోదగ్గ విషయాలు, నేర్చుకోదగ్గ విషయాలు ఎన్నో ఉన్నం దునే భగవంతుడు ఈ పుస్తక రచనను కాలయాపనచేసాడని ఇప్పడు గ్రహించెను. ఈ భగవదన్వేషణలో నేను ఎంతవరకు కృతార్థుడనయ్యానో పాఠకలోకం నిర్ణయించాలి.

అపురూపమైన ప్రార్థన శ్లోకాలు, పద్యాలు వివిధ గ్రంథముల నుండి సేకరించి కావాలనే ఎక్కువ సంఖ్యలో పిల్లలు, పెద్దలు తెలియని వారంతా వీటిని నేర్చుకొంటారనే సదుద్దేశ్యంతోనే ప్రచురించడం జరిగింది. భగవ దన్వేషణకు ప్రార్ధన ముఖ్యం కనుక పేజీలు తిరగవెయ్యకుండా ప్రతీ ఒక్కరూ ముందుగా ప్రార్ధనచేసి పుస్తకాన్ని చదవాలని నా అభిలాష, కోరిక. ఈ విధంగానైనా కొందరి పిల్లలకు తెలుగు పద్యాలు, నాలుగు సంస్కృత శ్లోకాలు పెద్దలు నేర్పిస్తే నా ఆశయం నెరవేరుతుంది. వారకి సర్వదాకృతజ్ఞుడనవు తాను.

మంచి-చెడు, క్రమశిక్షణ, శీలము ఉన్నతంగా ఎదగడానికి, ఆధ్యాత్మిక భావనలు కలగడానికి కారణం కనుక లోకంపోకడ తెలియజేస్తూ నేను వ్రాసిన సామాజిక వ్యాసాలు కొన్నిటిని, ఆధ్యాత్మిక వ్యాసాలు కొన్నిటిని ఇంతకు ముందు గతపదేళ్ళలో వివిధ పత్రికలలో ప్రచురించబడిన వాటిలో కొన్నిటిని ఏరికూర్చి ఈ పుస్తకములో పొందుపరిచేను.

అందరూ తెలుసుకోదగ్గవిషయాలు, ఆచరించవలసిన విషయములు, కొందరు మహానుభావులు చెప్పిన సూక్తులు, గొప్పమాటలను కూడా వివిధ గ్రంథముల నుండి సేకరించి, ఆధ్యాత్మికంగా ఎదగడానికి, భగవదన్వేషణకి తోడ్పడుతుందనే సదుద్దేశముతో వాటిని కూడా కొన్నిటిని ఈ పుస్తకములో జోడించాను. ఆ మహానుభావులందరకు నా కృతజ్ఞతాభివందనములు తెలియ జేస్తున్నాను.

పూర్వపు రోజులలో ఉమ్మడికుటుంబాలలో వుండే మమతాను రాగాలు ప్రేమాభిమానాలు ఎలావుండేవో తెలియజెప్పడానికి నా బాల్యము, విద్యార్థి దశ గురించి ప్రస్తావించాను. ఈ తరం వారికి అందులో గొప్పతనం తెలియదు. ఈ రోజుల్లో దగ్గరబంధువులు ఎవరైనా ఇంటికి వచ్చి పిల్లలను పరిచయం చేసుకోబోతే పిల్లలు 'హాయ్!' అంటూ చేతులు ఊపిలోనికి వెళ్తారు. కానీ కూర్చొని మాట్లాడటానికి ఇష్టపడరు. పైగా పరువు తక్కువగా భావిస్తారు.

ఈ పుస్తకాన్ని వెలుగులోనికి తేడానికి పదివేలరూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించిన నా తమ్ముడు చి॥ డా॥ మహాభాష్యం నరసింహ సీతారమనాథ్, చి॥సౌ॥ రాజ్యలక్ష్మి (రాజా) కు శుభాశీస్సులు. ఎంత బిజీగా వున్నా నా కోరిక మన్నించి , నామీద వున్న అభిమానముతో ఈ పుస్తకము కవరు పేజీ అందంగా తీర్చిదిద్ది అందజేసిన చిరకాల మిత్రుడు, నా శ్రేయోభిలాషి శ్రీఖరిడేహాల్ వేంకట భీమారావు, రిటైర్డు సీనియర్ మేనేజరు, (ఇసిఐఎల్) హైద్రాబాదువారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

ఈ పుస్తక వ్రాతప్రతిని ఎంతో శ్రమకోర్చి చదివి అమూల్య అభిప్రాయము తెలియజేసి పుస్తకములో తప్పులుదిద్ది సహకరించిన డా. జక్కు రామకృష్ణ, విజయనగరం గారికి నా కృతజ్ఞతాభివందనాలు.

ఈపుస్తకముద్రణకు ప్రోత్సహించి తగిన సలహాల నొసంగిన డా॥ రామసూరిగారికి మిత్రుడు వాకర్ శ్రీ సిహెచ్ ప్రకాశరావు, విజయనగరం గారికి ధన్యవాద ములు తెలియజేస్తున్నాను.

ఈ పుస్తకాన్ని అందంగా ప్రచురించడానికి సహకరించిన మోహన్ పబ్లికేషన్స్, రాజమండ్రివారికి నా ప్రత్యేక అభివందనములు.

-మహాభాష్యం నరసింహారావు

రచయిత

విజయనగరం

26-5-2010, నృసింహజయంతి

నా గురించి....

విజయనగరం కాపురస్తులు, కామోకాయన విశ్వామిత్ర గోత్రీకులైన శ్రీ మహాభాష్యం నరసింహం పంతులుగారు, శ్రీమతి వేంకట నరసమ్మగార్ల ద్వితీయ సంతానంగా మా నాన్నగారు శ్రీ వరాహ నరసింహంగారు జన్మించారు. బొబ్బిలి కాపురస్తులు శ్రీ ముదిగంటి (హరి) సీతారామయ్యగారు, శ్రీమతి సూరీడమ్మల ద్వితీయపుత్రిక రాజేశ్వరిగారిని మా నాన్నగారు పరిణయమాడేరు. వారికి ప్రథమ సంతానంగా నేను 7-10-1940సం॥లో బొబ్బిలిలో జన్మించాను. నా తరువాత అయిదుగురు తమ్ముళ్ళు ఒక చెల్లెలు జన్మించారు.

నా హైస్కూలు విద్యాభ్యాసము బొబ్బిలి, చోడవరం, విజయనగరం, రాజాం లలో జరిగింది. కాలేజీ విద్య విజయనగరం, భువనేశ్వర్‌లలో జరిగింది. భువ నేశ్వర్‌లో అగ్రికల్చరల్ బి.యస్సీ. చదవడానికి అక్కడవున్న మా నాన్నగారి కనిష్ట సోదరుడుయైన కాశీనాధ్ బాబయ్య, కామేశ్వరి పిన్ని గారింట్లో అయిదేళ్ళువుండి చదువు పూర్తి చేసేను. (1965)

1966 జనవరి నెలలో నేషనల్ సీడ్స్ కార్పోరేషన్‌లో విజయవాడలో ఉద్యోగం రావడంతో ఉద్యోగంలోచేరాను. 13 సంవత్సరములు నేషనల్ సీడ్స్‌లో చేసి, తరువాత ఏ.పి.సీడ్స్‌లోకి 1979లో ఉద్యోగంమారి రాష్ట్రంలో విజయవాడ, తణుకు, హైద్రాబాదు, నిజామాబాదు, కర్నూలు, వరంగల్, విజయనగరంలలో ఉద్యోగంచేసి 2000 సం॥మే నెలలో రీజినల్ మేనేజరుగా ఉద్యోగ పదవీవిరమణ చేసేను.

1969జూన్ ఆరవతేదీనాడు రెల్లివలసకాపురస్తులు శ్రీ ద్వైత సూర్యనారా యణ, సూరీడమ్మల ద్వితీయకుమార్తె రామలక్ష్మితో నా వివాహము జరిగింది. సంతానంగా ముగ్గురు అమ్మాయిలు చి॥సౌ॥ విజయ, అరుణ, భారతి జన్మిం చారు. ముగ్గురికీ వివాహాలు జరిగి హాయిగా కాపురాలు చేసుకుంటున్నారు. అల్లుళ్ళు ముగ్గురూ వివిధ శాఖల్లో ఇంజనీర్లుగా భారతదేశములోనే ఉద్యోగాలు చేస్తున్నారు.

1970లో ప్రప్రథమంగా నేను వ్రాసిన నాటికలు 'కొత్తల్లుడు, భలేఅల్లుడు, మంచి అల్లుడు, బాంధవ్యాలు' విజయవాడ నుండి ఆల్ ఇండియా రేడియోలో ప్రసారమయ్యాయి.

1982లో మొదటిసారి శబరిమల యాత్రచేసివచ్చి,స్వామి అయ్యప్పదీక్ష, శబరిమల యాత్ర పుస్తకం వ్రాసి రచనా వ్యాసాంగానికి శ్రీకారంచుట్టాను.

తరువాత శ్రీఅయ్యప్ప, శ్రీ షిర్డీసాయిబాబాలపై మరోయైదు పుస్తకములు వ్రాసి ప్రచురించాను. సుమారు 70,000 కాపీలు పుస్తకాలు నేను వ్రాసినవి ఇప్పటి వరకు అచ్చయి అమ్ముడు పోయాయి.

తరువాత 2000 సంవత్సరంలో రిటైర్మెంటు అయ్యాక 2001 నుండి వ్యాసరచనలు చేయడం ప్రారంభించాను. కొన్ని కథలు, ఆంధ్రప్రభ, ప్రియదత్తలో ప్రచురించేరు. నేనువ్రాసిన సామాజిక వ్యాసాలు 'ప్రియదర్శిని'లో 150, 'మంచి మాట' ఆధ్యాత్మిక వ్యాసాలు 50, వరకు ఆంధ్రభూమి దినపత్రికలో ప్రచురించ బడ్డాయి. ఇవికాక మరొక 100 వ్యాసాలు ఇతర పత్రికలలో కుముదం భక్తి, ఋషిపీఠం, దివ్యధాత్రి, ధ్యానమాలిక, భక్తిసుధ, సహస్రార, శ్రీవేంకటేశం, శుభం, మల్లె తీగ మున్నగు ఆధ్యాత్మిక పత్రికలలో ప్రచురించబడ్డాయి.

రచనా ప్రవృత్తే కాకుండా పోస్టల్ స్టాంపుల సేకరణ, పురాతన నాణెములు, విదేశీ కరెన్సీ సేకరణ నా హాబీలు. ఎక్కువ కాలము పుస్తక పఠనము, రచనా వ్యాసాంగముతోనే కాలము గడచిపోతోంది. ఆధ్యాత్మిక చింతన అలవరచుకొని, చేతనైతే ఇతరులకు సాయం చేస్తూ, మంచి మనిషిగా జీవించాలని ఆశయం.

మా ముత్తాతలు శ్రీ మహాభాష్యం నారాయణశేషాద్రిశాస్త్రిగారు, శ్రీ కాశీనాథ్ శాస్త్రిగారు కాశీలో విద్యాభ్యాసము చేసి, గొప్పగా భాష్యం చెప్పి ఇంటిపేరునే 'మహాభాష్యం'గా బిరుదుపొంది విజయనగరం మహారాజావారి ఆస్థాన పండితు లుగా వుండి పేరు ప్రతిష్టలు సంపాదించారు. ఆ వంశంలో జన్మించడం వలన అనుకుంటా కొద్దో గొప్పో నాకూ, మా అన్నదమ్ములందరకూ సాహిత్యాభిలాషతో పాటు రచనలు చేయడం ప్రవృత్తిగా మారింది. అంతకుముందు అంటే యైదు తరాలకు పూర్వము మా ఇంటిపేరు 'రుద్రాక్షి' వారని, కర్నూలు జిల్లా నంద్యాల దగ్గర గాజులపల్లె మా పూర్వీకుల నివాసంగా వుండేదని మా తాతగారు చెప్పారు.

ఇట్లు

విజయనగరం **మహాభాష్యం నరసింహారావు**

26-5-2010,నృసింహజయంతి రచయిత

పుస్తకముద్రణకు విరాళాన్ని అందించి,
ప్రోత్సహించిన దాతలు

డా॥ ప్రొ॥ మహాభాష్యం నరసింహసీతారామనాథ్
వారి సతీమణి రాజ్యలక్ష్మి (రాజా)
విశాఖపట్నం



అంకితం

సింహాచలేశ్వరుడు శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామికి భక్తితో అంకితం

నరసింహస్వామి నిన్నే
నిరతము సేవింతునయ్య నిండుమనముతో
కరుణింపుము దేవా నను
హరియను కీర్తింతు నిన్ను ఆశ్రిత రక్షా !

-మహాభాష్యం నరసింహారావు



రచయిత మహాభాష్యం నరసింహారావు,
వారి సతీమణి శ్రీమతి రామలక్ష్మి

మా గురుస్వామి

పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది. వికసించి గుభాళిస్తుంది 'వటువు ఇంత వాడై, ఇంతకు ఇంతై బ్రహ్మాండ మెల్లనిండెన్' అన్నట్లు శ్రీ అయ్యప్పసేవా సమితిలో యాత్రా విద్యార్థిగాచేరి, తన సహజసిద్ధమైన ఆధ్యాత్మిక చింతనతో తాను ఎదిగి, ఇతరులను ఎదిగించడానికి ఆధ్యాత్మిక రచయితయై, తన నిస్వార్థతకు గురుపీఠ శిఖరాగ్రములకు ఎదిగి, ఆ పదవికి వన్నెతెచ్చిన మా గురుస్వామి...

అలనాడు నృసింహస్వామివెంట చెంచులక్ష్మి అనుసరించినట్లు, జ్యోతి దర్శనా శక్తులైన అటవిక (పేటతుళ్ళి) అయ్యప్పలు, ఈ నరసింహస్వామిని అనుసరించి ఆ గురుస్వామి "చెట్టులెక్కగలను, పుట్టలెక్కగలను, వనయాత్ర చేయించి ఆకాశపు అంచున జ్యోతిచూపగలను" అని వారిని నడిపించే తీరు నిక్కముగ వక్కాణించెదమో మహాభాష్యం గురుస్వామి.

వికసించిన దేవకాంచనమని..........



మహాభాష్యం నరసింహారావు గురుస్వామి

న రసింహజన్మనిడిన నరసింహులకు అగ్రనరసింహుడితండు...
ర మ్య రచనల్ సల్పిన ఆధ్యాత్మిక తత్పరుండితండు...
సిం హాద్రి మొదల్‌కాంచనాద్రిపరై మార్గదర్శకుడితండు...
హా స్యమేగాని అపహాస్యమెరుగని స్వాముల బోధకుండితండు...
రా జేశ్వరీ నోములపంట, రామలక్ష్మి హృదయగుహేశండితండు...
వు న్నతమైన మహాభాష్య వంశోత్పన్న సుపుత్రుండితండు...
మ నమనస్సున మెదలాడే మాన్యమణికంఠుడితండు...
హా వభావాలకు చిందులాడే నృసింహుడా! కాదు నారసింహుడితండు...
భా దార్తులగోడు తన గూడపై నుంచు సాయినాథుడితండు..
ష్యం కలేక మా గురుస్వామి బోలాశంకరుడితండు....

–శ్రీ అయ్యప్ప సేవాసమితి, ముత్యాలంపాడు, విజయవాడ–11.

6–1–1992

ఆదర్శ గురువులు

1. పరమ పూజ్యులు శ్రీ ఆదిశంకరాచార్యులు
2. పరమ పూజ్యులు శ్రీ రామకృష్ణపరమహంస
3. పరమ పూజ్యులు శ్రీ రమణ మహర్షి
4. పరమ పూజ్యులు శ్రీ వివేకానందస్వామి
5. పరమ పూజ్యులు శ్రీ సద్గురు షిర్డీ సాయిబాబా
6. పరమ పూజ్యులు శ్రీ విమోచనానందస్వామి
7. పరమ పూజ్యులు శ్రీ సత్యసాయిబాబా
8. పరమ పూజ్యులు శ్రీ సద్గురు శివానందమూర్తి
9. పూజ్యులు శ్రీ సి.బి.వి. సుబ్రహ్మణ్యం గురుస్వామి
10. పూజ్యులు శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ
11. పూజ్యులు శ్రీ బిక్షమయ్య గురూజీ
12. పూజ్యులు శ్రీ ఉమాదత్ పట్నాయక్

జీవనయాత్రకు మార్గదర్శకులు

1.	శ్రీమతి మహాభాష్యం రాజేశ్వరి	(అమ్మ)
2.	శ్రీ మహాభాష్యం వరాహనరసింహం	(నాన్నగారు)
3.	శ్రీమతి భాస్కరభట్ల లక్ష్మీదేవమ్మ	(అవ్వ)
4.	శ్రీమతి ముదిగంటి సూరీడు	(అమ్మమ్మ)
5.	శ్రీమతి మహాభాష్యం వేంకటనరసమ్మ	(నాయనమ్మ)
6.	శ్రీ మహాభాష్యం నరసింహం పంతులు	(తాతగారు)
7.	శ్రీమతి వింజమూరి లక్ష్మీనరసమ్మ	(నాన్నగారి మేనత్త)
8.	శ్రీమతి దంతుర్తి లక్ష్మీనరసమ్మ	(రెండవ మేనత్త)
9.	శ్రీ మహాభాష్యం వెంకటరత్నం	(పిళ్ళాబాయి పిన్ని)
10.	శ్రీ మహాభాష్యం నారాయణశేషాద్రిశాస్త్రి	(బాబయ్య)
11.	శ్రీమతి మహాభాష్యం కామేశ్వరి	(కావాంబపిన్ని)
12.	శ్రీ మహాభాష్యం నారాయణకాశీనాధ్	(బాబయ్య)
13.	శ్రీ దంతుర్తి వరాహలక్ష్మీనరసింహమూర్తి	(మేనబావ)
14.	శ్రీ ముదిగంటి జగ్గారావు	(మేనమామ)
15.	శ్రీ దైత సూర్యనారాయణ	(మామగారు)
16.	శ్రీమతి దైత సూరీడమ్మ	(అత్తగారు)
17.	శ్రీ కూరెళ్ళ శేషగిరిరావు	(పెదతోటల్లుడు)
18.	శ్రీమతి మహాభాష్యం రామలక్ష్మి (రమ)	(సహధర్మచారిణి)

ఓమ్
శ్రీ శివాయ గురవే నమః శ్రీ విష్ణురూపాయ నమశ్శివాయ
శ్రీమాత్రే నమః శ్రీ స్వామియే శరణమయ్యప్ప!

ఓం గం గణపతియేనమః

అంతరాయ తిమిరోపశాంతయే శాంతపావన మచింత్యవైభవమ్ ।
తం నరంవపుషి, కుంజరంముఖే మన్మహే కిమపి తుందిలం మహః॥

1. ముదాకరాత్తమోదకం సదావిముక్తి సాదకం ।
కలాదరావతంసకం విలాసిలోక రక్షకమ్।
అనాయకైక నాయకం వినాశితే భద్రైత్యకం ।
నతాశు బాశు నాశకం నమామితం వినాయకం॥

2. నతేతరాతి భీకరం నవోదితార్క భాస్కరం।
సమత్పురారి నిర్జరం నతాధికాపదుద్దరమ్।
సురేశ్వరం నిధీశ్వరం గజేశ్వరం గణేశ్వరం ।
మహేశ్వరం తమాశ్రయే పరాత్పరం నిరన్తరమ్॥

3. సమస్తలోక శంకరం నిరస్తదైత్య కుంజరం ।
దరేతరోదరం వరంవరే భవక్త్ర మక్షరమ్ ।
కృపాకరం క్షమాకరం ముదాకరం యసస్కరం ।
మనస్కరం నమస్కృతాం నమస్కరోమి భాస్వరమ్ ॥

4. అకించనార్తి మార్జనం చిరంతనోక్తి భాజనం ।
పురారిపూర్వ నందనం సురారి గర్వ చర్వణమ్ ।
ప్రపంచనాశ భీషణం ధనంజయాది భూషణం ।
కపోలదాన వారణం భజేపురాణ వారణమ్ ॥

5. నితాన్తకాన్తి దన్తకాన్తి మస్తకాన్తి కాత్మజం
అచిన్త్య రూపమంత హీనమంతరాయ కన్తనమ్ ।
హృదన్తరే నిరన్తరం వసన్తమేవయోగినాం ।
తమేకదన్త మేవతం నిచన్తయామి సంతతమ్ ॥

6. మహాగణేశ పంచరత్న మాదరేణ యోన్వహం।
ప్రజల్పతి ప్రభాతనే హృదిస్మరన్ గణేశ్వరన్ ।
అరోగతా మదోషతాం సుసాహితీం సుపుత్రతాం
సమాహితాయ రష్టభూతి మభ్యుపైతి సోచిరాత్ ॥

ఓం శ్రీ గురుభ్యోనమః

1. అఖండమండలాకారం వ్యాప్తం యేన చరాచరమ్ ।
తత్పదం దర్శితం యేనతస్మై శ్రీగురవే నమః॥

2. అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా
చక్షురున్మీలితం యేనతస్మై శ్రీగురవే నమః
3. గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః।
గురురేవసాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః॥

హయగ్రీవ ముపాస్మహే

జ్ఞానానందమయంవేదం నిర్మల స్పటికాకృతిం ।
ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవ ముపాస్మహే ।
శంఖచక్ర మహాముద్రా పుస్తకాఢ్యం చతుర్భుజం
సంపూర్ణ చంద్ర సంకాశం హయగ్రీవ ముపాస్మహే ।
ఓంకారోద్గీత రూపాయ ఋగ్యజుస్సామమూర్తయే
నమో హమోత్త మాంగాయ వాంచితార్థం ప్రయచ్ఛమే ।
అజ్ఞానతిమిరంఛింది జ్ఞానమాశుప్రయచ్ఛమే ।
దేహిమే సంపదం దేవ హయశీర్ష నమోస్తుతే ।
మేదాం విద్యాం బలం ప్రజ్ఞాం సంపదం పుత్రపౌత్రకాన్
దేహిమే సకలం దేవ హయశీర్ష నమోస్తుతే ॥

శ్రీ దక్షిణామూర్తియే నమః

గురవే సర్వలోకానాం బిషజే భవరోగిణామ్
నిధయే సర్వవిద్యానాం దక్షిణామూర్తియేనమః
అప్రమేయత్ త్వయా దీత నిర్మల జ్ఞానమూర్తయే
మనోకిరాం విదూరాయ దక్షిణామూర్తియే నమః॥
వటవిటపి సమీపే భూమిభాగే నిషణ్ణం
సకల మునిజనానాం జ్ఞానదాతారమారాత్
త్రిభువన గురు వికాశం దక్షిణామూర్తి దేవం
జనన మరణ దుఃఖచ్ఛేద దక్షం నమామి॥
"దక్షిణామూర్తి బీజంచ రామ బీజేన సంయుతం
ద్రామిత్యేకాక్షరం, జ్ఞేయం, బిందునాద కళాత్మకం
ఏతద్బీజం మయా ప్రోక్తం బ్రహ్మ విష్ణు శివాత్మకం
వేదవ్యాసేన కథితం ప్రకారాంత రముచ్యతే।
దత్తస్యాది మంత్రస్య దాత్రేయ స్వాది మస్వరః
"దిగంబరాయ విద్మహే అవధూతాయ ధీమహి తన్నోదత్త ప్రచోదయాత్"
సదాశివ సమారంభాం శంకరాచార్య మద్యమామ్
కృష్ణమాచార్య పర్యంతాం వందేగురు పరమ్పరమ్ ॥

శ్రీ సరస్వత్యై నమః

జ్ఞానం దేహి స్మృతిందేహి విద్యాం విధ్యాది దేవతే ।
ప్రతిష్ఠాం కవితాం దేహి శక్తిం శిష్య ప్రచోధికామ్ ॥
వీణాధరే విపుల మంగళ దానశీలే, భక్తార్తి నాశిని విరంచిహరీశ వన్ద్యే ।
కీర్తి ప్రదేఖిల మనోరథ దేమహర్వ్యే, విద్యాప్రదాయినీ సరస్వతీ నేమినిత్యమ్ ॥
పుస్తక జపవటిహస్తే, వరదాభయ చిహ్నచారు బాహులతే
కర్పూరాములదేహే, వాగీశ్వరీ బోదయాసు మమచేతః
శారదా శారదాంభోజ వదనా వదనాంబుజే ।
సర్వదా సర్వదాఽస్మాకం సన్నిధి సన్నిధిం క్రియాత్॥
సరస్వతీ ! నమస్తుభ్యం వరదే కామరూపిణీ ।
విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతు మే సదా ॥
పద్మపత్ర విశాలాక్షి పద్మకేసరి వర్ణినీ
నిత్యం పద్మాలయే దేవి సామాం పాతు సరస్వతీ
మాణిక్యవీణా ముపలాల యంతీం, మదాలసాం మంజుల వాగ్విలాసామ్ ।
మహేంద్ర నీలద్యుతి కోమలాంగీం, మాతంగ కన్యాం మనసాస్మరామి॥

శివాయ గురవేనమః

వందేశంభుముమాపతిం సురగురుం వందే జగత్కారణం
వందే పన్నగ భూషణం మృగధరం వందే పశూనాంపతిమ్
వందే సూర్యశశాంక వహ్నినయనం వందేముకుందప్రియం
వందే భక్తజనాశ్రయం చవరదం వందే శివం శంకరమ్॥
గంగాతరంగ రమణీయ జటాకలాపం
గౌరీనిరంతర విభూషిత వామభాగం
నారాయణప్రియ మనంగ మదాపహారం
వారణాశీపురపతిం భజవిశ్వనాధమ్॥
శివ శివేతి శివేతి శివేతివా, భవ భవేతి భవేతి భవేతివా
హరహరేతి హరేతి హరేతివా, భజ మనః శివమేవ నిరంతరమ్॥
వాగర్థావివ సంపృక్తవే వాగర్థః ప్రతిపత్తయే
జగతః పతరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ ॥

శ్రీ మాత్రే నమః

1. అరుణాం కరుణాతరంగతాక్షీం, ధృతపాశాంకుశ పుష్పబాణచాపామ్
అణిమాదిభిరావృతాం మయూఖై, రహమిత్యేవ తోభావయామి భవానీమ్॥
2. అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాలబె
ద్దమ్మ సురారులమ్మ కడుపాఱడిపుచ్చినయమ్మ తన్నులో

నమ్మినవేల్పు టమ్ముల మనమ్ములనుండెడి యమ్మ దుర్గమా
యమ్మ కృతాబ్ది యిచ్చుత మహత్వకవిత్వ పటుత్వ సంపదల్.

3. కాత్యాయనీ మహామాయే భవాని భువనేశ్వరి ।
సంసార సాగరేమగ్నం మాముద్ధర కృపామయే ॥
బ్రహ్మ విష్ణు శివారాధ్యే ప్రసాదం జగదంబికే
మనోఽభిలషితం దేవి వరందేహి నమోఽస్తుతే ॥

4. అన్నపూర్ణే సదాపూర్ణే శంకరప్రాణవల్లభే ।
జ్ఞానవైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాం దేహీ చ పార్వతీ ॥

శ్రీ మహావిష్ణువే నమః

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీ వ్యాసం తతోజయ ముదీరయేత్ ॥
శాన్తాకారం భుజగశయనం పద్మనాభం సురేశం ।
విశ్వాకారం గగనసదృశం, మేఘవర్ణం శుభాంగమ్ ॥
లక్ష్మీకాంతం కమలనయనం యోగిహృద్ధ్యాన గమ్యం ।
వందే విష్ణుం భవభయహరం సర్వలోకైక నాధమ్ ॥
మేఘశ్యామం పీతకౌశేయవాసం శ్రీ వత్సాంకం కౌస్తుభోద్భాసితాంగమ్।
పుణ్యోపేతం పుండరీకాయతాక్షం విష్ణుం వందే సర్వలోకైకనాధమ్॥

శ్రీ మహాలక్ష్మీ స్తుతి

వందే పద్మకరాం ప్రసన్నవదనాం సౌభాగ్యదాం భాగ్యదాం ।
హస్తాభ్యామ భయప్రదాం మణిగణైర్నానా విధైర్భూషితామ్ ।
భక్తాభీష్ట ఫలప్రదాం హరిహర బ్రహ్మాదిభిస్సేవితాం ।
పార్శ్వే పంకజశంఖ పద్మనిది భిర్యుక్తాం సదాశక్తిభిః॥
సరసిజనయనే సరోజహస్తే దవతరాంశుక గంధమాల్యశోభే ।
భగవతీ హరివల్లభే మనోజ్ఞే త్రిభువనభూతికరి ప్రసీద మహ్యామ్॥

❁ ❁ ❁

శ్రీరాఘవం దశరధాత్మజ మప్రమేయం
సీతాపతిం రఘుకులాన్వయ రత్నదీపం ।
ఆజానుబాహు మరవింద దళాయతాక్షం
రామం నిశాచర వినాశకరం నమామి ॥

శ్లో॥ ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదమ్ ।
లోకాభిరామం శ్రీరామం భూయోభూయో నమామ్యహమ్॥

శ్లో॥ శ్రీరామచంద్రః ఆశ్రితపారిజాతః సమస్త కల్యాణ గుణాభిరామః
సీతాముఖాంబోరుహ చంచరీకః నిరంతరం మంగళంమాతనోతు॥

శ్లో॥ శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే ।
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే ॥

❁ ❁ ❁

భజగోవిందం భజగోవిందం । గోవిందం భజ మూడమతే ।
సంప్రాప్తే సన్నిహితేకాలే నహినహి రక్షతి దకృన్కరణే ॥
మూడజహీహి దనాగమ తృష్ణాం కురుసద్బుద్ధిం మనసీవితృష్ణాం॥
యల్లభసే నిజకర్మోపాత్తం విత్తంతేన వినోదయ చిత్తమ్ ॥
నారీస్తన భరనాభీదేశం దృష్ట్వామాగా మోహావేశమ్ ।
ఏతన్మాంసవసాది వికారం మనసి విచింతయ వారంవారమ్॥

❁ ❁ ❁

కస్తూరి తిలకం లలాటపలకే వక్షస్థలే కౌస్తుభమ్ ।
నాసాగ్రే నవమౌక్తికం కరతలే వేణుం కరే కంకణమ్ ।
సర్వాంగే హరిచందనంచ కలయన్ కంఠేచ ముక్తావళీ
గోపస్త్రీ పరివేష్ఠితో విజయతే గోపాల చూడామణి॥

❁ ❁ ❁

శ్లో॥ ఉగ్రంవీరం మహావిష్ణుం జ్వలంతం సర్వతోముఖం ।
నృసింహం భీషణం భద్రం మృత్యుం మృత్యుం నమామ్యహమ్॥
లక్ష్మీపతే ! కమలనాభ ! సురేశవిష్ణో
వైకుంఠ! కృష్ణ ! మధుసూదన ! పుష్కరాక్ష
బ్రహ్మణ్య ! కేశవ ! జనార్ధన ! వాసుదేవ !
లక్ష్మీనరసింహ మహదేహి కరావలంబమ్ ॥
ప్రహ్లాద నారద పరాశర పుండరీక ।
వ్యాసాంబరీష శుకశౌనక హృన్నివాస ।
భక్తానురక్త పరిపాలన పారిజాత ।
లక్ష్మీనరసింహ । మమదేహి కరావలంబమ్ ॥
ఏకేన చక్రమసరేణ కరేణ శంఖ
మన్యేన సింధుతనయా మవలంబ్యతిష్ఠన్ ।
వామేతరేణ వరదాభయహస్త ముద్రాం
లక్ష్మీనృసింహ ! మమదేహి కరావలంబమ్ ॥
మాతానృసింహశ్చ పితా నృసింహః
భ్రాతా నృసింహశ్చ సఖా నృసింహః
విద్యా నృసింహో ద్రవిణం నృసింహః
స్వామీ నృసింహస్సకలం నృసింహః

❁ ❁ ❁

శ్లో॥ ఆశ్యామకోమల విశాల తనూవిచిత్ర వాసోవసాన
మరుణోత్పల దామహస్తం ।
ఉత్తుంగ రత్నమకుటం । కుటిలాగ్రకేశం
శాస్తారం యిష్టవరదం శరణం శరణం ప్రపద్యే॥
శ్లో॥ తేజోమండల మద్యకం త్రిణయనం దివ్యాంబరాలంకృతందేవం
పుష్పశరేషు కార్ముఖిళసల్ మాణిక్యపత్రాభయం, బిభ్రాణాం
కరం పకంజైర్ మదగజస్కందాది రూఢం
విభుం, శాస్తారం శరణం భజామి సతతం ।
త్రైలోక్యసమ్మోహనమ్॥
శ్లో॥ కల్హారోజ్వల నీలకుంతల భరం కాలాంబుధశ్యామలం
కర్పూరా కలితాభిరామ వపుషం కాంతేందు
బింబాననం శ్రీదండ అంకుశ పాశశూల
విలసత్పాణిం మదాం దద్యువారూఢం శత్రు
విమర్దనం హృది మహాశాస్తారం ఆద్యం భజే ॥
శ్లో॥ భూతనాథ సదానంద, సర్వభూతదయాపర ।
రక్ష రక్ష మహాబాహో శాస్తే తుభ్యం నమోనమః॥

❁ ❁ ❁

మనోజవం మారుత తుల్యవేగమ్
జితేంద్రియం బుద్ధిమతాం వరిష్టమ్
వాతాత్మజం వానరయూధముఖ్యమ్
శ్రీరామదూతం శరణం ప్రపద్యే ॥

శ్లో॥ గోష్పదీకృత వారాశీం మశశీకృత రాక్షసమ్
రామాయణ మహామాలా రత్నం వందేనీలాత్మజమ్॥

శ్లో॥ యత్ర యత్ర రఘునాధకీర్తనం తత్ర తత్ర కృతమస్తకాంజిలిం
బాష్పవారి పరిపూర్ణలోచనం మారుతిం నమత రాక్షాసాంతకమ్॥

❁ ❁ ❁

శ్రీ కైవల్యపదంబుజేరుడికునై చింతించెదన్ లోకర
క్షైకారంభకు భక్తపాలన కళా సంరంభకుని దానవో
ద్రేక సంభకు గేళిలోల శజల సద్వుగ్జాల సంభూతనా
నాకంజాత భవాండ కుంభ కువంహానందాంగ నాడింబకున్
హరిః ఓమ్ తత్సత్....

1

ఒకనాడు జమీందారీ కుటుంబంగా వెలిగి పలువురికి అన్నంపెట్టిపేరు ప్రఖ్యాతులు గడించిన మా అమ్మమ్మగారి కుటుంబం మా తాతగారి మరణాంతరం మా మామయ్య చేసిన కొత్త వ్యాపారాలు కలిసిరాక, వున్న భూములు జమిందారీ యాక్టు, ఇనాందారీయాక్టు వలన పోవడంతో వున్న ఆస్తి అంతా కరిగిపోగా, బొబ్బిలిలో వున్న ఇల్లు అమ్ముకొని పొట్టచేత పట్టుకొని మా మామయ్య ఒక ప్రైవేటు కంపెనీలో గుమాస్తాగా ఉద్యోగంలో చేరడం, మా తాతగారు మా పెద్దమేనత్తకు ఒక సంపన్నుల సంబంధంచూసి పెళ్ళిచేసినా మా మామయ్య పెద్దలు మాటలను పెడచెవినిపెట్టి ఊళ్ళో వున్న భూములను ఇల్లు అమ్ముకొని పట్నంవచ్చి చిన్న చితక వ్యాపారాలు చేసి నష్టపోయి, పెద్ద చదువులేనందున గంపెడు సంసారంలో మా తాతగారి పంచచేరడం, అలాగే మాకు తెలిసిన వాళ్ళమ్మాయికి మెడిసిన్‌లో సీటువచ్చి జాయిన్ చేద్దామనుకున్న తరుణంలో తండ్రి ఏక్సిడెంట్‌కి గురియై మరణించడంతో మెడిసిన్ చదవవలసిన అమ్మాయి తండ్రి ఆఫీసులో గుమస్తాగా ఉద్యోగంలోచేరి కుటుంబ భారాన్ని వహించడం, మా బంధువర్గంలో ఒక అందమైన జంటకు అనాకారి అవిటితనం వున్న సంతానం కలగడం, డబ్బు, హోదా, గౌరవం అన్నీవుండి కొందరికి సంతానం కలగకపోవడం, కొందరు పుట్టుకతోనే ఎన్నో విద్యలలో (సంగీతం, సాహిత్యం, వివిధ కళలలో) ఆరితేరి వుండడం, ఏకసంతగ్రాహులుగా వుండడం, అభం, శుభం, తెలియని వయస్సులో వివాహమై పదేళ్ళు నిండకుండా వైధవ్యం పొందిన మా నాన్నగారి మేనత్త జీవితం, డబ్బు, ఆస్తి అన్నీ వుండి పద్దెనిమిదేళ్ళకే భర్తను పోగొట్టుకున్న మా మేనత్తగారి జీవితం నా జీవితంతో అడుగగడుగునా నేను ఎదుర్కొన్న సమస్యలు, ఒకతల్లికి తండ్రికి పుట్టిన నలుగురు పిల్లలలో ఒకరు ఇంజనీరు, డాక్టరు అయితే ఒకరు గుమాస్తాగా రాణిస్తే మరొకరు చదువురాక పిచ్చి వానిలా ప్రవర్తించడం, ఆస్తి, అంతస్తు, హోదా, ఇల్లువాకిలీ పిల్లలు, అన్నీవుండి పులిలా బ్రతికిన వ్యక్తులు చివరదశలో (వృద్ధాప్యంలో) వృద్ధాశ్రమాలలో మగ్గడం, కొన్ని పెంపుడు జంతువులు ముఖ్యంగా కొన్ని కుక్కలకు చేసే ముద్దు ముచ్చట, రాజభోగాలు ఇవన్నీ చూసాక నాలో అంతులేని ఆలోచనలు చోటు చేసు కున్నాయి. ఏదో అద్భుతశక్తి తెరవెనకవుండి ఆడిస్తోందని ఆ అద్భుత శక్తే కనిపించని భగవంతుడని, అతని ఉనికి తెలుసుకోవడానికి చేసిన ప్రయత్నమే ఈ భగవదన్వేషణ.

సృష్టిలో మొత్తం 84 లక్షల జీవరాసులున్నట్లు చెబుతారు. అన్నిట్లో మానవజన్మే ఉత్తమమైనదిగా, ఉత్కృష్టమైనదిగా చెబుతారు. ఎందుకంటే మానవుడు ద్విపాద జంతువు.వెన్నుపాము నిటారుగా భూమివైపు నుండి ఆకాశము వైపు వుండడం వలన (వీటిలోవుండే షట్ చక్రాలు అంటే ఆజ్ఞ, విశుద్ధ, అనాహత, మణిపూరక, స్వాధిష్ఠాన, మూలాధార అనువాటినే షట్ చక్రాలంటారు.) మానవునికి మేధాశక్తి అబ్బి మంచి, చెడుగురించి ఆలోచించగల విచక్షణా జ్ఞానం అలవడింది. జంతువు

లలో ఈ వెన్నుపాము భూమికి సమాంతరంగా వుండడం వలన పశువులలో ఆలోచనాశక్తి కొరవడింది. ఆజ్ఞాచక్రం రెండు కనుబొమల మధ్యవుండి వినాళగ్రంథులను పరిపోషిస్తూ వుంటుంది. గొంతుమధ్య భాగములో స్వరపేటిక దగ్గర వుండే విశుద్ధ చక్రం పరిసర అవయవ విధులను నిర్వహిస్తూ వుంటుంది. అనాహత గా పిలువబడే హృదయచక్రం, నాభిస్థానంలోవుండే చక్రాన్ని 'మణిపూరక' చక్రంగా చెబుతారు. ఇది చినప్రేవులను, పెదప్రేవుల వ్యవస్థను నియంత్రిస్తూ వుంటుంది. 'స్వాధిష్ఠానం' జననేంద్రియ, మూత్ర వ్యవస్థను నియంత్రణ చేస్తుంది. మూలాధారం సార్థక నామ ధేయంతో శరీరమంతటకీ మూలవ్యవస్థగా విధులు నిర్వహిస్తుంది. కంటికి కనబడని ఈ షట్ చక్రాలు మానవశరీరంలో గుప్తంగా నిర్వాహణకు ఎంతో తోడ్పడుతున్నాయి. కర్మేంద్రియాలు (కన్ను, ముక్కు, చెవి, నాలుక,చర్మం) జ్ఞానేంద్రియాలు (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు) శరీర వ్యాపకాలను నిర్వహిస్తాయి.

జంతువులలో అనేక రకాల జంతువులున్నాయి. పక్షులలో ఎన్నో రకాలు వున్నాయి. మనుషులలోనే ఎన్నోరకాలు కన్పిస్తారు. అందరికీ రెండు కళ్లు, రెండు చెవులు, ఒకముక్కు, నోరువున్నా రూపంలో చాలా తేడాలు కన్పిస్తాయి. కొందరు నల్లగా వుంటే కొందరు చామనచాయకాగా, మరికొందరు ఎరుపు, పసిడిరంగులలో వుండి, పెద్దకళ్లు కొందరికుంటే చిన్నకళ్ళు కొందరికుండి, పొట్టిగా ఒకరుంటే, పొడుగ్గా ఒకరు ఇలా రకరకాల ఆకృతిలో కన్పిస్తూ వుంటారు. ఇవన్నీ చూస్తూవుంటే సృష్టికర్త బ్రహ్మదేవుడు గొప్పశిల్పి, ఇంజనీరు కూడా అయివుంటాడనిపిస్తుంది. మన శరీర అవయవనిర్మాణాన్ని చూస్తేనే ఆశ్చర్యం కలుగుతుంది. ముక్కుతో వాసనచూడ వచ్చు, ఊపిరి పీలుస్తాము. నోటితో మాట్లాడవచ్చు, ఆహారాన్ని స్వీకరించవచ్చు. అలాగే స్త్రీ పురుషుల మర్మావయవాలు మూత్రవిసర్జనకు, సృష్టికార్యం నెరవేర్చడానికి ఇంకా శరీరంలో వ్యర్థపదార్థాలను విసర్జనకు సహకరిస్తాయి. మనం రకరకాల ఆహారాన్ని స్వీకరించినా కొంతభాగము రక్తమునకు, కొంత భాగము సృష్టి కార్యము నెరవేర్చడానికి అండము, వీర్యముగా, వ్యర్థపదార్థాలు మలమూత్ర రూపములోను స్వేదరూపంలోను, స్త్రీలలో నెలసరి బహిష్టు రూపంలోను బయటకు విసర్జించబడుతాయి. శరీరంలో అన్ని అవయవాలు సక్రమంగా పనిచేస్తే ఆరోగ్యంగావున్నట్లు లేకుంటే అనారోగ్యానికి గురి అవుతాము. సృష్టికర్త బ్రహ్మదేవుడు మంచి రచయిత కూడా కావడంవలన మానవుల్ని పుట్టించి చిత్ర విచిత్రమైన కథలల్లి వారి జీవితాలతో ఆడుకొంటువుంటాడు.

మనచుట్టూ వున్న నదులు, పర్వతాలు, రకరకాల చెట్లు, పువ్వులు, జలపాతాలు, సముద్రాలు, పచ్చనిపైర్లు, వింత అందాన్ని గొల్పుతాయి. జంతువులు, పక్షులు అందాల గురించి వేరేచెప్పనక్కర్లేదు. రకరకాల రంగులతో వింతగొలుపు రూపంలో అవి దర్శనమిస్తాయి. పక్షుల కిలకిలలు, జంతువుల రకరకాల అరుపులు, వాటి చేష్టలు చూస్తూవుంటే ఒక్కొక్కసారి నవ్వు పుట్టించి ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి.

బ్రహ్మదేవుడు సృష్టిలో గొప్ప, బీదాతారతమ్యం మానవులలోనే కాకుండా జంతువుల లోను, కీటకములలోను గోచరిస్తుంది. ఏనుగులు, అడవిలో సింహమువంటి కొన్ని జంతువులు బలమైనవి రాజుగా వ్యవహరించి మిగతా జంతువులను వాటి అదుపులో వుంచుకొని వాటిపై అధికారాన్ని పెత్తనాన్ని చెలాయించి సేవకులుగ ఉపయోగించు కొంటాయి. కీటకములలో చీమలు, చెదపురుగులు, తేనెటీగలు, మున్నగు క్రిమికీటక ములలో కూడా రాణి, రాజు కీటకాల నివాసానికి గూడుకట్టడం, కొన్ని ఆహారాన్ని సేకరించడం, వారిని కాపాడ దానికి సేవకులుగా, భటులుగా వ్యవహరించడం మనం నిత్యం చూస్తున్న విషయమే!

సృష్టిలో కొన్నిటిని చూసినపుడు ఆశ్చర్యం, నవ్వు పుట్టించినా దాని ప్రయోజ నం దానికుంటుంది. నాచిన్నతనంలో చదివిన కథ సందర్భం వచ్చింది కాబట్టి ఇక్కడ ప్రస్తావిస్తున్నాను.

పూర్వకాలంలో బస్సులు, రైళ్లులేని రోజులలో ఎంతదూరమైనా కాలినడకే ప్రయాణం చేసేవారు. శ్రీకాకుళం, విజయనగరం నుండి కూడా ఆ రోజులలో కాలి నడకన కాశీవెళ్ళి చదువుకున్నవారు, యాత్రచేసి విశ్వేశ్వరుని దర్శించి తిరిగి వచ్చినవారు కొందరైతే, కొందరు మార్గమధ్యములోనే క్రూరమృగములబారినపడో, దొంగలబారినపడో మరణించేవారు. దీని వలననే కాశీకిపోయినవారు కాటికి పోయిన వారితో సమానమనే నానుడిపుట్టింది.

అటువంటి ఆ రోజులలో ఒకబాటసారి నడిచినడిచి అలసిపోయి ఒకమర్రి చెట్టు నీడ విశ్రమించాడు. అతను పడుకొని నాలుగు దిక్కులాచూస్తూవుంటే అక్కడ దగ్గర్లో ఒకపొదలో గుమ్మడిపాదు కనిపించింది. ఆ పాదుకి పెద్దపెద్ద గుమ్మడికాయలు వేలాడుతూ కనిపించడం, పెద్దమర్రి వృక్షానికి చిన్నచిన్న పళ్ళువుండడం చూసి నవ్వుకొని బ్రహ్మదేవునికి నిజంగా తలకాయలేదు. ఇంతపెద్ద వృక్షానికి చిన్నచిన్న పళ్ళుపెట్టి, అంత చిన్న గుమ్మడిపాదుకి మోయలేనంత పెద్ద పెద్ద కాయలను పెట్టేడని ఆలోచిస్తూ నిద్రపోయాడు. కొంతసేపటికి చల్లని గాలివీచి చెట్టుపై నుండి మర్రిపళ్ళు ఆ బాటసారిపై పడడంతో మెలకువవచ్చి చూసేసరికి తనమీద, చుట్టూ చాలా మర్రిపళ్ళు పడివున్నాయి. అతనికి ఒక్కసారి భయంవేసి లేచి కూర్చొని బ్రహ్మదేవునికి తలకాయలేదనుకున్నాను. ఆయన చాలా తెలివైనవాడు కనుకనే సృష్టి అలాచేసేడు. ఒకవేళ గుమ్మడికాయలవంటి పెద్ద మర్రిపళ్ళే మర్రిచెట్టుకు వుండి అవిగాలికి తన మీదపడివుంటే ఈ పాటికి చచ్చేవాణ్ణని గ్రహించి గట్టిగా లెంపలు వాయించుకొని, తప్పుని మన్నించమని సృష్టికర్తకి ప్రణామాలాచరించి తిరిగి ప్రయాణం సాగించాడు.

దేవుని సృష్టిలో తప్పులెంచడం మనవెర్రితనం, అవివేకమే అవుతుంది. ఆ పరమాత్ముడు ఏది చేసినా ఎంతో ఆలోచించే సృష్టి చేస్తాడు.

ప్రకృతి భీభత్సాలు, తుఫాన్లు, భూకంపాలు, సునామీలు, వరదలు, కార్చిచ్చులు, అగ్నిపర్వతాలు, యుద్ధాలు, రకరకాల రోగాలు, కరువుకాటకాలు ఇవన్నీ ఎక్కువైన

జనాభాని తగ్గించి భూభారాన్ని సమతుల్యం చేయడానికే భగవంతుడు ఏర్పాటుచేసిన విధి విలాసమని చెప్పక తప్పదు.

పూర్వము మన మహర్షులు యజ్ఞయాగాదులుచేసి, తపస్సుచేసి భగవంతుని దర్శించివారు భగవంతుని రూపాన్ని వర్ణించి చెప్పడంతో మనకి భగవంతుని ఆకారం తెలిసింది. మన ఋషులు సందర్శించి చెప్పిన రూపాలనే శిల్పులు విగ్రహాలను తయారుచేస్తే వాటిని దేవాలయాలలో మంత్రపూర్వకంగా ప్రతిష్ఠించడం జరిగింది. కొందరు చిత్రకారులు గీచిన చిత్రాలనే భగంతుని ప్రతిరూపాలుగా భావించి పూజించడం జరుగుతోంది. భగవంతుడు (శక్తి) ఒక రూపములో ఎప్పుడూ వుండదు. వివిధ ఆకారాలు దాలుస్తుంది. త్రిమూర్తుల రూపంలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా అమ్మవారి రూపంలో శ్రీలలిత, దుర్గ, కాళీ, భవానీ, సరస్వతి, గాయత్రి మాత రూపాలలో సాక్షాత్కరిస్తారు. అందుకే కొందరు భగవంతునికి రూపంలేదని ఆయన నిర్వికారుడని పేర్కొంటారు. కానీ రూపంలేకుంటే సాధన కష్టమని, రూపంవుంటే భక్తి, శ్రద్ధ, నమ్మకం కలుగుతాయని మన మహర్షులు దైవానికి ఒక నిర్దుష్ట రూపాన్ని కలిగించి పవిత్ర నదీతీరాలలో కొండలపైన, అడవులలో ప్రశాంత వాతావరణంలో కాలుష్యానికి దూరంగా వుండే ప్రదేశాలలో విగ్రహ ప్రతిష్ఠచేసి గొప్పగొప్ప దేవాలయాలు నిర్మించి మానవాళి తరించడానికి మార్గము చూపేరు.

ప్రకృతి సౌందర్యంతో కన్నులు మిరుమిట్లు గొలుపుతూ పట్టణాలకు దూరంగా మనపుణ్య క్షేత్రాలు వుండేవి. కష్టపడి నమ్మకంతో, భక్తితో అడుగడుగునా, దైవాన్ని స్మరిస్తూ కొండలు, కోనలలో నడచివెళ్ళి దైవ సన్నిధికిచేరి దైవకృపకు పాత్రులయ్యేవారు. నేడు నాగరికతపేరుతో సకల సౌకర్యాలు కలిగించడం కోసం, అడవులను ధ్వంసంచేసి, ప్రతీచోట కాంక్రీటు భవనాలునిర్మించి, వినోదస్థలాలుగా, పర్యాటక కేంద్రాలుగా, వ్యాపార కేంద్రాలుగా దేవాలయ ప్రాంతాలను మార్చి డబ్బే పరమావధిగా ఎంచుకొని నేటి ప్రభుత్వాలు కాలుష్య వాతావరణంతోపాటు, దేవాలయాలను అపవిత్రంచేసి, భక్తిపారవశ్యంతో భగవంతుని దర్శించుకోకుండా చేస్తున్నారు.

2

భక్తులలో మూడురకాలుగా అధములు, మధ్యములు, ఉత్తములని వుంటారని గురుదేవులు శ్రీరామకృష్ణపరమహంస తెలియజేసారు. దేవుడు ఎక్కడో వున్నాడని, భగవంతుడువేరు, సృష్టివేరని అధమ తరగతికి చెందిన భక్తులు తలపోస్తారు. దేవుడు అంతర్యామి హృదయాంతరాళములో కలడని మధ్యతరగతివారు విశ్వసించి దైవాన్ని దర్శిస్తారు. దేవుడు సర్వంతర్యామి ఎందెందు వెతికిచూసిన అందందేకలడని విశ్వసించడమే కాక, అతడు బ్రహ్మాండమంతా వ్యాపించియున్నట్లు ఉత్తమ తరగతికి చెందిన భక్తులు విశ్వసిస్తారు. ప్రహ్లాదుడు ఉత్తమ తరగతికి చెందిన భక్తుడు కావడం వలనే తండ్రి హిరణ్యకశిపుడు క్రోధంతో నిత్యమూ నువ్వుకొలిచే శ్రీహరిని ఈ స్తంభములో చూపగలవా! అనిప్రహ్లాదుని ప్రశ్నించేసరికి ప్రహ్లాదుడు తడుము కోకుండా,

"ఇందుగలడందులేడని సందేహమువలదు చక్రిసర్వోపగతుం
డెందెందు వెదికి చూచిన నందందే కలడు దానవాగ్రణి వింటే"

అని చెప్పడంవిని హిరణ్యకశిపుడు తనచేతిలోవున్న గదతో ఆస్తంభమును చేధించే సరికి ఉగ్రనరసింహరూపములో నారాయణుడు ప్రత్యక్షమై హిరణ్య కశిపుని సంహరించినట్లు మనకి భాగవతకథ తెలియజేస్తోంది.

నా బాల్యంలోనే రామాయణ, భారత, భాగవత కథలు ఉగ్గుపాలతోనే ఒంట పట్టడంవలన భగవంతునిపై భక్తిభావం నాలో నాటుకుపోయింది. నాఅన్నప్రాశన రోజున ఎదురుగా ఎన్నో వస్తువులు వుంచినా నేను పాకురుకొంటూ వెళ్ళిమూలవున్న భాగవత గ్రంథాన్ని ప్రప్రథమంగా ముట్టుకున్నానని మా అమ్మమ్మ చెప్పిమురిసి పోయేది. తరువాత నా బాల్యంలో 5-6సం॥రాలు వయస్సు వచ్చేవరకు తిరుత్తణిలో గడపడం వలన అక్కడ ఇంటికి దగ్గరలో వున్నకొండకు ప్రతిరోజు పిల్లలంతా కలసి ఆ వయసులో తిరుత్తణికొండమెట్లపై నుండి నడచి కొండ ఎక్కి శ్రీ వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామివారిని దర్శించిరావడం, అక్కడ కొండపై ఊరేగింపు, ఉత్సవాలు, ఆడి కృత్తికకు జరిగే తెప్ప ఉత్సవాలు, పూలకావిడులు, పాలకావిడులు, మోసుకొంటూ కొండ ఎక్కే భక్తబృందాల కోలాహలం అంతా నా హృదయపలకంపై ముద్రించబడింది. తిరుత్తణిలో మాతాతగారు మహాభాష్యం నరసింహం పంతులు గారు ఆ రోజులలో సబ్‌రిజిస్ట్రారుగా ఉద్యోగంచేసి, పదవీవిరమణ తరువాత కొంత కాలం తిరుత్తణిలో వుండడం వలన మా నాన్నగారు వరాహనరసింహంగారు అక్కడకు దగ్గర్లోవున్న అరక్కోణంలో రైల్వేలో ఉద్యోగం చేయడంవలన బాల్యంలో కొంతకాలం శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారి సన్నిధిలో గడిపే భాగ్యం కలిగింది. అక్కడ వున్నప్పుడే మా అమ్మనాన్నగార్లతో కలిసి పళనివెళ్ళి పళని సుబ్రహ్మణ్యస్వామివారిని, అరుణాచలం వెళ్ళి అరుణాచలేశ్వరుని, శ్రీ రమణమహర్షి గారిని దర్శించి రావడం నా అదృష్టంగా భావిస్తాను. అవన్నీ బాగా గుర్తువుండడం ఈ నాటికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

తరువాత మా తాతగారు విశాఖజిల్లాలో వున్న చోడవరంకు తన మకాం మార్చడంతో మానాన్నగారు అరక్కోణం మకాం మార్చేరు. మా అమ్మగారికి అనారోగ్య కారణంగా నన్ను మా అమ్మమ్మగారి కోరికమేర బొబ్బిలి పంపించేరు. 1947 ఆగష్టు 15 తొలి స్వాతంత్ర్య సంబరాల వేడుకలు బొబ్బిలిలో జరగడం, ఆ ఊరేగిం పులో పాల్గొని త్రివర్ణపతాకాన్ని చేతిలో పట్టుకొని ఊరేగడం బాగా గుర్తువున్నాయి. బొబ్బిలిలో ముగ్గురు తాతగార్ల ఇళ్లు వరుసగా కలిపివుండేవి. మూడిళ్లలో తొలి మనవడని అవడం వలన అత్యంత గారాబంగా ముద్దుగా నన్ను అంతా చూసేవారు. అమ్మమ్మ, అవ్వ (మా అమ్మమ్మగారి అమ్మ) నన్ను పక్కలో పడుకోబెట్టుకుని రోజూ ఎన్నో నీతి కథలు, నీతిశతకపద్యాలురాత్రివేళ చెప్పేవారు. ఆ రోజులలో అంటే పదేళ్ళ వయసులోపు చూసిన సంఘటనలు, విని నేర్చుకున్న పద్యాలు, ఎక్కాలు అన్నీ ఈనాటికీ గుర్తుండిపోయాయి. బొబ్బిలిలో శ్రీవేణుగోపాలస్వామివారి దేవాల

యం అంటే నాకు చాలా ఇష్టంగావుండేది. తరుచు ఆ దేవాలయానికి వెళ్ళి రుక్మిణీ, సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామిని దర్శించి వచ్చేవాణ్ణి.

మా తాతగారు ముదిగంటి సీతారామయ్యగారు నాకు యైదేళ్ళ ప్రాయంలోనే స్వర్గస్తులయ్యారు. వారిది జమిందారీ వంశం. వారిరువురు అన్నదమ్ములతో కలసి ఆముదం, నల్లజీడి పిక్కలు, ముషిడీపిక్కలు, చింతపిక్కలు, కరక్కాయలు, ఇండుపు పిక్కలు మున్నగు ఏజెన్సీ సరకులను సేకరించి వ్యాపారం చేయడమేకాక వారు ఆరోజులలో జర్మనీ, ఇంగ్లండు వంటి విదేశాలకు ఎగుమతిచేసి విశేషలాభాలు ఆర్జించి లక్షాధికారులుగా కీర్తిపొందారు. ఇల్లు ఎప్పుడూ బంధుమిత్రులతో కళకళ లాడుతూ వుండేది. వారాలుచేసి చదువుకునే విద్యార్థులుండేవారు. దానధర్మాలకు లోటువుండేదికాదు. చుట్టుపక్కల పల్లెల నుండి ఏదైనా పనిమీద బొబ్బిలి వచ్చిన బంధుమిత్రులు వీరింటికే సరాసరివచ్చి భోజనం ఆరగించి అతిథి మర్యాదలు స్వీకరించి వెళ్ళేవారు. ఆదివారంవస్తే పోటీపడి కుంచాలతో బియ్యంతెచ్చి దోసిళ్ళతో బిచ్చగాళ్ళకు బియ్యం పోయడం మా పిల్లలకు ఒక ఆటగావుండేది. కొందరు సంతోషంగా మమ్మల్ని దీవించి వెళ్ళేవారు. మా పెద్దలు మమ్మల్ని చూసి పొంగిపోయేవారు. అలా మూడవతరగతి వరకు అంటే నాకు ఎనిమిది ఏళ్ళు నిండేవరకు బొబ్బిలిలో వుండి చదువుకున్నాను. అక్కడ మా అమ్మమ్మ వాళ్ళు చేసే ముద్దు, గారాబంచూసి నేను చెడిపోతానేమోననేభయం కలిగి మా నాన్నగారు నన్ను బొబ్బిలి నుండితీసుకు వెళ్ళి చోడవరంలో నాల్గవతరగతిలో చేర్పించారు. ఆ తరువాత పండగలకు, సెలవులకు తప్ప బొబ్బిలి వెళ్ళడానికి కుదిరేదికాదు. మా నాన్నగారికి వ్యాపారంచేసి డబ్బు సంపాదించాలని ఆశకలిగి, అరక్కోణంలో చేస్తున్న రైల్వే ఉద్యోగానికి రాజీనామాచేసి చోడవరంవచ్చి ఏవో వ్యాపారాలు చేయడం ప్రారంభించారు.

ఆ రోజులలో చోడవరంలో మా తాతగారితోనే ఉద్యోగం మానేసి వచ్చిన మా పెదనాన్నగారికుటుంబం, మాకుటుంబం, మా మేనత్తగారి పిల్లలు అంతా కలిసి పిల్లలమే ఎనిమిది మంది, పెద్దవాళ్ళు పదిమంది కలిసి మొత్తం అందరూ ఒక ఇంట్లో వుండేవారం. అక్కడ మేమున్న కందర్పాకోలనీలో చుట్టుపక్కల మా బంధువుల పిల్లలు పదిమంది వరకు వుండేవారు. వయసులో కొద్దిగా తేడాలున్నా ఆటపాటలతో అంతాకలిసి మెలిసి తిరుగుతూ అన్నిట్లో పోటీపడేవాళ్ళం,ఇంటివెనుక మామిడితోటలువుండేవి. తరచు ఆ తోటలలో ఎక్కువగా విహరించేవాళ్ళం. ఇంట్లో నేను సుబ్రహ్మణ్యస్వామిబొమ్మపెట్టి పూజలుచేయడం, అటుకులు, బెల్లం, వంటివి నైవేద్యంపెట్టి అందరికీ ప్రసాదాలు పంచడం, దేవుని రథంపై ఊరేగించడం లాటి ఆటలు నాతోటి పిల్లలతో ఆడేవాణ్ణి. చోడవరంలో ఇంటికి దగ్గర్లో బాలగణపతి దేవాలయం వుండేది. కాణీపాకం గుడిలో వినాయకుడిలా అక్కడ విగ్రహంపైకి సగభాగమే కనిపించి మిగతా సగభాగము తొండము భూమిలోకి చెరువు అడుగు భాగములో వున్నట్లు చెబుతారు. ఊరిలో పురాతన శివాలయం (గౌరీ శంకరాలయం)

వుంది. ఆ శివాలయానికి గొప్ప చరిత్ర వుంది. ఆ శివాలయం నిర్మాణంలో వున్నప్పుడు సింహాచలం వరాహనరసింహస్వామి దేవాలయం నుండి కొన్ని రాతిస్తంభాలు నడిచి వచ్చి గుడిలోకివచ్చి నిల్చినట్లు చెబుతారు. ఈనాటికీ సింహాచలంలో దేవాలయంలో పోలిన నాలుగు రాతిస్తంబాలు చెక్కు చెదరకుండా మనకి గుడిలో దర్శనమిస్తాయి. తరచు పిల్లలంతా కలిసి సెలవురోజులలో ఆ దేవాలయానికి వెళ్ళి దైవాన్ని దర్శించి వచ్చేవాళ్ళం. ఒకొక్కసారి తపస్సుచేయాలని మామిడితోటలలోకి వెళ్ళి చెట్లక్రింద కూర్చొని ఋషిలా తపస్సుచేయడం ఒక క్రీడగా వుండేది. ఆ రోజులలో మహాశివరాత్రి నాడు, కార్తీక సోమవారంనాడు ఇంట్లోపెద్ద వాళ్ళతో సమానంగా శ్రద్ధాభక్తులతో ఏమిత్రాగకుండా, తినకుండా ఉపవాసాలు చేసేవాళ్ళం. మహాశివరాత్రినాడు పిల్లలంతా కలసి జాగరణచేసి ఆటలు ఆడుతూ శివాలయంలో జరిగే వేడుకలు చూసి అనిర్వచనీయమైన అనుభూతిని, ఆనందాన్ని పొందడం మరువలేని గొప్పవిశేషం.

మా ఇంట్లో మానాన్నగారి మేనత్తగారు వింజమూరి లక్ష్మీనరసమ్మగారు బాల్యంలోనే వివాహమై పదేళ్ళు నిండకుండానే భర్తను పోగొట్టుకుని వైవాహిక జీవితాన్ని రుచిచూడకుండానే వైధవ్యాన్ని పొంది, ఆధ్యాత్మిక చింతనతో కాలము వెళ్ళబుచ్చేవారు. ఆమెకు తోడుగా మా రెండవమేనత్త దంతుర్తి లక్ష్మీనరసమ్మగారు ఉండేవారు. ఈమె ఒక కుమారునికి జన్మనిచ్చాక పద్దెనిమిది ఏండ్లు నిండకుండా భర్తను పోగొట్టుకొని వితంతువుగా మారి మాతాతగారి ఇంట్లోనే ఉండేవారు. వీరిరువురూ ఆధ్యాత్మిక గ్రంధాలు చదువుతూ, పిల్లలమైన మాకు భక్తి కథలు చెబుతూ, క్రమశిక్షణ నేర్పించి, బాల్యంలోనే మాకు ఆధ్యాత్మిక చింతన కలుగజేసేవారు. ఆరోజులలో వినాయకచవితి వస్తే 21 రకాల పత్రిలు సేకరించడానికి ముందురోజు మధ్యాహ్నాం స్కూలు ఎగగొట్టి తోటలవెంట దొడ్డిలవెంట తిరిగి రకరకాల పువ్వులు, పత్రిలు సేకరించి విఘ్నేశ్వరుని పూజ భక్తి శ్రద్ధలతో చేసేవారం. అలాగే దశరాలలో సరస్వతీపూజ, దీపావళి పండ గలు కూడా ఎంతోఘనంగా పిల్లలంతా కలిసి చేయడం ఆనందం కలిగించేది.

అప్పటికి (1951–52) మా ఇంట్లో కరెంటు దీపాలులేవు. కిరసనాయిలు బుడ్డీలు, లాంతర్లు పెట్టుకుని గుడ్డిదీపాల వెలుగులోనే చదువుసాగేది. పరీక్షలలో నాకు అత్తెసరుమార్కులు మాత్రమే వచ్చేవి. లెక్కలు, ఇంగ్లీషులో మార్కులు బాగా తక్కువ వచ్చేవి. మా నాన్నగారికి విపరీతమైన కోపం వుండేది. ఆ రోజులలో మా నాన్నగారి కోపాన్ని చూసి అంతా దూర్వాసుడు, విశ్వామిత్రునితో పోల్చేవారు. పరీక్ష లలో నాకు తక్కువ మార్కులు రావడంచూసి నాన్నగారు కోపగించుకొని నన్ను చితక బాదేవారు. ఆ సమయంలో మా మేనత్తలో, నాయనమ్మగారో వచ్చి అడ్డుపడి నన్ను మా నాన్నగారి దగ్గరనుండి దూరంగా తీసుకువెళ్ళేవారు. మా అమ్మగారికి నాపై ఎంతజాలి, ప్రేమ వున్నా నాన్నగారంటే భయం వలన నన్ను కొడుతూవుంటే

దగ్గరకు వచ్చేదికాదు. మానాన్నగారు లెక్కలు, ఇంగ్లీషులో డౌట్సు వుంటే అడగమనే వారు. అడిగితే కనీసం ఒక లెక్కచెప్పడానికి 10-20 మొట్టికాయలు, సొంటిపిక్కలు తినవలసివచ్చేది. ఆ బాధ భరించలేక డౌట్సు వున్నా వేరే వారిని అడిగేవాణ్ణి కానీ మా నాన్నగారిని అడగడానికి భయంవేసేది.

మా రెండవ మేనత్తగారబ్బాయి దంతుర్తి వరాహలక్ష్మీనరసింహామూర్తి నా కన్న వయసులో మూడేళ్ళే పెద్దయినా నాపై జాలి, అభిమానంతో నాకు లెక్కలు, ఇంగ్లీషు చెప్పి నాన్నగారి నుండి దెబ్బలు తినకుండా కొంతదోహదంచేసేవాడు. ఆ రోజులలో చదువంటే భయంపుట్టి ఇంట్లో నుండి దూరంగా పారిపోవాలని పించేది. కానీ మా అమ్మనాపై చూపేజాలి, కరుణ, ప్రేమ నన్ను కట్టిపడేసి ఇంటినుండి పారి పోకుండా చేసాయి. ఒకసారి 'నాన్నగారికి నాపై ఎందుకింతద్వేషం. నేను ఏం పాపం చేసానని' మా అమ్మగారి ముందు ఏడ్చాను. మా అమ్మ నాతలనిమురుతూ 'నాన్నగారికి నీపై ద్వేషంలేదు. నువ్వు బాగాచదువుకొని గొప్పవాడివికావాలని ఆయన అభిలాష' అని మా అమ్మసర్ది చెప్పి నన్ను ఊరడించింది. తరువాత స్కూల్లో పాఠం చెబుతూ ఒకసారి మా మాష్టారు భా.రవి గురించి చెప్పారు. ఆ కథవిన్నాక తండ్రికి పిల్లలపై ప్రేమవున్నా, వారు ఎంత గొప్పపనులు చేసినా వారిని ముందు పొగడరని, వారి అభివృద్ధినే కాంక్షిస్తారని తెలుసుకొన్నాను. అప్పటినుండి కష్టపడి చదవాలని నిర్ణయించుకొని, ఇంట్లోనుండి పారిపోయే ప్రయత్నాన్ని విరమించుకున్నాను.

మా అమ్మగారికున్న బంగారు నగలు, మాతాతగారిచ్చిన భూమిని విక్రయించి వచ్చిన సొమ్ముతో మా నాన్నగారు వ్యాపారాలు చేసి కలిసిరాక నష్టపోవడంతో, ఆ రోజులలో బ్రతకలేక బడిపంతులనే నానుడిని సార్థకం చేస్తూ చివరకు బి.ఎడ్ చదవడానికి నిర్ణయించుకొని విజయనగరం మకాం మార్చేరు. విజయనగరం వచ్చాక వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఇక్కడ ఆడుకోడానికి తోటలు, దొడ్డిలులేవు. స్కూల్లో చదివే ఫ్రెండ్స్ తప్ప వేరే కంపెనీ ఉండేదికాదు. నాన్నగారు ముందునుంచి నన్ను క్రమశిక్షణలో పెంచాలని తెల్లవారు జామున నిద్రలేపి, చన్నీటి స్నానం చేయించి, చదువుకోమనేవారు. సినిమాలకు పంపేవారు కాదు. చూస్తే సంవత్సరానికి ఒకటో రెండోసినామాలు చూడనిచ్చేవారు. సెలవు రోజులలో కూడా ఇంట్లో కూర్చుని బుద్ధిగా చదువుకోమనేవారు. నాతోటి పిల్లలంతా ఆటపాటలతో గడుపుతూ వుంటే నాకు చదవాలనిపించేది కాదు. కానీ తప్పనిసరిగా నాన్నగారు ఇంట్లోవున్నప్పుడు పుస్తకం పట్టుకొని కూర్చుని ఆయన బయటికి వెళ్లగానే తుర్రుమనేవాణ్ణి. ఒకవేళ మానాన్నగారు ఇంటికివచ్చే సరికి నేను ఇంట్లో లేకపోతే ఆరోజు నాకు బాగా దేహ శుద్ధి జరిగేది.

ఆ రోజులలో విజయనగరంలో ఎక్కడ నవరాత్రి ఉత్సవాలు జరిగినా, త్యాగ రాజు ఆరాధనా ఉత్సవాలు జరిగినా, మహాశివరాత్రి వంటి పండగ సందర్భాలలో మంచి పేరున్న హరిదాసులువచ్చి హరికథలు చెప్పేవారు. హరికథలు జనరంజకంగా

ఉండడం వలన పెద్ద సంఖ్యలోనే భక్తులు హాజరయ్యేవారు. ఆ రోజులలో టి.విలు రేడియోలు వంటివి ఇంట్లో లేనందున ప్రజలకు హరికథలు, బుర్రకథలు వీధినాటకాలే కాలక్షేపంగా వుండేవి. కురుక్షేత్రం, హరిశ్చంద్రవంటి నాటకాలు రాత్రిపదిగంటలకు మొదలుపెడితే తెల్లవారు జామున 5-6 గంటల వరకు నాటకాలు సాగేవి. హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసుగారు హరికథలుచెప్పే రోజులలో ఒక్కొక్క సారి రాత్రి పదిగంటలకు హరికథ మొదలుపెడితే తెల్లారి సూర్యుడుదయించే వరకు కథసాగేదిట. జనంకూడా కదలకుండా కట్రాటల్లా కూర్చొని వినేవారుట. కొన్నిచోట్ల టిక్కెట్లు పెట్టి అమ్మితే టిక్కెట్టుకొని దాసుగారిహరికథను వినేవారంటే ఈ రోజులలో ఎవ్వరూ నమ్మరు. కానీ ఇదిఅక్షరసత్యం. పండగరోజులలో పర్వదినాలలో ఇటువంటి కార్యక్రమాలు వుండేవికాబట్టి నాన్నగారు అభ్యంతరం చెప్పకుండా వెళ్ళనిచ్చేవారు. ఆవిధంగా నా పురాణ విజ్ఞానం పెరిగింది. విజయనగరంలో తర్డు, ఫోర్తు ఫారములు పూర్తయేసరికి మా నాన్నగారికి రాజాంలో టీచరుగా ఉద్యోగంరావడం వలన నాన్నగారు విజయనగరం నుండి రాజాం మకాం మార్చడంవలన రాజాం హైస్కూల్లో ఫిఫ్త్ ఫారంలో చేరాను.

ఇంటికి పెద్దకొడుకును అవడం వలన నా తరువాత పుట్టిన అయిదుగురు తమ్ముళ్లు, చెల్లి అంతా చిన్నపిల్లలవడం వలన ఇంట్లో పనులలో అమ్మకుసాయం చేసేవాణ్ణి. బయటబజారు పనులు, ఇంటికి కావలసిన సరుకులు తేవడం వంటి పనులు కూడా నేనే చేయవలసివచ్చేది. నా తరువాత పెద్ద తమ్ముడు సీతారామనాధ్ (మూర్తి) ఆరుఏళ్ళ తరువాత పుట్టడం, మధ్యలో ఇద్దరు పిల్లలు పుట్టిచనిపోవడంతో మా తమ్ముణ్ణి చాలా గారాబంగా చూసేవారు. దానికి తోడు వాడు బాగా చదివి అన్ని సబ్జెక్టుల్లో ఫస్టు మార్కులు సంపాదించడం వలన నాన్నగారికి వాడంటే ఇష్టంగా వుండేది. వాడిని బాగాముద్దు చేసేవారు. వాడికి ఏ పనులు చెప్పేవారు కారు. ఎప్పుడూ మా తమ్ముడు ఏదో పుస్తకం పట్టుకొని కూర్చుని చదువుకొనేవాడు. ఇంటా బయట పనులుచేస్తూ చదవుకోవడం నాకు కోపం చికాకు కలిగించేవి. మా తమ్ముడిపై ఈర్ష్యా ద్వేషాలతో మనసురగిలిపోయేది. ఒకొక్కసారి మా నాన్నగారు ఇంటిలో లేనప్పుడు ఏదోమిషపెట్టి కశితో నా తమ్ముణ్ణి కొట్టేవాణ్ణి. మానాన్నగారు ఇంటికి వచ్చాక మా తమ్ముడు కంప్లయింట్‌తో మానాన్నగారు నన్నుదండించేవారు. నాది వ్యర్థజీవితమని కుమిలిపోయేవాణ్ణి.

నాన్నగారి నోటంట ఏదైనాపని చేయమని ఆదేశిస్తే వెంటనే చేయాలి. ఒక్క క్షణం ఆలస్యమైనా కోపంతో అగ్గిరాముడై ముందూ వెనక చూడకుండా కొట్టేవారు. ఆ రోజులు తలచుకుంటే ఇప్పటికీ ఒడలు గగుర్పొడుస్తుంది. ఇంచుమించు ఫిఫ్తుఫారం పూర్తయ్యేవరకు నాన్నగారిచేత దెబ్బలుతిన్నట్లుగుర్తు. కాలేజీలో చదువకునే రోజులలో కూడా మా నాన్నగారితో ఎదురుగా మాట్లాడడానికి భయపడేవాణ్ణి. బయటకు ఎక్కడికైనా వెళ్ళాలనుకున్నా, డబ్బులు అవసరమైనా ముందు మా అమ్మగారికి చెప్పే

వాణ్ణి. మా అమ్మగారు భయపడుతూనే సమయం చూసుకొని పిల్లలంతా కలసి సినిమాకి వెళ్ళాలనుకొంటున్నారనో, వాళ్ళ అమ్మమ్మ గారి ఊరు వెళ్దామనుకుంటున్నారనో మెల్లగా చెప్పేది. ఆయనకి ఇష్టమై వెళ్ళమంటే వెళ్ళేవాళ్ళం. లేకుంటే మౌనంగా వుండి పోయేవాళ్ళం. నాకన్నా మాతమ్ముళ్ళకునాన్నగారి దగ్గర చనువు ఎక్కువగా ఉండేది. అలా అంత క్రమశిక్షణలో పెరగబట్టే కష్టం సుఖం, బాగా ఒంటబట్టేయి.

నేను స్కూలు ఫైనల్ చదువుతున్న రోజులలో ఎప్పుడైనా మా అమ్మగారిపై కోపంవచ్చి, నా విలువ ఇప్పుడు నీకు తెలియడంలేదు. రేపు నేను కాలేజీ చదువుకి పై ఊరు వెళితే అప్పుడు నీకు తెలుస్తుంది. అనేవాణ్ణి. నా మాటలకు మా అమ్మగారు నవ్వి, వెనకటికి నీలాటిదే ఒకామె తన కోడి, కుంపటీ లేకపోతే తెల్లారదనుకొనేదిట అనే సామెత చెప్పి నా కోపం పోగొట్టి నవ్వించేది. అలా చదువు సాగిస్తూ మెల్లగా స్కూలు ఫైనల్ చదువు పూర్తిచేసాను. (1956) భగవంతుని దయవలన మంచి మార్కులతో పరీక్ష పాసవడం వలన నన్ను డాక్టరు చేయాలని మా నాన్నగారు నన్ను విజయగరం మహారాజా కాలేజీలో సైన్సుగ్రూపులో ఇంటర్మీడియట్‌లో చేర్పించారు. విజయనగరంలో మా తాతగారికి స్వంత ఇల్లు వుండడంవలన, మా మేనత్త గారి కుటుంబంకోసం తాతగారు, నాయనమ్మగారు అక్కడ ఉండడంవలన నా చదువు రెండేళ్ళు నిరాటంకంగా విజయనగరంలో సాగింది.

క్రమశిక్షణ, శీలానికి మొదటనుండి మా ఇంట్లో ఎక్కువ విలువ నిచ్చేవారు. యవ్వన వికారాలు ప్రారంభమైనవేళ మనసును అదుపులో వుంచుకోడానికి శ్రీరామ కృష్ణ పరమహంస, వివేకానందుడు జీవితచరిత్రలు చదివి వారి జీవితాలను ఆదర్శంగా తీసుకొని చదువు సాగించాను. ఆ రోజులలోనే కాలేజీ లైబ్రరీ నుండి మహనీయుల జీవిత చరిత్రలెన్నో తెచ్చుకొని చదివేను. మా ఇంట్లో ఆర్థికపరిస్థితులు బాగులేక, వచ్చే జీతంచాలక కుటుంబభారాన్ని మోయడానికి నాన్నగారు పడే అవస్థలుచూసి బాధకలిగేది. ఇంటరు త్వరగా పూర్తిచేసి ఉద్యోగంలో చేరి కుటుంబాన్ని ఆదుకోవాలని కలలు కనేవాణ్ణి. పరీక్షలు బాగానే వ్రాసాను. కానీ ఇంటర్మీడియట్ పరీక్షలో తప్పడంతో ఇంట్లోవారంతా ఆశ్చర్యంతోపాటు బాధపడ్డారు. శోకతప్త హృదయంతో ఇక చదవనని చెప్పి ఉద్యోగప్రయత్నాలు మొదలుపెట్టి, నేవీ, ఎయిర్‌ఫోర్సుకి, రైల్వే ఉద్యోగాలకోసం దరకాస్తు చేసాను. కనీసం ఏ వుద్యోగానికి ఇంటర్వ్యూకి కూడా పిలువలేదు. ఈలోగా మా తాతగారు చోడవరంలో వ్యవసాయ భూములనమ్మి ఇల్లు కట్టాలనే ప్రయత్నంలో వుండి తనకు తోడుగా వుండడానికి నన్ను చోడవరం పంపమని అడగడంతో నాన్నగారు నన్ను చోడవరం పంపేరు.

ఆ రోజులలో మా నాన్నగారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా నన్నుఎలాగైనా చదివించాలని, కనీసం గ్రాడ్యుయేటునైనా చేయాలని అభిలషించేవారు. మా తాతగారికి నాయనమ్మ గారికి కూడా నన్ను చదివించాలని కోరిక వుండేది. భగవంతుడు లీలలు చిత్ర విచిత్రంగా వుంటాయి. మా నాన్నగారి ఆఖరి తమ్ముడు

కాశీనాథ్ బాబాయికి భువనేశ్వర్‌లో ఏ.జీ.ఆఫీసులో ఉద్యోగంరావడం వలన అక్కడ వుంటున్నారు. భువనేశ్వర్ అగ్రికల్చర్ కాలేజీలో సీట్లు వున్నాయని, అప్లై చేస్తే సులువుగా కాలేజీలో సీటువస్తుందని ముందు ఇంటర్వ్యూ ఉంటుంది కనుక స్టడీ సర్టిఫికెట్స్‌తో నన్ను భువనేశ్వర్ పంపమని మా తాతగారికి మా బాబాయ్య ఉత్తరం రాయడంతో మా నాన్నగారి అంగీకారంతీసుకుని నన్ను భువనేశ్వర్ పంపారు మా తాతగారు. ధనసహాయం చేయడంతో భువనేశ్వర్ అగ్రికల్చర్ కాలేజీలో చేరాను. ఆవిధంగా భువనేశ్వర్‌లో మా బాబాయి గారింట్లో యైదేళ్ళు వుండి చదువు కొనసాగించాను.

నేను కాలేజీలో చదువుకునే రోజులలో ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సు నాలో ఎక్కువగా వుండి బాధపడేవాణ్ణి. నేను దురదృష్టవంతుడనని, నల్లగా వుంటానని, అందంగా వుండనని, చదువరావడంలేదని దిగులుపడుతూ వుండేవాణ్ణి, నా శ్రేయస్సు అభిలషించి నన్ను మొదటనుండి అభిమానించే నా మేనత్త కుమారుడు డి.వి.ఎల్. నరసింహమూర్తి అప్పుడు ఢిల్లీలో ఐ.ఏ.ఎస్.కి కోచింగ్ తీసుకునేవాడు. నాలో వున్న ఇన్‌ఫిరియారిటీ కాంప్లెక్సు పోగొట్టడానికి పెద్దపెద్ద ఉత్తరాలు వ్రాసి వివేకానందుని సూక్తులు రాస్తూ, నన్ను ప్రోత్సహించి చదువకోడానికి చాలా దోహదంచేసాడు. అతను ముందుస్టేటు సర్వీసులో జాయిన్ అయి తరువాత ఐ.ఏ.ఎస్. సాధించి ఆంధ్ర గవర్నమెంటులో జిల్లాకలక్టరుగా, ట్రాన్సుపోర్టు కమీషనర్‌గా, లేబరు కమిషనర్‌గా, రిజిస్ట్రేషన్ ఐ.జి.గా, తిరుపతిదేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా వివిధ హోదాలలో ఉన్నత పదవులు ఎన్నో అలంకరించి తరువాత పదవీ విరమణ చేసారు.

భువనేశ్వర్ వాతావరణం నాకు బాగా నచ్చింది. న్యూకాపిటల్ అప్పుడే కొత్తగా నిర్మాణమవుతోంది. చేతిలో సైకిలు వుండడంవల్ల భువనేశ్వర్‌లో లింగరాజు మందిరం,కందగిరి, ఉదయగిరి గుహలు చూడడానికి శెలవు రోజులలో మిత్రులతో కలిసి వెళ్ళేవాణ్ణి. లింగరాజు మందిరంపైన, రాజారాణి మందిరంపైన వున్న శిల్పకళ అత్యంత అద్భుతంగా వుంటుంది. ఎన్నిసార్లు చూసినా తనివితీరదు. కొన్ని సజీవ శిల్పాలు అక్కడ దర్శనమిస్తాయి. శిల్పులు ఎంతో శ్రమకోర్చి రాతిలో సుందరంగా మలచిన శిల్పాలను, వివిధ రకాల చిత్రకళా కుడ్యచిత్రాలు కనువిందు చేస్తూ వుంటే చూసి ఓర్వలేని తరుష్కులు దేవాలయంపై చెక్కిన బొమ్మలను, నగిషీలను నాశనం చేసినా ఈ నాటికీ కొన్ని శిల్పాలు, చిత్రాలు జీవకళతో రాణించడం గొప్పవిశేషం. నేను అక్కడ కాలేజీలో చదువుకునే రోజులలోనే ఢిల్లీలో రెండు సంవత్సరాలు వరుసగా వరల్డ్ అగ్రికల్చర్ ఫెయిర్, మరొక సంవత్సరం వరల్డ్ ఇండస్ట్రియల్ ఫెయిర్ ఎగ్జిబిషన్లు జరగడంవలన రెండుసార్లు కాలేజీవారు నార్తు ఇండియన్ టూరుకి తీసుకు వెళ్ళడం జరిగింది. అలాఛాన్సు రావడం వలన చదువుకునే రోజులలోనే రెండుసార్లు కలకత్తా కాశీ, అలహాబాదు, ఢిల్లీ, కాన్పూరు మున్నగు ప్రదేశాలుచూడడం చిన్నవయసులోనే గంగానదిలో త్రివేణీ సంగమంలో స్నానం చేసే భాగ్యము, కాశీవిశ్వేశ్వరుని దర్శించు

కునే భాగ్యం కలిగింది. మరొక సంవత్సరం సౌత్ ఇండియా టూరు తీసుకువెళ్ళడం వలన బొంబాయి, పూనా, హైదరాబాదు, మైసూరు, బెంగుళూరు మున్నగు ప్రదేశాలు చూడడం జరిగింది. మైసూరులో బృందావన్ గార్డెన్స్, చాముండేశ్వరి దేవిని తొలి సారిగా దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను. భువనేశ్వర్‌లో చదువుకునే రోజులలోనే పూరీ, జగన్నాథస్వామి రథయాత్రని, కోణార్క్ దేవాలయాన్ని సందర్శించ డం జరిగింది. పూరి, కోణార్క్‌దేవాలయాలు కూడా అద్భుతమైన శిల్పకళాకండాలతో శృంగార స్త్రీమూర్తులతో చూడముచ్చట గొలుపుతాయి. అక్కడ శిల్పాలలో శృంగారా నికి ఎక్కువ ప్రాధాన్యత కనిపిస్తుంది.

మా ఇంట్లో మా తమ్ముళ్ళు వారి చదువుతోపాటు సాహిత్యంపై మక్కువతో కవితలల్లేవారు. మాపెదతమ్ముడు సీతారామనాథ్‌కి ఆంగ్లంలోను, తెలుగులో కూడా భాషపై మంచిపట్టువుండడంతో తెలుగులో పద్యాలు రాయడమే కాకుండా అసుకవిత్వం చెప్పి అందరినీ అద్భుతపరచేవాడు. రెండవ తమ్ముడు నరసింహనాథ్, నాల్గవతమ్ముడు శ్రీహరేష్ కూడా కృషిచేసి తెలుగులో పద్యాలు రాయడం ప్రారంభిం చారు. ఆ రోజులలో మా తమ్ముడు సీతారమనాథ్, శ్రీహరేష్ రామాయణాన్ని పద్య కావ్యంగా రాసేరు. సీతారామనాథ్, బాలకాండనే రామాయణంగా రాస్తే మా శ్రీహరేష్ మొత్తం రామాయాణాన్ని వెయ్యిపద్యాలలో తెలుగులో వున్న అన్ని చందస్సులలో పద్యాలు రాసేడు. వీరిని చూసి మిగతా తమ్ముళ్ళు పద్యాలు రాయడం మొదలెట్టారు. నేను శలవులకు ఇంటికివెళితే వారు వ్రాసిన పద్యాలు నాకు పోటీపడి వినిపించేవారు. మా అమ్మగారు కమ్మగా వేడివేడిగా చేగోడీలో, జంతికలో, బజ్జీలో, పకోడీలో వేయించి ప్లేట్లలో పెట్టి అందిస్తూ వుంటే వాటిని ఆరగిస్తూ మధ్యమధ్య అమ్మచేసిన పిండివంట కాలను, అమ్మను పొగుడుతూ పద్యాలు చెబుతూవుండేవారు. వారిని చూసి నాకూ పద్యాలు రాయడం నేర్చుకోవాలని రాయాలని కుతూహలం కలగడంతో కష్టపడి ఆ రోజులలో నేనూ పద్యాలు రాయడం నేర్చుకుని కొన్ని పద్యాలు వ్రాసాను. వాటిలో మచ్చుకు కొన్ని ఇక్కడ ఉదహరిస్తున్నాను.

అమ్మమాట వినుము అన్నివేళల యందు
జయము నీకు కలుగు శంకవలదు
అమ్మమాట నమ్మి ఔన్నత్యమందితి
అనుభవమ్ము తోడ అంటినేను 1

నాన్నమాట నమ్మి అన్ని బాగచదివి
పట్టువిడువ లేదు ఫలముదక్కె
జాబువచ్చె వేగజనని కరుణతోడ
నాన్నమాట వేదమన్నమాట. 2

ఎట్టివంటనైన ఇంపుగా చేసెడి
అమ్మచేతివంట అమృతమ్ము

విసుగులేదు తల్లి కిసుమంతయైనను
అమ్మవంటి వారు అరుదు ఇలలోను 3
వర్షమొచ్చి హర్షమొసగె కర్షకులకు
అతిముదమున జల్లిరి విత్తులాసతోడ
బాగుపండునంచు ప్రజలు పలికి రపుడు
దైవమేమిటి చేయగ దలచినాడొ ! 4
ఏమిగెడ్డమొచ్చె ఏమి సేతును నేను
షేవు చేయకున్న చింతకలుగు
ఎల్లపురుషుల కిది ఏమిశాపమొ కదా!
ఏమిబాదవచ్చె ఏమిసేతు 5
అమ్మకెపుడు కార్తికనిన ఇష్టము
నాన్నకెపుడు మూర్తియన్నప్రీతి
శ్రీహరనిన నాకు చెడ్డఇష్టము కద
ఏను అంటె ఇష్టమెవరికింట ? 6
మదిన నిన్ను తలంచుచు మాత దీని
వ్రాయనారంభమునుచేస్తి, పలుకువెలది
నీదయనుజూపి వేగంబె నేను జేయు
పద్యరచనకు జేయూతవాణి ఇమ్ము. 7
మూర్తి నాకు పద్యములు వ్రాయరాదని
ఏను ఊరుకొంటి ఇన్నినాళ్లు
కాని శ్రీహరేషు కష్టముతోనేర్పె
పద్యరచన నాకు వచ్చెనింట. 8
పిచికచూడ చిన్న పిసరంత యుండును
అల్లరింత దాని దనుట వశమె
నిద్రవచ్చువేళ నిత్యంబు అరచును
తెగులు కుదురుటెటుల దీనికింక. 9

ఆ రోజులలో ఇంట్లో అంతాకలిస్తే పండగవాతావరణం నెలకొనేది. అభిమానాలు, ఆప్యాయతలు, అనురాగాలతో అన్నదమ్ముల అనుబంధం కొనసాగేది. మా చెల్లి అయిదుగురు తరువాత పుట్టడం వలన, చిన్నపిల్లవడం వలన ఇంట్లో అందరికీ ముద్దుగా వుండేది. పెద్దల్ని గౌరవించడం, వినయ విధేయతలతో మెలగడం అన్నీ మా అమ్మగారు ఉగ్గుపాలతోనే ఇంట్లో మా అందరికీ నేర్పడం వలన అంతా క్రమశిక్షణలో పెరగడం జరిగింది. మా ఇల్లు సరస్వతీ నిలయంగా వుండి పలువురికి ఆదర్శంగా వుండేది. కష్టాలు వుంటే దైవభక్తి మెండుగా వుంటుందనేది జగమెరిగి సత్యం. మేము ఆ రోజులలో కష్టాలలో వుండడం వలన ఇంట్లో భజనలు, పూజలు

కూడా అంతా కలిసి చేసేవారం. మా పెద్దల ప్రోత్సాహం వుండడం వలన భక్తి పాటలు పాడుతూ అప్పుడప్పుడు ఇంట్లో తరచు భజనలుజరిగేవి. హరినామ స్మరణతో ఇల్లంతా మారుమ్రోగేది. శనివారంనాడు ప్రత్యేకంగా భజనలు చేసేవారు. చుట్టుప్రక్కల వారు కూడా అప్పుడప్పుడు వచ్చి భజనలలో పాల్గొనేవారు. మా తమ్ముళ్ళ గొంతు బాగుండడం వలన భక్తిపాటలు రాగయుక్తంగా తన్మయత్వంతో పాడేవారు. ఇంట్లో వున్న కొన్ని వస్తువులనే వాద్యపరికరాలుగా ఉపయోగించి భజనను రక్తి కట్టించేవారు.

1962వ సంవత్సరంలో చైనా భారతదేశముపై దండయాత్ర చేయడంతో యుద్ధం మొదలయింది. అంతవరకు శాంతిమంత్రాలను వల్లెవేస్తూ నిద్రాణమైవున్న దేశప్రజలలో చైతన్యం వచ్చింది. నా శరీరంలో ఉడుకు రక్తంపొంగి ప్రవహిస్తూ న్నందున దేశభక్తి రగిలింది. దేశసేవ చేయాలని మనసు ఉరకలువేయడంతో కటక్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ సెంటర్లో జూనియర్ కమీషన్డ్ ఆఫీసర్లు రిక్రూట్‌మెంట్ జరుగుతోందని విని కటక్ వెళ్ళేను. మూడురోజులు ఏవోపరీక్షలు నిర్వహించి చివరకు నన్ను సెలక్టు చేయలేదు. చాలా బాధ కలిగింది. ఆర్మీలో చేరడానికి అవకాశం లేదానని అడిగితే కావలిస్తే సోల్జరుగా చేరవచ్చని చెప్పేరు. ఈవిషయం మా నాన్న గారికి, తాతగారికి తెలిసి సోల్జరుగా ఆర్మీలోచేరడానికి అయిదవక్లాసు క్వాలిఫికేషన్ చాలని పిచ్చిపిచ్చి ఆలోచనలు పెట్టుకోకుండా బాగా చదువుకోమని చివాట్లు వేసేరు. అంతటితో ఊరుకోకుండా గ్రాడ్యుయేషన్ పూర్తయేవరకు వేరేఆలోచనలు పెట్టుకో వద్దని, ఉద్యోగంలో చేరాక ఏ వృత్తి నిర్వహిస్తున్నా నీతినిజాయితీగా వుండి సక్రమంగా విధులు నిర్వహిస్తే అదేగొప్ప దేశసేవని దేశసేవ చేయడానికి మిలట్రీలోనే చేరక్కర్లేదని గట్టిగా మందలించడంతో మిలట్రీ ఆలోచనకి స్వస్తిచెప్పి బుద్ధిగా చదువుకోవడం మొదలు పెట్టేను.

కాలేజీలో చదువుకునే రోజులలో దొరికిన సాహిత్యాన్నంతా చదివేవాణ్ణి. చదువుకునే రోజులలో కొన్ని కథలు వ్రాసేను, కానీ ఏ ఒక్కటీ ప్రచురణకు నోచుకో లేదు. నేను కష్టపడి రాత్రిపగలు చదివినా తలకెక్కి జ్ఞాపకం వుండేది తక్కువగా వుండేది. అలాగే పరీక్షలువ్రాసి, మధ్యలో రెండుసార్లు పరీక్షలో ఫెయిల్ అయినా పెద్దల ఆశీస్సులతో భగవంతుని కృపతో డిగ్రీ చదువుపూర్తిచేయకలిగేను. ఫైనల్ ఇయర్‌లో ప్యాసయినట్లు తెలిసాక కైలాసశిఖరం అధిరోహించినంత ఆనందాన్ని పొందేను. ఆరోజు మరవలేనిది. మా ఇంట్లో మానాన్నగారు, అమ్మ, తమ్ముళ్ళు, పొందిన ఆనందం వర్ణనాతీతం. కానీ నన్ను అభిమానించి, నా భవిష్యత్తుకు దారి చూపిన మా తాతగారు శుభవార్త వినకుండా నెలరోజులకు ముందే స్వర్గస్తులవడం బాధ కలిగించింది. (1965)

నా చదువు పూర్తయేసరికి (1965) మా పెద్దతమ్ముడు సీతారామనాథ్ విజయనగరంలో బీ.యస్సీ పూర్తిచేసి విశాఖపట్నం ఆంధ్రాయూనివర్శిటీలో ఎమ్.యస్సీ,లో చేరాడు. మొదటినుండి తెలివైనవాడు కావడం వలన క్లాసుఫస్టు, స్కూలు

ఫస్టు, కాలేజీఫస్టు వచ్చి చివరకు యూనివర్శిటీ ఫస్టు కూడా వచ్చి డిగ్రీలో రెండు గోల్డు మెడల్స్ అందుకోవడం మా ఇంట్లో అందరికీ గర్వకారణమయింది. అతని చదువు పీయుసీ నుండి స్కాలర్‌షిప్పులతోనే సాగింది. అలాగే ఎమ్.యస్సీ, పిహెచ్‌డి చేసి మా కుటుంబంలోనే మొదటి డాక్టరేట్‌ను సంపాదించి, హైద్రాబాదు ఈసిఐఎల్‌లో కొంతకాలం, ఖరగ్‌పూర్ ఐఐటీలో కొంతకాలం ఉద్యోగంచేసి చివరకు ఆంధ్రాయూనివర్శిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్‌గా స్థిరపడి మంచి గుర్తింపు పొందేడు. ఆ రోజులలో నేను మా తమ్ముడు సీతారామనాథ్ ఉద్యోగంలో చేరేక అమ్మ,నాన్నగారు కష్టపడకుండా వారిని సుఖపెట్టాలని, ఆర్థికంగా కుటుంబాన్ని ఆదుకొని తమ్ముళ్ళకు మంచి చదువులు చెప్పించాలని, చెల్లికి మంచి సంబంధం చూసి పెళ్ళిచేయాలని, రధానికి రెండు చక్రాలుగా ఇరువురు వుండి రథసారధ్యాన్ని అమ్మనాన్నలకు అప్పగించాలని, వారిని అన్నివిధాల ఆనందింపజేయాలని ఎన్నో కలలు కన్నాము. ఇంటికి పెద్దవారుగా ముందు పుట్టినందులకు కొంతత్యాగం చేయాలని మంచి మనసుతో నిర్ణయం తీసుకున్నాము.

నా జీవితంలో భగవంతుని లీలలు నా చదువు పూర్తయాక మొదలయ్యాయి. ఉద్యోగ ప్రయత్నం మొదలు పెట్టేను. మా నాన్నగారు అప్పుడు శ్రీకాకుళం జిల్లాలో హీరమండలం అనే ఊరిలో హెడ్‌మాస్టారుగా ఉద్యోగం చేసేవారు. మామేనత్తగారబ్బాయి శ్రీ డి.వి.ఎల్.నరసింహమూర్తి విజయవాడలో అప్పుడు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమీషనర్‌గా ఉద్యోగంలో వున్నందున నన్ను విజయవాడ వచ్చి వారింట్లోవుండి ఉద్యోగప్రయత్నం చేయమని పిలనిచనందున వెంటనే విజయవాడ వెళ్ళేను. విజయవాడలో శ్రీ కనకదుర్గమ్మవారిని దర్శించి, ఉద్యోగవేట ప్రారంభించాను. నా క్లాసుమేట్, ఆప్తమిత్రుడు నాగేశ్వరరావు ఢిల్లీలో నేషనల్ సీడ్స్ కారొపరేషన్‌లో ఉద్యోగం సంపాదించి, కొత్తగా విజయవాడలో ఆఫీసు బ్రాంచి పెట్టినందున విజయవాడ పోస్టింగ్ యిచ్చి ట్రాన్స్‌ఫర్ చేయడం వలన విజయవాడలో వుంటున్నట్లు ఉత్తరం రాయడంతో ఒక రోజు అతనిని కలియడానికి విజయవాడలో ఎన్.ఎస్.సీ ఆఫీసుకు వెళ్లేను. ఆఫీసులో స్టాపు పదిమందికి మించిలేరు. అందులో సగం మంది నార్తు ఇండియన్స్ అవడం వలన వారికి తెలుగు రాక అవస్థపడేవారు. విత్తనాన్ని శుద్ధిచేసి సరఫరా చేయడానికి లేబరుతోనే ఎక్కువపని చేయించవలసివచ్చేది. అందుకు నా స్నేహితుడు నాగేశ్వరరావే మొత్తం పనంతా లేబరుతో చేయించేవాడు.

ఇంట్లో ఏమీ తోచక ఖాళీగా వుండడంవలన ప్రతిరోజు ఉదయమే భోజనం చేసి నేషనల్ సీడ్స్ కార్పోరేషన్ ఆఫీసుకి కాలక్షేపానికి వెళ్ళేవాణ్ణి. ఒకరోజు ఆఫీసు రీజినల్ మేనేజర్‌గారు నన్నుచూసి, ఎవరుమీరు రోజూ ఆఫీసుకువచ్చి సాయంత్రం వరకు వుండి వెళ్తున్నారని అడిగేరు. నేను నాగేశ్వరరావు మిత్రుడనని, ఇద్దరం కలసి చదువుకున్నామని,ఉద్యోగం వేటలో వున్నానని ప్రస్తుతం కాళీగా వుండటం వలన రోజూ కాలక్షేపానికి ఆఫీసుకి వచ్చి వెళ్తున్నానని చెప్పాను. ఆయన నన్ను

ఒకసారి పరీక్షగాచూసి, మా ఆఫీసులో తెలుగువారు లేక పనికి చాలా యిబ్బంది పడుతున్నాము. కార్పరేషన్లో ఉద్యోగం ఇస్తే చేరతారా! అని రీజినల్ మేనేజర్‌గారు నన్ను అడిగేసరికి ఆశ్చర్యసంభ్రమాలతో నోటమాటలరాలేదు. ఉద్యోగానికి అప్లికేషన్ యిస్తే ఢిల్లీపంపుతానని రీజినల్ మేజేజరుగారే స్వయంగా చెప్పడంతో ఇంటికివచ్చి ఈ విషయాన్ని మా మేనబావకి, గుంటూరులో జిల్లా రిజిస్ట్రారుగా ఉద్యోగంచేస్తున్న మా శేషాద్రి బాబాయిగారికి చెప్పేను. వారు ఆనందించి వెంటనే అప్లికేషన్ ఇమ్మని ప్రోత్సహించేరు. అప్లికేషన్ ఇచ్చినవారం రోజులలో ఎమ్.డీ.గారు కేంపుమీద విజయవాడ వస్తున్నట్లు ఆ రోజు ఇంటర్వ్యూకి హాజరుకావలసినందని రీజినల్ మేనేజర్‌గారు నాకు లెటరు పంపారు. ఆ రోజు ఇంటర్వ్యూకి హాజరుకావడం, ఉద్యోగానికి సెలక్ట్ కావడం, వెంటనే ఉద్యోగంలో చేరమని ఆర్డరుఇవ్వడం అన్నీక్షణాలలో జరిగిపోయాయి. అది కలో నిజమో తెలియక సతమతమయ్యాను. అలా నాకు ఉద్యోగం ప్రాప్తించడంతో కొత్తజీవితం ప్రారంభమయింది. భగవంతునికి మనసారా భక్తితో నమస్కరించాను.

ఒకమంచి రోజుచూసి తే.19-1-1966ది నాడు నేషనల్ సీడ్సు కార్పొరేషన్లో విజయవాడలో అగ్రికల్చరు ఇన్స్పెక్టరుగా చేరడంతో నాఉద్యోగపర్వం మొదలయింది. నేను ఉద్యోగంలో చేరిన శుభవార్త మా ఇంట్లో అందర్నీ ఆనందసాగరంలో ఓలలాడించింది. ఉద్యోగంలో చేరిన కొత్తలో నెలకి మూడువందల ఇరవైయైదు రూపాయలు జీతం వచ్చేది. మానాన్నగారి ఆశయం మేరకు ఇద్దరు తమ్ముళ్లను అనకాపల్లి కాలేజీలో చేర్పించి చదివించాను. తరువాత మా తమ్ముడు సీతారామనాధ్ పి.హెచ్.డి పూర్తిచేసి ఉద్యోగంలో చేరడం వలన మేము ఆశించిన రీతిగా మా తమ్ముళ్లను వారి కిష్టమైన చదువులు చదివించి వారు ఉన్నతస్థితికి చేరడానికి దోహదపడ్డాము. తరువాత మా రెండవ తమ్ముడు నరసింహనాథ్ డిగ్రీపూర్తిచేసి, ప్రైవేటు కంపెనీలో అకౌంటెంట్‌గా ఉద్యోగంలో చేరడంవలన ఒకతమ్ముణ్ణి డాక్టరు చదివించాము. మిగతా వారు పోస్టుగ్రాడ్యుయేషన్ చదువు పూర్తిచేసుకొని ఒకరు బ్యాంకు ఆఫీసర్‌గా, మరొకరు ఇన్సూరెన్స్ కంపెనీ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసరుగా పదువుల అలంకరించి, భగవంతుని దయవలన అంతా ఉన్నతస్థానంలో వుండడం మాకు ఆనందాన్ని కలిగించింది. మా చెల్లికి మంచి సంబంధంచూసి ఆమె కోరిక మేరకు పి.హెచ్.డి.చేసి సెంట్రల్ గవర్నమెంట్‌లో సైంటిస్టు హోదాలో ఉద్యోగం చేస్తున్న అతనితో వివాహము జరిపించాము. మా జీవితాశయం నెరవేరి నందుకు ఎంతో తృప్తికలిగించింది.

పుణ్యంకొద్ది పురుషుడు, దానంకొద్దీ బిడ్డలని మా అమ్మగారు ఎప్పుడూ అంటూ వుండేవారు. భాగ్యంకొద్ది భార్య లేక అదృష్టం కొలది ఆలి అని కూడా కలిపితే బాగుంటుందని నాకనిపిస్తోంది. ఎందుకంటే మంచి జీవిత భాగస్వామిని దొరకకపోతే జీవితం నరకమవుతుందని వేరే చెప్పనక్కర్లేదనుకొంటాను. నా ఆశయాలకు తగిన అనుకూలవతియైన భార్య రామలక్ష్మి దొరకడం నా అదృష్టం. ఆమెతో నా వివాహము

తే.6–6–1969 దినాడు విజయనగరం దగ్గర రెల్లివలస గ్రామంలో జరిగింది. నా అడుగుజాడలలో ఆమె నడవడంవలన నేను అనుకొన్నట్లు తమ్ముళ్ళ చదువులు పూర్తికావడానికి, చెల్లిపెళ్ళిచేయడానికి, విశాఖలో ఇల్లుఏర్పడడానికి ఆమె సహకారాన్నందించింది. మాకు ముగ్గురూ అమ్మాయిలే పుట్టినా చక్కనిపిల్లల్ని భగవంతుడిచ్చాడని సంతోషించాము కాని కొడుకులులేరని దిగులు పడలేదు. ఆ ఆలోచన మనసులోనికి రానివ్వలేదు. కాలం మారడం వలన ఇద్దరూ లేక ముగ్గురు పిల్లలు చాలని దేశజనాభాను పెంచవద్దని ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తున్నరోజులవి. కొడుకులు లేకుండా ఆపరేషను చేయించుకుంటే ఇంట్లో పెద్దలు ఒప్పుకోరని ఎవరినీ సలహా అడగకుండా భార్యభర్తలిద్దరం ఆలోచించుకొని నిర్ణయానికి వచ్చాము. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి ఈశ్వర శతకంలో చెప్పిన పద్యము నాకుమంచి ధైర్యాన్ని చ్చింది. ఆ పద్యాన్నిక్కడ ఉదహరిస్తున్నాను.

కొడుకులు పుట్టరటంచు ఏడ్తురవివేకుల్ జీవనభ్రాంతులై
కొడుకులు పుట్టలేదేకౌరవేంద్రుకనేకుల్ ? వారిచే ఏగతుల్
వడసెన్? పుత్రులులేని ఆ శుకునకున్ వాటిల్లినేదుర్గతుల్
చెడునే మోక్షపదం బపుత్రకునకున్ శ్రీకాళహస్తీశ్వరా !

నా భార్య బాల్యం నుండి ఆధ్యాత్మిక భావాలు కలిగివుండడం వలన జీవన యానంలో ఏ ఇబ్బందికలుగలేదు. తనుచేసే పూజలకు, ఉపవాసాలకు, నేను అడ్డు చెప్పేవాణ్ణికాను. తనూ నా దారికి అడ్డువచ్చేదికాదు. ఆమెపూర్తి సహాయ సహకారములందించబట్టే 24సార్లు శబరిమలయాత్ర పవిత్రంగా దీక్షతో చేయ కలిగేను. శబరిమల యాత్రాను భవాలతో జీవితానుభవాలతో కొన్ని పుస్తకాలు, కథలు, వ్యాసాలు వ్రాసి రచయితగా గుర్తింపుబడిసేను. ఈ రోజు తెలుగులో కొత్తగా ఆధ్యాత్మిక పత్రిక కానీ సపరివార, మాసపత్రికలు ప్రారంభిస్తే నా రచనలు పంపమని ఆహ్వానాలు పంపడం నాకెంతో గర్వకారణంగా వుంటుంది. కనిపించని ఆమె సహకారం ఎంతో వుందని ఈ నాటికీ నేను విశ్వసిస్తాను.

3

నేషనల్ సీడ్సు కార్పోరేషన్‌లో పదమూడేళ్ళు ఉద్యోగం చేసాక ఏపీసీడ్సు రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించడం వలన మూడేళ్ళ డిప్యూటేషన్ మీద ఏపి సీడ్స్‌లో ఉద్యోగ నిర్వహణకోసం కొంతమంది సిబ్బందితోపాటు నన్నుఎంపికచేసి పంపేరు. (1976) మూడుసంవత్సరములు పూర్తయిన తరువాత ప్రమోషన్‌యిచ్చి ఏపీసీడ్స్‌లో ఉద్యోగానికి పర్మనెంటుగా రమ్మనడంతో ఆలోచించి, నేషనల్ సీడ్సులో అయితే ఆల్ ఇండియా ట్రాన్స్‌ఫర్లు వుండడం వలన నాకు ముగ్గురుపిల్లలు అమ్మాయిలే అవడం వలన ఏపిసీడ్స్‌లో చేరితే ట్రాన్స్‌ఫర్ చేసినా ఆంధ్రప్రదేశ్‌లోనే చేస్తారు. కనుక పిల్లల చదువులకు, పెళ్ళిళ్ళలకు బెంగపడక్కర్లేదని దూరదృష్టితో ఆలోచించి ఏపిసీడ్స్‌లో పని చేయడానికి మొగ్గుచూపేను (1979) భగవంతుని అనుగ్రహంతో

తరువాత మరొక రెండు ప్రమోషన్లు వచ్చి రాష్ట్రంలో పలుప్రాంతాలలో పనిచేసి చివరగా రీజినల్ మేనేజరుగా విజయనగరం వచ్చి మూడుసంవత్సరాలు ఉద్యోగంచేసి 2000 సంవత్సరం మేనెలలో పదవీ విరమణచేసాను.

నా ఉద్యోగపర్వమే నాకు ఎన్నో జీవితపాఠాలనునేర్పించింది. ఏపిసీడ్స్‌లో చేరింది లగాయతూ ఎన్నో సమస్యలను ఎదుర్కొనవసి వచ్చింది.నేను తణుకులో నేషనల్ సీడ్స్‌లో ఉద్యోగం చేసినప్పుడు ఒకగ్రాడ్యుయేట్ నిరుద్యోగి ఉద్యోగం కోసం వస్తే జాలిపడి అతన్ని డైలీవేజ్‌లో గుమాస్తాగా నియమించేను. అతను కష్టపడి బాగా పనిచేసేవాడు. ఆరేళ్ళ తరువాత నేను ఏపిసీడ్స్‌లో చేరాక తణుకు మేనేజరుగా వచ్చినప్పుడు అతను ఇంకా డైలీవేజిలో వుండి పనిచేయడం చూసి జాలిపడి అతని సర్వీసు రెగ్యులర్ చేయడానికి సిఫారసు చేసాను. అతను కూడా హెడ్ఆఫీసులో అందరి దృష్టిలో పడినందున అతనికి క్యాషియర్ ఉద్యోగంయిచ్చి తణుకులోనే పోస్టింగ్ యిచ్చారు. అతనిపై వున్న నమ్మకంతో అతను రాసిన కేష్‌బుక్‌ను పరిశీలించకుండానే సంతకంపెట్టేవాణ్ణి. ఒకసారి ఆడిట్ వాళ్ళు వచ్చి ఇనస్పెక్షన్‌చేసినపుడు నలభైఆరు వేలు ఆఫీసు డబ్బు తక్కువ కనిపోస్తోందని చెబితే విస్తుపోయాను. అప్పుడు కూడా గుడ్డిగా మా క్యాషియర్‌ని నమ్మి అతన్ని వెనకేసుకువచ్చి మరల మరొకసారి అకౌంట్స్ చూడమన్నాను. చివరకు మా కేషియర్ చాలా తెలివిగా నలభైఆరువేల సొమ్ము కాజేసేడని తేలడంతో గతుక్కుమన్నాను. కొత్తగా ఏపిసీడ్స్ కార్పొరేషన్ ప్రారంభించడం వలన పోలీసు, కోర్టు వరకు వెళ్ళి పేపర్లు ఎక్కకుండా సమస్యను పరిష్కరించాలని మా ఉన్నతాధికారులు ఆలోచించి ఆ సొమ్మును తెచ్చి వెంటనే ఆఫీసులో కడితే ఇద్దరు ఉద్యోగాలు నిలుస్తాయి. లేకుంటే ఉద్యోగాలు పోతాయని బెదిరించారు. రెండు రోజులు వ్యవధి ఇచ్చి డబ్బు కట్టకపోతే సస్పెండు చేస్తామని బెదిరించారు. మా కేషియర్ తెలివిగా తను ఇరవైవేలు మించి కట్టలేనని చేతులు ఎత్తేసాడు.ఏమి చేయడానికి పాలుపోని సందర్భంలో మా ఆఫీసు స్థాపుముందుకువచ్చి నాకు అండగా నిలబడి ఆరువేల రూపాయలు యిచ్చి ఆదుకోవడంతో మా చెల్లిపెళ్ళికోసం బ్యాంకులో దాచిన పదివేలు, మరొక పదివేలు అప్పుచేసి తెచ్చి మొత్తం ఇరవైవేలునేను కృష్ణార్పణం చేయవలసివచ్చింది. (1979)

ఎంతో కష్టపడి సంపాదించి ఎన్నో కోర్కెలు చంపుకొని, భార్య నగలు చేయించ మన్నా చేయించకుండా దాచిపెట్టిన ధనము అలా వృధాగా పోవడం చాలా బాధ కల్గించింది. ఆరోజు ఎంత ఏడ్చానో ఎంత కన్నీరు కార్చానో ఆ భగవంతునికే తెలుసు. నమ్మకద్రోహంతో జీవితంలో మొదటిసారి మోసపోయాను. ఎవరిని నమ్మాలో ఎవరిని నమ్మకూడదో తెలియని పరిస్థితి దాపురించింది. అప్పటివరకు తెల్లని వన్నీ పాలు, నల్లని వన్నీ నీళ్లు అని నమ్మేస్థితిలో వుండేవాణ్ణి. నేను ఉద్యోగంలో చేరిన దగ్గరనుండి ఉద్యోగ నిర్వహణ సక్రమంగా చేయడానికి జిల్లా రిజిస్ట్రారుగా పనిచేస్తున్న మా నాన్నగారి తమ్ముడు శేషాద్రిబాబాయిగారిని, మా మేనబావ అయిన

డి.వి.ఎల్. నరసింహామూర్తి గారి సలహాలు తీసుకునేవాణ్ణి. కానీ ఈ సమస్య ఉత్పన్నమైనప్పుడు వ్యవధిలేనందున ఎవ్వరినీ సంప్రదించకుండా కేవలం మా ఉన్నతాధికారులు, సహఉద్యోగుల సలహామేరకే సొమ్ము ఆఫీసులో జమచేసి నష్ట పోయాను. నేను ఉద్యోగంలో చేరిన కొత్తలో క్రమశిక్షణకు, నైతికవిలువలకు విలువ నిచ్చే ఆఫీసర్లు డా.జీవి.చలంగారు, డా.ఎమ్.వీ.ఎస్.శాస్త్రిగారు, శ్రీ సీ.ఎస్. మూర్తి గారు, డా. ఎస్వి.ఎస్.శాస్త్రిగారు వంటి వారి దగ్గర పనిచేయడం వలన మొదటనుండి కష్టపడి పనిచేయడం, ముక్కుకి సూటిగా పోవడం అలవడింది. నేను పనిబాగా చేస్తానని అహంకారం, గర్వంతో వుండేవాణ్ణి. విధినిర్వహణలో ఎవరినీ లక్ష్యపెట్టే వాణ్ణికాదు. ఒక్కొక్కసారి నాకన్న పెద్దఆఫీసర్లతోనే వాదనలకు దిగి నాకు ఇష్టంలేని పనులు చేయడానికి అంగీకరించేవాణ్ణికాదు. దానికితోడు మానాన్నగారి కోపం ఇంట్లో నాకు సంక్రమించింది. మా నాన్నగారి కోపంతో పోల్చుకుంటే తక్కువేకాని కోపిష్టి అనే ముద్ర నాపైన పడింది. ఒక్కొక్కసారి ఇంట్లో నా ప్రవర్తన వలన పిల్లలు, కుటుంబ సభ్యులు ఇబ్బంది పడేవారు. తలచుకుంటే ఈ రోజు సిగ్గుతో బాధ కలుగు తుంది.

ఆఫీసులో జరిగిన సంఘటనతో నన్ను తణుకు నుండి హైద్రాబాదు ట్రాన్స్ఫర్ చేసారు. బాల్యం నుండి దేవుడంటే భక్తి వుండేదికాని స్థిరంగా కూర్చుని పూజచేసే అలవాటు వుండేదికాదు. నుదుటి విభూది కుంకుమ ధరించి దేవుని ముందునిలబడే నాకు వచ్చిన పద్యాలు, శ్లోకాలు చెప్పుకొని దైవప్రార్థన చేసేవాణ్ణి. ముఖ్యమైన పండుగలు, పర్వదినాలలోనే స్థిమితంగా కూర్చొని పూజాకార్యక్రమాలు నిర్వహించే వాణ్ణి. తణుకు దెబ్బతో ఏది చేయాలన్నా అనుకున్నది సాధించాలన్నా భగవంతుని అనుగ్రహం వుండాలని, ఆయన కృప, దయలేనిదే ఏమీ చేయలేమనే సత్యాన్ని గ్రహించి, ప్రతిరోజు ఉదయం భగవంతునిముందు కొంతసేపు కూర్చొని ప్రార్థన, పూజ చేయడం మొదలుపెట్టేను. హైద్రాబాదులో ఒకరోజు నల్లకుంటలో వున్న శంకరమఠానికి వెళ్లేను. ఆరోజు అక్కడ శృంగేరి పీఠాధిపతి శంకరాచార్యులవారు ప్రవచనం జరుగుతోంది. కొంతసేపు అక్కడకూర్చుని ఆయనప్రవచనం విన్నాను. ప్రతి ఒక్కరికీ టి.వీ చూడడానికి, న్యూస్‌పేపరు చదవడానికి, రాజకీయాలు, సిని మాలు, క్రికెట్టు గురించి కబుర్లు చెప్పుకోడానికి టైమువుంటుంది కాని సంధ్యావందనం చేయమన్నా, గాయత్రీ మంత్రాన్ని జపం చేయమంటే టైములేదని చెబుతారు. మనం మిగతా పనులకు స్నానికి భోజనానికి టైము కేటాయించినట్లు దైవకార్యానికి ప్రతిరోజు పది నిమిషాలో పావుగంటో కనీసం కేటాయిస్తే భగవంతుడు సంతోషించి ఆశీర్వదిస్తా రని చెప్పారు. ఆ మాటలు ఇంజక్షన్లా నాకు పనిచేసి ప్రతిరోజూ గాయత్రీ మంత్రజపం, వీలున్నప్పుడు సంధ్యావందనం చేయడం ప్రారంభించాను. తరువాత ఒక సంవత్స రానికే హైద్రాబాదు నుండి నిజామాబాదు ట్రాన్స్ఫర్ చేసారు. మా డాక్టరు తమ్ముడు రామకృష్ణ ఎర్నాకులంలోవున్న మా బుచ్చిమేనత్తగారింటికి వెళ్ళి అక్కడనుండి

మామామయ్యగారితో కలసి శబరిమలయాత్రచేసి వచ్చి శబరిమలయాత్ర గురించి గొప్పగా వర్ణించి చెప్పడంతో నాకూ ఒకసారి శబరిమలవెళ్ళి శ్రీఅయ్యప్పస్వామివారిని దర్శించుకొని రావాలని సంకల్పం కలిగింది. స్వామిశరణం. ఓమ్ స్వామియే శరణ మయ్యప్ప!

1981 డిసెంబరు నెల మూడవవారంలో భార్యపిల్లలతో కలిసి కేరళ, తమిళ నాడులోవున్న కొన్ని పుణ్యక్షేత్రాలు దర్శించాలని ఎర్నాకులంలోవున్న మా మేనత్త గారింటికి వెళ్ళేను. అక్కడవారింట్లో మా కుటుంబాన్ని వదలి ఒంటరిగా శబరిమల యాత్రకు బయలుదేరాను. ఎర్నాకులం నుండి బస్సులో పంబవరకు వెళ్ళి అక్కడ పంచానదిలో స్నానంచేసి శబమరిమలకు నడచివెళ్తున్న స్వాములవెంట శరణాలు చెబుతూ నేనూ కొండలపై అడవులలో రాళ్ళు, ముళ్ళు దాటుకొంటూ నడచి ప్రయాణిం చాను. ఎర్నాకులంలో బస్సు ఎక్కినది లగాయతూ మా తమ్ముడు రామకృష్ణ ఇచ్చిన శబరిమలయాత్ర పుస్తకం చదవడంతో మనసంతా అయ్యప్పస్వామిపైనే లగ్న మయింది. ఇతర చింతన లేమీ మనసులోనికి రాలేదు. శరణాలు చెబుతూ నడుస్తూ పంబలో రాత్రి 7 గం॥లకు బయలుదేరిన నేను రాత్రి 11 గంటలకు శబరిమల సన్నిధానము అంటే నాలుగు గంటల వ్యవధిలో చీకటిలో ప్రయాణించి చేరడం ఆశ్చర్యాన్ని కలిగించింది. శబరిమల చేరగానే అక్కడ భక్తుల కోలాహలం చూసి నాకు తెలియకుండానే కన్నులవెంట బాష్పదారలు కారేయి. శబరిమల శరణుఘోషతో దద్దరిల్లుతోంది. అంతా నల్ల సముద్రంలా కానవచ్చింది. తెలియని భయంతో భక్తి భావంతో మనసంతా నిండిపోయింది. దీక్ష, ఇరుముడి లేనందున పక్కమెట్లగుండా పైకెక్కి హరిహరసుతుడైన అయ్యప్పస్వామిని భక్తి పారవశ్యంతో దర్శించుకొని జన్మ తరించినట్లు భావించాను. తరువాత దేవాలయ ప్రాంగణమంతా తిరిగి మండల దీక్షతో భక్తిపారవశ్యంతో శిరస్సుపై ఇరుముడిలతో పదునెనిమిది మెట్లు ఎక్కే స్వాము లను చూసేసరికి శిరసువంచి వారికి పాదాభివందనం చేయాలనిపించింది. నేను అంతకు ముందు ఎన్నో పుణ్యక్షేత్రాలు దర్శించాను. దేవాలయాలు చూసాను. కానీ శబరిమలలో నాకు కలిగిన దివ్యానుభూతి, పారవశ్యం వేరొకచోట కలుగలేదు. మండలదీక్షచేసి ఇరుముడిని శిరస్సుపై వుంచుకొని మరొకసారి శబరిమల యాత్రకి రావాలని బలమైన కోరిక కలగడంతో అయ్యప్ప భగవానునికి మనసులోనే నమస్క రించి నాకోరికను మన్నించి నెరవేర్చవలసినదిగా స్వామివారిని ప్రార్థించాను. స్వామి శరణం ! ఓమ్ స్వామియే శరణమయ్యప్ప !

ఆ రాత్రి శబరిమల సన్నిధానంలో కొత్తగా నిర్మించిన రేకుల షెడ్డులో ప్రస్తుత క్యూ కాంప్లెక్స్షెడ్డు) తెలుగు మాటలు వినబడడంతో అటువైపు వారి చెంతకు వెళ్ళి ఆ రాత్రి అక్కడ విశ్రమించాను. మరునాడు తెల్లవారు జామున 4 గంటలకు నిద్ర లేచి, పంబకు బయలుదేరాను. పంబ చేరగానే 7 గం॥లకు బస్సులో బయలుదేరి 12 గంటలకు ఎర్కాకులం చేరాను. నేను అంతతొందరగా శబరిమలయాత్ర చేసి

ఇంటికి రావడంచూసి అంతా ఆశ్చర్యపోయారు. స్వామిశరణం. తరువాత అక్కడ నుండి మామయ్యగారు సలహామేరకు కుటుంబ సమేతంగా చోటానిక్కర్, కాలడి, కన్యాకుమారి, సుచీంద్రం చూసి పళనివచ్చి శ్రీసుబ్రహ్మణ్యస్వామిని దర్శించు కున్నాము. అక్కడనుండి మదురై వెళ్ళి మీనాక్షీదేవిని, సుందరేశ్వరుని దర్శించి, రామేశ్వరం వెళ్ళి శ్రీరామలింగేశ్వరుని దర్శించేము. రామేశ్వరం నుండి సరాసరి శ్రీరంగంవచ్చి శ్రీరంగనాథుని దర్శించుకొని చెన్నై మీదుగా హైద్రాబాదుచేరి అక్కడ నుండి నిజామాబాదుగూటికి చేరాము. ఈ యాత్రలన్నిటిలో శబరిమల యాత్ర మరువలేనిది. ఓమ్ స్వామియే శరణమయ్యప్ప!

ఒకసంవత్సరం తిరగకుండానే నిజామాబాదునుండి విజయవాడ ట్రాన్స్‌ఫర్ చేయడం బాధకలిగించింది. కానీ భగవంతుని లీలలు చిత్రవిచిత్రంగా వుంటాయి. విజయవాడలో గొల్లపూడి వాసుడైన అయ్యప్పస్వామి, కనకదుర్గమ్మ వారిని దర్శించి ఆఫీసులో బాధ్యతలు స్వీకరించాను. అయ్యప్పదీక్ష చేసి శబరిమల యాత్రకు వెళ్ళాలనే కోరికవుండేది కాని బ్రహ్మచర్యం చేయాలి. నేలపై పడుకోవాలి, రెండుపూటలా చన్నీటి స్నానం చేయాలి, ఒకపూట భోజనం చేయాలి. నల్లబట్టలు వేసుకొని చెప్పులు లేకుండా నడచి ఆఫీసుకు వెళ్ళాలంటే ఒకరకమైన భయం, సిగ్గు కలిగి ఇంకా వయస్సు నలభైరెండేకదా! నలభై యైదుదాటాక శబరిమలయాత్రకు వెల్దామను కున్నాను.

ఎప్పుడూ టూర్లు తిరుగుతూ బయటనీళ్ళు త్రాగుతూ ఆహారం తింటూ నాకు రాని జాండిస్ (పచ్చకామెర్లు) ఇంటిపట్టున వుండి ఎప్పుడూ బయటకి వెళ్ళని నా శ్రీమతికి రావడం ఆశ్చర్యాన్ని కలిగించింది. మొదట డాక్టరు జాండిస్ అని గుర్తించ కుండా జ్వరం తగ్గడానికి వేరేమందు లివ్వడం వలన జాండిస్ ముదిరిపోయి, లేవ లేని పరిస్థితి వచ్చింది. ఆ టైములో గోదావరిఖనిలోవున్న నా డాక్టరు తమ్ముడు రామకృష్ణకు ఫోనుచేసాను. అతను వెంటనే రక్తపరీక్ష చేయించి, కొన్ని మందులు వాడమని సూచించడంతో ఆ మందులు వాడేక ఇరవై రోజులకు వ్యాధి తగ్గుముఖం పట్టింది. మా పెళ్ళయాక ఎన్నడూ ఒక్కరోజు జ్వరంతో కాని తలనొప్పితో కాని పడుకోవడం చూడలేదు. అటువంటిది శ్రీమతి అలా ఇరవైరోజులు పడకవేయడం భయంవేసింది. మా అత్తగారు వెంటనే వచ్చి ఆమెకు, పిల్లలకు సేవచేయడం వలన నా ఆందోళన తగ్గింది. నా శ్రీమతి పూర్తిగా కోలుకునేవరకు మా అత్తగారు నెలరోజుల పైన వుండి వెళ్ళేరు. శ్రీమతికి తీవ్రంగా పచ్చకామెర్లు రావడంతో వాయిదా వేయాలను కున్న శబరిమలయాత్రను ఆ సంవత్సరమే దీక్షతీసుకుని శబరిమల యాత్రకు వెళ్ళి స్వామివారిని దర్శించుకు రావాలని నిర్ణయించుకున్నాను. ఓమ్‌స్వామియే శరణం అయ్యప్ప!

నా అదృష్టం కొలది విజయవాడలో మంచి గురుస్వామి శ్రీ సి.బి.వి.సుబ్రహ్మ ణ్యంగారు దొరకడంవలన ఆయన చెప్పిన ప్రకారం తే. 17-11-1983ది నాడు

గొల్లపూడి ధర్మశాస్తా ఎదుట మాలాధారణచేసి దీక్ష ప్రారంభించేను. మా గురుస్వామి శ్రీశ్రీశ్రీ విమోచనానందస్వామి శబరిమల తపస్వితో యాత్రచేసి వున్నందున అయ్యప్ప దీక్ష, శబరిమలయాత్ర గురించి బాగా తెలిసివున్నందున నాకు అన్నీ వివరంగా చెప్పడంతో తు.చ.తప్పకుండా దీక్షావిధులను, నియమావళిని భక్తిశ్రద్ధలతో ఆచరించ డం మొదలుపెట్టేను. రోజూ నున్నగా షేవుచేసుకునే గెడ్డం పెరగడం, నుదుట విభూది, చందనం, కుంకుమ అలంకారాలతో నల్లబట్టలతో నారూపం నాకే వింతగా కన్పించేది. బాగా తెలిసినవారు కూడా నన్ను గుర్తుపట్టలేనంతగా నా రూపం మారి పోయింది. ఒక విరాగిగా యోగిగా జీవితం గడుస్తోంది. ఇంట్లో పిల్లలు, శ్రీమతి కూడా భయభక్తులతో స్వామిని సేవించసాగేరు. ప్రతిరోజూ విజయవాడలో వున్న ఏదో ఒక దేవాలయమునకు కాలినడకతో వెళ్ళి దర్శించారావాలని నిర్ణయించుకొని రోజుకొక దేవాలయానికి వెళ్ళి దైవ దర్శనం చేసుకువచ్చేవాణ్ణి.

మా గురుస్వామి భజనలు, పూజలు ఎంతోభక్తిశ్రద్ధలతో నిర్వహించేవారు. వారి గాత్రం సుమధురంగా వుండేది. భక్తితన్మయత్వంలో భజనపాటలు పాడుతూ వుంటే ఎదురుగా హరిహరసుతుడు అయ్యప్పస్వామి సాక్షాత్కరించేవారు. పూజ, భజనలు సాగుతూవుంటే నిశ్శబ్దవాతావరణం నెలకొనేది. భజనకి వచ్చినస్వాములు, భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయేవారు. అందుకు గురుస్వామిగారు చేసే పూజలు, భజనలుకు తప్పకహాజరు అయేవాణ్ణి. దీక్షలో వుండగా ఒకరోజు రాత్రి మా ఆఫీసులో డ్యూటీలో ఉన్నవాచ్‌మేన్‌ని కొట్టి మాఆఫీసులో దొంగలుపడి ఇనప్పెట్టె తెరవడం చేతకాక ఇనప్పెట్టెనే తీసుకువెళ్ళేరు. ఆ ముందు రోజు నేను కేంపు వెళ్ళడం వలన ఇనప్పెట్టెలో ఎంతసొమ్మువుందో వివరం తెలియక మా కేషియర్ని పిలిచి అడిగేను. సొమ్ము నలభై వేల వరకు వుందని ముందు రోజు సాయంత్రం విత్తనాలు అమ్మిన సొమ్ము నంతా భద్రంగా ఇనప్పెట్టెలో దాచానని చెప్పి కేషియరు బుక్ చూపించడంతో మనస్సు కొంత ఊరట చెందింది. హెడ్‌ఆఫీసుకి, పోలీసువారికి దొంగతనం గురించి తెలియజేసి అయ్యప్పపై భారంవేసి నిశ్చింతగా దీక్ష కొనసాగిం చాను. కేష్‌బుక్ అన్నీ సవ్యంగా ఉండడంవలన ఏరిమార్కు లేకుండా బయటపడ కలిగేను. అప్పుడు విజయవాడలో ఎస్.పీగా వ్యాసుగారున్నందున పోలీసులు చాక చక్యంగా దొంగల్ని పట్టుకుని పగలగొట్టిన ఇనప్పెట్టెతో సహా దొరికిన నగదును కోర్టులో సమర్పించడం, తరువాత కోర్టువిచారణ పూర్తయేక ఆఫీసుకి సొమ్మును అప్పగించడం జరిగింది.

నేను మండలానికి అంటే డిసెంబరు నెలాఖర్లో శబరిమలయాత్ర చేయాలను కొని నవంబరు 17వ తేదీ నాడు మాలను ధరించి దీక్షను ప్రారంభించాను. కానీ మా గురుస్వామి సీనియర్ స్వాములు, కన్నె స్వాములు (తొలిసారిగా శబరిమల యాత్రచేసేవారిని కన్నెస్వాములని అంటారు) ఎరుమేలి నుండి డెబ్బైకిలోమీటర్లు నడిచి వనయాత్ర చేసి మకర సంక్రాంతినాడు జ్యోతిదర్శనం చేసుకోవడం

జనవరినెలలో యాత్రచేసి రావడం ఉత్తమమని పదేపదే చెప్పడంతో ఆలోచించి జీవితంలో ఒక్కసారే దీక్షచేసి శబరిమలయాత్ర చేయాలనుకున్నాను కాబట్టి ఎరుమేలి నుండి యాత్రచేసి జ్యోతిదర్శనం చేయడానికి నిర్ణయించుకున్నాను. 41 రోజులు చేయాలనుకున్నదీక్ష 60 రోజులకు పెరగడంతో ఇంట్లో అంతా హడలిపోయారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా దీక్షసక్రమంగా సాగడంతో మనసంతా అయ్యప్పధ్యాసతో నిండిపోయింది. స్వామిశరణం. ఓమ్‌స్వామియే శరణమయ్యప్ప!

తే. 7-1-1984ది శనివారంనాడు ఇరుముడి కట్టుకు, శబరిమల యాత్రకు తేదీ నిర్ణయించడంతో, ఆరోజు ఇరుముడిని కట్టుకొని మా బృందంతో కలసి గురు స్వామితో బస్సులో శబరిమలయాత్రకు సాయంత్రం ప్రయాణమయ్యాము. ఓమ్ స్వామియే శరణమయ్యస్వా! సమస్తాపరాధ రక్షకునే వరణమయ్యప్ప, స్వామిశరణం, అయ్యప్పశరణం అంటూ శరణాలు చెబుతూ మొదట గొల్లపూడి ధర్మశాస్తాను దర్శించి బస్సులో బయలుదేరి తెల్లవారేసరికి చెన్నై చేరేము. చెన్నైలో ఉన్న రెండు అయ్యప్ప దేవాలయాలు, సుబ్రహ్మణ్యస్వామి, మహాలక్ష్మి దేవాలయాలను దర్శించి రాత్రికి శ్రీరంగంచేరి విశ్రమించాము. శ్రీరంగం నుండి కరుపత్తూరు మరునాడు చేరి కరుపత్తూరు వాసుడైన అయ్యప్పస్వామిని, అప్పుడు అక్కడవున్న శ్రీశ్రీశ్రీ విమోచనా నందస్వామివారిని దర్శించి వారి ఆశీస్సులు పొందేను. అక్కడ నుండి పళని చేరి శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారిని, దర్శించి రాత్రికి గురువయ్యూరు చేరేము. తెల్లవారిలేచి గురువయ్యూరప్పని దర్శించి పులకించిన హృదయంతో భక్తి తన్మయత్వంతో మునిగి తేలేము. మా సీనియర్‌స్వాములు వనయాత్రకి కావలసిన నిమ్మకాయలు, బ్రెడ్, గ్లూకోజ్, పిప్పరమెంట్లు, వగైరాలు కావలసినవి అక్కడే కొనుక్కోమని చెప్పడంతో లేనివారంతా కొనుక్కుని బస్సు ఎక్కేము. బస్సు త్రిచూర్‌లో వడకనాథ క్షేత్రంలో ఆగింది. అక్కడ పార్వతీ పరమేశ్వరులను, సీతారాముల్ని, అయ్యప్పను దర్శించి కాలడి వెళ్ళేము. కాలడి ఆదిశంకరాచార్యులవారి పుట్టిన స్థలము. అక్కడ పూర్ణానది ఒడ్డున ఆదిశంకరులు నివసించిన ప్రదేశములో ప్రస్తుతం అక్కడ శారదాదేవి ఆలయం, శివాలయం, ఆదిశంకరులతల్లిగారి సమాధి ఉన్నాయి. వాటిని సందర్శించి చోటా నిక్కర్‌వెళ్ళి ఆ మధ్యాహ్నం అక్కడవున్న భగవతి అమ్మవారి దర్శనం చేసుకున్నాము. చోటానిక్కర్ భగవతి అమ్మవారు చాలా మహిమగల దేవతగా చెబుతారు. అక్కడ నుండి బయలుదేరి రాత్రి 7 గం॥ప్రాంతంలో ఎరుమేలి చేరేము. ఓమ్ ఎరుమేలి ధర్మశాస్తానే శరణం అయ్యప్ప! స్వామియే శరణమయ్యప్ప !

ఆ రోజు జనవరి 10వతేది ఎరుమేలిలో ఆ రోజు రాత్రి ఒంటికి రంగులు పులుముకొని, ఆకులు అలమలుగాలిబూరలు ధరించి ఒక అటవికునిగా తయారై పేటతుళ్ళి నృత్యం స్వామి దిందకతోం-అయ్యప్ప దిందకతోం అంటూ మా బృందంలో అందరితో కలసి నృత్యంచేసి, మిగిలివున్న అహంకారాన్ని, దేహాభిమానాన్ని అక్కడ వదలి ఆ రాత్రి అక్కడ విశ్రమించాము. మణికంఠుడు (అయ్యప్ప) పులి పాలకోసం,

అడవికి వచ్చినపుడు ఎరుమేలిలో వావార్ అనే అటవిక దొంగ మణి కంఠునితో యుద్ధానికి దిగి, యుద్ధములో ఓడిపోయి, తరువాత వావార్ శరణు కోరడంతో అయ్యప్ప అనుగ్రహించి అతనితో చెలిమిచేస్తాడు. ఆ రాత్రి అక్కడ వావర్ విందు ఏర్పాటచేసి, అటవిక సాంప్రదాయ నృత్యంచేసి స్వామివారిని కూడా ఆహ్వానించి వావర్, స్వామివారు కలసి నృత్యంచేసినట్లు కథ ఉండడంవలన ఎరు మేలిలో స్వాములంతా అటవిక వేషంలో నృత్యం చేయడం సాంప్రదాయమయింది. వావర్‌స్వామి ముస్లిం అని ఇప్పుడు అక్కడ పెద్దమసీదు కట్టేరు. తే. 11-1-1984 నాడు తెల్లవారుజామున నిద్రలేచి కాలకృత్యాలు ముగించుకొని, గురుస్వామికి నమస్క రించగానే ఇరుముడి మానెత్తిపై వుంచారు. ఎరుమేలి నుండే అడవులలో కొండలు ఎక్కుతు దిగుతూ 70 కిలోమీటర్ల దూరం ప్రయాణం సాగించాలి. నడవలేనివారు పంబ వరకు బస్సులో వెళ్ళి 6 కిలోమీటర్లు దూరం నడచి శబరిమల చేరవచ్చు. ఓమ్ స్వామియే శరణమయ్యప్ప, స్వామి శరణం, అయ్యప్పశరణం అంటూ శరణాలు చెబుతూ వనయాత్రకు ఎరుమేలి నుండి 24 మంది బయలుదేరాము. మిగతా 11 మంది గురుస్వామితో బస్సులో పంబకి వెళ్ళేరు. శబరిమలయాత్రకు మనోబలము, దైవబలము అవసరం. మార్గమధ్యములో కాలైకట్టి ఆశ్రమందాటి అళుదానదిచేరాము. అక్కడ నదిలో స్నానముచేసి, రెండురాళ్ళను సేకరించి కొంతసేపు అళుదానది ఒడ్డున విశ్రమించి సీనియర్ స్వాములు ఇరుముడిని నెత్తిపైన ఉంచగానే వారి ఆదేశం ప్రకారం ఆ అడవిలో ప్రయాణం సాగించాము. అళుదామేడు ఎక్కడంచాలా కష్టంగా వుండడంతో, దారిలో అక్కడక్కడ విశ్రమిస్తూ మెల్లగా నడక సాగించాము. మధ్యమధ్య నిమ్మరసం, గ్లూకోజు త్రాగుతూ అయ్యప్ప భగవానుని స్మరణచేస్తూ అళుదామేడు చేరుకున్నాము. అళుదామేడులో విశ్రమించి దారిలో పయనిస్తున్న స్వాముల్ని చూస్తూవుంటే కళ్ళవెంబడి నీళ్ళు గిర్రున తిరిగేయి. వనయాత్రచేస్తు అయిదు సంవత్సరముల వయసున్న మణికంఠులు, 70-80 ఏళ్ళునిండిన వయసు మళ్ళిన స్వాములు, అరవై ఏళ్ళుపైబడ్డ మాతలు (మాలికాపురాలు)కన్పించడంతో ఒడలు జలదరించింది. ఓమ్ స్వామియే శరణ మయ్యప్ప అంటూ కొంతసేపు విశ్రాంతి తీసుకొని మరల పయనించాము.

నెత్తిపై ఇరుముడి, భుజానికి షోల్డరుబేగు, వాటర్‌బాటిల్ తగిలించుకొని కారడవులలో నడకచాలా కష్టంగా వుంది. ఎవరినోట విన్నా స్వామి శరణుఘోష తప్ప వేరేమాట వినిపించడంలేదు. స్వామివారి శరణుఘోషతో అడవి దద్దరిల్లుతోంది. చీమలబారులా లక్షల సంఖ్యలో అయ్యప్పలు ఒక ప్రవాహంలా పయనిస్తున్నారు. బృందానికి బృందానికి మధ్యకాళీ కనిపించడంలేదు. ఆ అయ్యప్ప ప్రవాహాన్ని చూస్తూ వుండే ప్రపంచలో ఉన్న మానవాళి అంతా ఒక్కసారి దీక్షతీసుకుని శబరిమల వస్తు న్నారా? అనే భ్రాంతి కలిగించింది. మెల్లగా నడచి కళ్ళడంకుండ్రుచేరి అళుదానది నుండి తెచ్చిన రెండు రాళ్ళను అక్కడవుంచి, ఆ గుట్టకు ప్రదక్షిణంచేసి నమస్కరిం

చాము. అప్పటికే చీకటిపడడం వలన టార్చిలైట్లకు పనికల్పించి తిరిగి ప్రయాణం సాగించి అళుదాఇరక్కం దాటాక కరిమల ఏట్రందాటి ముక్కలం గుడి చేరేసరికి అందరిలో సత్తువతగ్గి నీరసం ఆవహించడంతో అంతా ఏకగ్రీవంగా ఇక నడవలేమని చెప్పడంతో కొండపై ఒక సురక్షితప్రదేశంలో విరి (ఆకులతో కప్పి తయారుచేసిన పందిరి) అద్దెకు తీసుకుని అందులో విశ్రమించాము. మా సీనియరు అయ్యప్పలు వేడివేడి ఉప్మాతయారుచేసి పెట్టడంతో అన్నదాన ప్రభువుకి నమస్కరించి ఉప్మా ఆరగించి ఆ రాత్రి అంతా ఆ విరిలో నిద్రించాము. ఓమ్ స్వామియే శరణం అయ్యప్ప!

తెల్లవారు జామున మూడుగంటలకు అంటే తే.12-1-1984ది నాడు అడవిలో నిద్రలేచి ముఖప్రక్షాళన గావించి మరల ఇరుముడినెత్తుకొని చీకట్లో టార్చిలైట్లు సాయంతో ప్రయాణంసాగించాము. అలా కరిమల ఇరక్కందాటి, పెరియానవట్టం, సిరియానవట్టం చేరేసరికి పంబ సుందర దృశ్యం కనిపించింది. మా ఆనందానికి అవధులులేవు. అందరిలో కొత్త ఉత్సాహం నెలకొంది. బిగ్గరగా శరణాలు చెప్పుకొంటూ పంబాతీరం చేరేసరికి అక్కడ మా గురుస్వామితో వనయాత్ర చేయకుండా డైరక్టుగా బస్సులో పంబచేరిన మా బృందంలో స్వాములు మాకు స్వాగతం పలికి పాదాభివందనంచేసి మమ్మల్ని బసచేసిన ‘విరి’కి తీసుకు వెళ్ళేరు. గురుస్వామిగారికి, వనయాత్ర దగ్గరుండి చేయించిన మా సీనియర్ మార్గదర్శక అయ్యప్ప స్వాములకు పాదాభివందనంచేసి, అక్కడ స్వాములు మాకిచ్చిన మజ్జిగ సేవించి, ఉరకలు వేస్తున్న పవిత్ర పంబానదిలో స్నానంచేసే సరికి వనయాత్రలో చేసిన బడలికతీరి కాళ్ళనొప్పులు, ఒళ్ళునొప్పులు మటుమాయమయ్యాయి. లేకపోతే నేనేమిటి ఏనాడు అడవులలో కొండలపై నడవడం అలవాటులేని నేను చెప్పులు లేకుండా డెబ్బైకిలోమీటర్లు నడచి ఏ అలసట లేకుండా, బాధలేకుండా శబరిమల యాత్ర చేయడం ఎంతో వింత గొలిపింది. శబరిమల అయ్యప్పస్వామికి తనివితీర నమస్కరించి, శరణుఘోష ప్రియుణ్ణి శరణాలతో అర్చిస్తూ బసచేరేసరికి గురుస్వామి పంబసద్ది ఏర్పాటుచేసి మహా ప్రసాదాన్ని తినిపించడంతో అన్నదాన ప్రభువుకి భక్తితో నమస్కరించి, పంబ సద్దిని స్వీకరించి, సాయంత్రం పంబవిళక్కు వెలిగించి పంబానదిలో పంబ విళక్కు వదిలి జ్యోతి స్వరూపునిగాంచి భక్తి పారవశ్యంతో నమస్కరించాను. ఆ రాత్రి పంబలో తీసుకున్న ‘విరి’లో విశ్రమించి అంతా నిద్ర పోయాము. ఓమ్ స్వామియే శరణమయ్యప్పా!

తే. 13-1-1984 తెల్లవారు జామున నిద్రలేచి, పవిత్ర పంబానదిలో స్నానమాచరించి, విబూది, చందనం, కుంకుమనుదుట, ధరించి, ఉత్సాహంగా షోల్డరు బేగు, భుజానికి తగిలించుకుఒని తయారయ్యేసరికి గురుస్వామి మా బృందంలో అందరికి స్వామి శరణుఘోష బిగ్గరగా చెబుతూవుంటే ఇరుముడిని అందరి శిరస్సుపై వుంచారు. స్వామిశరణాలు చెప్పుకుంటూ పయనించి పంబగణపతిని, భగవతిని, హనుమంతుని దర్శించి అప్పాచిమేడు, నీలిమల ఎక్కి మధ్యమధ్య కొన్ని నిమిషాలు

విశ్రాంతి తీసుకొంటూ శబరిపీఠం, శరంగుత్తి దాటగానే శబరిమల సన్నిధానం కనిపించేసరికి తనువు పులకరించి, బిగ్గరగా స్వామిశరణాలు చెబుతూ ఆనందపార వశ్యంతో క్యూ కాంప్లెక్స్ వున్న షెడ్డులోనికి ప్రవేశించాము. పదునెట్టాంబడి మొదటి మెట్టుపై కొట్టడానికిచేతిలో కొబ్బరికాయపట్టుకొని ఉరకలు, పరుగులతో పదునెట్టాంబడిచేరి మొదట మెట్టుపై కొబ్బరికాయ కొట్టి మెట్లు ఎక్కువతూవుండే పొందిన దివ్యానుభూతిని మాటలలో వర్ణించిచెప్పలేను. పదునెనిమిది మెట్లు ఎక్కలేని వారిని పోలీసు అయ్యప్పలు చేతి ఊతం యిచ్చి మెట్లు ఎక్కేటట్లు చేస్తారు. మండల దీక్షతో ఇరుముడితో పదునెట్టాంబడి ఎక్కి హరహరసుతుడైన అయ్యప్పస్వామిని దర్శించడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తాను. ఆ దివ్య మంగళ విగ్రహాన్ని ఎంతసేపు చూసినా తనివితీరదు. కానీ భక్తుల రద్దీవలన కొన్ని క్షణాలు మాత్రమే స్వామివారిని దర్శించే భాగ్యము కలుగుతుంది. ఓమ్‌స్వామియే శరణమయ్యప్ప! పదునెట్టాండడికి అధిపతి యే శరణమయ్యప్ప అంటూ స్వామివారిని దర్శించి భక్తిపారవశ్యంతో మా బృందంలో కొందరితో కలసి శబరిమల సన్నిధానంలో మా కోసం ఏర్పాటుచేసిన వారికి చేరకున్నాము.

మధ్యాహ్నం గురుస్వామి భోజనం ఏర్పాటు చేయడం వలన తృప్తిగా ఆరగించి కొంతసేపు విశ్రమించి మరల స్నానాదులు పూర్తిచేసుకుని శబరిమలలో వున్న ఉపదేవా లయాలు కన్నిమూల మహాగణపతి, నాగరాజు, మాలికాపురత్తమ్మ, కరుప్పస్వామి, కడుత్తస్వామి, వావర్‌స్వామి ఆలయాలు దర్శించి ముడుపులు హుండీలోవేసి వీలైనన్ని సార్లు పక్కమెట్లగుండా వెళ్ళి అయ్యప్పస్వామిని దర్శించి వచ్చాము. అందరూ అయ్యప్ప దర్శనాలు చేసువచ్చాక గురుస్వామి, సీనియరు స్వాముల సహకారంతో ఇరుముడిలు విప్పి ముద్రకాయలు పగలగొట్టి కొత్తగిన్నెలో ముద్రకాయలలో నెయ్యిపోసి, ఆనేతిగిన్నెను ఒకసీనియర్ స్వామికి కన్నెస్వామికి అప్పజెప్ప అభిషేకానికి టిక్కెట్లు కొని స్వామివరికి అభిషేకం చేయడానికి పంపించారు. ఇరుముడిలో వుంచిన విభూది చందనం, కుంకుమలను వేరే ప్లేట్లలో నింపి, విబూది మధ్య కర్పూరాన్ని ఉంచి, వెలిగించి అలా హారతిని తీసుకుని మాలికాపురత్తమ్మగుడిచుట్టూ, అయ్యాప్ప స్వామి దేవాలయంచుట్టూ ప్రదక్షిణంచేసి రమ్మన్నారు. పసుపు, కుంకుమలను అమ్మవారికి సమర్పించి, జాకెట్టుముక్కల్ని అమ్మవారికి చూపించి ఇంటికి పట్టుకువెళ్ళమన్నారు. అభిషేకించిన నెయ్యి చిన్న ప్లాస్టిక్ డబ్బాలలో నింపియిచ్చారు. ముద్రకాయల కొబ్బరి చిప్పలను తీసుకువెళ్ళి అగ్నికుండంలో వేసిరమ్మన్నారు. ముద్రకాయల చిప్పలను తీసుకువెళ్ళి అగ్నికుండంలో వేయమనడం వలన అంతా వేసివచ్చాము. అరవణ పాయసం డబ్బాలు (ప్రసాదం) అభిషేకించిన విబూదిపొట్లాలు అక్కడ కౌంటర్లో అమ్ముతున్నట్లు తెలిసి ఇంటికి తీసుకువెళ్లడానికి కొనితెచ్చుకున్నాము. ఆరాత్రి శబరి మల సన్నిధానంలో మాకు ఏర్పాటుచేసిన విరిలో నిద్రించాము. ఓమ్‌స్వామియే శరణమయ్యప్ప! సర్వాపరాధ రక్షకునే శరణమయ్యప్ప!

తే. 14-1-1984 మకరసంక్రాంతి రోజు ఎప్పుడూ బంధుమిత్రులతో ఆనందంగా గడిపేరోజు ఈ సారి మకరసంక్రాంతికి స్వామివారి సన్నిధిలో వుండడం, అక్కడ జరిగే అన్నివేడుకలు దర్శించడం నా పూర్వజన్మ విశేషంగా భావిస్తాను. తెల్లవారు జామునలేచి భస్మకుళంలో స్నానంచేసి స్వామివారిని దర్శించి మధ్యాహ్నం 2 గంటలకు పదునెట్టాంబడి దగ్గరకుచేరి, స్వామి శరణుఘోష చెబుతూ కూర్చున్నాము. దర్శనం ఆపుచేసి, దేవాలయాన్ని, పదునెనిమిది మెట్లను కడిగి శుభ్రపరచడం, పూల తోరణాలతో అలంకరించడం అన్నీ దగ్గరవుండి చూసేము. సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో పందళం నుండి కర్పూరహారతుల మధ్య తెచ్చిన తిరువాభరణాల పెట్టెలను తాకి ఆనందించాము. స్వామివారికి ఆభరణాలు అలంకరించి హారతి యిచ్చాక తూర్పుదిక్కున కనిపించే దివ్యమంగళ జ్యోతిని దర్శించి భక్తిపారవశ్యంతో మునిగితేలేము. పులకించిన హృదయంతో పరుగు పరుగున వెళ్ళి గురుస్వామివారి పాదాలకు నమస్కరించి, రాత్రి భక్తి పారవశ్యంతో భజనచేసాము. హరిహర సుతుడు అయ్యప్పస్వామి శబరిమల దేవాలయంలో పట్టబందాసనములో కూర్చొని, చిన్ముద్ర అభయహస్తముతో సాకారంగా దర్శనమిస్తే, మకర సంక్రాంతి రోజు సాయంత్రం వేళ నిరాకారరూపంలో జ్యోతిస్వరూపునిగాసంవత్సరానికి ఒక్కసారి దర్శనమివ్వడం ఇక్కడ గొప్పవిశేషం. ఆ జ్యోతి స్వరూపుని చూడడానికే లక్షలసంఖ్యలో భక్తులు శబరిమల వస్తారు. దివ్యాభరణాలతో అలంకరించిన స్వామిరూపాన్ని రాత్రి దర్శించు కొని విరికివచ్చి నిద్రించాము. రాత్రి తెల్లవార్లూ నిద్రలో ఆ దివ్యమంగళ రూపమే గోచరించింది. ఓమ్ స్వామియే శరణమయ్యప్ప! అలంకార ప్రియనే శరణమయ్యప్ప జ్యోతిస్వరూపనే శరణమయ్యప్ప!

తే. 15-1-1984 తెల్లవారు జామున నిద్రలేచి కాలకృత్యాలు ముగించు కొని ఇరుముడిలో మిగిలిన కొబ్బరికాయను పదునెట్టాంబడి పక్కనవున్న గోడపై కొట్టి శరణుఘోష చెబుతూ తిరుగు ప్రయాణమయ్యాము. పంబాతీరముచేరేక పంబా నదిలో స్నానంచేసి, భిక్షస్వీకరించేసరికి మా బస్సు రావడంతో స్వామి శరణుఘోష బిగ్గరగా చెబుతూ అంతా బస్సు ఎక్కేము. మా తిరుగు ప్రయాణంలో కుళుత్తపులైలో బాల అయ్యప్పను, అరియాంగావులో బ్రహ్మచారి అయ్యప్పను దర్శించి 'అరియంగావు అయ్యనే శరణమయ్యప్ప' అంటూ స్వామివారికి మొక్కి రాత్రికి కుర్తాళం చేరు కున్నాము. కుర్తాళంలో రాత్రి ఒక సత్రంలో నిద్రించి తెల్లవారుజామున (16-1-1984) నిద్రలేచి ఒంటికి అక్కడ అంతా నూనెతో మర్దనా చేయించుకుంటూ వుంటే నేనూ చేయించుకొని జలపాతం క్రింద తనివి తీరా స్నానంచేసి, కుర్తాళంలో వున్న శివాలయాన్ని (సిద్దేశ్వరస్వామి) దర్శించి తరువాత భిక్షస్వీకరించి తిరిగి బస్సులో అచ్చన్ కోయిల్ బయలు దేరేము. అచ్చన్ కోయిల్ వెళ్ళేమార్గము ఇరుగ్గా వుండి బస్సుపోదంటే బస్సుదిగి అక్కడ రెండువేన్లు అద్దెకు మాట్లాడుకొని అచ్చన్‌కోయిల్ వెళ్ళి పూర్ణపుష్కలనాధుడైన అయ్యప్పస్వామిని దర్శించి వచ్చాము. స్వామి ధర్మశాస్తా

అవతారంలోవుండగా పూర్ణ, పుష్కల అనే ఇరువురి కన్యలతో వివాహమైనట్లు ఒక కథ వుంది. ఈ విధంగా అయ్యప్ప దర్శనం ఇక్కడ ఒకచోటే వుంటుంది. పూర్ణ పుష్కలనాథనే శరణమయ్యప్ప! అని భక్తితో మొక్కి తిరిగి బయలుదేరాము.

మనదేశములో ముఖ్యంగా తమిళనాడులో ఉన్నదేవాలయాలు రామేశ్వరం, మధురై, శ్రీరంగం, విల్లుపుత్తూరు, కంచి, తిరువణ్ణామలై, సుచేంద్రం, కన్యాకుమారి, మున్నగు దేవాలయాలు చూస్తూవుంటే మానవ నిర్మితంగా గోచరించదు. యంత్రాలు, క్రేన్లు ఏవీలేని ఆరోజులలో అటువంటి పెద్దపెద్ద కట్టడాలు దేవాలయాలు ప్రాకారాలు, గోపురాలు నిర్మించారంటే చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఎందరో తపస్సంపన్నులు, వేదపండితులు మంత్రాలు వల్లిస్తే అవలీలలా రాతిపైకప్పులు, దూలాలుపైకి లేవడం వలన అటువంటి అద్భుత దేవాలయాలు నిర్మించగలిగారని నాటి నిర్మాణాలవెనక అద్భుతశక్తి దాగివుందని పండితులు చెబుతారు. ఇది అక్షరసత్యంగా గోచరిస్తుంది.

తరువాత బస్సులో విల్లుపుత్తూరువచ్చి శ్రీ ఆండాల్ తల్లిని, (గోదాదేవిని) శ్రీనృసింహస్వామి, వటపత్ర సాయిదేవాలయాలు దర్శించి, మధురై బయలుదేరేము. దారిలో త్రిపురకుండ్రంలో ఆగి శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారిని దర్శించుకుని సాయంత్రా నికి మదురై చేరేము. అక్కడ స్నానాదులు పూర్తిచేసుకొని మధురై దేవాలయం సందర్శించాము. దేవాలయం ఊరిమధ్య నాలుగుపెద్ద గోపురాలతో కొన్నిఎకరాల విస్తీర్ణంలో వ్యాపించి వుంది. వరసిద్ధివినాయకుని, మీనాక్షి దేవిని, సుందరేశ్వరుని, సుబ్రహ్మణ్యస్వామి, ఆంజనేయస్వామి, శనీశ్వరుడు ఇతరదేవతామూర్తులన్నీ దర్శించి రాత్రి తిరిగి బస్సులో ప్రయాణించి, మరునాడు (17-1-1984) తెల్లవారుజామున బస్సు శ్రీరంగంలో కావేరినది ఒడ్డుకుచేరింది. ఈ దేవాలయము నాలుగు ప్రదాన గోపురాలతో కొన్ని ఎకరాల విస్తీర్ణంలో ఊరిమధ్యనే వుంది. పవిత్రకావేరీనదిలో స్నానం చేసి శ్రీరంగనాధుని, ఆండాల్తల్లిని దర్శించి, దగ్గర్లోవున్న జంబుకేశ్వరుని, అఖిలాండేశ్వరి అమ్మవారిని దర్శించి కంచి చేరేము. కంచిలో విష్ణుకంచి, శివకంచిలు దర్శించి కామాక్షీ అమ్మవారిని, ఏకాంబరేశ్వరుని, వరదరాజస్వామిని దర్శించి రాత్రికి తిరుత్తణిచేరి సుబ్రహ్మణ్యస్వామి వారిని దర్శించుకొని శ్రీకాళహస్తికి బయలుదేరేము.

శ్రీకాళహస్తి తెల్లవారు జామున బస్సుచేరడంవలన చీకటి వీడే వరకు బస్సులోనే కూర్చొని యైదుగంటలయ్యాక సువర్ణముఖి నదిలో స్నానంచేసి శ్రీకాళ హస్తీశ్వరుని, జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని, దక్షిణామూర్తిని దర్శించి దగ్గరవున్న హోటల్లో బిక్ష ఆరగించి తిరిగి విజయవాడ బయలుదేరేము. ఇరుముడికట్టుకుని యాత్రకు బయలుదేరినది మొదలు 18 తారీఖువరకు పదిరోజులపాటు బయట ప్రపంచంతో సంబంధం లేకుండా రేడియోలో వార్తలువినకుండా, వార్తాపత్రికలు చదవకుండా, ఇంటికిఫోను చేయకుండా మా బృందంలోవారంతా వుండి శబరిమల యాత్ర చేయడం గొప్పవిశేషం. కళ్ళుమూసినా తెరచినా స్వామివారి రూపమే గోచరిం చేది. బస్సు చప్పుడు కూడా స్వామియే అయ్యప్పో అని వినిపించేది. అంతభక్తి

తత్పరతతో క్రమశిక్షణతో యాత్రచేసిన బృందాన్ని ఇప్పటివరకు చూడలేదని మా బస్సు డ్రైవర్‌కితాబుయిచ్చాడు. మధ్యలో నెల్లూరులో భోజనాలకు ఆగి సాయంత్రానికి విజయవాడ కృష్ణాతీరంచేరి కృష్ణానదిలో స్నానంచేసి గొల్లపూడిచేరి, గొల్లపూడి ధర్మ శాస్తాను దర్శించి యాత్ర దిగ్విజయం చేసి నందులకు భక్తితో మొక్కి స్వామివారి ఎదుట మా గురుస్వామి ఇక దీక్ష విరమించవచ్చని చెప్పి, మెడలో ధరించిన ముద్ర మాలలను తొలగించి చేతికియిచ్చారు. మెడలో మాలతీయగానే ఏదో అద్భుతశక్తి నాలో నుండి దూరమైనట్లు భావనకలిగింది. ఆవిధంగా శబరిమలయాత్ర ముగిసినా హరిహరసుతుడు అయ్యప్పస్వామి నన్ను వీడలేదు. ఓమ్ స్వామియే శరణమయ్యప్ప! స్వామిశరణం! అయ్యప్పశరణం! మా గురుస్వామి ఆధ్యాత్మిక జిజ్ఞాసను నాలోపెంచి పలుసార్లు కఠినదీక్షను అవలంబించి శబరిమల యాత్ర చేయడానికి దోహదపడినందు లకు మాగురుస్వామికి సర్వదాకృతజ్ఞతాభివందనాలు అర్పిస్తున్నాను.

4

భక్తి అనేది హృదయం నుండి రావాలి. అంతేకాని ఊరికే దేవుడికి చేతులు జోడించి నమస్కరిస్తూ నోటితో భగవన్నామం ఉచ్చరించడం వలనరాదు. దీనికి సంబంధించిన కథ ఒకటుంది.

త్రిలోకసంచారి నారదమునీంద్రునికి తనకంటే గొప్ప భక్తుడు ఎవరూ వుండ రని, నారాయణస్మరణం నిత్యంచేస్తున్నది తనేనని కాస్తంత గర్వం కలిగింది. ఒకసారి వైకుంఠంవెళ్ళినప్పుడు శ్రీమహావిష్ణువును సందర్శించి, మహావిష్ణువు నోట తనే గొప్ప భక్తుడనిపించుకోవాలనే భావన కలిగింది. వెంటనే లక్ష్మీనారాయణులను కీర్తించి, స్వామీ నాకంటే గొప్ప భక్తులు ఎవరైనా ఉన్నారా? అని గర్వంగా అడిగేడు. శ్రీ మహావిష్ణువు చిరుదరహాసంతో లేకేమి భూలోకంలో నాకత్యంతప్రియమైన భక్తుడొక డున్నాడు అని అనగానే నారదుడు ఆశ్చర్యంతో కొయ్యబారి మరల తేరుకొని ఆతృ తగా ఎవరుస్వామి అతను? ఎక్కడుంటాడు? అని అడిగేడు. అతను భూలోకంలో పలాన ఊరిలో వుంటాడని చిరునామా చెప్పడంతో నారదమునీంద్రుడు పరుగు పరుగున ఆ ఊరుచేరి అతనికోసం వెతికాడు.

ఆ ఊరిలో వ్యవసాయం చేస్తూ బ్రతుకుతున్న పేదరైతుని చూసి నారదుడు ఆశ్చర్యపోయాడు. అతను రోజుకు నాలుగుసార్లు అంటే నిద్రలేచినపుడు, పని ప్రారంభించినప్పుడు, అన్నం తినేటప్పుడు, నిద్రపోయే ముందు ఒకసారి నారాయణ నామం ఉచ్చరిస్తున్నాడు. రోజంతా క్షణంతీరిక లేకుండా గడుపుతున్న అతన్ని చూసి తనసంసయం తీర్చుకోడానికి మరల నారదుడు వైకుంఠం వెళ్ళి శ్రీమన్నారాయణ్ణి కలిసి, ఆపేదరైతు నీకు అత్యంత ప్రియమైన భక్తుడెలా అయ్యాడని అడిగేడు.

శ్రీమహావిష్ణువు దానికి సమాధానంగా ఒకగిన్నె తెప్పించి దాని నిండా నూనె నింపి, ఒకచుక్క కూడా క్రింద పడకుండా ఈ గిన్నెనూనెతో మూడుసార్లు ప్రదక్షిణం చేయమని ఆదేశించాడు. నారదుడు ఇదెంతపని అనుకొంటూ నూనెగిన్నె పట్టుకుని

ఒకచుక్క క్రిందపడకుండా జాగ్రత్తగా వైకుంఠనాధుని చుట్టూ మూడు ప్రదక్షిణాలుచేసి గర్వంగా చూసేడు. నారాయణుడు చిరునవ్వు నవ్వుతూ 'ఎన్నిసార్లు నారాయణ మంత్రాన్ని ఉచ్చరించానని' అడిగేడు. నారదుడు ఆశ్చర్యంగా నారాయణుని వంక చూసి తనదృష్టి అంతానూనెపైనే ఉండడంవలన ఒక్కసారి కూడా దైవాన్ని తలవలేదు అని చెప్పేడు. ఆపేదరైతు దృష్టి అతనుచేసే వృత్తిపైనే లగ్నం కావడం వలన రోజుకు నాలుగుసార్లు దైవాన్ని స్మరించినా భక్తి నిండిన హృదయంతో స్మరిస్తున్నాడు. అందుకే అతనంటే నాకు ఇష్టం. అని శ్రీమన్నారాయణుడు చెప్పడంతో సిగ్గుతో నారదుడు తలవంచుకొని సెలవు తీసుకొని అక్కడ నుండి నిష్క్రమించాడు.

నీవు చేసేపనిలోనే దైవాన్ని దర్శించు అని అనుభవంతో మనపెద్దలు ఎప్పుడో చెప్పేరు.

అయ్యప్పదీక్ష శబరిమలయాత్ర చేసాక నాలో బాగా మార్పు వచ్చింది. ప్రతిరోజూ సూర్యోదయానికి ముందు నిద్రలేవడం, రెండుపూటలా చన్నీటి స్నానం చేయడం, రోజూ కూర్చొని కనీసం గంటసేపు దైవపూజ చేయడం అలవాటయింది. బయట చిల్లరతిళ్లు తినడం మానకున్నాను. హోటళ్ళలో కూడా తప్పనిసరి పరిస్థితిలో తప్ప తినకూడదని నిర్ణయించుకుని దానికి కట్టుబడివున్నాను. వ్యర్థప్రసంగాలు, అధిక ప్రసంగాలు, సినిమాలు, టి.వి. చూడడం తగ్గించి ఆధ్యాత్మిక గ్రంథాలు, చదవ డానికి, ఆధ్యాత్మిక ప్రసంగాలు వినడానికి ప్రాధాన్యత ఇవ్వడంతో శాంతం అలవడింది. ఇంట్లో సంతోషవాతావరణం నెలకొంది. ఇంట్లో నా శ్రీమతి, పిల్లలు కూడా క్రమశిక్ష ణతో ఉదయమే నిద్రలేచి ఎవరూ చెప్పకుండా చన్నీటిస్నానం చేయడం అలవాటు చేసుకున్నారు. పిల్లలు స్నానంచేసి నుదుట విభూది, కుంకుమ ధరించి రోజూ యైదు నిమిషాలు తక్కువ లేకుండా దైవప్రార్థన చేసి స్కూలుకి వెళ్ళేవారు. శ్రీమతిలో కూడా భక్తి పెరిగి పూజలు ఎక్కువసేపు చేయడం ప్రారంభించింది. మొదటి నుండి ఇంటి అలంకరణకు ప్రాధాన్యత నిచ్చి ఇంటిని ఎప్పుడూ అందంగా అలంకరించి ఉంచేది. మా ఇంటికి ఎవరు వచ్చినా మా ఇల్లుచూసి, మా ఇల్లు ఒక దేవాలయంలా పవిత్రంగా వుంటుంది. అనేవారు. శ్రీమతి కూడా ఎంతో శ్రద్ధగా ఏ ఊళ్ళో ఉన్నా ఇంటిని శుభ్రంగా అందంగా అలంకరించేది. ఎక్కడ శుచి శుభ్రత ఉంటుందో అక్కడ భగవంతుడుంటాడన్నది సత్యం.

ఒకసారి జీవితంలో శబరిమలయాత్రచేయాలకున్న నేను మరల మరుసటి సంవత్సరం కూడా యాత్రకు వెళ్ళడానికి సిద్ధమయే సరికి ఇంట్లో అంతా ఆశ్చర్య పోయారు. నా మొదటి శబరిమల యాత్రానుభవాలతో స్వామి అయ్యప్పదీక్ష–శబరి మలయాత్ర అనేపేరుతో పుస్తకం వ్రాసి ప్రచురించాను (1984) మొత్తం 2000 కాపీలు అచ్చువేయించి వెయ్యి కాపీలు ఉచితంగా పంపిణీ చేసాను. ఆ పుస్తకానికి అనూహ్య స్పందన, ఆదరణ లభించడంతో ఆ తరువాత 15 ముద్రణలు జరిగి ఇంకా ప్రచురణలో వుంది. అయ్యప్పదీక్ష, శబరిమల యాత్ర గురించి, అప్పటివరకు

వివరణలతో తెలుగులో పుస్తకంలేనందున కళ్ళకు కట్టినట్లు శబరిమల యాత్రగురించి వర్ణించి చెప్పడం వలన ఈ రోజు కూడా (2010) దేశం నలుమూలల నుండి, ఇరవై యైదు సంవత్సరాలు గడచినా ఈ పుస్తకం గురించి, వారి సంసయాలు తీర్చుకోవడం కోసం ఫోన్లు, ఉత్తరాలువస్తూంటాయి. ఈ పుస్తకాన్ని చదివి దేవుణ్ణి నమ్మనివారు కూడా కొందరు మాలధరించి, దీక్షచేసి శబరిమల యాత్రచేసి వచ్చినట్లు తెలిసింది. చాలామంది శబరిమలయాత్ర చేయడానికి నా పుస్తకం స్ఫూర్తి దాయక మయిందని విని ఆనందించాను. కొందరు నాపుస్తకం చదివి దీక్షచేసి శబరిమల యాత్రచేసి వచ్చి వారికున్న దుర్వ్యసనాలను (త్రాగుడు, ధూమపానము) మాను కున్నట్లు మంచినవడవడి కలిగిజీవిస్తున్నందున కుటుంబంలో అయ్యప్ప కృపవలన సుఖశాంతులు బడిసేరని చెప్పగా విని నా జన్మచరితార్థమైనట్లు ఉప్పొంగిపోయి అయ్యప్పస్వామికి మనసులోనే భక్తితో నమస్కరించాను. ఒక్కసారి వెళ్లాలని ప్రారంభించిన శబరిమలయాత్ర 3సార్లు చేయాలని, 5సార్లు చేయాలని, తొమ్మిది సార్లు చేయాలనుకొని చివరకు పద్దెనిమిదిసార్లు పూర్తి చేసి శబరిమలలో కొబ్బరి చెట్టునాటిన తరువాత కూడా తృప్తికలుగక అలా ఇప్పటివరకు 50–60 రోజులు తక్కువకాకుండా దీక్షచేసి 24సార్లు శబరిమల యాత్రచేసి రావడం నా పూర్వజన్మ సుకృతంగానే భావిస్తాను. (2010). ఓమ్ స్వామియే శరణమయ్యప్ప! సమస్తపరాదరక్షకునే శరణ మయ్యప్ప!

నా మొదటిపుస్తకం ప్రచురించాక అసంఖ్యాకంగా ఉత్తరాలు రాసి పలువురు సందేహాలు వ్యక్తం చేయడంతో సందేహ నివృర్తికోసం ఇంకా కొంత సమాచారాన్ని సేకరించి, నా రెండవ పుస్తకముగా 'శబరిమలయాత్ర–విశిష్టత' వ్రాసి ప్రచురించాను. ఈ పుస్తకం కూడా ఇప్పటికి 9 ముద్రణలై బహుళప్రచారం పొందింది. తరువాత శబరిమలై అయ్యప్ప వైభవం పేర ఒక పుస్తకాన్ని వ్రాసి ప్రచురించాను. నా మొదటి పుస్తకం చదివి చెన్నైనుండి ఒక అయ్యప్ప, అనంతపురం నుండి ఒక అయ్యప్ప విజయవాడలో మా ఇంటికివచ్చి నన్ను అభినందించి షిర్డీసాయి బాబామీదకూడా ఒక పుస్తకం రాయమని కోరివెళ్లేరు. అప్పటివరకు షిర్డిసాయిబాబా గురించి నాకు ఎక్కువ తెలియకపోయినా బాబా చరిత్ర చదివి, షిర్డీవెళ్ళి శ్రీ సాయిబాబాని దర్శించి 'షిర్డిసాయి' అయ్యప్పల వైశిష్ట్యం. 'శ్రీ షిరిడీ సాయిదీక్ష పేరుతో రెండు పుస్తకాలు వ్రాసి ప్రచురించాను. తలచుకుంటే భగవంతుని లీలలు చిత్ర విచిత్రంగా వుంటాయి. నా మొదటి పుస్తకాన్ని చదివి హైద్రాబాదు నుండి ఒక దత్తాత్రేయుని భక్తుడు మా ఇంటికివచ్చి నాకు ఆప్తమిత్రుడవడమే కాకుండా ఎన్నో ఆధ్యాత్మిక విషయాలు తెలియజేసి తెనాలి దగ్గరవున్న పూలమ్మగారనే సాయ భక్తులరాలు ఇంటికి తీసుకువెళ్ళి ఆమె ఆశీర్వచనాలు ఇప్పించి, అక్కడ జరిగే చండీయాగంలోపాల్గొనే అవకాశం కల్పించ డం నా జీవితంలో మరపురాని సంఘటన. పుస్తకాలు రాయడానికే శక్తినివ్వకుండా ప్రచురించిన పుస్తకాలు విక్రయానికి కూడా ఆయనేదారి చూపడం విశేషం.

2008వ సంవత్సరంలో చార్‌ధామ్ యాత్ర (కేదారినాథ్ బదరీనాథ్ యమునోత్రి, గంగోత్రి) యాత్రచేసి వైష్ణవీదేవియాత్ర కూడా పూర్తిచేసి వచ్చి 'పాంచ్‌ధామ్' యాత్ర పేరుతో అందరికీ పనికివచ్చేటట్లు గైడులా ఉపయోగపడే పుస్తకాన్ని రచియించి ప్రచురించాను.

నేను శబరిమలయాత్ర ఏ కోరికతోను, మొక్కుబడితోను ప్రారంభించలేదు. కేవలం పట్టబందాసనంలో చిన్ముద్ర అభయహస్తముతో శబరిమలలో పదునెనిమిది మెట్లమీద మందహాసవదనముతో కూర్చున్న మణికంఠుడైన అయ్యప్పస్వామిని దర్శించ డానికే యాత్ర ప్రారంభించాను. నాకు తరచు ట్రాన్స్‌ఫర్లు వచ్చి ఎన్ని ఊళ్ళు తిరిగినా మా పిల్లల అదృష్టమో, నా అదృష్టమో భగవదనుగ్రహమో తెలియదుకాని ఏ ఊరు ట్రాన్స్‌ఫర్ అయినా వారికి మంచి స్కూళ్ళల్లో డొనేషన్ కట్టకుండా, రికమండేషన్ లేకుండా సీట్లు వచ్చేవి. మాకోలీగ్స్, ఆఫీసు స్టాఫు డొనేషన్లు కట్టకుండా సీట్లు సంపాదించడం చూసి ఆశ్చర్యపోయేవారు. ముగ్గురు పిల్లలు తెలివైనవారై బాగా చదవడం వలన నేను శ్రమపడకుండానే పెద్దమ్మాయి గ్రాడ్యుయేషన్, మిగతా ఇద్దరు అమ్మాయిలు పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తిచేసారు. భగవంతుని అనుగ్రహంతోనే మా ముగ్గురు అమ్మాయిలకు మంచి సంబంధాలు వచ్చి పెళ్ళయి మంచి అల్లుళ్ళు వచ్చారు. ముగ్గురూ ఉన్నత స్థితిలో వుండి పిల్లపాపలతో హాయిగా వుంటున్నారు.

నేను కర్నూలులో పనిచేస్తున్నప్పుడు ఒకతనికి కావలసిన విత్తనముల ఇవ్వలేదని ఒక రాజకీయ నాయకుడు మా ఆఫీసుకువచ్చినాపై దౌర్జన్యం చేసేడు. ఈ సంఘటన జరిగిన వెంటనే మా ఆఫీసుస్టాఫ్ కొందరు రాజకీయనాయకులు నన్నుపోలీసులకు హెడ్డాఫీసుకు కంప్లయింట్ చేయమని నాకు అండగా వారంతా ఉంటామని ప్రోత్స హించారు. ఆయన చేసిన తప్పుకు ఆయనే శిక్ష అనుభవిస్తాడని నేను ఎవరికీ కంప్లయింట్ చేయలేదు. తరువాత అతను ఎన్నిపార్టీలు మారి ఎన్నిసార్లు ఎలక్షన్లలో నిలబడి ఎంత డబ్బు ఖర్చుచేసినా ఒక్కసారి ఎలక్షన్లో గెలవలేదు. ఓటమే చవిచూసాడు. భగవంతుడే ఆరకంగా అతణ్ణి శిక్షించేడని నా నమ్మకం.

నేను రెండవసారి అయ్యప్పదీక్షతీసుకున్నప్పుడు మా గురుస్వామి దీక్షలో కేవలం అయ్యప్పపూజలు, భజనలే కాకుండా ప్రతిరోజు లేక వీలుకలిగినపుడు విష్ణు సహస్రనామస్తోత్రం, లలితాసహస్రనామస్తోత్రం, ఆదిత్య హృదయస్తోత్రం వంటివి పారాయణం చేయడం మంచిది. అవి చాలా మహిమాన్విత స్తోత్రాలు కనుక వాటిని కూడా పారాయణచేయమని ప్రోత్సహించి పారాయణచేసే విధానాన్ని మా గురుస్వామి నేర్పించారు. మేము శ్రద్ధాభక్తులతో నేర్చుకుని పారాయణగావించి అనారోగ్యానికి గురియై మంచంపట్టిన వారికోసం కొందరు మిత్రుల ఇళ్లల్లో మా బృందం కొన్నిసార్లు పారాయణచేయగానే వారు త్వరితగతిని జబ్బునుండి కోలుకొని ఆరోగ్యవంతులవడం చాలా ఆశ్యర్యాన్ని కలిగించింది. మా అమ్మగారికి లివరు వ్యాధి వచ్చి ఆమె ఎక్కువకాలం బ్రతకదని కొన్ని నెలలు మాత్రమే బ్రతుకుతారని

డాక్టరు చెప్పడంతో మా అన్నదమ్ములంతా కలసి 108 సార్లు విష్ణుసహస్రనామ పారాయణాన్ని మా ఇంట్లో చేసేసరికి ఆమె ఆయుర్దాయం ఆరుసంవత్సరములు పెరిగింది. ఆమెకు వైద్యం చేసిన డాక్టర్లే అన్నేళ్ళు జీవించడం చూసి ఆశ్చర్యపోయారు. ఆ స్తోత్రాలలో అంతటి అద్భుత మహాత్మ్యం ఉందని నమ్మకం ఉండబట్టే భక్తితో సాధన చేసి రెండుసార్లు ఆఫీసులో వచ్చిన గండాలనుండి బయటపడ్డాను. తణుకులో పనిచేసినపుడు దైవసహాయాన్ని కోరకపోవడంవలనే నష్టపోయాను. మా బృందంలో వున్న జి.గోపాలకృష్ణస్వామి, విశ్వనాధ్ కామేశ్వరరావుస్వామి, నేను విష్ణు సహస్రనామ స్తోత్ర పుస్తకాలను ముద్రించి ఉచితంగా పంపిణీ చేయడమేకాకుండా ఎందరోపారా యణచేయడానికి తోడ్పడ్డాము.

విష్ణుసహస్రనామ పారాయణలో అంతటి మహాత్మ్యం వుండబట్టే శ్రీ షిర్డిసాయిబాబా గారు కూడా పారాయణచేయమని భక్తులను ప్రోత్సహించేవారు.

నేను విజయవాడకు రెండవసారి ట్రాన్స్ఫరైవచ్చినప్పుడు ఒక సంవత్సరం మా ఆఫీసు నుండి సరఫరాచేసిన వరివిత్తనములు మొలకరాలేదని రైతులు ఆందోళన చేస్తే వారికి ఎనిమిదిలక్షల వరకు ఆఫీసునుండి కాంపన్సేషన్‌గా మొత్తం సొమ్ము చెల్లించవలసి వచ్చింది. రాజకీయనాయకులు నాపై ధ్వజమెత్తారు. ఏదో పెద్ద ఫ్రాడ్ జరిగిందని తక్షణమే చర్యతీసుకోవాలని పట్టుబట్టారు. అంతా నా ఉద్యోగం ఊడుతుందనుకున్నారు. మా సంస్థ ఎమ్.డి.గారు ఒక అనుభవజ్ఞుడైన సీనియర్ ఆఫీసరుతో ఎంక్వయిరీచేయిస్తే విత్తన సేకరణలో తప్పు జరగలేదని గోడౌన్లో విత్తనాలు నిలువవుంచి నప్పుడు పురుగుపడితే దాని నివారణకు వాడిన పురుగుమందులు, ఫ్యూమిగేషన్ వలన, ఆ సంవత్సరముల విపరీతమైన ఎండలవలన మొలకశాతం తగ్గిందని నిరూపణ అవడం, విత్తనాన్ని స్టేట్‌వేర్ హౌసింగ్ గోడౌన్లలో నిల్వవుంచి నందువలన నా తప్పులేదని రుజువు కావడంతో అప్పుడు రాజకీయ నాయకులను తృప్తి పరచడం కోసం నన్ను విజయవాడనుండి హైద్రాబాదుట్రాన్స్‌ఫర్ చేసారు. భగవంతుడు నాలుగుచేతులతో కిరీటంధరించి వచ్చి కాపాడక పోయినా మనుష్య రూపంలో కూడావచ్చి కాపాడు తాడనడానికి ఇది గొప్ప నిదర్శనం. నిజానికి అప్పుడు ఎమ.డి.గారు తెలంగాణాకు చెందిన వ్యక్తి, అతనితో నాకు పూర్వపరిచయంలేదు. మా సంస్థకు ఎమ్‌డి.గా వచ్చిన సంవత్సరం నుండే తెలిసినా ఆయన చేసిన ఉపకారాన్ని ఈ జన్మలో మరువలేను. ఓమ్‌స్వామియే శరణమయ్యప్ప!

భగవంతుని నమ్ముకున్న వానికి భగవంతుడు ఏదో రూపంలోవచ్చి తప్పక సాయం చేస్తాడని తెలపడానికి ఉదాహరణగా ఇక్కడ ఒక కథను ప్రస్తావిస్తున్నాను.

ఒక ఊరిలో ఒకగుడిలో నిత్యం పూజలుచేసే పూజారి ఒకతను ఉండేవాడు. ఒకసారి ఆ ఊరిలో ఎడతెరపి లేకుండా వానలు కురవడంతో వాగులు, నదులు పొంగి ఆ ఊరిని ముంపుకుగురిచేసింది. ముంపు వస్తోందని, వరదలవలన ఊరు మునిగే ప్రమాదం వుందని ప్రజలను కాళీచేసి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్ళమని

అధికారులు ఆదేశించి తగిన చర్యలు తీసుకొని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఆగుడి పూజారిని రమ్మంటే నాకు భయంలేదు. నన్ను ఆ భగవంతుడే కాపాడతాడని చెప్పి అతను రాలేదు. వరదపెరిగి గుడిని కూడా ముంచడంతో ఆ పూజారి గుడి శిఖరం ఎక్కి కూర్చున్నాడు. ఈ విషయం తెలిసిన అధికారులు అతన్ని రక్షించడానికి ఒకపడవను పంపేరు. పడవ వచ్చినా అతను ఎక్కకుండా నన్ను ఆ భగవంతుడే రక్షిస్తాడనిచెప్పి మొండిగా చెప్పి పడవను వెనక్కి పొమ్మన్నాడు. వరద ఉధృతంగా రావడంతో అతను నీటిలోపడి కొట్టుకుపోయి దారిలో ఒకచెట్టు దొరికితే దానిపై ఆశ్రయించి కూర్చునివున్న అతన్ని, ఇంకా వరదలోచిక్కుకున్న వారి కోసం హెలికాప్టరును అధికారులు పంపేరు. హెలికాప్టరు నుండి తాడు జార విడిచి పూజారిని ఎంత ఎక్కమని బ్రతిమిలాడినా అతను ఎక్కకుండా నన్ను ఆ భగవంతుడే కాపాడుతాడని భీష్మించుకొని చివరకు వరదలో కొట్టుకుపోయి మరణించాడు.

అతడు మరణించి స్వర్గలోకానికి చేరేక అక్కడ దేవుణ్ణి చూసి, నిన్ను నమ్ముకున్న నన్ను రక్షిస్తావని ఎదురుచూస్తే నువ్వు రక్షించకుండా ఈ భక్తుణ్ణి మృత్యువుపాలు చేసేవు. నువ్వేమి దేవుడివయ్యా! అని ప్రశ్నించాడు. దేవుడు నవ్వి, నిన్ను రక్షించడానికి ముందు పడవ ఏర్పాటుచేసాను. తరువాత హెలికాప్టర్ పంపేను. అయినా మూర్ఖంగా నువ్వు ఎక్కలేదు. ఆ తప్పు నీది కాని నాదికాదు. అని చెప్పడంతో ఆ భక్తునికి కనువిప్పు కలిగి తనుచేసిన తప్పులను తెలుసుకొని లెంపలు వాయించుకొన్నాడుట. భగవంతుని నమ్మినవారికి సాయం ఏ రూపములోనైనా అందవచ్చు. అంతేకాని దైవమే స్వయంగా వచ్చి కాపాడుతాడను కోవడం అవివేకమవుతుంది. షిర్డిసాయి బాబాగారు కూడా తనలీలలో ఈవిషయాన్నే తెలియపరచడానికి వివిధ రూపాలలో భక్తుల ఇళ్ళకు వచ్చి భక్తులను పరీక్షించి అనుగ్రహించి వారికోర్కెలు తీర్చినట్లు మనకి శ్రీసాయి సచ్చరిత్ర తెలియజేస్తోంది.

నేను వరంగల్ ఆఫీసులో పనిచేసినది ఒక్కసంవత్సరమే అయినా, నాకు విజయగనం ట్రాన్స్‌ఫర్ అయ్యాక వరంగల్ ఆఫీసులో అకౌంట్స్ ఆడిట్ చేస్తే మా ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టరుకి నా టైములో మూడు లక్షల రూపాయలు, నా ముందు వున్న అదికారి టైములో నాలుగు లక్షల రూపాయలు అతనికివ్వ వలసిన మొత్తం కంటే అధికంగా ఇచ్చినట్లు తేలడంతో ఆ సొమ్ము మొత్తాన్ని ఇన్‌చార్జిగా ఉన్న ఇద్దరు అధికారులు ఆఫీసుకు చెల్లించాలని లేని పక్షంలో ఆ సొమ్మును జీతభత్యాల నుండి వసూలు చేయడవలసి వస్తుందనిముందు సస్పెండు చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీచేసేరు. నేను రెండు నెలలక్రితమే విజయనగరం ట్రాన్స్‌ఫరై వచ్చిన నన్ను తిరిగి హైద్రాబాదు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు ఆర్డరు పంపేరు. స్వంత ఊరు బదిలీమీద వచ్చేనని ఉత్సాహంలేకుండా ఏదోరకమైన సమస్యలు ఆఫీసు మూలంగా రావడం చికాకు కలిగించింది. ఎంత జాగ్రత్తగా వున్నా ఆఫీసులో ఎకౌంటెంటు, క్యాషియర్

ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టకు చెందిన కొత్త సర్క్యులర్ చూడకుండా పాత సర్క్యులరు రేట్ల ప్రకారం లెక్కకట్టి ట్రాన్స్‌పోర్టుబిల్లు పాసు చేయడం వలన అకౌంటెంటు పొరపాటు వలన అదనంగా ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టరుకి ఏడు లక్షలరూపాయలు అధికంగా లభించడంతో లాభం పొందిన ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టరు చెక్కులు తీసుకొని లబ్ధిపొందేడు. ఈ వార్త నన్ను చాలా కృంగదీసింది. ఈ ఆపదనుండి ఆ పరమాత్ముడు తప్ప ఎవ్వరూ కాపాడలేరని నిశ్చయించుకుని ప్రతిరోజు ఉదయం, సాయంత్రం శ్రీ విష్ణు సహస్రనామపారాయణ, శ్రీ లలితాసహస్రనామ పారాయణం, ఆదిత్య హృదయం భక్తి శ్రద్ధలతో పారాయణం చేయడం ప్రారంభించాను.

హైద్రాబాద్‌వెళ్ళి వరంగల్‌లో నాముందు పనిచేసిన అధికారిని కలిసి ఈ సమస్యనుండి ఎలా బయటపడాలను కొంటున్నారని అడిగేను. అతను బిక్కమొగమేసి డబ్బు ఆఫీసుకు కట్టకపోతే ఉద్యోగాలు పోతాయి. ఆ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టరు మనపై దయతలచి డబ్బువెనక్కి యిచ్చి, ఆఫీసుకి కట్టానంటే సమస్యకి పరిష్కారం వుంటుంది. లేకుంటే డబ్బులుకట్టి ఉద్యోగాలను నిలుపుకోవడమే మార్గమని చెప్పడంతో భగవంతుని ప్రార్థించి అతనిపై భారంవేసి వరంగల్ వెళ్ళి కాంట్రాక్టరు ఇంటికి వెళ్ళి ఇద్దరం కలసి విషయం చెప్పి, ఈ ముప్పునుండి ఎలాగైనా మమ్మల్ని కాపాడా లని ఆయన్ని ప్రాధేయపడ్డాము. ఆయన భార్యతో సంప్రదించి మరునాడు చెబుతా నన్నాడు. మానవప్రయత్నం చేస్తున్నా, ఆ దైవాన్నే నమ్ముకొని నా ప్రయత్నం ముమ్మ రం చేసాను. కరుణామయుడైన భగవంతుడు మా ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టరు హృద యంలో దూరి నాలుగు రోజులు టైమిస్తే మొత్తం సొమ్ము ఏడు లక్షల రూపాయలు హైద్రాబాదు వచ్చి ఆఫీసులో చెల్లిస్తానని చెప్పి రాతపూర్వకంగా ఇవ్వడంతో ఆయన్ని అభినందించి తిరిగి హైద్రాబాదు వచ్చాము.

నేను దైవాన్ని ప్రార్థిస్తూ, ఆయనపైనే భారంవేసి రోజులు లెక్కపెట్టసాగేను. ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టరు మాట తప్పకుండా చెప్పినరోజుకి ఆఫీసుకి వచ్చి యైదు లక్షలరూపాయలు జమచేసి, మిగతా రెండు లక్షల రూపాయలు అతనికి ఆఫీసు నుండి రావలసిన బిల్లులనుండి మినహాయించుకోమని రాసి యివ్వడంతో పెద్ద గండం నుండి బయట పడ్డాము. ఆ రోజు నా ఆనందానికి పగ్గాలులేవు. ఈ ఆపద నుండి ఆ భగవంతుడే నన్ను మరొకసారి కాపాడి నన్నుఆదుకున్నాడని నా నమ్మకం. ఈ సంఘటనతో భగవంతునిపై మరింత విశ్వాసం పెరిగింది. పాత ఎమ్.డి.గారు మారి మాసంస్థకి కొత్తగా రెండేళ్ళ క్రిందట రాయలసీమ ప్రాంతానికి చెందిన అధికారి కొత్తగా ఎమ్.డి.గా వచ్చినా, మా సమస్య పరిష్కారానికి చొరవచూపి నందులకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపి మరల నన్ను విజయనగరం ట్రాన్స్‌ఫర్ చేయమని అడిగేను. మొదట ఎంత బ్రతిమాలినా ఒప్పుకోలేదు. అయినా పట్టువిడవని విక్రమార్కునిలా, దైవధ్యానం చేస్తూ ఆయన వెంటపడ్డాను. ఆయన ముందు విసుక్కున్నా చివరకు మరల విజయనగరం ఆఫీసుకు నన్ను ట్రాన్స్‌ఫర్ చేసినట్లు ఆర్డరు

ఇచ్చి పంపేరు. ఈ గెలుపు నాదికాదు ఆ భగవంతునిదే! ఆ అయ్యప్పదే! ఓమ్ స్వామియే శరణం అయ్యప్ప.

ఈ సందర్భంగా ఒకవిషయాన్ని తప్పక చెప్పాలి. విజయనగరంలో పైడితల్లి అమ్మవారి సిరిమాను పండగ వుండడం వలన ఆ రోజుకి ఎలాగైనా తిరగి విజయ నగరం రావాలని రిటర్న్‌టికెట్టు ముందుగానే కొనుక్కున్నాను. ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టరు ఎప్పుడు డబ్బులుకడ్తాడో తెలియదు. కట్టిన తరువాత ఆఫీసులో ఎమ్.డీగారి రియాక్షన్ ఎలాగుంటుందో తెలియదు. మరల విజయనగరం ట్రాన్స్ ఫర్ ఆర్డర్సు తీసుకుని వెళ్తానంటున్నావు. ఇవన్నీ ఈవారం రోజులలో ఎలాసాధ్యం. నీప్రయాణాన్ని పోస్టుఫోన్ చేసుకోమని నా స్నేహితుడు సలహా యిచ్చాడు. నేనుమాత్రం ఆ అమ్మవారి కృపాకటాక్షలు నాపై తప్పక ఉంటాయని నమ్ముతూ నా ప్రయత్నం నేనుకొనసాగించి, చివరకు విజయం సాధించి, అమ్మవారి పండగటైముకి విజయనగరం చేరడం అందర్నీ ఆశ్చర్యచకితులను గావించింది. ఇంటిదగ్గర నాశ్రీమతి కూడా నాకోసం ప్రత్యేక పూజలు, ఉపవాసాలు చేయడం వలన కేవలం దైవ కృపతోనే పెద్దగండం నుండి బయటపడ్డాను.

అయ్యప్ప దీక్షా నియమావళిలో మనకి తెలియని ఎన్నో రహస్యాలు దాగి వున్నాయి. ఈ విషయాన్ని తెలియకనేడు అనేకమంది దీక్షా నియమావళిని ఇష్టం వచ్చినట్లు సడలిస్తూ మండలదీక్షను వారంరోజులని, 15 రోజులని, 21 రోజులని కుదించి ఇష్టానుసారం వారికి అనుకూలంగా మార్చుకొని శబరిమల యాత్ర చేయడం వలన ఆశించిన ఫలితాలను పొందలేక పోతున్నారు. భక్తితో చేయవలసిన పూజలు, భజనలు ఆడంబరాలు, అట్టహాసాలకు పోయి, ఏదోపెళ్ళి సంబరాలులా వీడియోలు, ఫోటోలకు పోజులిచ్చి తీయించుకుని, సాత్వికాహారం, మితాహారం సేవించడానికి బదులు విందుభోజనాలు ఏర్పటుచేసి, రాత్రివేళ ఆలస్యంగా పూజలు, భజనలు ప్రారంభించి అర్ధరాత్రివరకు కొనసాగించడం వలన ఆశించిన ప్రయోజనాన్ని పొందలేక పోతున్నారు. బ్రహ్మచర్య వ్రతం అర్థం తెలియని కొందరు దీక్ష తీసుకున్న స్వాములపక్క అతని భార్యని కూర్చోబెట్టి ఇద్దరుచేత పూజలు చేయిస్తున్నారు. పడిపూజ, భజనముందు కన్నతల్లి చేతకాని, భార్యచేతకాని, యజమాని ముందుగా కావలిస్తే జ్యోతిప్రజ్వలన చేయించవచ్చు. కానీ దీక్షలోలేని స్త్రీలను పక్కన కూర్చోబెట్టుకొని అయ్యప్ప పూజలు చేయించడం మంచిదికాదు. అయ్యప్పపూజ, భజన సమయంలో దీక్షలో ఉన్న స్వాములే ముందు కూర్చోవాలి. దీక్షలోలేని పురుషులు, స్త్రీలుదూరంగా కూర్చొని భక్తితోవీక్షించాలి. ఇది సంప్రదాయకమైన పద్ధతి. శ్రీవిమోచనానంద స్వామివారు చెప్పిన పద్ధతి. వంటవార్పు వడ్డనసమయంలో శుచిశుభ్రత పాటించేస్త్రీలు పురుషులు కూడా పాల్గొని సహకరించవచ్చు. సేవలు చేయవచ్చు.

పూజ, భజనలలో భక్తికే ప్రాధాన్యత వుండాలి. షిర్డీసాయిబాబావారు కూడా భక్తి,శ్రద్ధ,నమ్మకం ఉండాలని, అవివుంటే వారికి తాను దగ్గరవుతానని పలు సందర్భా

లలో చెప్పి అదేతనకు పెద్ద దక్షిణగా స్వీకరిస్తానని భక్తులకు ప్రబోధించారు. దీక్షలో చన్నీటిస్నానం, నేలపై నిద్రించడం, బ్రహ్మచర్యవ్రతం చేయడం, మితాహారం సాత్వికాహారం సేవించడం, కాలి చెప్పులు లేకుండా నడవడం, తలపై ఇరుముడి పెట్టుకొని యాత్రకు వెళ్లడం, ఒకరికి ఒకరు అంతస్తులు, హోదామరచి సాయం చేసుకొంటూ అహంకారము, గర్వము విడనాడి, సర్వమానవ సౌభ్రాతృత్వానికి అర్ధము తెలియజేస్తూ అడవులలో పర్వతారోహణకు ఉపయోగపడే విధముగా దీక్షానియమా వళిని రూపొందించారు. 'అహంబ్రహ్మస్మి–తత్త్వమసి' సిద్ధాంతాన్ని ప్రతిపాదించి మాల ధరించి దీక్ష తీసుకున్న ప్రతి ఒక్కరిలో అయ్యప్ప భగవానుని దర్శిస్తూ తనలో కూడా దైవాన్ని దర్శించుకోవడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. అందుకే మాలాధారణచేసి నల్లబట్టలు వేసుకున్న స్వామిని చూడగానే మనకి తెలియకుండానే మన రెండుచేతులు పైకిలేచి స్వామిశరణం అని నమస్కరించడం జరుగుతుంది. తరచు పాదాభివందనం చేయడం, పూజ, భజనల తరువాత అయ్యప్పలు భిక్షసేవించాక తిన్న ఎంగిలి విస్తరాకులు ఎత్తడం, వివిధరకాల సేవలు చేయడంతో భక్తి పెరుగుతుంది. అహంకారం నశిస్తుంది. మనపురాణాలు, ఉపనిషత్తులు అన్నీకూడా భగవంతుడు ఎక్కడోలేడు, మన హృదయాలలోనే ఉన్నాడని ఘోషిస్తున్నాయి. అందుకే మహానుభావులు మానవసేవే మాధవసేవని ప్రబోధించి తరించమన్నారు. శ్రీషిర్డీసాయిబాబా కూడా సాటి మానవులనేకాక పశుపక్ష్యాదులను కూడా ప్రేమించాలని, తను ఏదో ఒకరూపంలో భక్తుల ఇంటికి వస్తానని చెప్పడంలో అంతరార్థాన్ని ప్రతీఒక్కరు ఇక్కడ గ్రహించాలి.

శ్రీరమణ మహర్షి కూడా ఎవరైనా ఆయన్ని దైవంగురించి ప్రశ్నిస్తే ముందు నువ్వెవరో తెలుసుకుని తనదగ్గరకు రమ్మనేవారు. నేను అంటే దేహముకాదని, లోనవేరేవున్న పరమాత్మని, దానిని దర్శించడానికి ప్రయత్నించమని ప్రబోధించేవారు. దైవ దర్శనం కావాలన్నా, ఆయన అనుగ్రహం కావాలన్నా చంటిబిడ్డ ఆకలై పాలకోసం ఏడ్చినట్లు ఏడిస్తే కన్నతల్లి ఎక్కడవున్నా పరుగుపరుగున వచ్చి బిడ్డను అక్కున చేర్చుకొని పాలిచ్చినట్లు భగవంతుడు కూడా భక్తితో, ఆర్తితో నీవేతప్ప నాకు వేరేదిక్కులేదని భారమంతా భగవంతునిపైవేసి శరణువేడితే కన్నతల్లి బిడ్డను లాలించినట్లు, గజేంద్ర మోక్షములో గజేంద్రుని కాపాడినట్లు, కౌరవసభలో ద్రౌపదిని రక్షించినట్లు, భగవంతుడు వచ్చి కాపాడుతాడని శ్రీరామకృష్ణ పరమహంస పదే పదే శిష్యులకు చెప్పేవారు. మీరు దేవుణ్ణి చూసారా! అని పరమహంస గారిని ఎవరైనా ప్రశ్నిస్తే నేను నిన్ను చూస్తున్నట్లే దైవాన్ని (జగజ్జననిని) చూసాను. ఆమెతో మాట్లాడేను. ఆమెతో తరచు మాట్లాడుతూవుంటాను. అని పలుసార్లు చెప్పేరు. నాకు దేవుణ్ణి చూపించమని ఎవరైనా అడిగితే, నువ్వు డబ్బు సంపాదనకు, ఇతర వ్యవహారలకు ఇచ్చే ప్రాధాన్యతలో సగంభాగమైనా దైవచింతనకి కేటాయిస్తే భగవంతుని తప్పక చూపిస్తానని ధైర్యంగా చెప్పిన మహానుభావుడు ఆయనే. అందుకే వివేకానందుని వంటిమేధాసంపన్నుడు ఆయన్ని ఆశ్రయించి ఆయనకి ప్రియశిష్యుడై గురువాత్సల్యంతో లోకంచేత పూజింపబడుతున్నాడు.

నేను మొదటిసారి అయ్యప్పదీక్ష తీసుకున్నప్పుడు కొందరు నన్నుచూసి, స్వామి మీకు ఏ చెడు అలవాట్లు లేవు కదా! అయ్యప్ప మాల ఎందుకు వేసుకున్నారని అమాయకంగా అడిగేవారు. నేడు శబరిమల వెళ్ళేవారిలో చాలామంది తమకున్న దురలవాట్లు పొగత్రాగడం, మద్యంసేవించడం, జూదం, వ్యభిచారం, మున్నగు అలవాట్లను వదలు కోవడం కోసం అయ్యప్ప దీక్ష చేయడం, శబరిమలయాత్ర వెళ్ళడం జరుగుతోంది. వ్యసనాలకు బానిసవైన వారు శబరిమల యాత్ర నుండి తిరిగి వచ్చాక వాటికి దూరమైతే మంచిదేకానీ కొందరు యాత్రనుండి తిరిగివచ్చిన వెంటనే మరల మందుకు, సిగరెట్ల వంటి వ్యసనాలకు అలవాటు పడడం చాలా బాధాకరమైన విషయం. ఇటువంటి వారిని చూసే అయ్యప్పదీక్షకు, శబరిమల యాత్రకు కళంకంవచ్చి అయ్యప్ప లంటే చులకనభావం ఏర్పడింది. ఎంతో పవిత్రమైన శబరిమల యాత్ర ఈవిధంగా మారడం కడుశోచనీయం. స్వామిశరణం..

6

కుటుంబంలో అంతా కష్టాల కడలినుండి బయటపడి ఉన్నతస్థితికి చేరుకొని ఆనందంగా ఉన్నామనుకున్న సమయంలో మా అమ్మగారికి లివరు వ్యాధి ముదిరి మంచాన పడడం మమ్మల్ని కృంగదీసింది. శాంతమూర్తి,సహనశీలి, ఉత్తమ ఇల్లాలుగా మాతృమూర్తిగా నిరాడంబరంగా జీవించిన కరుణామూర్తి మా అమ్మ తే 23-9-1994 నాడు స్వర్గస్తురాలవడం మాకు తీరని లోటు. ఈ ప్రపంచంలో నాకు జన్మనిచ్చి నన్ను అతిగా ప్రేమించి, అభిమానించి నా ఉన్నతినికాంక్షించి, నన్ను ఉత్తమపౌరుడిగా తీర్చిదిద్దిన తేజోమూర్తి సౌభాగ్యవతిగా ఈ భువిని వీడి ఉత్తమ లోకాలకు వెళ్ళడం ఆమె చేసుకున్న పుణ్యఫలమైనా ఆ లోటు మాకెవ్వరూ తీర్చలేనిది. మా అమ్మగారు స్వర్గస్తులైన తరువాత నేను వ్రాసిన నా మూడవ పుస్తకం 'శబరిమలఅయ్యప్ప వైభవం' మా అమ్మగారికి అంకితం యిచ్చాను. ఆ సందర్భంలో మా తమ్ముడు నరసింహనాథ్ వ్రాసిన పద్యాన్ని ఇక్కడ ప్రచురిస్తున్నాను.

"శాంతసహనశీలి చల్లని మాతల్లి
మహిని వీడెకాని మదిని నిలచి
అనవరతము తనదు ఆశీస్సులొసగుచు
గాచుచుండె మమ్ము కరుణతోడ"

మా అమ్మగారు స్వర్గస్తురాలవడాన్ని జీర్ణించుకోకుండానే చెన్నైలో హిందుస్తాన్ లీవర్సులో ఎకౌంటెంటుగా ఉద్యోగంచేస్తున్న మా రెండవ తమ్ముడు నరసింహనాథ్ అరవై సంవత్సరములు నిండకుండానే (18-2-2006) భార్య, ముగ్గురు పిల్లలను అనాథలనుచేసి సిర్రాసిస్ వ్యాధితో మృతిచెందడం మమ్మల్ని ఎంతగానో కృంగదీసింది. మాలో సౌమ్యుడు, మితభాషి, క్రమశిక్షణకు మారుపేరుగా ఉండి,నిస్వార్థంగా మాకుటుంబ ఉన్నతికి ఎనలేని కృషి చేసిన తమ్ముడు ఇకలేడంటే బాధకలుగుతుంది. భగవంతుడు నిర్దయుడని పించింది. గాంధీమహాత్ముడు, లాల్‌బహదూర్‌శాస్త్రి,

సిద్ధాంతాలను నమ్మి ఆచరించినవ్యక్తి అవడంవలన మా బంధువర్గంలో అందరికీ అతనంటే చిన్నవాడైనా ఎనలేనిగౌరవం. అమ్మపై అతనురాసిన పద్యాన్నేఉదాహరించాను.

ఆధ్యాత్మిక చింతన నాలో పెరగడంతో ఒకసారి విశాఖపట్నం వచ్చినపుడు శ్రీరామకృష్ణామిషన్ ఆశ్రమంలో శ్రీశారదామాతవద్ద ఉపదేశం పొందిన ఆమె శిష్యుడు శ్రీమత్ స్వామి గంబీరానందజీ మహారాజావారు తే. 22-1-1988 నాడు కలకత్తా నుండి వచ్చి ఉపదేశం చేస్తున్నట్లు మా తమ్ముడు ద్వారా తెలుసుకొని నేనూ ఉపదేశం పొందాలని రామకృష్ణామిషన్‌కి వెళ్ళాను. గురువుగారి ధర్శనానికి వెళ్ళినపుడు ఒట్టి చేతులతో వెళ్ళకూడదని పళ్ళు, ఒకపంచె, కండువా పట్టుకువెళ్ళి స్వామీజీకి సమర్పించి, పాదాభివందనచేసి కూర్చున్నాను. మొత్తం 60-70 మందిని ఒకహాల్లో కూర్చోబెట్టి మంత్రం ఉపదేశించారు. బ్రహ్మోపదేశం అంటే గురువుగారు స్వయంగా చెవులో చెబుతారనుకున్నాను. కానీ అలా అనుకున్నట్లు ఉపదేశం చేయ కుండా సామూహికంగా మంత్రోపదేశం చేయడం వలన నిరాశచెంది ఎంత ప్రయత్నించిన గురి కుదరలేదు. ధ్యానముపై మనసులగ్నం కాలేదు. చాలా బాధ కలిగింది.

విజయనగరం వచ్చాక మా కాలనీలో ఆధ్యాత్మిక చింతన గల కొందరు సీనియరు సిటిజన్సంతా కలిసి సత్సంగాన్ని ఏర్పాటుచేసుకొని ప్రతిరోజూ సాయంత్రం ఒకరింట్లో కలసి ఒక గంటకుపైగా ఏ ఇతర ప్రసంగములు. చింతనలు లేకుండా దైవ ప్రార్థనతో ప్రారంభించి రెండు భగవద్గీత శ్లోకములు చదివి, రోజూ భారతమో, భాగవతమో, రామాయణయో లేక అష్టాదశపురాణాలలో ఒకటి చదివి దాని భావాన్ని అర్థము చేసుకోవడానికి ప్రయత్నించాము. పురాణపఠనం అయ్యాక స్వస్తి మంత్రముతో సత్సంగాన్ని ముగించడం జరిగేది. అలా సత్సంగం ద్వారా పురాణాలలో వున్న అనేక కొత్త విషయాలెన్నో తెలుసుకోవడానికి అవకాశం లభించింది. భగవదన్వేషణకి సత్సంగం తోడ్పడడమేకాకుండా భక్తిరచనలెన్నో చేయడానికి నాకు దోహదం కలిగించింది.

మానవసేవయందు నమ్మకంలేని మతమును విశ్వసించరాదు. భగవద్గీతలో శ్రీ కృష్ణపరమాత్ముడు భక్తులు ఎక్కడ భగవంతుని గురించి గానం చేస్తారో అక్కడ తను ఉంటానని చెప్పేడు. ఇంకా ఎవరు అన్య చింతనలు లేకుండా తననే తదేకంగా ధ్యానం చేస్తారో, తనయందే నిష్ఠ కలిగి వుంటారో అటువంటివారి యోగక్షేమాలను స్వయంగా తానే వహిస్తానని చెప్పడం మనం గుర్తు వుంచుకోవాలి. వారిశక్తి కొలది భక్తితో పలము, ఆకులు, నీళ్ళు తెచ్చి యిచ్చినా స్వీకరిస్తానని మాట ఇచ్చాడు. అందుకే కుచేలుడు భక్తితో తెచ్చి యిచ్చిన పిడికెడు అటుకులను ఎంతో ఆప్యాయంగా స్వీకరించి అతనికి అష్టైశ్వర్యాలు యిచ్చి కాపాడినాడు శ్రీకృష్ణుడే అని మరచిపోరాదు.

వీలునిబట్టి ప్రతిరోజు అష్టాక్షరీ మంత్రము (ఓం నమో నారాయణాయ) లేక శివపంచాక్షరీ మంత్రము (ఓం నమఃశివాయ) మంత్రమును కానీ ప్రణవ

మంత్రము (ఓంకారము) రోజు ఉదయం వేళకాని సాయంత్రంవేళకానీ వీలుంటే రెండుపూటలా మనస్సులో భక్తి శ్రద్ధలతో జపిస్తే వారు పాపవిముక్తులై నిస్సంశయముగా ముక్తిని పొందగలరు. ఇందులో సంశయంలేదని కంచి పీఠాధిపతులు నొక్కి వక్కాణించారు. ఇలాటి విషయాలెన్నో తెలుసుకోవడం జరిగింది.

భగవద్గీతలో, ఉపనిషత్తులలో ఆహారనియమాలు, నిత్యం మనం ఆచరించవలసిన ధర్మాలు, నైతికవిలువల గురించి అనేక విషయాలు కథల రూపములోను, ప్రబోధరూపంలోను చెప్పడం జరిగింది. అందుకే పెద్దవాళ్ళు రామాయణ, భారత, భాగవతాలు చదివితే విజ్ఞానంతోపాటునైతిక విలువలు తెలుస్తాయని పిల్లలచేత చదివించేవారు. నీతిశతకాలు వల్లెవేయించేవారు. యోగా గురించి ఈమధ్య బాగా ప్రచారం చేస్తూ, ఆధ్యాత్మిక చింతనకు, ఆరోగ్యానికి కూడా యోగా బాగా ఉపయోగపడుతుందని పలువురు యోగాశిక్షణ యిస్తున్నారు. భిక్షమయ్యగురూజీ యోగశిక్షణ ఇవ్వడానికి విజయనగరంవస్తే యోగాశిక్షణ శిబిరంలో పదిరోజులు శిక్షణపొంది బ్రహ్మోపదేశాన్ని పొందేను. శిక్షణలో ఎన్నో విషయాలు మంచి అలవాట్లు అలవడడానికి,శరీరవ్యాయామంతోపాటు భారత రామాయణాల్లో చెప్పిన ఎన్నో మంచి విషయాలను తెలియజేసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి ఎంతో కృషిచేయడం ముదావహం. మంచి నడవడితో ఏకాగ్రతతో ధ్యానముచేసినవారికి తెలియకుండానే కొన్ని దివ్యశక్తులు వస్తాయి. కొందరు జ్యోతిష్యులు ఉదయమే పూజ అవగానే చెప్పిన విషయాలు తప్పకుండా జరుగుతాయి. అలాగే వైద్యం చేసేవారు ఏకాగ్రతతో పూజ జపంచేసి వారిచేతితో మందులిస్తే ఎటువంటి దీర్ఘవ్యాధులైనా మటుమాయ మవడం చాలా మంది ఎరిగిన విషయమే! శ్రీ ఎక్కిరాల కృష్ణమాచార్యులు మాస్టారు (ఈ.వే) పూజ, జపంచేసి ఆయన చేతితోఉదయమే రోగగ్రస్తులకు హోమియోమందు ఉచితంగా పంపిణీచేసేవారు. ఎందరో రోగులు ఆ మందులువాడి రోగాలబారినుండి విముక్తులవడంతో తెల్లవారుజాము నుండి వారింటి ముందు మందుకోసం పెద్దపెద్ద క్యూవుండేది. ఆయన ఉదయం వేళే మందుల ఉయిచ్చేవారు. నేడు చాలామంది ఆయన శిష్యులే హోమియోపతీమందులను ఉచితవైద్యం చేస్తూ మందులు పంపిణీ చేస్తున్నారు. భిక్షమయ్య గురూజీ కూడా ఆయన పద్ధతిలోనే పూజలుచేసి అనేక రోగగ్రస్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తూ స్వస్థత చేకూరుస్తున్నారు.

అయ్యప్పదీక్ష సక్రమంగా నలభైరోజులు చేసి నియమనిష్ఠలు పాటించిన వారిలో అనేకమందికి అద్భుతశక్తులు లభిస్తున్నప్పుడు, నిత్యం నియమనిష్ఠలతో జపము, పూజచేసేవారికి దివ్యశక్తులు లభించడంలో ఆశ్చర్యంలేదు. దీక్షలుచేసినవారు, నిత్యపూజలు రోజూ చేసేవారు చేతిలో విభూది (ఊది) యిచ్చినా దాని దివ్యప్రభావంతో కొన్నిరోగాలు నయమవుతాయి. కొన్ని సమస్యలు పరిష్కారమవుతాయి. నేను దీక్షలో వుండగా చర్మవ్యాధితో చాలా కాలం నుండి బాధపడుతున్న ఒకరోగికి ఊదీయిచ్చి రాస్తే చర్మవ్యాధి మటుమాయమయింది. సంతానంలేని దంపతులు ఆశీర్వదించమంటే

వారికి ఆశీర్వదిస్తే వారికి సంతానం కలిగింది. నేను షిర్డీసాయిబాబా పుస్తకం వ్రాసి విజయవాడలో నాకు తెలిసిన ఒక బాబాభక్తుడు శ్రీ సి.బి.వి. రామసుందరం గారికి చూపించాను. ఆయన సిగరెట్టు త్రాగుతూ నేను ఎంతో పవిత్రంగా రాసిన పుస్తకాన్ని చదవడం నాకు చాలా బాధకలిగించింది. మనసులోనే బాబాగారిని తలచుకొని సిగరెట్టు వ్యసనాన్ని మాన్పించలేవా అనుకున్నాను. ఆ తరువాత చిత్రవిచిత్రంగా ఆయన మంచానపడి నెలరోజులు వ్యాధినిపడి డాక్టర్లకు రోగం అంతుచిక్కలేదు. తరువాత చిట్కావైద్యం, విష్ణుసహస్రనామ పారాయణతో కోలుకొని ఆరోగ్యవంతుడవ డమే కాకుండా సిగరెట్టు వ్యసనాన్ని మానివేసేరు. ఆ తరువాత 15 ఏళ్ళు జీవించారు. ఒక అమ్మాయి అయ్యప్పపూజ, భజనలో ఉత్సాహంగా పాల్గొని భక్తితో సేవలు చేయడం చూసి, ఆ అమ్మాయికి త్వరలో పెళ్ళయితే బాగుండునని మనసులో అను కొన్నాను. నేను శబరిమల యాత్రనుండి తిరిగివచ్చేసరికి ఆ అమ్మాయికి ప్రయత్నించ కుండానే పెళ్ళి కుదిరిందని శుభవార్త విని ఆశ్చర్యచకితుడనయ్యాను. ఈ విషయం తెలిసిన ఒక స్వామివారి చెల్లెలికి వివాహమవాలని ఆశీర్వదించమని కోరేదు. కానీ స్వామివారు అనుగ్రహించలేదు. అంటే నాలోకొంచెం అహంకారం, గర్వము ప్రవేశించడంతో వారికోరిక ఫలించలేదనుకొంటాను.

దీక్ష లన్నిటిలో ఔదంబరదీక్ష (దత్తాత్రేయదీక్ష) చాలా కష్టమయింది. ఈ దీక్షలో చప్పిడి భోజనం చేయాలి. అంటే ఉప్పు, పులుపు, కారంలేకుండా భోజనం చేయాలి. నాలుగైదు రోజులు చప్పిడి భోజనం చేసి దీక్ష చేయవచ్చును కానీ ఆ తరువాత ఆహారమంటే వెగటుపుట్టి ఏమీ తినాలని వుండదు. ఈ దీక్షను 7రోజులు, 15రోజులు, 21రోజులు, 41 రోజులు వారికున్న అవకాశాన్ని బట్టిచేస్తారు. మేమి రువురం వారంరోజులు (7 రోజులు) దీక్షపాటించే సరికే నీర్సంవచ్చి అన్నం అంటే వెగుటు పుట్టింది. మిగతా నియమాలన్నీ అయ్యప్పదీక్ష పాటించే విధంగానే చేయాలి. ఏ దీక్షచేసినా ఆత్మనిగ్రహం, మనోనిగ్రహం ముందు అలవరచుకోవాలి. అప్పుడే దీక్షాలక్ష్యం నెరవేరుతుంది.

శబరిమలయాత్ర తొలిసారి వెళ్ళే స్వాముల్ని కన్నెస్వాములని పిలుస్తారు. కన్నెస్వామిగా తొలిసారిదీక్షచేసి యాత్రకు వెళ్ళే స్వాములుదీక్ష, భక్తి పారవశ్యంతో, భయంతో చేయడం వలన వారికి వాక్శుద్ధితోపాటు వారికి తెలియకుండానే కొన్ని శక్తులు కలుగుతాయి. అందుకేవారి నోటివాక్కులు నిజమవుతాయి. శబరిమలవాసు డైన అయ్యప్పస్వామికి కన్నెస్వాములంటే ఇష్టమని, శబరిమలయాత్ర చేసే ప్రతీ బృందంలో కన్నెస్వామిని ఒకరినైనా తప్పకుండా తీసుకువెళ్తారు. జీవితంలో కన్నె స్వామిగా యాత్రచేసే భాగ్యము ఒక్కసారే లభిస్తుంది. దీక్ష సక్రమంగా చేసిన వారికి ఆ మహత్తు బాగా తెలుస్తుంది. మహిషిశాపవిమోచనం జరిగాక మణికంఠుని చూసిన మాలికాపురుత్తమ్మ తనని వివాహము చేసుకోమని కోరిందిట. దానికి స్వామి తాను ఈ అవతారంలో బ్రహ్మచారిగా ఉండదలచి నందున వివాహ ప్రసక్తిలేదని,

శబరికొండపై ఉండి పూజలు అందుకోడానికి ఆమెకు అర్హత కలిపిస్తానని చెప్పి, ఆమెకు స్వామివారు వరమిచ్చేరు. అయినా ఆమె పదేపదే వివాహము చేసుకోమని కోరడంతో మణికంఠుడు తెలివిగా ఏ సంవత్సరమైనా శబరిమల యాత్రకు కన్నె స్వామి రాకపోతే ఆ సంవత్సరం నా బ్రహ్మచర్యదీక్ష విడిచి పెట్టి ఆమెను వివాహము చేసుకుంటానని మాలికాపురుత్తమ్మకి మాటయిచ్చేరు. సంవత్సరానికి సంవత్సరం కన్నెస్వాములు పెరుగుతున్నారు కానీ తగ్గడంలేదు. శబరిమలయాత్రకు కన్నెస్వాములు రాలేదంటే ప్రళయం వచ్చినట్లే !

శబరిమలలో మకరసంక్రాంతి రోజు రాత్రి పదిగంటలకు ఏనుగుపై అలంకరించి మాలికాపురత్తమ్మను ఉత్సాహంగా శరంగుత్తి వరకు తీసుకువెళ్తారు. శరంగుత్తిలో కన్నెస్వాములు వెంట తెచ్చి అక్కడ పడవేసిన శరములు లక్షల సంఖ్యలో పడిన బాణములగుట్టనుచూసి ఈ సంవత్సరంకూడా తనకి వివాహమయే యోగ్యత లేదని ఏనుగుపై ఉత్సాహంగా వెళ్ళిన మాలికాపురత్తమ్మ దిగులుగా తిరిగివస్తుంది. శబరిమలయాత్రకు వెళ్ళేవారు మకరసంక్రాంతినాడు ఈ దృశ్యాన్ని కనులార చూడవచ్చు. శబరిమలయాత్రకు వెళ్ళే స్వాములు మొదటి సంవత్సరం బాణం, రెండవ సంవత్సరం కత్తి, మూడవ సంవత్సరం గంట తమతో తీసుకువెళ్ళడం సంప్రదాయం కర్రకత్తులు, బాణంపుల్లలు, ఎరుమేలిలో తయారుచేసి స్వాములకోసం అమ్ముతూ వుంటారు. వాటినే స్వాములు కొనుక్కుని యాత్రలో వాటిని తీసుకువచ్చి శబరిమల సన్నిధానం కనిపించగానే శరంగుత్తిలో వాటిని విడచి, నమస్కరించి సన్నిధానం చేరుతారు. ఓమ్ స్వామియే శరణమయ్యప్ప!

శబరిమల యాత్రకు నేను రెగ్యులరుగా వెళ్తున్నా నా పిల్లల్ని కాని శ్రీమతిని కాని ఎప్పుడూ రమ్మని కోరలేదు. కానీ నా ముగ్గురు పిల్లలు చి॥విజయ, అరుణ, భారతి శరణుఘోష, శరణాలు నోటికి కంఠస్తం వచ్చేవరకు రోజూ చెప్పి అప్పగించుకునేవారు. మా మూడవ అమ్మాయి చి॥భారతికి అయ్యప్పస్వామి అంటే అమితభక్తి. నాతో తరచు భజనలకు వచ్చి, ఇంట్లో పూజ, భజనచేస్తే నాతోకూర్చొని అయ్యప్ప భక్తిగీతాలు పాడేది. నాతో శబరిమలయాత్రకు వస్తానని సంబరపడేది. కానీ నేను అప్పుడు ప్రతీ సంవత్సరం ఎరుమేలినుండి వనయాత్ర 70కి.మీటర్లు నడచి జ్యోతి దర్శనానికి వెళ్ళడం మూలంగా మా అమ్మాయి రావడానికి ఉత్సహం చూపినా బాలికగా ఉన్నప్పుడు తీసుకువెళ్ళ లేకపోయాను. నేను ఇరవై ఒకటవసారి శబరిమల యాత్రకు వెళ్ళడానికి సిద్ధమైనపుడు నా శ్రీమతి రామలక్ష్మినాతో శబరిమల యాత్రకు వస్తానని చెప్పడం, ఆ సంవత్సరమే ఆమె అక్క చోడవరంలోవున్న మాతోటల్లుడు మరదలు కూడా మండలదీక్షచేసి 'విషు' (ఏప్రియల్ నెలలో) తొలిసారి శబరిమల వెళ్ళివచ్చాము. అంతకు ముందెప్పుడూ జనవరినెలలోనే యాత్రచేసేవాణ్ణి. శబరిమల యాత్రకు డిసెంబరు, జనవరి మాసాలే అనుకూలంగా వుంటాయి. ఏప్రిల్ నెలలో భక్తులరద్దీ తక్కువగా ఉంటుంది. కాని ఎండలు మొదలవడం వలన దీక్ష, యాత్ర తృప్తిగా సాగదు.స్వామి శరణం! స్వామియే శరణమయ్యప్ప!

నా రెండవ పుస్తకము శబరిమలయాత్ర-విశిష్టత వ్రాసి ప్రచురించినపుడు పుస్తకంలో కొన్ని కొత్తపాటలు, పద్యాలు ప్రచురించాలని సంకల్పం కలిగి మా తమ్ముళ్ళందరూ పాటలు, పద్యాలు రాసి ఇచ్చారు కానీ అందులో మా నాల్గవ తమ్ముడు చి॥ శ్రీహరీష్ వ్రాసినపాట పద్యం నాకు బాగా నచ్చినందున ఇష్టమైనందున వాటిని ఇక్కడ ప్రచురిస్తున్నాను. పాటచిన్నదైనా ఈ పాటవిన్నవారికి అయ్యప్పస్వామిపై భక్తి కలిగి శబరిమలయాత్ర చేయాలనిపిస్తుంది. ఓమ్‌స్వామియే శరణమయ్యప్ప!

"శబరిమలై స్వామిదీక్ష నిర్మల భక్తికి పరీక్ష
స్వామిదీక్ష నియమనిబంధనలు
కామక్రోధ మదాధులకు సంకెలలు ॥శబరి॥
హరిహరసుత దివ్యనామ కీర్తనం
భవబంధ విముక్తి దాయకం ॥శబరి॥
మణికంఠ స్వామి ఆరాధనం
మనశ్శాంతినిచ్చు మహాసాధనం ॥శబరి॥
స్వామిమకరజ్యోతిపుణ్య దర్శనం
జీవితధన్యతలేని దర్శనం
శబరిమలై స్వామిదీక్ష-నిర్మలభక్తికి పరీక్ష॥

పద్యం

పసివాడు మొదలుగా పండువృద్ధులు కూడ
ప్రేమతో నిన్ను సేవింతురయ్య
కాశ్మీరమాదిగా కన్యాకుమారి ప
ర్యంతము నిన్ను ధ్యానింతురయ్య
కటిక దరిద్రులు కోటీశ్వరుగూడి
గుంపుగా భక్తినిన్ గొలుతురయ్యా
హిందువులేకాక ఎందరో భిన్నమ
తస్తులకును నీవుదైవమయ్య !
భక్తజన దుఃఖనాశ ! శబరిగిరీశ
వ్యాఘ్రవాహన! కాననవాస ! సకల
దేవతారూప ! దివ్య జ్యోతి స్వరూప !
హరిహరాత్మజ ! మణికంఠ శరణు శరణు.

మా తమ్ముడు ప్రా.డా. సీతారామ నాథ్ నేను ఒకసారి మా అమ్మగారికి అనారోగ్యంగా ఉంటే చూడడానికి గోదావరిఖని వెళ్ళేము. మా అమ్మగారికి ఆరోగ్యం చేకూరడంతో తిరిగి ప్రయాణ మయ్యాము. రామగుండం రైల్వేస్టేషన్లో ట్రైన్ రాకకోసం నిరీక్షిస్తూ కూర్చున్నసమయంలో అయ్యప్పంటే నాకు ఇష్టమని ఆశువుగా ఒక పద్యం చెప్పేడు (27-11-1987) దగ్గర రాయడానికి కాగితం లేకపోతే బస్సు టిక్కెట్

వెనకవైపు ఈ పద్యం రాసి యిచ్చాడు.

శరణం ఆశ్రిత రక్షక – శరణం కరుణాలవాల శరణం శాస్తా
శరణం దుష్టవినాశక – శరణం శబరిమలవాస శరణం శరణం.

సకల దేవతలపై ఇలాంటి పద్యాలు ఎన్నో రాసేడు. కొన్నిటిని నేనుప్రచురించిన పుస్తకాలలో ముద్రించాను...స్వామిశరణం.

7

హిమాలయాలలో ఈనాడు కూడా ఎందరోయోగులు, తపసంపన్నులు ఉన్నారు. వారు ప్రపంచంలో మారుమూల ఎక్కడో జరిగే సంఘటనలను దివ్యదృష్టితో గ్రహించి కళ్ళకు కట్టినట్లు వర్ణించి చెప్పగలరు. పరకాయ ప్రవేశము చేయగలరు. గాలిలో అడిగిన వస్తువులను సృష్టించి ఇవ్వగలరు. తినడానికి పలాన హోటల్లో (విదేశాలలోనైనా) తయారైన వంటకము కావాలన్నా దానిని క్షణాలలో తెప్పించి మన ముందు వుంచే శక్తి సామర్ధ్యాలు కలవారు నేటికీ అనేకులు ఉన్నారు. మా సద్గురు నాధులు శ్రీ విమోచనానందస్వామి శబరిమల తపస్వి ఆసేతు హిమాచలము పర్యటించి ఒకసారి హిమాలయాలలో వుండగా రోజూ పూజచేసే అతని అయ్యప్ప పటము పగిలి వుండడంచూసి అక్కడవున్న తన శిష్యులతో శబరిమలలో ఉన్న నా అయ్యప్పస్వామికి ఏదో అపరాధం జరిగిందని చెప్పి ఏడవడంచూసి ఆయనకి పిచ్చి పట్టిందనుకున్నారు. తరువాత ఆయన శిష్యులు మరునాడు ఢిల్లీవెళ్ళేక వార్తా పత్రికలో శబరిమలదేవాలయాన్ని కొందరు దుండగులు ధ్వంసంచేసి, అగ్నికి ఆహుతి చేసారనే వార్తను చదివి వారు నిశ్చేష్టులయ్యారు. ఒక సంవత్సరకాలం శబరిమలలో తపస్సుచేసి దైవచింతనతో ఉన్నందున ఆ మహానుభావునికి అద్భుతశక్తులు లభిం చాయి. అచంచల విశ్వాసము, శక్తితోనే ఆయన భారతదేశములో కాశీ, హరిద్వార్, శ్రీరంగ పట్టణం, కరుపత్తూరు, గొల్లపూడి మొదలగుచోట్ల అయ్యప్పదేవాలయాలు నిర్మించి మనదేశములోనే కాకుండా యావత్ ప్రపంచము శబరిమల అయ్యప్ప మహత్యాన్ని గుర్తించేలా చేసేరు. మన మధ్యవుంటూ భగవాన్ శ్రీసత్యసాయిబాబా వారు ఎందరో భక్తులకు ఉంగరాలు, వాచీలు, ఊదీ వంటివి గాలిలో సృష్టించి ఇచ్చిన సందర్భాలు చాలా ఉన్నాయి. ప్రత్యక్షంగా దీనిని వీక్షించిన వారు నేటికి చాలా మంది ఉన్నారు. ఇటువంటి శక్తులకు పరిమితం కాకుండా, మోక్షసాధన కోసం నిత్యం తపించాలని, మోక్షమే ప్రధాన లక్ష్యంగా చేసుకుని యోగులు తపమాచ రిస్తారు. ఇటువంటి మహాత్మ్యాలు చూపడంవలన తపస్సుతో సాధించిన శక్తులు తరిగి పోతాయని చెబుతారు. విశ్వామిత్రుడు క్రోధంతో, కామంతో కొందర్ని శపించి తన తపశ్శక్తి పోగొట్టుకొన్నట్లు రామాయాణకావ్యం విశదీకరిస్తోంది.

ఒకదేవాలయము సందర్శించి భగవంతుని ప్రార్ధించినందులకు కలిగే లాభాన్ని శ్రీరామకృష్ణ పరమహంస అందరికీ అర్ధమయ్యే రీతిలో ఒక కథరూపంలో చక్కగా చెప్పేరు.

ఒక ఊరిలో ఇద్దరు స్నేహితులుండేవారు. అందులో ఒకడికి ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. రెండవవాడు నాస్తికుడు కాకపోయినా కొంచెం బద్ధకిష్టి. దేవుడు గుడిదాక వెళ్ళిదండంపెట్టడం ఎందుకు? దూరంనుండి దండంపెడితే చాలదా. అనేరకం. ఒకరోజు వీరిరువురూ కలిసి పొరుగూరు కాలినడకన బయలుదేరేరు. మార్గమధ్యంలో ఒకదేవాలయం కనిపించింది. భక్తుడు దేవాలయాన్ని చూసి దైవాన్ని దర్శించుకు వెల్దామని మిత్రుణ్ణి పిలిచేడు. అతను నాకు ఓపికలేదు, రాలేను. ఇక్కడ కూర్చుంటాను. వెళ్ళాలనుకుంటే నువ్వెళ్ళి దర్శనంచేసుకురమ్మని చెప్పడంతో అతను దేవాలయానికి వెళ్ళి గుడిచుట్టూ ప్రదక్షిణం చేసి దైవాన్ని దర్శించి వస్తూవుంటే కాల్లో ముల్లు గుచ్చుకోవడం వలన కాలుకుంటుకుంటూ రావడంచూసి ఏమి మిత్రమా! గుడికివెళ్ళి దేవుని దర్శించి వచ్చినందులకు దేవుడు నీకు మంచి బహుమతి యిచ్చినట్లున్నాడని వెటకారంగా అని చూడు నేను గుడికి రాకుండా ఇక్కడ కూర్చుని ఏమితోచక క్రిందరాళ్ళను కెలుకుతుంటే నాకు ఒకరత్నం దొరికింది. అని చూపించే సరికి భక్తుడు ఆశ్చర్యపోయి నోటమాటరాలేదు.

మరల ఇద్దరూ కలిసి ప్రయాణం సాగిస్తువుంటే మార్గమధ్యంలో ఒక సాధువు కనిపించాడు. అతన్ని చూడగానే భక్తుడు రెండుచేతులతో నమస్కరించాడు. అతని మిత్రుడు వెటకారంగా సాధువుకి రత్నంచూపించి, నా మిత్రునికి దేవాలయానికి వెళ్ళినందులకు కాలులో ముల్లుగుచ్చుకొంది. నేను దేవాలయానికి వెళ్ళకుండా కూర్చు న్నందుకు నాకురత్నం దొరికింది. ఇందులో అంతర్యం ఏమిటని ఆ సాధువుని ప్రశ్నించాడు. ఆ సాధువు కొన్ని క్షణాలు కళ్ళూమూసుకుని కారణం గ్రహించి వారి వంక చిరుదరహాసంతో చూస్తూ ఈ రోజు నీమిత్రునికి మృత్యుగండం వుంది. అతను దేవాలయానికి వెళ్ళి దైవాన్ని సందర్శించి రావడం వలన ఆగండం గడచి, చిన్న ముల్లుగుచ్చుకుని బయటపడ్డాడు. నీ పూర్వ జన్మపుణ్యం వలన నీకు ఈ రోజు పెద్దనిధి దొరికే యోగం వుంది. కానీ నీవు ఆ అవకాశాన్ని చేతులార జార విడుచుకున్నావు. అవకాశం వచ్చినా దైవాన్ని సందర్శించనందుకు నిధికి బదులు ఒక రత్నాన్ని మాత్రమే దేవుడునీకిచ్చి దీనితో సంతృప్తి పడమన్నాడు. మంచి బంగారు అవకాశాన్ని నువ్వు పోగొట్టుకున్నావని చెప్పడంతో ఇద్దరూ ఆ సాధువు పాదాలపై పడి కళ్ళు తెరిపించినందులకు కృతజ్ఞతలు తెలియజేసారు.

తీర్థయాత్రలు చేయడంవలన, దేవాలయాలను దర్శించడం వలన, మహాత్ము లకు మొక్కడం వలన పుణ్యముతోపాటు సత్ఫలితాలే లభిస్తాయి కాని నష్టం జరగదు. పవిత్రనదులు ఎక్కడో కొండలలో కోనలలో పుట్టి, అడవుల గుండా ప్రవహిస్తూ అడవిలో వున్న ఓషధి చెట్లను తాకుతూ, రకరకాల శిలాజాలను తాకుతూ, ప్రవహించ డం వలన నదులలో స్నానంచేసిన వారికి ఆరోగ్యంతోపాటు పుణ్యము లభిస్తుంది. భారతదేశములో అనేక పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. కొన్ని పుణ్యక్షేత్రాలలో భగవంతుడే నివసించిన స్థలాలైతే మరికొన్ని మహర్షులు, పుణ్యపురుషులు తపస్సాచరించి ప్రతిష్ఠిం చిన దేవతామూర్తులవేకం ఉన్నాయి. ఈ కోవకు చెందినవే కేదారేశ్వరం, బదరీనాథ్,

హరిద్వార్, కాశీ, గయ, అయోధ్య, బృంధావన్, ద్వారక, గురవయ్యూరు, శబరిమల, రామేశ్వరం, మధురై, తిరుపతి, ద్వాదశజ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తిపీఠాలు మున్నగు నవెన్నో మనదేశములో ఉన్నాయి. ప్రపంచంలో గంగానదిని మించిన పవిత్ర నది లేదు. కాశీవంటి విశిష్టపట్టణములేదు. పాశ్చాత్యులనేకులు గంగాజలంపై, కాశి పట్టణానికి ఇంత ప్రాముఖ్యత రావడానికి కారణమేమై వుంటుందోనని పరిశోదన చేసారు. కాశీలో ఉన్న 56 గణపతి ఆలయాలు, ఇంకా అక్కడ మహర్షులచే ప్రతిష్ఠించ బడిన కొన్ని దేవాలయములు, సూర్యకిరణాల ప్రభావమని గ్రహించి విస్తుపోయారు.

పురాతన నగరమైన కాశీలో సుమారు 2000 దేవాలయాలున్నట్లు అంచనా. కాశీలో గంగ ఒడ్డున దాదాపు 84 ఘట్టాలు మనకి దర్శనమిస్తాయి. వీటిలో యైదు ఘట్టాలు అత్యంత పవిత్రమైనవి. వీటిని పంచతీర్థాలని కూడా అంటారు. అవి అసీతీర్థం, దశాశ్వమేధతీర్థం, ఆదికేశవతీర్థం, పంచగంగా తీర్థం, మణికంఠకతీర్థంగా ప్రసిద్ధి చెందాయి. ఉదయం, సాయంత్రంవేళ దశాశ్వమేధ ఘట్టంలో ఇచ్చే గంగా హారతి కనుల పండగ్గా వుంటుంది. ప్రతీఒక్కరూ చూసి తరించాలి. కాశీపట్టణం వరుణ, అసి అను రెండు నదుల మధ్య ఉన్నందున వారణాశిగా ప్రసిద్ధి చెందింది. ఈ కాశీకి ఆనందకాననం, మహాస్మశానం, అవిముక్తం అనే నామాంతరాలు కూడా వున్నాయి. ఇక్కడ బ్రహ్మదేవుడు యజ్ఞం చేసాడు. ఆ పవిత్ర స్థలాన్నే దశాశ్వమేధ ఘట్టంగా పిలుస్తారు. ఈ క్షేత్రానికి కాలభైరవుడు క్షేత్రపాలకుడు, అష్టభైరవులు, దూండి గణపతితోపాటు యాభై ఆరుమంది గణపతులు, నవదుర్గలు, ఏకాదశ రుద్రులు, ద్వాదశాదిత్యులు, నవగ్రహాలు కాశీలో వున్నాయి. గంగా స్నానమాచరించిన తరువాత విశ్వేశ్వరుని, బిందుమాధవుని, దూండి గణపతిని, దండపాణిని, కాలభైర వుని, కుమారస్వామిని అన్నపూర్ణమ్మను, విశాలాక్షి తల్లిని దర్శించుకోవడం ఆన వాయితీ. కాశీఅన్నపూర్ణ దయవలన ఉచిత భోజనసౌఖర్యాలు పలుచోట్ల వుండడం వలన యాత్రీకులు ఇబ్బంది పడనవసరంలేదు.

భారతీయులు చెట్లను పుట్టలను, రాళ్ళనుపూజిస్తారని వెక్కిరించే వారు చాలా మంది ఉన్నారు. నాగరికతకి పూర్వమే చెట్లలో ఔషధగుణాలున్నాయని భారతీయులు గ్రహించారు. భగవంతుడు సర్వాంతర్యామి చెట్టులో, పుట్టలో మనిషిలో జంతువులలో కూడా భగవంతుని దర్శించేగుణం పూర్వం నుండి ఉండబట్టే కొందరు తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలని, కొందరు పతివ్రతలు భర్తే ప్రత్యక్షదైవమని, గోవు సకల దేవతలకు ప్రతినిధి అని పూజించి తరించిన మహనీయులు అనేకమంది ఉన్నారు. రావిచెట్టు, వేపచెట్టు, మామిడిచెట్టు, జమ్మిచెట్టు, మారేడుచెట్టు, మర్రిచెట్టు, మేడిచెట్టు, తులసి చెట్టు ఇవన్నీ దేవతా వృక్షాలుగా గుర్తించారు. వీటిలో ఔషధగుణాలతోపాటు ఆక్సిజన్ ఎక్కువగా ఇస్తాయని, కాలుష్యాన్ని నివారిస్తాయని మనపూర్వీకులు ఎప్పుడో గుర్తించే వీటిని పూజించడం మొదలు పెట్టేరు. అందుకే ఊరిమధ్య, దేవాలయాలలో ఈ వృక్షాలను పెంచి పూజించేవారు.

నా పూర్వజన్మ సుకృతంవలన, భారతదేశములో జన్మించడం వలన ఆ సేతు హిమాచలాలు పర్యటించి, ద్వాదశజ్యోతిర్లింగాలు,అష్టాదశ శక్తిపీఠాలలో పన్నెండు పంచారామములు, పంచభూతలింగాలు,త్రిలింగాలు, యైదు ముఖ్య అయ్యప్ప దేవాల యాలు, ఆరు సుబ్రహ్మణ్యస్వామి దేవాలయాలు, పూరీ, ద్వారక, భువనేశ్వర్, మధుర, బృందావనం మున్నగు పుణ్యక్షేత్రాలతోపాటు చార్‌ధామ్ యాత్ర, వైష్ణవీదేవి యాత్రలు చేయకలిగేను. ఎన్నో పవిత్రనదులలో స్నానమాచరించాను. మానవజన్మ ఎత్తడానికి మాతృగర్భంలో తొమ్మిది మాసాలు పెరిగిన శరీరం అవడం వలన కాశీలో తొమ్మిది రోజులు నివసిస్తే సమస్త దోషాలు నశియించి, మరుజన్మ వుండదని భారతీయుల విశ్వాసం. ఈ విషయాన్ని తెలుసుకొని కాశీలో 12 రోజులువుండి ప్రతిరోజు గంగలో స్నానమాచరించి కాశీవిశ్వేశ్వరుని, అన్నపూర్ణమ్మను, విశాలాక్షి అమ్మవారిని దర్శించే భాగ్యం కలిగింది. భగవంతుని అపారమైన దయఉండబట్టే సిరిసంపదలు ఎక్కువలేక పోయినా ఆరోగ్యానికి మించిన భాగ్యము లేదని ఆ పరమాత్ముని చరణకమలములను సేవిస్తూ జీవిస్తున్నాను. భాగవతములో పోతనా మాత్యుడు భక్తి తన్మయంలో రచించిన ఈక్రింది మూడు పద్యాలను ప్రతీ ఒక్కరూ ఎప్పుడూ గుర్తుంచుకోవలసిన పద్యాలవడం వలన వాటిని ఇక్కడ పేర్కొంటున్నాను.

సీ. మందార మకరంద మాధుర్యమునదేలు మదుపంబు
వోవునే మదనములకు
నిర్మల మందాకినీ వీచికల దూగు రాయంచ చనునె
తరింగిణులకు
లలితరసాల పల్లవఖాదియై చొక్కుకోయిల చేరునే
కుటజములకు
బూర్ణేందు చంద్రికా స్ఫురిత చకోరక మరుగునే
సాంద్రనీహారములకు
తే. నంబుజోదర దివ్యపాదారవింద
చింతనామృత పానవిశేషమత్త
చిత్తమేరీతి నితరంబు జేరనేర్చు
వినుతగుణశీల మాటలు వేయునేల ?

సీ. కమలాక్షు నర్చించు కరములు కరములు
శ్రీనాధువర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకుని జూచు చూడ్కులు చూడ్కులు
శేషసాయికి మొక్కు శిరము శిరము
విష్ణు నాకర్ణించు వీనులు వీనులు
మధువైరి దవిలిన మనము మనము
భగవంతువలగొను పదములు పదములు
పురుషోత్తముని మీది బుద్ధి బుద్ధి

తే. దేవ దేవుని జింతించు దినము దినము
చక్రహస్తుని బ్రకటించు చదువు చదువు
కుంభినీధవు జెప్పెడి గురుడు గురుడు
తండ్రి హరి జేరుమని యెడి తండ్రి తండ్రి.

సీ. కమలాక్షునకు గాని కాయంబు కాయమే
పవనగుంపిత చర్మ బస్త్రిగాక
వైకుంఠుబొగడని వక్త్రంబు వక్త్రమే
ఢమఢమ ధ్వనితోడ ఢక్కగాక
హరిపూజనములేని హస్తంబు హస్తమే
తరుశాఖ నిర్మిత దర్విగాక
కమలేశు జూడని కన్నులు కన్నులే
తనకుడ్య జాల రంధ్రములుగాక

ఆ. చక్రిచింతలేని జన్మంబు జన్మమే
తరళ సలిల బుద్బుదంబుగాక
విష్ణుభక్తిలేని విభుదుండు విబుధుడే
పాదయుగముతోడి పశువుగాక!

ఇటువంటి అద్భుతమైన భక్తిరసపద్యాలెన్నో భాగవతంలో ఉన్నాయి. ఎవ్వనిచే జనించు, లోకంబులు లోకేశులు, లాఒక్కింతయులేదు, సిరికింజెప్పదు, ఇంతింతై వటుడింతై కలయో వైష్ణవమాయయో, చుట్టాలుదొంగలు, కాటుక కంటనీరు, వంటి ఆణిముత్యాలవంటి పద్యాలెన్నో భాగవతంలో వున్నాయి. నేడు మనదురదృష్టం వలన కాన్వెంటు చదువులు వచ్చి మనపిల్లలకు తెలుగు పద్యాలు నేర్పించలేకపోతు న్నాము. మనంచదవలేక పోతున్నాము. ఈ విధంగానైనా ఒకసారి పోతన కవిత్వాన్ని గుర్తు తెచ్చుకొని పాఠకులు చదువుతారనే సదుద్దేశముతోనే పై మూడు పద్యాలు ఇక్కడ పొందుపరిచాను. కాళహస్తి ఈశ్వరశతకం, దాశరధిశతకం, కృష్ణశతకంలో పద్యాలు కూడా భక్తిరసంతో నిండివుంటాయి. పదేపదే చదవాలనే కోరిక కలుగు తుంది.

మనిషి ఆనందంగా సంతోషంగా ఉండాలంటే తృప్తి అనేది ప్రతి ఒక్కరికీ ఉండాలి. తృపిఉంటే జీవితం సాఫీగా సాగిపోతుంది. ఆశకు అంతువుండదు. సైకిలున్నవాడికి మోటారుసైకిలుంటే బాగుండుననిపిస్తుంది. మోటారు సైకిలు ఉన్న వాడు కారుంటే బాగుండుననుకొంటాడు. ఇల్లులేనివాడు మొదట చిన్నఇల్లు ఉంటే బాగుండు ననుకొంటాడు. ఇల్లు వచ్చాక తరువాత ఇంట్లో ఖరీదైన ఫర్నిచర్ వుండా లని, ఇంకాపెద్ద ఇల్లువుంటే బాగుండునని తలపోయడం సహజం. మనంవున్నదానితో తృప్తిపడి, మనకన్నాలేని వారితో పోల్చుకొని వారికన్నా మనం బాగున్నామని, ఆనం దంగా వుండడం అలవాటుచేసుకోవాలి. మనకన్నాలేని వారితో పోల్చుకొని వారి కన్నా మనం బాగున్నామని, ఆనందంగా వుండడం అలవాటుచేసుకోవాలి. మనకన్నా

ఉన్నతంగా వున్న వారితో పోల్చుకోకూడదు. పోటీపడకూడదు. పోటీపడితే అశాంతి తప్పదు. ఒకతల్లికి పుట్టినపిల్లలే ఒక రకంగా వుండరు. అందంలోను, చదువులోను ఉద్యోగంలోను అన్నిట్లో వ్యత్యాసం వుండవచ్చు. వారివారి పూర్వజన్మ సుకృతం, అదృష్టంబట్టి జీవితంలో వ్యత్యాసంవుండవచ్చు. ఈర్ష్య, అసూయా ద్వేషాలకు దూరంగా వుంటే జీవితం సుఖమయమవుతుంది. ఆనందమయజీవితానికి తృప్తి చాలా ముఖ్యం.

నేను చదువుకునే రోజులలో కూడు,గుడ్డకి లోటులేకుండా నా జీవితం చివరి వరకు వెళ్ళిపోవాలని ఆశించాను. కానీ నేను ఆశించిన దానికన్నా జీవితంలో చదువు, మంచి ఉద్యోగం, హోదాతోపాటు వుండడానికి స్వంత ఇల్లు ఇచ్చాడు. పిల్లల అదృష్టంమేరకు కట్నాలబెడద లేకుండా మంచి సంబంధాలు రావడం, అల్లుళ్ళు మంచివాళ్ళు దొరకడం అంతా భగవదనుగ్రహమే! అవకాశం వున్నా న్యాయార్జనతో జీవించాలని ఎన్నడూ అత్యాశలకు పోలేదు. ఎవరి నుండి ఏమి ఆశించలేదు. అందుకే హాయిగా జీవించకలుగుతున్నాను. చింతలకు దూరంగా వుంటే ఆరోగ్యం కూడా మనకి తోడవుతుంది. ఇది అనుభవం నేర్పిన గుణపాఠం.

8

జీవితంలో ఉన్నతశిఖరాలు అధిరోహించాలన్నా, పరమాత్ముని దర్శించాలన్నా మనముందున్న అవరోధాలను ఒక్కొక్క మెట్టు ఎక్కి జయించాలి. అవే పదునెనిమిది మెట్లు. కోరిక (కామము) క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యము, దంబము, అహంకారము ఈ ఎనిమిదింటిని అష్టరాగాలంటారు. వీటిని జయించడ మంటే మాటలుకాదు. గొప్ప గొప్ప మహర్షులు, మహాత్ములే విఫులమైనట్లు మనకి చరిత్ర, పురాణాలు చెబుతున్నాయి. తరువాత పంచేంద్రియాలు (కన్ను, చెవి, ముక్కు నాలుక, చర్మము) ను జయించాలి. అంటే శరీరంపై మమకారం వుండకూడదు. ఆపైన త్రిగుణాలను (సత్వగుణము, తమోగుణము, రజోగుణము) అనే మూడు గుణాలను జయించాలి.తమోగుణాన్ని, రజోగుణాన్ని జయించి, సత్వగుణాన్ని అలవవరుచుకోవాలంటే ఎన్నో త్యాగాలు చేయాలి. ఎన్నో సుఖాలను వదలుకోవాలి. వాటి మీద వ్యామోహం, కోరికవుండకూడదు. శరీరంపై మమకారం వుండకూడదు. ఒక యోగిగా సన్యాసిగా జీవించాలి. కఠిన బ్రహ్మచర్యం అవలంబిస్తేనే ఇవన్నీ సాధ్యమవుతాయి. అందుకే మనపూర్వీకులు భగవద్దర్శనానికి ఇవన్నీ కావాలని కఠిన నియమాలను ఏర్పరిచేరు. శబరిమలలో పదునెట్టాంబడి ఎక్కి వెళ్ళి జ్యోతిస్వరూపుని దర్శించడమంటే చివరకు విద్య, అవిద్యలను కూడా ఆ దైవ సన్నిదిలో సమర్పించి అన్నిటికీ అతీతుడనయ్యానని దైవం ముందు మోకరిల్లి శరణాగతుడవడమే ముఖ్య ఉద్దేశం.

శబరిమల సన్నిధానంలో జనవరి 14వ తేదీ మకరసంక్రాంతి రోజు సాయంత్రం వేళలో కొన్ని లక్షలమంది ఏకాగ్రతచిత్తంతో ఆరుగంటల నుండి కన్నార్ప

కుండా జ్యోతిదర్శనం కోసం తూర్పు దిక్కువైపు చూస్తూ, స్వామివారి శరణఘోష చెబుతూ, భక్తిపారవశ్యంతో గంటకుపైగా తపిస్తారు. ఎక్కడ ఆర్తితో, భక్తితో భక్తులు భజిస్తే అక్కడ తానుంటానని భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్ముడు చెప్పినట్లు హరిహర సుతుడు మణికంఠుడు ఎక్కడున్నా ఆ వేళకు శబరిమల వచ్చితీరుతాడు. జ్యోతి స్వరూపునిగా దర్శనమిస్తాడు. ఇందులో సందేహంలేదు. మకరజ్యోతి నిజమైన జ్యోతా, అక్కడ కృత్రిమంగా వెలిగించే జ్యోతా అని మీమాంసపడేకన్నా హరిహర స్వరూపాన్ని జ్యోతి రూపంలో దర్శించడం పూర్వజన్మ సుకృతమే అవుతుంది.

భగవదన్వేషణలో వైకుంఠపాళి ఆటలో నిచ్చెనలు ఎన్నిసార్లు ఎక్కినా మధ్య మధ్య పాములు మ్రింగడంతో క్రింది దిగి వచ్చినట్లు నిజజీవితంలో పైకి ఎగబ్రాకాలని ఎంతప్రయత్నించినా ఎప్పుడూ దిగువ మెట్టుపైనే వున్నాననిపిస్తుంది. సంసార సాగరం ఈదుతూ భగవత్సాక్షాత్కారాన్ని పొందడం అంత సులువు కాదు. మనం ఎంత ప్రశాంతంగా మౌనంగా ఉండాలనుకున్నా ఇంట్లో వాతావరణం, చుట్టు ప్రక్కల వారు వుండనివ్వరు. అందుకే భగవదన్వేషణకు అంతం వుండదు. ఈ ప్రయాణం నిరంతరం సాగవలసిందే ! మహర్షులందులకే నిర్జన ప్రదేశాలకు వెళ్ళి అరణ్యాలలో తపస్సాచరించేవారు.

అలా భగవదన్వేషణచేస్తూ డెబ్భైలో అడుగుపెట్టేను. కామ, క్రోధ, లోభ, మోహ మద మాత్సర్యాలైన అరిషడ్వర్గాలను జయించలేకపోతే అడుగు ముందుకు వేయలేమనే సత్యాన్ని గ్రహించాను. పిల్లలు పెళ్ళిళ్లై కాపురాలకు వెళ్ళాక మనవలు, మనవరాళ్ళని వారిపై మమకారం పెంచుకోకుండా అంటీనంటకుండా వుండి వానప్రస్థ ఆశ్రమజీవితాన్ని గడపడం నేర్చుకుంటే సుఖశాంతులు లభిస్తాయి. 60-70 నిండినా ఇంకా ధనము సంపాదించాలని తాపత్రయపడితే ఎన్ని జన్మలెత్తినా పరమాత్ముని చేరలేరు. ఎంతసంపాదించినా ఎవ్వరూ పోయేటప్పుడు తమవెంట ఒక్కపైసా తీసుకువెళ్ళలేరు. కాశీలో డెబ్బై ఏళ్ళునిండిన పండితుడొకడు వ్యాకరణం వల్లించడం చూసిన ఆదిశంకరాచార్యులు ఈ వయసులో నీవు చదవవలసినది వ్యాకరణంకాదని, వేదాలు, ఉపనిషత్తులని కమ్మగా చివాట్లుపెట్టి భజగోవిందం శ్లోకాలు చెప్పి అతని కనులు తెరిపించారు. ఈ దేహము చివరకు పంచభూతాలలోకి కలవక తప్పదు. సంపాదించిన ధనములో కొంతభాగము దానధర్మములు చేసి, సాటి మానవులను అవసరానికి ఆదుకొని పట్టెడన్నంపెడితే భగవంతుడు సంతోషి స్తాడు. మానవసేవే మాధవసేవనే దృక్పథాన్ని అలవరుచుకుంటే ప్రతీ ఒక్కరిలో దైవాన్ని సందర్శించవచ్చు. అప్పుడే సుఖము, శాంతి లభిస్తాయి.

9

1979లో తణుకులో ఉద్యోగం చేస్తున్నప్పుడు న్యూస్‌పేపర్లో హౌసింగుబోర్డు ప్రకటన చూని మా ఆఫీసులో స్టాఫ్ అంతా అప్లికేషన్ పెడుతూ నన్ను కూడా ఇంటికోసం దరఖాస్తు పెట్టమన్నారు. అప్పటికి మా తమ్ముళ్ళ చదువుపూర్తికాలేదు.

మా చెల్లెలు వివాహము జరగలేదు. అందుచేత ఇల్లుకట్టు కోవాలని కానీ, కొనాలని కాని ఆలోచన నాకు లేదు. అప్లికేషన్‌తో ముందు వెయ్యిరూపాయలే కట్టాలి. ఒకవేళ ఇల్లు వచ్చేటట్లయితే మిగతా డబ్బు ఇన్‌స్టాల్‌మెంట్‌లో కట్టాలి. ఒక్కసారి కట్టక్కర్లేదు. ఇల్లు మీకు ఎలాటు అయినప్పుడు చూసుకోవచ్చు. అప్పుడు ఇల్లుకావాలంటే తీసుకో వచ్చు. లేకుంటే మానేయవచ్చు. హౌసింగుబోర్డు ప్రోసెసింగ్ అంతా అయేసరికి నాలుగేళ్ళు పడుతుంది. మరేమీ ఆలోచించకుండా ముందు వెయ్యి రూపాయలే కాబట్టి కట్టండిసార్ అంటూ ఆఫీసు స్టాఫంతా ప్రోత్సహించడంతో వారితో కలసి నేనూ దరఖాస్తు పెట్టేను. అనూహ్యంగా అలా అనుకోకుండా విజయనగరం అలకా నందకాలనీలో 1982లో ఇల్లువచ్చింది. ఈరోజు రిటైర్మెంటు తరువాత వుండడానికి ఆ ఇల్లే నాకు నివాసగృహమైంది. భగవంతుని లీలలు చిత్ర విచిత్రంగా వుంటాయన డానికి ఇదొక చక్కని నిదర్శనం.

భగవంతుని అనుగ్రహం సంపూర్ణంగా వుండడం వలన ఇంకా కొన్నాళ్ళు ఈభూమిపై నివసించే యోగ్యత వుండడంవలన మూడుసార్లు జలగండం నుండి ఒకసారి రోడ్డు ప్రమాదం నుండి బయటపడ్డాను. కాలేజీలో చదువుతున్న రోజులలో చిత్తూరుజిల్లాలో కైలాసకోన అనే ప్రదేశానికి ఎన్‌సిసి కేంపు వెళ్ళేము. స్నానాలు చేయడానికి అక్కడ దగ్గరలో పొలాలలోవున్న నేలనూతిలో దిగి ఈత రానందున మెట్లపైనే కూర్చొని మగ్గుతో రోజూ స్నానం చేసేవాణ్ణి. ఈతవచ్చిన నా స్నేహితులు బావిలో దుమికి ఈతకొట్టి స్నానం చేసేవారు. ఒకరోజు ఒడ్డున నేను స్నానంచేస్తూ వుంటే నా మిత్రుడు చూసి ఎక్కువలోతు లేదు. మీరూదిగి స్నానం చేయండని చెప్ప డంతో నేను ముందు వెనక ఆలోచించకుండా నూతిలోకి దుమికాను. నీటిలో మునిగి అయిదు నిమిషాలైనా బయటకు రాకపోవడం చూసి ఈతవచ్చిన నా మిత్రుడు వెంటనే నీటిలో మునిగి నన్ను బయటపడేసి ప్రమాదం నుండి కాపాడేడు. మరొక సారి కొవ్వూరులో మాబాబాయిగారింటికి వెళ్ళినప్పుడు రోజూ గోదావరి నదికి వెళ్ళి స్నానం చేసేవాణ్ణి. ఒకరోజు స్నానం చేస్తూ వుంటే ప్రవాహ వేగంతో కొట్టుకు పోతున్న నన్ను చూసి ఆ రేవులోనే స్నానం చేస్తున్న ఒక అబ్బాయి నాకు ఈతరాదని గ్రహించి వెంటనే ఈదుతూవచ్చి నన్ను రక్షించాడు. మరొకసారి విశాఖపట్నం వెళ్లి నప్పుడు సముద్రస్నానంచేయాలనే సరదాతో ఒంటరిగా మినర్వాదియేటరు సమీపంలో స్నానానికి సముద్రంలో దిగి స్నానం చేయసాగేను. స్నానం చేస్తూవుంటే ఒక పెద్ద కెరటం వచ్చి నన్ను లోనికి లాక్కుపోయింది. ఉక్కిరిబిక్కిరవుతూ క్రిందపడి నిలదొక్కు కోవాలని ప్రయత్నం చేస్తూవుంటే మరొక పెద్ద కెరటం వచ్చి మరల నన్ను ఒడ్డున పడవేయడంతో బ్రతికి బయటపడ్డాను. అంటే ఆ పరమాత్మే మూడుసార్లు నన్ను జలగండం నుండి రక్షించి కాపాడి ప్రాణభిక్ష పెట్టేడని నా నమ్మకం.

నేను కర్నూలులో ఉద్యోగం చేస్తున్నప్పుడు తరచు నంద్యాల జీపులో కేంపు వెళ్ళేవాణ్ణి. వేన్‌టైపు జీపు వుండేది. ఊరుదాటాక సరదాగా అప్పుడప్పుడు డ్రైవరుని

పక్కన కూర్చోమని నేను జీపు డ్రైవ్‌చేసేవాణ్ణి. ఒకరోజు సాయంత్రం నంద్యాల నుండి తిరిగి కర్నూలు వస్తూవుండగా డ్రైవర్ని పక్కన కూర్చోమని నేను డ్రైవింగ్ చేయసాగేను. మా డ్రైవర్ నా డ్రైవింగ్‌చూసి మీకు బాగా డ్రైవింగ్ వచ్చింది. ఇక ఊరుబయట కాకుండా సిటిలో కూడా డ్రైవ్ చేయవచ్చని నాకు సర్టిఫికెట్ యిచ్చాడు. నేను చాలా ఆనందపడ్డాను. ఇంతలో పెద్దకుక్క ఒకటి అడ్డంగా వచ్చింది. అరవై కిలోమీటర్ల స్పీడులో వెళ్తున్న నేను సడన్‌గా బ్రేకు నొక్కేసరికి మావేన్ తలక్రిందులుగా పడిపోయి నాలుగు టైర్లు మీద చక్రాల్లా తిరగసాగేయి. మా ఎదురుగా అంబాసిడర్ కారులో స్టేట్ బ్యాంక్ అఫీషియల్స్ కర్నూలునుండి నంద్యాల వెళ్తున్నవారు తలక్రిందులుగా పడిపోయిన మా వేన్‌ని చూసి వారు కారుఆపి, పెద్ద యాక్సిడెంట్ అయిందని భయపడుతూ మా వేన్‌దగ్గరకొచ్చి స్టీరింగ్ ముందు పగిలిన అద్దం గుండా డ్రైవరును నన్ను బయటకు లాగేరు. మా డ్రైవర్‌కి ఏమీ దెబ్బ తగలలేదు. నాకూదెబ్బ తగిలిన సూచనలు ఏమీకనపించలేదు. వారికి థ్యాంక్సు చెప్పి మాట్లాడబోతూ వుంటే నన్ను మాట్లాడవద్దని కూర్చోమని, కూర్చోబెట్టి మంచినీళ్ళిచ్చేరు. చెవి వెనక తలపైన చిన్న గాయమై రక్తం రావడం చూసి వారు కంగారుపడ్డారు. కానీ నాకు ఆ విషయం తెలియక అయామ్ ఆల్‌రైట్ అంటూ లేవబోయాను.

వారు నన్ను కదలకుండా కొంతసేపు కూర్చోబెట్టి, ఆ చుట్టు ప్రక్కల వారిని పిలిచి తలక్రిందులై పడివున్న మా వేన్‌ను అతికష్టంపై నిలబెట్టేరు. ఆయల్ ట్యాంకు పగిలి బండి అద్దాలు పగిలి కొద్దిగా సొట్టలుపడి, ఒంపులు తిరిగింది కాని డేమేజ్ ఎక్కువకాలేదు. ఆ ఆఫీసర్లే దేవునిలా నన్ను ఆదుకొని కర్నూలు వెళుతున్న ఒక ఫేమిలీ కారును ఆపి, నన్ను ఎక్కించి కర్నూలు పంపేరు. వెంటనే హాస్పిటల్‌కి వెళ్ళి చూపిస్తే చిన్నగాయం అవడం వలన కుట్లు కూడా అవసరం లేదని డ్రస్సింగు చేసి, ఆయింటుమెంటురాసి ఇంజక్షన్ చేసి పంపేరు. ఆ స్పీడులో తలక్రిందులై వేన్‌పడినా, డ్రైవరు, నేను సురక్షితంగా బయటపడ్డామంటే ఆ హరిహరపుత్రుడు అయ్యప్ప కృపా కటాక్షాలేననే ఈ రోజుకు నేను విశ్వసిస్తాను. ఓమ్ స్వామియే శరణమయ్యప్ప.

విజయనగరంలో మేము ఇంట్లో లేని సమయంలో రెండుసార్లు తలుపు గడియలు విరగగొట్టి దొంగలు పడడం జరిగింది. కానీ మా ఇంట్లో భగవంతుడు కొలువై వుండడం వలన విలువైన వస్తువులు ఏమీ పోలేదు. ఇల్లంతా వెతికినా దొంగల కళ్ళకు విలువైన వస్తువులు ఇంట్లో వున్నవి వారికి కానరాకపోవడం ఈ నాటికీ నాకు ఆశ్చర్యాన్నికలిగిస్తుంది. ఎంతో వింతగా తోస్తుంది. ఇది నిజంగా మిరాకిల్. మీరు నిత్యం భగవంతుని పూజిస్తారు కదా ! నిజంగా భగవంతుడే వుంటే మీకు ఎందుకిలా ఎప్పుడూ ఏవో సమస్యలు, కష్టాలు వచ్చి పడుతూ వుంటాయని కొందరు ప్రశ్నిస్తూ వుంటారు. గతజన్మలో చేసిన పాపాలు మనల్ని తొందరగా వీడవు. వాటిమూలంగానే ఈ జన్మలో ఎన్నిమంచి పనులు చేస్తున్నా ఒక్కొక్కప్పుడు ఊహించని సమస్యలు, కష్టాలు వచ్చి పడుతూవుంటాయి. నేను

ఆఫీసుకు సంబంధిం చిన కొన్ని విషయాలలో కోర్టులచుట్టూ పోలీసు స్టేషన్ల చుట్టూ తిరిగడం చూసి మనకి ఆస్తిపాస్తులు, ఏ గొడవలులేకపోయినా మీరు కోర్టులచుట్టూ తిరగడం నాకు బాధగా వుందని నా శ్రీమతి నాతోటి అనేది. గతజన్మ తాలూకా వాసనలు ఇంకా వుండబట్టే ఇలాటి వన్నీ సంభవిస్తూ వుంటాయి. కానీ మనం ఇప్పుడు చేసే మంచి పనుల మూలంగా, దైవప్రార్థనలవలన సమస్యలు సులువుగా పరిస్కరింప బడతాయి. త్యాగరాజు, రామదాసు, భక్తపోతన, మీరాభాయి,సతీసక్కు భాయి, భక్తతుకారామ్‌లాటి భక్తులెందరో కూడా వారిజీవితంలో కష్టాలు అనుభవించారు. వారి కష్టాలతో పోలిస్తే మనం అనుభవించే కష్టాలు ఒకలెక్కలోనికిరావు.

శ్రీరామకృష్ణపరమహంస శిష్యులడిగిన ప్రశ్నలకు, శిష్యులకు చేసే బోధలు ఎక్కువగా చిన్నచిన్న కథల రూపంలోనే వుండి సామాన్యులకు సహితం అరటిపండు ఒలచినోటికి అందించినట్లు వుండడం వలన వినడానికి ఆశక్తికరంగా వుంటాయి. అలాటి కథలు సందర్భంవచ్చిందికాబట్టి ఇక్కడ మూడింటిని ప్రస్తావిస్తాను. ఒకసారి ఒక అమ్మవారి దేవాలయంలో దొంగలుపడి అమ్మవారి నగలు కిరీటం అన్నీ ఎత్తుకు వెళ్లేరు. ఆ ఆభరణాలను చేయించి అమ్మవారికి సమర్పించిన జమిందారు శ్రీరామకృష్ణ పరమహంస వారి దగ్గరకొచ్చి గుడిలో అమ్మవారు తన నగలనే కాపాడుకోలేక పోయారు. ఇక ఆవిడ మనల్ని ఏమి కాపాడుతారు. మనపిచ్చిగాని అని నిట్టూర్చాడు. పరమహంసగారు తడుము కోకుండా, మిమ్మల్ని అమ్మవారు తనకి ఆభరణాలు, కిరీటం కావాలని అడిగేరా! అని అడిగేసరికి ఆజమీందారు ఖంగుతిని నేను ఆ జగజ్జననికి శోభతెస్తాయని నగలు, ఆభరణాలు చేయించాను. అని గొప్పగా చెప్పడం విని, ఆ జగజ్జననికి మీరు చేయించిన ఆభరణాలు నచ్చలేదను కొంటారు. అందుకే వాటిని ఆమె దొంగలపాలు చేసారు. అని శ్రీరామకృష్ణులు అనగానే ఆ జమీందారు ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టేడు.

మనం అత్యాశలకు పోయి ఒక్కొక్కసారి భగవంతునికి ఎన్నో కానుకలు ముడుపులు చెల్లిస్తామని మొక్కుకుంటాము. మన మొక్కుబడులు ఆయనకి ప్రీతి అయితే స్వీకరించి మనల్ని ప్రసన్నం చేస్తాడు. ఆయనకి ఇష్టంలేకపోతే మనం ఎన్ని కానుకలు, మొక్కుబడులు చెల్లించినా మనకోరికలు తీరవు. ఫలితం వుండదు. ఇది జగమెరిగిన సత్యం. ఈ క్రింది సంఘటన నవ్వు తెప్పించినా మహానుభావులు ఏదీ ఆచరించకుండా చెప్పరని తెలపడానికి నిదర్శనం.

శ్రీరామకృష్ణపరమహంసగారి దగ్గరకు ఒకామె తన బిడ్డను తీసుకువచ్చి మా అబ్బాయి విపరీతంగా తీపివస్తువులు (మిఠాయి) తింటూ వుంటాడు. ఆ అలవాటు మాన్పించాలని ఎంత ప్రయత్నించినా మానటంలేదు. మీరు దయచేసి ఎలాగైనా మావాడిచేత ఆ అలవాటును మాన్పించాలని పరమహంసగారిని ప్రాధేయపడ్డారు. రామకృష్ణులు ఆలోచించి పదిరోజుల తరువాత వాళ్ళబ్బాయిని తీసుకొని మరల రమ్మన్నారు. ఆ కన్నబిడ్డను తీసుకొని మరల పదిరోజుల తరువాత శ్రీరామకృష్ణుల్ని

సందర్శించి నిలబడ్డారు. శ్రీరామకృష్ణపరమ హంసవారు చిరునవ్వు నవ్వుతూ ఆ బిడ్డను దగ్గరకు చేరదీసి మెల్లగా తలనిమిరి బాబూ తీపివస్తువులు ఎక్కువగా తినకు, ఆరోగ్యం చెడిపోతుంది. అమ్మమాట విని మానేస్తే మంచిది అనిచెప్పి వెళ్ళ మన్నారు. ఆ తల్లి నివ్వెరపోయి, ఈమాట చెప్పడానికా పదిరోజుల తరువాత రమ్మ న్నారు. ఆ రోజే ఈ మాట చెప్పవచ్చు కదా స్వామీ' అని ప్రశ్నించింది. దానికి పరమహంసగారు నవ్వి ముందు నాకున్న ఆ చెడు అలవాటును మానుకోవడానికి పదిరోజుల తరువాత రమ్మన్నాను. నేను బెల్లంతింటూ పిల్లవాణ్ణి తినవద్దని చెప్పడం ధర్మంకాదకదా ! అన్నారు. ఆ మాటలు విన్న ఆయన శిష్యులు, ఆ కన్నతల్లి కూడా ఆశ్చర్యంతో అవాక్క య్యారు. ఉన్నది దేవుని గుడిలో దేవుని సమక్షంలో అయినా దృష్టంతా బయటవిడిచి పెట్టిన చెప్పులమీదే వుంటుందని చాలామందికితెలుసు. ఇక కొత్త చెప్పులయితే వేరే చెప్పక్కర్లేదు. శ్రీరామకృష్ణులు చెప్పిన కథే మరొకటి చెబుతున్నాను.

ఒక ఊళ్ళో పూజారికొడుకు, ఒక వ్యాపారి కొడుకు ఒక స్కూలులోనే చదువు కునేవారు. బాల్యంనుండి ఇద్దరూ మంచి స్నేహితులు. పూజారి ఆకస్మిక మరణంతో అతని కొడుకును తప్పనిసరి పరిస్థితిలో గుడి పూజారిగా నియమించ బడ్డాడు. ఆ తరువాత వ్యాపారి కొడుకు వ్యాపారంలో స్థిరపడ్డాడు. వ్యాపారి కొడుకు ధనవంతు డవడం వలన విలాసవంతమైన జీవితానికి అలవాటు పడ్డాడు. పూజారి కొడుకు స్నేహితుడవడం వలన అప్పుడప్పుడు విందులకు, వినోదాలకు పిలిచేవాడు. కానీ అతనికి గుడిలోవున్న పనులమూలంగా వెళ్ళడానికి వీలుచిక్కేదికాదు. దానితో ఎప్పుడూ అతను విచారిస్తూ నా స్నేహితుడు చాలా అదృష్టవంతుడు జీవితాన్ని అనుభవిస్తున్నాడు. నేను ఈ గుడిలో ఈ నాలుగుగోడల మధ్యబంధించబడ్డాను. నాది వ్యర్థజీవితమని తలపోస్తూ, దైవకార్యం భౌతికంగా చేస్తున్న మనసంతా విలాస జీవితంపైనే వుండేది. వ్యాపారం చేస్తున్న స్నేహితుడు వేశ్యాగృహాలలో తిరుగుతున్నా, జూదమాడుతున్నా నా స్నేహితుడు చాలా అదృష్టవంతుడు ఎప్పుడూ అతను దైవ కార్యాలు నిర్వహిస్తూ దేవాలయంలో వుంటున్నాడని అతని మనసంతా దైవం మీదే వుండేది. కొంతకాలమయ్యాక ఇద్దరూ మృతిచెందారు. వ్యాపారిని తీసుకువెళ్ళడానికి విష్ణుదూతలు, పూజారిని తీసుకువెళ్ళడానికి యమదూతలు వచ్చారుట. గుడి పూజారి ఆశ్చర్యంగా యమకింకర్లను చూచి నేను నిత్యం దైవసాన్నిధ్యంలో వుండి రేయిం బవళ్ళు గుడిలో అర్చకత్వం చేసి పూజలు చేసాను. అటువంటి నన్ను యమలోకం తీసుకువెళ్తున్నారెందుకు? అని ప్రశ్నించాడు. దానికి యమదూతలు నవ్వి పేరుకి నువ్వు గుళ్లో వున్నావు కానీ నీ మనసంతా ఎప్పుడూ సానివాడలమీద, జూదంమీదే వుండేది. అందుకే నీకు ఈ శిక్ష. నీ మిత్రుడు ఎక్కడో బయట విహరించి విలాస జీవితంగడిపినా అతని మనస్సెప్పుడూ దైవంమీదే లగ్నం అవడం వలన అతనికి విష్ణులోకం ప్రాప్తించిందని చెప్పడంతో పూజారి సిగ్గుతో కుంచించుకుపోయాడు.

శ్రీరామకృష్ణులు ఇలాటి కథలెన్నో చెప్పి శిష్యుల కళ్ళుతెరిపించేవారు.

మానవుడు చంద్రమండలం వెళ్ళి అక్కడ నివాసం వుండడానికి అర్రులు చాస్తున్న సమయమిది. అవయవాల మార్పిడి, చివరకు గుండెమార్పిడి కూడా చేసి ప్రాణం పోస్తున్నామని విర్రవీగుతున్న రోజులివి. భారతీయ విజ్ఞాన శాస్త్రం ఖగోళ శాస్త్రం పూర్వంనుండి ఎన్నో విషయాలు తెలియజెప్పి పాశ్చాత్య శాస్త్రజ్ఞులకు ఆశ్చర్యానికి గురిచేసారు. ఈ సంవత్సరంలో (2009) ఈ మధ్య వరుసగా మూడు గ్రహణాలు వస్తే ఇది అరిష్టసూచకమని, దీనివలన ప్రాణనష్టము,ఆస్తినష్టము కూడా మనదేశములోనేకాకుండా ఇతరదేశాలలో కూడా వుంటుందని మన పండితులు జోస్యం చెప్పారు. భారతయుద్ధముజరిగే ముందు రెండవ ప్రపంచయుద్ధము జరిగే ముందు ఇలాగే మూడుగ్రహణాలు వరుసగా వచ్చాయని దాని వలన చాలా జననష్టము, ఆస్తినష్టము, జరిగిన సంగతి అందరికీ తెలిసినదే. ఈ విషయాన్ని ముందుగా తెలియపరిస్తే ఎవ్వరూ నమ్మలేదు. కానీ నేడు ఇండోనీషియా, ఫిలిప్పైన్స్, అండమాన్ నికోబార్ చిలీ టర్కీ చైనా మున్నగు చోట్ల భూకంపాలు వచ్చాయి. నేడు కనీవిని ఎరుగని రీతిలో జలప్రళయంవచ్చి మనరాష్ట్రాన్ని కర్ణాటక రాష్ట్రంలో కొన్ని జిల్లాలను అతలా కుతలంచేసి అపారమైన ఆస్తి నష్టాన్ని విపరీతంగా పంటనష్టాన్ని, జననష్టాన్ని కలుగజేసి భీభత్సం సృష్టించి ఆరుజిల్లాలలో కోలుకోలేని దెబ్బ తీసింది. నేడు తెలంగాణా కోసం చేసే అల్లర్లతో ఆస్తినష్టం, ప్రాణనష్టం కూడా జరుగుతోంది. విరోధినామ సంవత్సరం, వికృతినామ సంవత్సరం రెండు సంవత్సరాలు మంచివికావని, దేశములోనేకాక ప్రపంచంలోనే అనేక అరిష్టాలు జరుగుతాయని మనవాళ్ళు జ్యోతిష్యం చెప్పేరు. నేడు జరుగుతున్న సంఘటనలు చూస్తూవుంటే అక్షరాల ఇది నిజమనిపిస్తోంది. ఇప్పుడు కర్నూలు, విజయవాడలో వచ్చిన జలప్రయలం ఒక హెచ్చరికగా భగవంతుడు చూపిన నమూనా మాత్రమేననేది ప్రతిఒక్కరూ గ్రహించాలి. ఇకముందైనా జాగ్రత్తగా వ్యవహరించి, మంచినపెంచి, ధర్మాన్ని కాపాడితే ప్రకృతి ఆగ్రహించదు. భూకంపాలు,సునామీలు, జలప్రళయాలురాకుండా వుండాలంటే దైవానుగ్రహాన్ని సంపాదించాలి. భయం భక్తిలేకుండా దేవాలయలలో దేవుని సొమ్మును అపహరించేవారు, కుదువబెట్టేవారు, తయారవడం, దేవుని సొమ్మును స్వార్ధ ప్రయోజనాలకోసం దుర్వినియోగం చేయడం వంటివిఎక్కువయ్యాయి. దేశములో అత్యాచారాలు పెరిగేయి. వావివరుసలు పట్టించు కోకుండా ప్రేమపేరుతో వివాహాలు జరగుతున్నాయి. అమ్మాయిలు, అబ్బాయిలు వయసుతో నిమిత్తం లేకుండా విచ్చల విడితనానికి అలవాటుపడి ప్రేమ, దోమలని అఘాయిత్యాలకు పాలుపడుతున్నారు. ప్రజలలో నైతిక విలువలు క్షీణిస్తున్నాయి. అక్రమసంపాదన, పదవీ వ్యామోహము, కామప్రవృత్తి భీభత్సాలకు గురి అవుతున్నాము. మతం అన్నది నలుగురికి ప్రయోజనకారిగా వుండాలి. ఎవరికిష్టమైన దైవాన్ని వారు ఇష్టమైన రీతిలో సేవించుకోవచ్చు. అంతేకానీ ఏవో ఆశలు చూపి మత మార్పిడి చేయడం, భారతదేశములోవుండి భారతీయులకు ద్రోహము చేయడమే అవుతుంది. మతమార్పిడి పేరుతో కలహాలు సృష్టించకూడదు. ఇప్పటికైనా పెద్ద మనసుతో మత పెద్దలు ఆలోచించ వలసిన సమయం ఆసన్నమయింది. సర్వేజనాః సుఖినోభవన్తుః ఓమ్ శాంతిః శాంతిః శాంతిః ఓమ్ తత్‌సత్.

10

వేదాంత సారము

భగవదన్వేషణలో భాగముగా ఏదైన ఆధ్యాత్మిక గ్రంథములేకాని పుస్తకము కానీ చదివినప్పుడు నాకు నచ్చినవిషయములు ఆధ్యాత్మికంగా ఎదగడానికి ఉపయోగ పడే అంశాలు కొన్నిటిని అప్పుడప్పుడు నాడైరీలో రాసేవాణ్ణి. పాఠకులకు ఉపయోగ పడతాయనే ఉద్దేశ్యంతో వాటిని ఇక్కడ ప్రచురిస్తున్నాను. గ్రంథరచయితలందరకూ నా నమోవాకములు.

ఉపనిషత్తులలో యోగి, సన్యాసి, పరమహంస అనేవాడు ఎల వుండాలో వారి ప్రవర్తన ఎలా వుంటుందో, సర్వము వదలిన వారి గురించి ఈ క్రింది తెలుప బడిన విషయము పరిశీలిస్తే, అవగతమవుతుంది.

శమము, దమము, శౌచము అంటే ఏమిటో ఈ మూడింటి లక్షణాలు ఇక్కడ తెలియజేస్తున్నాడు. భగవంతుని యందు బుద్ధిని లగ్నమొనర్చుట శమము, ఇంద్రియ నిగ్రహమును పాటించుట దమము, కర్మలయందు ఆసక్తి లేకపోవుట శౌచమని అంటారు. దేహము అనిత్యము. దహింపబడునదే దేహము. నశించుటయే దీని స్వభావము. దీపము ఆరకముందే ఇంటిని చక్కబెట్టుకోవాలి. ఆయువు క్షీణించక పూర్వమే దేహము నశించిక పూర్వమే బంధముల నుండి సాధకుడు విడివడాలి. ముక్తిని పొందేందుకు ప్రయత్నించాలి. ముక్తిని పొంది తరించుటకు మూడు ఉపాయాలున్నాయి. అవియే భక్తి, జ్ఞాన కర్మయోగములు. వీటిని బాగుగా నెరిగి దృఢవ్రతుడై ఆచరించు పుణ్యాత్ముడు ముక్త పురుషడగును.

గురువు సాయంతోనే జీవుడు, తన ఆత్మ స్వరూపాన్ని తిరిగి పొందకలుగతాడు. గురువుదారి చూపుతాడు, శిష్యుడు గురువు బోధించిన పద్ధతి ప్రకారం ధ్యానిస్తాడు. దీనివలన మనసు శుద్ధమై, శాంతమై, జాగృతమై స్థిరమైన ధ్యానస్థితని పొంది, ఆత్మ సాక్షాత్కారం చేసుకొని శుద్ధచైతన్య పదంలో మేల్కొంటుంది. ఇలా జ్ఞానాన్ని పొంది ముక్తుడౌతాడు.

బ్రహ్మ,విష్ణు,మహేశ్వరుల వద్దనుండి గడ్డిపోచవరకు చరాచర ప్రపంచం యావత్తు సర్వవ్యాప్తి అయన పరబ్రహ్మయొక్క వ్యక్త రూపమేనని సంగతి తెలుసుకోవ డం, ధ్యానించడం, దర్శించడం, పరాజ్ఞానం, ఉత్తమోత్తమైన భక్తి అన్నింటకన్నా ఉదాత్తమైన కర్మ.

భగవంతుని తత్వాన్ని సరిగా ఎరుగక, విగ్రహాలనే పరమాత్మగా ఎంచుకొనే వాళ్ళు బ్రాంతులు, మట్టి, శిల, సాలగ్రామం దారువు ఇలా రకరకాల పదార్థాలతో తయారుచేసిన విగ్రహాలను పూజిస్తారు. అయితే అసలు తత్వాన్ని ఆ పూజలలో బాటే హృదయంలో వెతుక్కోవాలి. అలా వెతుక్కోనంతకాలం ఈ భవయంత్రం లోంచి బయటపడేమార్గంలేదు.

వేదాంతంలో ఎంతో విద్వత్తువున్నా, సాధకుడు ఇంద్రియ విషయాల వలన ఆకర్షింపబడితే అతడు బహిర్ముఖ దృష్టితోవుంటే పరబ్రహ్మ స్వరూపాన్ని నిలకడగా తెలుసుకోలేడు. కేవలం కర్మలన్నింటినీ మానివేయడం, గురువు నుండి జపమంత్రదీక్ష తీసు కోవడం సన్యాసంకాదు. భిక్షాటనంకూడా సన్యాసంకాదు. ఇంద్రియ సంయమనం ద్వారా మహిమాన్విత పదమైన ధ్యానంలో నిలకడగా ఉండే నిష్ఠయే నిజమైన యతిత్వం.

సన్యాస స్వీకరణం తరువాత సాధకుడు ఇంటినీ గ్రామాన్ని వదిలెయ్యాలి. తన ఇంటి విషయం, జన్మస్థాన విషయం ఇకస్మరణ వుండరాదు. బ్రహ్మము గురించే అతను సదాచింతన చెయ్యాలి. మనోబుద్ధులను శుద్ధపరచుకొన్నాక, స్థిరసంకల్పుడయ్యాక, శాస్త్రాధ్యయనం చేసి వాటిని గూడార్థాలను గ్రహించాక ఆ సన్యాసి ఇక తన జన్మ గ్రామంలో కాని, పట్టణంలోకాని వశించరాదు. జైలు నుండి విడుదలయిన దొంగ వేగంగా అక్కడ నుండి పారిపోయనట్లు జనసమ్మర్ధంతో కూడిన పట్టణాలనుండి దూరంగా పోయి ప్రశాంతమైన ఏకాంతప్రదేశాన్ని చేరుకోవాలి. అక్కడ అతణ్ణి చలింపజేసే ఆలోచన నుండి తేలికగా విడుదల అవుతాడు. అప్పుడే నిర్గుణ ధ్యానం కొనసాగుతుంది.

పరమహంసయోగి తన ఆనందాత్మలో రమించుచతూ వుంటాడు. శీతోష్ణాల వల్ల చలించడు. సుఖదుఃఖాలు అతణ్ణి ఇసుమంతైనా కదిలించలేవు. ఆత్మ క్రీడలో నిరంతరం నిమగ్నుడై వుండే అతడు దుఃఖం, క్షుత్పపాసలు, విషయాలు అన్నింటి పట్ల పరమనిర్లిప్తతలో వుంటాడు. అతడు పిలక, యజ్ఞోపవీతము, వస్త్రముకూడా ధరించడు. ఆయన శరీరమనో బుద్ధులకు సంబంధించిన మిధ్యా జ్ఞానాన్ని, అజ్ఞానాన్ని త్యజిస్తాడు. శాశ్వతమైన బ్రహ్మాన్ని ఎరిగి తానే బ్రహ్మమనే నిత్యజ్ఞానంతో వుంటాడు. నిత్యము, శాంతము, అచలము, నిష్కలము అయిన చిదానంద స్వరూపుని నేను అదే స్వభావం అని ఎరిగివుంటాడు. అదే ఆయన శిఖ, అదే ఆయన యజ్ఞోపవీతం జీవాత్మ పరమాత్మల కలయికే ఆయన సంధ్యావందనం.

బ్రహ్మీస్థితిలో నిత్యము నిశ్చలుడై నిలిచియున్న పరమహంస యోగిలో లేశమైనా దంభదర్పాహంకారాలు, నిందాస్తుతులు, కామక్రోదాదులు వుండవు. తన శరీరాన్ని శవంగా భావించి అసహ్యించు కొంటాడు. అతడి దృష్టిలో బ్రాహ్మణ, శూద్రజాతులంటూ వుండవు. నిత్యమూ తన నిస్సంగ మహిమలో ప్రకాశిస్తూ వుంటాడు. ఆ పరమహంస పరమాత్మయే !

విజ్ఞాని అయిన సాధకుడు తన హృదయంలో ప్రకాశిస్తున్న ఆత్మను సర్వ వ్యాప్తమైన పరమాత్మగా తెలుసుకొన్నప్పుడు ఆయనే బ్రహ్మదేవుడు, ఆయనే విష్ణువు, ఆయనే శివుడు, ఇంద్రుడు, తారపతియైన చంద్రుడు కూడా తనలోని ఆత్మను సర్వ వ్యాపిత పరమాత్మగా తెలుసుకొన్న మహాపురుషుడు పరమాత్మయొక్క పరమానుభూతిని పొందుతాడు. అతడే పరమహంస

❀ ❀ ❀

పూర్వం రోజులలో కొన్నినియమాలు ఏర్పరుచుకుని కఠినంగా ఆచరించే వారు. కొందరు పొద్దు చూడనిదే భోజనం చేసేవారు కాదు. అంటే సూర్యుని చూడకుండా భోజనం చేసేవారు కాదు. ఆ రోజులలో వర్షాకాలంలో ముసురుపట్టి ఒకొక్క సారి రెండుమూడు రోజులు సూర్యుడు కనిపించక పోయినా భోజనం చేయకుండా మంచినీరుత్రాగి వుండి పోయేవారు. అలాగే కొందరు వారానికి ఒకరోజో రెండు రోజులో మాట్లాడకుండా మౌనం పాటించేవారు. వారానికి ఒకరోజో, నెలకొరోజో లేక సంవత్సరానికి ఒక రోజయినా రోజులో మేలుకున్నప్పుడు రెండు మూడు గంటలు కనీసం మౌనంగా మాట్లాడకుండా ఉండగలిగితే చాలా మంచిది.

మౌనం గురించి, మౌనవ్రతం గురించి ఒక మహానుభావుడు చాలా చక్కగా వివరించేడు. మౌనం భాషలేని ప్రార్థన..మౌనం మాటల్లేని విజ్ఞానం..మౌనం నిశ్శబ్దం మంత్రఘోష మౌనం అతి గొప్ప సంభాషణ..మౌనం పదునైన ఆయుధం.

మనం మాట్లాడుతున్నంతసేపు మనసు మాట్లాడదు. మనం ఆపేస్తే మనసు మాట్లాడడం మొదలు పెడుతుంది. మౌనంలోనే మనసుతో సంభాషించగలము. మౌనం నిర్లిప్తత..కొన్నిసార్లు రెండూ ఒకేలా అనిపిస్తాయి. కానీ వేరు వేరు ఒకటి తూర్పు ఇంకొకటి పడమర.. ఒకటి పైపైకి తీసుకువెళ్తుంది. ఇంకొకటి పాతాళానికి తొక్కేస్తుంది. మౌనం అంటే ఆలోచనలూ, కలలూ, కోరికలు, భ్రమలూ,ముసుగులూ, బుర్రలోని చెత్తనంతా పక్కకితోసేసి, నిన్ను నీవు స్పష్టంగా చూసుకోవడం, ఇది ఆత్మ సాక్షాత్కారమే!

మౌనంలో మనసెప్పుడు వినని సంగీతం వుంటుంది. మనమెప్పుడూ అనుభవించని సువాసన వుంటుంది. మనో నేత్రాలతో మాత్రమే చూడగల వెలుతురు వుంటుంది. ఇది కల్పనకాదు. నిజం. మౌనమంటే శూన్యస్థితి. యోగులూ, సిద్ధులూ ఏళ్ళతరబడి తపస్సు చేసేది ఆస్థితికోసమే. పరిపూర్ణ మౌనాన్ని సాధించినట్లయితే, పరిపూర్ణత్వాన్ని చేరుకున్నట్లే !

మహానుభావులు మాట్లాడుతున్నప్పుడు కూడా మనసు మౌనంగా వుంటుంది. మనం మౌనంగా ఉన్నప్పుడు కూడా మనసు ఏదో గందరగోళం చేస్తూ వుంటుంది. ఆ కొమ్మ మీదనుండి ఈ కొమ్మమీదకి, ఈ కొమ్మమీద నుండి ఆ కొమ్మదీదకి కోతిలా గెంతుతూ చంచలంగా ఉంటుంది.

గతంలో అర్థం లేకుండా మాట్లాడినందుకో అనవసరంగా తూలనాడి నందుకో పశ్చాత్తాపపడేవారు చాలామంది కనిపిస్తారు. మౌనంకారణంగా బాధపడ్డ దాఖలాలు ఒక్కటీ వుండవు. మౌనం మాటలకే కాదు. మనసుకీ సంబంధించినది. మనసు నిండా ఆలోచనలు వుండి మాట్లాడకపోయినా అది మౌనవ్రతంకాదు. టి.వి. చూస్తూనో కంప్యూటరులో చాట్ చేస్తూనో నేను మౌనంగావున్నానంటే సరిపోదు. మౌనవ్రతంలో మనసు ధ్యానస్థితిలో వుండాలి. శరీరంసేదతీరుతూ వుండాలి. శ్వాస మీద ధ్యాసవుండాలి. అదేమౌనవ్రతం.

తెలుసుకోదగ్గవి

1. గాయత్రికి మించిన మంత్రములేదు. తల్లికి మించిన దైవము లేదు.
2. సూర్యునికి ఎదురుగా దంతధావన చేయరాదు. దంతధావనము మధ్యవ్రేలితో చేయవలెను.
3. మలమూత్ర విసర్జనములు సూర్య, చంద్రులకు ఎదురుగా చేయరాదు, గాలికి ఎదురుగా చేయవలెను.
4. సూర్యోదయమునకు ముందుగానే లేచి స్నానము చేయవలెను. సూర్యుని శక్తి నీటిలో ఉండును, కనుక ఆరోగ్యప్రదము.
5. చూపుడు వేలుతో బొట్టు పెట్టుకోరాదు.
6. భోజనానికి విస్తరి వేసినపుడు, అరటి ఆకు చివర, కూర్చొనిన వారికి ఎడమ వైపు వుండునట్లు వేయవలెను. కుడివైపునకు వుండునట్లు వేయరాదు.
7. ఇతరులకు భోజనము పెట్టినప్పుడు, యజమాని వారికి తన కుడివైపున కూర్చో బెట్టుకొనవలెను.
8. తాంబూలము ఇచ్చునపుడు తమలపాకులు చివుళ్ళు, అరటిపండ్ల చివుళ్ళు పుచ్చుకొనే వారికి ఎదురుగా ఉండవలెను. లేనిచో తాంబూలం వ్యర్థము.
9. తమలపాకులు 3, వక్కలు 2 రెండు పండ్లు పెట్టవలెను.
10. నిద్రించునపుడు ఎడమచేతిని తలక్రింద పెట్టుకొని, ఎడమ వైపునకు తిరగి నిద్రించవలెను.
11. అన్ని జీవరాసులలో గోవుయే పవిత్రమైనది. మల మూత్రములు కూడా పవిత్రమే అయిన జంతువు అదొక్కటే.
12. మానవునికి బ్రహ్మజ్ఞానము కలవారి యందు భక్తి, సేవ, పూజ, దానశీలత, సజ్జన సాంగత్యం ఈ నాలుగూ ఉండాలి.
13. దానము పాత్రత నెరిగి యిచ్చుట మంచిది.
14. స్త్రీలకు సంతానము కలుగుటకు అడ్డుగానున్న శక్తిని రావిచెట్టు గాలి తొలగిం చును. కాబట్టి అశ్వత్థప్రదక్షిణలు చేస్తే సంతానము కలుగును. ఆదివారం అత్యుత్తమము.
15. వేపచెట్టు రాత్రింబవళ్లు ప్రాణవాయువు నిస్తుంది. కాబట్టి దానిక్రింద ఎప్పుడైనా ఉండవచ్చును. మిగిలిన చెట్ల క్రింద రాత్రిళ్లు ఉండరాదు.
16. చదువుకొనేటప్పుడు ఇద్దరుండాలి. తపస్సు చేసేటప్పుడు ఒక్కరే ఉండాలి.
17. భార్యతో సంప్రదించకుండా ఇతరులను భోజనానికి పిలవరాదు.
18. ఆచారము వలన దైవత్వము, ఋషిత్వము కలుగుతాయి.
19. తల్లిదండ్రులను సేవించువారికి ధర్మము, జయము, సుఖము కలుగును.
20. తపశ్శక్తి వలన కలిగేది దైవభోగము, చెప్పి చేయించుకొనేది రాజభోగము, తాను కావాలని చేసుకొనేది మానవ భోగము.

21. జ్ఞానము – మోక్షము గురించి ఆలోచించేది.
22. విజ్ఞానము – అనేక పుస్తకములు చదివి, వాటి సారాంశమును చెప్పునది.
23. బుద్ధి – ఇతరుల గూర్చి ఆలోచించేది.
24. తీర్థయాత్ర సమయంలో బ్రహ్మచర్యమును పాటించాలి.
25. యజమానికి భార్య ఎడమ వైపున, కుమారుడు కుడివైపున ఉండవలెను.
26. కార్తీకమాసము పగలు శంకర స్వరూపము, రాత్రి నారాయణ స్వరూపము, కనుక వివాహములు చేయరాదు.
27. పూర్వజన్మ సుకృతాన్నిబట్టి విద్య, భార్య, ఐశ్వర్యము లభించును.
28. తెల్లవారుజామున నీరు త్రాగవలెను. రాత్రులందు పాలు త్రాగవలెను.
29. ఆస్తిని అన్నదమ్ములు పంచుకొంటే మార్చుకోవచ్చును. తండ్రి పంచితే మార్చ కూడదు.
30. శివుడు అభిషేక ప్రియుడు, విష్ణువు అలంకార ప్రియుడు, సూర్యుడు నమస్కార ప్రియుడు.
31. బ్రహ్మకపాలము వెళ్ళి తనకు కూడా పిండప్రదానము చేసికొన్నవాడు, శుభ కార్యములకు పీటలమీద కూర్చొనుటకు అనర్హుడగును.
32. తపస్సు చేసుకొనేవారు, విద్యార్థులు, పూజ చేసుకొనేవారు వీపు వెనుకభాగం ఆనుకుంటే శక్తి సామర్థ్యాలు ఉండవు.
33. జ్ఞానం, వైరాగ్యము, యశస్సు, వీర్యము, ఐశ్వర్యము ఈ ఐదింటికి "భగ" అని పేరు. ఈ యైదు గుణాలు పొందినవాడు భగవంతుడు.
34. సర్వ ప్రాణులలోను ఆత్మరూపమున ప్రకాశించుచు స్తుతించబడుచు, సర్వ వ్యాప్తమై వుండు వానిని దేవుడు అందురు.
35. మంగళవాద్యములతో ఇచ్చే స్వాగతం శుభప్రదం. దోసిలి యొగ్గి పిలుచుట గౌరవప్రదం.
36. దైవకర్మలు చేయునపుడు ఉత్తర ముఖముగా వుండి ముందు ఎడమ పాదాన్ని, తరువాత కుడిపాదాన్ని కడుక్కోవాలి.
37. కాళ్ళుచేతితో కడుగు కొనవలెను. కాలిమీద కాలుపెట్టి తోమరాదు.
38. స్నాన జప,హోమ, దాన, దేవపూజ, భోజన సమయములందు అంచుగల వస్త్రములు మాత్రమే ధరించవలెను.
39. సప్తమినాడు, ఆదివారంనాడు, రాత్రివేళలో ఉసిరికాయ తినరాదు.
40. చారు అన్నం మధ్యలోకాని, మజ్జిగ అన్నంమధ్యలోకాని, పరమాన్నం మధ్యలో గాని మంచినీరు త్రాగరాదు.
41. అష్టకష్టములు : దాసీత్వము, దరిద్రము, భార్యలేకపోవటం, ప్రతీ పని తానే చేసుకోవటం, ఆస్తి ఎక్కువ ఉండడం, అసలు లేకపోవడం, అప్పులపాలవడం, ప్రతిరోజు నడవటం.
42. ఈషణ త్రయము : భార్యమీద ఆశ, పుత్రుని మీద ఆశ, ధనము మీద ఆశ, ఈ మూడూ మానవునికి ఉండును.
43. పంచ సౌగంధికములు : యాలకులు, జాపత్రి, జాజికాయ, దాల్చినచెక్క, లవంగములు.

44. గంధాణిక పంచకములు : గంధము, పుష్పం, ధూపం, దీపము, నైవేద్యము ఇవి లేని పూజనిష్ఫలము.
45. దేవతా వృక్షములు : మందారము, పారిజాతము.
46. పతివ్రతలు : అహల్య, ద్రౌపది, సీత, తార, మండోదరి.
47. నవవిధ భక్తులు : శ్రవణము, కీర్తనము, స్మరణము, పాదసేవ, అర్చన, నమస్కారము, దాస్యము, సఖిత్వము, ఆత్మ నివేదనము.
48. తపస్సులు : మానసిక తపస్సు, శారీరక, వాక్, వేదాంత తపస్సులు.
49. నాశనములేనివి అక్షతలు. నాశనము లేనటు వంటిది అశ్వత్థ వృక్షము.
50. కాళ్ళుకడుగుకొనుటకు ఇచ్చిననీరును, త్రాగుటకు ఇచ్చిన నీరును కొంచెము మిగిల్చినచో వారు డబ్బును మిగుల్చుదురు.
51. దేవతా పూజా సమయమునందు పూజ అయిన తరువాత బ్రహ్మీముహుర్త సమయమందు అన్నమాటలు జరుగును. దూపం లేకుండా పూజపనికిరాదు. ఇంటిలో పూజకు అగరబత్తి, ప్రత్యేక పూజకు సాంబ్రాణి, గ్రామదేవతకు గుగ్గిలము పొగవేయవలెను.
52. చేతిని నాకరాదు. ఎంగిలి విస్తరిలో నెయ్యి వేసుకొనరాదు. పీటకు ఇనుప మేకులు పనికిరావు.
53. తులసి మొక్కలో నీరుపోసి నెత్తిమీద స్త్రీ, పురుషులు అందరు చల్లుకోవచ్చు.
54. తీర్థం శివ స్వరూపము, ప్రసాదం విష్ణు స్వరూపం.
55. సూర్యాస్తమయం అయ్యాక పురుషసూక్తం చేయగూడదు, స్త్రీ సూక్తం మాత్రమే చేయాలి.
56. శివునికి తెల్ల అక్షతలు వాడవచ్చును. యితరమైన వారికి పసుపువి వాడవచ్చును. శక్తులకు, స్త్రీ దేవతలకు కుంకుమాక్షతలు వాడవలెను.
57. హారతి వట్టిచేతితో ఇవ్వరాదు. పువ్వుగాని, అక్షతలు గాని చేతపట్టుకొని ఇవ్వాలి.
58. మినుములు ఎక్కవ తింటే మేధాశక్తి నశిస్తుంది.
59. ఆచమనం చేయునపుడు చప్పుడు కారాదు. చప్పుడు అయినచో రక్తముతో సమానము.
60. ఆచమనం చేయునపుడు, మంచినీరు త్రాగునపుడు క్రింది పెదవికి తగులునట్లు చేయవలెను. పంటికి తగులరాదు.
61. ఆచమనం చేయునపుడు మూడు పర్యాయములు ఎప్పటి కప్పుడు చేతిలో నీళ్ళుపోసుకోవలెను. ఒకేసారి పోసుకొని ముమ్మారు త్రాగరాదు. అట్లు త్రాగినచో ఎంగిలితో సమానము.
62. ఆచమనం చేయువారికి రాగిది కాని, బంగారపుది కాని, వెండిదికాని, దర్భది గాని ఉంగరము తప్పక వేలికి ధరించి ఉండాలి.
63. ఆచమనంచేసి, కేశవనామం పూర్తికాగానే గంట మ్రోగించవలెను. ఘంటానాదం దేవతలకు పిలుపు, శంఖారావం జయమునకు పిలుపు, ధనుష్టంకారము యుద్ధమునకు పిలుపు, బిందెలు మ్రోగించిన దెయ్యాలకు పిలుపు.

64. వస్త్రమును నాలుగు మడతలుగా ఎడమచేతియందు వుంచి దానిపై కుడిచేతి నుంచి, పవిత్రమైన తీర్థమును మూడుసార్లు, ఒక్కచుక్కనైనా క్రింద పడనీయ కుండా పుచ్చుకొనవలయును. తీర్థము బ్రహ్మహత్యాది పాతకములను నశింప జేయును. ఒక్క చుక్క క్రింద పడిన అంతకు 8 రెట్లు పాపం వచ్చును.
65. తీర్థము తాను ముందుగా పుచ్చుకొని, తర్వాత మిగతా వారికి ముమ్మారు ఇవ్వవలయును.
66. తీర్థము మూడుసార్లుగా తీసుకొనుటకు కారణము–
1) ఆధ్యాత్మికము 2) అది భౌతికము 3) అది దైవికము
67. ఆలయములో నిలబడి, ఇంట్లో కూర్చొని తీర్థము తీసికొనవలెను.
68. తీర్థము త్రాగినతర్వాత ఆచేతిని శిరస్సుమీదరాచుకొనరాదు. బట్టకుతుడవవలెను.
69. పూజా సమయమున దీపారాధన, అగ్గిపుల్లతో చేయరాదు. ఇంకొక జ్యోతినిగాని, అగరవత్తినిగాని వెలిగించి, దానితో దీపారాధన చేయవలెను.
70. దీపారాధన చేయగానే అక్షతలుగాని, కుంకుమగాని, పువ్వులుగాని దీపం కుంది మొదట్లో వుంచవలెను.
71. ఒకదీపం కుందిలో రెండు జ్యోతులకు తక్కువ కాకుండ ఉంచవలెను. ఒక్క దీపం అశుభం.
72. దీపారాధన ఆవునేతితో ఈశ్వరప్రీతి, నూనెతో విష్ణువు ప్రీతి. స్త్రీదేవతలకు కూడా పనికివచ్చును.
73. దీపారాధన శివునికి ఎడమవైపు విష్ణువుకు కుడివైపు చేయవలెను. మిగిలిన వారికి ఎటైనా చేయవచ్చును. ఎదురుగా మాత్రం చేయరాదు.
74. ఉదయం దీపారాధన ఎంతపుణ్యమో, సాయంకాల దీపారాధన కూడా అంతే పుణ్యము.
75. ఆవునేతి దీపారాధన జ్ఞానసిద్ధి, నువ్వులనూనె దీపారాధన, సంపదవృద్ధి, కీర్తియు కలుగజేయును.
76. సూర్యోదయమునకు ముందుగానే ముందురోజు తాలూకు పువ్వులు తీసివేయ వలెను.
77. అర్చనకు పూజా ద్రవ్యములను తన దక్షిణ భాగమున కుడివైపు ఉండవలెను. ఎడమచేతితో గ్రహించరాదు.
78. స్టీలు సామానులలో భోజనము తినే కంచాలలో పూజా ద్రవ్యములు ఉంచ కూడదు.
79. ఎర్ర మందారాలు స్త్రీ, పురుష మూర్తుల పూజకు పనికివచ్చును.
80. వాసనలేని పువ్వులు తప్ప అన్ని పువ్వులు స్త్రీ దేవతామూర్తుల పూజకు పనికి వచ్చును.
81. ఏ రోజు కోసిన పువ్వులు ఆ రోజే వాడవలెను. అక్షతలు ఏరోజు చేసినవి ఆ రోజే వాడవలెను.
82. భగవంతుని పూజకు “తులసి” అతి ప్రశస్తము, స్త్రీలు దళములు కోయ రాదు, పెంచవచ్చును.
83. ఆషాఢ శుద్ధ ఏకాదశినుండి, కార్తీక శుద్ధ పౌర్ణమి వరకు చాతుర్మాస దీక్ష కావున, ఆ సమయంతో తులసి మొక్కను చోటు మార్చి పాతరాదు.

84. ఇంటిలో పూజించు లోహ విగ్రహాలు పాదములు లగాయితు శిరస్సు వరకు, రెండు లేక మూడు అంగుళాలు ఎత్తు మాత్రమే ఉండవలెను. అంతకన్న పెద్ద విగ్రహములు ఇంట్లో వుంచుకొనరాదు.
85. నామములతో పూజ చేయునపుడు "ఓం"కారము నామమునకు ముందు చేర్చ వలెను.
86. హారతి కళ్ళకద్దుకొని, చేతులను వాసనచూచి తర్వాత శిరస్సుపై పెట్టుకోవలెను.
87. పూజచేయునపుడు దర్భాసనంగాని, లేడి చర్మంగాని, నూతన వస్త్రంగాని వేసుకుని కూర్చొనవలెను. క్రింద ఏ ఆచ్ఛాదనము లేకుండా కూర్చొనరాదు.
88. కొబ్బరి బొండము జటాజూటంతో కూడిన శివుని శిరస్సుతో సమానము. శుభం కనుక కొబ్బరికాయ కొట్టి పని ప్రారంభించుట మంచిది. కొబ్బరికాయ కొట్టునపుడు పీచు ఎడమవైపున ఉండవలెను.
89. పూజకు పట్టుబట్ట, తెల్లని పట్టుబట్ట మంచివి. ఎర్రని పట్టుబట్ట రకరకాలు రంగులు, బొమ్మలు కలవి ధరించుట మంచిదికాదు. అంచులు గల బట్టను ధరించవలెను.
90. పట్టుబట్ట కట్టుకొని ఒకసారి భోజనము చేసిన ఆ బట్ట పూజకు పనికిరాదు.
91. తడిబట్టతో ఎట్టి శుభకార్యాలు కాని, క్షురకర్మలు కాని చేసుకొనరాదు.
92. పంచామృతస్నానం, శుద్ధోదక స్నానం చేయించిన తర్వాత ఆచమనం చేయించ వలెను.
93. అవుసర నైవేద్యములకు పంచదార పనికిరాదు. బెల్లం పనికి వచ్చును. కలకండ (పటిక పంచదార) పెట్టవచ్చును.
94. శివాలయంలో నందికి ఏ పక్కనుంచి లోపలికి వెళ్ళెదరో ఆ ప్రక్కనుంచి మాత్రమే వెనుకకు రావలెను.
95. శివాలయంలో నందీశ్వరుని ప్రార్థించిన తర్వాత మాత్రమే స్వామి వారిని దర్శించడానికి వెళ్ళవలెను.
96. నందీశ్వరుని కొమ్ములమీద ఎడమచేయి ఉంచి, వెనుక భాగాన కుడిచేయి ఉంచి స్పృశించినచో, శిరస్సు వంచును కనుక, నందికి ఉచ్ఛ్వాస, నిశ్శ్వాసలు ఆగి శివదర్శన భాగ్యము కలుగును.
97. దేవాలయమునుండి బయటకు వచ్చుటకు వెనుకకు తిరిగి రాకూడదు. ప్రక్కకు నడుస్తూ రావలెను.
98. ఉసిరిచెట్టును కార్తీకమాసంలో పూజించుట వలన ఆరోగ్యము కలుగును.
99. జిల్లేడు చెట్టుకి, సూర్యునికి సంబంధ మున్నందున రథసప్తమి నాడు ఏడు జిల్లేడు ఆకులతో తలమీద పెట్టుకుని మూడు పర్యాయాలు స్నానం చేయవలెను.
100. సంకల్పము చేయు ముందు అభిషేక కాలమందు, అభిషేకానంతరము ధూప, దీప, నీరాజన సమయములందును, పవళింపుసేవయందు ఘంటానాదము చేయవలెను.

101.పంక్తిలో భోజనమునకు కూర్చున్నప్పుడు వడ్డన పూర్తికాకుండా భుజించరాదు. వడ్డన పూర్తి అయిన తరువాత యజమాని ఆజ్ఞ మేరకు భగవదర్పణ చేసి భుజించవలెను.

102.అదేవిధముగా భోజనము పూర్తి అయిన పిదప పంక్తిలో అందరి భోజనాలు పూర్తయిన పిదప లేవవలెను. ఇతరులు భుజించుచుండగా మధ్యలో లేవరాదు.

103.ప్రతిదినము ఆదిత్య హృదయము, విష్ణు సహస్రనామాలు పారాయణము చేస్తే మంచిది.

104.అన్ని దానములకంటే అన్నదానమే గొప్ప.

105.దేవుని దగ్గరకు, బాలల దగ్గరకు పెద్దల దగ్గరకు వట్టి చేతులతో పోరాదు.

106.తనకంటే భాగ్యవంతులను చూసి అసూయ పడరాదు. తనకంటే పేదవారిని చూసి తనివి చెందవలెను.

107.చేసిన తప్పులకై పశ్చాత్తాపపడి ఇక మీదట వానిని చేయరాదు.

108.ఎల్లవేళల పరులఇండ్లయందు భుజించుట వలన తాను సంపాదించిన పుణ్యము నశించుటయేగాక, యన్నమిడిన వాని పాతకములు కూడా జుట్టుకొనును.

109.స్నానము వలన తేజస్సు, బలము, ఆయువు, ప్రజ్ఞ వృద్ధిచెందును. స్నానము వలన దుస్వప్నదోషములు తొలగిశోకదారిద్ర్యములు తొలగును. పురుడు, మైల వచ్చినపుడు, శ్రాద్ధ దినములందు, వ్రతదినములందు, వేడి నీళ్ళస్నానము చేయకూడదు. వివాహాది శుభకార్యాములందు చన్నీటి స్నానముచేయరాదు.

110.వృద్ధాప్యములో ఆరోగ్యంగా ఆనందంగా ఉండాలంటే యవ్వనంలో (వయసులో) తప్పులుచేయకుండాఉండాలి. ఈ రోజుల్లో బి.పి.,షుగరు,హార్టుప్రాబ్లమ్స్, ఉన్నవారు రోజురోజుకి ఎక్కువవుతున్నందున నలభైఏళ్ళు వచ్చిన దగ్గరనుండి మార్నింగ్‌వాక్, ఈవినింగ్‌వాక్ యోగమున్నగు వాటినిచేస్తూ వుండాలి.

111.రానున్నది రాక మానదు, కానున్నది కాకమానదు. పోనున్నది పోకమానదు. ప్రాప్తానుసారము లభించు భోగములు భరించక తప్పదు. ఇది ప్రారబ్ధ నాశనము కొరకు జ్ఞానిని విముక్త ఖైదీవలె సంతసించును.

112.జ్ఞానికి అజ్ఞానికి ప్రారబ్ధకర్మ ఫలానుభవము సమానముగా నుండినను అజ్ఞాని దుఃఖము పొందును. జ్ఞాని దుఃఖము పొందదు.

113. గుమ్మం, ఇల్లు, వాకిలీ కడిగేక ముగ్గు తప్పక వేయాలి.

114.భోజనం వడ్డించేముందు ఆకులో కూర, పప్పు, స్వీటు ఏదో ఒకటి వడ్డించకుండా ఆకులో కాని కంచములోకాని ముందు అన్నము వడ్డించరాదు.

115.ఆహారము మితముగా తినవలెను. అనగా అర్ధభాగము ఆహారము, పావుభాగము నీరు త్రాగి, పావుభాగము ఎప్పుడూ ఖాళీగా వుంచిన ఆరోగ్యము.

116.కాకిలాచిరకాలం బ్రతికేకంటే హంసలా ఆరునెలలు బ్రతికినా మంచిదే !

117.చెడువినవద్దు, చెడుకనవద్దు, చెడు చెప్పద్దు.

118.ఓంకారము (ప్రణవము) మించిన మంత్రము లేదు. ధ్యానానికి మించిన సాధనలేదు. తనఆత్మను మించిన దైవములేదు. తృప్తిని మించిన సౌఖ్యములేదు.

119. పూజలు, వ్రతములు చేయువారు తప్పక గోచీ ధరించవలెను.
120. తీర్థయాత్రలయందు పర్వదినములయందు బ్రహ్మచర్యము తప్పక పాటించాలి.
121. విభూదినుదుట ధరించడం, రుద్రాక్షలు ధరించడం వలన ఆరోగ్యదాయకము. గోవుని పూజించుట మంచిది.
122. సద్గురువును ఒకరిని ఎన్నుకొని ఉపదేశము పొంది, ధ్యానము సాగించిన తొందరగా ఆత్మసాక్షాత్కారము లభిచును.
123. నువ్వు చేటవలె బ్రతకాలి. జల్లెడవలె వుండిపోకు. అని కొందరు చెబుతారు. దీనిలో చాలా అర్థంవుంది. జల్లెడ మంచి విషయాలన్నీ జల్లించి, పనికిరాని పొట్టును, మట్టినీ రాళ్ళని మాత్రమే తనలోనిలుపుకొంటుంది. కానీ చేట అలా కాదు. పొట్టు, చెత్త, రాళ్ళు వగైరాని నేలమీదికి నెట్టేసి పనికివచ్చే పదార్థాన్ని మాత్రమే తనలో నిలుపుకొంటుంది. దీనిని బట్టి మనం జల్లెడో, చేటో నిర్ణయించు కోవాలి.
124. మనిషి జీవితంలో ఏనాడైతే నేర్చుకోవడం ఆపేస్తాడో, ఆనాటి నుంచే ఆ మనిషి ముసలితనం వచ్చినట్లు లెఖ్ఖ. అటువంటి మనిషి వయసు ఇరవై అయినా అందుకు భిన్నంగా నిరంతరం నేర్చుకోవాలనే తపన గల మనిషికి ఎంత వయస్సు వచ్చినా ముసలితనం రానేరాదు.
125. ముఖం మీద చిరునవ్వు లేని మనిషి పూర్తిగా బట్టలు వేసుకోని వారితో సమానం. కాబట్టి ఎప్పుడు నవ్వుతూ సరదాగా అందరూ అభిమానించేలా ప్రవర్తించాలి.
126. మనిషి జీవితంలో తగు విశ్రాంతి ఎంతైనా అవసరం. లేకుంటే శరీరమూ, మనసూ అదుపుతప్పిపోతాయి.
127. ఆత్మవిశ్వాసం, ఆత్మజ్ఞానం, ఆత్మనిగ్రహం ఈ మూడు లక్షణాలు మనిషి జీవితాన్ని ఎంతో శక్తి వంతంగా తయారుచేస్తాయి.
128. ధ్యానం ఒక విమానం వంటిది. దాని సాయంతో అనంతమైన ఆనందంవైపు అవలీలగా ప్రయాణంచేసి శాంతి సామ్రాజ్యం లోకి మానవుడు అడుగుపెట్ట గలడు.
129. ప్రతీ మనిషికి సృష్టికర్త రెండు చెవులు, రెండు కళ్ళుతోపాటు ఒక నాలుక ప్రసాదించాడు. రెండు చెవులతో ఎక్కువగా వినాలని, ఒక నాలుకను ఉపయోగించి మనం సాధ్యమైనంత తక్కువగా మాట్లాడాలని.
130. "ఆల్ ది ఫెయిల్యూర్స్ ఆర్ ఆపర్చ్యునిటీస్" అంటారు అనుభవజ్ఞులు. వైఫల్యాలకు బెదరకండి. అవి మీలో నూతనశక్తిని కలిగించగలవు. అవి చక్కని పాఠము చెప్పగలవు. కొత్తకొత్త ఆలోచనలను రేకెత్తించగలవు. మీలో అనుకున్న మార్పు తీసుకురావడానికి దోహదపడగలవు.

131.సందేహం మనిషికి భయంకరమైన శత్రువు. అది మనిషి హృదయంలో లేనిపోని భయాలను పుట్టిస్తుంది. వాటివల్ల ఎంతో నమ్మకంతో జయించగలమన్న వారి ముందు సైతం మనం తలవంచుకోవలసిన విషమపరిస్థితులు ఎదురవుతూ వుంటాయి.

132.మనిషి జీవితంలో క్షణక్షణం భయపడుతూ సాధించేది ఏమి ఉండదు. పైగా అలా భయపడుతు అడుగడుగునా వెనుకంజవేస్తూ ఉండే మనిషి మానవత్వాన్నే కాదు, భగవంతుణ్ణిసైతం మరచిపోయే బలహీన స్థితికి దిగజారిపోతూవుంటాడు.

133.జీవితంలో మనిషి ముందుకు రావాలంటే అందుకు మూడు మంచి పద్ధతులు అవసరం. 1. సాధించదలచుకొన్న లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. 2. ఆ లక్ష్య సాధనలో రాబోయే ఆటంకాలను విశ్లేషించుకోవాలి. 3. ఆటంకాలని ఎలా అధిగమించాలో నేర్చుకోవాలి.

134.జీవితం ఎంత విలువైనదో అంత చిన్నది కూడా. అందుకే మనం గతించిన వాటిని గురించి వ్యర్థంగా మదనపడుతూనో, జరగబోయే వాటిని విలాస వంతంగా ఊహించుకొంటునూ క్షణకాం కూడా వృథా చేయకూడదు.

135.మనం చేసేపనిలో విజయాన్ని చేజిక్కించుకోడానికి మనకి కావలసింది ముఖ్యంగా మూడులక్షణాలు, ధైర్యసాహసాలతో ముందడుగు వేయడం, తక్కిన వారికన్నా ముందుగా నిర్ణయాలు తీసుకోవడం. అందరూ చేసిన పనినిన చేయకుండా, కొత్తకోణంలో చేయడం.

136.ఎవరో వస్తారనీ, ఏదోచేస్తారని ఎదురు చూడడం మూర్ఖత్వమే ఎవ్వరూరారు. ఏదీ చెయ్యరు. ఎవరికి వారే ముందుకు సాగాలి. ముందుకుసాగాలంటే కొన్నిం టిని వదిలిపెట్టాలి. కొన్నింటిని సంపాదించాలి. వదిలిపెట్టే వాటిలో ముఖ్య మైనవి బద్ధకం, వ్యసనాలు, ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు, అర్థంలేనిభయాలు, ఆందోళనలు, సంపాదించే వాటిలో ఆత్మవిశ్వాసం, పోజటివ్ తింకింగ్ ముఖ్యమైనవి.

137.గతించిపోయిన అనుభవాలను, సంఘటనలను మనసులో పెట్టుకోకు! నీ హృదయం నిర్మలంగా వుంటే ఎదుటి హృదయాలు కూడా నీకు నిర్మలంగా కన్పిస్తాయి. నీలో చీకటి వుంటే ఎదుటి హృదయాలలో కూడా నీకు అంతులేని చీకటి కన్పిస్తుంది. మన హృదయాలలో పగలు, క్రోధాలు, విద్వేషాలు రగులు తున్నంతకాలం మనలో మానవత్వం నశిస్తుంది.

138.కృషిచేసేవారికి కరువు వుండదు. జపంచేసేవారికి పాతకం వుండదు. మౌనంగా వుండేవారికి కలహం వుండదు. జాగ్రత్తలో వుండేవారికి భయం వుండదు. ఈ లక్షణాలను అలవర్చుకున్నవారికి అన్నింటా విజయమే.

139.క్రమం తప్పకుండా యోగా ని అభ్యసించడం వలన శ్వాసవ్యవస్థ రక్తప్రసరణ వ్యవస్థ, జీర్ణవ్యవస్థ అన్ని వ్యవస్థలు శరీరంలో సక్రమంగా పనిచేసి ఆరోగ్యన్ని సమకూరుస్తాయి.

140.ప్రతిరోజు పూజానంతరం దేవుని ఎదుట పద్నాలుగు గుంజీలు తీస్తే మంచిది.

నవదుర్గలు : శైలపుత్రి, బ్రహ్మచారిణి, చన్ద్రఘంటి, కూష్మాండ, స్కందమాత, కాత్యాయిని, కాళరాత్రి, భైరవి, సర్వసిద్ధ.

నవవిధ భక్తులు : 1. శ్రవణము 2. కీర్తనము 3. స్మరణము 4. పాదసేవనము 5. అర్చనము 6. వందనము 7. దాస్యము 8. సఖ్యము 9. ఆత్మనివేదనము.

సప్తమాతృకలు : అవిష, కాళి, కౌసిక, ఉద్ధత, సారిక, ఆర్య, వైధాత్రి

పంచమహాయజ్ఞాలు : దేవయజ్ఞము, పితృయజ్ఞము,భూతయజ్ఞము, మనుష్యయజ్ఞము, బ్రహ్మయజ్ఞము.

మోక్షమిచ్చే సప్తపురాలు : అయోధ్య, మధుర, మాయావతి (హరిద్వార్) కాశీ, కాంచీపురం, అవంతిక (ఉజ్జయినీ) ద్వారవతి (ద్వారక) ఇవి సప్త మోక్షప్రదాయకాలు. వీటిలో కాశీ క్షేత్రం సర్వశ్రేష్ఠమయింది.

త్రికరణములు : మనస్సు, వాక్కు, పని

సప్తమహర్షులు : కశ్యపుడు, అత్రి, భరద్వాజుడు, విశ్వామిత్రుడు, గౌతముడు, వశిష్ఠుడు, జమదగ్ని.

అష్టగంధములు : కర్పూరము, కస్తూరి, పునుగు, జవ్వాజి, అగరు, పన్నీరు, అత్తరు, గంధము.

నవబ్రహ్మలు : మరీచి, భరద్వాజుడు, అంగీరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, దక్షుడు, వశిష్ఠుడు, వామదేవుడు.

నవరసములు : శృంగారము, హాస్యము, కరుణము, రౌద్రము, వీరము, భయానకము, భీభత్సము, అద్భుతము, శాంతము.

షోడశోపచారాలు : ఆవాహనము,ఆసనము,పాద్యము,అర్ఘ్యము, ఆచమనీయము, అభిషేకము, వస్త్రము, యజ్ఞోపవీతము, గంధము, పుష్పము, ధూపము, దీపము, నైవేద్యము, తాంబూలము, ప్రదక్షిణము, నమస్కారము.

చతుర్విద సేవలు ద్వారా పరమాత్మని దర్శించుట

1. స్థాన సేవనము : భగవానుని ఆలయమును శుభ్రము చేయుట, అలంకరించుట, పూలతోటలు పెంచుట.
2. అంగసేవనము : విగ్రహములను శుభ్రపరచుట, ఆభరణములతో రూపముల నలంకరించుట, నైవేద్యము నర్పించుట, విశేషసేవలనందించుట.
3. భావసేవనము : పరమాత్మయే సర్వమని సదాభావించుట, తల్లి, తండ్రి, బంధువు, మిత్రుడు, ధనము, దైవము సమస్తము పరమాత్మయేనని సదా విశ్వసించి జీవించుట.
4. ఆత్మసేవనము : పరమాత్మ తనకన్నను వేరుకాదని భావించి ఆత్మనివేదనాసక్తితో స్వామిని సేవించుట.

అష్టసిద్ధులు

1. అణిమాసిద్ధి – మిక్కిలి సూక్ష్మరూపమును పొందుట.
2. మహిమాసిద్ధి – మిక్కిలి స్థూల రూపమును పొందుట.
3. లఘిమాసిద్ధి – మిక్కిలి తేలిక రూపమును పొందుట.
4. ప్రాప్తిసిద్ధి – ఇంద్రియములతో ఇంద్రియాధిష్ఠాన దేవతలను దర్శించుట.
5. ప్రాకామ్యసిద్ధి – లౌకిక, పారలౌకిక పదార్థములను దర్శించి, అనుభవించు సామర్థ్యమును పొందుట.
6. ఈశిత్వసిద్ధి – మాయనుపాదిగా కలిగిన ఈశ్వరునియొక్క అంశలగు జ్ఞాన వీర్యాదులను ప్రకోపింపజేయుట.
7. వశిత్వసిద్ధి – విషయభోగవిరక్తి
8. కామావసాయతసిద్ధి – సమస్త కోరికలు ఉపసమించుట.

గౌణసిద్ధులు

1.ఆకలిదప్పులు లేకుండుట 2. దూరప్రదేశములందు జరుగు విషయములు తెలుసుకొనుట 3. దూరదృశ్యములుగాంచుట 4. దేహములో మనోవేగముతో కోరిన ప్రదేశమునకేగుట 5. కోరిన రూపము ధరించుట. 6. అన్యదేహాదులలో ప్రవేశించుట 7. దేవతలక్రీడావిలాసములను తిలకించుట 8. సంకల్పములను సిద్ధించుకొనుట 9. అడ్డులేని ఆదేశమును కలిగియుండుట. 10. కోరిన దేహమును త్యజించుట. ఈ పదింటిని గుణజాతసిద్ధులని అందురు.

క్షుద్రసిద్ధులు : యైదువిధములు. 1. త్రికాలజ్ఞత్వము 2. శీతోష్ణసహిష్ణుత్వము 3. అన్యులమనస్సు ఎరుంగుట 4. అగ్ని, సూర్యుడు, జలము, విషము మున్నగు వాని ప్రభావములనాపుట. 5. అపజయము నెరుగకుండుట.

జీవన సౌందర్యం

1. సువర్ణాభరణాలను ధరిస్తే ఆయుర్వృద్ధి
2. చక్కని దుస్తులు ధరిస్తే తేజస్సు
3. ప్రసన్నంగా వుంటే ఆరోగ్యం
4. ఎప్పుడూ ఆనందంగా వుంటే లక్ష్మీప్రదం
5. పట్టుదలతో కృషిచేస్తే సంపూర్ణ విజయం
6. ఒకరికి సహాయపడితే క్షేమం.
7. తృప్తివుండే నిత్యయవ్వనం
8. నవ్వుతూ వుంటే నిత్యయవ్వనం
9. మధురంగా మాట్లాడితే మంగళకరం
10. మితంగా భుజిస్తే చక్కని రూపం.

కొన్ని ముఖ్య మంత్రములు

నిద్రలేచునపుడు :

కరాగ్రే వసతే లక్ష్మీ కరమధ్యే సరస్వతీ ।
కరమూలే స్థితాగౌరీ, ప్రభాతే కరదర్శనం ॥

స్నానము చేయునపుడు :

గంగేచ యమునేచైవ గోదావరి సరస్వతి ।
నర్మదా సింధు కావేరి జలేస్మిన్ సన్నిధిం కురు ॥

విభూది ధారణ :

శ్రీ కరంచ పవిత్రంచ శోక, రోగనివారణం ।
లోకవశీకరం పుంసాం, భస్మం త్రైలోక్య సమ్మోహనమ్ ॥

మృత్యుంజయ మహా మంత్రము :

ఓమ్ త్రయంబకం యజామహే సుగన్దీం పుష్టివర్ధనమ్ ।
ఉర్వారుక మవ బన్దనాన్మృత్యో ర్ముక్షాయమామృతాత్ ॥

జ్యోతి ప్రజ్వలన :

దీపం జ్యోతిః పరబ్రహ్మదీపం సర్వత మోపహం ।
దీపేన సాధ్యతే సర్వం సంధ్యా దీపనమోస్తుతే ॥

శ్లో॥ శుభం భవతు కల్యాణీ ఆరోగ్యం ధనసపందమ్ ।
మమ శతృ వినాశాయ సాదుం జ్యోతిర్నమోస్తుతే ॥

తీర్థ స్వీకరణ :

అకాలమృత్యుహరణం సర్వవ్యాధి నివారణం
సమస్త పాపక్షయకరం శ్రీ భూతనాథ పాదోదకం పావనం శుభం

ప్రదక్షిణ నమస్కారం :

యానికానిచ పాపాని, జన్మాంతర కృతానిచ ।
తాని తాని ప్రణస్యన్తి ప్రదక్షిణ పదే పదే ॥
అన్యధాశరణం నాస్తి త్వమేవ శరణం మమ
తస్మాత్ కారుణ్య భావేన రక్ష రక్ష జనార్ధన ॥

సాష్టాంగ నమస్కారం :

ఉరసా శిరసా దృష్ట్యా మనసా వచ
సాతదాపద్భ్యాం కరాభ్యాం కర్ణాభ్యాం
ప్రదమోష్టాంగ ఉచ్చతే - సాష్టాంగ నమస్కార సమర్పయమి.

నిద్రకుముందు :

రామస్కందం హనుమంతం, వైనతేయం వృకోదరం ।
శయనేయః సస్మరేన్నిత్యం దుస్వప్నం తస్యవస్యతి

తీర్థ స్వీకరణ

శ్లో॥ అకాల మృత్యుహరణం సర్వవ్యాధి నివారణం
సమస్త పాప క్షయకరం శ్రీభూతనాథ పాదోదకం పావనం శుభం.

నూతన యజ్ఞోపవీత ధారణ విధానము

యజ్ఞోపవీతాన్ని ధరించిన ప్రతీ ఒక్కరూ గాయత్రీ మంత్రాన్ని తప్పక జపించాలని, జపించడానికి అర్హత వున్నట్లు మన పెద్దలు చెప్పేరు. ద్విజులు (బ్రాహ్మణులు) సంధ్యావందనాన్ని మూడు పూటలా చేయాలని నియమంవుంది. కానీ కలి ప్రభావం వలనో, కాలమహిమవలనో నేడు సంధ్యావంనం చేసేవారు అరుదుగా కనిపిస్తున్నారు. ఉత్తరభారతంలో జన్మించిన ఆచార్య రామశర్మగారు గాయత్రీ మంత్ర జపం చేయడానికి కులము, స్త్రీ, పురుష భేదములేదని యజ్ఞోపవీతధారణతో సంబంధం లేకుండా ప్రతీఒక్కరూ గాయత్రీ మంత్రాన్ని జపించమన్నారు. గాయత్రీ మంత్రాన్ని ఒక మంత్రంగా జపించాలి కానీ రకరకాల రాగాలతో పాటగా పాడకూడదు. యజ్ఞోపవీత ధారణను తెలియజేస్తూ, పాఠకులకు ఉపయోగకరంగా వుంటుందని ఇక్కడ పొందుపరుస్తున్నాను.

శ్లో॥ అపవిత్రః పవిత్రోవా సర్వావస్థాం గతో పివా
యః స్మరేత్ పుండరీకాక్షం సబాహ్యా భ్యన్తరశ్శుచిః॥
(ఈ మంత్రమును అనుకొనుచు శిరస్సుపై నీళ్లు జల్లుకోవలెను.)
ఆచమనము : ఓం మహాగణాధిపతయే నమోనమః ఓం కేశవాయస్వాహా ఓం నారాయణాయస్వాహా ఓం మాధవాయస్వాహా అని ముమ్మారు ఆచమనము చేయవలెను. తదుపరి చేయి కడుగుకొనవలెను.

గోవిందా, విష్ణు, మధుసూదన, త్రివిక్రమ, వామన, శ్రీధర, హృషీకేశ, పద్మనాభ, దామోదర, సంకర్షణ, వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, పురుషోత్తమ, అధోక్షజ, నారసింహ, అచ్యుత, జనార్దన, ఉపేంద్ర, హరే శ్రీ కృష్ణాయనమః అని నమస్కరించవలెను.

ఉత్తిష్ఠన్తు భూతపిశాచాః ఏతే భూమిభారకాః
ఏతేషా మవిరోధేన బ్రహ్మకర్మ సమారభే.

(చేతిలో నీళ్ళుపోసుకొని యీ మంత్రమును చదివిన పిమ్మట భూమిపై నీళ్ళు జల్లవలెను.)

ఓం భూః ఓం భువః ఓగ్ం సువః ఓం మహః ఓం జనః ఓం తపః ఓగ్ం సత్యమ్ ఓం తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి, ధియో యోనః ప్రచోదయాత్ ఓమాపో జ్యోతిరసోమృతం బ్రహ్మ భూర్భువస్సువరోమ్.

గృహస్థులు (ఐదువేళ్ళతోనాసికాగ్రమును పట్టుకొని యీ మంత్రమును చెప్పవలెను.) బ్రహ్మచారులు బొటన వ్రేలితో కుడిముక్కును, అనామిక కనిష్టిక వేళ్లతో ఎడమ ముక్కును పట్టుకొని చెప్పవలెను.

సంకల్పం :

శుభే శోభనముహూర్తే, శ్రీ మహావిష్ణో రాజ్ఞయా ప్రవర్తమానస్య, అద్య బ్రహ్మణః ద్వితీయ పరార్థే శ్వేతవరాహకల్పే, వైవస్వత మన్వన్తరే, కలియుగే, ప్రథమ పాదే, జమ్బూద్వీపే భరతవర్షే భరతఖండే వరాహ నృసింహక్షేత్రే మహోదధితీరే, (వసతి) స్వగృహే అస్మిన్వర్తమాన వ్యావహారిక చాన్ద్రమానేన.....వర్షఋతౌ, శ్రావణ మాసే, శుక్లపక్షే పౌర్ణమాశ్యాం...వాసరే...శుభనక్షత్రే శుభయోగే, శుభకరణే. ఏవం గుణ విశేషణ విశిష్టాయాం, శుభతిథౌ, శ్రీమాన్...గోత్రః....నామధేయః శ్రీమతః ...గోత్రస్య....నామధేయస్య ధర్మపత్నీ సమేతస్య మమ ఉపాత్త దురితక్షయ ద్వారా శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం, ధర్మార్థ కామమోక్ష చతుర్విధ ఫలపురుషార్థం నూతన యజ్ఞోపవీత ధారణం కరిష్యే.

(బ్రహ్మచారులు శ్రీ మతః.... గోత్రస్య....నామధేయస్య ధర్మపత్నీ సమేతస్య చెప్పనక్కరలేదు.)

యజ్ఞోపవీతము యొక్క 5 ముడుల వద్దను, మరిరెండు సమానదూర స్థలముల వద్దను, కుంకుమను తడిచేసి అలంకరించి ఉంచుకొనవలెను.

తదుపరి‌- ఆచమనముచేసి యీ యజ్ఞోపవీతధారణ మంత్రము-

శ్లో॥ యజ్ఞోపవీతం పరమం పవిత్రం
ప్రజాపతేర్యత్సహజం పురస్తాత్
ఆయుష్య మగ్ర్యం ప్రతి ముంచశుభ్రం
యజ్ఞోపవీతం బలమస్తు తేజః॥

చెప్పుచు ఒకపోగు "నిత్య కర్మానుష్ఠాన ఫలసిద్ధ్యర్థం" ప్రథమ యజ్ఞోపవీతధారణం కరిష్యే అని దాల్చవలెను.

మరల ఆచమనముచేసి పై మంత్రమును పఠించుచు రెండు పోగులను "గృహస్థాశ్రమ ఫలసిద్ద్యర్థం ద్వితీయ యజ్ఞోపవీతధారణం కరిష్యే అని జంటగా ధరించవలెను. తిరుగ ఆచమనముచేసి పై మంత్రమును పఠించుచు ఆపన్నివారణా ర్థము చతుర్థ, పంచమ యజ్ఞోపవీతధారణం కరిష్యే (నాలుగు,ఐదు)ముడులను ఒక దాని తర్వాత మరియొకటి ధరించవలెను. మొత్తము 5 ముడులువచ్చినట్లు సరిచేసుకొనవలెను.

తదుపరి పాత, క్రొత్త జందెములను కలిపి కుడిచేతి బొటన చూపుడు వేళ్ళ మధ్యగ పట్టుకొని దశగాయత్రిచేసి (పదిసార్లు గాయత్రి మంత్రమును జపించి) యథాశక్తి గాయత్రీ దేవతార్పణమస్తు అని నీటిని వదలవలెను. (బ్రహ్మచారులు ఒక ముడినే ధరించవలెను.)

గాయత్రీ మంత్రము

ఓం భూర్భువస్సువః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య
ధీమహి ధియో యోనః ప్రచోదయాత్॥

ఇపుడు యీ క్రింది విసర్జన మంత్రము చదువుతూ పాత జందెమును తీసి వేయవలెను.

ఉపవీతం చిన్నతంతుం జీర్ణకశ్మల దూషితం ।
విసృజామి యశోబ్రహ్మ వర్చోదీర్ఘాయురస్తుమే ॥

తిరుగ ఆచమనముచేసి నూతన యజ్ఞోపవీతముతో ఓపినంత అనగా కనీసం పదిసార్లైనను గాయత్రీ మంత్రము జపించి యధాశక్తి గాయత్రీదేవతార్పణమస్తు అని నీరు విడువవలెను. తదుపరి గాయత్రీ దేవతనుద్దేశించి నైవేద్యము సమర్పించి ఆ ప్రసాదమునకు నమస్కరించి స్వీకరించవలెను.

ముక్తా విద్రుమ హేమనీల ధవళచ్ఛాయై ర్ముఖైస్త్రీ క్షణైః
ముక్తామిందునిబద్ధ రత్నమకుటాం తత్వార్థ వర్ణాత్మికాం
గాయత్రీం వరదాభయాంఙ్కుశ కశాః శుభ్రం కపాలాంగదాం
శఖంచక్రమదార విందయుగళం హస్తైర్వ హన్తింభజే
యోదేవస్స వితాస్మాకంధి యోదర్మార్ధి గోచారః
ప్రేరయేత్తస్యయద్భర్గతద్వరేణ్యముపాస్మహ
యస్యాః పావన గర్భగోళ వివరాజ్జాతాశ్రుతీనాంత్రయీ

స్రష్టుః సృష్టివిధానకర్మ వివృతావాచార్యకం సందధేతాంత్వార్థ విభోదివర్ణ విభవైరుద్యోది తాత్మశ్రియమ్ గాయత్రీం శ్రుతిమాతకం పరశివాం వన్దేమసచ్చిత్కలామ్

తత్ప్రప్తకోటిమహితోజ్జ్వలమంత్రహారే
నేతామణిన్త మసిదేవి ! పరాత్మవిద్యే
తామస్పృశన్ ప్రగతిమంచతినైవకశ్చిత్
గాయత్రిఃదేవి భవతీం శరణం ప్రపద్యే॥
బ్రహ్మమను పంచకాసాం
వనకళాపార్థసర్వశస్త్రామ్
తేజస్త్రయి తినేత్రాం
ఛందోగాత్రీం భజేమగాయత్రీమ్॥

సంవత్సరములో మకర సంక్రాంతి నుండి (జనవరి14) నుండి ఆరుమాసములు ఉత్తరాయణము, మిగిలిన ఆరుమాసములు దక్షిణాయనము.

చైత్ర,వైశాఖములు	వసంతఋతువు	ఏప్రిల్-మే
జ్యేష్ట, ఆషాఢములు	గ్రీష్మఋతువు	జూన్-జూలై
శ్రావణ, భాద్రపదములు	వర్షఋతువు	ఆగస్టు-సెప్టెంబరు
ఆశ్వీయుజ,కార్తీకములు	శరదృతువు	అక్టోబరు-నవంబరు
మార్గశిర,పుష్యములు	హేమంతఋతువు	డిసెంబరు-జనవరి
మాఘ, ఫాల్గుణములు	శశిరఋతువు	ఫిబ్రవరి-మార్చి

నేను వ్రాసిన ఆధ్యాత్మిక వ్యాసాలు ఆంధ్రభూమి దినపత్రికలో 'మంచిమాట'లో ప్రచురించబడినవి, కుముదం భక్తిస్పెషల్, ధ్యానమాలిక, భక్తిసుధ, సహస్రార, ఋషిపీఠం మున్నగు మాసపత్రికలలో ప్రచురించబడిన కొన్ని భక్తి వ్యాసాలను నాకు నచ్చిన వాటిని క్రోడీకరించి భగవదన్వేషణలో భాగంగా ఇక్కడ ప్రచురిస్తున్నాను.

విభూదిధారణ

విభూది అంటే భస్మధారణ భారతదేశంలో అనాదినుండి వస్తున్న ఆచారం. సాధారణంగా స్నానంచేసిన తరువాత విభూదిని నుదుట భాగంలో మూడు అడ్డుపట్టీ లుగా పెట్టుకోవడం శ్రేష్ఠము. విభూదిధారణ అన్నిమతముల వారు చేయవచ్చును. కానీ చాలా మంది ఇదిశైవుల సాంప్రదాయంగా భావిస్తారు. కానీ ఇది నిజం కాదు. దేవునికి పూజచేసే వారెవరైనా విభూది ధరించకుండా పూజచేస్తే వ్యర్థమవుతుందని పెద్దలుచెప్తారు. అందుచేత విభూతితప్పక నుదుటధరించే పూజాపునస్కారాలుచేయాలి.

తమిళులలో మొదటనుండి విభూది పెట్టుకొనే ఆచారంవుంది. కన్నడులలో కూడా ఎక్కువమంది విభూది ధరిస్తారు. కేరళీయులు ఎక్కువగా చందనమును నుదుట ధరిస్తారు. ఆంధ్రదేశములో అయ్యప్ప సంస్కృతి, శ్రీసాయి సంస్కృతి రావ డంతో గత ఇరవై సంవత్సరాల నుండి నుదుటిపై విభూది, చందనం, కుంకుమ ధరించేవారు ఎక్కువగా కనిపిస్తున్నారు. విభూది నుదుట ధరించడంవలన ముఖానికి కొత్తకాంతి రావడమే కాకుండా వింతశక్తి దేహములో ప్రవేశిస్తుంది. తడిచేసి విభూది ధరిస్తే శక్తి ఇంకా పెరుగుతుంది. అంటే మన శరీరములోవున్న విద్యుత్‌శక్తి పెరిగి మనిషిని ఉత్తేజుణ్ణిచేస్తుంది. నిత్యము విభూది ధారణచేయువారికి రుద్రత్వం కలిగి అంత్యమందు కైలాసప్రాప్తి కలుగునని పెద్దలు చెప్తారు. తలకు స్నానం చేసినపుడు తడిచేసిన విభూది లేనప్పుడు పొడి విభూది ధరిస్తారు.

కనుబొమలమధ్య జ్ఞాననేత్రము వుండును కనుక చందనము కుంకుమ ధరించ వలెను. విభూది ధారణవలన చక్కని కాంతి, ధైర్యము, బలము చేకూరి, గ్రహపీడ అకాల మరణము వంటివి తొలగిపోవును. నుదుట వ్రాతమారే అవకాశం వుంది. నుదుట ధరించే మూడురేఖల బ్రహ్మ, విష్ణు, రుద్రులకు సంకేతంగా భావించాలి. కొందరు దీనికి సత్వ, రజస్తమో గుణములకు (త్రిగుణములకు) అతీతులుగా అభివర్ణి స్తారు. కొందరు విభూదికి ఇంకొక నిర్వచనం చెప్తారు. చనిపోయిన తరువాత ప్రతీ ఒక్కరు చివరకు బూడిదే అవుతారని తెలుసుకొని బ్రతికినన్నాళ్లు మంచిగా బ్రతకమని నుదుట విభూది గుర్తుచేస్తుందిట. విభూది ధరించడం వలన, ఔషధముగా చిటికెడు పొడి విభూది నీళ్లలో కలుపుకొని కాని సేవించడంవలన వాత, పిత్తకఫముల వలన వచ్చే రోగాలు, అనేక దీర్ఘరోగాలు నయమయే గుణముంది.

విభూదిని ఆవుపేడ పిడకలు కాల్చగా వచ్చిన భస్మము కానీ కొన్నిమేలు రకాలైన చెట్లయొక్క కట్టెలుకాల్చగా వచ్చిన భస్మము రావి మోదుగ నేరేడు మారేడు,

మామిడి, గంధం, ఉత్తరేణి, వేప మేడి మొదలగుచెట్లు)తో తయారుచేస్తారు. హోమము, యాగములు చేయుటకు పైన పేర్కొన్నవృక్షముల కట్టెలు ఆవుపేడ పిడకలు ఆవునెయ్యి వాడుతారు. హోమాగ్ని చల్లారిన తరువాత మిగిలిన భస్మమును సేకరించి విభూదిగా వాడుతారు. ఆ భస్మములో సువాసనకోసం పన్నీరు చేరుస్తారు.

విభూదిని మామూలుగా వాడినందువలనే అనేకమైన లాభాలు కలుగడమేకా కాకుండా వింతశక్తితో మనిషి ప్రవర్తిస్తాడు. అటువంటి విభూదిని కొన్ని దేవాలయము లలో భగవంతునికి అభిషేకించి ఇవ్వగానే, ఆపవిత్రమైన విభూదిలో నూతన శక్తులు ప్రవేశించి సర్వరోగనివారణ ధన్వంతరిగా పనిచేస్తుంది.

ముఖ్యంగా పళని సుబ్రహ్మణ్యస్వామి వారికి అభిషేకించిన విభూది శబరిమ లలో శ్రీహరి హరసుతుడికి అభిషేకించిన విభూదిలోను, కొన్ని శైవక్షేత్రాలలో శివుడికి అభిషేకించిన విభూదిలోను, షిరిడీలో ధుని నుండి సేకరించిన విభూదిలోను మహ త్త్యం వున్నట్లు, విభూది ధారణవలన, ఔషధంగా విభూదిని సేవించడంవలన అనేక దీర్ఘరోగముల నుండి విముక్తియైనట్లు ఎందరో చెప్పడం, అనుభవపూర్వకంగా చాలా మందికి ఇది తెలిసిన విషయమే! షిరిడీసాయిబాబా విభూదిని ఊదీ ప్రసాదమని పిలుస్తారు. కొన్ని విగ్రహములలో వింతశక్తి వుండడం వలన విభూదిని ఆ విగ్రహము లకు అభిషేకించిన తక్షణం ఆ శక్తి అభిషేకించిన విభూదికి కలిగి తలచిన కార్యములు జయము కలుగడమే కాకుండా రోగవిముక్తి కూడా కలుగజేస్తోంది.

నేడు అనేకులు విభూది మహిమను గ్రహించి, స్త్రీ పురుష జాతి భేదము లేకుండా అంతా నుదుట విభూది ధరించి భగవంతునికి చేరువవతున్నారు. శబరి మల వెళ్ళే అయ్యప్పలు అక్కడ వంటలు చేసుకొనే నూట ఎనిమిది కట్టెల పొయ్యిల నుండి భస్మము సేకరించే సాంప్రదాయం పూర్వం వుండేది. అడవులలో ఎన్నోరకాల ఔషధిచెట్లు వుంటాయి. వాటికట్టెలతో వంట చేయగా వచ్చిన భస్మము సేకరించడం వలన అందులో ఔషది గుణములు మెండుగా వుంటాయి. తరువాత ఆ భస్మమును జల్లించి శుభ్రపరచి శ్రీ అయ్యప్పస్వామికి అభిషేకించి, ఆ విభూదిని రోగగ్రస్తులకిస్తే రోగాలు ఇట్టే మాయమయేవి. స్వామివారి విగ్రహానికి అభిషేకించిన విభూది మహ త్త్యం గురించి చెప్పనలవికాదు. పళని వంటి పుణ్యక్షేత్రాలలో విగ్రహము నవపాషాణ మనే రాతితో మలచినట్లు చెబుతారు.

అలాగే అయ్యప్పవంటి పంచలోహ విగ్రహాలలోను వింతశక్తి దాగి వుండడం వలన విభూది మహత్త్యం పెరిగి ఎందరో భక్తులను విశేషంగా ఆకర్షించి లోకంలో ఇంకా మంచితనం మిగలడానికి ఎంతో దోహదం చేస్తోంది. పవిత్రమైన విభూదిని నుదుటపైన, హృదయముపైన రెండు చేతుల భుజములకు రాసుకొంటూ ఈ క్రింది మంత్రాన్ని పఠించడం మంచిదిగా చెప్తాను.

(ఆంధ్రభూమి దినపత్రిక - మంచిమాట - 7-10-2002)

❀ ❀ ❀

భగవంతుని రూపం

భగవంతుడు సర్వాంతర్యామి... ఇందుగలడందులేడని సందేహము వలదు, ఎందెందు వెదకి చూచిన అందందే భగవంతుడున్నాడని ప్రహ్లాదుడు తండ్రి హిరణ్యాకశిపునికి చెప్పి, స్తంబములో విష్ణువుని చూపమన్న, నరసింహస్వామి రూపంలో ప్రత్యక్షమై హిరణ్యకశిపుని సంహరించినట్లు భాగవతమువలన విన్నాము. పరమేశ్వరునికి ఒకరూపములేదు. మనం ఏ భావనతో తలపోస్తే ఆ రూపములో సాక్షాత్కరిస్తాడని చెబుతారు. తల్లిదండ్రి, గురువులు ప్రత్యక్షదైవాలని వారిలోనే దైవాన్ని చూసి తరించిన వారున్నారు. భర్తే ప్రత్యక్ష దైవమని భర్తలనే భగవంతునిగా ఆరాధించి తరించిన సాధ్వీమతల్లులు మనదేశంలో చాలామంది వున్నారు. "తత్వమశి" సిద్ధాంతం ప్రతినొక్కరిలో దైవాన్ని సందర్శించమని చెప్పడంలో విశేషమదే!

ఆదిశంకరులు మరొక అడుగు ముందకేసి అద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. అహంబ్రహ్మాస్మి ప్రతీ ఒక్కరూ తనలో పరమాత్మను దర్శించాలి. అలాగేయితరులలో అంటే ప్రతీప్రాణిలో పరమాత్మను దర్శించాలి. 'తత్వమసి' సిద్ధాంతాన్ని చెప్పి తన వాక్పటిమతో, రచనలతో అద్వైత మతాన్ని స్థాపించి ప్రచారం చేసారు. పెక్కు మందికి శంకరుల భావము అర్థంకాక, సిద్ధాంతము నచ్చక దూరమయ్యారు. ప్రతి జీవిలో భగవద్దర్శనం చేయగలవ్యక్తి మానవుడికి వుంటే ఈరోజు ఇన్నిరకాల అరాచకాలు, హత్యలు, ఘోరాలుజరగవు. మానవసేవే మాధవసేవని మనపూర్వీకులు చెప్పి సాటిమానవులపైన దయ, కరుణవాత్సల్యము చూపడానికి ఒకమార్గం ఏర్పాటు చేసారు.

సామాన్య జనులు, అజ్ఞానులకు, ఆత్మ, పరమాత్మల గురించి చెబితే అర్థం కాదనీ, ఒక నిర్దిష్ట రూపాన్ని, శక్తిని చూపి వారిని తరింపచేయాలనే దృష్టితో మన మహర్షులు సందర్శించిన భగవంతుని రూపాలను వర్ణించి చెబితే కొందరు చిత్రకారులు, శిల్పాచార్యులు భగవంతుని రూపానికి ఆకృతి కల్పించారు.

చతుర్ముఖబ్రహ్మ, వీణాపాణి, హంస వాహనురాలైన సరస్వతీమాత, నాలుగు చేతులతో పద్మముపై ఆశీనురాలైన మహాలక్ష్మీ స్వరూపము, చతుర్భుజుడు, శంఖు, చక్ర,గద, పద్మములతో అలరించే స్వామి మహావిష్ణువుగా అభివర్ణించారు. పన్నగ భూషణుడు, గంగాధరుడు, గజచర్మాంబరదరుడు, చంద్రశేఖరుడు, త్రిశూల పాణియైన మూర్తిని పరమశివుడని అభివర్ణించేరు. హిమగిరితనయ, లలిత, త్రిపురసుందరి, జగన్మాతరూపము, అత్యంత కరుణా రూపముగా వర్ణించి చెప్పారు. భువనేశ్వరి, రాజరాజేశ్వరిగా అమ్మను కీర్తిస్తూ స్తోత్రాలు రచించేరు. త్రిమూర్తులు ముగ్గురమ్మల రూపాలేకాక దశావతారాలలో మహావిష్ణువు రూపాలు, భారత, భాగవత, రామాయణాలలో విపులంగా వర్ణించి చెప్పారు.

సామాన్య మానవుడికి భగవంతునిమీద భక్తి కలగడానికి ధ్యానం కలగడానికి భగవంతుని చిత్రపటాలను ఇంట్లో పూజించడానికి, శిలావిగ్రహాలు, పంచలోహ

విగ్రహాలు దేవాలయాలలో ప్రతిష్ఠించేరు. నిత్యపూజలు, ధూప, దీప, నైవేద్యాలను భగవదాలయాలలో ఏర్పాటుచేసి వాటి పవిత్రతను కాపాడడానికి ఆలయపూజారులను, ఆచార్యులను నియమించి మానవులలో ఆస్తికత్వానికి మన పూర్వీకులెంతో కృషిచేసారు. నీతి, నియమాలు పాటించి, మంచి నడవడితో ప్రజలు నడవడానికి, దానధర్మాలుచేస్తూ భగవంతునికి చేరువవడానికి మన పూర్వీకులు ఎంతో కృషిచేశారు.

ఆనాటి మహారాజులు, చక్రవర్తులు ధర్మావర్తనులై దైవభక్తి పరాయణులై దేశములో ప్రసిద్ధ దేవాలయములనెన్నింటినో కట్టించి, మహర్షులతో, పీఠాధిపతులతో దేవాలయములలో విగ్రహములను ప్రతిష్ఠించి పూజా కార్యక్రమాలు,ఉత్సవాలు నిర్వహించుటకు మడులు, మన్యాలు దేవాలయాలకు అర్పించారు. దేవాలయనిర్మాణానికి దైవాన్ని ఆధారించడానికే కాకుండా పూర్వపురోజులలో దేవాలయాలు విద్యాలయాలుగా కూడా రాణించేవి. నృత్యము, గానము వంటి కళలను పోషించి ఆదరించి, నాట్యకారులకు, సంగీత విద్వాంసులకు ప్రోత్సాహమిచ్చేవారు. దేశదేశాలనుంచి శిల్పాచార్యలను పిలిచి, సుందరశిల్పాలతో మనోహరమైన శిల్పసంపదతో ఎన్నో దేవాలయాలు నిర్మించారు. ప్రతీదేవాలయములో రామాయణ, భాగవత, భారత కథలతోపాటు వివిధ రీతుల నాట్యభంగిమలు, వాద్యకారుల చిత్రాలు, శృంగార భామినులతపాటు రతిక్రీడా దృశ్యాలను కూడా శిల్పాలలో అతి మనోహరంగా మలచి, సామాన్యులకు విజ్ఞానము, వినోదము కలిగించడానికి ఎంతో తోడ్పడ్డారు.

దేవాలయములు పవిత్రంగా, ప్రశాంతంగా వుండాలని పట్టణాలకు దూరంగా, కొండలపైన అడవీ ప్రాంతాలలో నిర్మించి, బయట ప్రపంచానికి సంబంధం లేకుండా వుండడానికి ఎన్నో ప్రాకారాలు, గోపురాలునిర్మించి గర్భగుడిలో మంత్ర తంత్రములతో, ప్రజాకర్షణ యంత్రాలతో విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఆ అకర్షణ శక్తివల్లనే నేడు తిరుపతి, శబరిమల, గురువాయూరు, శ్రీశైలం, కాశీ, పూరీ జగన్నాధం, బెజవాడ కనకదుర్గ, సింహాచలం, అన్నవరం వంటి పుణ్యక్షేత్రాలు నిత్యం భక్తుల రాకతో కిటకిటలాడుతున్నాయి.

విగ్రహము శక్తి, ఆకారము, ఎత్తులపై ఆధారపడకుండా విగ్రహ ప్రతిష్టకు ముందు వుంచిన యంత్రముపైనే ఆధారపడి వుంటుంది. ప్రపంచాన్నంతా ఆకర్షిస్తున్న శబరిమల అయ్యప్ప విగ్రహం, గురువాయూరులో గురువాయూరప్ప విగ్రహం, ఉడిపి కృష్ణుని విగ్రహం, కాశీలో విశ్వేశ్వరుడు, శ్రీశైలంలో మల్లన్న ఇంకా అనేక జ్యోతిర్లింగాలు చూడడానికి చిన్నవిగా వున్నా భక్తులను విశేషంగా ఆకర్షించి, అమిత భక్తిని కలిగించి మనసును, దైవమునందే నిలిపి తరింపచేస్తాయి. తంజావూరులో బృహదీశ్వరాలయంలో కొండంత శివలింగం వున్నా భక్తితో వచ్చే భక్తులకన్నా వినోద పర్యాటనకు వచ్చే పర్యాటకులే ఎక్కువగా కనిపిస్తారు.

మానవునికి భగవంతునియందు నమ్మకం కలగడానికి, భక్తి కలగడానికి విగ్రహారాధన మనపూర్వీకులు ఏర్పాటుచేసారు. విగ్రహములో కాని పటమునందు

గాని భగవంతుని ప్రతిరూపాన్ని చూసుకొని సకల మర్యాదలను గావించి, అంటే అర్ఘ్యము, పాద్యము, అలంకరణము, ఆచమనము అన్నీ సమర్పించి నైవేద్యము, తాంబూలము కూడా సమర్పించి పూజాదికాలు చేయడం ఒక ఆచారము, సాంప్రదాయముగా పెద్దలు చెప్పారు. ఇంట్లో పూజలు స్వయముగా చేసుకొన్నా, దేవాలయాలలో అర్చకుడు నామగోత్రాలతో పూజలు జరిపించి భక్తిని ప్రేరేపించడం జరుగుతుంది. విగ్రహారాధన, పూజాకార్యక్రమాలు చేయడంవల్ల ప్రతివొక్కరిలో ఒకచోట నిలకడగా కొంతసేపు కూర్చోవడం అలవడుతుంది. భగవంతుని రూపం కన్నుల కెదురుగా కనిపిస్తూ వుండడంవల్ల, ఆ రూపము మన హృదయములోకి ప్రవేశించి కనుల మూసి కూర్చున్నా ఆ రూపము సాక్షాత్కరిస్తుంది. ఎప్పుడైతే భక్తునికి కనులు మూసుకున్నా దైవసందర్శన చేయు భాగ్యం కలుగుతుందో అప్పుడు మనసు నిశ్చల స్థితికిచేరి, నిలకడగా వున్నట్లు గ్రహించాలి. ఆ స్థితిలో విగ్రహారాధన విడచిపెట్టి, కనులు మూసుకుని ధ్యానమునకు ఉపక్రమించాలి. మనకిష్టదైవముపై మనసు నిలిపి నిశ్చల స్థితిలో ఓంకారముకానీ పంచాక్షరీ మహామంత్రంను కానీ మనసులో ఉచ్చరిస్తూ ధ్యానము చేయవలెను.

ధ్యానము చేయుటకు ప్రశాంతమైన ప్రదేశము అవసరము. భూమిపైన కూర్చొనకుండా ధర్భాసనముకానీ, జింకచర్మము లేక ఏదైనా అసనము ఏర్పరచుకొని పద్మాసనము లేక, సుఖాసనమునందు కూర్చుని ధ్యానము చేయవెను. మనసు ఏకాగ్రత్తకు ఎదురుగా కొవ్వొత్తి దీపంగానీ, ప్రణవమునుకానీ వుంచుకొనవచ్చును. బాహ్య ప్రపంచంలో సంబంధం లేకుండా సర్వమును మరచి ఏకాగ్రచిత్తముతో ధ్యానం చేయాలి. మొదట రోజుకు కొన్ని నిమిషాలుచేసి అభ్యాసముతో, అర్థగంట, గంటచేసి తర్వాత మెల్లగా కొన్ని గంటలు ధ్యానంచేసి అనిర్వచనీయమైన అనుభూతి కలుగుతుంది. సాధనతో భగవత్సాక్షాత్కారాన్ని కూడా బడయగలరు. మూడు నాలుగు గంటలు చేయుపూజకన్నా ఐదునిమిషాలు నిశ్చలమైన మనసుతో చేయు ధ్యానము గొప్పదని మహానూవులుచెప్పారు.

ఏకాగ్రచిత్తముతో ధ్యానమునకు అలవాటుపడిన ఇతర చింతలను విడనాడి భగవంతునిలో ఐక్యము చెందవలెను. తాపత్రయము పెరిగి తొలుత పిచ్చివానిలా ప్రవర్తిస్తారు. శ్రీరామకృష్ణపరమహంస, శ్రీరమణమహర్షి, శ్రీ వివేకానందులు ధ్యానములో తురీయవస్థకు చేరుకొని దైవ సాక్షాత్కారాన్ని పొందారు. ధ్యానానికి తెల్లవారు జామున 3 గంటల నుంచి 6 గంటల మధ్య కాలము ఉత్తమము. ధ్యానము ఒక ప్రదేశము చేయుటే శ్రేయస్కరం. బాహ్య ప్రపంచాన్ని మరచి ధ్యానస్థితిలో చేరువారు ఎప్పుడు ఎక్కడైనా పరిసరాలతో,కాలములో సంబంధం లేకుండా ధ్యానములో నిమగ్నమవుతారు. మహాతేజశ్వాలురుగా రూపొంది దివ్యశక్తు లను పొందుతారు. భగవంతుడు సాకారుడు, నిరాకారుడు కనుక మనకి ఎలాకావలిస్తే అలా ఆ రూపంలో సాక్షాత్కరిస్తాడు. (ఆంధ్రభూమి దినపత్రిక - మంచిమాట - 2004)

భగవంతుడొక్కడే !

భగవంతుడు ఒక్కడే ! అతనికి అనంత నామాలున్నాయి. నీళ్లను ఒక్కొక్క భాషలో ఒక్కొక్క పేరుతో జలం, పానీ, తన్నీ, వేళం అని పిలిచినట్లే భగవంతుడు రాముడు, కృష్ణుడు, శివుడు, వేంకటేశుడు అని పిలుస్తారు. మానవులలో భేద గుణాలు వున్నాయి కానీ పరమాత్మలో లేవని శ్రీరామకృష్ణ పరమహంస వంటి మహనీయులు చెప్పినా నేటికీ ఇంకా కొందరు శివకేశవులకు భేదము కలిగించి శివుడు గొప్ప, రాముడు గొప్పని వాదులాడుకోవడం విడ్డూరంగా కనిపిస్తుంది.

శ్రీరామచంద్రుడు రవణ వధానంతరం, ఋషుల ఆదేశం మేరకు రామేశ్వ రంలో శ్రీరామలింగేశ్వరస్వామి పేరుతో లింగాన్ని ప్రతిష్ఠచేశారు. ఆలింగం ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటిగా భాసిస్తోంది.

శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే
శివస్య హృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయం శివః
యధా శివమయో విష్ణుః దేవం విష్ణుమయః శివః
యదాంతరం న పశ్యామి తథాయే స్వస్తి రాయుషి

శివుడు విష్ణురూపుడు, అట్లే విష్ణువు శివరూపుడు. శివుని హృదయమే విష్ణువు. విష్ణువు హృదయమే శివుడు. విష్ణు యెట్లు శివమయుడో, అట్లే శివుడు విష్ణుమయుడు. వీరిరువురికి భేదములేదు. ఇట్టి భావమే కలిగి, వీరికి వ్యత్యాసం ఏమాత్రం లేదని తెలిసికొన్నప్పుడే నీకు ఆయుశ్శుభములు కలుగునని దీని అర్థము.

ఒకసారి పరమశివుడు నిత్యం శ్రీరామ జపం చేస్తున్నట్లు, అందులోనే తాను లీనమై ఆనందిస్తున్నట్లు పార్వతీదేవికి చెప్పినట్లు వ్యాసభగవానుడు శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్ర ఉత్తరభాగంలో తెలియజేసెను.

'శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే'

సుందరవదనా! శ్రీరామ రామ రామయని మనోహరుడైన రామునిలోనే నేను రమిస్తున్నాను. ఆ రామనామం సహస్రనామానికి సమానం అని పరమశివుడే పార్వతికి తెలియజేశారు.

పార్వతీ పరమేశ్వరుల అనుగ్రహ పుత్రుడైన విఘ్న వినాయకుడు విష్ణు అంశతో జన్మ పొందేడని ఒకకథ వుంది. అందుకే విఘ్ననాయకుని 'శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం' అని ప్రార్థన చేస్తాము. చిన్నికృష్ణుడు బాల్యములో ఒంటినిండా మట్టిపూసుకొని, శిఖను నెమలిఫించము, కస్తూరి తిలకము, కౌస్తుభవముతో కనిపిం చిన బాలకృష్ణుని చూస్తూవుంటే ఆయన రూపంలో శివుడు గోచరమయ్యేడని పోతనా మాత్యులు చక్కని పద్యాన్ని చెప్పారు. చివరిలో విష్ణువుకి శివునికి భేదము లేదని తేల్చిచెప్పాడు.

"చేతులారంగ శివుని పూజింపదేని నోరు నొవ్వంగ హరికీర్తినుడవడేని
తనువు నంటిన ధరణి పరాగంబు పూసిన నెటిభూతిపూతలాగ
ముందర వెలుగొందు ముక్తాలలామంబు తొగల నంగడికాని తునుకగాగ
పాలభాగంబుపై పరగుకావినిబొట్టు కాముని గెలిచిన కన్నుగాగ
హారవల్లుబరగ హారనట్లులుగాగ బాల లీల ప్రౌఢ బాలకుండు
శివుని భంగినొప్పె శివునికి దనకును వేరలేమితెల్పవెలియునట్లు

శివకేశవులకు భేదములేదని, వారిరువురూ ఎప్పుడూ ఒక్కటిగా నుంటారని శ్రీ ఆదిశంకరాచార్యులు తెలియజేస్తూ విష్ణు సహస్రనామాలకు భాష్యం చెప్పి, శ్రీ లక్ష్మీ నరసింహస్తోత్రము, శ్రీరామస్తోత్రము, శ్రీకృష్ణ స్తోత్రము, కనకధారా స్తోత్రము, వంటి అమూల్యభక్తి రచనలతో హిందూ మతం పతనం కాకుండా అద్వైత సిద్ధాంత తంతో రక్షించారు. శ్రీరామచంద్రుని భక్తుడు చరణదాసుడైన హనుమంతుడు శివాంశ సంభూతుడు. పరమశివుని కోసం మహావిష్ణువు రెండుసార్లు మోహినీ అవతారం ఎత్తేడు. పరమశివుడు లోకకల్యాణార్థమై నటరాజుగా నృత్యం చేస్తూవుంటే మహా విష్ణువు తన్మయత్వంతో మద్దెలవాయిస్తే, సరస్వతీదేవి వీణాగానం చేసినట్లు చెప్తారు.

ప్రసిద్ధి గాంచిన చిదంబర క్షేత్రములో నటరాజు దేవాలయము పక్కనే శ్రీ మహా విష్ణువు కొలువుదీరి వుంటాడు. ఓంకారేశ్వర క్షేత్రంలో దేవాలయముపై శ్రీకృష్ణుని విగ్రహాలున్నాయి. కాశీక్షేత్రంలో శ్రీ విశ్వేశ్వరునిసేవించే భక్తులు త్రిదళాలైన మారేడు దళాలపై శ్రీరామ అని సింధూరంతో వ్రాసి పూజిస్తారు. కాశీవిశ్వేశ్వర ఆలయంలో శ్రీరాముని ప్రతిమ కనిపిస్తుంది. తులసీదాసురాసిన రామాయణాన్ని కాశీ విశ్వేశ్వరునికి అంకితం చేశాడు.

రుక్మిణీదేవి శ్రీకృష్ణుని వివాహమాడడానికి గోపికలు శ్రీకృష్ణుని అనుగ్రహం పొందడానికి కాత్యాయనీ వ్రతం చేసారు. గోదాదేవి శ్రీవ్రతము (కాత్యాయనీ వ్రతం) ఆచరించి శ్రీరంగనాథుని భర్తగా పొందింది. శివకేశవులకు భేదము లేదని యిలా ఎన్నైనా చెప్పుకోవచ్చు. ఇప్పటికైనా పీఠాధిపతులు, మతాధిపతులు అనవసర చర్చను వీడి, హిందూ మతాన్ని రక్షించడానికి పూనుకొంటారని ఆ భగవంతుడు వారిలో సద్భావన కలిగించాలని ప్రార్థిస్తున్నాను. ఓమ్ తత్ సత్ !

(ఆంధ్రభూమి దినపత్రిక – మంచిమాట – 15-4-2004)

❁ ❁ ❁

శరణాగతి

"మన్మనాభవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు
మామే వైవ్యసి నత్యంతే ప్రతిజానే ప్రియోసిమే"

ఈ శ్లోకము శరణాగతిని బోధిస్తుంది. నీవు నాతో ఏకమగుము. నాకొరకు త్యాగము చేయుదు. నా ముందు మోకరిల్లుము. ఆవిధముగా నాతో ఐక్యత పొందిన పిదప నీవు తప్పక నన్ను చేరుదువు.

అనన్యాశ్చిన్త యన్తో మాంయే జనాః పర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్॥

ఎవరు ఇతర భావములు లేనివారై నన్ను గురించి చింతించుచు, ఎడతెగక ధ్యానించుచున్నారో, ఎల్లప్పుడు నాయందే నిష్ఠగలిగి వుందురో, వారియొక్క క్షేమము లను నేనే వహించుచున్నాననియు చెప్పెను. గజేంద్రుడు, మొసలి బారినుంచి తప్పించు కొనడానికి విశ్వప్రయత్నంచేసి, చేతకాక పరమేశ్వరుణ్ని శరణుజొొచ్చి ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై అంటూ స్తుతించి, చివరకు లా ఒక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యె, బ్రాణంబులన్ ఠావుల్ దప్పెను మూర్ఛవచ్చె, అని ప్రార్థించేసరికి వైకుంఠవాసుడు సిరికి చెప్పకుండా, శంఖుచక్రములు లేకుండా భక్తుని కాపాడేందుకు బయలుదేరేడని శరణాగత వత్సలుని గురించి పోతనామాత్యుడు అతి మధురంగా చెప్పేడు. ధృతరాష్ట్రునికి నిండు కొలువులో ద్రౌపది వస్త్రాపహరణ దుశ్శాసనుడు చేస్తూవుంటే, చేతులెత్తి ద్రౌపది 'హేకృష్ణా' అని శరణు వేడగానే శ్రీకృష్ణ పరమాత్ముడు అక్షయ వలువలనిచ్చి ఆమె మానాన్ని కాపాడేడు. హిరణ్యకశిపుడు, ప్రహ్లాదుని నోటపదే పదే పలుకుచున్న నారాయణ శబ్దము వినలేక ప్రహ్లాదుని అనేక హింసలకు గురిచేసేడు. ఎన్ని హింసలను పెట్టినా ప్రహ్లాదుడు, నారాయణుని శరణువేడడంవలన అతనిని ఏమీ బాధించలేదు.

దుర్వాస మహాముని అంబరీషుని దారుణంగా శపించినను, అంబరీషుడు నారాయణుని శరణుజొచ్చడంవలన శాపఫలాన్ని నారాయణుడే గ్రహించి, సుదర్శన చక్రాన్ని దుర్వాశునిపై ప్రయోగించి, శరణాగతవత్సలుడై అంబరీషుని కాపాడేడు. కుంతీదేవిని శ్రీకృష్ణుడు ఒకసారి వరమేదైనా కోరుకొనుమని అడిగితే, కుంతీదేవి శరణాగత వత్సలుడైన శ్రీకృష్ణునికి నమస్కరించి, 'కష్టాలు ఎప్పుడూ యిలాగే వుండేటట్లు ఆశీర్వదించమని' అడిగిందట. అంటే కష్టాలలో దైవాన్ని ప్రార్థిస్తూ, దైవానికి సన్నిహితంగా వుంటామని ఆమె భావన. కష్టాలలో వున్న భక్తులను వారి మనోగతాన్ని గ్రహించి భగవంతుడు ఆదుకొన్న సందర్భాలు చాలా వున్నాయి. కుచే లుడు, కటిక దరిద్రంతో అలమటిస్తున్నా శ్రీకృష్ణ భగవానుని సంపదలు కోరలేదు. అయినా పరమాత్ముడే వారికి సకల ఐశ్వర్యములనిచ్చి కాపాడాడు. శంకరాచార్యుల వారు బిచ్చమెత్తుకుంటూ ఒక గృహస్తుని ఇంటికి వెళ్ళి బిక్షాందేహీ అని యాచించేడు. ఆ గృహస్తు కటిక దరిద్రము అనుభవిస్తూ ఇంట్లో బిచ్చం వేయడానికి ఏమీ కనిపించ లేదు. చివరకు గూటిలో ఎండిన ఉసిరికాయ కనిపిస్తే, బిక్షం లేదని చెప్పకుండా, ఆ ఇల్లాలు దీనవదనంతో ఆ ఉసిరికాయను భిక్షాపాత్రలో వేసింది. శంకరాచార్యుల వారు వారి ధీనావస్తనుచూసి ఎంతో పరితపించి 'వందే వందారు మందార మిందిరానంద కందలమ్' అని కనకదారాస్తవము పఠించి మహాలక్ష్మి దేవిని ప్రసన్నం చేసుకొని కటిక దరిద్రములో అలమటిస్తన్న ఆ ఇల్లాలు ఇంట్లో కనకవర్షాన్ని (బంగారు ఉసిరి కాయలు) కురిపించి, వారికి సకల సంపదలు కలుగజేసేరు. అడగపోయినా

ఆదుకోవ డం కూడా పరమాత్ముని లీల. భక్తితో గజేంద్రుడిలా ఇతరచింతలు లేకుండా ఆ పరమాత్మునే శరణువేడి కొలిస్తే, శరణాగత వత్సలుడు, ఆపద్బాంధవుడు, అనాథ రక్షకుడు, అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, ఆశ్రిత రక్షకుడు, సమస్త అపరాధ ములను మన్నించి ఎక్కడున్నా పరుగునవచ్చి భక్తుని కాపాడుతాడు.

ఇందులో సందేహంలేదు. కానీ మానవుడిలో ఓర్పు, సహనం లేక అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతూ, రకరకాల ఆలోచనలతో, ఎవరినీ పూర్తిగా నమ్మక అధోగతి, పాలవుతున్నారు. శరణాగతవత్సలుడని ఆ దైవాన్నే నమ్ముకొని శరణాగతి అంటే ఆయన కృపకు పాత్రులవుతారనడంలో సందేహంలేదు. ఓమ్ తత్ సత్!

(ఆంధ్రభూమి దినపత్రిక – మంచిమాట – 19–1–2003)

❀ ❀ ❀

సర్వే జనాః సుఖినోభవంతు

స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం న్యాయేన మార్గేణ మహీం మహేశాః

గోబ్రాహ్మణేభ్య శ్శుభమస్తు నిత్యం లోకాసమస్తా స్సుఖినోభవన్తు

ధర్మస్య విజయోస్తు–అధర్మస్యనాగోస్తువాణీషు సద్భావనాస్తువిశ్వస్య కల్యాణ మస్తు

హిందువులు ఏ పూజా కార్యక్రమాలు నిర్వహించినా, ఏ వ్రతమాచరించినా, ఏ భగవానుని ఏ రీతిగా కీర్తించినా, తన సుఖ సంతోషాలతోపాటు, కుటుంబంలో అందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరుతూ, ఇంకా లోకంలో వున్న సమస్త జనులే కాకుండా, మానవులకు సేవలందిస్తున్న జంతుజాలమునకు అందరకు శుభము కలగాలని, అందరూ సుఖ శాంతులతో జీవనము గడుపుతూ హాయిగా వుండాలని దైవాన్ని ప్రార్థించడం మన హిందూ సాంప్రదాయం, ఏదేశంలో లేని సంప్రదాయం మనదేశంలోనే వుండడం విశేషం.

ధర్మానికి విజయం కలగాలి. అధర్మంనశించాలి. ప్రపంచమంతా శాంతితో వర్ధిల్లాలి అని కోరుకోవడం చూస్తే భారతీయుల హృదయం వైశాల్యం ఎంత పెద్దదో ప్రతీ ఒక్కరికీ అవగతమౌతోంది. అంటే వారు చేసే పూజలు, ప్రార్థనలు వారి స్వార్థ ప్రయోజనాలకు కాకుండా లోకహితానికి కూడా చేస్తున్నారని గ్రహించాలి.

ఆవిధంగా లోకకళ్యాణార్థం యజ్ఞ యాగాలు చేయడం, పూజలు నిర్వహించ డం మనకి ఆదినుంచి వస్తున్న సంప్రదాయం. నేడు కలి ప్రభావం ఎంతవున్నా మానవుల నీతి బాహ్యులై ప్రవర్తిస్తున్నా ఇంకా ధర్మము నశించకుండా వుందంటే కొందరు ధర్మాత్ములు నిస్వార్థంగా చేసే పూజల సత్ఫలితమనే చెప్పాలి.

మానవసేవ యందు నమ్మకము లేని మతమును విశ్వసించకూడదు. ఏ మతమైనా మానవసేవే మాధవసేవగా గుర్తించిననాడే అది విలసిల్లుతుంది. సంకుచిత

భావాలు, అసూయాద్వేషాలు, మూర్ఖత్వము వలనే నేడు మతకలహాలు చెలరేగుతున్నాయి. భగవంతుడే స్వయంగా నారద మునీంద్రునికి చెప్పిన పలుకులు విశ్వసించి ప్రతీ ఒక్కరూ ఆ స్వర్వాంతర్యామియైన భగవంతుని మనసారా పూజిస్తే ఆయన అనుగ్రహం కలుగుతుంది. భక్తులు గానము చేసినచోట భగవంతుడు అక్కడవుండి పూజలందుకొంటాడు.

మద్భక్తాయత్ర గాయంతి తత్ర తిష్ఠామి నారద
అనన్యాశ్చిన్తయన్తోమాం యేజనా పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమ వహామ్యహమ్.

ఎవరు ఇతర భావములేనివారై నన్ను గురించి చింతించుచు, ఎడ తెగక ధ్యానించుచున్నారో ఎల్లప్పుడు నాయందే నిష్ఠ కలిగియుందురో, వారి యోగక్షేమాలను నేనే వహించుచున్నాననియు చెప్పెను. ఎన్నో జన్మలలో చేసిన పుణ్య ఫలంవలనే మానవ జన్మ లభిస్తుందని అన్ని జన్మలలోకన్నా మనావ జన్మ ఉత్కృష్టమైనదని భగవంతుని అన్వేషించడానికి ఆలోచించే మేధాశక్తిని మానవునొక్కొక్కడికే భగవంతుడు వరప్రసాదంగా ఇచ్చేడని చెప్తారు.

మానవుడిగా జన్మించినందులకు సాటిమానవులకు సాయపడుతూ, దాన ధర్మాలు ఆచరిస్తూ నలుగురికి ఉపయోగపడే మంచి పనులుచేస్తూ, అత్యాశలకు పోకుండా వున్నదానితో తృప్తిపడి నిజాయితీగా జీవితం సాగిస్తే ఆనందం స్వంతమవుతుంది.

మానవుని జీవితకాలం 80 నుంచి 100 సంవత్సరాలైతే నలభయ్యోపడిలోకి వచ్చేసరికి వార్ధక్యసూచనలు పొడసూపి, ముందు కళ్ళచూపు తగ్గడంతో ప్రారంభమవుతుంది. తరువాత జుత్తు తెల్లబడటం, పళ్లుఊడడం, నిస్సత్తువ ఆవహించి మనిషి నిర్వీర్యుడవుతాడు.

ఇంకా పూర్వజన్మ వాసనలు ఏమైనావుంటే ఒక్కొక్కసారి నలభై ఏళ్ళు రాకుండానే శరీరరుగ్మతలైన మధుమేహము, రక్తపోటు, గుండెకు సంబంధించిన జబ్బులు సోకి బ్రతికివుండగానే నరకాన్ని చూడవలసి వస్తుంది. అందుచేత వార్ధక్యపు ఛాయలు పొడసూపక ముందే శరీరంలో కండబలం తగ్గకుండా వున్నప్పుడే సర్వాంతర్యామియైన ఆ పరమేశ్వరుని సేవించి తరించాలి. రోజూ మనం మిగతా పనులన్నీ ఎలా మానకుండా చేస్తున్నామో అదేవిధంగా భగవన్నామ స్మరణకు ఉదయం కొంత సమయం, సాయంకాలం కొంత సమయం కేటాయించి భక్తితో దైవాన్ని ధ్యానిస్తే భగవంతుడు వారిని అనుగ్రహించి, అంత్యమందు మోక్షాన్ని ప్రసాదిస్తాడు. అడవిలో కూర్చుని ముక్కుమూసుకుని తపస్సాచరించ నవసరంలేదు. ఈ కలియుగంలో యజ్ఞాలు, యాగాలు చేయనవసరంలేదు. ఓమ్ తత్ సత్!

(ఆంధ్రభూమి దినపత్రిక – మంచిమాట – 21–5–2002)

❁ ❁ ❁

ప్రవచనాలు

ఈ రోజులలో ఇంకా కొంత నీతి–నిజాయితీ, మంచి,చెడు,పాపం,పుణ్యం దానం ధర్మం భగవంతునిపట్ల భయం, భక్తి వున్నాయంటే నేడు కొందరు మహానుభావులు చెప్పే ప్రవచనాలే కారణంగా చెప్పవచ్చు. పాఠశాల,కళాశాల పుస్తకాలలో పాఠ్యాంశాలుగా పూర్వకాంచెప్పే నీతి శతకాలు, భర్తృహరి సుభాషితాలు, రామాయణ, భారతభాగవత కథాంశాలు నేటి ప్లిలలకు సెక్యులరిజం పేరుతో బోధించడంలేదు. పాఠ్యగ్రంథాలే చదవడానికి టైము చాలని పిల్లలు ఇక నీతి శతకాలు, రామాయణ, భాగవత గ్రంథాలు, చదివే అవకాశములేదు. దానికితోడు నేడు ప్రతిఇంట్లో వున్న బుల్లితెర కార్యక్రమాలే ఎక్కువగా పిల్లలను, పెద్దలను ఆకర్షించి పెడతోవను పట్టిస్తున్నాయి.

లోకోద్ధారణకోసమో, భగవత్సేవ పేరునో, స్వార్థప్రయోజనం పొట్టకూటి కోసమో మరి ఏ ఉద్దేశ్యంతో సన్యాసులు, బబాలుగా మారినా ఆణిముత్యాల వంటి వారి ప్రవచనాలు కొందరినైనా పతనావస్థ నుంచి రక్షించి సన్మార్గులుగా తీర్చి దిద్దుతున్నాయనడంలో సందేహంలేదు. ఈ మధ్య కొందరు ఉన్నతవిద్య అభ్యసించి, హిందూమతము, భారతీయ సంస్కృతి, దేశభక్తితో పతనమవుతున్న మన సంస్కృతిని, మన ఆచారాలను, సాంప్రదాయాలను పునరుద్ధరించాలని కంకణం కట్టుకని ఉన్నత పదువులను, ఉద్యోగాలను కూడా వదులుకొని వారి అమూల్య రచనలద్వారా, ప్రవచనాలద్వారా భారతీయ సంస్కృతిని కాపాడి, ప్రజలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఆ మహనీయులకు కోటి ప్రణామాలు.

ప్రవచనాల ప్రభావం ఎలా వుంటుందో నా జీవితంలో కొన్ని సంఘటనలు, అనుభవాలు తెలియజేస్తాను. ఒకసారి హైదరాబాద్ నల్లకుంటలోవున్న శంకరమఠం భక్తులతో కిక్కిరిసి వుండడం చూసి లోనికివెళ్ళాను. అక్కడ శ్రీ శృంగేరి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థులవారి ప్రవచనాలు జరుగుతున్నాయని విని అక్కడ కూర్చుని ఆరోజు ఆయన ప్రవచనాలువినే భాగ్యం కలిగింది. ఆరోజు ఆయన ప్రవచనాలలో ఆచరాలు వ్యవహారాల గురించి చెబుతూ, మంత్రాలలో వున్నతమైనది, శ్రేష్ఠమైనది, సులువైనది యైన గాయత్రీ మంత్రాన్ని సంధ్యావందనాన్ని నేడు నిత్యం చేయవలసినా పౌరులు చేయడం లేదని ఎంతో బాధపచెందుతూ చెప్పారు. నేడు ఎవరైనా నువ్వు సంధ్యావందనం ఎందుకు చేయలేదని అడిగితే, వెంటనే టైమ్ సరిపోదని సమాధానం చెబుతారని, నిజానికి టైము సరిపోవడంకాదని, వారికి చేయాలని దృఢసంకల్పము లేకపోవడమే కారణమని చెప్పారు. ప్రతిరోజు 24 గంటలలో అర్థగంటసేపు సంధ్యా వందనం చేయడానికి, భగవధ్యానము చేయడానికి మాత్రం వారికి టైముండదు. అంటే చేయా లనే తపన, కోరిక వారికి కలగడంలేదు అని చెప్పగా విని ఆ మరునాడే పుస్తకాల షాపులో సంధ్యా వందనం పుస్తకంకొని తెలిసిన బ్రాహ్మణుని ద్వారా నేర్చుకుని సంధ్యావందనం ప్రారంభించాను. అది వీలుకాకపోతే కనీసం 108మార్లు

గాయత్రీ మంత్రం జపం చేస్తున్నాను. మరొక మిత్రుడు తనకు బాల్యం నుంచి శివకేశవులలో ఎవరు గొప్ప ఎవరిని సేవిస్తే ఎక్కువ ఫలితాలు కలుగుతాయని ఆలోచిస్తూ ఎవరినడిగినా సరియైన సమా ధానం చెప్పలేకపోయారని, ఆ సందేహాన్ని ఎంతో చక్కగా షణ్ముగశర్మగారు తన ప్రవచనాల ద్వారా నివృత్తి చేసారని చెప్పి ఆనందించాడు.

శ్రీ విద్యా ప్రకాశానంద గిరిస్వామి భగవద్గీతలో సారాన్ని చెబుతూ, సాత్వికాహారం,మితాహారం తినాలని, తినే పదార్థాలు కూడా కావలసిన దానిలో సగభాగముతోనే కడుపునింపుకొని మిగతా పావుభాగము నీరుత్రాగాలని, పావుభాగము కడుపులో కాళీ వుంచి గాలితో నింపాలని, ఇలా చేయడంవలన ఏ జబ్బులు రావని భగవంతునిపై ఏకాగ్రత పెరుగుతుందని చెప్పారు.

ఎందరో నేడు మహాత్ముల ప్రవచనాలు విని యోగ, మెడిటేషన్‌వంటివి నేర్చుకొని కొన్ని దీర్ఘవ్యాధులనుంచి కూడా విముక్తులవుతున్నారు. మనశ్శాంతని పోగొట్టుకున్నవారు, ఆఫీసులు, ఇళ్లల్లో వచ్చిన గొడవలతో సతమతమయ్యేవారికి మహాత్ముల ప్రవచనాలు వారి మనసుకి ఊరట కలిగించడమే కాకుండా ఎంతో ప్రశాంతతని కలిగించి ఆనందంగా వుండగలుగుతున్నారు.

గుడ్డిలో మెల్ల నయమన్నట్లు ఇంట్లో బుల్లి తెరపెట్టి చెత్త కార్యక్రమాలతో ఊదరగొడుతున్నా ప్రతిరోజు ఉదయం సుప్రభాత సేవగా కొందరు మహాత్ముల ప్రవచనాలు వినిపించడం మెచ్చుకోదగ్గ విషయం. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలన్నీ తెల్లవారుజామున ఐదున్నర గంటలనుంచి ఆరున్నర, ఏడులోపు ముగించడంవల్ల చూసేవారు తక్కువమంది వుంటున్నారు. మహాత్ముల ప్రవచనాలు చెప్పేటపుడు కుటుంబసభ్యులను, పిల్లలను తీసుకువెళ్ళడంవలన వారికి పురాతన సాంప్రదాయాలు,ఆచారాలు, దానధర్మాలవలన కలిగేఫలితాలు, మంచిచెడు తెలుసుకొని ఉత్తమ భారతీయులుగా, భావిపౌరులుగా తయారవడానికి దోహదం చేసినవారమవుతాము.

నేడు చాలా ఇళ్లల్లో శుచి శుభ్రత లోపిస్తున్నాయి. బయట ఎక్కడెక్కడో తిరిగి వచ్చి కాళ్లూ చేతులైనా కనీసం కడుక్కోకుండా, తొడుక్కున్న బట్టలతో, బయట తిరిగిన చెప్పులతో భోజనాలు, టిఫిన్లు చేస్తున్నారు. ఇది అనారోగ్యహేతువు. రోగాలకి ఆహ్వానం పలకడమేనని వేరే చెప్పనక్కర్లేదు. ఎంత టేబుల్ మీల్స్ తిన్నా శుచి శుభ్రత పాటించాలి. అన్నం వండేవారు, వడ్డించేవారు కూడా స్నానాదులు చేసి, శుభ్రమైన దుస్తులు ధరించి మంచి చింతనతో లేక భగవధ్యానముచేస్తూ వండి వడ్డిస్తే అదే మహా ప్రసాదమై తినేవారికి ఒంటబట్టి ఆరోగ్యాన్ని ఆనందాన్ని కలిగిస్తాయి. శుచి శుభ్రత వున్నచోటే మహాలక్ష్మి వుంటుందని మహాత్ములు పదే పదే ప్రవచనాలలో చెబుతున్నారు.

(ఆంధ్రభూమి దినపత్రిక – మంచిమాట – 2–3–2005)

నమ్మకం ముఖ్యం

ఈ రోజులలో చేసే వ్రతాలు, పూజలు, దీక్షలు అన్నీ మొక్కుబడిగానే సాగుతున్నాయి. కానీ శ్రద్ధాభక్తులతో, నమ్మకంతో చేసేవారు అరుదుగా కన్పిస్తున్నారు. ఏ స్తోత్రమైనా, వ్రతమైనా దీక్షైనా నమ్మకంతో చేస్తే సత్ఫలితాల్ని యిస్తాయి. మన పురాణాలలో, మహర్షులు రచించిన స్తోత్రాలలో ఎన్నో రహస్యాలు దాగివున్నాయి. భగవద్గీత, విష్ణు సహస్రనామ స్తోత్రాలలో కొన్ని శ్లోకాలను నమ్మకంతో శ్రద్ధాభక్తులతో పఠిస్తే సంతానం లేనివారికి సంతానం, రోగాలతో బాధపడేవారికి విముక్తి, ధనలాభం, ఋణవిముక్తి వంటివి కలుగుతాయి. అలాగే లలితా స్తోత్రము చేసిన రహస్య విషయాలను హయగ్రీవుడు అగస్త మహర్షికి ఎరిగించినట్లు మనకు తెలుస్తోంది.

భార్యాభర్తలు సఖ్యతగా లేకపోయినా, నిత్యం పోట్లాడుకుంటున్నా శ్రీలలితా సహస్రనామ స్తోత్రపారాయణంవల్ల ఇద్దరూ కలిసి అన్యోన్యంగా కాపురం చేస్తారని తెలుస్తోంది. తలచిన కార్యాలు పూర్తి కావాలన్నా, దృష్టిదోషాలు, ఇతర దోషాలు పోవాలన్నా శ్రీలలితా సహస్రనామస్తోత్రము కొన్నాళ్లు, భక్తిశ్రద్ధలతో నమ్మకంతో చేస్తే సత్ఫలితముంటుంది. గొడ్రాళ్లు, సంతానం లేనివారు రావిచెట్టు చుట్టు 108 ప్రదక్షిణలు చేయడంవలన సంతాన వంతులవుతారు. చెట్లే ఔషధాలు, మాటలే మంత్రాలు, ఏ చెట్టులో ఏ ఔషధముందో, ఏ మాటలో ఏమంత్రముందో తెలుసుకొని నమ్మకంతో చేస్తే దీర్ఘరోగాలు మటుమాయమవుతాయి.

కొందరు మేము ఎన్నితీర్థయాత్రలుచేసినా, పూజలు వ్రతాలుచేసినా సత్ఫలితాలివ్వడం లేదని వాపోతుంటారు. తీర్థయాత్రలు వినోద యాత్రలా మొక్కుబడిగాచేసి, భగవంతుని సన్నిధిలో కూడా అన్యచింతనలతో వుంటే ఫలితం దక్కదు. ఏకాగ్రతతో భక్తిశ్రద్ధలతో స్వామివారిని సేవించాలి. శ్రీ సత్యనారాయణవ్రతం చేయడానికి పీటల మీద కూర్చుని అన్యమనస్కంగా ఏదో ఆలోచిస్తూ కబుర్లు చెబుతూ పురోహితుడు చెప్తున్నట్లు చేయడంవల్ల ప్రయోజనం శూన్యం. ఏకాగ్రత, భక్తిశ్రద్ధలు లేకుండా యాంత్రికంగా నూటికి తొంభై తొమ్మిదిమంది వ్రతాలుచేస్తారు. అవి మొక్కుబడి వ్రతాలు, పూజలు అవుతాయి. కానీ కోరికలు ఫలించవు. కోరికలు ఫలించాలంటే నమ్మకం శ్రద్ధాభక్తులు కావాలి. ఈ రోజులలో చాలామంది దీక్షలు, పూజలు చూస్తూవుంటే బేషజాలకే ఎక్కువ ప్రాధాన్యత యిస్తున్నట్లు కన్పిస్తుంది. నియమ నిబంధనలను సక్రమంగా పాటించరు. అన్నిటినీ సడలిస్తూ వారికి అనుకూలంగా వుండేటట్లు చేయడంవలనే ఆశించిన ఫలితాలు దక్కడంలేదు. నలభైరోజులుదీక్ష చేయాలంటే దీక్షను వారికి అనుకూలంగా మూడు రోజులు, వారంరోజులు, 21 రోజులు చేసేవారు నేడు ఎక్కువయ్యారు. సాత్వికాహారం, మితాహారం తినాలని, చన్నీటి స్నానం చేయాలని, దుర్వ్యసనాలను వీడాలని కనీసం దీక్షలో పాటించమని చెప్పినా అన్నిరకాల ఆహారాలు తినేవారు కారాకిళ్లీలు, జర్దాలు, పాన్‌పరాగ్‌లు నమిలేవారు, పొగత్రేగావరు అక్కడక్కడ దర్శన మిస్తుంటారు.

మన మహర్షులు మానవులు సుఖంగా, హాయిగా బ్రతకడానికి ఎన్నో మంత్రములు, ఆయుర్వేద మూలికావైద్యము మనకి ప్రసాదించారు. వాటిపై నమ్మకంలేక పోవడంవల్లనే నేడు మనం అధోగతి పాలవుతున్నాము. గోమూత్రములో, ఆవుపేడలో, ఆవుపాలలో, ఆవునేతిలో ఎంతో పవిత్రత, రోగనివారణ గుణము వున్నాయని మన పూర్వీకులు ఎన్నడో గుర్తించారు. గంగజాలములో పవిత్రతనెరిగి మనపూర్వీకులు గంగ విశిష్టతను ఎప్పుడో లోకానికి తెలియజేశారు. కాలుష్య నివారణకు, సకాలంలో వర్షాలు కురియడానికి యజ్ఞయాగాదులచేసి, ఆవుపేడతోచేసిన పిడకలు, ఆవునెయ్యి హోమాగ్నిలోవాడి కాలుష్య నివారణచేసేవారు.

విష్ణు సహస్రనామ స్తోత్రము, లలితా సహస్రనామస్తోత్రము, ఇతర దేవతా స్తోత్రములు పఠించేముందు అచ్చుతప్పులు వుంటే తెలిసిన వారి ద్వారా సరిచేసుకొని ఉచ్ఛారణ కూడా జాగ్రత్తగా గమనించి, స్పష్టంగా పలుకుతూ స్తోత్రం చేయాలి. తప్పులతో స్తోత్రం చేయడం వలన సత్ఫలితాలు ఇవ్వకపోగా ఒక్కొక్కసారి చెడు జరిగే అవకాశాలు కూడా వున్నాయి. అందుకే కొత్తగా స్తోత్రాలు చదవదలచినవారు, అనుభవము వుండి తెలిసినవారి నుంచి నేర్చుకోవాలి. నేడువచ్చే పుస్తకాలలో అచ్చు తప్పులు ఎక్కువగా వుంటున్నాయి. ఏది చేసినా నమ్మకంతో చేయాలి. అప్పుడే సత్ఫలితాన్ని పొందుతారు.

పూజలు చేయించేవారు. చేసేవారు కూడా శ్రద్ధగా చేయాలి. పూజలు చేసే వారికి శ్రద్ధాభక్తులు లేకపోతే చేయించే పురోహితుడు కూడా టూకీగా చేయించి, దక్షిణ తాంబూలాలు స్వీకరించి వెళ్తాడు. ఒక్కక్కసారి పురోహితునికి అర్జెంటు పని వున్నా, వేరేచోట పూజలున్నా త్వరగాచేసి సక్రమంగా పూజ సక్రమంగా జరగలేదని మనోవేదనతో కృంగిపోతారు. పూజావ్రతములు శ్రద్ధాభక్తితో చేసి దాని ఫలితాన్ని భగవంతునికే సమర్పించాలి. అందుకే పూజలయ్యాక సర్వం శ్రీకృష్ణార్పణమస్తు! అనో శ్రీ పరమేశ్వరార్పణమస్తు! అనో అక్షంతలు నీళ్లు తీసుకొని పళ్లెంలో దారపోయడం మన సాంప్రదాయం. అలా చేస్తే భగవంతుడు మెచ్చి మన కోరికలు ఈడేరుస్తాడని భక్తుల నమ్మకం. దేనికైనా నమ్మకం కలగాలి.

సద్గురు శివానందమూర్తిగారు సామవేదం షణ్ముగశర్మగారు వంటి పురుషోత్తములు నేడు పురాణాలలో మరుగునపడిన ఎన్నో రహస్యాలను, విశేషాలను వెలికితీసి వాటిని తమచక్కని ఉపన్యాసాలతో, రచనలతో అణగారిపోయిన హిందూ తత్వాన్ని, భారతీయ సాంప్రదాయాన్ని వెలుగులోకి తెస్తున్నారు. పామరులకు కూడా అర్థమయే రీతిలో విష్ణుసహస్రనామాలలో, లలితాసహస్ర నామాలలో ఔన్నత్యం అర్థాలు, కృష్ణతత్వం, శివతత్వం అన్నీ చెప్పి శ్రోతల హృదయాలను భక్తితత్పరతతో రంజింపచేస్తున్నారు. శివకేశవులలో భేదము లేదని ఇరువురూ ఒక్కటేనని ఎన్నో ఉదాహరణలతో చక్కగా వివరిస్తున్నారు.

గాయత్రీ మంత్రం ఎంతో పవిత్రమైనది. గాయత్రిని మించిన మంత్రములేదు. తల్లిని మించిన దైవము లేదని ఒక నానుడి ఉంది. ఇటువంటి పవిత్రమైన మంత్రాలు నేడు కేసెట్ల రూపంలో రకరకాల ఉచ్ఛారణతో, వివిధరాగాలలో వివిపిస్తున్నారు. మంత్రములు పాడుకునేవికావు. స్థిరముగా ఒకచోట కింద ఆసనముపై కూర్చుని మననము చేసుకోవాలి. అంతేకాని బాత్‌రూములలో, బెడ్‌రూములలో పాడుకునే పాటలు కావు. గాయత్రీ మంత్రం, మృత్యుంజయమంత్రము, తదితర మంత్రాల పవిత్రతను ప్రతొవొక్కరూ కాపాడాలి. మంత్రమనేది ఉపదేశ పూర్వకముగా పొందాలి. అప్పుడే అది సత్ఫలితాన్నిస్తుంది. నేడు టేబులు మీల్స్ అలవాటయ్యాక కింద కూర్చుని పదినిమిషాలు పూజలు చేయడానికి, జపాలు చేయడానికి అష్టకష్టాలు పడుతున్నారు. నేలమీద పీట లేక దర్భాసనము లేక ఒక బట్టనైనా పరచుకొని దానిపై కూర్చుని ధ్యానము చేయాలి. ఏదైనా ఏకాగ్రచిత్తంతో చేస్తే ఫలితం వుంటుంది.

(ఆంధ్రభూమి దినపత్రిక – మంచిమాట – 30-10-2004)

❁ ❁ ❁

సత్సంగ మహిమ

అన్ని జన్మలలో ఉత్తమమైన జన్మ నరజన్మ అని దీనిని సార్ధకం చేసుకోవాలని కాలాన్ని వృధాచేయకుండా ఎన్నిపనులు ఉన్నా భగవన్నామ స్మరణకు కొంత సమయాన్నికేటాయించి ఏ మంత్రము, పూజా విధానము తెలియకపోయినా, ఓమ్ నమః శివాయ ఓమ్ నమో నారాయణాయ, హరేరామ, హరేరామ, రామ రామ హరేహరే, హరేకృష్ణ, హరేకృష్ణ, కృష్ణ కృష్ణ హరేహరే వంటి నామాలను జపించి కలియుగంలో తరించవచ్చని మహాత్ములు చెప్పారు. ఓం నమఃశ్శివాయ మంత్రాన్ని పంచాక్షరీ అని, ఓమ్ నమో నారాయణ మంత్రాన్ని అష్టాక్షరీ మంత్రమని, రామనామ మంత్రం కలియుగానికి తారక మంత్రమని చెబుతారు.

ప్రాతఃకాలమున పంచాక్షరీ మంత్రం, సంధ్యాకాలంలో అష్టాక్షరీ మంత్రం జపించడం మంచిదని కంచి పెద్దస్వాములు ఒకసారి ప్రవచనాలలో చెప్పారు. త్రిసంధ్యలలో సంధ్యావందనంచేసే ద్విజులు నేడు కరువయ్యారు. రోజుకు మూడుసార్లు కాకపోయినా, రెండుసార్లు కనీసం ఒక్కసారైనా చేసే మహనీయులు కరువవడంతో కొందరు పీఠాధిపతులు, మహాత్ములు నేటికాలానికి అనుగుణంగా ప్రతిరోజు ఉదయం ప్రాతఃకాలంలో 108సార్లు గాయత్రీ మంత్రాన్ని జపించి తరించమని బోధిస్తున్నారు.

ఉత్తరభారతదేశంలో గాయత్రీ మంత్రాన్ని ఒక ఉద్యమంగా నడిపి, గాయత్రీ మంత్రాన్ని పఠించడానికి కులమతభేదాలు లేవని, మగవారే చేయాలని ఆంక్షలేదని, స్త్రీలు కూడా చేయవచ్చని ప్రోత్సహించి, దేశంలో అనేక గాయత్రీ పీఠాలు స్థాపించి గాయత్రీమంత్రాన్ని కాసెట్లుద్వారా కరపత్రాలద్వారా, ప్రచారం ప్రారంభించారు. ముఖ్యంగా స్త్రీలు, బ్రాహ్మణేతరులు అనేకమంది ఆకర్షితులై గాయత్రీ మంత్రాన్ని

జపిస్తున్నారు. కొందరు కేసెట్లు విని ఆనందిస్తున్నారు. కొందరు గాయత్రీ మంత్రాలను ఉపదేశం ద్వారా పొంది ఆచరించాలి. కానీ కాసెట్లు, కరపత్రాల ద్వారా నేర్చుకుని మంత్రాన్ని జపించడం వలన సత్ఫలితముండదని, గాయత్రీ మంత్రాన్ని పవిత్రంగా ఒక గురువు నుంచి ఉపదేశము పొంది నిర్మల మనస్సుతో ఏకాగ్రతగా జపించాలని కొందరు మహాత్ములు చెప్పేమాటలు ఆలోచించదగ్గవే !

ఇదే విషయాన్ని మరికొందరుపండితులు, హిందూ ప్రచారకర్తలు, బాబాలు వంటివారు ఏదోవిధంగా గాయత్రీ మంత్రప్రచారమై నలుగురు నోటా వినిపించడం మంచిదేనని చెప్పడం గమనార్హం. అలాగే కొన్ని సినిమాలలో దేవతలను అవహేళన చేయడం, కొన్ని శృంగార సన్నివేశాల పాటలలో అయ్యోరామా! అయ్యో కృష్ణావంటి పదాలను చేర్చి పాడి భగవంతుని అపహాస్యం చేస్తున్నారని దీనిని ప్రతిఘటించాలని చెబితే, కొందరు విజ్ఞులు ఈరకంగానైనా మన హిందూ దేవతలను, భగవన్నామాన్ని ఉచ్చరిస్తున్నందుకు సంతోషించాలి. కలియుగంలో ఏదోవిధంగా భగవన్నామ స్మరణ చేయడం ముఖ్యం. అంతేకాని ఏ సందర్భంలో ఎక్కడ చేయడం అనేది ముఖ్యం కాదని అందువల్ల ఏదోరకంగా భగవన్నామ సంకీర్తన చేయనివ్వమని చెప్పడం ముదావహం. మన హిందూమతంలో వున్న గొప్పతనమో, లోపమో తెలియదుకానీ దేనినైనా సమర్థించగల గొప్ప బాబాలు, పీఠాధిపతులు, ప్రవక్తలు వున్నారు. సాకారము, నిరాకారాలలో భగవంతుని పూజించడం, ద్వైతాద్వైత మత సిద్ధాంతాలు, తత్వమసి సిద్ధాంతం అన్నీ సామాన్యునికి అర్థంకాక ఎక్కువ మంది విగ్రహారాధనకే పరిమిత మవుతున్నారు.

సత్సాంగత్యము, సత్పురుషుల కలయిక, మహాత్ముల ప్రవచనాలతో ఆధ్యాత్మిక చింతన ఏర్పడుతుంది. వృద్ధులు, పదవీ విరమణ చేసినవారు టీవిలకు అతుక్కు పోకుండా సాయంత్రంవేళ ఎక్కడవీలైతే అక్కడ కలుసుకుని ఆధ్యాత్మిక చింతనతో కాలక్షేపం చేయాలి. ఇంటిదగ్గర ఆధ్యాత్మిక గ్రంథాలు చదివి ఆ గ్రంథాలలో విషయాలు నలుగురూ చర్చించాలి. లేకుంటే సంస్కృతం, తెలుగు బాగా తెలిసి చదవగలనేర్పు వుండి, అవసరమైనచోట అర్థం చెప్పగల పరిజ్ఞానం కలవారిని వీలైతే వృత్తిరీత్యా అధ్యాపకునిగా చేసి పదవీ విరణమచేసిన వారినెవరినైనా గురువుగా భావించి భగవద్గీత, రామాయణము, భారతము, భాగవతము వంటి ఆధ్యాత్మిక గ్రంథాలు చదవడం వలన ప్రయోజనం వుంటుంది. ఆధ్యాత్మిక గ్రంథాలు చదవడంవలన ఎన్నో కొత్తవిషయాలు తెలియడమేకాక, జీవిత సత్యాలెన్నో తెలుస్తాయి. భారత, రామాయణ గ్రంథాల్లో మానవాళికి కావలసిన మంచిచెడులు, ఎవరి దగ్గర ఎలా ప్రవర్తించాలో ఎవరిని ఎలా మెప్పించాలో, అన్నదమ్ముల అత్తాకోడళ్ల, గురుశిష్యులు, తండ్రీకొడుకుల, భార్యాభర్తల అనుబంధాలు ఇలా ఎన్నో విషయాలు వివిధ పాత్రల ద్వారా ఎంతోచక్కగా చెప్పడం జరిగింది. ప్రతీ పాత్ర సమాజానికి ఒక నీతిని చెబు తుంది. నేడు పాఠ్యగ్రంథాలలో పాఠ్యాంశాలుగా రామాయణ, భారతగ్రంథాలు,

నీతి శతకాలు లేవుకాబట్టి పిల్లలకు వాటిలోని కొన్ని విషయాలనైనా చెప్పి పెడదారి పట్టి పతనమవుతున్న యువతను కొంతవరకైనా రక్షించి సన్మార్గంలో నడిపించాలి.

బుద్ధిచెప్పవలసిన పెద్దవారే పెడదారులు పట్టి తిరుగుతూ టీవీల ముందు అతుక్కుపోతే ఇక యువతకు మంచి చెడు చెప్పే నాథుడు కరువై విజృంభిస్తారు. ఇప్పటికే పాశ్చాత్య నాగరికతపై మోజు పెరిగి కట్టుబొట్టులో మార్పు వచ్చింది. అప్పుడే డేటింగులు, ప్రేమలు, పెళ్ళిళ్లు పెద్దలు ప్రమేయం లేకుండా చేసుకునే వరకు వచ్చారు. అంతకు ముందుగానే పెద్దలు కళ్ళు తెరచి సత్సాంగత్యంతో వారిని తీర్చిదిద్దాలి. -(ఆంధ్రభూమి దినపత్రిక-మంచిమాట-29-3-2005)

❁ ❁ ❁

పితృవాక్య పరిపాలకులు

పితృవాక్య పరిపాలకుడనగానే మనకి దశరథతనయుడైన శ్రీరామచంద్రుడే గుర్తుకువస్తాడు. కానీ మనపురాణ కావ్యాలలో పితృవాక్య పరిపాలకులు మరికొంద రున్నారు. శ్రీరామచంద్రునికి యువరాజ పట్టాభిషేకం చేయడానికి దశరథమహారాజు ముహూర్తం నిర్ణయించి, శ్రీరామచంద్రుని పిలిపించి పట్టాభిషేకానికి సన్నిద్ధం కమ్మని చెప్పి, దీక్షాపత్రాన్ని ప్రారంభించమని ఆదేశించడంతో శ్రీరామచంద్రమూర్తి ఆనం దంగా తండ్రిమాట శిరసావహించి, సీతాదేవితోపాటు ఉపవాస దీక్షకు ఉపక్రమిం చాడు. దశరథ మహారాజు ముద్దుల భార్య కైకేయి ముందు ఆనందించినా, దాసి మందర ప్రోద్భలంతో ఎప్పుడో దశరథ మహారాజు కైకేయికిచ్చిన రెండు వరాలు గుర్తుచేసి శ్రీరామచంద్రుని పదునాలుగు సంవత్సరముల అరణ్యవాసము, భరతుని రాజ్యాభిషేకం చేయమని కోరడంతో చెట్టంత దశరథ మహారాజు కుప్పకూలి పోయాడు.

ఈవిషయాన్ని మంత్రిద్వారా తెలుసుకున్న శ్రీరామచంద్రుడు తల్లి కైకేయి గృహానికి వెళ్లి, తండ్రి దశరథుడు పడుతున్న అవస్థని చూసి, రాజ్యాన్ని, అయోధ్యను విడిచి అరణ్యాలకు వెళ్లడానికి సిద్ధపడ్డాడు. శ్రీరామచంద్రుడు స్థితప్రజ్ఞుడు కావడం వలన యువరాజు పట్టాభిషేకమంటే ఎంత ఆనందించాడో అడవికి వెళ్ళమన్నా అదే చిరునవ్వుతో మారు మాట్లాడకుండా అరణ్యవాసానికి సిద్ధమయ్యాడు. తరువాత తమ్ముడు లక్ష్మణుడు, భార్య సీతాదేవి వద్దన్నా వెంటపబడి అడవులకు వెళ్ళడం, సీతాపహరణం, రావణ, కుంభకర్ణ, కరదూషణాది రాక్షసులను సంహరించడం అంతా రామాయణగాథ అందరకు తెలిసినదే!

పరశురాముడు, రేణుకా, జమదగ్నులకు శ్రీమహావిష్ణు అంశతో జన్మించిన పుత్రుడు. రేణుకాదేవి మహాపతివ్రత. భర్తసేవలుచేస్తూ రోజూ మట్టితో కుండ స్వయంగా తయారుచేసి నదీజలముతెచ్చి, నీటిని వంట, వార్పుకు వాడేది. ఒకరోజు రేణుకాదేవి నీళ్లు తేవడానికి నదికి వెళ్లగా ఆ నదిలో జలక్రీడలాడుతున్న గంధర్వ

కన్యలు, వారితో సరసాలాడుతున్న గంధర్వుని చూసి, ఆమె మనసు వ్యాకులతచెందింది. అన్య మనస్కంగానే రోజులాగ ఆమె నీరుతేవడానికి మట్టితో కుండ తయారు చేయడానికి ఎంత ప్రయత్నించినా, కుండ నిలవకుండా పగలసాగింది. రేణుకాదేవి చేసేది లేక దుఃఖితురాలై, నీరు లేకుండానే నదినుంచి తిరిగి వచ్చింది. రిక్తహస్తాలతో నీరుతేకుండా వచ్చిన భార్యను చూసిన భర్త జమదగ్ని మహర్షి జరిగిన వృత్తాంతాన్ని దివ్యదృష్టితో గ్రహించి ఆమెను శిక్షించాలనుకున్నాడు. వెంటనే తన పుత్రులను పిలిచి, తల్లి రేణుకాదేవి శిరస్సు ఖండించమని ఆజ్ఞాపించాడు. కానీ ఎవ్వరూ తల్లి శిరస్సు ఖండించడానికి ముందుకు రాలేదు. ఆ సమయంలో అక్కడ రమణ్వంతుడ, సువేషణుడు, వసువు, విశ్వావసువు అనే నలుగురు కుమారులు మాత్రమే అక్కడున్నారు. యైదవ కుమారుడైన పరశురాముడు అక్కడ లేడు. తండ్రి జమదగ్నిలో కోపజ్వాలలు పెల్లుబికి బిగ్గరగా పరశురాముని కోసం కేకలు వేసాడు.

అడవిలో కట్టెలు నరుకుతన్న పరశురాముడు తండ్రి కేకలు వినిపించి పరుగు పరుగున ఆశ్రమానికి వచ్చాడు. జమదగ్ని మహర్షి తన మాటను పెడచెవిని పెట్టిన నలుగురు పుత్రులను శపించి, రేణుకను సంహరించమని ఆజ్ఞాపించాడు. పరశురాముడు పితృవాక్య పరిపాలకుడవడంవల్ల ముందు వెనుకలు ఆలోచించకుండా తండ్రిమాట ప్రకారం తల్లి రేణుకాదేవిని గండ్రగొడ్డలితో సంహరించాడు. జమదగ్ని మహర్షి సంతసించి, ఏదైనా వరము కోరుకోమని ఆజ్ఞాపించాడు. పరశురాముడు తండ్రికి నమస్కరించి వినయంగా తన తల్లిని, సోదరులను తిరిగి బ్రతికించమని కోరుకున్నాడు. జమదగ్ని మహర్షి సంతసించి, పరశురాముని కోరికమేరకు మరల భార్యపుత్రులను సజీవులను గావించాడు.

తరువాత కార్తావీర్యార్జునుడు వేటకువచ్చి, జమదగ్ని మహర్షి యిచ్చిన అతిథ్యాన్ని స్వీకరించి, కామధేనువుని తనకిమ్మని కోరడం, జమదగ్ని మహర్షి కామధేనువును యివ్వడానికి నిరాకరించడంతో రాజు బలవంతంగా కామధేనువును తీసుకు వెళ్లడానికి ప్రయత్నించడంతో అడ్డువచ్చిన జమదగ్ని మహర్షిని కార్తవీర్యార్జునుడు సంహరించి కామధేనువుని తీసుకువెళ్లాడు. పరశురాముని తల్లి విలపిస్తూ వేసినకేకలు విని పరుగుపరుగున వచ్చి, జరిగిన విషయం తెలుసుకొని, ప్రతిజ్ఞచేసి కార్తవీర్యార్జునితోపాటు అనేకమంది రాజులను భూమండలమంతా దండయాత్ర 21సార్లు చేసి మట్టుపెట్టి వారి రక్తముతో పితృతర్పణము చేసిన సాహసి ముని కుమారుడైన పరశురాముడు. క్షత్రియులను గడగడలాడించి తండ్రి ఋణము తీర్చుకున్న తనయుడు పరశురాముడు. తరువాత తీర్థయాత్రలుచేసి పాపప్రక్షాళాన్ని చేసుకున్నాడు.

వృషవర్యునికి శర్మిష్టయను పుత్రిక కలదు. శర్మిష్ఠ చెలికత్తెలతో ఆనందంగా జలాశయంలో జలకమాడుచుండెను. శుక్రాచార్యుని కుమార్తె దేవయాని కూడా వారితో జలకమాడుతున్నది. అదే సమయమున శివపార్వతులు వృషభ వాహనులై

గగనతలమున విహరించుట గాంచిన కన్యలు సిగ్గుతో ఒడ్డుకుచేరి వస్త్రములు ధరించిరి. ఆ తొందరలో దేవయాని వస్త్రములను శర్మిష్ఠ ధరించెను. దేవయానికి కోపం వచ్చి యజ్ఞహవిస్సుని కుక్కముట్టినట్లు, బ్రాహ్మణ వంశానికి, భృగువంశానికి చెందిన నా వస్త్రాన్ని అపవిత్రం చేసావు. నీ తండ్రికి నా తండ్రికి శిష్యుడని తెలియదా! అంటూ నిందించడంతో రాజపుత్రికయైన శర్మిష్ఠకు కోపమువచ్చి, దూషించి ఆమె వస్త్రములను లాక్కొని, దేవయానిని అక్కడ బావిలో పడవేసి ఇంటికి వెళ్లెను.

వేటకు వచ్చిన యయాతి మహారాజు దప్పికగొన్నవాడై నీటికోసం బావిచెంతకు వచ్చి, బావినుండి వినిపిస్తున్న స్త్రీ ఆర్తనాదాన్ని విని, ఆమె వివస్త్రయి వుండుట చూసి తన ఉత్తరీయము నామెకొసగి చేయి అందించి బావినుండి ఆమెను బయటకు తీసెను.

దేవయాని రాజునకు కృతజ్ఞతలు తెలిపి, నాచేయి పట్టుకొని నన్ను రక్షించావు కాబట్టి నన్ను అర్ధాంగిగా స్వీకరించమని యయాతి మహారాజుని కోరింది. యయాతి ఆమె సౌందర్యలావణ్యాలను చూసి వెంటనే అంగీకరించాడు.

దేవయాని ఇంటికివెళ్ళి, తండ్రి శుక్రాచార్యునికి జరిగిన వృత్తాంతమంతా తెలపగా శుక్రాచార్యుడు కోపోద్రిక్తుడై వృషవర్యుని పిలిపించగా, జరిగిన విషయాన్ని ఎరింగిన రాజు గురువుగారిని క్షమాభిక్షకోరి దేవయాని కోరికపై రాజుపుత్రిక శర్మిష్ఠ తన వెయ్యిమంది దాసీలతో దేవయానికి దాసియై వుండునట్లు అంగీకరించెను

దేవయాని, యయాతి మహారాజుల వివాహం వైభవంగా జరిగింది. దేవయానికి సంతానం కలిగెను. తాను సంతానవతి కావలెనని శర్మిష్ఠకి కోరిక కలెగను. తన కోరికను మహారాజు యయాతికి విన్నవించి పుత్రభిక్ష పెట్టమనెను. యయాతి వలన ఆమె కూడా సంతానవతి అయిన విషయం తెలుసుకున్న దేవయాని కోపించి ఈ విషయం తండ్రికి ఎరిగించెను. శుక్రాచార్యుడు కోపోద్రిక్తుడై యయాతికి ముసలితనం ప్రాప్తించునట్లు శపించెను. యయాతి దుఃఖితుడై గురువును ప్రార్థించగా గురువు ప్రసన్నుడై ఎవరైనను నీ ముసలితనాన్ని స్వీకరించి, వారి యవ్వనాన్ని నీకు ఒసగ గలిగితే నీవు మరల యవ్వనాన్ని పొంది సుఖిస్తావు?" అని శుక్రాచార్యుడు తెలపడంతో ఆనందించి తనపుత్రులు యదువ, తుర్వసుడు, ద్రుహ్యుడు, అనువు అనివారిని అడుగగా వారు యవ్వనము తండ్రికి యిచ్చుటకు నిరాకరించారు.

యయాతి మహారాజు ఖిన్నుడై, తన కుమారులలో చిన్నవాడు, బుద్ధి కుశలత లున్నవాడైన పురూరవుని ఆఖరి ప్రయత్నముగా అడిగెను. దానికి పురూరవుడు ఆనందించి 'నీవు ఇచ్చిన దేహము యిది, నీ కోరిక తీర్చడంకన్నా ఈ జన్మకి నాకు కావలసినదేముంది? తప్పక నా యవ్వనాన్ని స్వీకరించి, నీ ముసలితనాన్ని నాకు ప్రసాదించు తండ్రీ' అంటూ పురూరవుడు అర్థించి తండ్రి కోరిక నెరవేర్చాడు.

వేయి సంవత్సరాలు కామభోగాలు అనుభవించినా యయాతికి కోరికలు తీరకపోవడం గమనించి, కోరికలను తృప్తి వుండదని గ్రహించి, కుమారుడు పురూర

వుని పిలిచి అతని యవ్వనాన్ని తిరిగి ఒసంగి ముసలితనాన్ని గ్రహించి, కుమారుని రాజ్యాభిషిక్తుని గావించి యయాతి తపస్సు చేయడానికి అడవులకేగాడు. ఆవిధంగా పురూరవ చక్రవర్తి పితృవాక్య పరిపాలకుడై, తండ్రి కోరిక నెరవేర్చి చరితార్థుడయ్యాడు.

(ఆంధ్రభూమి దినపత్రిక – మంచిమాట – 2004)

❀ ❀ ❀

తీర్థ యాత్రలు - ప్రయోజనం

భారతీయులకు అనాదినుండి అనేక పుణ్యక్షేత్రములు దర్శించుటకు తీర్థ యాత్రలు చేయడం ఒక ఆచారంగా వస్తోంది. ప్రయాణ సౌకర్యాలు, వసతులు లేని రోజులలోనే కాశీవంటి పుణ్యక్షేత్రాలు దర్శించడానికి కాలినడకతో బృందాలుగా వెళ్ళేవారు. అడవులు, కొండలు, కోనలు దాటి వెళ్లవలసి రావడంవలన కాశీకి వెళ్ళినవారు కాటికి వెళ్ళినవారితో సమానమని భావించేవారు.

మన పుణ్యక్షేత్రాలుగా పరిగణించే పెక్కు క్షేత్రాలలో శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, శ్రీవేంకటేశ్వరుడు, పరమశివుడు, ఆదిపరాశక్తి ఇంకా ఎందరో దేవతామూర్తులు జన్మించిన స్థలం, సంచరించిన పుణ్యభూమి, పుణ్యనదులు ప్రవహించే భూమి, ఎందరో మహానుభావులు, పుణ్యమూర్తులు తపశ్శాలురు, మహర్షులు దివ్య పురుషులు నివసించిన,సంచరించిన ప్రదేశాలను దర్శిస్తే మనలో వున్న మలినాలు తొలగి నిర్మలమైన మనసుతో ఏకాగ్రత కలుగుతుందని తీర్థయాత్రలు చేయమని మన పూర్వీకులు ప్రోత్సహించారు.

భగవంతుడు సర్వంతర్యామికదా! ఎక్కడ చూసినా అతడే వుండాలికదా! అలాంటప్పుడు మనము తీర్థయాత్రలకని కాశీ, రామేశ్వరం, హరిద్వార్ వంటి పుణ్య క్షేత్రాలకు వెళ్ళాలా అని చాలామందికి అనుమానం కలుగుతుంది. శ్రీరామకృష్ణ పరమహంస అటువంటి అనుమానం గలవారికి చక్కని సమాధానం చెప్పేరు. ఆవుపాలు నిజముగా రక్తరూపములో ఆవు శరీరమునంతట వ్యాపించి వున్నను, చెవులను, కొమ్ములను, తోకను పిండిన పాలురావుకదా!

ఒక్కపొదుగునుండి పాలు ఎలా లభించునో భగవంతుడు సర్వంతర్యామి యైనను సామాన్యులకు ఎల్లచోటలా లభ్యముకాదు. పవిత్ర దేవాలయాలలో, పుణ్య స్థలాలలో భగవంతుడు భక్తులకు గోచరించును.

ఎందరో తపశ్శాలులు, భక్తులు, త్యాగధనులు నివసించిన ప్రదేశములలో నిత్యము దైవచింతన, దైవ సంకీర్తన, దైవనామముతో పవిత్రమైన భూమిలో భగ వంతుడు నివసించి యుండును. అట్టి పుణ్యప్రదేశములనే మన పూర్వీకులు తీర్థయాత్రా స్థలములుగా నిర్ణయించి, వార్థక్యము పొడసూపగానే దైవచింతనతో తీర్థయాత్రలు చేసెడువారు. నేడు చాలామంది వయసులో వున్నవారు కూడా ప్రయాణ వసతులు, సౌకర్యములు పెరిగినందున భగవత్‌చింతనలో కాకపోయినా ప్రకృతి

రమణీయాన్ని దర్శించడానికి, దేవాలయ, శిల్పకళలను ఆరాధించడానికి తీర్థయాత్రలు చేస్తున్నారు.

ఇంటివద్ద వుండి నిత్యదీపారాధన, పూజలు చేస్తూ దైవచింతనలో గడిపేవారికి తీర్థయాత్రలవలన ప్రయోజనం ఎక్కువ వుంటుంది.

ఆ పుణ్యభూమి, పవిత్ర ప్రదేశాన్ని దర్శించగానే వారిచిత్తము దైవమునందే లగ్నమై వారికి భగవంతని దివ్యమూర్తిని దర్శించి తరించగలరు. దైవచింతన లేనివారు తీర్థయాత్రలవల్లనే పుణ్యాన్ని ప్రోగుచేసుకోవాలనుకునేవారికి యాత్రలవలన ప్రయోజనం లభించదు.

మన పుణ్యనదులు గంగ, యమున, సరస్వతి, కావేరి, గోదావరి, కృష్ణ, పంబా నదులు ఎంతో పవిత్రమైనవి. ఆ నదులలో స్నానము చేయడంవల్ల సర్వపాపములు తొలగడమే కాకుండా పుణ్యనదుల ప్రభావంవల్ల కొన్న రోగాలు, శరీర రుగ్మతలు నశిస్తాయి.

అలాగే పవిత్ర దేవాలయములలో వందల సంవత్సరాల నుంచి వున్న దేవతా వృక్షములైన మర్రి, మామిడి, రావి, మేడి, బిల్వము, వేప అమలక వృక్షముల వలన భక్తులకు ఆరోగ్యాన్ని కలిగించడమే కాకుండా, ఆ వృక్షాల గాలిసోకగానే వంధత్వముతో బాధపడే అనేకులు సంతానవంతులు కావడం కూడా జరుగుతుంది.

ఆ దేవతా వృక్షాలలో ఔషధ గుణాలు వుండడంవల్ల తపశ్శాలురచే ఆ వృక్షాలు దేవాలయ ప్రాంగణంలో నాటడం వల్ల శక్తివంతమైన సంతానాన్ని కూడా ప్రసాదించడంలో ఆశ్చర్యం లేదు. కొన్ని పుణ్యక్షేత్రాలలోదేవతా మూర్తులను మహర్షులు ప్రతిష్ఠిస్తే, కొన్ని క్షేత్రాలలో శ్రీరామచంద్రుడు, శ్రీకృష్ణుని వంటి అవతారమూర్తులచే స్వయంగా ప్రతిష్ఠగావించినట్లు పురాణగాథలున్నాయి. కొన్ని ప్రదేశాలలో విగ్రహాలు, శివలింగాలు స్వయంభూ విగ్రహాలుగా చెప్తారు. పరమేశ్వరుడే భక్తుల నలరించడానికి భూలోకంలో అక్కడక్కడ వెలసినట్లు చెప్తారు. కాశీ, రామేశ్వరం, తిరుమల, గురవయ్యూరు, శబరిమల, హరిద్వార్, కేదారేశ్వర్ వంటి క్షేత్రాలకు ఎంతో ప్రాధాన్యత లభించింది.

దేనికైనా నమ్మకము ప్రధానము. ఆ విగ్రహాన్ని రాయి అనుకుంటే వారికి అది బండరాయిగానే గోచరిస్తుంది. అదే పవిత్ర దేవతామూర్తిగా భావిస్తే ఆ దైవమే ఎదుట సాక్షాత్కారిస్తాడు. స్వార్థపరులు, మోసగాళ్లు, దొంగలు ప్రతిచోటా వుంటారు. తీర్థయాత్రలకు వచ్చే భక్తులను కూడా వారు విడిచిపెట్టరు. మనం తీర్థయాత్రకు వచ్చింది ఆ పరమాత్ముని దర్శనానికి కాబట్టి, ఆ పరమాత్ముని కనులార దర్శించి, మనసంతా నింపుకొని పవిత్ర హృదయంతో ఇంటికి రావాలి. అక్కడ జరిగే ఘోరాలు, మోసాలు, స్వార్థపూరిత చర్యలను పట్టించుకోకూడదు. అప్పుడే మనకి తీర్థయాత్ర ఫలితం దక్కుతుంది. చెడు వినవద్దు, చెడు కనవద్దు, చెడు మాట్లాడవద్దనే సూక్తులు గుర్తుంచుకోవాలి.

మనోనిగ్రహ పరిరక్షణకోసం గయక్షేత్రంలో ఇష్టమైన ఆకు, పండు, కూరలు వంటివి విసర్జించి జీవితంలో మరల వాటిని ముట్టరు. అందుకే కాశీవెళ్ళినవారిని (గయ కూడా వెల్తారని) కాశీలో ఏమి విడిచిపెట్టేవని అడుగుతారు.

(ఆంధ్రభూమి దినపత్రిక – మంచిమాట – 2-6-2004)

❋ ❋ ❋

మన పురాణాలలో విజ్ఞానం

వ్యాసమహర్షిచే రచింపబడిన అష్టాదశ పురాణాలను చదివినవారికి, వేదములలో అర్థాన్ని గ్రహించినవారికి మన పూర్వీకులు ఎంతటి ఉన్నతస్థితిలో ఉండేవారో, వారు సముపార్జించిన విజ్ఞానాన్ని చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. నేడు మన శాస్త్రజ్ఞులు (ప్రపంచ దేశశాస్త్రజ్ఞులు) కనుక్కున్న ఎన్నో విషయాలు మన పురాణ కాలంలోనే ఉన్నట్లు మన అష్టాదశ పురాణాలద్వారా తెలుస్తోంది. ఉదాహరణకి కృత్రిమ గర్భదారణ, టెస్టుట్యూబ్‌బేబీస్, క్లోనింగ్, బ్లడ్‌ట్రాన్స్‌మిషన్, సెక్సుమార్పిడి, మగవారికి సంతానం కలిగే యోగం, విమానయానం, శస్త్ర అస్త్రాలు (అణుబాంబులు, కృత్రిమ వర్షం మొ॥) ఆకాశవాణి, దూరదర్శన్ వంటివి ఎన్నో ఉన్నట్లు మనకి ఆధారాలున్నాయి. అందులో కొన్ని ముఖ్యమైన విశేషాలని తెలపడానికే ఈ వ్యాస ప్రయత్నం.

పూర్వకాలంలో గంధర్వులు, దేవతలు విమానాలపై ఆకాశంలో విహరించినట్లు మనకు అనేక కథలున్నాయి. గంధర్వ దంపతులు సరససల్లాపాలాడుతూ విమానయానం చేస్తూంటే జమదగ్ని మహర్షి భార్య రేణుకాదేవి వారిని చూసి మనసు చలించడంవలన పాతివ్రత్యభంగం కలిగి మట్టితో కుండ చేయలేక నీళ్ల నది నుండి తేకుండా రావడంచూసి జమదగ్ని మహర్షి భార్యను శపిస్తాడు. ఇది కాక పుష్పక విమానమనే విచిత్రమైన విమానం కూడా ఉన్నట్లు, రావణుడు, కుబేరుడు, శ్రీరామచంద్రుడు మొదలగు వారంతా ఉపయోగించినట్లు రామాయణం ద్వారా మనకి తెలుస్తోంది. భరద్వాజ మహర్షి వైమానిక శాస్త్రాన్ని వ్రాసినట్లు అందులో విమానాల గురించి పెక్కు విషయాలు పేర్కొన్నట్లు తెలుస్తోంది. కృత్రిమ గర్భధారణ గురించి కూడా మనపురాణ గ్రంథాలలో ఉండడం విశేషం. వసు చరిత్రలో వసుమహరాజు వేటకి వెళ్ళి అడవిలో ఉన్నప్పుడు భార్య ఋతుమతి అయిన తరువాత రోజులు అవడం వలన గర్భాదారణ కొరకు వీర్యాన్ని తీసి ఒక దోనెలోఉంచి ఒక పక్షి ద్వారా పంపుతాడు. దారిలో కొన్ని వీర్యంబొట్లు నదిలో పడడం, దానిని ఒక చేప మ్రింగడంతో మత్స్య గ్రంధి జన్మించినట్లు ఒక కథ.

ఇక శాస్త్రనాళిక పిల్లలు పుట్టినట్లు పురాణాలలో అనేక కథనాలున్నాయి. కౌరవుల జననం, ద్రోణుడు, అగస్త్యుడు, వశిష్ఠుడు, కుమారస్వామి మున్నగు వారందరూ కుండలలో, పాత్రలలో వీర్యాన్ని, గాంధారి గర్భ విచ్ఛిన్నమైన అండశేషాలను భద్రపరచితే కాలక్రమేణా జీవం పోసుకొని జన్మించినట్లు మన పురాణాలు పేర్కొంటు

న్నాయి. పూర్వం అయోనిజులుగా వ్యవహరించబడిన వారంతా బ్రహ్మమానస పుత్రులు (పుత్రికలు) కావడం విశేషం. లేక యజ్ఞకుండం నుండి కొందరు ఉద్భవించి నట్లు కథనం, ద్రౌపది, సీత, ధృష్టద్యుమ్నుడు, అహల్య, మండోదరి మొ॥ సహజంగా యోని నుండి పుట్టకుండా కృత్రిమంగా కడుపుకోసి తీసిన పిల్లలు అయోనిజులుగానే పరిగణిస్తారు.

నేడు మన శాస్త్రవేత్తలు ఎన్నో ప్రయోగాలుచేసి చివరకు మగవారు కూడా సంతానాన్ని పొందవచ్చుని తేల్చారు. మన పురాణాలలో యౌవ్వనాసురుడని ఒక మహారాజు పుత్ర సంతానం కోసం ఒక యజ్ఞం చేసాడు. యజ్ఞం పూర్తయిన తరువాత యజ్ఞప్రసాదాన్ని ఒకపాత్రలో పోసి, భార్యకిచ్చి దానిని స్వీకరించేటట్లు చేస్తే చక్కని మగ శిశువు పుడతాడని మహర్షులు రాజుకి అందించాడు. రాజు భద్రంగా ఆ పాత్రను ఒక సురక్షిత ప్రాంతంలో పెట్టి నిద్రించాడు.

అర్థరాత్రి యౌవనాసురుడికి దాహంవేసి నిద్రలో మేల్కొని మంచి నీళ్ళనుకొని పాత్రలో ఉన్నటువంటి యజ్ఞప్రసాదాన్ని స్వీకరించడం వలన రాజు గర్భం ధరించి మాంధాతకి జన్మనిచ్చేడు. ఇతని గర్భంలో కుడి భాగము కోసి శిశువుని బయటికి తీసేరు. ఇతనూ అయోనిజుడే. పాలు త్రాగడానికి (చన్ను కుడపడానికి) తల్లి లేనందున ఇంద్రుడు చూపుడు వేలు చూపి చీకమన్నాడట. అందుచేత ఆ బాలునికి మాంధాత అనిపేరు వచ్చింది.

ఇప్పుడు మనకున్న వైద్యవిజ్ఞానంకన్నా పూర్వకాలంలో విజ్ఞానం ఇంకా ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. యయాతి అనే మహరాజుకి తాను వెయ్యి సంవత్సరాలు కామభోగాలు అనుభవించినా తృప్తి కలుగక ఇంకా యవ్వనాన్ని పొంది సుఖించాలని తన నలుగురు కుమారుల్ని పిలిచి వారి యవ్వనాన్ని అడుగు తాడు. ముగ్గురు కుమారులు అంగీకరించలేదు. చిన్నకుమారుడైన పూరుడు తండ్రికి తన యవ్వనాన్ని ఇవ్వడానికి అంగీకరిస్తాడు. అంటే ఆ రోజులలో రక్తదానము, రక్తాన్ని ఎక్కించడం వంటి ప్రక్రియలు మన పూర్వీకులకు తెలుసన్నమాట. కొన్నాళ్ళు కామసుఖాలు అనుభవించి తిరిగి మరలా పూరుడికి యవ్వనశక్తినిచ్చి రాజ్యాభిషిక్తుని గావించి యయాతి వానప్రస్థానికి వెల్తాడు.

ఆ రోజులలో వైద్య విజ్ఞానానికి మరోమచ్చు తునకగా చెప్పతగినది అవ యవాల మార్పిడి, నేడు కాలు, చెయ్యి, వేలు, మూత్రపిండాలు, కళ్ళు, చెవి, ముక్కు వంటి అవయవాలకు మాత్రమే చికిత్స చేసి మారిస్తే ఆ రోజులలో మానవశరీరాలకు ఏనుగు తలకాయను విఘ్నేశ్వరునికి, గుర్రపు తలని హయగ్రీవునికి (విష్ణువుకి) మేక తలను దక్షప్రజాపతికి అతికించి ప్రాణం పోసారు. దీనిని బట్టి చూస్తే ప్లాస్టిక్ సర్జరి గ్రాఫ్టింగ్ వంటివి పురాణకాలాలలో ఉన్నట్లు మనకి తెలుస్తోంది. ఈ రోజు నేత్రదానం, రక్తదానంతో చూపు ఇచ్చి ప్రాణం పోసిన ఉదంతాలు చాలా మన పురాణాలలో కాశీమజిలి కథల వంటి వాటిలో కన్పిస్తాయి.

ఇప్పుడు శాస్త్రజ్ఞులు కొత్తగా క్లోనింగు, టిష్యూకల్చర్ వంటి ప్రయోగాలతో నూతనంగా మనుషుల్ని, జంతువుల్ని, చెట్లను సృష్టిస్తున్నారు. అయితే ఆనాడే మన పురాణాలలో కొందరు మహర్షులు తోడను చీల్చి తొడనుండి కొందర్ని సృష్టించినట్లు కనబడుతోంది.

నరనారాయణులకు దేవేంద్రుడు తపోభంగం చేయడానికి అందమైన అప్సరస కాంతలను పంపితే నారాయణుడు తన ఊరువు నుండి ఊర్వశిని సృష్టించినట్లు, ఆమె అప్సరస కాంతలలో అందమైనదిగా చెబుతారు. దధీచి మహర్షి దేవేంద్రునికి వజ్రాయుధం తయారీకి ఉపయోగకరంగా తన దేహంలో ఉన్న అస్తికుల్ని సమర్పిస్తే సంతానం లేకుండా భర్త ప్రాణాలను హరించినందులకు అతనిభార్య అలకబూని శపించబోతే దధీచి తొడను రాపిడి చేయగా ఒక మగశిశువు ఉద్భవించినట్లు కథ ఉంది.

మన పురాణాలలో చాలా కథలలో పురుషులు, స్త్రీలుగా మారినట్లు, స్త్రీలు పురుషులుగా మారినట్లు అనేకచోట్ల కన్పిస్తుంది. నేడు సెక్సుమార్పిడి చేయవచ్చని వైద్యులు నిర్ధారించి చిన్న శస్త్రచికిత్సతో అబ్బాయిల్ని అమ్మాయిలుగా, అమ్మాయిల్ని అబ్బాయిలుగా మారుస్తున్నట్లు వింటున్నాము. ఇంకా కొందరు వైద్యులు నపుంసకుల్ని కూడా సృష్టించి కొజ్జావారిగా మారుస్తున్న కథ అందరికీ తెలిసినదే. మొదట స్త్రీ లక్షణాలతో జన్మించి వివాహమయ్యాక భార్యవలన గుట్టురట్టువుతుందేమోనని భయపడి అడవుల పాలవుతాడు. అక్కడ ఒక గంధర్వుడు తారసపడి తాను కొన్నాళ్ళు స్త్రీరూపాన్ని ధరించి ఉంటానని చెప్పి అతనికి పురుష రూపాన్ని శిఖండికి ఇస్తాడు. తరువాత శిఖండి రాజ్యానికి వచ్చి భార్యతో సుఖంగా సంసారం చేశాడు.

ఇది కాక మరోపురాణగాథలో ఒకసారి సుద్యుమ్నుడనే మహారాజు మేరు పర్వతం దగ్గరవున్న ఒక సుందర ఉద్యానవనానికి వచ్చి అతడేకాక అతని పరివారము చిరవకు గుర్రం కూడా స్త్రీ రూపాన్ని పొందడంతో సిగ్గుతో ఆ రాజు తన రాజ్యానికి వెళ్ళకుండా అక్కడే అడవులలో 'ఇల'అనే పేరుతో విహరిస్తూ ఉంటాడు. ఒకరోజు బుధుడు (చంద్రుని కొడుకు) వేటకువచ్చి ఇలని చూసి మోహిస్తాడు. 'ఇల' కూడా అతన్నిచూచి ప్రేమించడంతో ఇద్దరూ గాంధర్వ వివాహము చేసుకొని పురూరవునికి జన్మనిస్తారు.

గర్భవంతులుగా ఉన్నవారు సత్ సంతానాన్ని కనడానికి మంచి ఆహారంతో పాటు మంచి పనులు చేస్తూ సత్కాలక్షేపంచేయడం మంచిదని మంచి నీతికథలు, పురాణాలు చదవడం మంచిదని పెద్దలు చెబుతారు. వైద్యశాస్త్రములో కూడా మేటర్నల్ ఇంప్రెషన్ ప్రభావము పిల్లలపై ఉన్నట్లు నిర్ధారించేరు. తల్లిదండ్రులు అందంగా లేకపోయినా అందమైన పిల్లలు పుట్టడం, కొందరు పిల్లలు హంతకులు, దొంగలుగా మారడానికి, సత్పురుషులుగా మారడానికి తల్లి ఆలోచనల ప్రభావం, పరిసరాల ప్రభావం చాలా ఉంటుంది. మన పురాణాలలో సుభద్ర గర్భవతిగా ఉన్నప్పుడు

అర్జునుడు పద్మవ్యూహం గురించి చెబుతూ ఉంటే సుభద్ర నిద్రపోయినా కడుపులో ఉన్న అభిమన్యుడు వినడం వలన గొప్ప పరాక్రమశాలి అయ్యేడు.

హిరణ్యకశిపుని భార్య లీలావతి గర్భవతిగా ఉన్నప్పుడు నారదుడు చెప్పిన పురాణ కథలు విని ప్రహ్లాదుడు హరి భక్తుడయ్యాడు. అదే విధముగా ఉద్దాల కుమారుడు అష్టావక్రుడు తల్లి కడుపులో ఉన్నప్పుడే తండ్రి ప్రతిరోజూ చదివే వేదవేదాంగాలను ఒంట బట్టించుకొని ఒకనాడు తండ్రినే తప్పు పట్టడంతో అతను కోపించి శపించడం వలనే అష్టావక్రుడు అష్టవంకర్లతో పుట్టేడు.

ఆ రోజులలో అంటే పురాణ కాలంలోనే దూరదర్శినులు ఆకాశవాణి అశరీర వాణీలున్నట్లు మనకి అనేక కథలద్వారా తెలుస్తోంది. కురుక్షేత్రంలో జరుగుతున్న భారతయుద్ధాన్ని, శ్రీకృష్ణ పరమాత్ముడు అర్జునుడికి బోధించిన గీతాబోధని ప్రత్యక్షంగా సంజయుడు తిలకించి, గుడ్డివాడైన ధృతరాష్ట్రునికి చెప్పడమే పెద్ద నిదర్శనం.

కంసుడు తన చెల్లెలు దేవకిని, బావ వసుదేవుణ్ణి రథముపై తీసుకువెళుతూంటే ఆకాశవాణి అతని మృత్యువు దేవకీ అష్టమగర్భాన జన్మించే కుమారుడుతో ఉంటుందని చెప్పడం, శ్రీకృష్ణ జన్మానంతరం శిశువుని వ్రేపల్లెచేర్చి ఆడశివువును (మాయను) తెచ్చి కంసుని కప్పగిస్తే,కంసుడు ఆ బిడ్డను చంపబోతే అశరీరవాణిగా మారి మృత్యువు దగ్గరపడిందని, వ్రేపల్లెలో బాలుడు దిన దిన ప్రవర్ధమానమవుతున్నాడని చెబుతుంది. ఈ విధమైన కథలు అనేకం మన పురాణాలలో గోచరిస్తాయి.

ఇప్పుడు మనకున్న కంప్యూటర్ విజ్ఞానం, ఈమెయిల్ వంటివి ఆ రోజులలో కూడా ఉన్నట్లు అనేక నిదర్శనాలు ఉన్నాయి. అంజనం వేయడమనే విద్య తెలిసినవారు దొంగతనంచేసినవారిని, ద్రోహం తలపెట్టినవారిని, శత్రువుల్ని అరచేతిలో కాటుక వంటివి పూసి వారిని చూపించేవారు. శ్రీకృష్ణుడు శశిరేఖకు ప్రియదర్శిని అనే ఒక పెట్టెను కానుకగా ఇస్తాడు. ఆ పెట్టె తెరచి చూస్తే అందులో ఎవరికిష్టమైన వారు వారికి కనిపించి మురిపిస్తారని చెబుతారు. అందుచేత కంప్యూటర్ విజ్ఞానం ఆ రోజులలో ఉందని నమ్మాలి. ఇంజనీరింగు స్కిల్ గురించి చెప్పుకోవాలంటే రామ సేతువు, రామేశ్వరం వంటి మన పురాతన దేవాలయాలు, సముద్రగర్భంలో ఉన్న పేట్ ద్వారకా వంటివి చాలా ఉన్నాయి. నేడు శాస్త్రజ్ఞులు తయారుచేసిన అణుబాంబులు, హైడ్రోజన్ బాంబులు వంటివి వినాశకర ఆయుధాలు ఆనాడూ ఉన్నాయి. ఈనాడు రిమోట్ కంట్రోలుతో పనిచేసినట్లు ఆ రోజుల్లో బ్రహ్మాస్త్రం, వారుణాస్త్రం, నాగాస్త్రం, నారాయణాస్త్రం, పాశుపతాస్త్రం మున్నగు అస్త్రశస్త్రాలు ఉన్నాయి. మన పూర్వీకులికి వాటిని ప్రయోగించడంతోపాటు మరల వెనక్కి తీసుకొనే శక్తి కూడా ఉండేది.

ఈ రోజులలో మన శాస్త్రజ్ఞులకి ప్రయోగించి, వినాశనాన్ని సృష్టించగలరు. కాని ఆపే శక్తిలేదు. వారుణాస్త్రాన్ని ఉపయోగించి అకాలవర్షాన్ని కురిపించే వారు. ఆగ్నేయాస్త్రంతో అగ్నిని పుట్టించేవారు. నాగాస్త్రంతో పాములను, విషకీటకాలను

సృష్టించి శత్రువుల్ని భయపెట్టేవారు. వాయువ్యాస్త్రంతో పెనుగాలులు సృష్టించి భయ విహ్వలలుగా చేసేవారు. బ్రహ్మాస్త్రం, పాశుపతాస్త్రం అంటే శక్తివంతమైన అణుబాంబు లుగా చెప్పాలి. ఇలా మన పురాణాల్ని పరిశీలించి, పరిశోధిస్తే అపరిమితమైన విజ్ఞానాన్ని బయటికి తీయవచ్చు. ఇప్పుడిప్పుడే కొందరు మహానుభావులు ఉద్భవించి దీనికి పూనుకోవడం హర్షించదగ్గ విషయం.

(భక్తి సుధ ఆధ్యాత్మిక మాసపత్రిక – సెప్టెంబర్' 2008)

❁ ❁ ❁

మీరూ ఆలోచించండి !

పూర్వపు రోజుల్లో మనరాష్ట్రంలో ఏ ఊళ్లో చూసినా ఊరుమధ్య రామాలయం, ఊరి చివర శివాలయం కనిపించేవి. రామాలయం ఊరిమధ్యలో వుండడం వలన ఊరిపెద్దలు, పిల్లలు సాయంత్రంవేళ అక్కడికి చేరేవారు. పర్వదినాలలో పండగల సందర్భంగా అక్కడ పురాణకాలక్షేపం, హరికథ, వీధిభాగవతం, తోలు బొమ్మలాట, చెక్కభజనలు లాంటి కార్యక్రమాలు ఏర్పాటుచేసి, భక్తిరసంతో పాటు వినోదాన్ని కలిగించేవాళ్లు. కొన్ని ఊళ్లల్లో ప్రతీశనివారం సాయంత్రం భజన కార్యక్రమాలు నిర్వహించి, ధూపదీప నైవేద్యాలతో భక్తులను ఆకట్టుకునేవారు.

శివాలయాలు ఊరి చివర వుండడం వలన కార్తీక మాసం, మాఘమాసం, శివరాత్రి సందర్భంలోనే కళకళలాడేవి. సోమవారంనాడు మరియు కొన్ని పర్వదినా లలో శివాలయాలలో భక్తులు కనిపించేవారు. మనరాష్ట్రంలోనే కాకుండా భారత దేశంలో ఇంచుమించు అన్ని నగరాలలో,పల్లెల్లో ఎక్కడికెళ్ళినా శివాలయాలు, రామా లయాలులేని గ్రామం లేదంటే అతిశయోక్తి కాదు.

నేడు అనేక శివాలయాలు, రామాలయాలు ఇంకా కొన్ని పురాతన దేవాల యాలు ధూపదీప నైవేద్యాలకు దూరమై జీర్ణావస్థలో వుండడం చాలామంది గమనించే వుంటారు. ముఖ్యంగా మన ఆంధ్రప్రదేశ్‌లో అనేక దేవాలయాల పరిస్థితి దీపం పెట్టే నాథుడే లేక కటిక చీకటిలో అలమటిస్తున్నాయి. కానీ మరొక విచిత్ర పరిణామం ఏమిటంటే ప్రతీపల్లెలో, నగరంలో కొత్త కొత్త దేవాలయాలు ఎన్నో వెలుస్తున్నాయి. కొన్నిచోట్ల కోట్ల రూపాయలు గుమ్మరించి కొత్తదేవాలయాలు కట్టడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

ఆంధ్రుల మనస్తత్వం విచిత్రంగా వుంటుంది...ఎప్పుడూ కొత్తదనం కోరుకోవ డంలో ముందుంటారు. 1950–60 సంవత్సరాల మధ్యకాంలో తిరుపతి వేంకటేశ్వ రుని ఎక్కువగా కొలిచేవారు. చాలామంది ఇళ్లల్లో శనివారాలు భజనలు చేసేవారు. పుట్టిన పిల్లలకు శ్రీనివాస్, బాలాజీ, వెంకటేశ్వర్లు, వేకంటేశ్వరరావు అనే పేర్లే ఎక్కువగా పెట్టుకొనేవారు. ఈ రోజుల్లోనే చాలా ఊళ్లలో వేంకటేశ్వరస్వామి దేవా లయాలు బాగా నిర్మించారు. 1960–70 మధ్యకాంలో సంతోషిమాత పూజలు

వ్రతాలు స్త్రీలలో ఎక్కువగా ప్రాచుర్యం వహించడంతో రాష్ట్రంలో చాలాచోట్ల సంతోషీ మాత ఆలయాలు కొత్తగా వెలిశాయి.

1970-90 సంవత్సరానికి అయ్యప్పస్వామిదీక్ష, శబరిమల యాత్ర ప్రాచుర్యం పొందడంతో రాష్ట్రంలో విపరీతంగా అయ్యప్పభక్తులు పెరిగారు. రాష్ట్రంలో అనేక పట్టణాలలో,నగరాలలో,కొన్ని పల్లెల్లో కూడా అయ్యప్పదేవాలయాలు వెలిశాయి. కొన్నిచోట్ల కోట్ల రూపాయలు వెచ్చించి అత్యంత సుందరంగా దేవాలయాలు నిర్మిం చారు. మనరాష్ట్రంలో ఇప్పటివరకు సుమారు వెయ్యి అయ్యప్పదేవాలయాలు కొత్తగా వెలిసినట్లు తెలుస్తోంది. పెద్దపెద్ద పట్టణాలలో 3,4 దేవాలయాలు కూడా వున్నాయి. కేరళ రాష్ట్రంలో కన్న మనరాష్ట్రంలోనే అయ్యప్పదేవాలయాలు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. దేశంలో మరెక్కడా ఇన్ని అయ్యప్పదేవాలయాలు కొత్తగా నిర్మించబడలేదు.

1990వ సంవత్సరం తరువాత ఆంధ్రుల దృష్టి షిర్డీ సాయిబాబాపై పడింది. షిర్డీసాయి దర్శనానికి అయ్యప్పదీక్షవలె దీక్ష అక్కర్లేకపోవడం చేత తిరుపతి వేంకటేశ్వర స్వామిని దర్శించుకొన్నట్లు కుటుంబ సమేతంగా వెళ్ళి దర్శించుకోవడం వలన షిర్డీ సాయిబాబా ఆంధ్రుల ఆరాధ్యదైవంగా ప్రసిద్ధి పొందారు. దాంతో ప్రతీ ఊరిలో షిర్డీ సాయిబాబా ఆలయాలు వెలిశాయి.

కొన్ని నగరాలలో పోటీగా పేటపేటకూ ఒకసాయిబాబా ఆలయం నిర్మంచడం మొదలుపెట్టారు. ఇప్పటికీ నిర్మిస్తూనేవున్నార. విజయనగరం లాంటి చిన్నపట్టణంలో కూడా పది సాయిబాబా మందిరాలు వుండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇంకొక విశేషమేమంటే ఈ మధ్య ఏడుళ్లో నైనా కొత్తగా నిర్మించే ఆలయం సాయిబాబాది కానీ, అయ్యప్పస్వామిది అవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఏ రాష్ట్రంలో కూడా సాయిబాబాకు ఇన్ని ఆలయాలు లేవు. ఇంతమంది భక్తులు లేరు.

నమ్మకానిబట్టి, వారికున్న భక్తినిబట్టి, భగవంతుడు వారికిచ్చిన శక్తినిబట్టి ఎన్నెన్ని దేవాలయాలనైనా నిర్మించవచ్చు. కానీ ధూపదీప నైవేద్యాలకు మాత్రం లోటురానివ్వకూడదు. దేశంలో ముఖ్యంగా మనరాష్ట్రంలో నేడు అనేక దేవాలయాలు జీర్ణావస్థలో వుండి రోజూ దీపం పెట్టే నాదుడులేక అలమటిస్తూ వుంటే కొత్తకొత్త దేవాలయాలు నిర్మించడం అవసరమా అనిపిస్తుంది.

ఇప్పటికీ జీర్ణావస్థలో వున్న దేవాయాలలో ఖాళీ ప్రదేవాలలో సాయిబాబాను గానీ, అయ్యప్పనుగానీ ప్రతిష్ఠించి పురాతన దేవాలయాలనుపునః ప్రారంభించి, బాగుచేయిస్తే ఎందరో మహాత్ములచేత పూర్వకాలంలో నిర్మింపబడ్డ దేవాలయాలు కళకళలాడి పూర్వవైభవాన్ని సంతరించుకుంటాయనడంలో ఏమాత్రం సందేహంలేదు.

కొత్త దేవాలయాలు కట్టనవసరంలేదు. కలియుగదైవం తిరుపతి వేంకటేశ్వరు నికి వచ్చే ఆదాయంలో పదోవంతు రాష్ట్రంలో జీర్ణావస్థలో వున్న పురాతన దేవాలయా లను పునఃనిర్మించడానికి ఖర్చుచేస్తే భక్తులు ఆనందిస్తారు. మన శిల్పకళను, పురాతన

చరిత్రను కాపాడిన వాళ్ళవుతారు. ఎంతోమంది నిరుద్యోగులకు బ్రతుకుతెరువు చూపించినవాళ్లవుతారు. (సహస్రార – ఆధ్యాత్మికమాసపత్రిక – మే 2007)

❀ ❀ ❀

ఆహార నియమాలు

ఆరోగ్యమే మహాభాగ్యము సిరిసంపదలకన్నా ఆరోగ్యం మిన్నయని మన పూర్వీకులు గ్రహించి ఈ ఆర్యోక్తిని చెప్పారు. అక్షర లక్షలు విలువచేసే వాక్యముగా దీనిని చెప్పాలి. ఈ విషయం గురించి మన భారతీయ పురాణ గ్రంథాలు భారతం లోను, భగవద్గీతలోను ఎంతో విశదంగా మన పూర్వీకులు తెలియజేశారు. చాలా కాలం ఇంచుమించు 1950–60 వరకు మన దేశంలో ఆహార నియమాలు తుచ. పాటించి అనేకమంది ఆరోగ్యవంతులుగా జీవించారు. ఆ రోజులలో అంటే 1950–60లో ఇప్పుడున్నని రోగాలులేవు. బి.పి,షుగరు, హార్టుకంప్లెయింట్,వున్నవారిని వేళ్ళపై లెక్కించవచ్చు. కళ్ళజబ్బులు పంటిజబ్బులు కొంతమందికే పరిమిత మయ్యేవి. నేడు నాగరికత మోజుతో కొత్తగా తెచ్చుకున్న రోగాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

శుచి శుభ్రత పాటించకపోవడమే సగం రోగాలకు కారణం. ఇంటి ఇల్లాలు శుచిగా స్నానంచేసి, మంచి మనసుతో చెడు ఆలోచనలు లేకుండా భగవంతుని స్మరిస్తూ వండి వడ్డిస్తే అది మహాప్రసాదమవుతుంది. తినే ఏ పదార్థాన్నైనా భగవంతు నికి అర్పించి 'పరమేశ్వరార్పణమస్తు!' కృష్ణార్పణమస్తు అని భగవంతుని తలచుకుని కళ్ళకు అద్దుకుతింటే తినే ఆహారం పుష్టిని, శక్తిని ఇస్తుంది. కాళ్లూచేతులు కడుక్కుని శుభ్రంగా తుడుచుకుని కూర్చుని వండి వడ్డించిన పదార్థాలు తినాలి. టీవి చూస్తూ కంచాన్ని ఒళ్లోపెట్టుకని, మంచం మీద పెట్టుకుని ఎక్కడ పడితే అక్కడ తినకూడదు. నిల్వ ఉంచిన పదార్థాలు, ఫ్రిజ్‌లో దాచుకుని మైక్రోఓవెన్‌లో వేడి చేసుకుని పదార్థాలు అసలు తినకూడదు.

శ్రీకృష్ణపరమాత్మే స్వయంగా భగవద్గీతలో అటువంటి ఆహారాన్ని భుజించ రాదని తెలియజేసేరు. వండిన తరువాత ఒకజాము దాటినది, సారము నశించినది, దుర్గంధపూరితమై పాచిపోయిన పదార్థములు, ఒకరు ఎంగిలి చేసినది, అశుద్ధముగా నుండుటను, ఆరోగ్యశాస్త్రరీత్యా కూడా నిలవ పదార్థాలు శరీరానికి చేటుతెచ్చి, రోగ కారణమవుతుందని చెప్పారు. హోటళ్లలో, రోడ్డు ప్రక్కన బండిపై అమ్మే ఛాట్ మసాలా ఫుడ్స్, ఫాస్టుఫుడ్స్, తినేవారికి తినేటప్పుడు ఆనందం కలిగించినా తరువాత రకరకాల రోగాలు తెచ్చిపెడతాయి. ఇలా రోడ్డుప్రక్కన ఫాస్టుఫుడ్ తిని ఇంటికివెళ్ళి మరణించిన వ్యక్తిని నేను చూశాను. రోగగ్రస్తులై ఆసుపత్రి పాలైన వారు అనేకులు వున్నారు. నేడు పెళ్ళిళ్లు, అనేక రకాల ఫంక్షన్లలో ప్లాస్టిక్ ఆకులు, ప్లేట్లులో వేడి వేడి పదార్థాలు వడ్డించి పెట్టడం చూస్తున్నాము. ప్లాస్టిక్ గ్లాసులలో మంచినీళ్ళు, వేడి కాఫీ త్రాగుతున్నాము. మనకి తెలియకుండా హాని కలిగించే కొన్ని రసయనాలు, బాక్టీరియా ఆహారంతోపాటు కడుపులోనికి పోతోంది. బఫే భోజనం అంటే ప్లేటు

పట్టుకుని తిరుగుతూ, కావలసినవి వడ్డించుకుతినడం ఈ మధ్య ఫేషనుగా మారింది. రకరకాల మనుషులు ఎంగిలి చేతితో వడ్డించుకు తినడం ఈ బఫే పద్ధతిలో ప్రత్యేకత. కేటరింగు పద్ధతి అవడంవలన వారి స్వలాభాలకోసం మధ్యాహ్నం వండినవి రాత్రికి, రాత్రి వండినవి మరునాడు వేడిచేసి పదార్ధాలను కలిపి పెట్టడం వారి ప్రత్యేకత. శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో చెప్పిన అన్ని ఆహారనియమాలను నేడు మనం ఉల్లంఘించుతున్నట్లే !

మనం తినే తిండి కూడా న్యాయమైన ఆర్జనతో కూడి వుండాలని, అక్రమ ఆర్జన పనికిరాదని కూడా శ్రీకృష్ణపరమాత్మ చెప్పేరు. మనం తినే ఆహారం కూడా కావలసిన దాంట్లో సగంతిని, మరో పావువంతు నీరు త్రాగి మిగతా పావుభాగాన్ని ఖాళీగా వుంచాలని, అపక్వాహారాన్ని అంటేపచ్చికూరలు, పళ్లు, మొలకెత్తిన గింజలు వంటివి తినడం ఉత్తమమమని కూడా పేర్కొన్నారు.

శ్రీకృష్ణపరమాత్మ రాయబారం నిమిత్తం ధృతరాష్ట్రుని కొలువునకు వెళ్లినపుడు దుర్యోధనుడు విందుకు ఆహ్వానిస్తే దుర్యోధనునికి ఇంటికి వెళ్ళకుండా విదురుని ఇంటికి వెళ్లి భుజించేడు. దుర్యోదనుడు కారణం అడిగితే నీ సంపాదన న్యాయార్జితం కాదని, అహంకరాం, డంబంతో పెట్టే కూడుకన్నా భక్తితో పెట్టే పట్టెడన్నం మేలు చేస్తుందని చెప్పి దుర్యోధనుని కళ్లు తెరిపించాడు. వేమనకూడా గంగి గోవు పాలు పద్యం ద్వారా దీనినే మరింత వివరంగా చెప్పేడు.

(ఆంధ్రభూమి దినపత్రిక – మంచిమాట – 2-6-2009)

❋ ❋ ❋

బ్రహ్మచారులు

బ్రహ్మచారి శతమర్కటః అని పూర్వం మన పెద్దలు అనేవారు. కానీ మన పురాణాలలో కనిపించే బ్రహ్మచారులంతా ఉత్తములు. బుద్ధిమంతులుగానే గోచరిస్తారు. బ్రహ్మచర్యంవలన బుద్ధిబలం, దేహబలం పెరిగి ముఖవర్చస్సు పెరుగుతుందని, వాక్శుద్ధి కలుగుతుందని చెబుతారు. మనోబలం, ధైర్యంతోపాటు నిశ్చల మనస్సు, ఏకాగ్రత కలుగుతాయి. అందుకే నేడు ఏ దీక్షావ్రతము చేయాలన్నా ముందు బ్రహ్మచర్య వ్రతానికి అగ్రతాంబూలమిచ్చి, బ్రహ్మచర్య వ్రతం సాగించడానికి తెల్లవారు జామున మేల్కొనడం, చన్నీటి స్నానం చేయడం, పూజ, ధ్యానం వంటివి చేయడం, మితాహారం, సాత్వికాహారం తినడం, పరుపులు, మంచాలు విడిచి నేలపై నిద్రించడం, మితంగా మాట్లాడడం, స్త్రీలను దూరంగా వుంచడం, వారితో అవసరమైన మాటలు మాట్లాడడం వంటి నియమాలు ఏర్పటుచేసారు.

పురాణాలలో నారద మునీంద్రుడు త్రిలోకసంచారియై, తన మేధాసంపత్తితో, బుద్ధిబలంతో ఎందరో రాక్షసులను అంతమొందించడానికి భగవంతునికి సాయం చేసాడు. గర్వంతో విర్రవీగుతున్న ఎందరో గర్వాన్ని అణచడానికి కారకుడయ్యాడు.

త్రిమూర్తుల భార్యలు ముగ్గురమ్మలు గర్వాన్ని అనుసూయ పాతివ్రత్య మహత్యంతో త్రిమూర్తులనే పసిపాపలను చేసి ఆడించేలా చేసింది. సత్యభామ గర్వమణచడానికి వ్రతం పేరుతో శ్రీకృష్ణునినే తులాభారంవేసే పరిస్థితి తెచ్చి రుక్మిణి గొప్పతనాన్ని లోకానికి చాటిచెప్పేడు. నిజానికి నారదుడు లేని పురాణమే లేదనిపిస్తుంది.

హనుమంతుడు శివాంశ సంభూతుడు, వాయుపుత్రుడు, అంజనీ తన యుడు, కేసరి పుత్రుడుగా సుగ్రీవుని మంత్రిగా శ్రీరామదూతగా నవవ్యాకరణ పండితుడిగా లోకానికి తెలుసు హనుమంతుని మేధస్సుకి, బుద్ధికి, మనోబలం, ధైర్యానికి, బ్రహ్మ చర్యమే కారణమని చెప్పాలి. ఎలాంటి కార్యాన్నయినా తృటిలో సాధించగల ప్రజ్ఞావం తుడు, బలశాలి, కార్యదీక్షాపరుడవడమే నేడు అందరకు ఆదర్శ దైవమయ్యాడు.

శంతన మహారాజు కుమారుడు గంగేయుడు (దేవవ్రతుడు) తండ్రి మోహిం చిన సత్యవతితో వివాహం, జరిపించడానికి ఆమెతండ్రి కోరిన షరతులకు అన్నింటికీ ఒప్పుకొని తాను వివాహం చేసుకోకుండా బ్రహ్మచారిగా వుండడానికి, సత్యవతికి పుట్టిన సంతానానికే రాజ్యాభిషేకం చేయడానికి ఒప్పుకొని ప్రతిజ్ఞ చేయడంవలన భీష్ముడుగా ఖ్యాతి గడించేడు. సంతానం లేకుండా సత్యవతి పుత్రులు మరణించేక తల్లి సత్యవతి భీష్ముని కోడళ్లతో కూడి సంతానాన్ని ప్రసాదించమని కోరింది. భీష్ముడు తన ప్రతిజ్ఞ నిలబెట్టుకోవడంవల్ల వ్యాసుని ద్వారా ఆమె సంతానవంతులను చేసింది. భీష్ముడు బ్రహ్మచర్య వ్రతప్రభావంవలనే స్వచ్ఛంద మరణం పొందేటట్లు తండ్రిచే వరం పొందడమే కాకుండా కురు పితామహుడిగా వాసికెక్కి అంత్యసమయంలో విష్ణు సహస్రనామ పారాయణాన్ని లోకానికి తెలియజేసి తరించిన మహానుభావుడు.

పరశురాముడు, జమదగ్ని మహర్షి రేణుకాదేవిలకు, విష్ణు అంశతో జన్మించిన తనయుడు. తన శౌర్య పరాక్రమాలతో దేశంలో రాజులందర్నీ గడగడలాడించి, నిర్వీర్యులనుచేసిన మహా పరాక్రమశాలి. తండ్రి జమదగ్ని, తల్లి రేణుకాదేవిని చంప మని ఆజ్ఞాపిస్తే పరశురాముని ముగ్గురు సోదరులు అంగీకరించక తండ్రి ఆగ్రహానికి గురయ్యారు. కానీ పరశురాముడు తండ్రి ఆజ్ఞను శిరసావహించి, తల్లి రేణుకాదేవిని తన గండ్రగొడ్డలితో సంహరించాడు. తండ్రి సంతోషించి వరం కోరుకోమంటే తన సోదరులతోపాటు తల్లిని మరల బ్రతికించమని వరం కోరుకుని వారిని బ్రతికించు కున్నాడు. పరశురాముడు పలువురికి అస్త్రశస్త్రవిద్యలు నేర్పించి గురువుగా కూడా కీర్తిబడసిన మహాపురుషుడే కాకుండా దేశంలో అనేక దేవాలయాలు, విగ్రహ ప్రతిష్ఠలు కూడా పరశురామునిచే నిర్మితమై దివ్యక్షేత్రాలుగా నేటికి విరాజిల్లుతున్నాయి. దశావ తారాలలో ఒక అవతారంగా అందిరిచే కీర్తించబడుతున్న వున్నతమైన మహనీయుడు.

ఆదిశంకరాచార్యులు కేరళలోని కాలడి గ్రామంలో జన్మించి బాల్యంలోనే సన్యసించి శారదామాత అనుగ్రహంతో అనేక గ్రంథాలు, దేవతా స్తోత్రాలు వ్రాయడ మేకాక భాష్యాలు చెప్పి ఆసేతు హిమాచలము పిన్నవయసులోనే మూడుసార్లు పర్యటించి, అద్వైత మతాన్ని స్థాపించి, అహం బ్రహ్మాస్మి, తత్వమసి సిద్ధాంతాన్ని

ప్రపంచానికి అందించిన అద్వితీయ ప్రతిభాశాలి. తన వాక్చాతుర్యంతో, ప్రతిభతో అనేకమంది పండితులను పిన్నవయసులోనే ఓడించి శంకరభగవతావతారంగా కీర్తించబడ్డారు. దేశంలో నాలుగు మూలలా నాలుగు పీఠములను స్థాపించి తన శిష్యులచే ఆ పీఠమును సక్రమంగా నడిపే ఏర్పాటు చేయడంవలన నేటికీ శంకరులచే స్థాపించబడిన పీఠాలు ఎంతో పవిత్రదేవలయాలుగా భాసిస్తూ వివిధ సేవలు అందిస్తున్నాయి. దేశంలో అనేక దేవాలయాలలో శ్రీచక్రంను ప్రతిష్ఠించి ఆ దేవాలయ ములు భక్తులతో నిత్యం కిటకిటలాడేటట్లు చేసిన తపోసంపన్నులు ఆది శంకరులు చిన్నవయసులోనే అంటే ముప్పది రెండేళ్లకే లోకాన్ని వీడినా ఆది శంకరుల అవతా రంగా నేటికీ పూజలు అందుకుంటూ భక్తుల హృదయాలలో చిరస్థాయిగా నిలచి వున్నారంటే అతిశయోక్తికాదు.

పంతొమ్మిదవ శతాబ్దంలో జన్మించిన మహానుభావులలో శ్రీరామకృష్ణ పరమ హంస శారదామాత శ్రీ వివేకానందులు అగ్రగణ్యులుగా పేర్కొనవచ్చు. బ్రహ్మచర్య దీక్షవలన గొప్పతనాన్ని, బ్రహ్మచర్య దీక్షవలన కలిగే లాభాలను ప్రపంచానికి చాటి చెప్పిన ఆదర్శమూర్తులు, చిరస్మరణీయులుగా వన్నెకెక్కారు.

శ్రీరామకృష్ణ పరమహంస బడిలో పెద్ద విద్యలు అభ్యసించకపోయినా, నిత్యం భగవత్సేవలో, తదేకధ్యానంలో వుండి భగవత్ సాక్షాత్కారం పొందిన పరమహంస లోకానికి దేవుని తాను చూసేనని ధైర్యంగా చెప్పిన మహానుభావుడు ఆయన. ఒక్కడే! నిరంతరం ఎందరో ఆ మహానుభావుని దర్శించి వారి సందేహాలు నిర్వృర్తి చేసుకునేవారు.

ఆయనబోధలు, ఆయన సమాధానాలు ఎక్కువగా పిట్టకధలూ, ఉపమానాలతో ఉండేవి. అరటిపండు వొలిచి నోటికి అందించినట్లు చక్కగా సందేహాలను తీర్చి భక్తుల హృదయాలుదోచుకున్నారు. వివేకానందుడు ఎన్నోసార్లు రామకృష్ణుని సందర్శించి, ఎన్నో ప్రశ్నలకు, సందేహాలకు ఆయన నుంచి తృప్తికరమైన జవాబులు లభించడంవల్లనే శ్రీరామకృష్ణుని గురువుగా స్వీకరించి చరితార్థుడయేరు.

శ్రీరామకృష్ణులు ఆధ్యాత్మికతత్వము, పిచ్చివానివలె ప్రవర్తించడం చూసి అతనికి పెళ్లిచేస్తే ఈ లోకములో పడతామోనని శారదాదేవితో అతనికి వివాహం జరిపిం చారు. వివాహం జరిగినా శ్రీరామకృష్ణులు ఆమెను భార్యగా ఎన్నడూ చూడలేదు. ఆమెలో కూడా కాళీమాతను సందర్శించి, జగన్మాతా అని ఆమెకు మొక్కేవాడు. అతని భార్యనేకాక సాటి స్త్రీలలందర్నీ కూడా శ్రీరామకృష్ణులు దేవీ స్వరూపులుగానే భావించి తరించారు. ఆయన అకుంఠితదీక్ష, తన్మయత్వం, తురీయవస్థలో ధ్యానంలో రోజుల తరబడి వుండడం చూసిన శారదాదేవి, శ్రీరామకృష్ణుని ఒక భర్తగా కాకుండా అందరిలా ఒక మహానుభావునిగా గుర్తించి సేవలుచేసి తరించారు.

శారదాదేవి రామకృష్ణునితో వివాహమైనా ఎన్నడూ భర్తతో కాపురం చేయాలని అభిలషించలేదు. చిన్నతనంలో అందరిలా తనకు వివాహమయినా భర్త శ్రీరామ

కృష్ణుల వారికి సేవచేసి శిష్యగణానికి శారదామాతగా ఎదిగి అందరి మన్ననలు పొందేరు. స్వామివివేకానందుని పేరు చెప్పగానే అస్ఖలిత బ్రహ్మచారిగా చెబుతారు. శ్రీరామకృష్ణ పరమహంసలవారికి ప్రథమశిష్యుడై కఠోర బ్రహ్మచర్య నిష్టతో, ఆత్మనిగ్రహం, మనోబలం, కార్యదీక్ష, పట్టుదల, మొండి ధైర్యంతో దేశ విదేశాలలో పర్యటించి శ్రీరామ కృష్ణుని బోధలు, హిందూమత గొప్పతనాన్ని చాటిన ప్రతిభాశాలి, ఏకాగ్రతతో ధ్యాన నిమగ్నుడై తురియావస్థను పొందిన మహోన్నతుడు. ఎటువంటి గొప్ప వ్యక్తినైనా, మహారాజుల వంటివారిని కూడా తన వాగ్ధాటితో, గుండె ధైర్యంతో వారిని వశపరచు కునేవారు.

ప్రజాసేవంటే మానవసేవే మాధవ సేవని లోకానికి చాటిచెప్పి రామకృష్ణ మిషన్‌ను స్థాపించి క్రమశిక్షణకు మారుపేరుగా అనేక విద్యాలయాలు, గ్రంథాల యాలు, వైద్యశాలలు నెలకొల్పి సేవలందించారు. తనలాటి బ్రహ్మచారులు పదిమంది వుంటే ప్రపంచాన్ని ఉర్రూతలూగిస్తానని ధైర్యంగా చాటిచెప్పిన మేధావి. క్రమశిక్షణ, పట్టుదలకు మారుపేరు వివేకానందులే. బ్రహ్మచర్యానికి అర్థం చెప్పిన మహోన్నత వ్యక్తిగా వివేకానందుని పేర్కొనాలి.

(ఆంధ్రభూమి దినపత్రిక – మంచిమాట – 12-9-2004)

❀❀❀

శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ మహిమ !

మా అమ్మగారికి లివరు జబ్బు (సిర్రోసిస్) వచ్చినట్లుగా మా డాక్టర్ తమ్ముడు గుర్తించి వైద్యపరీక్షలు జరిపించాడు. వ్యాధినిర్ధారణై ఆరునెలలు మించి బ్రతకరని స్పెషలిస్ట్ చెప్పడంతో ఇంట్లో అంతా ఆందోళన చెందాము. ఈ వ్యాధికి సరియైన మందులేదు. ఇక భగవంతుడే మనకి రక్షని మా డాక్టర్ తమ్ముడు చెప్పడంతో మా అమ్మగారిని హాస్పిటల్ నుండి ఇంటికి తీసుకువచ్చి మేము ఆరుగురం అన్నదమ్ములం కలిసి 108సార్లు విష్ణుసహస్రనామపారాయణ మా అమ్మగారి ముందు కూర్చొని చేశాము. ఆ లక్ష్మీనారాయణుని కటాక్షం వలన మా అమ్మగారు తరువాత ఆరు సంవత్సరాలు జీవించి వైకుంఠవాసం చేసారు.

నేను విజయవాడలో ఉన్నప్పుడు మా గురుస్వామి ప్రేరణతో విష్ణు సహస్ర నామ పారాయణము, శ్రీలలితా సహస్రనామ పారాయణం చేయడం మా సమితిలో ప్రారంభించాం. శలవురోజులలోను, వీలున్నపుడు రోజుకి 11 పర్యాయములు ఒక్కొక్కరి ఇంట్లో శ్రీ విష్ణు సహస్రనామ పారాయణచేసే వారము. మాతో శబరిమల యాత్రకు వచ్చిన ఒకస్వామికి పక్షవాతం వచ్చి మంచంపట్టి, వ్యాపారంలో నష్టపోయి, దీనస్థితిలో ఉన్నాడని తెలుసుకొని వారింటికి వెళ్ళి ఆరు వారాలపాటు వారింట్లో రోజుకు 11 సార్లు చొప్పున శ్రీ లక్ష్మీస్తోత్రముతోపాటు విష్ణు సహస్రనామ పారాయణం చేయడంతో కదలలేని స్థితిలో ఉన్నరోగి మరలలేచి మొదట ఒకరి సహాయంతో

లేచి నిలబడి నడకప్రారంభించి నలుగురితో కలసి ఆనందంగా జీవితాన్ని వెళ్ళబుచ్చాడు. మాట ముద్దగా వుండి ఒకచేయి స్వాధీనంలో లేకపోయిననూ పాటలు, పద్యాలు వ్రాసి పుస్తకం ప్రచురించాడు.

అయ్యప్పసహచరులు శ్రీ విశ్వనాధ కామేశ్వరరావుగారికి పెద్ద ఆపరేషన్ అయి భయాందోళనలతో వున్నప్పుడు, శ్రీ జి. గోపాలకృష్ణగారు స్కూటరు యాక్సిడెంట్ అయి తలకి గాయమై కోమాలో వున్నప్పుడు మా బృందం వారిరువురు ఇళ్ళల్లో శ్రీ విష్ణుసహస్రనామపారాయణచేసి, వారికి ఆరోగ్యాన్ని ప్రసాదించమని దైవాన్ని ప్రార్థించాము. వారిరువురూ కోలుకొని ఆరోగ్యవంతులై మరల శబరిమల యాత్ర మాతో చేయడమే కాకుండా విష్ణుసహస్రనా పారాయాణాన్ని ప్రోత్సహించి, పారాయణ పుస్తకాలు ముద్రించి ఉచితంగా పంపిణి చేసేరు. నేనూ వారితో చేయి కలిపేను.

అలాగే విజయవాడలోనే రాధమ్మగారని మాతో శబరిమల యాత్రచేసిన ఒకామె అనారోగ్యానికి గురియై మంచంపడితే వారింట్లో పారాయణచేసి ఆమెకు ఆరోగ్యము చేకూర్చాము (ఆ లక్ష్మీనారాయణులే ఆరోగ్యన్ని ప్రసాదించారు.) మా బృందంలోనే బాలకృష్ణస్వామి తండ్రి రామసుందరంగారికి ఏదో తెలియని జబ్బువచ్చి మంచం పట్టారు. నెల రోజులు డాక్టర్లు రకరకాల పరీక్షలుజరిపి రోగ నిర్ధారణ చేయలేకపోయారు. ఆ సమయంలో మా బృందం వారింటికి వెళ్ళి రోజుకు 11 సార్లు చొప్పున 10 రోజులు పారాయణచేసాము. భగవంతుని కృపవలన అతను కోలుకుని తరువాత 15 ఏళ్ళు జీవించారు.

విష్ణు సహస్రనామ పారాయణలో ఇంతటి ప్రాశస్త్యం, మహిమ ఉండబట్టే శ్రీ సద్గురు షిర్డీసాయిబాబా విష్ణుసహస్రనామ పారాయణ చేయమని వారి శిష్యులను, భక్తులను ప్రోత్సహించేవారు. విష్ణు సహస్రనామ పారాయణంలో కొన్ని శ్లోకాల్ని సంపుటీకరణచేస్తూ, ఉద్యోగ విజయాలు, కళ్యాణప్రాప్తి, వ్యాధినివారణ, ధనలాభము, మంత్రలాభాన్ని పొందినవారు పలువురున్నారు. దేనికైనా భక్తి, శ్రద్ధ, నమ్మకం ఉండాలి. (ఋషిపీఠం-ఆధ్యాత్మిక మాసపత్రిక-జూన్ 2009)

❀ ❀ ❀

మతమార్పిడిలు

శ్రీ సామవేదం షణ్ముఖశర్మగారికి నమస్కారములు. ఈ రోజు మతప్రచారాలు చాలా జోరుగా సాగుతున్నాయి.

కొత్తగా, రైళ్ళల్లో, ఇళ్ళల్లో ప్రవచనాలు, భజనలు (పాటలు) తో హోరెత్తిస్తున్నారు. ఇది చాలదన్నట్లు ఇంటింటికివచ్చి ప్రచారం చేస్తున్నారు. కరపత్రాలు పంచుతున్నారు. అయిదు నిమిషాలు వారి మాటలు వినమని బలవంతం చేస్తున్నారు. కొందర్ని మోహమాటంపెట్టి, ఏవో కబుర్లు ముందుచెప్పి, మెల్లగా చాపక్రింద నీరులా మతప్రచారం మొదలెడుతున్నారు.

నాకు ఈ మధ్య చిత్రమైన అనుభవం అయింది. అప్పుడే పూజచేసుకుని హాల్లోకి వచ్చాను. బయటగేటు చప్పుడైతే ఎవరని బయటకు వెళ్ళాను. నా నుదుట విభూతి, చందనం, కుంకుమబొట్లు ఉన్నాయి. చొక్కా వేసుకోకపోవడం వలన మెడలోని యజ్ఞోపవీతం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. జెంటిల్‌మెన్ (ఇద్దరు) గుడ్ మార్నింగ్ చెప్పి పలకరించి, "మిమ్మల్ని రెండు ప్రశ్నలడుతుతాను. సమాధానం చెప్పండి" దేనికో డేటా సేకరిస్తున్నట్లు చెప్పడంతో "సరే"అన్నాను.

"ప్రస్తుత పరిస్థితులు చాలా ఆందోళనకరంగా, భయంకరంగా ఉన్నాయి కదా! దానిపై మీ అభిప్రాయం ఏమిటి ? పరిస్థితులు మారి మంచిరోజులు వస్తాయని అనుకొంటున్నారా!" అని అడిగారు. నేను వెంటనే "ఈ పరిస్థితులు మారుతాయని అనుకోవడం లేదు. రాబోయే రోజులు ఇంకా గడ్డుగా ఉంటాయనుకొంటున్నాను" అని అన్నాను.

"మీరు కరెక్టుగా చెప్పారు. ఇదే విషయాన్ని బైబిల్లో పలాన పేజీలో జీసస్ చెప్పారని చెబుతూవచ్చిన పెద్దమనిషి బైబిలు తీయడంలో ఇది మతప్రచారానికి వచ్చినవారని తెలుసుకొని వెంటనే "ఈ విషయాలన్నీ మా భవిష్యపురాణంలో ఎప్పుడో చెప్పారు. ఇవన్నీ నాకు బాగా తెలుసు. ఇప్పుడు నా వయసు డెబ్బై. చాలా విషయాలు తెలుసు. కొత్తగా తెలుసుకోవడానికి ఏమీలేదు. దయచేసి వెళ్ళండి" అని మర్యాద పూర్వకంగా సాగనంపి లోనికి వచ్చాను.

సాయంత్రం ఇదే విషయాన్ని నా స్నేహితునికి చెబితే ఆయన నాకో కొత్త విషయాన్ని చెప్పాడు. వాళ్ళ కాలనీలో ఒకతను ఇంట్లో ఉన్న దేవుని పటాలన్నీ తెచ్చి దగ్గర్లోవున్న శివాలయంలో ఒకమూల పడవేయడం చూసి కారణమడిగితే మతం మారానని చెప్పాడట. మరికొద్ది రోజుల తరువాత ఆ స్నేహితుడే కాలనీలో ఇల్లు కట్టడం చూసి ఆశ్చర్యంగా ఇంత డబ్బు ఎలా వచ్చిందని అడగ్గా. మతం మారితే ఇచ్చారని చెప్పాడుట. మతం మారితే డబ్బు ఇస్తారా ? అని ఆశ్చర్యంగా అతను అడిగేసరికి అతను నవ్వి, "కులాన్నిబట్టి యిస్తారు. నా భార్యకు మూడు, నాకు మూడు మొత్తం ఆరులక్షలు ఇచ్చారు. అగ్రవర్ణాలవారికి రేటు ఎక్కువగా ఇస్తారని చెప్పడంతో నా స్నేహితుడు ఒక్కసారి షాక్ తిన్నాడుట. దేశంలో ఈ రోజు పరిస్థితులిలా ఉన్నాయి.

మతప్రచారం కోసమే ఈ మధ్యకోట్లురూపాయలు ఖర్చుచేసి భారీ ఏర్పాట్లు చేసి, ప్రసంగాలుచేసి అట్టహాసం చేస్తున్నారు. సెక్యులర్ దేశమని మన హిందూ దేవాలయాలకు వచ్చిన ఆదాయం సొమ్ముతోనైనా మనం మతప్రచారం చేయకూడదు. మన దేవాలయాలపై రాజకీయనాయకులు పెత్తనం రోజురోజుకి ఎక్కువవుతోంది. నీతి నిజాయితీలేనివారిని, అక్రమ సంపాదనలుచేసేవారిని ధర్మకర్తలుగా, దేవాలయ చెయిర్‌మెన్‌లుగా నియమించి అపఖ్యాతి పాలుచేస్తున్నారు. డబ్బే ప్రధానమన్నట్లుగా దేవాలయంలో వ్యాపారాలు చేస్తున్నారు. మనకు లెక్కకు కొన్ని వందల

పీఠాధిపతులున్నారు. కానీ ఒక్కరూ ప్రభుత్వాన్ని ప్రశ్నించడంలేదు. ధైర్యంగా మొట్ట మొదటిసారిగా శ్రీ రామ్‌దేవ్ (యోగాప్రచారకర్త) తిరుమల తిరుపతి దేవస్థానానికి ఒక మద్యం వ్యాపారం చేసే వారిని ధర్మకర్త (చెయిర్‌మెన్)గా నియిమించడాన్ని అన్యాయం, అక్రమమమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సంపాదకీయంలో మీరు ధైర్యంగా రాసిన సంపాదకీయం నన్నెంతో ఆకర్షించింది. ఈ రోజుల్లో ఇంత ఘాటుగా నిక్కచ్చిగా, నిర్మొహమాటంగా, సూటిగా ఏ విషయాన్నైనా ధైర్యంగా చెప్పగల సామర్థ్యం ధైర్యం ఉన్న మీకు నా ధన్యవాదములు. మీ దేశభక్తికి, హిందూత్వంపై ఉన్న అభి మానానికి భారతీయ సంస్కృతిని లోతుగా పరిశీలించి, పరిశోధించి మన పురాణా లలో ఉన్న విజ్ఞానాన్ని ప్రవచనాల ద్వారా ప్రపంచానికి తెలియజేస్తున్న మీకు అభివంద నములు. కృతజ్ఞతాభివందనములు.

(ఋషిపీఠం ఆధ్యాత్మిక మాసపత్రిక - మార్చి 2009)

❀ ❀ ❀

ప్రజ్ఞాశాలి హనుమంతుడు

శ్రీరామలక్ష్మణులిరువురిని ప్రప్రథమంగా పంపాతీరముదాటి ఋష్యమూక పర్వత సమీపమునకు వచ్చుచున్నవారిని సుగ్రీవుడు చూసి కంగారుపడి శత్రువులుగా భావించి మంత్రియైన హనుమంతుని పిలిచి, వారి మంచి చెడ్డలను తెలుసుకొని రమ్మనమని పంపెను. వాయుపుత్రుడగు హనుమ తన సహజమగు వానరరూపమును విడచి ఒక సన్యాసి వేషము ధరించి రామలక్ష్మణుల కడకేగి వారి దివ్యతేజస్సునిగాంచి పులకితుడై వారికి నమస్కరించెను. శ్రీరాముని సౌందర్యము, దేహకాంతి, అతనిదీర్ఘ బాహువులు, సూర్యచంద్రుని కాంతిలో ప్రకాశించే అతని నేత్రములు చూసి పరవశ ముచెందెను. శ్రీరామలక్ష్మణులను వారి వేషధారణ వారి పలుకులు విని వీరు శత్రువులుకారని గ్రహించిన వెంటనే తన భిక్షకరూపమును విడనాడి వానరరూప ముతో సాక్షాత్కరించి అతి వినయముతో తన రాక గురించి శ్రీరామలక్ష్మణులకు విన్న వించెను.

"ఋష్యమూక పర్వతమందు సుగ్రీవుడను వాసనరరాజు వున్నాడు. అతడు ధర్మ స్వభావము కలవాడు. వీరుడు, సోదరునిచే అవమానింపబడి దుఃఖములో వున్నాడు. అతను పంపగా వచ్చిన దూతను నేను. నా పేరు హనుమంతుడు. సుగ్రీవుడు మీతో మైత్రి చేసుకొనవలెనని కోరుతున్నాడు. నేను అతని మంత్రని అని ప్రారంభించి, రామలక్ష్మణుల గురించి వారి రాక గురించి తెలుసుకొనగోరెను. అప్పటివరకు పెదవి విప్పని రాముడు, లక్ష్మణునితో హనుమంతుడు సామాన్యుడు కాదని వేద వేదాంగములను అధ్యయనము చేసిన మహా పండితునివలె కన్పించు చున్నాడని చెప్పెను.

"నానృగ్వేద వినీతస్య నాయజుర్వేద ధారిణః।
నా సామవేద విదుషశ్శ్య మేవం ప్రభాషితమ్॥"

ఋగ్వేదము నందు శిక్షితుడుగానివాడు, యజుర్వేదమును ధారణ చేయని వాడు, సామవేదమును గానము చేయుటను ఎరుంగనివాడు ఇట్లు మాట్లాడజాలరు. అందుచే ఈతడు మూడు వేదములను అధ్యయనముచేసినట్లు తోచుచున్నది. శ్రీరాము డతని వేద పాండిత్యమును గుర్తించినవాడై, హనుమ పలికిన పలుకులకు ముగ్ధుడై, హనుమమాట్లాడిన మాటలలో 'ఉభౌయోగ్యావహం మన్యేరక్షితం పృధివీమిమామ్' మీరిరువురూ ఈ భూమిని రక్షింప యోగ్యులని నేను తలంచుచున్నాను అని అనడం "మానుషౌదేవరూపిణే" అని మానవులుగా దిగివచ్చిన దేవతామూర్తులని ప్రశంసించ డంతో రామునికి హనుమంతునిపై అభిమానముపెరిగెను.

'మానం వ్యాకరణం కృత్స్నమనేన బహుధాశ్రుతమ్ ।

బహువ్యాహరతా నేననకిఞ్చ దప శబ్దితమ్॥

వేదాంగములు ఆరు. శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, కల్పము, జ్యోతిషము. అందు వ్యాకరణము ప్రధానము. అట్టి వ్యాకరణములు తొమ్మిది రక ములు. ఆ తొమ్మిది రకముల వ్యాకరణములను ఎరిగినవాడు హనుమ. హనుమ మాటాడునపుడు ముఖమునందుగాని, నేత్రములలోగాని, నుదిటియందుగాని, ఇతరా వయవములలోగాని, ఎచ్చటను ఏవిధమైన వికారము కన్పడకుండా ఉండుట గ్రహించి శ్రీరాముడు, హనుమ వాక్చాతుర్యమును ప్రశంసించి, ఇట్టి లక్షణములు కలవాడు దూతగా లభించినవాడు ఎట్టి రాచకార్యములైనను సిద్ధింపగలవని లక్ష్మణునితో తనము మనకవగతమవుతుంది.

హనుమంతుని రాముని మాటలలో సుగ్రీవునినే వెదకుకొనుచు వచ్చుచున్నా రని విని అమితముగా ఆనందించెను. రాముని రాకతో సుగ్రీవునికి రాజ్యము మరల సిద్ధించునని అతనికి మంచి రోజులురాగలవని విని పులకించి పోయెను. తరువాత లక్ష్మణునిద్వారా, వారు అయోధ్యను పాలించే దశరథ మహారాజు పుత్రులమని, తండ్రి ఆనతితో సీతాసమేతముగా అరణ్యవాసమునకు వచ్చిన సంగతి, ఆశ్రమము నుండి రావణుడు, సీతమ్మను అపహరించిన సంగతి అన్నీ సవినయముగా హనుమకు ఎరింగించి, సీతాన్వేషణకు బయలుదేరినట్లు చెప్పెను. దారిలో కబందుడనే రాక్షసుని సంహారము, అతని శాపవిమోచనము గురించి తెలియచేసి, కబందుడు, సీతాన్వేషణ విషయములో సుగ్రీవునితో మైత్రిని చేయమని చెప్పుట వలన అతను సూచించిన విధముగా ఋష్యమూక పర్వతము చేరుటకు వచ్చితిమని లక్ష్మణుడు చెప్పగా విన్న హనుమంతుడు ఈ విషయములో సుగ్రీవుడు తప్పక సహకరించగలడని, అతని మైత్రివలన యిరువురికి లాభదాయకమని వారికి ఎరింగించి శ్రీరామచంద్రుల నిరువురిని హనుమ తన భుజములపై కెక్కించుకొని ఆనంద పారవశ్యముతో ఋష్య మూక పర్వతమునకు చేర్చి సుగ్రీవునితో మైత్రి గావించి, నేటికి పూజలు అందు కుంటున్నాడు. - (ఆంధ్రభూమి దినపత్రిక - మంచిమాట-7-3-2004)

❁ ❁ ❁

నాయన

శ్రీరమణమహర్షి అనే నామధేయాన్ని ప్రపంచానికి అందజేసిన మహనీయుడు కావ్యకంఠ వశిష్ఠ గణపతిముని. అప్పటివరకు భగవాన్ రమణమహర్షిని ఎరిగినవారు ఆయన పేరు తెలియక బ్రాహ్మణస్వామి అని పిలచుకునేవారు. అసలు పేరు వెంకట రమణ అయినా ఎవరికీ ఆయన నామధేయము తెలియక బ్రాహ్మణస్వామి అని పిలిచేవారు. 1907లో గణపతిముని తీర్థయాత్రలుచేస్తూ, మంత్రతపాలు (అరుణా చలం) రావడం జరిగింది. అక్కడ కొండమీద తపస్సు చేస్తున్న బ్రాహ్మణస్వామిని చూసి తన్మయత్వం చెంది, కన్నీరు కారుస్తూ 'భగవాన్ ఇన్నాళ్ళకు నాకు దర్శన మిచ్చేవా? అంటూ సాష్టాంగ ప్రమాణమాచరించి రమణుల అనుగ్రహంతో అక్కడ కొండమీద తపస్సచేస్తున్న బ్రాహ్మణస్వామిని చూసి తన్మయత్వం చెంది, కన్నీరు కారుస్తూ, భగవాన్ ఇన్నాళ్లకు నాకు దర్శనమిచ్చేవా? అంటూ సాష్టాంగ ప్రమాణ మాచరించి రమణుల అనుగ్రహంతో అక్కడ తపస్సు ప్రారంభించారు. భగవాన్ రమణ మహర్షి గణపతి మునిని ఆశీర్వదించి నాయనా అని సంబోధించి ఆ తర్వాత కూడా అతన్ని నాయనా రి అని పిలిచెడువారు. ఈ పేరు వారికి అవిధంగా సార్థక నామధేయమైంది.

విజయనగరంజిల్లా బొబ్బిలికి దగ్గరలోవున్న 'కలువరాయి' గణపతి మునీంద్రుల జన్మస్థలం, నవాబ్ అయ్యల సోమయాజుల భీమశాస్త్రి కుమారుడు నరసింహశాస్త్రి వారి కుటుంబం వేదాధ్యయనం చేయడమేకాకుండా ఆధ్యాత్మికంగా ఎంతో పేరు గడించి పండితులుగా గౌరవ సత్కారాలు అందుకునేవారు. నరసింహ శాస్త్రికి నరసమాంబ భార్య. నరసింహశాస్త్రికి దూండీ గణపతి అంటే అమితభక్తి. నరసమాంబకి అరసవిల్లి సూర్యనారాయణమూర్తి అంటే అమిత భక్తి, పిల్లలకోసం తపిస్తూ ఇద్దరూ వారిష్టదేవతలను కొలిచేవారు. దైవానుగ్రహంతో నరసమాంబ గర్భవతియై ఏడు మాసములునిండేక ప్రసవానికి పుట్టింటికి వెళ్లేరు. నరసింహశాస్త్రి కాశీవెళ్లడానికి బయలుదేరేరు. (1878) ఆ రోజులలో కాశీ అంతా కాలినడకనే వెళ్లేవారు. నరసింహశాస్త్రి కాశీలో వుంటూ దూండీ వినాయకుని గుడిలో ఏడురోజులు గడిపేరు. ఒకరోజు మధ్యాహ్నం (17-11-1878) ఒక అందమైన బాలుడు దూండీ వినాయకుని విగ్రహమునుండి పాకురుకొంటూవచ్చి తపస్సులో నిమగ్నమైవున్న నరసింహశాస్త్రి ఒడిలో చేరినట్లు భావనకలకగడంతో ఆనంద పారవశ్యంతో కనులువిప్పి చూసేసరికి అక్కడ బాలుడు కనిపించకపోయేసరికి నిర్ఘాంత పోయారు. తర్వాత తనకి గణపతియే కుమారుణ్ణి ప్రసాదిస్తున్నాడని ఆనందంతో స్వామివారికి మొకరిల్లి తిరిగి ఇంటికి పయనమయేడు.

అత్తవారింటికి చేరేసరికి ఆయనకాశీలో ఊండీ వినాయకుని సమక్షంలో పొందిన అనుభూతి సమయానికే భార్య ప్రసవవార్త విని ఆశ్చర్యపోయాడు. ఆ బాలునికి సూర్యగణపతిశాస్త్రి అని నామకరణం చేసి అల్లారు ముద్దుగా పెంచి పెద్ద

చేసారు. సకల విద్యలు, వేదాలు అన్నీ అభ్యసించి, వశిష్ఠ గణపతి శాస్త్రిగా తనపేరు మార్చుకొని తన పాండిత్యానికి గుర్తింపుకోసం నవద్వీప్ వెళ్లేరు. ఆ రోజులలో అమరావతి, నలంద, ఉజ్జయినీ, నవద్వీప్ విశ్వవిద్యాలయాలు వుండేవి. పాండిత్య ప్రతిభని పరీక్షించి వారికి బిరుదు ప్రదానం చేసేవారు. అక్కడ జరిగే హరి సభలో తన పాండిత్యంతో అందర్నీ ఆశ్చర్యచకితులను చేసి ఎటువంటి సమస్యనైనా పూరించి శ్రీ అంబికాదత్తవంటి విశ్వవిద్యాలయ కులపతి నుంచి ప్రశంసలు పొంది కావ్యమునే కంఠములో గలవాడని కీర్తించి ఆయన మేధస్సుకి తగిన బిరుదు 'కావ్యకంఠ'తో నమస్కరించి వేనోళ్ళ పొగిడేరు. బాల్యంలోనే విశాలాక్ష్మమ్మతో గణపతిశాస్త్రికి వివాహ మైనది. వారికి మహదేవశాస్త్రి అనే కుమారుడు కలిగేడు.

కావ్యకంఠవశిష్ఠ గణపతి ముని తీర్థయాత్రలుచేస్తూ రమణమహర్షిని సుబ్రహ్మణ్య అవతారంగా భావించి ఆయనచెంత కొంతకాలం వుండి తపస్సు గావించ డమే కాకుండా అరుణాచలేశ్వరుని స్తుతిస్తూ హరసహస్రం పేరుతో వెయ్యి శ్లోకాలతో గ్రంథం వ్రాసేరు. తరువాత శక్తి స్వరూపిణి అయిన ఉమాదేవిపై కూడా వెయ్యి శ్లోకాలు వ్రాసి ఇరవై రోజులలో అందజేస్తానని రమణమహర్షి వారికి చెప్పి తపోనిష్ఠలో మునిగేరు.

ఒకరోజు దేశంలో ప్రజలు అన్నార్తులై ఆకలి ఆకలి అని అలమటిస్తున్నట్లు కేకలు వినిపించెను. కళ్లుతెరచి చూసేసరికి ఏమీ కనిపించలేదుకానీ అతనికీ ఆకలి బాధ కలగడంతో ఆశ్చర్యం పొందారు. తరువాత మరల ధ్యాననిష్టలోకి వెళ్లారు. గణపతి ముని ప్రారంభించిన ఉమాసహస్రం మూడు వంతులు మాత్రమే పూర్త యింది. పందొమ్మిది రోజులు గడచిపోయేయి. గణపతి ముని చేతిలో అసంపూర్ణంగా వున్న గ్రంధాన్ని అక్కడకు రమణమహర్షితోపాటునలుగురు శిష్యులు వచ్చి రమణుని అనుగ్రహంతో ఉమా సహస్రాన్ని వ్రాసి పూర్తిచేసారు. కావ్యకంఠ గణపతిముని ఆధ్యాత్మికంగా ఎంత ఎత్తుకెదిగినా సాంఘిక దురాచారాలను వ్యతిరేకించేవారు. బాల్య వివాహాలను వ్యతిరేకించి బాలికకు 18 సం॥లు నిండిన తర్వాతే వివాహం జరిపించాలని అనేక సభలలో నొక్కివక్కాణించారు. మదనమోహనమాలవ్య కావ్యకంఠ గణపతికి మిత్రులవ డంతో స్వాతంత్రోద్యమంలో చేరి పెక్కు నాయకుల ప్రశంసలు అందుకొని తన ఉపన్యాసాలతో ప్రజలను ఆకట్టుకున్నారు. హరిజనోద్ధరణకు నడుం బిగించి అస్పృశ్యతా నివారణకు స్త్రీల హక్కులకోసం పోరాటం చేసారు. గాంధీ మహాత్మునితో కలసి ఒకే వేదికపై ప్రసంగించారు. మదనమోహన్‌మాలవ్య, డా. అనిబిసెంటు వంటి వారు గణపతి మునిని పలువిధముల ప్రసంసించారు. గాంధీజీ దేశభాషగా హిందీని ప్రతిపాదిస్తే గణపతి ముని వ్యతిరేకించి సంస్కృతం జాతీయ భాషగా వుండాలని గాంధీజీతో వాదించారు.

వశిష్ఠ గణపతి ముని అనేక ప్రదేశాలు తిరుగుతూ ఎందరో శిష్య గణంతో నిండి వుండేవారు. 1934లో జి.ఎల్. కాంతం అనే శిష్యుని కోరికపై కలకత్తాలో

రెండేళ్లున్నారు. అప్పుడు ఖరగ్‌పూర్‌లో అనేకమంది శిష్యులు ఏర్పడ్డారు. వారి కోరికపై అప్పుడప్పుడు ఖరగ్‌పూర్ వెళ్ళివచ్చేవారు. 1962సం.లో నాయనకి భార్య వియోగం కలిగింది. నాయన 21-7-1936న మధ్యాహ్నం భోజనంచేసి విశ్రమించేరు. తెలివిగా వుండి మాట్లాడుతూ లేవడానికి ఇష్టపడకపోవడంతో డాక్టరుకి చూపిస్తే బాగా నీరసంగా వున్నారని అందర్నీ పిలిపించమని చెప్పడంతో కుమారుడు మహ దేవశాస్త్రిని, లక్ష్మీకాంతంను పిలిపించారు. వైద్యానికి కలకత్తా తీసుకెళ్తామంటే నిరా కరించారు. నాయన జూలై 25, 1936న ఉదయమే ఎంతో ఉత్సాహంగా లేచి జప, తపాలు, హోమం గావించి మధ్యాహ్నం 12.30 గం॥ సమయంలో అంతిమ శ్వాస విడచి పరమాత్మలో ఐక్యమయ్యారు.

(ఆంధ్రభూమి దినపత్రిక - మంచిమాట - 25-6-2004)

❋ ❋ ❋

రమణ మహర్షి

పూర్వపురోజులలో మహర్షుల గురించి విన్నాముకానీ కనులార చూడలేదు. అరుణాచలంలో మనకోసం తపస్సు గావించిన మహనీయుడు శ్రీ రమణ మహర్షిని దర్శించిన పుణ్యాత్ములు నిదర్శనంగా నేటికీ వున్నారు. ఆ మహర్షి ఎన్నో సంవత్సర ములు కొండ గుహలలో తపస్సుగావించి, ఆయన దర్శన భాగ్యముతోనే అనేకుల సంశయములుతీర్చిన మహానుభావుడు. ఆయన దక్షిణమూర్తి అవతారమని, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి అవతారమని ఆయన శిష్యుల నమ్మకం. ఆయన తన పదహేడవ యేట అరుణాచలం పేరు విని యింట్లో ఎవ్వరికీ చెప్పకుండా దొంగతనంగా పారి పోయివచ్చి, తపస్సు గావించిన మహా మనిషి. సన్యసించినది మొదలు తుది శ్వాస విడిచేవరకు కౌపీనమునే ధరించి, ఆయనను దర్శించడానికి వచ్చినవారికి, భక్తులకు అందరకు నిరాడంబరముగానే కన్పించేవారు. భక్తులు కానుకలుగా వెండి వస్తువులు యిచ్చినా స్వీకరించకుండా ఎప్పుడూ తన వస్తువుల్లే వాడుకొనేవారు. ఆయన శిష్యు లలో కావ్యకంఠ గణపతిశాస్త్రి అగ్రగణ్యులు. ఆయనే మొదట 'శ్రీరమణ మహర్షి' అని నామధేయాన్ని ఆయనకు ప్రతిపాదించారు. అంతకు పూర్వము శ్రీరమణులు ఎవరితోనూ మాట్లాడకపోవడంతో ఆయన్ని అంతామౌనస్వామిగా పిలచేవారు.

ఆయనకు భారతీయులేకాక పాశ్చాత్యులు అనేకమంది శిష్యులయ్యారు. వారిలో పాల్‌బ్రింటన్, ఆర్థర్ ఆన్ బోర్న్, ఎస్.ఎస్.కోహెన్, హంఫ్రీస్, మేజర్ చాడ్‌విక్ ముఖ్యులు. రమణ మహర్షిలో గొప్పతనం ఏమిటంటే ఉపన్యాసాలు, ఉపదే శాలు లేకుండా ఆయన చూపులతోనే భక్తులను ఆకట్టుకునేవారు, ఆయన్ని గురువుగా స్వీకరిస్తామని ఉపదేశం చేయమని అడిగితే నాకే ఎవరూ ఇప్పటిదాకా గురువులేరు.

నిన్ను శిష్యుడిగా ఎలా స్వీకరించేదని నవ్వుతూ చెప్పేవారు. ఆయన పలికిన మాటలు ఆణిముత్యాలు. దేవుడు మనిషిని సృష్టించేడు. మనిషి దేవుణ్ణి సృష్టించు

కున్నాడు. ఇద్దరూ నామరూపాలను సృష్టించినవారే. నిజానికి మనిషికానీ, దేవుడుకానీ సృష్టించబడినవారు కాదు ? నువ్వెరవో కనుక్కో నిన్ను గురించి నీవు తెలుసుకో ఇదే వేదాంతసారమని ఆయన్ని అడిగినవారికి చెప్పేవారు.

ఒకసారి ఆయనకున్న ఒక్క తువ్వాలు బాగాచినిగిపోయి పీలికలై జీర్ణావస్థకి వస్తే ఎవరూ చూడకుండా దాన్ని ఒకచెట్టు తొర్రలో దాచుకున్నారు. మరొక సారి అతను కట్టుకొనే కౌపీనము చిరిగిపోతే ఒక ముల్లుకు బెజ్జంపెట్టి కౌపీనము నుంచి దారపు పోగుతీసి దాన్ని కుట్టుకున్నారు. ఆయన శిష్యులు దేనికోసమో వెతుకుతూ చెట్టు తొర్రలో చేయపెట్టేసరికి జీర్ణవస్థలో వున్న ఆయన తుండుగుడ్డ చూసి కన్నీళ్లు కార్చి కొత్త తువ్వాళ్లు కొని యిచ్చేరట. ఒక శిష్యుడు దీనినే అందంగా పద్యరూపంలో అల్లి మహర్షి గుణాలను చాటేరు.

'ముల్లుతో కుట్టిన కౌపీనం ధరించిన ఓ వెంకటరమణా
వేయి కళ్ళ ఇంద్రుడే నీకు తువ్వాలై సేవ చేశాడయ్యా?'

అరుణాచల పర్వతం ఎత్తు 2668అడుగులు, చుట్టుకొలత సుమారు ఎనిమిది మైళ్లు (12కి.మీ.) అరుణాచలం వచ్చిన భక్తులు ఆ గిరి ప్రదక్షిణం చేయడం ఒక సాంప్రదాయంగా పరిగణిస్తారు రమణ మహర్షి అప్పుడే ప్రదక్షిణం చేసివచ్చి కూర్చున్నా వచ్చిన భక్తులు స్వామివారిని రమ్మంటే మరల వారి వెనుక వెళ్ళి వారితో ప్రదక్షిణం చేసివచ్చేవారు.

శ్రీ రమణులవారికి పశుపక్ష్యాదులపై విపరీతమైన ప్రేమ వుండేది. ఆశ్రమము నిండా కోతులు విచ్చలవిడిగా తిరగాడేవి. ఒకసారి ఒకభక్తుడు మధురమైన ఫలములు తెచ్చి స్వామివారికి సమర్పించి తినమని ప్రాధేయపడ్డాడు. ఎక్కడ నుంచో కోతివచ్చి వాటిని తీసుకుపోవడంతో భక్తుడు బాధపడుతూ వుంటే, ఇది ఒకప్పుడు చిట్టడివి. అందులో నిర్భయంగా కోతులు సంచరించేవి. మనం ఈనాడు వాటి స్థలాన్ని ఆక్ర మించుకొన్నందుకు వాటిని గౌరవించాలన్నారు. మరొకసారి మహర్షి భోజనం చేయడానికి ఉపక్రమిస్తూవుంటే ఒక కోతి వచ్చి అడ్డుపడితే తొలిముద్దని కోతికి పెట్టారు. అది దానిని తినకుండా మహర్షులవారిని చెంపమీద కొట్టింది.

వెంటనే దాని భావము గ్రహించి వేరే విస్తరి తెప్పించి వడ్డిస్తే అందులో పదార్థాలు తిని అది వెళ్లింది. భక్తులు ఆశ్చర్యంగా కారణమడిగితే ఆ కోతి వనానికి రాజు. దానికి చేతిముద్ద తినడం ఇష్టంలేక చెంపదెబ్బ కొట్టిందని నవ్వుతూ చెప్పారు. శ్రీరమణునికి ముస్లిం భక్తులు వుండేవారు. క్రిస్టియన్లు, ముస్లింలు అందరూ నిర్భ యంగా ఆశ్రమానికి వచ్చి శ్రీరమణుని దర్శించుకుని వెళ్ళేవారు. ఒకసారి ఒక భక్తుడు భగవాన్ సమీపాన కూర్చుని బర్త్ కంట్రోల్‌పై మీ అభిప్రాయంచెప్పమని అడిగేరు. స్వామివారి మౌనాన్ని చూసి ఆ భక్తుడు అధికసంతానం వలన కలిగే నష్టా లను వివరిస్తూ ఉపన్యాసము ఇచ్చాడు. మహర్షి మెల్లగా నీకు డెత్ కంట్రోల్‌గురించి

తెలుసా? అని అడిగేసరికి తను నివ్వెరపోయాడు. ఆశ్రమానికి వచ్చిన భక్తులకు ఏ మాత్రం లోటు జరిగినా భగవాన్‌వారు సహించేవారు కాదు.

తనకి త్రాగడానికేమైనా తెస్తే ముందు వచ్చిన భక్తులకు యిమ్మని ఆదేశించే వారు. సహపంక్తి భోజనం చేయడమేకాకుండా, వంటశాలలో వంటలను పరిశీలించే వారు. అరుణాచల రమణుని తల్లి సమాధిపైన ఒక దేవాలయం కట్టాలని కొందరు భక్తులు వెళ్లి శ్రీరమణుని అడిగేరు.

తన పేరున చందాలు వసూలుచేసి దేవాలయాలు, కట్టద్దని తనని సన్యాసిగానే వుండనివ్వమని నిష్కర్షగా చెప్పారు. స్వామిజీని వివిధ పట్టణాలకు, తీసుకువెళ్లి ఉపన్యాసాలిప్పించాలను కున్న వారిని కూడా నిరాశపరిచారు.

1950లోశ్రీరమణుని ఆరోగ్యం బొత్తిగా చెడిపోయినకారణంగా పలువురు ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని పూజలు జరిపించారు. భక్తుల ఆరాటాన్ని చూసిన మహర్షి, అరిటాకులో వడ్డించిన భోజనం చేసిన తర్వాత, ఆ విస్తరిని కడిగి మళ్లీ భోజనానికి వాడుకుంటారా? అని తన అవతార సమాప్తిని సూచించారు.

ప్రతి విషయానికీ ఇతరుల సహాయంపై ఆధారపడవలసిన దేహ పరిస్థితి ఏర్పడిన తర్వాత ఈ శరీరాన్ని ఇంకా నేనెందుకుమోయాలి ? అని తన సహచరులను ఒకసారి ప్రశ్నించారు శ్రీరమణులు. 1879 డిసెంబరు 30న జన్మించి, 1950 ఏప్రిల్ 14న తనువు చాలించిన వెంకట్రామన్ భగవాన్ శ్రీరమణ మహర్షిగా నేటికీ కీర్తించబడుతున్నారు.

(ఆంధ్రభూమి దినపత్రిక – మంచిమాట – 11–11–2003)

❀ ❀ ❀

గిరి ప్రదక్షిణం

శ్రీ రమణుల చరిత్ర అపూర్వం. శ్రీ రమణుల మహిమలు అనంతం. శ్రీ వేంకటరమణ 1879 డిసెంబర్ 30వ తేదీనాడు తమిళనాడులో మధురైకి 30 మైళ్ళ దూరంలో వున్న తిరుచ్చుళి గ్రామంలో అళగమ్మ, సుందరమయ్యర్ పుణ్యదంప తులకు ద్వితీయ పుత్రులుగా శ్రీ రమణులు జన్మించారు. ఎలిమెంటరీ స్కూలు విద్యను తిర్చుళిలోనే అభ్యసించి, హైస్కూలు విద్య మధురైలోని తన పినతండ్రి ఇంట్లోవుండి చదివారు. రమణులు పదవతరగతి చదువుతూ వుండగా తన పదిహేనేవ ఏట అరుణాచలం పేరువినగానే తనకి ఏదో సంబంధం వున్నట్లు గోచరించింది. అప్పుడే తను మరణించినట్లు, తన ఉచ్ఛ్వాస నిశ్వాసాలు ఆగినా, దేహములో చలనము లేకపోయినా తాను వున్నట్లు చిత్రమైన అనుభూతిని పొందారు. 1896 సెప్టెంబరు 1వ తేదీనాడు ఎవ్వరికీ ఇంట్లో చెప్పకుండా కట్టు బట్టలతో మధురై నుంచి అరుణా చలం బయలుదేరి వెళ్లారు. అరుణాచల శిఖరాన్ని చూడగానే మేను పులకరించింది. అనిర్వచనీయమైన దివ్యానుభూతిని పొందారు. అరుణాచలేశ్వరుని దేవాలయానికి

వెళ్ళి అరుణాచలేశ్వరుని, అమ్మవారిని దర్శించి వచ్చి తను కట్టుకున్న బట్టలను విడిచి గోచి ఒక్కటే ధరించి, అరుణాచల అరణ్యంలో ఒక ప్రదేశాన్ని ఎన్నుకొని తపస్సు ప్రారంభించారు. అప్పటి నుంచి జీవితాంతం గోచీతోనే వున్నారు.

శ్రీరమణులు ఏకాగ్రతతో కొన్నాళ్ళు అక్కడ తపస్సుకొనసాగించారు. కొందరు పశువుల కాపర్లు తపస్సు చేస్తున్న రమణుని వింతగా చూసి కొన్నాళ్ళు భయపడ్డారు. తరువాత దగ్గరికి వెళ్ళి పిలిస్తే పలకకపోవడం చూసి మౌనస్వామి బ్రాహ్మణస్వామి అని పిలుస్తూ ఈ విషయాన్ని గ్రామస్తులకు తెలయిజేశారు. కొందరు గ్రామస్తులు వచ్చి చూసి పాలు, పళ్ళు వంటివి సమర్పించి వెళ్లేవారు. శ్రీరమణులు నిశ్చల సమాధిలో కొన్నాళ్ళువుండి బాహ్య ప్రపంచాన్నే మరచిపోయేవారు. ఒంటిమీద చీమలు, విషకీటకాలు ప్రాకినా చలనం వుండేదికాదు. ఒక్కొక్కసారి కొందరు అల్లరి పిల్లలు వచ్చి రాళ్ళువిసిరి, కర్రతోకొట్టి తపోభంగం చేయడానికి ప్రయత్నించేవారు. శ్రీరమణులు అదరక బెదరక అలాగే తపస్సు కొనసాగించేవారు.

తరువాత 1889లో విరూపాక్ష గృహతపస్సుకి అనువైన ప్రదేశమని గుర్తించి అక్కడ తపస్సు కొనసాగించారు. అక్కడ సుమారు 17 సం.ల వరకు అంటే 1916వరకు విరూపాక్ష గృహంలోనే తపస్సు కొనసాగించారు. పశువుల కాపర్ల వలన శ్రీరమణుని ఆచూకీ చుట్టుపక్కలవారికి తెలిసి ఆయన్ని దర్శించడానికి భక్తులు అనేకమంది వచ్చి వెళుతూవుండేవారు. అప్పటివరకు మౌనస్వామి, బ్రాహ్మణస్వామిగా పిలవబడే శ్రీరమణుల్ని శ్రీకావ్యకంఠ గణపతి మునీంద్రుడు ఆ దివ్యతేజస్సుని చూసి ఆశ్చర్యపడి సాష్టాంగపడి మోకరిల్లి శ్రీరమణమహర్షి అనే పేరుతో తొలిసారిగా లోకానికి పరిచయం చేసారు. చివరికి ఆపేరే విశ్వవ్యాపితమై శ్రీరమణ మహర్షిగా లోకానికి వెలుగును చూపేరు. వయసులో గణపతి ముని పెద్దవారైనందున శ్రీరమణులు అతనిని నోరు విప్పి అప్పుడప్పుడు మాట్లాడసాగారు.

ఆ తర్వాత శ్రీరమణమహర్షి 1916నుంచి 1922 వరకు స్కంధాశ్రమానికి మారి అక్కడ తపస్సు కొనసాగించారు. 1922లో తల్లి మరణానంతరం శిష్యులు భక్తుల ప్రోద్భలంతో ఇప్పుడున్న రమణాశ్రమానికి శ్రీకారం చుట్టి తుదిశ్వాస విడిచే (14-4-1950) వరకు భక్తులకు దర్శనమిస్తూ మౌనంగానే వుండి భక్తుల సంశయాలు, సందేహాలు తీరుస్తూ కొందరికి శ్రీ సుబ్రహ్మణ్యస్వామి అవతారంగా మరి కొందరికి దక్షిణామూర్తి అవతారంగా గోచరించి అవతారపురుషునిగా చిరస్మరణీయులయ్యారు.

శ్రీరమణ మహర్షికి అరుణాచల దేవాలయముకన్నా అక్కడవున్న కొండనే ఎక్కువ ప్రేమించేవారు. ఆ కొండను కైలాసశిఖరంగా భావించి ఆ కొండపై శివ కుటుంబాన్ని (శివపార్వతులు, వినాయకుడు, కుమారస్వామి, నందీశ్వరుడు) అందరిని దర్శించేవారు. బ్రహ్మదేవుడు, విష్ణుమూర్తి కూడా శివపార్వతుల దర్శనానికి ఆ కొండకు వస్తూవుంటారని మహర్షి చెప్పేవారట. అందుకు ఆ గిరిచుట్టూ ప్రదక్షిణంచేస్తే సర్వ

లోకాలకు ప్రదక్షిణ చేసినట్లే అని చెప్పి శ్రీరమణమహర్షి తరచు గిరి ప్రదక్షిణ చేస్తూ భక్తులను, శిష్యులను ప్రదక్షిణం చేయడానికి ప్రోత్సహించేవారు.

అరుణాచలమనే స్మరణతోనే ముక్తి వస్తుందని మహర్షులు చెప్పేవారు. అరుణాచలేశ్వరుడు అగ్నిలింగం (జ్యోతిర్లింగం)గా అక్కడ భాసిస్తున్నాడు. శ్రీరమణాశ్రమం దగ్గర్లో వున్న దక్షిణామూర్తిని దర్శించి గిరి ప్రదక్షిణం ప్రారంభించి తిరిగి మరల దక్షిణామూర్తి ఆలయానికి వచ్చి నమస్కరించి గిరిప్రదక్షిణం పూర్తిచేస్తారు.

పౌర్ణమిరోజులలో రాత్రి తెల్లవార్లూ గిరిప్రదక్షిణం చేస్తూ కనిపిస్తారు. అరుణాచలాన్నే తిరువణ్ణామలై, అన్నామలై అని కూడా అంటారు. కార్తీకమాసంలో కొండ శిఖరాన్ని వెలిగించే జ్యోతి అరుణాచల జ్యోతిగా శబరిమల మకర జ్యోతిలా ప్రపంచ ప్రసిద్ధి చెందింది.

(ఆంధ్రభూమి దినపత్రిక – మంచిమాట – 23–3–2008)

❁ ❁ ❁

రమణుల అనుగ్రహం

నా పూర్వజన్మ సుకృతం వలన నా అరవయేట (1946లో) మా అమ్మనాన్న గార్లతో అరుణాచలం వెళ్ళి శ్రీరమణ మహర్షి దివ్యదర్శనం చేసుకునే భాగ్యము కలిగింది. నావయస్సు ఆరేళ్ళే అయినా తిరువణ్ణామలైలో ఆ రోజు చూసిన దృశ్యాలన్నీ నా మనోఫలకంపై చిత్రీకరించబడ్డాయి. ఏళ్ళుగడచినా శ్రీరమణమహర్షి రూపము నా మదిలో అలా ఉండి పోయింది. సుమారు ఒక గంటకుపైగా శ్రీరమణాశ్రమంలో శ్రీరమణమహర్షి ముందు మౌనంగా మా తల్లిదండ్రులతోపాటు కూర్చున్నాను. మా తమ్ముడు (సుమారు సంవత్సరం వయస్సు ఉంటుంది) ఏడ్వడం మొదలు పెట్టేసరికి బయటకు తీసుకువెళ్ళమని అక్కడి శిష్యులు చెప్పడంతో మా అమ్మగారు మా తమ్ముణ్ణి ఎత్తుకొని బయటకు వెళ్ళారు. మరికొంత సమయం నేను, మా నాన్న గారు అక్కడ కూర్చుని తరువాత మహర్షుల వారికి నమస్కరించి బయటకు వచ్చాము.

రమణాశ్రమంలో ఉన్న పుస్తకాల షాపులో మా నాన్నగారు 'ఉపదేశసారము' అనే తెలుగు పుస్తకాన్ని కొన్నారు. ఆ లేతవయసులో ఎందుకో శ్రీరమణు లంటే నాకు తెలియనభక్తి భావము ఏర్పడింది. 'ఉపదేశసారం'పుస్తకాన్ని చాలా భద్రంగా నా దగ్గరే దాచుకొన్నాను. నేను స్కూలు ఫైనల్ చదివేవరకు నా దగ్గర భద్రంగా ఆ పుస్తకం ఉంది. కాలేజీ చదువులకు బయటకు వెళ్ళడం, మా నాన్నగారికి ట్రాన్స్‌ఫర్లతో ఆ పుస్తకం కనిపించలేదు. అయినా శ్రీరమణుల రూపము మాత్రం నా మదిలో స్థిరంగా ఉండిపోయింది.

ఉద్యోగంలోచేరాక, పెళ్ళయ్యాక చాలాసార్లు తిరువణ్ణామలై వెళ్ళాలనుకొన్నాను కానీ వీలుపడలేదు. 1986లో అయ్యప్పదీక్షతో శబరిమలై యాత్రకు వెళుతూ మా గురుస్వామి తిరువణ్ణామలై తీసుకువెళ్ళారు. ఆ రోజు నా ఆనందానికి అవధులు

లేవు. ఆశ్రమాన్ని, అక్కడ దేవాలయంలో ఉన్న అణ్ణామలై స్వామిని, (శివుడు) ఉణ్ణా మలై తాయారుని (పార్వతీదేవి) అన్నీ చూశాము. ఆశ్రమ ప్రాంతమంతా పూర్తిగా మారిపోయింది. చుట్టూ చాలా కట్టడాలు వచ్చాయి. అప్పటికే నేను శ్రీరమణ మహర్షి జీవిత చరిత్రకు సంబంధించిన కొన్ని పుస్తకాలు చదవడం వలన గిరి ప్రదక్షిణం చేయాలని, శ్రీరమణులు సంచరించిన ప్రదేశాలు, తపస్సు చేసిన పవిత్ర స్థలాలలను సందర్శించాలని కోరిక ఉన్నా, టైములేదని మా గురుస్వామి చెప్పడంతో శ్రీరమణుల అనుగ్రహంలేదని, మరొకసారి తిరువణ్ణామలై ప్రత్యేకంగా వచ్చి అన్నీ చూడాలని నిశ్చయించుకొని మా బృందంతో శబరిమలై యాత్రకు వెళ్ళాను.

శ్రీరమణులు బాల్యంలోనే ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా 1896 ఆగస్టు 29న (పదిహేడవయేట) ఇల్లు వదలి తిరువణ్ణామలై వెళ్ళడానికి జేబులో మూడురూపాయ లతో బయలుదేరాడు. శ్రీరమణుల అసలుపేరు వేంకట్రామన్, తండ్రి సుందరం అయ్యర్, రమణులకు పదేళ్ళ ప్రాయంలనే మరణించారు. తండ్రి మరణంతో ఆర్థిక పరిస్థితులు బాగులేక తల్లి అళగమ్మాళ్ మానామధురైలో బంధువుల ఇంటికి చిన్న పిల్లలతో చేరితే శ్రీరమణులు, అతని అన్నయ నాగస్వామి మధురైలో హైస్కూలు చదువుకోసం సుబ్బయ్యర్ అనే బంధువుల ఇంటికి చేరారు. శ్రీ వేంకట్రామన్ అల్లరి చిల్లరిగా తిరిగినా ఆటపాటలతో వినోదించినా, ఒక్కసారి విన్న పాఠాన్ని మరచిపోకుండా అప్పజెప్పేవాడు. చెరువులో ఈతకొట్టడమంటే వేంకట్రామన్‌కి అత్యంత ఇష్టంగా ఉండేది. అప్పుడప్పుడు తనకు తెలియకుండానే దేవాలయంలోనో, ఇంట్లో మూలగదిలోనో ధ్యానంలో కూర్చొని ఉండిపోయేవాడు.

వేంకట్రామన్‌కి ఒకరోజు తను మరణించినట్లు అనుభూతి కలిగి, దేహము కాక నేను అనే ఆత్మ ఒకటి ఉందని గ్రహించి, నేను గురించి తెగ ఆలోచించసాగాడు. ఆ సమయములోనే అరుణాచలం అనేమాట అతని చెవిని పడింది. అరుణాచలానికి తన జీవితానికి ఏదో సంబంధం ఉందని గ్రహించి అరుణాచలం బయలుదేరాడు. వేంకట్రామన్. స్టేషన్‌కి వెళ్ళేవరకు అరుణాచలానికి డైరెక్టు ట్రైన్‌లేదని తెలియదు. దిండివనం స్టేషన్ వరకు రైలు టిక్కెట్టు ఇచ్చి అక్కడనుండి వెళ్ళమనడంతో తన దగ్గర ఉన్న మూడురూపాయలలో, రెండు రూపాయల పదమూడణాలిచ్చి టిక్కెట్టు కొని ట్రైన్ ఎక్కాడు. అతని దగ్గర మూడు అణాలు మాత్రమే మిగిలాయి. దిండివనం స్టేషన్లో దిగి తెల్లవారే వరకు స్టేషన్లోనే ఉండిపోయాడు. తెల్లారాక తిరువణ్ణామలైకి మధ్యాహ్నం వరకు ట్రైన్ లేదన్నారు.

వేంకట్రామన్‌కి ఏమీ తోచక స్టేషన్ బయటకువచ్చి అటూ, ఇటూ తిరుగుతూ ఉంటే ఆకలవడంతో భోజనానికి ఒక హోటలుకు వెళ్ళాడు. భోజనం చేసి జేబులో ఉన్న మూడణాలు ఇవ్వబోతే హోటలు యజమాని ఇక నీ దగ్గర డబ్బులులేవా? అని అడిగాడు. లేవని వేంకట్రామన్ తల అడ్డంగా ఊపడంతో డబ్బులు తీసుకోకుండా ఆ మూడు అణాలు అతనికిచ్చి వెనక్కి పంపాడు. తిరువణ్ణామలై వెళ్ళడానికి మాంబళ

బట్టు అనే ఊరు వరకు రెండున్నర అణాలు తీసుకొని టిక్కెట్టు ఇవ్వడంతో ట్రైన్ ఎక్కి సాయంత్రానికి మాంబళబట్టు చేరాడు.

మాంబళబట్టు నుండి తిరువణ్ణామలై సుమారు ముప్పైమైళ్ళు ఉంటుందని చెప్పడంతో చేతిలో ఉన్న అర్థణాతో ఏవో పళ్ళు కొనుక్కుని తిని, సుమారు పదిమైళ్ళు నడిచేసరికి అరియనల్లూరు అనే ఊరు చేరుకున్నాడు. అప్పటికే బాగా చీకటి పడింది. అక్కడ ఒకదేవాలయం కనిపించేసరికి అక్కడకు వెళ్ళేరు. అక్కడ వాచ్‌మన్ చూసి, రాత్రి అక్కడ ఎవరూ ఉండకూడదని చెప్పి వేంకట్రామన్‌ని బయటకు పంపించాడు. అక్కడే ఉన్న నది ఒడ్డునే నడుచుకొంటూ వేంకట్రామన్ కీళూర్ అనే ఊరు రాత్రికి చేరుకున్నాడు. అక్కడ ఉన్న వరదేశ్వరుని కోవెలకు చేరి ఆలకవడం వలన ప్రసాదం అడిగాడు. ఆలయ ధర్మకర్త తన ప్రసాదాన్ని తినమని వేంకట్రామన్‌కి పళ్లెంలో అందించాడు. మంచి నీళ్ళకోసం దగ్గర్లో ఉన్న శాస్త్రిగారింటికి వెళ్ళి అడిగాడు. ఖాళీకడుపుతో ఉన్నందున, పదిమైళ్ళు నడచి వచ్చినందున కళ్ళుతిరిగి వేంకట్రామన్ క్రిందపడ్డాడు.

కొంతసేపటికి తేరుకొని లేచి ప్రసాదం తిని, మంచినీళ్ళు త్రాగి అక్కడే నిద్రించాడు. తెల్లవారేక నిద్రలేచాడు. ఆ రోజు కృష్ణాష్టమి ఆగస్టు 31వ తేదీ 1896వ సంవత్సరం. తిరువణ్ణామలై చేరుకోవాలంటే మరొక ఇరవైమైళ్ళ దూరం ఉందన్నారు. ఎలా చేరుకోవాలో తెలియలేదు. మరలా ఆకలి వేయడంతో ఎదురుగా కనిపించిన ఇంటివైపు చూశాడు. అది ముత్తుకృష్ణ భాగవతార్ అనే ఆసామి ఇల్లు. ఆ ఇంటికి వెళ్ళి కాస్త అన్నం ఉంటే పెట్టండి. అనడిగాడు. ఆ రోజు కృష్ణాష్టమి అవడం మూలంగా వారింటికి చిన్నికృష్ణుడు వచ్చాడని మురిసిపోయి ఆ ఇల్లాలు కడుపార అన్నం పెట్టింది. వేంకట్రామన్ వారి ఆతిథ్యానికి సంతసించి కృతజ్ఞతలు తెలియ జేశాడు. వారి మంచితనం చూసి చేతిలో చిల్లిగవ్వలేనందున తన చెవులకున్న బంగారు చెవి పోగులను వుంచుకొనినాలుగు రూపాయలు ఇవ్వమని భాగవతారుని ప్రాధేయపడ్డాడు. ఇరవై రూపాయలు ఖరీదు చేసే చెవిపోగులకు నాలుగు రూపాయలే కదా అడుగుతున్నాడని, మరల సొమ్ము చెల్లించి వస్తువును తీసుకు వెళ్లాలని చెప్పి వేంకట్రామన్‌కి నాలుగు రూపాయలిచ్చి పంపాడు.

వెంటనే వెంకట్రామన్ సంతోషంగా రైల్వేస్టేషన్‌కి బయలుదేరాడు. మరుసటి రోజు ఉదయం వరకు తిరువణ్ణామలైకి వెళ్ళేరైలు లేదన్నారు. రాత్రి స్టేషన్లోనే పడుకుని నాలుగు అణాలతో తిరువణ్ణామలైకి టిక్కెట్టు కొన్నాడు. ఆ రోజు 1896 సెప్టెంబరు 1వ తేదీ ప్రాతఃకాలసమయంలో తిరువణ్ణామలై చేరేసరికి ఆనందంతో ఉప్పొంగి పోయాడు. అరుణాచలం అరుణాచలం అని కలలు కన్న తన స్వంతగూటికి చేరు కున్నట్లు ఎప్పటినుండో తెలిసిన ప్రదేశానికి వచ్చినట్లు అనుభూతిని పొందాడు. వెంటనే పరుగు పరుగున అరుణాచలేశ్వరుని దర్శనానికి దేవాలయానికి వెళ్ళాడు. దేవాలయద్వారాలు తెరచివున్నాయి. గర్భగుడిలో ఒక్క మనిషిలేదు. వేంకట్రామన్

భక్తి పారవశ్యంతో అచట వేంచేసి ఉన్న అణ్ణామలై స్వామిని (శివుడు) ఉణ్ణామలై తాయారు (పార్వతీదేవి) ని దర్శించి పులకించిపోయాడు. ఇంటిని వదిలి అప్పటికి నాలుగు రోజులయింది. తన కోసం వెతకవద్దని, బెంగపడవద్దని, తన ఖర్చులకోసం మూడు రూపాయలు తీసుకొని వెళ్తున్నట్లు ఒక చిన్న ఉత్తరం రాసి ఉంచి ఇంటి నుండి బయలుదేరాడు. చేరవలసిన చోటుకి చేరాడు.

ఆనందపారవశ్యంతో అమ్మని, అయ్యని దర్శించి బయటకు రాగానే ఒక మంగలి కనిపించి, తలనీలాలు సమర్పిస్తారా? అని అడిగాడు. అదీ భగవాదేశంగా భావించి తలవంచి గుండు గీయించుకుని క్షురకుడికి డబ్బులిచ్చి మిగిలిన డబ్బులను ఒక గుడ్డ పీలికలో మూటకట్టి కొలనులోనికి విసిరివేశాడు. తను వచ్చేటప్పుడు భాగవతారు భార్య ఇచ్చిన ప్రసాదం మిగిలితే దానిని కూడా చేపలకు ఆహారంగా కొలనులో వేశాడు. తను కట్టుకున్న వస్త్రాన్ని చింపి గోచిగా కట్టుకుని మిగతా దుస్తులు విసర్జించాడు. చిరునవ్వు ముఖంతో మరలా ఆలయంలోకి ప్రవేశించి, వేయికాళ్ళ మండపంలో కూర్చొని ధ్యానంలో మునిగిపోయాడు. తరువాత వేంకట్రామన్ అరుణాచలం కొండప్రక్క అడవులలోకి వెళ్ళి తపస్సులో మునిగి పోయాడు.

శ్రీరమణమహర్షి అరుణాచల అడవులలో విరూపాక్షగృహ, స్కందాశ్రమంలో 22 సంవత్సరాలు తపమాచరించారు. 1922లో శ్రీరమణుల తల్లి మరణానంతరం ప్రస్తుత ఆశ్రమానికి వచ్చి, అక్కడే నివాసముండి భక్తులకు దర్శనం ఇచ్చేవారు. 30-12-1879నాడు జన్మించిన శ్రీరమణులు 14-4-1950నాడు అరుణాచలం లోనే శివసాన్నిధ్యాన్ని పొందారు. మహర్షి అరుణాచలం పొలిమేరలు దాటి బయటకు వెళ్ళకపోయినా, ఆయనకీర్తి ప్రపంచం నలుదిశల పాకింది. అన్ని దేశాలలో వారి శిష్యులుండడం గొప్ప విశేషంగా చెబుతారు.

శ్రీరమణుల అనుగ్రహం కలగడం వలన 3-12-2007 రాత్రికి అరుణా చలం చేరి రాత్రి విశ్రమించడానికి ఆశ్రమంలో చోటులేనందున అక్కడికి దగ్గర్లో ఉన్న 'శివసన్నిధి'లో గది తీసుకొని రాత్రి విశ్రమించాను. రాత్రి రెండు గంట లకు (4-12-2007) నిద్రలేచి స్నానాదికాలు ముగించుకొని కొందరు భక్తులు గిరిప్రదక్షి ణం చేయడానికి వెళుతూ ఉంటే వారితో వెళ్ళి శ్రీరమణులు సంచరించిన ప్రదేశా లన్నీ చూడడం నా పూర్వజన్మ భాగ్యంగా భావిస్తున్నాను.

శ్రీరమణమహర్షి ప్రతిరోజు గిరిప్రదక్షిణం చేసేవారట. ఒక్కొక్కసారి ఎవరైనా భక్తులు, శిష్యులు కోరితే మరలా వారివెంట వెళ్ళి గిరిప్రదక్షిణం చేసి వచ్చేవారుట. గిరిప్రదక్షిణం ఒకసారి చేసివస్తే 14 కిలోమీటర్లదూరం కాలినడకతో వెళ్ళిరావాలి. సుమారు 4-5గంటల సమయం పడుతుంది. మేము దారిలో అన్నీ చూసుకొంటూ తెల్లవారు ఝామున 3 గంటలకు బయలుదేరితే ఉదయం 8 గంటలకు మా గిరి ప్రదక్షిణం పూర్తయింది. శ్రీ అరుణాచలేశ్వరుని అతీతకుచాంబికేశ్వరి (ఉణ్ణామలై

తాయారు) ఇంకా ఇతర దేవాలయాలను సందర్శించాను. అరుణాచలంలో శ్రీరమణుల ఆశ్రమానికి వెనుక ఉన్న అడవిలో శ్రీరమణ మహర్షి తపమాచరించిన స్కందాశ్రమాన్ని, విరూపాక్ష గుహను, శ్రీరమణమహర్షి సంచరించిన పవిత్ర స్థలాన్ని చూసి, ఆశ్రమానికి వచ్చి శ్రీరమణులు శయనించిన మంచము, కూర్చున్నకుర్చీ, ఇతర వస్తువులు చూసి, ధ్యానముద్రలో కొంతసేపు శ్రీరమణమహర్షి జీవించిన హాలులో కూర్చొని బాల్యస్మృతులు నెమరువేసు కున్నాను. శ్రీరమణుల సాక్షాత్కారంతో, అనుగ్రహంతో అక్కడ శివాలయాన్ని దర్శించుకొని, ప్రసాదాన్ని స్వీకరించి ఆ సాయంత్రం ఆనంద పారవశ్యంతో ఇంటిముఖం పట్టాను. ఆ విధంగా 60 సంవత్సరాల తరువాత మరలా శ్రీరమణులని దర్శించగలిగాను.

ఓం తత్ సత్ !

(ధ్యానమాలిక – ఆధ్యాత్మికమాసపత్రిక – ఆగస్టు 2009)

❀ ❀ ❀

ఆదిశంకరుల ఆత్మబోధ

శ్రీ ఆదిశంకరుల రచనలను మూడు విధములుగా విభజింపవచ్చును. అవి 1. భాష్యములు అనగా ప్రస్థానత్రయముపై వారు చేసిన వ్యాఖ్యానములు. 2. స్తోత్రములు సర్వదేవతా మూర్తులపై శంకరులు రచించిన ప్రార్థనలు. 3. ప్రకరణ గ్రంథములు. ప్రస్థానత్రయ వివరణను తెలియజేస్తూ తత్త్వబోధ, వివేక చూడామణి, వాక్య వృత్తి, అద్వైతానుభూతి, దృగ్దృశ్య వివేకము, ఆత్మబోధలనునవి ముఖ్యములు.

శ్రీ శంకరభగవత్పాదులు సామాన్య మానవులకు సైతం అద్వైత విజ్ఞానము అందుటకుగాను ప్రేమతో ఈ ఆత్మబోధ గ్రంథమును రచించారు. నిత్య జీవితములో గోచరించు సంఘటనలను, వస్తువులను ఆధారముగా తీసుకొని చక్కటి ఉపమానములతో అత్యద్భుతంగా రచించారు. ఆత్మబోధ యను ఈ గ్రంథములో అరువది ఎనిమిది శ్లోకములు కలవు.

ఆత్మ అనగా ఎట్టిది ? రాకపోకలు లేక కరచరణాది అవయవములు కలుగక, దుర్వాసనలతో కూడక, అణువునందు అణువుగను, ఘనముందు ఘనముగను, సర్వ వ్యాప్తియైనటువంటి ఆకాశమువలె అతి సూక్ష్మ శరీరము ధరించినటువంటి ఆత్మ, అగ్నిలో వుండు దహనశక్తివలె, సూర్యునిలో వుండు కాంతివలె, శోకమోహములు లేక, పంచేంద్రియములతో సంబంధములు కలుగక, సర్వభూతముల యందు, చిత్తము నందు ప్రజ్ఞాశక్తివలె ప్రకటింపచేయు నటువంటిది ఆత్మ.కర్మబద్ధముకాక దృశ్యముకాక, ఆకారములేక, సర్వవ్యాపకమై సూక్ష్మమైన తత్త్వమును ధరించునటువంటిది ఆత్మ.

ఇది అద్రష్టకాని, క్రమద్రస్టకాని, అధ్యాయద్రష్టకాని కానేరదు. చూచునట్టిది, వినునట్టిది, పలుకునట్టిది, కరచరణాదులతో కూడిన దేహము ఒక ఉపాధి మాత్రమే.

ఆత్మకాదు. పదార్థములను వెలుగులో అనుభవించునట్లుగా, ఈ దేహము ఇంద్రియ ములద్వారా ప్రకృతిని అనుభవించుచున్నది.

తానెవరో తనకు తెలిసివస్తే తెలుసుకోవలసినదంటూ ఏమీ మాగలదు. ఇదియే జ్ఞానము. జ్ఞానచక్షువుగలవానికి సర్వమూ బ్రహ్మస్వరూపమే. సృష్టి బ్రహ్మముకన్నా అన్యముకాదు. బ్రహ్మము సృష్టిచేయునూలేదు. బ్రహ్మము సృష్టికి ఆధారము కాదు. సృష్టిలో అంతర్లీనము కాదు. బ్రహ్మమే సృష్టి. వీక్షణములో దోషము లేనిచో అంతయు ఆత్మయే. అదియే నీవు. నీ కన్యమైనదంటూ లేదు.

యిదియే నిజమైన బోధ. బాధలను సమూలంగా సమాధిచేసే జ్ఞానబోధ. ఆత్మజ్ఞాన బోధ. ఇదియే ఆదిశంకరుల ఆత్మబోధ. ఆదిశంకరుల ఆత్మబోధ గ్రంధ మును ప్రారంభిస్తూ ఈ ప్రధమ శ్లోకంతో తెలియజేయుచున్నారు.

'తపోభిః క్షీణనాం శాంతానాం వీతరాగిణామ్

ముముక్షుణా మపేక్ష్యోయం ఆత్మబోధో విధీయతే'

తపస్సనగా తపించుటయని భావము. భగవంతునిపై నిరంతరము తపించుటే, పరితపించుటే నిజమైన తపస్సు, దేహేంద్రియ మనోబుద్ధులను ఆధ్యాత్మిక కార్య క్రమాలలోవుంచి, భగవదాలోచనలలో రమించుటయే తపస్సు. తపమాచరించువాని మనస్సు నిర్మలమగును.

రజోగుణజనిత ఆవేశము, తమోగుణ జనిత అలసత్వము నశించి, సత్వగుణ ప్రధానమైన ఆనందము అంతఃకరణములో పొడసూపును. సదా భగవదాలోచనలో తపించు మనస్సు దైవముతోనిండి యుండును. అఖండానందమయమగు మోక్షము నకు జ్ఞానమొక్కటే మార్గమని ద్వితీయ శ్లోకములో తెలియజేయుచున్నారు.

'బోధోన్య సాధనే భ్యోని సాక్షాన్మోక్షైక సాధనమ్

పాకస్య పత్నివత్ జ్ఞానం వినామోక్షో నసిద్ధ్యతి'

జ్ఞానార్జన చేయు సాధకులు సాధన చతుష్టయ సంపత్తి కలవారై యుండ వలెను. జ్ఞానాలయంలో ప్రవేశించగోరు ముముక్షువులు సాధన చతుష్టయమనే నాలుగు ద్వారముల గుండా ప్రయాణం సాగించాలి. ఈ నాలుగు సాధనములు 1) వివేక 2) వైరాగ్యము 3) షట్‌సంపత్తి అనగా ఆధ్యాత్మికానభూతికి ఉపకరించు ఆరు సాధనములు. అవి శమము, దమము, ఉపరతి, తితిక్ష, శ్రద్ధ, సమాధానము, ముముక్షుత్వము.

ఇక ఇరువది నాల్గవ శ్లోకములో ఇటుల తెలియజేయుచున్నారు.

ప్రకాశోర్కస్య తోయస్య శైత్యమగ్నేర్యధోష్టితా

స్వభావః సచ్చిదానంద నిత్యనిర్మల తాత్మనః

సూర్యునికి ప్రకాశము, నీటికి చల్లదనము, అగ్నికి వేడిసహజము. అదేవిధంగా

ఆత్మకు నిర్మలము, నిత్యము, సత్యము, చైతన్యము, ఆనందము, సహజము. అరువది ఎనిమిది శ్లోకములను శ్రద్ధతో పఠించిన ఆత్మబోధ సంపూర్ణమగును. ఓంతత్సత్.

(ఆంధ్రభూమి దినపత్రిక - మంచిమాట - 1-5-2004)

❁ ❁ ❁

శ్రీరామకృష్ణ పరమహంస

భారతమాత ఎందరో ముద్దుబిడ్డలను మహానుభావులకు జన్మనిచ్చి, భారత దేశము పలువిధముల ప్రపంచ పథములో కీర్తినార్జించుటకు దోహదము చేసింది. హైందవ మత పునరుద్ధరణకు, దేశవిదేశాలలో భగవంతుని ఉనికిని తెలియ జేయడానికి, హైందవమత గొప్పదనాన్ని తెలియజేయడానికి ఎందరో శిష్యులను తయారుచేసి, దేశానికి అందించిన ఆధ్యాత్మికయోగి, పరమహంస శ్రీరామకృష్ణుడు. వివేకానంద స్వామివంటి మేటి రత్నాన్ని సానపెట్టి ప్రపంచానికి అందించిన గురు తుల్యులు శ్రీరామకృష్ణ పరమహంస. వంగదేశములో మారుమూల గ్రామము కామార్పుకూర్‌లో బీద బ్రాహ్మణ కుటుంబంలో తే. 18-2-1836వ సంవత్సరంలో శ్రీరామకృష్ణులు గదాదరుడని నామధేయముతో జన్మించేరు. పొట్టకూటి విద్యలు అభ్యసించడానికి అతని మనస్సు అంగీకరించలేదు. దానికి తోడు అతని బాల్యములోనే తండ్రి మరణించడంతో శ్రీరామకృష్ణులు, రాణి రాసమణి యనుభక్తురాలు కట్టించిన కాళికాలయమునకు అర్చకుడుగా చేరారు. జగజ్జనని కాళీమాతను ప్రత్యక్షముగా చూడదలచి, ఆమెను ఆలయములో గానక విలపించుచు దగ్గరలోవున్న చిట్టడవికేగి తపస్సు ప్రారంభించెను. లోకైకమాత కాళిమాతయే అతనికి గురువై తత్వోపదేశమొన ర్చెను. శ్రీరామకృష్ణులు తేదకధ్యానముతో దేవినే స్మరిస్తూ బాహ్య స్పృహ కోల్పోయి, పిచ్చివాడిగా ప్రవర్తిస్తున్నందున అతని తల్లి, బంధువులు వివాహ చేసిన అతని పిచ్చి కుదురునని తలచి శారదామణిదేవి అనుయైదేళ్ళ బాలికతో ఆయనకు వివా హము జరిపించేరు. శ్రీరామకృష్ణులు నిత్యము కాళీమాతను ఆరాధిస్తూ ఆమెతోమాట్లా డుతూ, తన్మయత్వం చెందేవాడు. ఆయన భక్తిపారవశ్యత, ఆశయాన్ని గ్రహించిన ధర్మపత్ని శారదాదేవి ఆయన ప్రథమ శిష్యురాలిగాచేరి ఆయనకు సేవలుచేసి తరించింది. శ్రీరామకృష్ణులు భార్య శారదాదేవిని కూడా జనగన్మాతగా, తాను ఆరాధించే మాతగా భావించి పూజ్యభావముతో ఆరాధించేవారు. అతని దృష్టిలో కాంతా, కనక ములకు విలువలేదు. మట్టిని, బంగారాన్ని సమముగా చూసిన యోగిపుంగవుడు కనుకనే పరమహంసగా కీర్తించబడ్డాడు. శ్రీరామకృష్ణుల ఆధ్యాత్మిక సాధనలను గాంచిన భైరవీ బ్రాహ్మణి యను మహాయోగిని యతని వెదుక్కొనుచు వచ్చి, సమస్త తాంత్రిక రహస్యములను అతనికెరింగించేరు. తరువాత దోతాపురి యను యతీం ద్రుడు చేసిన దివ్యోపదేశముచే శ్రీరామకృష్ణులు వేదాంత సారామృత మంతయు గ్రహించి నిర్వికల్ప సమాధిస్థితిని పొందేరు. ఏ పాఠశాలలో శ్రీరామ కృష్ణులు చదవక పోయినా ఆయన్ని దర్శించడానికి వచ్చిన భక్తులు, శిష్యులు అడిగే

ప్రశ్నలకు అరటి పండు ఒలిచి యిచ్చినట్లు తియ్యగా సమాధానములు చెప్పేవారు. పామరజనానికి అర్థమయ్యే రీతిలో పిట్ట కథలుగా చెప్పి, భగవంతుని ఉనికిని తెలిపేవారు. ఒకసారి కొందరి శిష్యులు రాముడుగొప్ప శివుడు గొప్పని నిందించు కొంటూ ఉంటే శ్రీరామకృష్ణులు వారిని వెంటరమ్మనమని ఎంగిలాకుల కోసం దెబ్బలాడుకొనే కుక్కలను చూపించేరు. ఇంతలో ఎక్కడ నుండో వేరే కుక్క వచ్చి ఆకులలో తినడం చూపించి, వారికి జ్ఞానోదయాన్ని కలిగించేరు. శ్రీవివేకానందుల బాల్యమునుండి ఎన్నో పురాణ గాథలు, విని, చదివి భగవంతుని చూడాలనే కాంక్షతో పరితపించేవారు. వివేకానంద స్వామికి మాత్రం రామకృష్ణులమీద సదాభిప్రాయం ముందు కలుగలేదు. భగవంతుని చూపిస్తానని ధైర్యముగా మొట్టమొదట వివేకానం దుల వారికి చెప్పినది శ్రీరామకృష్ణులే. అయినా వివేకానందుడు అతన్ని కొన్నాళ్ళు విశ్వసించలేదు. ఎన్నోపరీక్షలు జరిపి అప్పుడప్పుడు కాళికాలాయానికి వచ్చి మెల్ల మెల్లగా శ్రీరామకృష్ణుల వారికి చేరువై, ప్రథమ శిష్యస్థానాన్ని సంపాదించకలిగేరు. శ్రీరామకృష్ణ పరమహంస అవతార పురుషులని, లోకానికి ప్రథమంగా చాటిచెప్పిన వారు వివేకానందులే. హిందూమతాన్ని పునరుద్ధరించడానికి, భారతదేశ కీర్తి ప్రతిష్ఠ లను నలుదిశల చాటడానికి వివేకానందుడే సమర్థుడని, ధైర్యవంతుడని, తగిన శిష్యుడనినమ్మి అతనికి ఆధ్యాత్మిక బోధచేసేరు. శ్రీరామకృష్ణులు ఆశించినట్లే వివేకానం దుడు భారతదేశ కీర్తిప్రతిష్ఠలను నలుదిశల చాటి, రామకృష్ణామిషన్ అనే ధార్మిక సంస్థను నెలకొల్పి, మానవసేవే మాధసేవ అనే భావాన్ని కల్పించి విద్యా సంస్థలను, విపత్తులలో పేద ప్రజలను ఆదుకోవడానికి, సేవలు చేయడానికి ఎంతో దోహదం చేసేరు.

గురుశిష్య బంధము చాలా గొప్పది, వివేకానందులవారు నాలుగు రోజులు కనిపించక పోతే శ్రీరామకృష్ణులు ఎంతో వ్యథచెందేవారు. శ్రీరామకృష్ణులు గొంతు వ్యాధి బాధతో తన అంత్య దశలో కూడా వివేకానందుని వీడక అతను సాధించిన తపఃశక్తినంతా వివేకానందునికి ధారబోసి, ఇకమీదట వివేకానందుడే గురువని శిష్యులందరకు వెల్లడించి, శ్రీరామకృష్ణ పరమహంస తే. 16-8-1896 పరబ్రహ్మై క్యము చెందేరు. (ఆంధ్రభూమి దినపత్రిక - మంచిమాట-24-11-2003)

❁ ❁ ❁

నిర్మల హృదయురాలు శ్రీ శారదామాత

శ్రీ శారదామాత శ్రీరామకృష్ణ పరమహంస సహధర్మచారిణిగా లోకమునకు సుపరిచుతురాలు. ఈమెను శ్రీమాతృదేవిగా భక్తజనులు కీర్తిస్తారు. ఈమె శ్రీరామ చంద్ర ముఖోపాధ్యాయుని కుమార్తె. ఆమెకు ఐదేళ్ళవయసులోనే 1860వ సంవత్స రంలో శ్రీరామకృష్ణునికిచ్చి వివాహము జరిపించిరి. 1872వ సంవత్సరమున తన భర్త పిచ్చివాడని చెప్పుకొనుట విని శ్రీ శారదామణిదేవి కలతచెంది, ఆమె స్వయముగా భర్త శ్రీరామకృష్ణుని సేవించుటకు దక్షిణేశ్వరముచేరెను. దివ్యప్రేమమూర్తి యగు

శ్రీరామకృష్ణుడు సామాన్య సన్యాసులవలేకాక, శ్రీశారదాదేవి నఖండ సానుభూతితో నాదరించిమైహికాముష్మిక విషయములన్నిటిలో ఆమెకు గురుత్వము వహించెను.

వినిర్మలహృదయమగు శారదాదవియు వెంటనే తన మగని ఆశయములను గ్రహించి తన ప్రాణేశ్వరుడు సాక్షాత్పరమేశ్వరుడని భావముతో అతని సేవించి తరించెను. స్త్రీల నందరను సాక్షా జగజ్జననీ స్వరూపిణులుగా గాంచుటను శ్రీ శారదామాత ఎంతగానో తోడ్పడెను.

శ్రీ శారదామాత కలకత్తాకు 18మైళ్ళ దూరంలోవున్న జయరాంబాటి అన్న కుగ్రామంలో కులీన బ్రాహ్మణ కుటుంబంలో 1853 డిసెంబరు 22 తారీఖునాడు జన్మించెను. చిరుప్రాయమునే ఆధ్యాత్మిక చింతన అలవరచుకొని శ్రీరామకృష్ణుని సహచర్యంతో మహిళాలోకానికి ఆదర్శ గృహిణిగా భర్త సేవలు చేస్తూ, గురుపత్నిగా, లోకమాతగా పేరుగాంచి శ్రీరామకృష్ణుని నిర్యాణానంతరం పీఠాన్ని అధిష్ఠించి శ్రీరామ కృష్ణ పరమహంసలేని లోటు తీర్చేరు.

శ్రీ మాతృదేవి బోధనలలో కొన్ని ముఖ్య సందేశాలను పరిశీలిస్తే ఆమె విశాల మనోగతము మనకవగతమవుతుంది.

మానవజన్మలో సుఖము లేనేలేదు. లోకము దుఃఖ మయము. సుఖమను నది ఇచట పేరున మాత్రమే కలదు. శ్రీగురుదేవుని కృప యెవనికి లభించునో, అతడు మాత్రమే ఆయన భగవంతుడని యెరుగగలుగును. సుఖమనగా అదియొక్క టియే యని జ్ఞప్తినుంచుకొనుము.

గురువుదేవుని నిర్యాణ కాలమున నేనును లోకమున వీడగోరితిని. అప్పుడు గురుదేవులు నాకు కనిపించి, వలదు. నీవిచటనే వుండవలెను. ఎంతయో కార్యము, మిగిలియున్నది. భక్తజన హృదయములందు సూక్ష్మ శరీరముతో నేను మున్నేరేండ్లు వుందును. అని చెప్పెను.

మానవుడెప్పుడూ ఏదోనొక కార్యమున నిమగ్నుడై వుండవలెను. ఎప్పుడును ఏ పనియు చేయక ఊరకుండరాదు. అట్లుండనప్పుడు అన్ని విధముల చెడు తలం పులు మనస్సులో ప్రవేశించును. రాత్రియు పగలును కలియు సంధ్యాకాలము భగవదా రాధనకు మిక్కిలి అనుకూలము. ఆ వేళలో మంత్రోచ్చారణము మానవుని పవిత్రు నొనర్చును. కావున భగవన్నామము నెప్పుడూ వీడకుము.

తీవ్ర తపశ్చర్య వలన మనస్సు పరిశుద్ధమగును. భగవంతుడు పరిశుద్ధ మయుడు. కావున తపః శ్రమ లేనిదే అతడు లభ్యుడుకాడు. 'మనస్సొకవేళ ఏకాగ్రము కాకుండినను, మంత్రజపమును మానక, నీ ధర్మమును నిర్వర్తించు చుండుము. కొంతసేపటికది, తనంతట తానే గాలి తాకిడి లేనిచోట దీపమువలె నిలకడగా వుండును. దీపము కదులుటకు గాలి కారణమైనట్లు, మన మోజులు, మన వాంఛలు మనస్సును అస్థిరము చేయును.

ధనమెప్పుడును మనస్సును కలుషిత మొనర్చును. నీకు ధనమోహము లేద నియు, ధనము నిన్నెప్పుడూ నాకర్షించదని నీవనుకొనవచ్చును. దానినే క్షణమునైనా త్యజించవచ్చని నీవనుకొనవచ్చును. కానీ ఇది పొరపాటు. ఇట్టి భావమును మన స్సులో ఎప్పుడూ రానీకుము. నీకు తెలియకుండగనే నీ గొంతు పిసికివేయును.

బ్రహ్మచర్య నిష్ఠ నవలంబించువాడు దైవప్రార్థన చేసినను చేయకున్నను, మోక్షము సగము, పాలు సాధించినట్లే. భగవంతుని యందతని నొక్కింత ఆసక్తి జనించెనేని, అతడతి త్వరితగతిని పరమాత్ముని సమీపించగలుగును. మానవునికి కోరికలున్నంత కాలము పునర్జన్మము లనంతముగా వచ్చుచుండును. ఒక శరీరము పిదప మరొక శరీరము ఏర్పడుటకు కోరికలే కారణము. గురుభక్తి మిక్కిలి ముఖ్యమైనది. తన గురువెట్టివాడైనను, అతని యందు పరిపూర్ణ భక్తినుంచు వానికి మోక్షము సిద్ధించును. భగవంతుడే సర్వమునకు కర్త. కానీ ఈ విషయమును గుర్తించక కొందరు మానవులు సర్వము తామే చేయుచున్నట్లు తలపోయుదురు. భగవంతునిపై ఆధారపడిననాడు ఆయనే అన్ని విపత్తులనుండి కాపాడును.

నిరాడంబరము, గాఢ నియమబద్ధము, నిస్వార్థము, మాతృప్రేమ పూరితము అగు ఆమె జీవితము సాటిలేనిది. ఆమె కలకత్తా నగరములో 1920వ సంవత్సరం జూలై 20వతేదీనాడు మహాసమాధిని పొందేరు.

(ఆంధ్రభూమి దినపత్రిక-మంచిమాట-29-3-2004)

❀ ❀ ❀

వివేకానందుని ఆశయము

భారతమాత కన్న ముద్దుబిడ్డలలో రత్నాలరాశిగా శ్రీ వివేకానందుని చెప్ప వచ్చును. జీవించినది నలభైఏళ్ళలోపే అయినా ప్రపంచాన్ని హిందూ మతప్రచారంతో ఉర్రూతలూగించి, దేశ విశేశాలలో అశేషసంఖ్యలో అభిమానుల్ని, శిష్యుల్ని పొందిన ఘనత కూడా ఆయనకే దక్కుతుంది. శ్రీరామకృష్ణ పరమహంసకు ప్రియశిష్యుడై, ఆయన ఆశయ సిద్ధికి, ఆయన సందేశాన్ని ప్రపంచమునకు అందించిన పూజ్యుడు వివేకానందస్వామి.

ధైర్యసాహసాలతో తను నమ్మిన సత్యాన్ని ప్రపంచానికి చాటి, నేటికీ ఉత్తమ పౌరులుగా సంఘసేవకులుగా తయారు కావడానికి ఎంతో తోడ్పడ్డారు. అస్ఖలిత బ్రహ్మచర్యమే తన మేధా సంపత్తికి, జ్ఞాపకశక్తికి కారణమని ఉద్ఘోదించిన మహ నీయుడు. హనుమంతుడులో వున్న పట్టుదల కార్యదీక్ష శ్రీరామచంద్రుని సేవ చేయ డానికి ఎలా ఉపకరించిందో, అలాగే ప్రతీవొక్కరూ ఆంజనేయుని ఆదర్శంగా తీసుకొని సేవచేయాలని కోరారు. హనుమంతుడు నిత్య బ్రహ్మచారి. వివేకానందునికి బాల్యం నుంచి హనుమం తునే ఆదర్శ దైవముగా పూజించెను. ఆయన అరటితోటలలో విహరిస్తాడని విని ఆయన కోసం వెదకి కానక నిరాశచెందాడు.

ఎందరో సన్యాసుల్ని, బాబాలను దేవుణ్ణి మీరు చూసేరా! అని అడిగేవారు. ఏ ఒక్కరూ చూసేనని ధైర్యంగా చెప్పలేదు. బ్రహ్మసమాజములో చేరి విగ్రహారాధనను ఒకనాడు వ్యతిరేకించిన స్వామి, శ్రీరామకృష్ణ పరమహంసను దర్శించి, ఆయన శిష్యునిగా చేరిన తర్వాత పూర్తిగా హిందూమతముపై విశ్వాసము పెంచుకొని, హిందూత్వముపై అనర్గళంగా ఉపన్యసించి, ప్రచారం గావించారు. స్వామి ఏకసంధ గ్రాహి, ఒకసారి గ్రంధమును పరికించి పక్కనపెడితే చాలామందికి ఆయన చదువు లేదని సంశయపడేవారు. కానీ వివేకానందుని పుస్తకములో ఏ పేజీలో విషయాన్ని అడిగినా టక్కున చెప్పగలిగేవారు. పిరికితనము చావుతో సమానమని, ధైర్యసాహసాలతో ఏపనైనా చేయాలని శిష్యులకు ఉద్భోదించేవారు.

ఒకసారి ఒక క్రైస్తవ మతాచార్యుడు, హిందువులు గుడ్డిగా నమ్మి రాళ్ళకు, చెట్లకు మొక్కతారని, విగ్రహారాధన కూడదని చెప్పి, నేను విగ్రహాన్ని కర్రతో కొడతాను. మీ దేవడు నన్ను శిక్షిస్తాడా? అని సభనుద్దేశించి అన్నారు. సభలో ఎవరూ పలకలేదు. విద్యార్థి దశలో నున్న వివేకానందుని చెవిని ఆ పలుకులు పడడంతో, వెంటనే మీ దేవుణ్ణి నేనుకొడ్తే ఏం చేస్తాడని ధైర్యంగా అడిగేరు.

ఆ మత ప్రచారకుడు ఆశ్చర్యంతో వివేకానందుని చూసి, నిన్ను నరరకంలో పడవేయును అని అనడంతో వివేకానందులు వెంటనే, మా దేవుడు కూడా నిన్ను అటులే నరకమున త్రోయును అనడంతో అతనునివ్వెరపోయాడు.

శ్రీ వివేకానందస్వామి తనయాత్రలో ఆళ్వారు మహారాజు ఆహ్వానముపై వారిని సందర్శించెను. ఆయన స్వామి తెలివితేటలు, చదువుచూసి, హాయిగా చక్కగా ఉద్యోగం ఏదైనా చేసుకోకుండా సన్యాసిగా తిరుగుతున్నారేమని స్వామిని ప్రశ్నిస్తే, స్వామి ఊరుకోకుండా వెంటనే ముఖ్యమైన రాచకార్యాలు, పనులు అన్నీ విడిచిపెట్టి వేట అని, వేడుకలని, పాశ్చాత్య వ్యామోహాలకు ఎందుకు పోతున్నారని అడిగేసరికి ఆ రాజుగారితోపాటు అంతా నిశ్చేష్టులయేరు.

రాజుగారు కొంచెం తడబడి, నాకు అవి అంటే ఇష్టం కాబట్టి చేస్తున్నానని అనేసరికి వివేకానందస్వామి కూడా నాకు సన్యాసిగా వుండి ఊళ్ళు తిరగడం ఇష్టం కనుక అనడంతో రాజు అతని ధైర్యాన్ని మెచ్చుకున్నాడు. ఆ మహారాజే ఊరుకోకుండా స్వామివారితో నాకు విగ్రహారాధన అంటే నమ్మకం లేదని చెప్పడంతో స్వామి క్షణం ఆగి అతనికి తగిన గుణపాఠం చెప్పాలని గోడకి వుంచిన రాజుగారి పటము తెప్పించి, దివానుని దానిపై ఉమ్మివేయమని పలికారు. దానికి రాజుగారు ఆగ్రహించి, వేళాకోళముగా వున్నదా ! అది నా చిత్రపటము. దానిపై ఉమ్మమందురా? అని బిగ్గరగా అరిచేరు. స్వామి నవ్వి ఇది ఒట్టికాగితము, అద్దమేకానీ, మీ రూపముకాదు.

దీనికి రక్తము, ఎముకలు, ఏమీలేదు. ఎవరైనా ఉమ్మివేయమని మరల అడిగేరు. అందరూ ముక్తకంఠంతో అది రాజుగారి చిత్తరవు అని గౌరవించడం చూసి, మీరు ఇందులో జీవించి లేకపోయినా మీరున్నారని భావించి అంతా గౌరవిస్తు

న్నారు. అలాగే రాతి విగ్రహములో కూడా భగవంతుని రూపము వుందని అంతా గౌరవిస్తున్నారు. అని వివేకానంద స్వామి చెప్పగానే రాజుకి కనువిప్పై స్వామివారికి నమస్కరించి క్షమించమని ప్రార్థించేరు.

మానవసేవే మాధవ సేవని తొలి తొలుత ప్రచారంచేసింది వివేకానందులే. తను ఏర్పాటుచేసిన రామకృష్ణామిషన్ ముఖ్యఉద్దేశము అదే! బ్రహ్మచర్యము, త్యాగము, మాతృదేశోద్ధరణము ముఖ్యఅంశములుగా శిష్యులకు చెప్పి, కష్టాల కడలిలో కూరుకు పోయిన బీదలనుద్ధరించమని పలికేరు.

హిందూమతము వర్ధిల్లాలంటే కులవివక్షత లేకుండా బీదలకు సేవ చేయమని అదే మాధవసేవగా అభివర్ణించారు. ఆ సేతు హిమాచలము పర్యటించి హిందువుల నందరను ఒకత్రాటిపై చేర్చి ప్రతీ ఒక్కరిలో దేశభక్తిని పెంచి, కార్యసాధకులను చేసారు.

కఠోర నియమాలతో, అకుంఠిత దీక్షతో, పట్టుదలతో, ధైర్యసాహసాలతో చేతిలో చిల్లు గవ్వలేని రోజులలో ప్రపంచ పర్యటన గావించిన నరేంద్రుడే వివేకానం దుడు. వీలు చిక్కినప్పుడల్లా ధ్యాననిమగ్నుడై, నిర్వికల్ప సమాధిని పొందిన వేదాంత మూర్తి మనస్వామి. అప్పుడప్పుడు ఇలాటి మహానుభావుల ఉద్భవించడం వలనే నేటికి మనహిందూ మతము వర్ధిల్లుతోంది. తే. 4-7-1902నాడు స్వామీజీ ముందుగా తెలియజేసిన రోజునే మహాసమాధిని పొందారు.

(ఆంధ్రభూమి దినపత్రిక - మంచిమాట -24-12-2003)

❋ ❋ ❋

శ్రీ దత్త దీక్ష

అత్రిమహర్షి అనసూయల తపఃఫలితంగా బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ముగ్గురూ ప్రత్యక్షమై వారు కోరినట్లు వారికి పుత్రులై జన్మిస్తామని మాట యిచ్చారు. బ్రహ్మ వరంతో దుర్వాసుడు, శ్రీ మహావిష్ణు వరంతో త్రిమూర్తుల అంశతో దత్తాత్రేయుడు వారికి పుత్రులుగా అవతరించారు. పువ్వు పుట్టగానే పరిమళించినట్లు శ్రీ దత్తాత్రేయుడు బాల్యంలోనే అనేక మహిమలు చూపడంతో అనేకమంది ముని పుత్రులు ఆయన్ని గురువుగా స్వీకరించడానికి పోటీపడ్డారు.

శ్రీ దత్తుడు మాత్రం వారిని పరీక్షించడానికి పలురకాల వేషాలువేస్తూ వెకిలి చేష్టలుచేస్తూ త్రాగుబోతుగా, వ్యభిచారిగా, దిగంబరుడుగా కనిపించి ముని కుమారు లకు ఆశ్చర్యాన్ని కల్గించేవాడు. ఒకసారి ఒక నదిలో మునిగి నూరు వర్షములు ఎవ్వరికీ కన్పించలేదు. అయినా కొందరు ముని కుమారులు ఆయనకోసం వేచి వుండి గురువుగా స్వీకరించారు. దత్తుని రాకచూసిన తల్లి అనసూయ మహదానం దంతో ఇన్నాళ్లూ ఎక్కడికెళ్ళేవని ప్రశ్నించి, ఇక ముందు తన్ను విడిచి వెళ్ళవద్దని ఆదేశించింది. కొన్నాళ్ళ తర్వాత దత్తాత్రేయుడు తను సహ్యాద్రికి వెళ్ళి తపస్సు చేసు

కొంటానని ఆనతిమ్మిని తల్లిని కోరాడు. దానికి తల్లి సమ్మతించలేదు. ఎన్నో సంవత్స రాలు తపస్సుచేసి మేము నిన్ను పొందాము. నీకు ఈ చర్మదేహాన్ని యిచ్చింది నేను. అది మరచిపోకు. ఒకవేళ నువ్వు వెళ్ళదలచుకొంటే నేనిచ్చిన చర్మదేహాన్ని నాకిచ్చేసి నువ్వు వెళ్లు అంది ఆ కన్నతల్లి.

ఆ మాటవిన్న దత్తస్వామి నిశ్చలంగా ఒక చిరునవ్వు నవ్వాడు. తల్లి చూస్తూ వుండగానే తన గోళ్లతో పరపర తన చర్మాన్ని చీల్చి తొడుక్కున బట్ట ఊడదీసినట్లు తీసి తల్లి చేతిలో పెట్టాడు. అనసూయమాత నిర్ఘాంతపోయింది. చర్మం లేని రక్త మాంసమైవున్న ఆ రూపాన్ని చూడలేకపోయింది. వెంటనే ఒక అనిర్వచనీయమైన దివ్యజ్యోతి సాక్షాత్కరించి ఆమె మనసు ప్రశాంతిచెందింది. అనసూయామాత ఆదిత్య తేజస్సునుచూసి గురుదత్తా ! నీవు జగత్తులను చీకటినుంచి వెలుగులోకి నడిపించ డానికి అవతరించిన జగద్గురువువు. నీ లీలలు చిత్రవిచిత్రం. నీ దివ్య జ్యోతితో ప్రశాంతత కలగుజేసేవు. నీ కోరిక ప్రకారమే సహ్యాద్రిపై కొలువుండి భక్తులని కరు ణించి ఏలుకో అని ఆశీర్వదించి పంపింది.

దత్తస్వామి తల్లి ఆశీస్సులు పొంది సహ్యాద్రి పర్వతంచేరి కొన్నాళ్లు తపమాచరిం చాడు. జంబాసురుడనే రాక్షసుడు తపోబలంతో విర్రవీగి స్వర్గంమీదకి దండెత్తాడు. దేవేంద్రుడు, దేవతలు భీకరయుద్ధం సాగించినా విజయాన్ని పొందలేకపోవడంతో బృహస్పతి, ఆదేశంతో దేవేంద్రుడు సహ్యాద్రి పర్వతంచేరి దత్త స్వామిని ప్రార్థించాడు. శ్రీ దత్తస్వామి అనుగ్రహించి అభయ మిచ్చి వారిని కాపాడాడు. దత్త స్వామి అమలక వృక్షం క్రింద కూర్చుని తపస్సు ప్రారంభించాడు. చచ్చుచేతులతో పుట్టి నీర్వీర్యుడై దిగులుపడివున్న కార్తవీర్యార్జునుడు కొందరు మహాత్ముల సలహాతో తపస్సుచేసి శ్రీ దత్తస్వామిని మెప్పించి వేయి చేతులు పొంది సహస్రబాహునిగా మారి దివ్యశక్తులతో రాజ్యమేలాడు. దత్తస్వామి తన లీలలతో ఎందరినో భక్తుల్ని ఆదుకొని, అనేక రూపా లలో వారికి సాక్షాత్కరించి వారి కోరికలు తీర్చారు. దత్తాత్రేయ అంశతో జన్మించిన అనేకమంది అవదూతలు కూడా భక్తుల్ని కరుణించి కాపాడిన వారున్నారు. వీరిలో ముఖ్యులుగా చెప్పదగినవారు శ్రీపాదవల్లభుడు, శ్రీనృసింహసరస్వతి, శ్రీ మాణిక్య ప్రభువు, శ్రీ అక్కల్‌కోట్కర్ స్వామి, శ్రీ షిరిడీసాయిబాబా, గొలగపూడి శ్రీ వెంకయ్య స్వామి మున్నగు వారంతా ఈ కోవకి చెందినవారే.

శ్రీ దత్తస్వామిని ప్రసన్నం చేసుకోవడానికి చేసే వ్రతం, దీక్షనే, ఔదుంబర దీక్షని అంటారు. ఈ దీక్ష ఇప్పుడు చేసే దీక్షలన్నిటిలో కఠినమైన దీక్షగా పేర్కొనవచ్చు. దీక్షావిధులు, ఒక మంచిరోజు చూసుకొని, దేవ సన్నిధిలోగాని గురుసన్నిధిలోగాని నిలబడి, ఒక మేడిపూసను (పుల్లను) పసుపు దారానికి కట్టి, దానిని దైవార్పణచేసి, దత్తస్మరణ చేస్తూ దానిని మరల తీసుకొని, దీక్షామాలగా మెడలో ధరించాలి. అపుడు ఆ దీక్షను3 రోజులుకానీ 7 రోజులుగానీ 21 రోజులుగానీ, 40 రోజులుకానీ కొనసాగిస్తామని దత్తస్వామి ముందు ప్రతిజ్ఞ చేయాలి. ఒక ఎందుకురిడీ కొబ్బరి

చిప్ప, కొద్దిగా ఎండు శనగలు, ఖర్జూరం, పంచదార, ఆవునెయ్యి, రెండురూపాయల బిళ్ల, ఇవన్నీ ఒక పసుపు గుడ్డలో మూటకట్టి, దత్తస్వామికి ముడుపుకట్టాలి.

దీక్షాకాలంలో ఉప్పు, పులుపు, కారాలు పూర్తిగా విసర్జించాలి. కఠిన బ్రహ్మా చర్యంచేస్తూ నేలమీదనే పడుకోవాలి. రెండుపూటలా చన్నీటి తలస్నానం చేసి దీపారాధన చేసి పూజ నిర్వహించాలి. ముఖ క్షవరం, కేశఖండన పనికి రాదు. ఒక్క పూట భోజనం, రాత్రివేళ అల్పాహారం సేవించాలి. సాత్వికాహారాన్నే సేవించాలి. ప్రతిరోజూ ఎంతో కొంత గురుచరిత్ర దత్త పారాయణ చేయాలి. అసత్యమాడరాదు, దానధర్మాలు చేస్తూ నీతిగా బ్రతకాలి. దీక్షాకాలంలో దీక్షావస్త్రాలుగా నూతన వస్త్రాలు ఏ రంగువైనా ధరించవచ్చు. పువ్వులు, డిజైన్లు వున్న వస్త్రాలు కాకుండా ఒకేరంగు వున్న వస్త్రాలు (తెల్లని) ధరించడం మంచిది.

అనుకున్న గడువు పూర్తయ్యాక (3,7,21,40 రోజులు) ఈ ముడుపు మూటను తీసుకొని ఒకదేవాలయానికి వెళ్ళి దేవాలయపూజారికికానీ, ఎవరైనా సద్గురువుకి కానీ సమర్పించి తాంబూలం దక్షిణ యివ్వవలెను. లేనియెడల ఏదైనా నదిలోనైనా విసర్జించి దీక్ష విరమణ చేయవచ్చు. దీక్షా వ్రతములో వున్న కాలమున మేడిచెట్టు చుట్టూ ప్రతిరోజూ 5 లేక 11 ప్రదక్షిణలుచేస్తే మంచిది. దీక్ష పూర్తయేలోపలే గురు చరిత్ర (దత్తచరిత్ర) పారాయణాన్ని కూడా పూర్తిచేయాలి. మనం దీక్షచేసే రోజులబట్టి పారాయణ గ్రంథంలో అధ్యాయాలు ప్రతిరోజూ చదవాలి.

దీక్షాకాలంలో ఉప్పు, పులుపు, కారాలు తినకూడదనే నియమం వుండడం వలన చప్పిడి భోజనం చేయలేక మితాహారాన్నే తినడం వలన ఆహారం సయించక పోవుడంతో దీక్షాపరులు చిక్కిపోయి బలహీనులవుతారు. అందుకే వారికున్న శక్తినిబట్టి ఈ ఔదుంబర దీక్షచేయాలి. మిగతా దీక్షలకు సాత్వికాహారాన్నే తినమని నియమ ముందికాని, ఉప్పు, పులుపు, కారం మానమనే నియమం లేదు. అందుకే ఔదుంబర దీక్ష కఠినమైనదని, అది చేయడానికి సామాన్యులు సాహసించరు. జై గురుదత్త!

(ఆంధ్రభూమి దినపత్రిక– మంచిమాట – 27–4–2007)

❁ ❁ ❁

శ్రీ సాయి తత్త్వం

శ్రీ షిర్డీ పురాధీశుడు శ్రీసాయితత్వం ఆయనతో కలిసి మెలిసి తిరిగిన శిష్యులకే అవగతమయ్యేది కాదు. బాబా హిందువా, ముస్లిమా అని ఆలోచించి తలబద్దలు కొట్టుకున్నవారున్నారు. బాబా మసీదులో నివాసముంటూ ఉర్సు, పీర్ల పండుగ దగ్గ రుండి జరిపించేవారు. శ్రీరామనవమి ఉత్సవాలను ప్రోత్సహించి హరికథలతో, భజనలతో భిక్షతో పూజలు జపిరించేవారు. నిత్యాగ్నిహోత్రాన్ని (ధుని) రగిలిచి అల్లా మాలిక్ అంటూ సటకాతో నేలపై కొడుతూ, హుక్కా పీలుస్తూ ఒక సామాన్య పకీ రులా ప్రవర్తించేవారు. ఎంతమంది ఎన్ని తెచ్చి ఇచ్చినా రోజూ బిక్షాటనానికివెళ్ళి

కనీసం ఏడు ఇళ్లయినా తిరిగి బిక్షను తెచ్చి అందులో కొంతభాగాన్ని పిల్లలకు, కుక్కలకు పెట్టి తను తరువాత భుజిం,ఏవారు. ఒక్కొక్కసారి తనే స్వయంగా వంటచేసి భక్తులకు తినిపించేవారు.

ఎవరైనా భక్తులువచ్చి ఉపదేశము చేయమంటే నాకు ఏ గురువు ఉపదేశం చేయలేదని, నేను గురూపదేశము పొందలేదని చెప్పేవారు. శ్రద్ధ, నమ్మకము భక్తితో పాటు ఉండాలని ప్రతీ ఒక్కరికి బోధించేవారు. విష్ణు సహస్రనామా పారాయణాన్ని భాగవత పఠనాన్ని ఎక్కువగా ప్రోత్సహించేవారు. భక్తుల నమ్మకాన్ని తగినట్లు శ్రీరాముడుగా, శ్రీకృష్ణునిగా, పాండురంగడుగా, దత్తస్వామిగా, శివునిగా, అక్కలకోట మహారాజ్‌గా వివిధ రూపాలలో భక్తులకు దర్శనమిచ్చి వారికి తనందు నమ్మకాన్ని కలిగించేవారు.

బాబామాటలు, చేష్టలు ఒక్కొక్కసారి ఆశ్చర్యం కలిగించేవి. కొన్ని చిన్న పిల్లల చేష్టలుగా వుండేవి. ఒకసారి ఒకభక్తుడు గోడమీద బల్లి కిచకిచమంటే దాని అర్థమేమిటని కొంటెగా అడిగాడు. బాబాగారు ఔరంగాబాద్ నుండి తన చెల్లెలు వస్తోందని సంతోషం వ్యక్తం చేస్తోందని అన్నారు. ఆ భక్తుడికి బాబా మాటలు అర్థముకాక మౌనంగా ఉండిపోయారు. కొంతసేపటికి ఒక భక్తుడు ఔరంగాబాదు నుండి బాబాగారికి పళ్లగంప గుర్రముపై నుండి దింపి సమర్పించాడు. ఆ పళ్ల గంపనుండి ఒక బల్లి దూకి గోడమీదకి పాకి ఇంతకు ముందున్న బల్లి దగ్గరికి వెళ్లి దానితో సంతోషంగా ఆడడం మొదలు పెట్టేసరికి అక్కడున్న భక్తులు బాబాగారి మాటలు విన్నవారు విస్తుపోయారు.

బాబాగారికి ఉపవాసాలు అంటే ఇష్టం ఉండేదికాదు. ఉపవాసాలు చేసే వారిని నిరుత్సాహపరచి భోజనం తినిపించేవారు. బాబాగారి శిష్యుడు గోకులే భార్య షిర్డీలో బాబాగారి సమక్షంలో వుంది. మూడు రోజులు ఉపవాసము చేయాలనుకొంది. బాబాగారు గ్రహించి ఆమెను పిలిచి, దాదాభట్టు ఇంటికిపోయి బొబ్బట్లుచేసి వారికి పెట్టి తినమని ఆజ్ఞాపించారు. మారుమాట్లాడకుండ వారింటికివెళ్ళి మూణ్ణాళ్ళు వంట చేసి భోజనం తినవలసి వచ్చింది. రామదాసీ అనే శిష్యుడు ప్రతీరోజు విష్ణు సహస్రనామపారాయణము చేసేవాడు. బాబాగారు ఒకరోజు అతని పుస్తకాన్ని శ్యామా అనే శిష్యునికిచ్చి రోజూ పారాయణ చేయమని చెప్పారు.

బాబాగారు మసీదులో దీపాలు వెలిగించేవారు. దీపావళి రోజున మసీదులో దీపాలు పెట్టడానికి షిర్డీలో షావుకార్లు ఎవ్వరూ నూనె ఇవ్వకపోతే బాబాగారు ప్రమిదిలలో నీళ్ళుపోసి ఒత్తులువేసి వెలిగించడం చూసి ఆశ్చర్య చకితులయ్యారు. ఒకరోజు సాయంత్రం షిర్డీలో తుఫాను భీభత్సం సృష్టించడంతో సర్వం జలమయ మయ్యేసరికి ప్రజలంతా బాబాని శరణు వేడేరు. బాబాగారు ఒక్కసారి ఆకాశంవైపు చూసి బిగ్గరగా ఆగు! నీ తీవ్రత తగ్గించు, నెమ్మదించు అని గర్జించగానే కుంభవృష్టి ఆగిపోయింది.

బాబాగారు సంతానంలేనివారికి అనేక మందికి సంతానం కలుగచేశారు. వారిలో దామూ అణ్ణాకాసర్, గోపాలరావు గుండు, ఔరంగబాగ్‌కర్ భార్య, సపత్నీకర్ భార్య మున్నగు వారికి బాబాగారి ఆశీస్సులతోనే సంతానం కలిగింది. బాబాగారి ఊదితో అనేకమంది దీర్ఘకాలిక వ్యాధులను పోగొట్టుకున్న వారున్నారు. ఊదీ మహిమతో సుఖప్రదమైన సందర్భాలు వున్నాయి. బాబాగారు కొందరి దగ్గర అడిగి దక్షిణ తీసుకునేవారు. ఊళ్ళో ప్లేగువ్యాధి వ్యాపిస్తోందని తెలుసుకొని బాబాగారు గోధుములు తిరగలిలో వేసి విసరి వ్యాధిని తరిమి కొట్టేరు.

నానా సాహెబ్ చందోర్కరు బాబాగారి శిష్యులలో ఒకరు. భగవద్గీతశ్లోకాలు ఒకరోజు గట్టిగా చదువుతూ ఉండడం చూసి బాబాగారు ఒక శ్లోకానికి అర్థం చెప్ప మన్నారు. బాబాగారికి సంస్కృతం రాదనే అభిప్రాయంతో ఏదో చెప్పడం విని బాబాగారు అర్థాన్ని వివరించి చెప్పి అతని కన్నులు తెరిపించారు. మరొక శిష్యుడు దాసగణు మరాఠీలో ఈశావాస్యోపనిషత్తుకు వ్యాఖ్య రాయడం మొదలెట్టి ఒక శ్లోకానికి అర్థము తెలియక బాబాగారిని వివరణ కోరేడు. బాబాగారు చిరునవ్వుతో విల్లేపార్లే అనే ఊరిలో కాకా సాహెబ్ దీక్షిత్ పనిపిల్ల నీ సంశయం తీర్చుస్తోందని దాసగణుని అక్కడకు పంపేరు. ఆ పనిపిల్ల ఇంట్లో ఆనందంగా పనిచేస్తూ పాడిన పాట విని దాసగణు ఉపనిషత్ వ్యాక్యానికి అర్థం తెలుసుకున్నాడు. బాబాగారి ప్రవర్తన ఇలా వింత గొలుపుతూ వుండేది.

ఒకసారి దాసగణు ప్రయాగ వెళ్ళి త్రివేణి సంగమంలో స్నానం చేయాలనుకుని అనుమతికోసం బాబాగారి పాదాలకు నమస్కరించేడు గంగా యమునలలో స్నానం కోసం ప్రయాగ వెళ్ళే పనిలేదని బాబాగారు రెండు పాదాల బొటనవేళ్ళ నుండి గంగా, యమునలను పారించే సరికి భక్తులు విస్తుపోయారు. బాబాగారు ఇలా ఎన్నో అద్భుతాలుచేసి దత్తావతారుడుగా ప్రసిద్ధిచెంది తను సమాధి చెందిన తరువాత కూడా భక్తుల అభీష్టాలు నెరవేరుస్తూ భక్తుల ఆరాధ్యదైవమయ్యాడు.

(ఆంధ్రభూమి దినపత్రిక – మంచిమాట – 25-6-2009)

❀ ❀ ❀

బ్రహ్మరాత

ప్రతీ జీవిభూమిపై జన్మించడానికి ముందు వారి భవిష్యత్తును తెలియజేస్తూ వారి నుదుటపై బ్రహ్మ రాస్తాడని, దానినిబట్టే వారి ఆయుర్దాయం, బుద్ధులు, వారు చేసే పనులు ఆధారపడి వుంటాయని బ్రహ్మరాతను ఎవరూ తప్పించలేరని మన పెద్దలు చెబుతూవుంటారు. బుద్ధిః కర్మానుసారాణి అనే నానుడి అందుకే వచ్చింది.

బ్రహ్మరాత గురించి ఒక కథ కూడా ప్రచారంలో వుంది. ఒకనాడు నారద మునీంద్రుడు త్రిలోకాలు సంచరిస్తూ, భూలోకానికి వచ్చుడు. నారదుడు చాలా సూక్ష్మగ్రాహి, ఎంతో మేధావి కావడంవలన భూలోక సంచారం చేస్తూ ఒక ఊళ్లో

ఒక శ్మశానం పక్కనుంచి వెళుతూవుంటే అతనికి ఒక మానవుని పుర్రె కనిపించింది. ఆ పుర్రె నుదిటిపై మరణానంతరం ఈ పుర్రె బ్రహ్మలోకము చేరును అని రాసివుండడం, బ్రహ్మరాతను తెలిసి చదివిన నారదుడు ఆశ్చర్యపోయాడు. తాతగారైన బ్రహ్మదేవుడు వయోభారంతో ఈ మధ్య యిలాంటి తప్పులు కూడా చేస్తున్నాడన్నమాట అనుకొని, ఆలోచించి తాతగారిని ఒక ఆట ఆడించవచ్చుని తలపు రావడంతోమెల్లగా ఆ పుర్రెను సంగ్రహించి తన జోలిలో పెట్టుకుని తిన్నగా బ్రహ్మలోకానికి వెళ్లాడు. సృష్టికర్త బ్రహ్మసృష్టి క్రియలో నిమగ్నమైవుండడం చూసి నారదుడే బ్రహ్మదేవుని పలకరించి కుశల ప్రశ్నలయ్యాక తాతగారూ ఈ మధ్య మీకు పని ఎక్కువై మీరు మానవులలాగే పొరపాట్లు చేస్తున్నారేమిటి ? అని అడిగేడు.

బ్రహ్మదేవుడు నవ్వి, నాచేతలో నా రాతలో ఎన్నడూ తప్పు జరగదు. నేను రాసిన రాతకు తిరుగలేదు. అది జరిగి తీరుతుంది. దృఢంగా చెప్పడం విన్న నారదుడు పగలబడి నవ్వాడు. బ్రహ్మ ఆశ్చర్యం నటిస్తూ, 'ఏమిటి మనవడా అంత వెటకారంగా నవ్వుతున్నావు. ఎక్కడైనా నేను రాసిన రాత తప్పిందా?' అని అడిగాడు.

నారదుడు ముసిముసి నవ్వులు నవ్వుతూ, జోలినుంచి మానవ పుర్రెను బయటకు తీసి, దీని ముఖంమీద ఏమిరాసి వుందో తమరే చదవండి అని బ్రహ్మదేవుని చేతికిచ్చాడు. బ్రహ్మదేవుడు ఆ పుర్రెను నిశితంగా పరిశీలించి మరణాంనతరం ఇది బ్రహ్మలోకము చేరును అని రాసాను అనగానే నారదుడు పక్కున నవ్వి, అదే మీరలా రాసినపుర్రె పాపం ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ భూలోకంలో స్మశానంలో పడి వుండటమే విశేషం అన్నాడు వెటకారంగా.

దానికి బ్రహ్మదేవుడు నవ్వి, 'నారదా! నువ్వు అదే పొరబడుతున్నావు. నేను దాని నుదిటిపై రాసినట్లే అది ఇప్పుడు నీ ద్వారా బ్రహ్మలోకమే చేరింది. నా రాత పొల్లెక్కడయింది. అని అనగానే నారదునికి జ్ఞానోదయమై క్షమించు తాతా! అంటూ సిగ్గుపడి అక్కడి నుంచి నిష్క్రమించాడు.

విధి వ్రాతను ఎవరూ తప్పించలేరని అందుకే అంటారు. దీనికి పూర్వజన్మ సుకృతం కూడా వుంటుంది. పుణ్యం కొద్దీ పురుషుడు,దానంకొద్దీ బిడ్డలు అని మన వాళ్ళు సామెత చెబుతారు. మనం పూర్వజన్మలో చేసిన పుణ్యఫలంవల్లే కొందరు గొప్పవాళ్లింట్లో పుట్టి సకల సంపదలు అనుభవిస్తూ వుంటే, మరికొందరు పూర్వజన్మలో వారు చేసిన పాపాలు, చెడ్డపనులవలన మానవులుగా జన్మించినా అష్టకష్టాలు పడుతూ ఘోర దరిద్రాన్ని అనుభవిస్తూ భూలోకంలో నరక యాతన పడుతూవుంటారు. కొందరు మొదట ధనవంతుల ఇంట్లో పుట్టి సకల సౌఖ్యాలు అనుభవించి, కొన్నేళ్ల తర్వాత కష్టాలు అనుభవించినవారు అనేకులు వుంటారు. అలాగే కొందరు మొదట కస్టాలు అనుభవించి తరువాత సకల సౌభాగ్యాలు అనుభవించినవారుంటారు. వీరందర్నీ చూస్తూవుంటే పూర్వజన్మ సుకృతం. గతజన్మ వాసనలని నమ్మవలసి వస్తుంది.

కొందరు పుట్టుకతోనే పువ్వు పుట్టగానే పరిమళించినట్లు దైవభక్తులు, గాయకులు, కవులుగా రాణిస్తారు ప్రహ్లాదుడు, ధృవుడు వంటివారైతే భక్త రామదాసు అన్నమయ్య, త్యాగరాజు, తులసిదాసు, భక్తతుకారం, వివేకానందుడు, రమణమహర్షి, శ్రీరామకృష్ణ పరమహంస వంటివారిని పేర్కొనవచ్చు.

విధి వ్రాతవలనే శ్రీరామచంద్రుడు, సీతామాత కూడా రాజ్యాన్ని వదలుకొని అరణ్యాలపాలై అష్టకష్టాలు అనుభవించారు. రావణ కుంభకర్ణాది రాక్షసులను సంహరించడం కోసం శ్రీరామచంద్రుడు కష్టాలు అనుభవించక తప్పలేదు. పంచ పాండవులు ఉత్తమ గుణాలు కలిగివున్నా ధర్మము వారివైపు వున్నా విధిరాతవలనే వారికి అరణ్యవాసము, అజ్ఞాత వాసము చేయక తప్పలేదు. నల మహారాజుని ఏరికోరి వివాహం చేసుకొని దమయంతి అష్టకస్టాలు అనుభవించింది. అసత్యమాడని హరిశ్చంద్రుడు నానా కష్టాలు పడినా సత్యవ్రతాన్ని మానకుండా లోకానికి అధర్మమయేడు.

మహాత్మగాంధీ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, జార్జి కెనడీ వంటివారు ప్రపంచ ప్రఖ్యాతి గాంచి, చిరత్ర పుటలలో చిరస్థాయిగా నిలచినా హత్యకు గురైఘోరమైన రీతిలో మరణించారు. హోమిబాబా, కల్పనాచావ్లా వంటి శాస్త్రవేత్తలు అంతరిక్షంలో మరణించారు. మృత్యువు ఎవరికి ఏ రీతిలో వస్తుందో ఎవ్వరూ చెప్పలేరు. రోడ్డు ప్రమాదాలు, రైలు ప్రమాదాలు, విమాన ప్రమాదాలు, భూకంపాలు, తుఫానులు, వరదలు, యుద్ధాలు, హత్యలు, ఒక కారణమైతే ఎప్పుడువచ్చే రకరకాల రోగాలు మరొక కారణమవుతున్నాయి. జ్యోతిష శాస్త్రవేత్తలు ఎన్ని లెక్కలు వేసి ఎంత పరిశోధన చేసి చెప్పినా, బ్రహ్మరాసిన రాతను మార్చలేరు. జ్యోతిశాస్త్ర ప్రకారం 50-60% జరగడానికి అవకాశాలు వున్నాయికానీ చెప్పినవన్నీ నిజాలు కావు.

మనకి మంచి చెడు చెప్పడానికి అనేకమంది మతాచార్యులు, బాబాలు, పీఠాధిపతులు, గురువులు చెప్పుకోవడానికఇ అనేకమంది వున్నారు. వారు ప్రజలను సన్మార్గంలో నడపడంపోయి వారే అజ్ఞానంలోవుండి ఇంకా శివకేశవులకు బేధం కలిగిస్తూ, ఈ రోజులలో కూడా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. ఆది శంకరాచార్యులవంటి మహానుభావుడు ఈ దేశంలో ఉద్భవించి తత్వమసి సిద్ధాంతాన్ని వ్యాప్తి గావించి, అంబ, శివుడు, కేశవుడు, అందరూ ఒక్కటేనని చెప్పి ఆదిశంకరులు అందరి దేవతలపైన స్తోత్రములు రాయడమేకాక విష్ణు సహస్రనామ స్తోత్రానికి, భగవద్గీతకు కూడా భాష్యంచెప్పేరు. శివకేశవులకు భేదం లేదని అనేక ఉదాహరణలతో చక్కగా నిరూపించారు. అయినా ఈ రోజు కూడా కొందరు స్వార్థచింతనతో, అజ్ఞానంతో ప్రజలను తప్పుదోవపట్టించి దేశంలో ఈర్ష్యా ద్వేషాలు రగిలించి, అశాంతికి ఆజ్యం పోస్తున్నారు.

వివేకానందుని వంటి మహనీయులు హిందూమతాన్ని విశ్వవ్యాప్తం చేస్తే నేడు కొందరు హిందూమతానికి చీడ పురుగులుగా చేరి, దేశంలో అల్లకల్లోలాలను

సృష్టిస్తున్నారు. పూర్వము మహారాజులు దేశాన్ని కాపాడడానికి సైన్యం ఎంత ముఖ్యమో ధర్మాన్ని కాపాడడానికి యజ్ఞయాగాదులు, పూజలు, వ్రతములు అంత అవసరమని గుర్తించి, బ్రాహ్మణులను (విద్యావంతులను) ఆదరించి దేశ రక్షణకు పూనుకునేవారు. నేడు కలుషిత రాజకీయాలొచ్చి న్యాయానికి, ధర్మానికి, నీతికి తిలోదకాలిచ్చి, దేవాలయాలను కూడా అపవిత్రం చేస్తున్నారు. సంధ్యా వందనము, గాయత్రీ మంత్రం జపించవలసినవారు నేడు కరువయ్యారు. పొట్టకూటికి రకరకాల ఊడిగాలు చేస్తూ కాలక్షేపం చేస్తున్నారు. పాఠశాలలో, కళాశాలలో ఉత్తమ విద్య, నీతిబోధచేసే అధ్యాపకులు కరువవడంతో రేపటి పౌరులుగా తయారయ్యే నేటి బాలలు అధోగతి పాలవుతున్నారు. ఇదంతా బ్రహ్మ రాత కాబట్టే ఇలాంటి పిదప బుద్ధులు పుడుతున్నాయని సరిపెట్టుకోవలసి వస్తుంది.

(ఆంధ్రభూమి దినపత్రిక – మంచిమాట – 30-9-2004)

❀ ❀ ❀

దేవాలయాల్లో అద్భుతాలు !

మనదేశంలో పుణ్యక్షేత్రాలకు కొదవలేదు. లెక్కలేనన్ని పుణ్యక్షేత్రాలు కాశ్మీరం నుండి కన్యాకుమారి వరకు ఉన్నాయి. ఒక్కొక్క దేవాలయానికి ఒక్కొక్క ప్రత్యేకత ఉంది. కొన్ని దేవాలయాలలో విగ్రహాలు చాలా మహత్తు కలిగివుండడం వలన, ఆ విగ్రహాలకు అభిషేకించిన విభూది, చందనం, నెయ్యి, పంచామృతాలు, అభిషేకించిన జలం, అగ్ని ఎన్నో రోగాలను నయం చేయడమే కాకుండా, ఆ ప్రసాదం దగ్గరుంటే ఆపదల నుండి కాపాడి, ఎన్నో రకాల మేలు జరుగుతుంది.

కేదారనాథ్, బదరీనాథ్ క్షేత్రాలు హిమాలయాలలో ఉన్నాయి. సంవత్సరానికి ఆరునెలలు మాత్రమే ఈ దేవాలయాలను తెరచివుంచుతారు. మిగతా ఆరునెలలు, అంటే నవంబరు నుండి ఏప్రిల్ నెలాఖరు వరకు ఈ దేవాలయాలు మూసివుంటాయి. అంటే, మంచుతో కప్పబడి మానవమాత్రులు వెళ్ళడానికి సాధ్యంకాదు. ఆ కాలంలో దేవతలు వచ్చి అక్కడ పూజలు జరుపుతారని భక్తుల నమ్మకం. ఈ రెండు క్షేత్రాలలో అంటే కేదారనాథ్, బదరీనాథ్ దేవాలయాలు మూసి వేసేటప్పుడు అఖండజ్యోతిని వెలిగించి ఉంచుతారు. ఆరునెలల తరువాత దేవాలయాన్ని తెరిచేవరకు ఆ అఖండ జ్యోతి అలా వెలగడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. పలువురు భక్తులు దేవాలయం మూసివేసేటప్పుడు అఖండజ్యోతిని చూసి, మరల దేవాలయం తెరిచే రోజు వచ్చి నేటికీ దర్శించడం గొప్ప మహత్తు.

రాజస్థాన్‌లో బికనీర్ అనేచోట శ్రీకరుణాదేవి అనే అమ్మవారి దేవాలయం ఉంది. ఆ ఆలయంలో దేవి బంగారు సింహాసనంపై కూర్చొని చిరు దరహాసంతో భక్తులకు దర్శనమిచ్చి ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. దేవిని చూసిన భక్తులు పారవశ్యం చెందుతారు. ఆ ఆలయం నిండా ఎలుకలు ఉండి ఇటూ అటూ పరుగులెడుతూ

భక్తులకు కితకితలు పెడుతుంటాయి. భక్తులు ఎలుకలనే దేవీ స్వరూపంగా భావించి, నైవేద్యాలు వాటికే అర్పిస్తారు. పొరపాటున ఎవరికాలు క్రిందైనా ఎలుకపడి చనిపోతే వారి తాహతునుబట్టి, బంగారు ఎలుకనో, వెండి ఎలుకనో చేయించి దేవాలయానికి సమర్పిస్తారు. ఎలుకలు ఎంతమంది భక్తులొచ్చినా బెదరవు. భక్తులను ఏమీచేయవు.

మనరాష్ట్రంలో గుంటూరు, విజయవాడ మార్గమధ్యంలో మంగళగిరి అనేచోట కొండపై లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఉంది. ఈ స్వామికే పానకాల నరసింహ స్వామి అనిపేరు కూడా ఉంది. ఈ కొండపై వెలసివున్ననరసింహస్వామికి బెల్లం పానకం ఇష్టమని పానకం తయారుచేసి ఆ పానకాన్ని నైవేద్యానికి పూజారి చేతికిస్తే, పూజారి ఆ పానకాన్ని అక్కడ నరసింహస్వామి నోట్లో పోస్తాడు. స్వామి సగంత్రాగి, సగం భక్తులకోసం తిరిగి అందిస్తాడు. బిందెడు పానకం ఇస్తే అరబిందె పానకం, చెంబుడు పానకం తీసుకువెళితే అరచెంబుడు పానకం మనకి తిరిగి స్వామి నోటి నుండి రావడం ఇక్కడ విశేషం. మరొక చెప్పుకోదగ్గ విశేషమేమిటంటే కొండపై నిత్యం బెల్లం ముక్కలు కొట్టి, నూరి పానకం చేస్తున్నా కొండపై ఒక చీమకాని, ఈగ కాని కనిపించదు. ఇప్పటికీ ఎవరికీ అర్ధముకాని విషయమిది.

మనరాష్ట్రంలోనే రాయలసీమలో నంద్యాలకు పదిహేను కిలోమీటర్ల దూరంలో మహానంది పేరుతో ఒక శివాలయం ఉంది. అక్కడ దేవాలయం ముందు రెండు నీటి కొలనులున్నాయి. ఆ నీరు దేవాలయం క్రింద నుండి సమీప కొండలనుండి వచ్చి చేరుతూ ఉంటుంది. నీళ్ళు స్వచ్ఛంగా స్ఫటికంలా ఉంటాయి. కొలనులో ఎప్పుడూ నాలుగైదు అడుగుల ఎత్తు నీరు ఉంటుంది. మనం స్నానం చేస్తూ మన కాలిబొటన వ్రేలి గోరును స్పష్టంగా చూడవచ్చు. నీరు అంత నిర్మలంగా ఉంటుంది. క్రింద రూపాయి నాణెంకాని, ఉంగరంలాంటి వస్తువుని జారవిడిచినా, నీటి అడుగున అని స్పష్టంగా మనకి కనిపిస్తాయి. ఏకాలంలో అక్కడికి వెళ్ళినా, నీటిలో బురద కనిపించకుండా స్వచ్ఛంగా ఉండటం విశేషం.

తమిళనాడులో మధురైకి సుమారు 120 కిలోమీటర్ల దూరంలో పళని క్షేత్రం ఉంది. సుబ్రహ్మణ్యస్వామి ఆరుక్షేత్రాలలో ఈ క్షేత్రం చాలా ప్రసిద్ధిచెందింది. ఈ పుణ్యక్షేత్రం పళనిలో, కొండపై శ్రీ సుబ్రహ్మణ్యస్వామి బాలుని రూపంలో ఇక్కడ గోచరిస్తాడు. ఈ స్వామి విగ్రహం నవపాషాణం అనే శిలతో చేయబడిందని చెబుతారు. ఇక్కడ స్వామివారికి అభిషేకించిన నీరు త్రాగినా, విభూధి, చందనం వంటివి ఒంటికి పూసుకున్నా, కొంచెం నీటిలో వేసుకొని త్రాగినా, దీర్ఘరోగాల నుండి కూడా విముక్తి లభిస్తుంది. పళని విభూదికి అంత ప్రత్యేకత లభించడానికి కారణం అదే. అక్కడ పాలు, పంచామృతం కూడా అభిషేకించి, ఒకప్పుడు భక్తులకిచ్చేవారు. తరచుగా అభిషేకాలు చేయడంవలన విగ్రహం అరిగిపోతోందని ఇప్పుడుఏ నిజ విగ్రహానికి అభిషేకించకుండా పక్కన కొత్తగా మరొక విగ్రహాన్ని ప్రతిష్టించి అభిషేకాలు, జరపడం వలన నేడు భక్తులు ఆశించిన ఫలితం పొందలేక పోతున్నారు.

కేరళలో శబరిమలలో పదునెట్టాంబడిపై ప్రతిష్ఠించిన అయ్యప్ప విగ్రహం పంచలోహాలతో చేయబడింది. ఆ పంచలోహవిగ్రహానికి అభిషేకించిన నెయ్యి, విభూది, చందనం, తేనె, పంచామృతాలు ఎంతో పవిత్రమైనవేకాక, చాలా మహిమాన్వితమైనవి. సర్వరోగనివారణ ధన్వంతరమూర్తిగా శ్రీఅయ్యప్పస్వామిని కీర్తించినట్లు ఎందరివో రోగాలు నయమవడమే కాకుండా విభూది, చందనం ధరించడం వలన ఆపదలనుండి విముక్తిని పొందిన వారున్నారు. నేడు లక్షలసంఖ్యలో భక్తులు శబరిమల రావడం వలన భక్తులు తెచ్చిన, నెయ్యి,విభూది,తేనె, చందనం వంటి వాటిని పూర్తిగా అభిషేకాలు చేయలేక స్వామివారికి తాకించి ప్రసాదంగా ఇస్తున్నారు. స్వామివారి విగ్రహానికి అభిషేకించినవి అయితే చాలా మహత్తు కలిగివుంటుంది.

కేరళలోనే త్రిస్సూరు (త్రిచూర్) అనే పుణ్యక్షేత్రం గురవయ్యూరు సమీపంలో ఉంది. దీనినే వడకనాథక్షేత్రమని కూడా అంటారు. ఊరి మధ్య సుమారు యాభై, అరవై ఎకరాల స్థలంలో ఈ దేవాలయం వుంటుంది. ఇక్కడ వడక్కనాథన్ (పరమ శివుడు) తోపాటు శ్రీశంకరనారాయణ, పార్వతీదేవి, శ్రీసీతారాముల విగ్రహాలు కూడా ఉపదేవాలయాలలో ఉన్నాయి. ఇక్కడ వడకనాథ స్వామికి నిత్యం ఆవునేతిని పైపూతగా పూసి ఉంచుతాడు. ఎండాకాలం, వానాకాలం, శీతాకాలం వచ్చినా, ఏకాలంలో నెయ్యి కరగకుండా అలా విగ్రహానికి వుండడం విశేషం. ఒక చీమకాని, దోమకాని లోపల కనిపించదు.

కేరళరాష్ట్రంలోనే కొట్టయాం దగ్గర్లో చెంగనూరు అనే ఊరు ఉంది. చెంగనూరులో భగవతి దేవాలయం చాలా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ భగవతి అమ్మవారు, స్త్రీలు నెలసరి బహిష్టు అయినట్లు, ప్రతీనెలా, ఒక్కొక్కసారి రెండుమూడు నెలలకు బహిష్టు అయినట్లు అమ్మవారికి కట్టిన చీరలపై రక్తపు మరకలు కనిపిస్తాయి. ఆ సమయంలో ప్రతిరోజూ పూజ చేసే పూజారులు (నంబూద్రిలు) గుడిలోకి వెళ్ళకుండా, భగవతి అమ్మవారికి స్నానం చేయించడానికి , బట్టలు మార్చడానికి స్త్రీలనే గర్భగుడిలోకి పంపుతారు. అమ్మవారికి కట్టినచీరలు, (బహిష్టు మరకలు ఉన్నవాటిని) బహిరంగవేలం వేస్తూవుంటారు. కొందరు వేలరూపాయలు వెచ్చించి చీరలు కొనుక్కొని తీసుకువెళ్తారు. పెళ్ళికాని పిల్లలకు అమ్మవారి చీరను కట్టిస్తే తొందరగా వివాహం జరుగుతుందని చాలామంది నమ్ముతారు.

కేరళలోనే నీలాంబరి అనే నగరానికి నలభై కిలోమీటర్ల దూరంలో అచ్చన్ కోయిల్ అనే అయ్యప్ప దేవాలయం వుంది. అయ్యప్ప ఐదు ముఖ్యమైన పుణ్యక్షేత్రాలలో ఇది ఒకటి. ఇక్కడకు పాము కరచిన వ్యక్తికి ఎవరైనా తీసుకు వచ్చి గుడిలో గంట మ్రోగిస్తే వెంటనే పూజారి వచ్చి, దేవాలయంలో వున్న నూతి నుండి నీరు తీసుకువచ్చి, ముందు పాముబారిన పడిన వ్యక్తిచే త్రాగించి, స్వామివారికి అలంకరించిన చందనాన్ని తీసుకువచ్చి రోగినుదుటపెట్టి, పాము కరచినచోట రాయగానే ఎటువంటి విషసర్పం కాటేసినా, పాముకాటుకి గురియైన వ్యక్తిలేచి కూర్చుంటాడట.

కేరళరాష్ట్రంలోనే అదుర్ అనే ఒకఊరు ఉంది. ఆఊరిలో మహాలక్ష్మీ దేవాలయం ఒకటుంది. దీర్ఘ చర్మవ్యాధులతో బాధపడేవారు. మందులతో నయంకాని వ్యాధిగ్రస్తులు ఆ దేవాలయానికి వచ్చి, అక్కడబావిలో శుచిగా స్నానంచేసి, అమ్మవారికి పొంగల్ వండి నైవేద్యంపెట్టి, మహాలక్ష్మి అమ్మవారిని భక్తితో సందర్శి స్తారు. అమ్మవారికి అలంకరించిన విభూదినితీసి భక్తులకు పూజారిఅందజేస్తారు. చర్మ రోగంతో బాధపడే రోగులు ఆ విబూధిని వారం, పదిరోజులు ఒంటికి రాసుకుంటే ఎటువంటి మొండి చర్మరోగమైనా తగ్గి తీరుతుందిట.

కేరళలోనే ఆళపుర్ఘజిల్లాలో మారుమూల ఒక గ్రామం ఉంది. ఆ గ్రామం పేరు ముతవళీ. ఇక్కడ పురాతన సుబ్రహ్మణ్యస్వామి దేవాలయం ఒకటి ఉంది. ఈ దేవాలయం ఈ మధ్యనే వార్తల్లోకెక్కింది. కొందరు భక్తులు అక్కడికి తీసుకెళ్ళిన సెల్‌ఫోన్లు, బేటరీలతో పనిచేసే గడియారాలు, కెమేరాలు వంటివి కొన్ని మాడిపోవడంతో భక్తులు ఆశ్చర్యానికిలోనై, దీనిని వెలుగులోకి తీసుకొచ్చారు. శాస్త్రజ్ఞులు ఈ విషయాన్ని పరిశీలిస్తే ఆ ఆలయ శిఖరంపైనున్న కలశం ఇరిడియం అనే లోహంతో తయారుచేయబడిందని తెలుసుకొని ఆశ్చర్యపోయారట. ఈ లోహం బంగారు కన్నా ఖరీదైనదే కాకుండా అరుదుగా లభించే లోహం కావడం వలన కొందరి స్వార్థపరుల కన్ను ఆ ఆలయంపై పడిందని ఉవాచ.

మనరాష్ట్రంలోని తూర్పుగోదావరిజిల్లాలో ఉన్న రావులపాలెం సమీపంలో సుమారు రెండుకిలోమీటర్ల దూరంలో ర్యాలి అనే ఊరువుంది. ఆ ఊరిమధ్యలో జగన్మోహనస్వామివారి దేవాలయంవుంది. ఆ విగ్రహం అత్యంత సుందరంగా ఉండడమే కాకుండా జగన్మోహనంగా ఉంటుంది. చూడడానికి నల్లరాతి విగ్రహంగా కనిపించినా ముందుభాగం మహావిష్ణువు రూపంలో స్వామి గోచరిస్తారు. విగ్రహం వెనక వైపువెళ్ళి వెనుక భాగాన్ని పరిశీలిస్తే అందమైన పద్మినీజాతి స్త్రీరూపంలో జగన్మోహినీ అవతారం గోచరిస్తుంది. ఆ విగ్రహం వెనక వైపువెళ్ళి వెనుక భాగాన్ని పరిశీలిస్తే అందమైన పద్మినీ జాతి స్త్రీరూపంలో జగన్మోహినీ అవతారం గోచరిస్తుంది. ఆ విగ్రహం కాలిపాదాన్ని తాకితే మన చేతికి చెమ్మ (నీరు) తగులుతుంది. ఈ నీరు ఆ పాదాలలోకి ఎలా వస్తుందో అంతుపట్టని రహస్యం. ఇదొక అంతుపట్టని అద్భుతం. అదేవిధంగా చిలుకూరు బాలాజీని దర్శించుకుంటే ఇతరదేశ ప్రయాణాలు, ఉద్యోగాలు సులభతరమవుతాయని స్వామి అనుగ్రహానికి పాత్రులైన భక్తులు చెబుతున్నమాట. ఇటువంటి అద్భుత పురాతన దేవాలయాలు భారతదేశంలో చాలా ఉన్నాయి. ఇంతటి పుణ్యభూమిలో భారతీయులుగా ఈ దేశంలో పుట్టినందులకు మనం గర్వించాలి. ఇది మనకు పూర్వ జన్మలో చేసిన లభించిన అపూర్వ అవకాశం.

(కుముదం భక్తి స్పెషల్ - మార్చి 2010)

❁ ❁ ❁

స్త్రీలు - శబరిమల యాత్ర

ఆదిపరాశక్తి సృష్టికి మూలమని, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను కూడా దేవే సృష్టించిందని, వారికి తోడుగా వుండి శక్తి కలిగించి వారి విధి నిర్వహణకు సహకరించడానికి సరస్వతీదేవిని, లక్ష్మీదేవిని, పార్వతీదేవిని సృష్టించి ఇచ్చినట్లు శ్రీదేవి భాగవతం చెబుతోంది. మరొకచోట ఆదిపరాశక్తే తన శరీరంలో కుడివైపు భాగాన్ని పురుషునిగా, ఎడమవైపు భాగాన్ని స్త్రీగా సృష్టించినట్లు పేర్కొన్నారు. పురుషుడు శక్తిమంతుడుగా ఎదిగి స్త్రీలపై అధిపత్యం చేయడం మొదలు పెట్టాడు. దీనికి ముఖ్య కారణం స్త్రీ సహజంగా బలహీనురాలు కావడం, బాధ్యతలతో ఇల్లే సర్వం అయి స్త్రీమూర్తి ఇల్లాలుగానే మిగిలిపోయింది. స్త్రీ విద్య నేర్వడంతో నేడు అన్ని రంగాలలో పురోగమిస్తోంది. ఒకప్పుడు టీచరు, నర్సు, డాక్టర్లు గుమాస్తాలు వంటి ఉద్యోగాలలో రాణించిన మహిళలు నేడు ఇది అది అనకుండా అన్ని రంగాలలో చేరి తన ప్రతిభ చాటుకుంటున్నారు. విమానాలు నడుపుతున్నారు. రోదశీలో విహరిస్తున్నారు. ఎన్ని సాధించినా ఎన్ని రంగాలలో విజృంభించినా ప్రకృతి సహజమైన క్రియ పిల్లల్ని కనడం పెంచడం తప్పడంలేదు. అన్ని రంగాలలో పురోగమిస్తున్న స్త్రీలు శబరిమల యాత్రకు స్త్రీలు (పదికి పైబడ్డవారు, యాభై ఏళ్లలోపువారు) రాకూడదని నిషేధించడం తప్పని కొందరు మహిళలు ఇరవై ఏళ్లనాడే కోర్టుకెక్కారు. శబరిమల పవిత్రతను కాపాడడానికి అక్కడ నియమాలు పాటించి తీరాల్సిందేనని కోర్టువారు తీర్పు ఇచ్చారు. కుతూహలం చంపుకోలేక అడపా దడపా దొంగచాటుగా దేవస్థానంవారి కన్నుగప్పి కొందరు స్త్రీలు వయసులో వున్నవారు శబరిమల యాత్రచేసి వస్తున్నారు.

స్త్రీ జాతిపై వైరంతోను, స్త్రీలపై ద్వేషంతోను, స్త్రీలను కించపరచాలని, పురుషాధిక్యతను చాటుకోవడానికి శబరిమల యాత్రకు స్త్రీలను నిషేధించలేదు. అనేక పట్టణాలలో వున్న దేవాలయాలలో అయ్యప్పస్వామిని దర్శించడానికి స్త్రీలకు ఎటువంటి నిబంధనా లేదు. మిగతా దేవాలయాలలో దైవాన్ని దర్శించుకున్నట్లు పవిత్రంగా వెళ్లి దర్శించుకుని రావచ్చు. ఒక్క శబరిమలలో వున్న అయ్యప్పస్వామిని ఎందుకు దర్శించకూడదంటే దానికి తగిన కారణాలను సద్గురువులు తెలియచేసారు. నేనూ 1981 సం.నుంచి శబరిమల యాత్రచేసి వస్తున్నాను. అనుభవంతో చెప్పిన మహాత్ముల మాటలు విశ్వసించడం మన హిందూ సంప్రదాయం. మన దేవాలయాల పవిత్రత కాపాడడం ప్రతీ భారతీయుడి ధర్మం.

శబరిమల యాత్రకు ఏయాత్రకులేని నియమావళిని, పవిత్రమైన దీక్షను మనపూర్వీకులు ఏర్పాటుచేశారు. మండల కాలం అంటే నలభై ఒక్కరోజులు తక్కువ కాకుండా దీక్షా నియమాలను పాటిస్తూ కఠినంగా దీక్షసాగించి ఇరుముడి కట్టుకుని నెత్తిపై పెట్టుకుని శబరిమల యాత్రకు వచ్చినవారికే శబరిమల సన్నిధానంలోవున్న పదునెనిమిదిమెట్లు ఎక్కి స్వామివారిని దర్శించుకోడానికి అర్హత వుందని మిగతావారికి అర్హత లేదని దేవస్థానం అధికారులు చెబుతున్నారు.

స్త్రీలకు సహజంగా నెలవారీ వచ్చే బహిస్టువలన నలభై ఒక్క రోజుల దీక్షకు అంతరాయం కలుగుతుంది. నలభై రోజులు దీక్ష చేయలేరు. శబరిమల యాత్రలో అడవులలో కొండలలో నడచి వెళ్లాలి. కనుక ఎక్కువ అలసటవలన నెలవారీ వచ్చే బహిష్టు ముందుగా రావడానికి అవకాశం వుంది. యాత్రలో స్త్రీలకు సరియైన సదుపాయం లేదు. తర్వాత అయ్యప్ప దీక్షా నియమావళిలో ముఖ్యమైనది కఠిన బ్రహ్మచర్యం. దీనిని సాధించడం, అమలుచేయడం ప్రస్తుత సమాజంలో చాలా కష్టం. బ్రహ్మచర్యాన్ని పాటించడానికే స్త్రీలకు దూరంగా వుండి వారు కనిపిస్తే వారిని అమ్మవారి ప్రతిరూపంగానే భావిస్తూ స్వామి శరణం అనిచెప్పి పవిత్రంగా వుండడానికి ప్రయత్నిస్తారు. స్త్రీల దృష్టి వారిపై పడకుండా వుండడానికే నలుపు దుస్తులు ధరించి, గెడ్డాన్ని జుత్తును పెంచుకుని విబూది, చందనం, కుంకుమ బొట్టులతో విరాగిగా, కనిపిస్తాడు. అన్ని వ్యసనాలను వదులుకుని స్వామి దీక్ష పవిత్రంగా చేస్తూ నిగ్రహాన్ని పాటిస్తాడు.

ఒకవేళ వయసులో వున్న స్త్రీలు శబరిమలయాత్రకు వస్తే బ్రహ్మచర్యంతో దీక్షలో వున్నవారి కన్నుచెదిరి, మానసిక ప్రశాంతతను కోల్పోయి అత్యాచారాలు జరుగుతాయనడంలో ఆశ్చర్యంలేదు. శబరిమల పవిత్రతే కాకుండా నలభైరోజులు ఏకాగ్రతతో చేసిన దీక్ష, పూజలు వ్యర్థమవుతాయి. సహజంగా పెరిగిన గడ్డాలు, జుత్తు వలన పురుషునిలో మార్పు గోచరిస్తుంది. స్త్రీలలో ఎలాంటి మార్పు గోచరమవదు. సహజ సౌందర్యాన్ని దాచుకోలేరు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం తలకి స్నానం చేయడం స్త్రీలకు ఇబ్బంది కలిగిస్తుంది. భార్యాభర్త ఇద్దరూ దీక్షలో వుంటే సంసార నౌక సరిగా సాగదు. ఇరుముడితో స్త్రీలు ఎక్కువదూరం నవడవడం కష్టమనే భావనకూడా వుండేది.

ఇప్పటివరకూ ఎంతో పవిత్రంగా దీక్షతో శబరిమల యాత్రను నిర్ధేశించారు. అక్కడా రంగురంగుల బట్టలతో,పువ్వుల చీరలతో స్త్రీలు శబరిమల యాత్రకివస్తే, మిగతా దేవాలయాలకు, శబరిమలకు తేడా కానరాదు. నలభైరోజులు పవిత్రమైన దీక్షతో స్వామి వారినేనిత్యం తలపోస్తూ స్వామి ఏకాగ్రత చెదరకుండా వుండాలంటే శబరిమల యాత్రకు స్త్రీలను నిషేధించడం సబబే అనిపిస్తుంది. భారతీయ సాంప్రదాయంలో చేసే పూజలు వ్రతాలు ఇంటియజమానిగా పురుషుడు చేసినా సహకుటుంబానాం ధర్మపత్నీ సమేతస్య అని చేయడం పద్ధతిగా వస్తోంది. అందువల్ల వయసులో స్త్రీలు సహకరించి శబరిమల యాత్రకు దూరంగా వుండడమే మంచిది. శబరిమల పవిత్రతకు కాపాడడం ఉత్తమం.

(ఆంధ్రభూమి దినపత్రిక - మంచిమాట - 13-8-2006)

❀ ❀ ❀

సంతాన ప్రాప్తిరస్తు

ఒక పురుషుడు ఒక స్త్రీ భార్యాభర్తలుగా కలిసి జీవించడానికి, సత్సంతానము పొందడానికి, కులగోత్రాలతో ఇంటి పేరునిలుపడానికి, మన హైంద వివాహ వ్యవస్థ ఏర్పడింది. భార్యాభర్తలు అనురాగంతో అనుకూల దాంపత్యం చేస్తే,సంతానం కలగడం ప్రకృతి సహజం. కానీ, కొందరు దంపతులకు పెళ్ళయిన చాలాకాలం వరకు సంతానము కలుగక పోవడంతో, దిగులు, వైరాగ్యం ఏర్పడుతుంటాయి. సంతానం లేకపోతే జీవితమే వ్యర్ధమనిపిస్తుంది. పురుషుని కన్నా, స్త్రీ హృదయం మాతృత్వం కోసం ఎక్కువ పరితపిస్తుంది. సంతానం కోసం పూజలు, వ్రతాలు, నోములు చేసి మొక్కుకొంటారు. భార్యాభర్తలిరువురు తీర్థయాత్రలుచేసి, పిల్లలకోసం తపిస్తారు. కొందరు వైద్యుల చుట్టూ తిరుగుతుంటారు. ఏ పుట్టలో ఏ పాముందోనని ఎవరు ఏది చెప్పినా అది చేస్తుంటారు. పూర్వకాలంలో కూడా కొందరు మహర్షులు. మహా రాజులు సంతానం లేకపోతే, యజ్ఞాలు, యాగాలు చేయడమేకాకుండా, తపస్సు గావించి, సంతానాన్ని పొందినట్లు, మనపురాణాలలో ఎన్నో కథలున్నాయి. దశరథమహారాజు వంటివారు పుత్రకామేష్టియాగంచేసి, నారాయణ అంశతో రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులనే నలుగురు కుమారులను పొందినట్లు రామాయణం వలన తెలుస్తోంది. మహర్షి, అత్రి అనసూయల తపఃఫలితంగా, వారికి త్రిమూర్తుల అంశతో శ్రీదత్తాత్రేయుడు అవతరించాడు. మృకండు ముని తపః ఫలముగా మార్కండేయుడు జన్మించాడు. ఇలా ఎందరో మహాత్ములు భగవంతుని అనుగ్రహంతో సంతానాన్ని పొందారు.

నేడు వైద్యవిజ్ఞానం పెరగడంతో సంతాన సాఫల్య కేంద్రాలని ప్రతీ నగరంలో వెలుస్తున్నాయి. స్త్రీ పురుషులిరువురిలో, ఎవరిలోపమున్నా సంతానం కలుగదు. పూర్వపు రోజులలో సంతానం కలగకపోతే స్త్రీలలోనే లోపముందనుకొని, పురుషుడు మరొక స్త్రీని వివాహమాడేవాడు. అలా ద్వితీయ వివాహము, తృతీయ వివాహము చేసుకొన్నవారు కూడా చాలమంది ఉండేవారు. పురుషులలో లోపం లేకుంటే వారికి సంతానము కలిగేది. ఒకవేళ పురుషునిలోనే లోపం ఉంటే, ఎంతమంది స్త్రీలను వివాహమాడినా సంతానం కలిగేదికాదు. ఇప్పుడు భార్యభర్త లిరువురినీ వైద్యులు పరీక్షించి, ఎవరిలోపం ఉందోకనుక్కొని, వారికి మందులద్వారా లేక శస్త్రచికిత్స ద్వారా, సంతానాన్ని కలుగజేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కొక్కసారి ఇద్దరిలో లోపం లేకపోయినా సంతాన కలగడం లేదు.

అటువంటి దంపతులు నిరాశ చెందకుడా ప్రసిద్ధ ఆయుర్వేద వైద్యుల సలహాతో మూలికలతో చేసినకొన్ని రకాల మందులతో, వారికి సంతానము కలిగే అవకాశం ఉంది. ఆయుర్వేదంలో మంచి మందులున్నాయి. కొన్ని ఇంగ్లీషు మందులకన్నా ధర కూడా తక్కువగానే ఉంటాయి. అనుభవమున్న వైద్యుని సంప్రదించాలి. దేనికైనా నమ్మకం ముఖ్యం. భార్యాభర్తలిరువురూ ఆనందంగా ఏ ఇతర చింతలు, ఆందోళనలు

లేకుండా కాపుం చేయాలి. ఇది చాలాముఖ్యం. కేవలం మందుల పైనే ఆధారపడ కుండా పిల్లలులేని స్త్రీలు దైవాన్ని కూడా నమ్ముకుంటే మంచిది. మన పెద్దలు అను భవంతో కొన్ని చిట్కాలు, సూచనలు ఇచ్చారు. వాటిని పాటిస్తే సత్ఫలితాలనుఇస్తాయి.

భారతీయులకు చెట్లను, పుట్టలను పూజించే ఆచారం పూర్వము నుండి ఉంది. ముఖ్యంగా తులసి, రావి, మర్రి, ఉసిరి, మేడి, వేప, మామిడి, అశ్వత్థ వృక్షాలను ఎంతో పవిత్రంగా భావిస్తారు. రావి, వేపచెట్లనుంచి వీచే గాలికి గొడ్రాళ్లను సహితం సంతానవంతులను చేసే శక్తి వుందని పెద్దలు చెప్తారు. అటువంటి రావిచెట్టు చుట్టూ ప్రతీ ఆదివారం 108 ప్రదక్షిణలు చేస్తే మంచిదని చెప్తారు. రావి, వేప కలసి ఉంటే ఉత్తమ ఫలితాలులభిస్తాయి. అందుకే పురాతన దేవాలయా లలో రావి, వేప చెట్లు తప్పక ఉంటాయి. అలాగే శ్రీ వల్లీ సుబ్రహ్మణ్యస్వామి వారిని పూజించి, నాగదోషాలు ఉంటే పోగొట్టుకోవచ్చు. నలభై ఒక్కరోజులు సుబ్రహ్మణ్య స్వామి వారిని ఆరాధించి, ఉంగరం సైజులో వెండితో చేసిన నాగ సర్పప్రతిమను ఒక బ్రాహ్మణునికి దానం చేయడం వల్ల మంచి జరుగుతుంది. సంతాన ప్రాప్తికి భగవద్గీతలోను, విష్ణు సహస్రనామ పారాయణ గ్రంథాలలోను ప్రత్యేకంగా కొన్ని శ్లోకాలు ఉన్నాయి. భక్తితో, నమ్మకంతో ప్రతి దినం పఠిస్తే సత్సంతానము కలగడానికి అవకాశాలున్నాయి.

భగవద్గీత 9వ అధ్యాయంలో, 9వ శ్లోకాన్ని ప్రదిదినం 108 పర్యాయములు భక్తితో పఠించడం వలన, శ్రీ కృష్ణ పరమాత్మ అనుగ్రహం వల్ల సంతానం కలుగు తుంది.

విశాఖజిల్లాలో ఉన్న సింహాచల క్షేత్రం పురాతనమైనది. శ్రీ వరాహనరసింహ స్వామి దేవాయంలో కప్పస్తంభం అనే పేరుతో ఒక స్తంభం ఉంది. భార్యాభర్తలు స్వామివారిని దర్శించుకొని, పూజాకార్యక్రమములనంతరము భార్యాభర్తలిరువురూ, ఈ కప్పస్తంభాన్ని కౌగిలించుకొంటే కోరిక ఫలించి సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం.

తరువాత కేరళలో ఉన్న శబరిమల అయ్యప్పస్వామి దర్శనభాగ్యంచేత, ఆయన కృపాకటాక్షాలతో సంతానం పొందినవారు చాలా మంది ఉన్నారు. పందళరాజుకు అడవిలో మణికంఠుడు (అయ్యప్ప)దొరికిన తరువాతనే రాణి గర్భందాల్చి పందళ రాజుకు కుమారుడు జన్మించాడు.

విజయనగరంజిల్లాలో శృంగవరపుకోట సమీపంలో ఉన్న ధర్మవరం అనేచోట సన్యాసయ్యపాలెంలో పురాతన పుణ్యక్షేత్రం ఉంది. ఈ దేవాలయం 15 వ శతాబ్దాం నాటిదని పెద్దలు చెబుతారు. ఈ దేవాలయంలో సంతానగోపాలయంత్రం, భైరవ యంత్రములనే రెండు యంత్రములను మంత్రపూర్వకంగా ప్రతిష్ఠించినట్లు చెబుతారు. స్వామిని ధర్మవరం సన్యాసయ్యగా భక్తులు పిలుస్తారు. ఇక్కడ దేవుడు ఈశ్వరుడే అయినా, విగ్రహరూపంలో ఉన్న సన్యాసేశ్వర స్వామికి పూజలు జరుపుతారు.

దేవస్థానంలో రుసుము చెల్లించి, సంతానం కోరే వారు పూజలు నిర్వహిస్తూ వుంటారు. సోమవారం దేవునికి ప్రీతిదాయకమని సంతానం కొరకు సోమవారము నాడే పూజలు నిర్వహిస్తుంటారు.

పూజకు ముందు దేవాలయ అర్చకుడు, గుప్పెడు మారేడు దళాలను తీసుకొని స్వామివారి విగ్రహంపై ఉన్న కిరీటంపై అలంకరించి పూజ ప్రారంభిస్తారు. సంతానం కోసం పూజలు చేసే స్త్రీలు, పళ్ళెంలో కర్పూరం వెలిగించి, ఆరకుండా కర్పూరము వేస్తూనే, శివయ్యను తలచుకొంటూ భక్తితో స్వామిని సేవిస్తారు. సంతానప్రాప్తి ఉన్నవారికి వెనువెంటనే స్వామి వారి కిరీటంలో ఉంచిన మారేడు దళాలు, హారతి ఇస్తున్న మహిళ పళ్ళెంలో పడతాయి. ఆలస్యంగా సంతానం కలిగేవారికి, స్వామి వారికి అలంకరించిన మారేడు దళాలు ఆలస్యంగా హారతి పళ్ళెంలో పడతాయి. సంతాన ప్రాప్తిలేని వారికి ఎన్నిగంటలు పూజచేసి, హారతి ఇచ్చినా, మారేడు దళ ములు క్రిందపడవు.

దేవాలయ పూజారులు పూజాకర్యాక్రమం ముగిసిన తరువాత, భార్యాభర్తలిరు వురినీ ఆశీర్వదించి వారికి ఎన్నాళ్ళలో సంతానం కలుగవచ్చునన్న విషయాన్ని, వారి కున్న అనుభవంతో చెబుతున్నారు. ఇంట్లో ప్రతిరోజు పూజ చేయడానికి, గుడిలో పూజలో పెట్టిన చిన్నత్రిశూలం, స్వామివారి పటం, ప్రసాదంగా విబూది ఇస్తారు. అలా భక్తిశ్రద్ధలతో పూజలుచేస్తూ భార్యాభర్తలు అన్యోన్యంగా కలసి కాపురం చేస్తే, అనతికాలంలో వారు సంతానవంతులవుతారు. ఇందుకు ఎన్నో నిదర్శనాలు న్నాయి.

పురాణకాలంలో వివిధ రకాలుగా సంతానాన్ని పొందడం విడ్డూరంగా కనిపిం చినా, నేడు వైద్యశాస్త్రరీత్యా నమ్మవలసి వస్తోంది. వీర్యాన్ని సేకరించి కుండలలో భద్రపరచగా, అగస్త్యుడు, ద్రోణుడు, శుక్రుడు, ఒక జన్మలో వశిష్ఠుడు వంటి మహ ర్షులు అంతా జన్మించినట్లు పురాణ కథలున్నాయి. గాంధారి గర్భాన్ని విచ్ఛిన్నం చేసుకొని విలపిస్తుంటే, వ్యాసుల వారి ఆదేశముతో ఆగర్భస్త పిండాన్ని నూరు భాగాలు చేసి నూరు కుండలలోఉంచగా, కౌరవులు జన్మించినట్లు మహా భారతం ద్వారా అవగతమవుతోంది. నేటి టెస్టుట్యూబు బేబీ ప్రక్రియకు మన పూర్వీకులు అనుసరించిన విధానానికి చాలా సారూప్యం ఉందని తెలుస్తోంది.

ఈ రోజులలో కొందరు సంతానాన్ని పొందలేకపోవడానికి కారణాలను పరిశీలిస్తే, ముఖ్యంగా ఐదు కారణాలు కనిపిస్తున్నాయి.

1. ఆలస్యంగా ముప్పయి ఏళ్ళకు వివాహం చేసుకోవడం

2. భార్య ఒకచోట, భర్త ఒకచోట ఉద్యోగరీత్యా ఉండడం.

3. భార్యాభర్తలిరువురూ ఉద్యోగస్తులైతే, పని భారంతో చికాకుగా వుండి దాంపత్య సుఖాన్ని సరిగా పొందకపోవడం.

4. కుటుంబ నియంత్రణపేర నేడు వస్తున్న రకరకాల మందులు, మాత్రలు వినియోగించడం

5. భార్యాభర్తలిరువురూ ఆందోళన, భయంతో, ఇతర ఆలోచనలలో ఉంటూ సంసారం చేయడం.

6. సహజ ప్రక్రియలుండగా లైంగిక ఆనందాన్ని జుర్రుకోవాలన్న వెర్రి తలపులో అవసరంలేని వయాగ్రా వంటి మందులు వాడటం.

7. అతిగా పొగత్రాగడం, మద్యం సేవించడం.

(కుముదం భక్తిస్పెషల్ - అక్టోబరు 2004)

❀ ❀ ❀

పడవెక్కి భద్రాద్రి పోదామా !

పడవెక్కి భద్రాద్రి పోదామా! భద్రాద్రి రాముణ్ణి చూద్దామా! అనే పాట విన్నప్పుడల్లా జీవితంలో ఒక్కసారైనా పడవ మీద గోదావరినదిపై ప్రయాణించి వెళ్లాలనే కోరిక కలిగేది. భద్రాద్రిరాముడి అనుగ్రహం కోసం వేచి చూడసాగాను. దానికి తోడు మా బాల్యంలో మా అమ్మమ్మ. మేనత్తలు అంతా పడవపై భద్రాద్రి వెళ్ళిన అనుభవాలు విన్నాక, టివిలో మనపురాణ సినిమాలు ప్రత్యేకించి రామాయణానికి సంబంధించినవి చూసాక మరింత ఉత్సాహం పెరిగింది. భద్రాద్రి రాముడు కరుణ 14-11-2008 నాడు కలగడంతో 13 తే. మధ్యాహ్నం బస్సులో రాజమండ్రి చేరాము. మా బంధువులంతా కలసి మొత్తం 60 మందిమి లాంచిలో రాజమండ్రి నుండి పట్టిసీమ, పాపికొండలు చూసుకొని భద్రాద్రి వెళ్ళడానికి ప్రోగ్రామ్ నిర్ణయించారు. జై శ్రీరామ్.

నవంబరు 13 తేదీ రాత్రి రాజమండ్రికి వచ్చిన వారంతా వుండడానికి లాంచీ రేవు దగ్గర్లో మార్కేండేయుని దేవాలయం పక్కనే ఒక పంక్షన్‌హాలుని రిజర్వు చేయడం వలన, వచ్చిన వారంతా రాత్రి అక్కడ నిద్రించి 14వ తేదీ తెల్లవారు జామున అంతా నాలుగు గంటకు నిద్రలేచి గోదావరిలో స్నానాలుచేసి తయారయ్యాము. 5.30 గంటలకు బోటు (లాంచీ) బయలుదేరుతుందని చెప్పడంతో శివాలయంలో గౌరీశంకరుల్ని దర్శించి లగేజీతో అంతా లాంచీ ఎక్కాము. గోదావరిపై భద్రాద్రి యాత్ర చేయాలని హైద్రాబాదు నుండి 25 మంది వచ్చేరు. మేము 35 మందిమి కలసి మొత్తం 60 మంది సర్దుకు కూర్చున్నాము. రామనామస్మరణతో ముద్దుకృష్ణ పేరుగల మా లాంచీ నెమ్మదిగా కదిలింది.

ఉషఃకాలంలో గోదావరిపైనుండి వీచే చల్లటిగాలులు అందర్నీ ఉక్కిరి బిక్కిరి చేస్తూవుంటే ఉత్సాహంతో పిల్లలు, నడివయస్సువారు లాంచీపైకి ఎక్కి ఆనందంతో ఉరకలువేస్తూ పరవశంతో మునిగి తేలసాగేరు. సూర్యోదయ అందాలను తిలకిస్తూ లోపల కూర్చున్న పెద్దవారూ ఒకరు తరువాత ఒకరు మూడువంతుల మంది

లాంచీ పైభాగానికి చేరారు. ఉదయం 8 గంటలనగానే వేడివేడి ఇడ్లీ, వడ, ఉప్మా, కాఫీతో కమ్మని ఫలహారాన్ని లాంచీవాళ్ళు అందజేసారు. ఉత్సాహంగా టిఫిన్ ఆరగించి, గోదావరి చుట్టూవున్న ప్రకృతి దృశ్యాలు చూసి పరవశం పొందసాగేము. కెమెరాలు, వీడియో కెమెరాలు తెచ్చుకున్నవారు ప్రకృతి అందాలను కెమెరాలలో బంధించసాగేరు. లాంచీలో లౌడు స్పీకర్లు ఉండడంతో భక్తిపాటలతో ప్రారంభించి, రక్తి పాటలు వేయడంతో పిల్లలు ఊగిపోతూ డాన్సులు ప్రారంభించారు.

మా బృందంలో ఎక్కువమంది సీనియర్ సిటిజన్సే. హైస్కూల్లో, కాలేజీలో చదువుకునే అమ్మాయిలు మాత్రం ఆరుగురు వుండడంతో ఆటపాటలతో అందరికీ హుషారు కలిగించారు. సుమారు 9.30 గంటలకు పట్టిసీమలో లాంచీఆపి, పట్టిసం వీరభద్రస్వామిని దర్శించి రమ్మన్నారు. ఇసుకమేట వేయడం వలన ఇసుకలో సుమారు నాలుగు ఫర్లాంగులు నడిచి వెళ్ళవలసి వచ్చింది. పురాతన దేవాలయం అవడం వలన, కార్తీకమాసం అవడం వలన, మేము అక్కడికి వెళ్ళిన టైముకు మరో మూడు లాంచీలపై వచ్చిన భక్తులు కనిపించారు.

పట్టిసం సన్నిధికి స్థలపురాణం వుంది. ఇక్కడ శ్రీ వీరభద్రస్వామి (పరమ శివుడు) కొలువైయున్నాడు. "శ్రీశైలం కాశికేదారం, కాళహస్తించ పట్టిసం। పంచక్షేత్ర పఠేన్నిత్యం మహాపాతకనాశనం ॥ పట్టిసాద్రి సమం క్షేత్రం నాస్తి బ్రహ్మాండ గోళకే। శ్రీ వీరభద్ర సమోదేవో నభూతో నభవిష్యతి॥" శివాంశ సంభూతుడు శ్రీ వీరభద్రేశ్వరుడు పట్టసాయుధనామముతోగల కత్తి అనే ఆయుధంతో దక్షప్రజాపతి శిరస్సును ఖండించి దేవకూట పర్వతముపై ప్రళయతాండవం చేయుచుండగా స్వామివారి చేతిలో వున్న పట్టిసాయుధము దేవకూట పర్వతంపై జారిపడింది.

అందువలన దేవకూటపర్వతము పట్టిసాచలముగా ప్రసిద్ధ చెందింది. ప్రళయ తాండవయు చేయుచున్న శ్రీవీరభద్రేశ్వరుని శాంతింపచేయమని దేవతలు, అగస్త్య మహర్షిని కోరగా, అంతట అగస్త్య మహర్షి శ్రీ వీరభద్రేశ్వరస్వామి చెంతకేగి, శాంతింపమని ప్రార్థించి స్వామివారిని ఆలింగనము చేసుకొని వీరభద్రుని అతని సందిట బంధించాడు. వీరభద్రుడు శాంతించి, పట్టసాద్రిపై లింగరూపమున స్వయంభువువై భద్రకాళీసమేతుడై వెలసినారు. స్వామివారి లింగాకారమున అగస్త్యభగవానుడు ఆలింగనము చేసుకున్న హస్తచిహ్నాలు నేటికీ గోచరించడం ఇక్కడివిశేషం.

పట్టిసం సన్నిధిలో క్షేత్రపాలకుడైన శ్రీభావన్నారాయణ స్వామివారి ఆలయం కూడా పక్కనే దగ్గర్లో వుంది. ఇక్కడ వున్న శ్రీ మహావిష్ణువు కుడిచేతిలో శంఖం, ఎడమ చేతిలో చక్రం తారుమారుగా వుండడం విశేషం. సాధారణంగా విష్ణుమూర్తి కుడిచేతిలో చక్రం, ఎడమచేతిలో శంకం వుంటాయి. గజేంద్రుని రక్షించడానికి (గజేంద్రమోక్షం) వైకుంఠం నుండి శ్రీ మహావిష్ణువు ఆయుధాలు ఏమీ లేకుండా వచ్చాడని వెనుక శ్రీచక్రాన్ని, శంఖాన్ని గరుత్మంతుడు తరువాత తెచ్చి అందించాడని, వాటిని అందుకోవడంతో తారుమారైనట్లు స్థలపురాణం చెబుతోంది.

పట్టిసంలో స్వామిని దర్శించుకొని అంతా లాంచీ ఎక్కేము. తరువాత లాంచీ ఎక్కి చుట్టూవున్న కొండలు, గుట్టలు చూస్తూ ప్రయాణం సాగించాక, సుమారు 12 గంటల ప్రాంతంలో గొందూరు అనే ఊరి ముందు లాంచీ ఆగడంతో, అక్కడ లాంచీ దిగాము. అక్కడ గ్రామదేవత గండిపోశమ్మ అమ్మవారు కొలువై వున్నారు. అక్కడ అమ్మవారిని దర్శించి, జామకాయలు కొనుక్కొని కొందరు వస్తే కొబ్బరి బొండాల నీరు త్రాగి కొందరు వచ్చారు. ఆ ఊరిలోనే (గొందూరు) లో గోదావరి ఒడ్డున ఆటకు వెళ్ళిన అమ్మాయిలలో ఒక అమ్మాయి బంగారు బొమ్మగా మారి, ఆ ప్రాంతాన్ని కాపాడడానికి అమ్మవారుగా వెలిసారని కథ చెబుతారు.

గొందూరు నుండి దేవీపట్నం మీదుగా (అల్లూరు సీతారామరాజుగారు ముట్టడించిన పోలీసుస్టేషన్) లాంచీ కదిలింది. అక్కడ చెక్‌పోస్టు వుండడం వలన కొంతసేపు ఆపి మరల లాంచీ కదిలింది. అక్కడ బొప్పాసుపళ్ళు ముక్కలుకోసి అమ్మడంతో కొనుక్కొని తిన్నాము.

పాపికొండల అందాలు, మలుపులు తిరిగేగోదావరి సొగసులు చూసి తీరవల సిందే. ప్రకృతి అందాలన్నీ అక్కడే మూసపోసినట్లు కనిపించాయి. సృష్టిలోని అందా లన్నీ అక్కడే వున్నట్లు గోచరించడంతో అంతా పులకించిన హృదయాలతో తన్మయు లయ్యాం. లాంచీని పేరంటాల పల్లిరేవులో ఆపడంతో అక్కడదిగి, శ్రీరామకృష్ణా శ్రమంలో వున్న పరమశివుని దర్శించి వచ్చాము. పచ్చి వెదురుతో అందంగా చేసిన బొమ్మ ఇళ్ళు, పూలగుత్తులు తయారుచేసి అమ్మడంతో కొందరు వాటిని కొన్నారు. వారి పనితనాన్ని చూసి అంతా మురిసిపోయాము.

మధ్యాహ్న భోజనం, సాయంత్రం టీ, టిఫిన్ లాంచీలోనే అందించడంతో ఆరగించి, కొందరు కునుకులు తీస్తూంటే ప్రకృతి అందాలను చూసి కొందరు పరవ శించ సాగారు. అలా అలా గోదావరిపై ప్రయాణం సాగి రాత్రి 7 గంటలకు రామగిరి చేరింది. లాంచీలు భద్రాచలం వరకు వెళ్ళవని అప్పుడే తెలిసింది. రామగిరిలో మా బృందం ఆర్గనైజరు ముందుగా బస్సు వ్యేను ఏర్పాటుచేయడం వలన అంతా లాంచీ దిగి బస్సులో కొందరు వ్యేనులో కొందరు ఎక్కి భద్రాచలం బయలుదేరాము. భద్రాచలంలో కూడా తెలిసినవారి ద్వారా అక్కడ వుండడానికి వసతి ఏర్పాటుచేయడం వలన ఆ రాత్రి అక్కడ బసచేసాము. భోజనానికి అక్కడ ఉన్న కరివేనవారి సత్రంలో ఏర్పాటు చేయడం వలన రాత్రి అప్పటికే 9 గంటలవడం వలన భద్రాద్రి రాముని ఆ రాత్రి చూడడానికి అవకాశం లేనందున ఉదయం దర్శనం చేసుకోవచ్చుని, ఆ రాత్రికి భోజనం చేసి విశ్రమించాము.

నవంబరు 15 తేదీ తెల్లవారుజామున మా బృందంలో కొందరు సుప్రభాత దర్శనానికి వెళ్లేరు. మాలో కొందరు గోదావరిలో స్నానంచేసి, దేవాలయానికి వెల్దామని చెప్పడంతో మేము గోదావరికి వెళ్ళి స్నానాలు చేసి, గోదావరి ఒడ్డునే దీపాలు వెలిగించుకొని మరల రూమ్‌కి వచ్చి బట్టలను మార్చుకొని, అంతా కలిసి శ్రీరామ

భద్రుని సందర్శించడానికి వెళ్ళేము. నవంబరు నెలా కార్తీకమాసమైనా భద్రాచలంలో గోదావరిలో నీరు తక్కువగా వుండడం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఉరుకులు పరుగులు తీస్తూ క్యూలో నిలబడి ముందు ధర్మదర్శనం చేసుకొన్నాము.

తరువాత శ్రీ భద్రాద్రిరామునికి అష్టోత్తర శతనామపూజ చేయించడానికి జంటకు నూరు రూపాయలు టిక్కెట్లు అవడంతో మా బృందంలో ఇంచుమించు అంతా అష్టోత్తర టిక్కెట్లు కొనుక్కొని గుడి చుట్టూ ప్రదక్షిణలుచేసి, భద్రుని ఆలయం, మహాలక్ష్మి ఆలయం, గోదాదేవి ఆలయం, సీతారాముల ఆభరణాలను సందర్శించి, అష్టోత్తర పూజకోసం కూర్చున్నాము. 20 మంది చొప్పున లోనికి పంపడంతో గర్భ గుడిలో శ్రీరాముని సన్నిధిలో దగ్గరగా కూర్చొని గోత్రనామాలతో అష్టోత్తర శతనామ పూజ చేయించుకోవడం చాలా ఆనందాన్ని కలిగిచింది. పూర్వజన్మ సుకృతం వలన గర్భగుడిలో సుమారు అరగంట వుండి అన్నీ ప్రత్యక్షంగా చూడడం జరిగింది.

శ్రీరామచంద్రుడు సీతమ్మవారిని వామాంకంపై కూర్చోపెట్టుకొని శంఖు, చక్రాలతో, చేతిలో బాణంతో దర్శనమిస్తాడు. పక్కన లక్ష్మణస్వామి ధనుర్బాణాలతో అన్నగారి పక్కన నిలబడి వుంటాడు. భద్రమహర్షి కోరికమేర శ్రీరామచంద్రుడు ఆ రూపంలో దర్శనమివ్వడం వలన, అక్కడ శ్రీరామచంద్రుని రూపము విచిత్రంగా గోచరిస్తుంది. శ్రీరాముడనగానే కోదండరాముడే గుర్తుకువస్తాడు. కానీ, భద్రాద్రిలో కన్పించేది చిత్రమైనరూపం. దేవాలయం బయట శ్రీ ఆంజనేయస్వామి కొలువై వున్నారు. భద్రాద్రి రాముణ్ణి తనివితీరా చూసాక భోజనాలుచేసి, పర్ణశాలకు బస్సుపై వెళ్ళేం. పర్ణశాలలో సీతారాముల్ని, చుట్టుపక్కల ప్రదేశాల్నిచూసి, సీతమ్మవారు కోక ఆరవేసిన ప్రదేశం, స్నానం చేసిన ప్రదేశం, పసుపురాయి, కుంకుమరాయి, శూర్పణఖ రాళ్ళగుట్ట అన్నీ చూసి రాత్రికి లాడ్జికి తిరిగివచ్చాము. రామదాసుమందిరం, క్షేత్ర పాలకుడైన లక్ష్మీనరసింహస్వామి ఆలయం, శివాలయం కూడా భద్రాచలంలో చూడవలసిన ప్రదేశాలు.

నవంబరు 16వతేదీ తెల్లవారుజామున లేచి మరొక సారి భద్రాద్రి రాముణ్ణి సందర్శించి బస్సులో 7 గంటలకు రామగిరి బయలుదేరాము. రామగిరిలో సీతారామ లక్ష్మణులను, మతంగమహర్షిని కొండపై దర్శించాము. ఇక్కడ రాముణ్ణి యోగరాము డని, శ్రీసుందర సీతారామస్వామి అని పిలుస్తారు. జటాయువుకి మోక్షాన్నిచ్చిన స్థలముగా కూడా దీనిని చెబుతారు. శ్రీరామచంద్రుడు రామగిరి నుండే భద్రమహర్షి కోరికపై భద్రాద్రిపై వెలిసారని పురాణ కథనం. రామగిరి సీతారాముల్ని దర్శించి తిరిగి లాంచీ ఎక్కి రాజమండ్రి బయలుదేరాము. గోదావరి సొగసులు చూస్తూ సాయంత్రం 6 గంటలకు తిరిగి రాజమండ్రి చేరాము. ఆ విధంగా గోదావరిపై మా భద్రాద్రి యాత్ర ముగిసింది. లోకంలో ఎట్టి రాత శ్రీరామ అని చుట్టబడక రాయబడదు. నూతన దంపతులకు శ్రీసీతారాముల కల్యాణ అక్షతలే శుభాశీస్సులు. ఆ దంపతుల ఆదర్శదాంపత్యం నేటి సతీపతులకు ఆదర్శం. పసిపిల్లలకు, భయార్తు

లకు, రోగార్తులకు, భవపీడితులకు శ్రీరామరక్ష అనే పెద్దల పదప్రయోగం అనాదిగా వస్తోంది. అందువల్లనే కాబోలు పరమ శివునికి కూడా శ్రీరామ నామము తారక మంత్రమయినది. అట్టి పరమపురుషుడైన శ్రీరాముని యొక్క ఇరువది ఐదు పుణ్యక్షేత్రాలలో భద్రాచలం అత్యంత మహిమాన్వితమయిన క్షేత్రం. దండ కారణ్యంలో గోదావరి నదీతీరంలోనున్న ఈ పుణ్య క్షేత్రాన్ని పడవలో చేరుకని దర్శించుకోవడం మాకు ఎంతో సంతోషాన్ని కలిగించింది. ఆ ఆదర్శ దంపతులను ప్రార్థించుకుంటూ ఇళ్ళకు చేరుకున్నాం. జై శ్రీరామ్!

(కుముదం భక్తిస్పెషల్ – ఏప్రిల్ 2009)

❁ ❁ ❁

స్వామియే శరణం అయ్యప్ప

మహిష సంహారంకోసం హరిహరసుతుడు మణికంఠునిగా ఈ భూలోకంలో అవతరించి, పంబాతీరంలో పసిబాలునిగా అడవిలో వేటకి వచ్చిన పందళరాజు కంటపడి, పిల్లలులేనిరాజు అగస్త్య మహర్షి ఆదేశంపై ఆ బాలుని పందళం తీసుకొని వెళ్ళి పెంచినట్లు ఒకకథ ఉంది. పిల్లలులేని రాజుకి మణికంఠుడు పందలం చేరాక సంతానము కలగడం, దేశం సస్యశ్యామలంగామారడం పంటలు పండటం, మణి కంఠునిరాజు, రాణి, ప్రజలంతా అయ్యప్పా అంటూ పిలిచి, చివరకు అయ్యప్పగా పేరు స్థిపడినట్లు మనకి తెలుస్తోంది. అయ్యప్ప అవతారంలోనే రాణికి వచ్చిన మాయదారి వ్యాధిని నయం చేయడానికి వైద్యుల సలహామేరకు పులిపాలకోసం ఒంటరిగా అడవులకివెళ్ళి, మహిషసంహారం చేసాడని, మహిష సంహారంతో దేవతలు దిగి వచ్చి, పొన్నంబలమేడువద్ద స్వర్ణాలయం నిర్మించి అయ్యప్పని పూజించారని కూడా చెబుతారు. తరువాత అయ్యప్ప పులిపాల కోసం అడవులకు వచ్చినట్లు చెప్పడంతో దేవేంద్రుడు ఆడపులిగా, మిగతా దేవతలు పులిమందగా మారడంతో అయ్యప్ప పులివాహనం ఎక్కి పందలం రావడం చూసిన దేశప్రజలు, రాజు, రాణి, అంతా భయభ్రాంతులై పులులమందను ముందు అడవికి పంపమని ప్రార్థిస్తారు.

అయ్యప్ప కరుణించి పులిమందను వెనక్కి పంపి, తన అవతారలక్ష్యం నెరవేర డం వలన అవతారం చాలిస్తున్నాని చెప్పి, బాణమో, కత్తో విసిరి, అది పడినచోట దేవాలయం కట్టమని, అక్కడ స్వామికొలువు తీరి ఉంటానని చెప్పడంతో, శబరిమల వెలుగులోకి వచ్చింది. రామావతారలంలో శ్రీరాముడు వనసవాసంచేసి, సీతాన్వే షణ చేస్తున్న తరుణంలో భక్తురాలు శబరి శ్రీరామలక్ష్మణులకు ఆతిథ్యం ఇచ్చి, కొలిచిన కొండవడం వలన ఈ కొండకు శబరిమల అనిపేరు వచ్చింది. శబరి ఆ కొండపై నివసించడం మూలంగా ఆ కొండకు పవిత్రత వచ్చింది. అయ్యప్పస్వామి విసిరిన బాణం లేక చురిక శబరిమలలో పడడం వలన స్వామి కోరికమేరకు పరశురామునిచే పదునెనిమిది మెట్లు (పదునెట్టాంబడి) చిన్ముద్ర, అభయహస్తం,

పట్టబందాసనంలో కూర్చున్న అయ్యప్ప శిలావిగ్రహాన్ని పరశురాముడే ప్రతిష్టించగా, పందళరాజు దేవాలయాన్ని నిర్మించినట్లు భూతనాదోపాఖ్యానీయం వలన, కేరళలో ప్రచారంలో నున్న జానపదగీతాల వలన తెలుస్తోంది. పందళరాజు కోరకపై సంవత్సరానికొక సారి మకరసంక్రాంతిరోజు సాయంత్రంవేళ జ్యోతిరూపంలో దర్శనమిస్తానని అయ్యప్ప స్వామి మాట ఇచ్చినందునే నేటికీ జ్యోతిదర్శనం అవుతోంది.

హరిహరులకు పుత్రుడు, విష్ణువు మోహినీ అవతారం దాల్చిసోయగాలతో శివుని మురిపించినట్లు, మోహినీ అందచందాలకు శివుడు పారవశ్యంచెంది, ఆమెను కౌగిలించుకోగా, ధర్మశాస్తా అవతరించినట్లు బ్రహ్మాండ పురాణంలో ఉంది. ఆ ధర్మశాస్తా విగ్రహరూపానలీనమై అంతర్ధానమయినట్లు తన దర్శనానికి శబరిమల వచ్చేవారు నియమనిష్ఠలు పాటించి రావాలని, బ్రహ్మచర్యం అంటే తనకు ఇష్టం కాబట్టి, కనీసం మండలకాలం కఠిన బ్రహ్మచర్యం పాటించి రావాలని ఆదేశించినట్లు చరిత్ర చెబుతోంది. అప్పటినుండి శబరిమలకి మరలా భక్తులు జ్యోతిదర్శనానికి మాత్రమే శబరిమల వెళ్ళేవారు. ఎరుమేలిమార్గం ఒక్కటే ఆ రోజులలో శబరిమల వెళ్ళడానికి మార్గం. నెలసరి పూజలకు ప్రత్యేకపూజలకు ఆలయసిబ్బంది, తాంత్రి,మేల్ శాంతి మార్గమే వెళ్ళివచ్చేవారు. పూర్వం కాశీకి వెళ్ళినవారు కాటికి వెళ్ళినవారితో సమానమే అన్న నానుడిలా శబరిమలయాత్రకి వెళ్ళినవారిని అలాగే అనుకునేవారు. అందుకే శబరిమల యాత్రకి బృందాలుగా వెళ్ళడం ఆనవాయితీగా వస్తోంది.

సుమారు 200 సంవత్సరాల క్రితం అంటే (1819) లో 70 మంది శబరిమల యాత్ర చేసారని, ఆ సంవత్సర ఆదాయం ఏడురూపాయలని పందళరాజు వంశీయుల రికార్డులో ఉన్నట్లు తెలుస్తోంది. వంద సంవత్సరాలుగా అంటే 1920వ సంవత్సరం తరువాత శబరిమల వెళ్ళేవారి సంఖ్య పెరిగినట్లు తెలుస్తోంది. 1907వ సంవత్సరంలో శబరిమలలో అయ్యప్పదేవాలయం పైకప్పు (గర్భగుడి) ఎండుగడ్డి, ఆకులతో కప్పబడి వుండేది. అప్పుడు అక్కడ శిలా విగ్రహానికే పూజలు జరిగేవి. 1970–1909 మధ్య కాలంలో దేవాలయం అగ్నికి ఆహుతి అవడంతో మరల దేవాలయాన్ని పునః నిర్మించి నట్లు తెలుస్తోంది.

ఈసారి శిలావిగ్రహానికి బదులు, అయ్యప్ప విగ్రహాన్ని పంచలోహాలతో తయారు చేసి ప్రతిష్ఠించారు. పంచలోహ విగ్రహం ప్రతిష్ఠించాకే శబరిమల వైభవం పెరిగింది. ఈ దేవాలయం 1935వరకు తిరువాన్కూరు మహారాజా సంస్థానంవారి ఆధీనంలో ఉండేది. 1935లో దీనిని తిరువాన్కూరు దేవస్థానం బోర్డువారికి అప్ప గించబడింది. ఆ తరువాతే భక్తుల సంఖ్య గణనీయంగా పెరగడంతో జ్యోతి దర్శనానికే కాకుండా మండలపూజ కొరకు నవంబరు 16 నుండి 26 వరకు శబరిమలలో దేవాలయం తెరవడం మొదలుపెట్టారు. చాలాక్కాయమార్గం, వండిపెరియారు మార్గం ఏర్పడి తరువాత పంబా ప్రాజెక్టు నిర్మాణంతో శబరిమలకువచ్చే భక్తుల రద్దీ పెరిగింది.

అనంతరం 1945వ సంవత్సరం నుండి భక్తుల సంఖ్య ఇంకా పెరగడంతో విషు, పంకుని ఉత్తారం, ఓణం వంటి పండుగదినాలలో కూడా తెరవడం ప్రారంభించారు.

శబరిమలకివెళ్ళే భక్తులు పెరగడాన్ని చూసి కొందరికి కన్నుకుట్టి 1950లో దేవాలయాన్ని, విగ్రహాన్ని ధ్వంసం చేసారు. అలా పరశురామ నిర్మితమైన దేవాలయం మూడుసార్లు అగ్నికి ఆహుతి అయింది. దేవస్థానం బోర్డు, భక్తుల విరాళాలతో ఇప్పుడున్న దేవాలయాన్ని పునః నిర్మించి ఇప్పుడున్న పంచలోహ అయ్యప్ప విగ్రహాన్ని చెంగనూరు వాస్తవ్యులు శ్రీ అయ్యప్పన్, శ్రీనీలకంఠన్ అనే శిల్పులిరువురూ కలసి రూపు దిద్దారు. దేవస్థానం ముఖ్యతాంత్రి శ్రీకాంతారు శంకరతాంత్రి 1951 జూన్ నెలలు (7-6-1951) వేదపండతుల మంత్రాలమధ్య భక్తుల శరణుఘోష మధ్య ప్రతిష్ఠజరిగింది. అప్పటి వరకు కేరళీ కేళివిగ్రహంగా కీర్తించబడిన అయ్యప్ప భారతీ కేళి విగ్రహంగా కీర్తించబడి, నేడు భూతళీకేళివిగ్రహంగా ప్రపంచమంతటా కీర్తించ బడుతున్నాడు.

శబరిమల తపస్వి శ్రీ విమోచనానందస్వామి కృషి ఎంతో మెచ్చుకోదగ్గది. 1950లో శబరిమల అయ్యప్ప ఆలయం అగ్నికి ఆహుతి అయినప్పుడు, శ్రీవిమోచనా నందస్వామి హిమాలయాలలో సంచరిస్తున్నారు. బదరీనాథ్‌లో ఈవార్త విని ఒక్క శబరిమలలో దేవాలయాన్ని ధ్వంసంచేసారు.కానీ భారతదేశమంతటా అయ్యప్ప దేవాలయాలు నిర్మించి, అతిత్వరలో ప్రపంచమంతటా నిన్ను కీర్తించేటట్లు చేస్తానని శపథంచేసి, ఆ మహానుభావుడు కాశీ, హరిద్వార్, పూనా, బొంబాయి, కరుపత్తూరు, శ్రీరంగపట్టణం, గొల్లపూడి (విజయవాడ) మున్నగు పట్టణాలలో అయ్యప్పదేవాల యాలునిర్మించడానికి దోహదం చేసారు. నేడు ఆయన కోరిక నెరవేరి దేశమంతటా ఎన్నో అయ్యప్పదేవాలయాలు నిర్మించారు. మన ఆంధ్రారాష్ట్రంలోనే వెయ్యికి మించి అయ్యప్పదేవాలయాలు నిర్మించినట్లు తెలిసింది. అమెరికా, సింగపూరు, సిలోన్, జర్మనీ, ఇంగ్లండు మున్నగు దేశాలలో కోట్లరూపాయలు వెచ్చించి అయ్యప్ప దేవాల యాలు నిర్మించినట్లు తెలుస్తోంది. నేడు శబరిమల యాత్రకు భారతీయులే కాక విదేశీయులు వచ్చి దర్శించుకోవడం విశేషం.

శబరిమలకు వచ్చేభక్తులు పెరగడంతో 1980నుండి దేవస్థానం బోర్డువారు శ్రద్ధతీసుకొని పంబపై వంతెన, పంబ నుండి విద్యుద్దీపాలు, మంచినీటికుళాయిలు, స్వాముల విశ్రాంతి కోసం పెద్దషెడ్లు నిర్మించారు. 1984వరకు పదునెట్టాంబడిని ఎక్కడానికి పరుశురామనిర్మితమైన రాతిమెట్లపైనుండే ఎక్కేవారు. వారు వెళ్ళే పడిని బట్టి ఆమెట్టుపై కొబ్బరికాయకొట్టిమెట్లు ఎక్కే ఆచారం ఉండేది. మెట్లు అరిగిపోయి, అన్నిమెట్లపై కొబ్బరికాయలు కొట్టడంవలన భక్తులు అనేక ఇబ్బందులకు గురికావడం చూసి, భక్తుల విరాళాలతో పదునెట్టాంబడికి 1985వ సంవత్సరంలో పంచలోహ కవచాన్ని మంత్రతంత్రాలతో కప్పడం జరిగింది. దీనివలన 18మెట్లు ఎక్కడం సులభతరమైంది. భక్తుల రద్దీ పెరగడం వలన తొక్కిసలాటలు లేకుండా ఉండడానికి

వీలుగా, 1982లో ప్లైఓవరు బ్రిడ్డికట్టి దానిపై నుండి పదునెట్టాంబడి ఎక్కాక క్యూలో వెళ్ళడానికి ఏర్పాటు చేసారు. కొండపై నుండి మాలికాపురత్తమ్మ గుడివరకు ఫ్లై ఓవర్ బ్రిడ్డి కట్టడం వలన యాత్రీకులు తిరగడానికి వీలుగాఉంది. 1989-90 ఓలనే పంబామార్గంలో కొంతభాగం, సన్నిధానం ఆవరణంలో మొత్తం భాగం సిమెంట్ కాంక్రీటుచేసి, బురదలేకుండా చేసి, భక్తులు విశ్రాంతి తీసుకోడానికి అనువుగా తయారు చేసారు.

1985నుండే దేవస్థానంవారి ప్రకటనతో అనేకమంది భక్తులు ఆకర్షితులై విరివిగా విరాళాలు అందజేసి, శబరిమల సన్నిధానంలో స్వాములు ఉండడానికి వసతి సౌకర్యాలకోసం బహుళ అంతస్తుల కాంక్రీటు భవనాలు నిర్మించడానికి పూను కొనడంతో పక్కా బిల్డింగులెన్నో అక్కడ నిర్మించబడి, శబరిమల స్వరూపాన్ని మార్చాయి. బెంగుళూరు భక్తుడొకరు శబరిమల గర్భగుడిపైన చుట్టూ బంగారు రేకు లతో తాపడం చేయడానికి పూనుకొని 2000 సంవత్సరంలో పూర్తిచేయడంతో శబరిమల స్వర్ణదేవాలయంగా మారింది.

2000 సంవత్సరం వచ్చేసరికి శబరిమలలో సౌకర్యాలు పెరగడంతోపాటు యాత్రికుల సంఖ్య ఐదుకోట్లకు చేరినట్లు, ఆదాయం కూడా ముప్పైకోట్లు వరకు పెరిగినట్లు చెబుతారు. సంవత్సరం,సంవత్సరం శబరిమలయాత్ర చేసేవారి సంఖ్య పెరుగుతూ, దేవాలయ ఆదాయం పెరుగుతోంది. తిరుమలలోవలె శబరిమలలో కూడా కాటేజీలు, యాత్రా సెంటర్లు, హోటళ్ళు అన్నీ రావడంతో శబరిమల స్వరూపం పూర్తిగా మారిపోయింది. మంది ఎక్కువైతే మజ్జిగ పలచనైనట్లు సంఖ్య పెరగడంతో భక్తి సన్నగిల్లుతోంది. సుఖాలకు, సౌకర్యాలకు అలవాటుపడి మండలదీక్ష, 7 రోజులకు 15 రోజులకు 21 రోజులకు పరిమితమవుతోంది. ఒకనాడు స్వామి నామాలు, శరణు ఘోషతప్ప వేరేమాటలు శబరిమల సన్నిధానంలో వినిపించేవి కావు. నేడు సెల్‌ఫోన్లు, టెలిఫోన్లు మోతలు, రకరకాల మాటలు వినిపించడం బాధాకరంగా ఉంటోంది.

శబరిమలలో వంశపారంపర్య ముఖ్యపూజారిని తాంత్రి అని పిలుస్తారు. వీరిని పరశురాముడుపూజకొరకు ఆంధ్రాలో కృష్ణాజిల్లా నుండి తీసుకెళ్ళారని చెబు తారు. ప్రస్తుతం, శ్రీరాజీవ్ తాంత్రి ఆధ్వర్యంలో శబరిమల దేవాలయంలో పూజలు జరిపించడానికి మేల్‌శాంతిని (పూజారి) ప్రతి సంవత్సరం లాటరీ ద్వారా ఎన్ను కొంటారు. దేవస్థానంవారికి వచ్చిన దరఖాస్తులని పరిశీలించి పదింటిని సెలక్టు చేసి వారి పేర్లనురాసి ఒక డబ్బాలోవుంచి, అయ్యప్పవిగ్రహం ముందుంచి ఒకచిన్న పిల్లవానిచేత లాటరీ తీయిస్తారు. ఎవరు పేరువస్తే వారు ఆ సంవత్సరానికి మేల్ శాంతిగా శబరిమలలో వ్యవహరిస్తారు.

స్వామివారి ఆభరణాలను పందళంలో భద్రపరచి ఉంచుతారు. ప్రతీయేటా జనవరి 14 తారీఖునాటికి (మకరసంక్రాంతి) శబరిమల మూడుపెట్టెలలో పందలం

నుండి 84 కిలోమీటర్లు అడవులలో నడుచుకొని మోసుకువస్తారు. ఈ ఆభరణాలు తేవడానికి పందళంలో భాస్కరన్‌పిళ్ళై వారి కుటుంబం ఉంది. వీరు మొత్తం 11 మంది దీక్షలో ఉండి (65రోజులు) తిరువాభరణాలను శబరిమల మోసుకువస్తారు. వీరు జనవరి 12 మధ్యహ్నం పందళంలో బయలుదేరి మధ్యలో రెండు రాత్రిళ్ళు విశ్రాంతి తీసుకొని, 14 తారీఖున సాయంత్రం 6 గంటలకు శబరిమల సన్నిధానం చేరుతారు. ఆభరణాల వెంట పందళ రాజు వంశస్తులలో పెద్దవాడు కత్తిపట్టుకొని నీలిమల వరకు వచ్చి అక్కడ విశ్రమిస్తాడు. తిరు ఆభరణాలు స్వామివారికి అలంక రించి కర్పూరహారతి గుళ్ళో ఇవ్వగానే తూర్పుదిక్కు పొన్నంబలమేడు నుండి భక్తులకు జ్యోతి దర్శనం అవుతుంది. పదునెనిమిది మెట్లు ఎక్కడానికి ఇరుముడి లేకుండా తాంత్రీ, పందళరాజు, తిరువాభరణాలు మోసేవారు ఎక్కుతారు. ఎక్కవచ్చు. మరల జనవరి 20వ తారీఖునాడు పందళరాజు వెంటరాగా తిరువాభరణాల మూడు పెట్టెలను తిరిగి పందళం తీసుకువెళ్ళి భద్రపరుస్తారు.

అయ్యప్పభక్తజనవత్సలుడు. ఆయన అనుగ్రహం ఉంటే మనం సాధించ లేనిదంటూ ఏమీలేదు. ఆయనను ఒకసారి దర్శించుకున్న భక్తులు మళ్ళీ మళ్ళీ ఆయన దర్శనం కోసం మరొక సంవత్సరం ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తుం టారు. అదీ ఆయన మహిమ. ఓమ్‌స్వామియే శరణమయ్యప్ప!

(కుముదం భక్తిస్పెషల్ – జనవరి 2010)

❁ ❁ ❁

నమస్తే

నమస్కారము చేయునపుడు నమస్తే అనరాదు. పెద్దలకు నమోనమః సామాన్యులకు నమోవః అనాలి. రెండు చేతులతో తప్ప ఒంటి చేతితో నమస్కారము చేయరాదు. పాదాభివందనము చేయువారు తమ ఎడమచేతిని అవతలివారి ఎడమ పాదముపై ఉంచి ఆ చేతిమీదుగా తమ కుడిచేతిని అవతలి వారి కుడిపాదముపై ఉంచి ముమ్మారు కళ్ళకు అద్దుకొనవలెను. మన శరీరములో విద్యుత్ ప్రవహిస్తుంది. మానవ శరీరము విద్యుద్వాహకము. కుడి, ఎడమలు ధన, ఋణ ధృవములు. ధన ధృవము ఋణధృవము కలిస్తే కాంతి వస్తుంది. పెద్దల కుడిపాదాన్ని కుడిచేత్తో, ఎడమ పాదాన్ని ఎడమచేత్తో పట్టుకొని నమస్కరిస్తే వారిలోని శక్తి మనకు వస్తుంది.

ఇంట్లో పెద్దలుంటే మొదట అమ్మమ్మకు, తర్వాత తాతగారికి, తర్వాత అమ్మకు, తర్వాత నాయనమ్మ, తాతకు, తండ్రికి తర్వాత మేనమామలకు, పినతండ్రులకు వరుసగా పాదాభివందనము చేయవలెను. గురువుకు గురువుంటే మొదట గురుదేవు లకు తర్వాత గురువునకు నమస్కరించవలెను.

దూరమునుండి నమస్కరించేటప్పుడు రెండుచేతులు జోడించి, హృదయానికి లలాటానికి, లేదా తలపైకి ఆనించి ధ్యానించాలి.

పురుషులు మాత్రమే భూమిమీద అని సాష్టాంగ నమస్కారము చేయవలెను. స్త్రీలు వక్షస్థలం నేలమీద ఆన్చి నమస్కరించకూడదు. కనుక మోకాళ్లు నేలపై ఆన్చి తమ ఎడమపాదము మీద కుడిపాదము ఆన్చి సాష్టాంగ నమస్కారము చేయవలెను.

పెద్దలు స్నానము చేయకుండా ఆశీర్వదించరాదు. కావున వారి స్నానానంతరమే నమస్కరించవలెను. తల్లికి ఒకసారి, తండ్రికి రెండుసార్లు, పెద్దలకు మూడు సార్లు భగవంతునికి నాలుగు సార్లు నమస్కరించవలెను.

ఓమ్ స్వామియే శరణమయ్యప్ప.

సామాజిక వ్యాసాలు

దసరా....సరదాలు..

దసరారోజులొస్తున్నాయంటే మా చిన్నతనంలో స్కూలు పిల్లలు దసరా బాణాలు పట్టుకొని పువ్వులు సంధించి కొడుతూ, దసరాపద్యాలు పాడుతూ ఇంటింటికీ తిరుగుతూ కనిపించేవారు. నా చిన్నతనంలో పాడిన దసరా పద్యాలు లీలగా ఇంకా కొంచెం గుర్తున్నాయి.

దసరాకి వస్తిమని విసవిసలు పడక చేతిలో లేదనక అప్పుయివ్వరనక
ఇరుగుపొరుగులవారు ఇస్తారు సుమ్మీ అయ్యవార్లకు చాలుయైదువరహాలు
పిల్లవాండ్రకు చాలు పప్పుబెల్లాలు పావలా యిస్తే పట్టేదిలేదు
అర్థరూపాయిస్తే అంటేదిలేదు ముప్పావలా ఇస్తే ముట్టేదిలేదు.
ఇచ్చ రూపాయిఇస్తే పుచ్చుకుంటాము జయీభవ విజయీభవ !

అని పిల్లలచేత పాడిస్తూ, పిల్లల్ని ఇళ్లచుట్టూ తిప్పి ఆకాలపు అయ్యవార్లు అందర్నీ అలరించేవారు. పగటి వేషాలువేసేవారు. బాగా కానవచ్చేవారు. పురాణ పాత్రలు ధరించి రోజుకొక వేషం వేసి చక్కగా పద్యాలు, పాటలు పాడి పదిరోజులు దసరాపండుగలలో యింటింట తిరిగి పదవరోజున డబ్బులు దండుకొనేవారు. పువేషాలు వేసినవారు పోటీలుపడి గెంతులువేసి డప్పుకు తగ్గట్టుఆడి పెద్దలను మెప్పించి డబ్బులు, పతకాలు పొందేవారు.

అక్కడక్కడ నవరాత్రి ఉత్సవాలు జరిపి దుర్గా పూజలు చేయించి దసరా పదిరోజులు రాత్రివేళ బుర్రకథలు, హరికథలు, వీధి నాటకాలతో భక్తులను రంజింప చేసేవారు. ఈరోజు ఆ సరదాలు లేవు. ఆ వేడుకలు లేవు. ఇంట్లో అంతా టీవికి అతుక్కుపోయి కూర్చుంటున్నారు. హరికథ వంటి కార్యక్రమం ఎక్కడైనా ఏర్పాటు

చేసినా పట్టుమని పదిమంది ప్రేక్షకులు వుండటంలేదు. అందుకే నేడు దసరాలు చప్పగ నడుస్తున్నాయి.

దసరా పండుగవస్తోందంటే నేడుఉద్యోగస్తులకు పండగ. వ్యాపారస్తులు హడలి పోతుంటారు. దసరా మామూళ్ళ బెడద భరించలేక కొందరు ఇంట్లో వుండే లేరని చెప్పిస్తారు. కొందరు అంటే కొన్ని డిపార్ట్‌మెంట్‌లో చక్కని ఉద్యోగాలుచేస్తూ మంచి జీతాలు తీసుకుంటూ కూడా సిగ్గు,బిడియం విడిచి దసరా మామూళ్ళని చేతులు చాచడం వింతగా కనిపిస్తుంది. రోడ్లుతుడిచేవారు, కాలువలు తుడిచేవారు, కూలి పనులు చేసేవారు దసరా మామూలని చేయిచాస్తే అర్థముంటుంది. కానీ నెలజీతాలు మెక్కుతూ దసరా మామూళ్లకు చేతులు చాచేవారిని చూస్తే ఆశ్చర్యమే స్తుంది.

పూర్వకాలంలో దసరాలలో పిల్లల్ని అయ్యవార్లు యింటింట తిప్పినప్పుడు ఆ పిల్లల తాలూకు మంచిచెడ్డలు, చదువు సంధ్యల గురించి పెద్దవాళ్ళు టీచర్లనడిగి తెలుసుకునేవారు. పిల్లల్ని బాగా చదివించమని చెప్పినమాట వినకపోతే దండించమని కూడా పెద్దలు చెప్పేవారు. ఆ రోజులలో వారికి ఒక రూపాయిస్తే ఎంతో కృతజ్ఞతా భావంతో పొంగిపోయేవారు. నేడు దసరా మామూళ్లకి ఎంత యిచ్చినా తృప్తి వుండదు. ఇంతయివ్వాలని డిమాండ్‌చేసి మరి అడిగి తీసుకుంటారు.

కొన్ని ఆఫీసులో బిల్లు కట్టడానికి వెళితే తిరిగి రావలసిన చిల్లర ఇవ్వకుండా అడిగితే దసరా మామూలని హైటెక్ రీతిలో వసూలు చేస్తూ వుంటారు.

దసరాలలో మూలానక్షత్రం వున్నరోజున పిల్లలచేత పుస్తకాలు పెట్టించిసరస్వతీ పూజ జరిపించడం ఆచారం. ఒకవేళ ఆరోజు చేయలేనప్పుడు దశమిరోజునాడైనా చదువుకొనే పిల్లలచేత సరస్వతీపూజ చేయిస్తారు. కర్మాగారాలలో పనిచేసేవారు, వర్క్‌షాపులలో పనిచేసేవారు విజయదశమినాడు విధిగా ఆయుధపూజ జరుపుతారు. అంటే వారు నిత్యం ఉపయోగిచే సామగ్రికి, మోటార్లకు, మెషీన్లకు, పరికరాలకు పసుపు, కుంకుమ బొట్లుపెట్టి పూజలు చేస్తారు. కార్లు, బస్సులు, లారీలు, మోటారుసైకిళ్లు, స్కూటర్లు, సైకిళ్లను కూడా శుభ్రంగా కడిగి, పసుపు కుంకుమలతో అందంగా అలంకరించి శక్తిపూజ జరపడం నేటికీ ఆచారంగా వుంది. దసరా పండుగలలో కొన్ని కంపెనీలవారు, యజమానులు ఉద్యోగస్తులకు బోనస్, కొత్తబట్టలు, బహుమతులు యిచ్చి వర్కర్సుని తృప్తిపరుస్తూ వుంటారు.

కొత్తగా పెళ్లయిన ఏడాది అల్లుళ్ళను, కూతుళ్లను, దసరా పండుగలకు పిలిచి కొత్త బట్టలు పెట్టి గౌరవించడం, బహుమతులు అల్లుళ్లకివ్వడం కూడా ఒక సాంప్రదా యంగా వస్తోంది. దసరాపండుగ శరత్కాలములో రావడంవల్ల వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా వుంటుంది. పచ్చని పొలాలతో పల్లెలు కళకళలాడుతూ వుంటాయి. సకాలంలో తగిన వర్షం కురిస్తే ఏరులు, నదులు, చెరువులు నిండి గలగలపారుతూ ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. కొందరు బొమ్మల కొలువులు పెట్టి పేరంటానికి పిలిచి, ఆటపాటలతో వినోదిస్తారు.

అమ్మవారిని పూజించేవారు, దసరాలలో నవరాత్రులు దీక్షాబద్ధులై, ముఖక్షవరము చేయకుండా, ఏకభుక్తముచేస్తూ బ్రహ్మచర్య నిష్ఠులై రెండు పూటలా తలకి స్నానంచేసి ప్రతిదినము దేవిని కొలుస్తారు. కొన్ని దేవాలయాలలో అమ్మవారికి రోజుకొక అవతారముతో అలంకరించి పూజిస్తారు. మహిషాసురుడనే రాక్షసుణ్ణి దుర్గాదేవి హతమార్చిందని మహిషాసుర మర్దినిగా, జగదంబగా అమ్మని కొలుస్తారు. అమ్మ కటాక్షించి ఆమె చల్లనిచూపులు ప్రసరిస్తే మానవ మనుగడకు లోటుందదని నమ్మకముతో జగన్మాతను పూజిస్తారు. దసరాలు వేడుకగా జరుపుతారు.

ఉత్తర భారతంలో ప్రధాన నగరాలైన ఢిల్లీవంటి పలుచోట్ల దసరా పండుగలలో రావణ వధకి గుర్తుగా పెద్దపెద్ద రావణాసురుని విగ్రహాలు తయారుచేసి, కొన్నిటిని బాణాసంచాతో నింపి, ఆ రావణ విగ్రహాలను అగ్నికి ఆహుతిచేసి ఆనందిస్తారు. మొత్తం మీద దసరా పండుగలు యావద్భారతదేశము ఏదో పేరున జరుపుకొంటుంది.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – అక్టోబరు 2003)

❋ ❋ ❋

పండుగ సందడి

పండగలొస్తున్నాయంటే పూర్వపు రోజుల్లో భలే సందడిగావుండేది. పండగల్లో సంక్రాంతి పండగను పెద్దపండగా వ్యవహరిస్తారు. ఏ పండగ వచ్చినా ముందు పిల్లలకు సందడి ఎక్కువగా వుంటుంది. దీపావళి, దసరా, ఉగాది, మకర సంక్రాంతి, వినాయకచవితి పండుగలు ముఖ్యంగా ఆంధ్రావనిలో ప్రతీయింట జరుపుకుంటారు. శ్రీరామనవమి, కృష్ణాష్టమి, మహాశివరాత్రి పండగలే అయినా యివి పెద్దవాళ్ల పండుగలుగ చెప్పవచ్చు. పూర్వం పండగ ముందు ఇళ్లకు సున్నాలు వేయించి, అందంగా తీర్చిదిద్దేవారు. ద్వారాలకు మామిడితోరణాలు కట్టి, గుమ్మాలకు పసుపురాసి అందంగా బొట్లుపెట్టి, వీధిగుమ్మంలో కళ్లాపుజల్లి రంగవల్లులతో ఎవరిల్లు చూసినా పండగ కళతో ముచ్చటగొలిపేది.

స్త్రీలకు క్షణం తీరుబడి వుండేది కాదు. అందులో సంక్రాంతి పండుగ కొత్త అల్లుళ్ళను, ఆడపిల్లలను ఇంటికి పండగకు పిలవడం, కొత్తబట్టలు, కానుకలు ఇచ్చి సంతోషపెట్టడం జరిగేది.

పిల్లలకు పండగలొస్తున్నాయంటే కొత్త బట్టలు వస్తాయని పొంగిపోయేవారు. తెల్లవారుజామున పెద్దలు. ముఖ్యంగా స్త్రీలులేచి పిల్లలకు వొంటినిండా నూనెరాసి, అమ్మకడుపు చల్లగా, అత్తకడుపు చల్లగా వెయ్యేళ్ళు బ్రతికి, పదిమంది పిల్లల్ని కని, పెద్ద ఉద్యోగంచేసి, బోలెడు ఆస్తి సంపాదించి, గొప్పవాడవ్వాలని ఆశీర్వదించి తలకి నూనెపెట్టి అక్షింతలు వేసేవారు. తరువాత నలుగుపిండితో ఒళ్లు నలిచి కుంకుడు కాయ పులుసుతో తలంటి వేడినీళ్లతో స్నానం చేయించేవారు. స్నానం పూర్తయ్యేక శ్రీరామరక్ష, మార్కండేయుడంత ఆయుష్షు, పార్వతీ అంత యైదోతనం కలిగి

వుండాలని ఆశీర్వదించేవారు. కొత్తబట్టలు కట్టుకొని పెద్దలకు నమస్కరిస్తే ఆశీర్వదించి డబ్బులు చేతిలో పెట్టేవారు.

వినాయకచవితి, దసరాలలోనైతే పిల్లల్ని కూర్చోబెట్టి విఘ్నేశ్వరపూజ, సరస్వతీ పూజలు వంటివి దగ్గరుండి జరిపించేవారు. శ్రీరామనవమి, కృష్ణాష్టమి, దీపావళి, ఉగాది పండుగలకు పెద్దలే పూజలు చేసి ప్రసాదాలు, పానకం యిచ్చేవారు. ఆ రోజులలో కొందరు దసరాలలో బొమ్మలకొలువుపెట్టి తొమ్మిదిరోజులు స్త్రీలను పేరంటానికి పిలిచి వేడుకగా జరిపేవారు. కొందరు సంక్రాంతి పండుగకు బొమ్మల కొలువుపెట్టి పేరంటానికి పిలిచే వారు, సంక్రాంతికిగొబ్బెమ్మల పాటలు పడడం, అమ్మాయిలు పట్టు పరికిణీలు ధరించి జడగంటలు వేసుకొని పెద్ద పెద్ద జడలతో చూడముచ్చట గొలిపేవారు.

సంక్రాంతి ముందురోజు భోగిపండుగ రోజున తెల్ల వారుజామున భోగి మంట వేసేవారు. పిడకలతో దండగుచ్చి, బోగీ దండగాతెచ్చి మండుతున్న అగ్నిలో వేసి, మంటలుపైకి లేస్తూవుంటే చప్పట్లు చరిచి ఆనందిస్తూ వుండేవారు. భోగి, సం క్రాంతి, కనుమ మూడురోజులు పండగలే అవడంవలన, పండిన పంటలు ఇంటికి వచ్చిన వేళవడం, పొలంపనులు అన్నీ అవడంవలన పల్లెసీమల్లో సంక్రాంతి పండుగనే వేడుకగా జరిపేవారు. మామూలు వంటలేకాక పిండివంటలతో షడ్రసోపేతమైన భోజనం వండి వడ్డించేవారు. మూడవరోజు కనుమపండుగ రోజున పశువులను అలంకరించి పూజించి మంచి ఆహారాన్ని అందించేవారు.

మగవారు మాత్రం పండుగలలో విశేషంగా పేకాట, కేరమ్‌బోర్డు, అష్టాచెమ్మా చదరంగం వంటి ఆటలతో కాలక్షేపం చేసేవారు. కొందరైతే కోడిపందేలు, ఎడ్లపం దేలు, గొర్రెపందేలు, వంటి పోటీలలో నిమగ్నమయ్యేవారు. పల్లెటూళ్లలో పండగ వాతావరణం బాగా వుండేది. అల్లుళ్లరాకతో ఊరికి కొత్త వెలుగువచ్చేది కొత్తల్లుళ్లను చిలిపి మరదళ్లు ఆటపట్టించి ఉడికించేవారు. సందడిలో సడేమియా అన్నట్లు కొందరు అల్లుళ్లు, అత్తమామలిచ్చిన కానుకలు చాలలేదని అలిగి వెళ్ళిపోయేవారు. మామలు వారిని బ్రతిమాలి అలుకతీర్చి సముదాయించడానికి తల ప్రాణం తోకకివచ్చేది. ఇవన్నీ చూడడానికి భలే సరదాగా వుండేది.

సంక్రాంతి పండుగలకు పిల్లలకు ఎక్కువ సెలవులుండడంతో ఈ రెండు పండగలకు ఆడపిల్లలు పుట్టింటికివచ్చేవారు. బంధువులందరూ కలవడంతో అభి మానాలు, ఆప్యాయతలు పెరిగేవి. ఈ రోజుల్లో పండుగలు వస్తున్నాయి, వెళ్తున్నాయి కానీ ఆ సరదాలు, వేడుకలు లేవు. పండగరోజు కూడా తెల్లవారుజామునలేచి స్నానాలు చేసేవారు అరుదుగా కనిపిస్తున్నారు. దానకితోడు నూనె, నలుగుపెట్టుకొని తలకు స్నానం చేసేవారు అసలు కనిపించడంలేదు. అందరూ షాంపులు, సబ్బులే రుద్దుకొని నీళ్ళుపోసుకుంటున్నారు. కానీ కుంకుడుకాయ, సీకాయ వంటివి ఉపయోగించడంలేదు. పండగ వచ్చినా పసుపురాసిన గుమ్మంకానీ, మామిడాకులతో

తోరణాలుకానీ కనిపించడంలేదు. కొత్తబట్టలు, కట్టుకోవడం, పిండివంటలతో పండుగ రోజులలో భోజనాలు మాత్రం కొందరుచేస్తున్నారు.

శరీరానికి నూనెరాసుకుని, నలుగుపెట్టి స్నానం చేయడం వలన దేహం గట్టిపడి&, ముసలితనమొచ్చినా, శరీరం సన్నగా వుండి ఆరోగ్యంగా వుంటారు. ఒంటికి పసుపురాసుకొని కాళ్లకు పారాణి పెట్టుకుంటే ముఖం, పాదాలు ముసలి తనం వచ్చినా స్త్రీలు లక్ష్మీకళతో మనోహరంగా కనిపిస్తారు. నేటి యువతరం బ్యూటీక్లినిక్‌లకు వెళ్లడానికి ఇష్టపడుతున్నారు. కానీ వంటయింట్లో అందుబాటులో వున్న పద్ధతులు నచ్చడంలేదు. పండగలపేరుతో మన పెద్దలు ఎంతో అనుబవంతో అన్నీ మంచి పద్ధతులనే మనకి చెప్పేరు. కానీ కాలమహిమతో, పాశ్చాత్య పోకడ లతో అన్నీ మనం దూరంచేసుకుంటున్నాము.

(ఆంధ్రభూమి దినపత్రిక - ప్రియదర్శిని - 12-1-2003)

❁ ❁ ❁

ముత్యమంత పసుపు

అప్పుడే వంటపని పూర్తిచేసుకొని టివి ఆన్‌చేసి కుర్చీలో కూలబడ్డాను. టింగ్ టింగ్ మంటూ కాలింగ్‌బెల్ మ్రోగడంతో వెళ్ళి తలుపుతీసేను. అపార్ట్‌మెంట్‌లో క్రిందిభాగ ములో వుంటున్న సునీత వచ్చింది. సునీతకి పెళ్ళయిమూడేళ్ళవుతుంది. భర్త ఇంజ నీరు. ఏమీ తోచకపోయినా, ఏమైనా సలహా కావలసివచ్చినా, పెద్దదానిగా నన్ను గౌరవించి మా ఇంటికి వస్తూవుంటుంది.

'ఆంటీ! మొన్నపక్కింటి లక్ష్మిగారితో శివాలయానికి వెళ్ళేను. అక్కడ కైలాస గౌరినోము, లక్షపసుపుకొమ్ముల నోము చేసుకొన్న కొందరు ముత్తయిదువులు పిలిచి బోలెడు పసుపు, కుంకుమ, పసుపుకొమ్ములు ప్లాస్టిక్ కవర్లలోపోసి ఇచ్చేరు. ఆ పసుపు, కుంకుమ ఏంచేసుకోవాలో అర్థం కావడంలేదు. నేను వంటలలో కూడా పుసుపు చాలా తక్కువ వాడతాను. పసుపు వాసన నాకు మావారికి అంతగా నచ్చదు అంటూ చెబుతూవుంటే నవ్వుతోపాటు ఆశ్చర్యం కలిగింది.

ఒకనాడు స్త్రీకి పసుపు, కుంకుమలే సౌభాగ్యమని, ముఖ్యమైనవని భావించే వారు, పసుపు శుభసూచకంగా భావించి విరివిగా వాడేవారు.పండవచ్చినా, శుభ కార్యంవచ్చినా ముందుగా ఇంట్లో గుమ్మాలకు పసుపురాసి, కుంకుమబొట్టుపెట్టి మామిడి తోరణాలతో అలంకరించేవారు. ఆడపిల్లలు, స్త్రీలు కూడా ముఖానికి ఒంటికి పసుపురాసుకొని స్నానాలుచేసేవారు. స్నానాంతరము ముఖానికి కుంకుమ బొట్టు పెట్టుకొని మహాలక్ష్మి కళ ఉట్టిపడుతూ కన్పించేవారు. నోములు, వ్రతాలు వస్తే పాదాలకు పసుపుపారాణి పూసుకొని ముస్తాబయేవారు. ముత్తయిదువుల పాదాలకు పసుపుపూసి, కుంకుమబొట్టు పెట్టి, నానబెట్టి మొలకెత్తిన పెసలుకానీ సెనగలుకానీ బఠానీలుకాని తాంబూలం, పళ్ళతో వాయనంగా ఇచ్చేవారు.

పూర్వం రోజులలో శ్రావణమాసం వస్తోందంటే ఆడపిల్లలకు భలే సందడిగా వుండేది. పట్టు పరికిణీలు, కాళ్ళకు గజ్జెల పట్టీలు, జడగంటలు వేసుకొని పిల్లలు ముస్తాబై నోములు నోచుకొని పేరంటానికి వస్తూ వుంటే పిల్లలు ముద్దొచ్చేవారు. ఆడ పిల్లలకు చిన్నతనంనుంచే నోములు, వ్రతాలపట్ల ఆసక్తిని కలిగించాలని పెద్ద వాళ్ళు అట్లతద్దినోము, శ్రావణమంగళవారం నోములు పిల్లలచేత నోపించేవారు. పిల్లలలో దైవముపట్ల భక్తిభావం, పెద్దలయందు గౌరవం కలిగివుండడానికి పునాదులు పసితనంలో వేయడం వలన పిల్లలు పెరిగి పెద్దవారైనా వారి నడవడి అలాగేవుండేది.

పసుపు–కుంకుమలు వాడుక అందరిళ్ళలో బాగావుండేది. పసుపు ఆరోగ్యానికి మంచిదని, రోగనిరోధకాన్ని కలిగిస్తుందని, కొన్ని సూక్ష్మక్రిముల నుండి కాపాడుతుం దని వైద్యశాస్త్రం కూడా చెబుతోంది. స్త్రీలు ఎక్కువగా నీటిలోను, తడిలోను పనిచేయ డం వలన పాదాలు దెబ్బతినకుండా పసుపు పాదాలకు రాసుకోవడంవలన పాదాలు సురక్షితంగా వుంటాయి. పసుపు ముఖానికి, ఒంటికి రాసుకొని స్నానంచేయడం వలన శరీర సౌందర్యం పెరగడమేకాకుండా కొన్ని చర్మరోగాలు రాకుండా శరీరాన్ని కాపాడుతుంది. వంటకాలలో పసుపు వాడడంవలన ఆరోగ్యం కుదుటపడడమే కాకుండా వంటకాలు అందంగా కనిపించడమే కాకుండా మంచి రుచి, సువాసన కలిగి వుంటాయి.

పెళ్ళి వచ్చినా పేరంటం వచ్చినా, పసుపు, కుంకుమతోనే ప్రారంభమవుతాయి. పెళ్ళి నిశ్చితార్ధనికి ముందు పసుపు కుంకుమలే యిచ్చి నిశ్చితార్ధం చేసుకుంటారు. అందుకే కొందరు పెళ్ళి నిశ్చితార్ధానికి పసుపు, కుంకుమ ఇవ్వడంగా పేర్కొంటారు. పసుపు కుంకుమ శుభానికి సూచిక. దైవానికి ఏ పూజచేయవలసి వచ్చినా పసుపు, కుంకుమ లేనిదేపూజసాగదు. అమ్మవారి పూజకు పువ్వులకంటే పసుపు, కుంకుమలకే ప్రాధాన్యత వుంది.

ఈ రోజుల్లో ఫేషన్లు పెరగడంతో తిలకాలు, రకరకాల స్టిక్కర్లు రావడంతో అంతా పసుపు కుంకుమల్ని విసర్జించి, నుదట తిలకాలు, స్టిక్కర్లే ధరిస్తున్నారు. ఒంటికి ముఖానికి పసుపు రాసుకోవడం మానేసి రకరకాల క్రీములు రాసుకొంటూన్నరు. చందనం, పసుపువంటి సహజ సౌందర్యసాధనాలు విడిచిపెట్టి నేడు మార్కెట్లో వచ్చే రకరకాల క్రీములపైనే స్త్రీలు మోజుపడి, వాటిని ఉపయోగిస్తున్నారు. కొన్ని శరీరానికి హాని కలిగిస్తున్నా కొన్ని రకాల చర్మవ్యాధులు వస్తున్నా వాటినే వినియోగిస్తు న్నారు. ఇది చాలా దురదృష్టకరం.

పసుపు, కుంకుమ సౌభాగ్యానికి పుణ్యస్త్రీకి చిహ్నంగా వాడేవారు. వివాహమైన తరువాత భర్తమరణిస్తే, పూర్వపు రోజులలో మొదట పసుపు, కుంకుమలు, గాజులనే విసర్జింపజేసి, స్త్రీని విధవరాలుగా తయారుచేసేవారు. స్త్రీ పపుసు రాసుకోకుండా కుంకుమబొట్టు పెట్టుకోకపోతే పూర్వం చాలా తప్పుపట్టేవారు. నేడు తిలకం బొట్టు అన్నిరకాలస్త్రీలు (భర్తమరణించినవారు) కూడా పెట్టుకుంటున్నారు.

మా చిన్నతనంతో మా అమ్మమ్మవాళ్ళు రూపాయి బిళ్ళంత కుంకుమబొట్టు పెట్టుకొనేవారు. మా అమ్మ అత్తవాళ్ళు పావులా కాసంత కుంకుమ బొట్టుపెట్టుకొనేవారు. బొట్టును నుదుటిపై నిలవడానికి కొంచెం తడిచేసి పెట్టుకోవడమో, నుదుట వేసలైను వంటివి రాసుకొని బొట్టుపెట్టుకొనేవారు. బొట్టు గుండ్రంగా రావడానికి చిల్లుకానీ వంటివి ఉపయోగించి నుట బొట్టుపెట్టుకొనేవారు. ఇంటికిఎవరైనా స్త్రీలు వస్తే వారు ఇంటినుండి వెళ్ళేటప్పుడు తాను ముఖానికి ముందు బొట్టుపెట్టుకొని ఎదుటివారికి బొట్టుపెట్టి పంపడం సాంప్రదాయం. ఏ శుభకార్యం వచ్చినా, నోములు, వ్రతాలకు, పుట్టిన రోజులకు, పేరంటానికి పిలవాలన్నా కుంకుమ బరిణలలో కుంకుమ పెట్టి పిలవడం నేటికి కొందరు కొనసాగిస్తున్నారు. పూర్వకాలంలో ఉపనయనం, వివాహానికి ముందు చిక్కసం పోయడమనే సాంప్రదాయం వుండేది. ముందుగా పిలిచేవారింటికి బేండు మేళాలతోవెళ్ళి పసుపు, కుంకుమ నలుగుపిండి, నూనె, కుంకుళ్లు వంటివి కూడా పంచియిచ్చి శుభకార్యానికి పిలిచేవారు, ఆ రోజులు వేరు, ఆ మనుషులు వేరు, తలచుకొంటే ఈ రోజు నవ్వువస్తుంది.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 22–8–2005)

❁ ❁ ❁

ఆషాఢం వచ్చింది !

పూర్వం రోజులలో ఆషాఢమాసం వస్తోందంటే కొత్తగా పెళ్లయిన జంటలకు గుబులుగా వుండేది. అత్త, కొత్తకోడలు ఒక గుమ్మందాటకూడదని, ఒక ఇంట్లో కలసి వుండకూడదని కొత్తకోడల్ని పుట్టింటికి పంపించేవారు. కరువులో అధిక మాసంలా ఒక్కొక్కసారి డబుల్ ఆషాఢాలు (అధికమాసం) వచ్చి కొత్త పెళ్లికొడుకుల్ని, పెళ్లికూతుళ్లను హడలెత్తించి దాగుడు మూతలాడించేవి. విరహంతో వేగిపోయి, దగ్గర్లో వుంటే చాటుమాటుగా ఎక్కడో కలుసుకుంటూ వుండేవారు. ఉద్యోగస్తులైతే ఆషాడం రాకుండా వేరింటి కాపురాలపెట్టి, పెద్దలు అక్కడనుంచి నిష్క్రమించేవారు. కానీ కొందరు చాందసులు, చాదస్తులు ఆషాడమాసంలో భార్యభర్తలు కలిసి వుండ కూడదని విడదీసేవారు. వారి బాధ ఆరోజులలో వర్ణనాతీతం.

ఇంతకీ ఆషాడమాసానికి కొత్తగా పెళ్ళిచేసుకొని కాపురాలుచేసే జంటలకి ఏమిటి సంబంధమా అని అలోచిస్తే ఆషాడమాసం అనారోగ్య మాసమని ఒకటే మనకి తోస్తుంది. ఒకఅత్త, కోడలు ఒకగుమ్మం దాటకూడదనే నియమం ఎలా వచ్చిందో అర్థంకాదు. పూర్వం రోజులలో ఎప్పుడో అత్త, కొత్తకోడలు ఆషాడమాసంలో ఒక ఇంట్లో వుండి ఏవో గొడవలో, అనారోగ్యం రావడమో, ఎవరో చనిపోవడమో జరిగి వుండాలి. అలా జరగడానికి కొత్తకోడలిరాకే కారణమని ఈ పద్ధతి అమలులోకి వచ్చిందేమోననిపిస్తుంది. అంతకాన్న కారణం కనిపించదు. శకునాలు, తుమ్ములు, వంటివి ఏవైనా కార్యసాధనకి వెళ్లేటపుడు చాలామంది నమ్మకంగా చూస్తారు. ఆ పనిజరగకపోతే ఎదురుగా శకునంవచ్చినవారిని తిట్టుకోవడం, బాధపడడం జరుగుతూ వుంటుంది. అలాగే ఈ ఆచారంవచ్చి వుంటుందనుకుంటాను.

ఆషాడమాసంవస్తే సరిగా ఎండకాయక, వానపడక, ఆకాశం మబ్బుగా వుండి వాతావరణం ఉత్సాహాన్ని కలిగించకుండా బద్ధకాన్ని కలుగజేస్తుంది. ఎండ సరిగ్గా కాయక ఎక్కువ కాలం మబ్బుగా ఉండడంవల్ల క్రిమికీటకాదులు, ఈగలు, దోమలు బాగా అభివృద్ధి చెందుతాయి. అవి తినే ఆహారపదార్థాలపై వాలి అనారోగ్యాన్ని కలుగచేస్తాయి. తిన్నఆహారంకూడా సరిగాజీర్ణంకాక చాలామంది అజీర్తితో బాధ పడుతూ వుంటారు. ఆషాడమాసంలో సరియైన మంచినీరు లభించక ఒక్కొక్కసారి బురదనీరు, మురికినీరు త్రాగడంవలన జాండీస్, కలరా వంటి వ్యాధులు కూడా వ్యాపిస్తూ వుంటాయి. ఆకుకూరలు, కాయగూరలుమీద క్రిమికీటకాల బెడద ఎక్కువగా వుండడంవల్ల ఆకుకూరలపై క్రిమికీటకాలగుడ్లు తెల్లగా ఆకుల కింద వందల సంఖ్యలో వుంటాయి. అలాగే కూరగాయలలో పుచ్చులు ఎక్కువగావస్తాయి. సరిగాచూసి, శుభ్రంగా కడిగి, వుడికించి తినకపోతే కొత్తరోగాలువస్తాయి. సూర్యరశ్మి సోకకుండా మబ్బుగా వాతావారణం వుంటే క్రిమికీటకాలు అభివృద్ధిచెందడానికి అనుకూలమైన సమయం, సూర్యరశ్మి సరిగా సోకకపోతే, మనుషుల్లోకూడా త్వరగా రోగాలు వ్యాపిస్తాయి. అందుకే ఆషాడమాసంలో ఎక్కువమంది అనారోగ్యాలపాలై ఆస్పత్రులన్నీ కిటకిటలాడుతూ వుంటాయి. ఇటువంటి ఆషాడమాసంలో కొత్తగాపెళ్ళయిన జంటలు విచ్చలవిడిగా శృంగారంలో పాల్గొని, కొత్త కోర్కెలతో వేళాపాళా లేకుండా సరియైన ఆహార నియమాలు పాటించకుండా విహరిస్తే అనారోగ్యం పాలయ్యే అవకాశం ఎక్కువగా వుండడంవల్ల పెద్దలు ఆషాడమాసంలో కొత్తగా పెళ్ళయిన భార్యభర్తల్ని ఆ నెలరోజులు దూరంగా వుంచాలని నిర్ణయించేరనిపిస్తుంది. ఇదికాక కొందరు ఆషాడమాసంలో ఒకవేళ నెలతప్పితే అమ్మాయిపురిటి రోజులు మంచి ఎండలలో వస్తుందని, వేసవికాలం తల్లి, పిల్లలకు తాపం భరించడం కష్టమని దూరాలోచనతో ఆషాడం, శ్రావణమాసాలు నోములని, వ్రతాలని భార్యభర్తలని దూరంగా వుంచుతారని కూడా కొందరు చెప్తారు.

మొత్తంమీద ఆషాడం, శ్రావణమాసాలంటే కొత్తజంటలకు గుండె దడగానే వుంటుంది. ఆషాడం వెళ్లేక కొత్తల్లుడికి ఆషాడ పట్టీ అని, కొత్త కోడలకి శ్రావణపట్టి అని పేరుతో బహుమతులు, బట్టలు, నగలు అందజేసి పెద్దలు పిల్లల్ని సంతోషపెడతారు. ఆషాడమాసం వస్తోందంటే ఆరోగ్యరీత్యా బయట హోటళ్లలో, రోడ్డుపక్క మిఠాయి,అంగళ్లలో అమ్మే తినుబండారాలు, నూనెతో వండిన వస్తువులు తినడం అంత మంచిదికాదు. ఇంట్లో వండిన పదార్థాలు కూడా మిగతా కాలంలోలా ఎక్కువ తినకుండా మితంగా తింటే ఆరోగ్యంగా వుండి డాక్టరు అవసరం, మందుల అవసరం రాదు. అలాగే ఆషాడంలో గోరింటాకు పెట్టుకోవడం కూడా ఆరోగ్యానికి మంచిదనే దాన్ని ఒక ఆచారంగా మార్చారు. గోరింటాకు శరీరానికి వేడిమిస్తుంది. ఈ ఆచారాలను పాటిస్తూ, ఆరోగ్యాన్ని కాపాడుకుందాం. ఆషాడాన్ని చక్కగా సాగనంపుదాం!

(ఆంధ్రభూమి దినపత్రిక - ప్రియదర్శిని - 2-7-2003)

❁ ❁ ❁

శ్రావణ మాసం వస్తోంది !

ఒకప్పుడు శ్రావణభాద్రపదాలు వస్తున్నాయంటే ప్రజలు ముందుజాగ్రత్తతో పొయ్యిలోకి కట్టెలు, బొగ్గులు, వంటసామాగ్రి అయిన బియ్యం, పప్పులు, ఉప్పులు అన్నీ తెచ్చుకని వర్షాలు, ముసురు మూలంగా బయటకు వెళ్లలేమోనని భయపడేవారు. వర్షాల మూలంగా సరుకులు రవాణాకి ఆటంకం కలిగి కొన్ని సరుకులు మార్కెట్లో దొరకవేమోననే భయంకూడా వుండేది. అప్పుడు వర్షాలు కూడా అలాగే కురిసేవి. నేడు కాలం మారడంవలన సంవత్సరంలో ఎక్కువకాలం ఎండలు, కొద్దిగా చలి అనుభవిస్తున్నాం. కానీ వర్షాలు ముసుర్లు చూడడంలేదు. ఒకప్పుడు తుఫాన్లకి, గాలివానలకు జడసిన ప్రజలు ఈ రోజు పెద్దతుఫాను వచ్చినా, వర్షము పడినా బాగుండునని తలపోసే దశకు చేరుకొన్నారు.

శ్రావణమాసం వచ్చేసరికి వాతావరణం చల్లబడి పచ్చని పంటపైర్లతో, పచ్చని చెట్లతో భూమి పులకరించి ప్రకృతి రమణీయంగా గోచరించేది. పచ్చని వరిపైర్లతో పల్లెలు కళకళలాడేవి. రైతులు, కూలీలు క్షణం ఖాళీలేకుండా పొలంపనులలో నిమగ్న మయ్యేవారు.

ఇక శ్రావణమాసం వస్తోందంటే స్త్రీలకు, ఆడపిల్లలకు క్షణం తీరిక వుండేది కాదు. శ్రావణమాసం నోములు వ్రతాలని వీధి గుమ్మాలకు పసుపు కుంకుమలతో అలంకరించి, మామిడితోరణాలుకట్టి, చిన్న చిన్న పిల్లలు కూడా పట్టుపరికిణీలు ధరించి నోము నోచుకొనేవారు. శ్రావణ మంగళవారంనాడు పేరంటాళ్ళను ఇంటికి పిలచి, మొలకెత్తిన పెసలుకాని, సెనగలుకానీ, బఠాణీలుకానీ తమలపాకులు, వక్కతో పేరంటాళ్ళకి ఇచ్చి ఎంతోసరదాగా నోముజరుపుకొనేవారు. శ్రావణమాసంలో స్త్రీలు పసుపుపారాణిలతో, పట్టుచీరల అందాలతో మహాలక్ష్మిలా హుందాగా నడచి వెళుతూ వుంటే పెద్దలు ఎంతగానో ఆనందించి ముచ్చటపడేవారు. అమ్మాయిలు జడగంటలువేసుకొని, పట్టులంగా, ఓణీలతో సిగ్గులుఒలకపోస్తూ హంసనడకలు నడుస్తూ వుంటే కుర్రకారు చాటుచాటుగా అమ్మాయిల అందాలనుచూసి మురిసిపోయేవారు. ఆ రోజుల్లో అమ్మాయిల చదువులకు అంత ప్రాధాన్యత లేకపోవడంతో ఎక్కువగా ఇళ్ళల్లో వుంటూ తల్లిచాటు బిడ్డల్లా పెరుగుతూ తల్లికి సాయంగా వుండేవారు. బయటకు ఒంటరిగా ఎక్కడికీ వెళ్ళేవారుకాదు. మగవారు కనిపించినా సిగ్గు బిడాయాలతో కుంచించుకుపోయేవారు. పరాయి మగవారితో మాట్లాడడానికి సాహసించేవారుకాదు. వినయము, విధేయత, సిగ్గు, బిడియమే ఆ రోజులలో అమ్మాయిలకు భూషణంగా వుండేవి. నోములు, వ్రతాలుచేస్తే తల్లికి తోడుగా వుంటూ ఎప్పుడూ యింట్లో కాలక్షేపం చేసే పిల్లలకు శ్రావణమాసం ఆటవిడుపుగా వుండి పేరంటానికి బయటకు వెళితే వారికి ఆనందం కలిగించేది.

శ్రావణమాసంవస్తే ఇంటి ఇల్లాళ్ళకు ఒక పండగ సందడిగా వుండేది. మురిపెం, ముచ్చట్లు తీర్చేభర్తలు వుంటే, బంగారు ఆభరణాలో, పట్టుచీరలో, కావాలని

పట్టుబట్టి కొనిపించుకొనేవారు. ఎంత సామాన్యులైనా కొత్తచీర శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతం సమయానికి కొనుక్కొని ఆనందించేవారు. ఆ రోజుల్లో యింకా ఉమ్మడి కుటుంబ వ్యవస్థ వుండడంవల్ల అత్తమామలు వారి శక్తి కొలది కోడళ్ళందరికీ నగలు, బట్టలుపెట్టి ఆదరించేవారు. ఎంత బీదవారైనా శ్రావణ మాసంలో తప్పక ఒక శుక్రవారమైనా వరలక్ష్మీవ్రతంచేసుకొని పూజ చేసుకోవడం నేటికీ రివాజుగా వస్తోంది.

స్త్రీలకు నగలపై, వస్త్రాలపై మోజుచూస్తే, నేడు పెద్దపెద్ద నగల దుకాణదారులు వస్త్రదుకాణదారులు పోటీపడి రాయితీలు ప్రకటిస్తూ, హోల్‌సేల్ రేట్లకే రిటైల్ అమ్మక మని ఆషాడమాసం నుంచి ప్రకటనలు చేస్తూ మైకుల్లో జనాన్ని హోరెత్తిస్తు ఉంటారు. నేడు పూజలూ వ్రతాలూ ఎలా ఉన్నా మొక్కుబడికి చేస్తున్నా మార్కెట్‌లో బంగారునగలు కొనుక్కోడానికి పట్టుచీరలు కొనుక్కోడానికి మాత్రం పోటీ ఎక్కువగా ఉంది.

శ్రావణమంగళవారం నాడు మచ్చుకు తిందామన్నా ఎక్కడా మొలకెత్తిన పెసలు, శనగలు కనిపించడంలేదు. పసుపుపారాణితో కళకళలాడే పచ్చటి మోము కనిపించడంలేదు. లంగా ఓణీ పట్టుబట్టలతో జడగంటలతో ముచ్చటగా చూద్దామన్నా మచ్చుకు ఒక అమ్మాయి కనిపించడంలేదు. మనవేష,భాషలలో వచ్చిన మార్పుకు తగ్గట్టే శ్రావణమాసం వచ్చినా శ్రావణమేఘాలు కాని వర్షాలుకానీ కనిపించక వర్షం కోసం తపిస్తున్నారు.

(ఆంధ్రభూమి దినపత్రిక - ఆగస్టు - 2003)

❁ ❁ ❁

టైమ్‌లేదు

ఎప్పటినుండో శ్రీశైలం వెళ్దామని అనుకోవడం ఏదో కారణంతో వెళ్ళలేక పోవడం జరిగేది. మా తోడల్లుడు కూతురువాళ్ళు కర్నూలులో ఉంటున్నారని, సంవత్స రం క్రితమే ట్రాన్స్‌ఫర్ అయి వాళ్ళు అక్కడ వుంటున్నారని ఈ మధ్య మా యింటికి వచ్చిన మా శ్రీమతి గారి అక్కయ్యద్వారా తెలియడంతో వారి అడ్రస్సు తీసుకొని కర్నూలు ముందుగావెళ్ళి, అక్కడనుండి శ్రీశైలం, మహానంది, మంత్రాలయం చూడా లని బయలుదేరి వెళ్లాం.

మారుమూల కర్నూలులో వుండడంవలన వారికి బంధువుల తాకిడి అంతగా వుండక మమ్మల్ని చూడగానే ఎంతో పొంగిపోయి ఎంతో సాదరంగా ఆహ్వానించేరు. శైలజ మా శ్రీమతి అక్కయ్యకూతురు. వాళ్ళాయిన రమేష్ అక్కడ స్టేట్‌బ్యాంకులో ఆఫీసరుగా ప్రమోషన్‌పై కర్నూలు వేసేరు. వారికి ఒక కొడుకు, ఒక కూతురు, పిల్లలు టెన్తుక్లాసు ఎయిత్‌క్లాస్ చదువుతున్నారు. రాత్రి 12 గంటలవరకు కబుర్లు చెప్పుకొని అంతా నిద్రాపోయేము. ఉదయమే వంటయింట్లో అలికిడికి తెలివివచ్చి లేచి అటువైపు వంటగదివైపు నా శ్రీమతి నడిచింది. ముఖ ప్రక్షాళనకు నేనూ బ్రష్

పట్టుకొని పెరటిలోకి వెళ్లేను. శైలజ నోటిలో బ్రష్ పెట్టుకొని, ఇంకా ముఖము కడుక్కోకుండానే గ్యాస్‌స్టౌవ్‌పై ఒకవైపు కాఫీ డికాషన్ తీస్తూ రెండవవైపు వంటకు కుక్కరు పెడుతోంది. ఆ దృశ్యం నా కళ్ళబడింది.

తరువాత పిల్లలు ఒకరి తరువాత ఒకరులేచి హడావిడిగా తయారై స్కూలుకి బయలుదేరుబోతుంటే వారికి టిఫెన్ పెట్టి, కేరియర్ సర్దిపిల్లల్ని స్కూలికి పంపించింది. పిల్లలు స్కూలుకి వెళ్లేక మరల వంట చేయడానికి ఉపక్రమించింది శైలజ. నా శ్రీమతి చూసి, అమ్మాయి నువ్వు వెళ్ళి స్నానం చేసిరా! ఈ లోపల కూర తరిగి అన్నీ రెడీచేస్తానని చెప్పినా మీకెందుకు శ్రమ. కబుర్లు చెబుతూ కూర్చోపిన్ని. ఐదు నిమిషాలలో వంటయిపోతుంది. తొమ్మిదిన్నరకు భోజనంచేసి, మీ అల్లుడు బేంకుకి వెళ్తారు. అప్పుడు తీరుబడిగా స్నానంచేసి చీర మార్చుకొంటాను అనడంతో కొంచెం చాదస్తంవున్న నా శ్రీమతి షాకు తిన్నట్లయింది. కొంతసేపటికి శ్రీమతి తమాయించు కుని ఉదయమే స్నానంచేసి రాత్రి కట్టుకున్న బట్ట మార్చుకోకుండా వంటగదిలోకి వెళ్ళడానికి నాకు ఇష్టం వుండదు. మీ బాబాయిగారు కూడా ఉదయం స్నానం చేయనిదే కాఫీ కూడా ముట్టరు తెలుసా! అని ఉపోద్ఘతంగా చెప్పింది. శైలజవిని నవ్వి, 'నేనూ అలాగే చేయాలని అనుకొంటాను పిన్నీ. కానీ టైము చాలదు. పిల్లల్ని ఎనిమిది గంటలకు స్కూలుకి పంపాలి. వారికి కేరియర్, టిఫిన్ అందించాలి, తరువాత శ్రీవారికి తొమ్మిదిన్నర గంటలకు అన్నంపెట్టాలి. అందుకే ముందు వంట వార్పు పూర్తిచేసుకొని వాళ్ళు వెళ్ళిన తరువాతే తీరుబడిగా స్నానంచేసి ఫ్రెష్‌గా తయారవుతాను. ఉదయం నుండి వంటగదిలో ఉండడం వలన చెమటపట్టి అప్పుడే స్నానం చేయాలనిపిస్తుంది. ఇక్కడ అందరూ అలాగే చేస్తారు.' అని సమర్థించుకో బోయింది. ఈ రోజుల్లో గంటల కొలది టివి ప్రోగ్రాములు చూడడానికి, పనికిరాని కబుర్లు, ఇగురుపొరుగు వారితో చెప్పుకోవడానికి, సినిమా పత్రికలు చదవడానికి టైము దొరుకుతుంది. కానీ ప్రతీరోజు ఐదు నిమిషాలు దైవప్రార్థనికి, స్నానం చేయ డానికి మాత్రం టైము కుదరదు. ఇది స్త్రీల విషయమేకాకుండా పురుషులకు వర్తిస్తుంది. క్రమశిక్షణ, మంచి అలవాట్లు, పద్ధతులు నేర్చుకోవాలి. పూర్వము ఏ సౌకర్యాలులేని రోజులలో మన పెద్దవాళ్ళు స్నానం చేయనిదే వంటచేసేవారు కాదు. నేడు గ్యాస్‌స్టౌలు కుక్కర్లు, మిక్సిలు, ఫ్రిజ్‌లు, వంటివి లేని యిల్లులేదు. ఇన్ని సౌకర్యాలున్నప్పుడు బద్ధకాన్ని కొంచెం పక్కనపెట్టి పదినిమిషాలు ముందుగా లేస్తే స్నానంచేసి వంట చేయవచ్చు. చెయ్యాలని పట్టుదల, సంకల్పం వుండాలికానీ టైము లేదని,కుదరదని అనుకోవడం పొరపాటు.

ఈ మధ్య చాలామంది కొత్తగా నైటీలు వేసుకొని పగలు పది గంటలయినా ఆ రాత్రి ధరించిన నైటీలతోనే వుండి, పాలవాళ్ళతో, కూరయాగలు అమ్మేవారితో, ఇరుగు పొరుగు వారితో మాట్లాడటం చూస్తుంటే వొడలు గగుర్పొడుస్తుంది. కొందరు ఇల్లాళ్లు బయటకినుంచి నీళ్ళు తెచ్చుకోవడానికి దగ్గరలో షాపింగ్‌కి రోడ్డుపైకి

నైటీలతోనే దర్శనమిస్తు వుంటారు. కొందరు మాత్రం నైటీ వేసుకొన్న మని గుర్తుకు వచ్చి పైన తువ్వాలుని కప్పుకొని పగలుతిరుగుతారు. నైటీ అంటే రాత్రివేళ ధరించే దుస్తులని పరువుగల ఇల్లాళ్లు పగటిపూట ధరించడం మంచిది కాదు. టూత్‌బ్రష్, నోట్లో పెట్టుకొని వంటకు ఉపక్రమించడం ఘోరాతి ఘోరం, క్షమించరాని నేరం. ఐదు నిమిషాలలో ముగించే కార్యక్రమం ఇతర పనుల మూలంగా పదిహేను నిమిషాలు పడుతుంది. అందుచేత అటువంటి కార్యక్రమాలను ముగించుకొనే వంట చేయడం ఉత్తమం.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 7-1-2004)

❀ ❀ ❀

ఈ నిజం నిష్ఠూరమే !

ఏ గొడవలకైనా, యుద్ధాలకైనా దేనికైనా ఆడవాళ్ళే కారణం. మగవాళ్ళయితే మంచీచెడూ, గౌరవం కోసం చూస్తారు. ఆడవాళ్లలో నిలువునా స్వార్థమే ! భగవంతుడు వారిని ఎలా సృష్టించాడో ! అంటూ ఉపోద్ఘాతంతో సీతారామయ్య ప్రారంభించాడు. అంటే ఈ రోజుపెద్ద రాద్ధాంతమే వాళ్ళింట్లో జరగివుండాలి.లేకపోతే సీతారామయ్య అలా మాట్లాడడు అనుకుంటూ ఇంతకీ ఈ రోజు ఏం జరిగింది అని అడిగేను. నిజం చెబితే నిష్ఠూరంగానే వుంటుంది. జెలసీకి మరోపేరు ఆడది. ఆడదానికి ఆడదే శత్రువు. కాకపోతే ముహూర్తం వరకు వచ్చిన పెళ్లి ఆగిపోవడం ఏమిటి ? కట్న కానుకలు అన్నీ ముందే మాట్లాడుకుని నిశ్చితార్థం టైములో మళ్ళీ ఇంట్లో అందరికీ బట్టలు పెట్టాలి. ఆడబడుచు, అత్తగారి లాంఛనాలు చాలవు, మరొక యాభైవేలు కావాలని పేచీ పెట్టి పీటల మీదకొచ్చిన పెళ్లిని చెడగొట్టేరు. మా నాన్న గారిని, అన్నయ్యని మాట్లాడనివ్వలేదు. బంగారం వంటి సంబంధం తప్పిపోయింది. మా అన్నయ్యని చూస్తే జాలివేస్తోంది.

ఎప్పటినుంచో పెళ్లి పెళ్లంటూ వుంటే ఈ మధ్యే పెళ్ళికి ఒప్పుకున్నాడు. అమ్మాయి కూడా చాలా బాగుంది. ఎంసిఏ చదివింది. సంబంధం తప్పిపోయిందని మేము బాధపడుతూ ఉంటే దీని తాతలు తన్నిన సంబంధం వస్తుంది. పోతేపోనీ అని పెళ్లి చెడగొట్టేరు. రెండేళ్లేయినా మరలా ఇంట్లో ఎవరికీ చీమకుట్టినట్లు లేదు. ఈ రోజు ఒక అమ్మాయిని చూపించేరు. అమ్మాయి ఇంజనీరింగు చదివింది కానీ రూపురేఖాలేదు. దానికితోడు పొట్టి. నాకు ఈ రోజు కోపం వచ్చిఅన్నయ్య పెళ్ళి చెడగొట్టడగానికి మీ ఇద్దరే కారణమని, మా అక్కని, అమ్మని గట్టిగా దులిపసి వచ్చాను"అన్నాడు బాధగా. సీతారామయ్య తన గోడు వినిపించి చివరకు అన్ని అనర్థాలకు స్త్రీలే మూలం, కారణమని చెప్పి రాత్రి ఎనిమిది గంటలయిందని వెళ్ళిపోయాడు. ఎంత ఆలోచించినా సీతారామయ్య చెప్పిన దాంట్లో వందశాతం నిజముందని పించింది. ఆ మధ్య మా ఫ్రెండ్ మూర్తివచ్చిశాంతినివాసంలా వుండే

వాళ్ళింటి నుంచి అన్నయ్య, వదిన ఇల్లు వదలివేరింటి కాపురం పెట్టేరని, దీనికి కారణం వాళ్ళ అన్నయ అత్తగారేనని, ఈమధ్య వాళ్ళత్తగారువచ్చి వారం రోజులున్నారని, ఆవిడ వెళ్లిన పది రోజులకు అన్నయ్య, వదిన వేరింటి కాపురం పెట్టేరని, వారిని ఎంతో ప్రాణంగా చూసినతల్లీ, తండ్రీదీనిని జీర్ణించుకోలేకపోతున్నారని బాధపడుతూ చెప్పేడు.

మగవారు అన్నదమ్ములు కలిపి వుందామనుకున్నా పెళ్లిళ్ళయ్యాక ఆడవాళ్లలో వుండే జెలసీ కారణంగానే ఏదోరకంగా పోట్లాటలుపెట్టి, లేక ఏవో గొడవలు సృష్టించి, కుటుంబం విడిపోయేటట్లు చేస్తారు. వేరింటి కాపురం పెట్టి స్వతంత్రంగా వుండాలనే ఆలోచన ఈ రోజు నూటికి తొంభైతొమ్మిది మందికి వుంటుంది. ఈ కాలం పిల్లలకు పెద్దవాళ్ళు ఇంట్లో అసలు వుండడానికి ఇష్టపడడంలేదు. కన్న తల్లిదండ్రులు ఇంటికి వచ్చినా చుట్టాన్ని చూసినట్లు చూసి ఎప్పుడు వెల్తారా అని చూసే వారెక్కువయ్యారు.

ముసలివాళ్ళు, వయోవృద్ధులైన తల్లిదండ్రులైనా, అత్తమామలను అయినా ఇంటిలో వుంచుకోడానికి ఎవరూ ఇష్టపడడంలేదు. అత్తా ఒకింటి కోడలేనని ఒక రోజు అటువంటి అవసరం మనకి వస్తుందని మగవారు ఆలోచిస్తారు కానీ ఆడవారు ఆలోచించరు.నాకు ఒంట్లో బాగులేదు. నేను ఆయన అంటే పెద్దాయన ఇంట్లో వుంటే వుండను. చాకిరీచేయలేను. ఆయన కావాలో నేను కావాలో తేల్చుకోండి. అని అల్టిమేటంజారీ చేసే మహిళలు నేడున్నారంటే ఆశ్చర్యపడక్కర్లేదు. ఆరోగ్యంగా వున్న అత్తగారుంటే ఇంట్లో చాకిరికి పనికివస్తుందని కొందరు వుంచుకోడానికిష్టపడ తారు కానీ, ఒంటరిగా వున్న మామగార్లను ఇంట్లో వుంచుకోడానికి ఇష్టపడరు. అందుకే నేడు దిన దిన ప్రవర్ధమానంగా ప్రతీ ఊరిలో వృద్ధాశ్రమాలు వెలుస్తున్నాయి.

ఇంకొక చిత్రమేమిటంటే ఈమధ్య చాలా ఓల్డేజ్‌హోమ్స్‌లో నోవేకెన్సీ బోర్డులు కనిపించడం, కొత్తగా కడుతూ వుండగానే బుక్‌అయిపోతున్నాయిన ఒక ఆర్గనైజరు చెప్పడంతో అవాక్కయ్యాను. మగవారిలో సర్దుకుపోయే గుణం వుంటుంది కానీ చాలామంది స్త్రీలలో సర్దుకుపోయేగుణం లేకపోవడం, స్వార్థ చింతనపెరగడంతోనే కుటుంబాలు విడిపోతున్నాయి. ఓర్పు, సహనానికి, మమతానురాగాలకు స్త్రీలే కారణ మయినా నేడు ప్రస్తుత కాలంలో ఆలోచనా ధోరణిమారి ఉమ్మడి కుటుంబాలు సినిమాలలో తప్ప లోకంలో కన్పించడంలేదు. సంకుచిత భావాలతో ఆలోచించే మగవారు లోకంలో వున్నా వేళ్ళతో లెక్కించవచ్చు.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 6-4-2009)

❁ ❁ ❁

టేకిట్ ...లేజీ

ఈతరం పిల్లలకు అన్నీ తెలుసు. తెలియని విషయం అంటూ ఏమీ వుండదు. ఒకటో ఛానెల్ నుంచి వందో ఛానెల్‌వరకూ టివీ చూడటం తెలుసు. ఉదయం

నుంచి రాత్రి వరకూ నిద్రపోవటం తెలుసు. ఎప్పుడు ఏది తినిపించమని అమ్మను అడగాలో తెలుసు. నాన్నను ఎలా నమ్మబలకాలో తెలుసు. కొన్ని తెలియకపోవడానికి కారణం వాళ్ళలో పెరిగిపోతున్నబద్ధకం వాళ్లలో బద్ధకం పెరిగిపోవడానికి కారణం మాత్రం కచ్చితంగా మనం వాళ్ళు నేర్చుకోవాల్సిన సమయంలో, మనం నేర్పాల్సిన విషయంలో చోటు చేసుకుంటున్న అతి గారాబం వాళ్ళను బద్ధకస్తులుగా మారుస్తుంది. పనికొచ్చే విషయాలు వాళ్ళకు తెలీకకాదు, మనం ఎక్కడ ఎలా మసలుకోవాలో మనం చెప్పక పిల్లలు నిజంగా పిడుగులే కానీ వాళ్ళను బద్ధకస్తులుగా మారుస్తుంది నిజంగా మనమే.

ఈ రోజులలో ఒకరు, ఇద్దరు పిల్లవడంవలన వార్ని గారాభంగా పెంచుతున్నారు. పిల్లల్ని అపురూపంగా ప్రేమగా చూడడం సహజం. పూర్వపు రోజులలో వరసగా పిల్లల్ని కనడంవలన తల్లికి ఎంత ప్రేమ ఉన్నా చంటిపిల్లలపై శ్రద్ధ చూపిస్తూ ముందు పిల్లల్ని దూరంగా వుంచేవారు. ఇంట్లో పెద్ద వాళ్ళ అమ్మమ్మో, నాయనమ్మో మేనత్తలు వంటివారు ఉంటే వాళ్ళు వారి ఆలనా పాలనా చూసేవారు. ఇరవైయవ శతాబ్దంలో పుట్టిన పిల్లలు చేతిలో రిమోట్‌పట్టుకుని పుట్టడంవలన వారికి పుట్టిన దగ్గరనుంచి, సీలింగుఫేను, ఎదురుగా బుల్లితెరపెట్టి కనిపించకపోతే పాలుత్రాగరు, అన్నం తినరు. నిద్రపోరు. మూడేళ్ళ వయస్సురాకుండానే రిమోట్ పట్టుకుని టి.వి ముందు కూర్చొని వారికిష్టమైన కార్టును, చానల్సు చూస్తూ అన్నపానీయాలను ఆరగించడం నేడు ప్రతీ ఇంట్లో జరుగుతున్న ముచ్చటే.

పిల్లల్ని స్కూలుకి పంపడానికి వచ్చిన తరువాత పిల్లల అన్నం, టిఫిన్ పెట్టడానికి కన్న తల్లులు పడే అవస్థ చూస్తూ వుంటే జాలివేస్తుంది. నోట్లోముద్ద పెట్టుకు నమిలి మింగకుండా ఆడుతూ పాడుతూ, గెంతుతూ టివీచూస్తూ తల్లుల్ని ఒక ఆట ఆడిస్తూ వుంటారు. తల్లులకు ప్రతిరోజు అన్నం కలిపి తినిపించం కొన్ని గంటలు పనిగా మారింది.

పిల్లలకు ఇలా అలవాటవడం వలన ఏ పండుయిచ్చినా, ఏది తినమన్నా సొంతంగా తినరు. అన్నీ వాళ్ళ తల్లో, ఆయానో నోట్లో పెడితేనే తినే స్టేజికిపిల్లలు వచ్చారు. పిల్లలకు అన్నం కలిపి బాక్సులో పెట్టినా కొందరు పిల్లలు స్కూల్లో తినకుండా ఇంటికి తీసుకువస్తారు. తల్లి ఇంట్లో తినిపిస్తేనే తింటారు. ఈ అలావటు కొందరు పిల్లలో 10-12 ఏళ్ళువచ్చినా ఉండడం గమనార్హం. చిల్లరతిళ్లు మాత్రం ఇష్టంగా ఎవరూ పెట్టకుండానే తింటారు. చాక్లెట్లు, కూల్‌డ్రింక్స్ మాత్రం నోటికి అందించకుండానే లాగించేస్తారు.

ఈ మధ్య చాలామంది తల్లులు పిల్లలపై అతిప్రేమతో వారికి అరటిపండు కూడా ఒలిచి నోటికి తినిపిస్తున్నారు. చాలామంది పిల్లలకు మామిడిపండు పీల్చుకొని తినడం తెలియదు. తల్లులు మామిడిపండ్లను జ్యూసుచేసి వారికి పట్టిస్తున్నారు. 10-17ఏళ్ళు వచ్చినా పిల్లలలో బద్ధకం పెరిగి సపోటాపండుఇచ్చినా, వాటర్‌మెలన్

(పుచ్చకాయ) బొప్పాయి పండుముక్కలుకోసి ఇచ్చినా జూస్‌చేసి ఇస్తే త్రాగుతామని పండు రూపంలో తినేది లేదని కుండబద్దలుకొట్టి మరీ చెప్తున్నారు. బత్తాయి, కమలా పళ్ళు వంటివి ఇస్తే తొక్క వల్చుకొని తినరు. జ్యూస్ తీసిస్తే తాగుతామంటారు. కొందరు పిల్లలు తొక్కతీసి వలచి ఇచ్చినా తినడానికి బద్ధకిస్తారు. శెనక్కాయలు వొల్చుకుతినే రోజుల పోయాయి. బజారులో వొలిచిన పలుకులు కొని వేయిస్తే తినడానికి ఇష్టపడతారు. కాని కాయలు ఇస్తే తినడానికి ఇష్టపడరు.

ఈ రోజు చాలా ఇళ్లల్లో పిల్లలు ఇలా తయారవడానికి తల్లులే ముఖ్యకారకులు. పిల్లలపై అతిశ్రద్ధ, ప్రేమకనబరుస్తూ, వారిని బద్ధకస్తులుగా తయారుచేస్తున్నారు. గత తరం చిన్నతనంలో మామిడిపండు తినడం, సపోటాపండు, బత్తాయి, నారింజ, కమలాలు వంటి పళ్ళు పెద్దలు వొలుచుకు తినడం చూసి నేర్చుకున్నదే తప్ప ఎవరూ నేర్పలేదు. ఈ రోజు బొప్పాయి, పుచ్చకాయ, మామిడిపండు, నారంజ వంటి జ్యూసులు తయారుచేసి పిల్లలకిస్తూ వుంటే ముందుతరం ఆశ్చర్యపోతోంది. పూర్వం జబ్బుపడ్డవారికి, బాగా ముదుసలులకే అలా పళ్ళరసాలుతీసి ఇచ్చేవారు.

పళ్ళు యథాతథంగా తింటేనే బలము, పుష్టిని ఇస్తాయి. జ్యూస్ తీసి ఇవ్వడం వలన కొన్ని విటమిన్లు, మినరల్స్ నశిస్తాయి. దానికి తోడు పళ్ళ జ్యూసులు తయారు చేసి ఫ్రిజ్‌లో వుంచి ఇవ్వడంవలన పిల్లలకు ఆరోగ్యరీత్యా మంచిదికాదు. పళ్ళు, కాయలు పళంగా తినడం పిల్లలకు అలవాటుచేయాలి. ఈ కాలం పిల్లలకి చెరకు ముక్కతినడం తెలియదు. తాటికాయతో ముంజులు తినడం తెలియదు. శెనక్కాయలు వొలుచుకొని తినడంలో వున్న మజా ఎన్ని పలుకులు తిన్నారాదు. కొన్నింటికి రుచి ఒరిజినల్‌గా తింటేనే వుంటుంది. పిల్లలకు బలం, ఆరోగ్యం కూడా ! అందుచేత పిల్లలకు తల్లులు జ్యూసులు, రెడిమేడ్ ఫుడ్స్, ఫాస్టుఫుడ్స్ అలవాటుచేయకుండా ఆలస్యమైనా వాళ్ళంతట వాళ్లు తినేటట్లు, తల్లులు ప్రోత్సహించాలి. వాళ్ళని బద్ధకస్తులుగా మార్చవద్దు. సహజసిద్ధమైన రుచుల్ని ఆస్వాదించేటట్లు చూసి రిమోరుకు దూరంగా వుంచండి.

(ఆంధ్రభూమి దినపత్రిక - ప్రియదర్శిని - 1-7-2009)

❀ ❀ ❀

జనరేషన్ గ్యాప్

అమ్మా అమ్మమ్మ ఇంకా మనింట్లో ఎన్నాళ్ళుంటుందే అంటూ వచ్చిన కళ్యాణి ముఖంచూసి ఆశ్చర్యంగా ఏమే అలా అడుగుతున్నావు. అన్నాను.

అమ్మమ్మ వచ్చిన దగ్గరనుండి మాకు పీస్ ఆఫ్ మైండ్ వుండడంలేదు. అస్తమాను మమ్మల్ని ఏదో ఒకటి అంటోంది! అంది కల్యాణి గోముగా.

ఔనే అమ్మా! పాతచింతకాయ పచ్చడిలా మేము తయారవాలిట. చేతికి ఎప్పుడూ గాజులు వేసుకోవాలిట. పెద్దబొట్టు పెట్టుకోవాలిట,జడవేసుకోవాలిట,

ఆడపిల్లలు ఇలా వుండకూడదు. అలా వుండకూడదు, అంటూ అస్తమానుసాధించి మమ్మల్ని వేధిస్తోంది. అంది చిన్నకూతురు స్వాతి అక్కకు వంతపాడుతూ. వంట చేస్తున్న లక్ష్మీదేవి వారిద్దర్నీ చూస్తూ అలా వుండిపోయింది. తల్లి ముఖకవళికలను చూసి ప్లిలిద్దురూ మెల్లగా నిష్క్రమించారు.

శ్రీనివాస్, లక్ష్మీదేవిలకుముగ్గురు పిల్లలు. ఇద్దరు కూతుళ్ళు. ఒక అబ్బాయి. లక్ష్మీదేవి తండ్రి రాఘవయ్యగారు సంవత్సరం క్రితం మరణించారు. వారి ఒక్క అబ్బాయి అమెరికాలో డాక్టరుగా సెటిలయ్యాడు. వారి ఇద్దరు కూతుళ్ళు ఒకరుఢిల్లీ లోను, మరొకరు హైద్రాబాద్‌లోను భర్తల ఉద్యోగరీత్యా వుంటున్నారు. తల్లి సుబ్బమ్మగారు ఒంటరిగా విజయనగరంలో స్వంత ఇంట్లోవుంటున్నారు. ఏడాది నుంచి బ్రతిమాలగా అతి కష్టంమీద సుబ్బమ్మగారు కూతురు యింటికి వచ్చేరు. వచ్చి పదిరోజులు కాలేదు. అప్పుడే పిల్లలు అమ్మమ్మ బాధ భరించలేకుండా వున్నాము. ఎప్పుడు వెళ్ళిపోతుందని అడుగుతున్నారు. లక్ష్మీదేవికి పిల్లల మనస్తత్వంబాధ కలిగించింది. జనరేషన్ గేప్‌అని నాలుగు రోజులుపోతే వారే సర్దుకుంటారని తలపోసింది.

కానీ చిలికి చిలికి గాలివానలా తయారై రోజూ ముగ్గురు పిల్లలు తల్లితో వాదించడం, ఆమెను చులకనచేసి మాట్లాడడం చూసి సహించలేక ఒకసారి ఎదిగిన పిల్లలనిద్దర్నీ మందలించేసరికి వారు చిన్నబుచ్చుకొని తల్లితో మాట్లాడడం మాని వేశారు. ఇదంతా గమనించి శ్రీనివాస్, పిల్లల మనసులు గాయం కాకూడదని, భార్యను ఒప్పించి మెల్లగా అత్తగారిని ఏదోసాకు చెప్పి దిగబెట్టి వచ్చేడు. ఈ రోజులలో ఇటువంటి సమస్యలు చాలామందికి ఎదురవుతున్నాయి. పిల్లలకు పెద్దవాళ్ళ పోకడ, రాకడ నచ్చడంలేదు. పిల్లల చిన్నతనంనుంచి ఇంట్లో తాతలు, అమ్మమ్మలు, నాయనమ్మలు వుంటే వారి పెంపకం, నడవడి ఒకరకంగా వుంటాయి. మొదటినుంచి వేరింటి కాపురాలు వుండి, పిల్లలు ఎదిగి ఒక వయసు వచ్చేక యింటికి తాతలు, అమ్మమ్మలవంటి పెద్దలువస్తే పిల్లలకి ఇబ్బందికరంగానే వుంటుంది. ఇంట్లో పెద్ద వాళ్ళు వుండడంవల్ల వాళ్ల ఫ్రీడమ్ పోయినట్లు మొదట ఫీలవుతారు. దానికితోడు మంచి మనసుతో పిల్లలు క్రమశిక్షణగా వుండాలని, స్త్రీలకు అలంకారాలైన గాజులు, బొట్టుపెట్టుకోవాలని, హైందవ సాంప్రదాయాలు, కాపాడాలని పెద్దవాళ్లు సలహాలిస్తూ వుంటారు. కాని నేడు కాన్వెంటులలో చదివేపిల్లలకు, కాలేజీలలో చదివేపిల్లలకు బామ్మల సలహాలు రుచించవు రోజూ పెరుగుతున్న నవనాగరికత ఫేషన్లు, సినిమా తారలను అనుకరించడానికే వారు ప్రయత్నిస్తారు. అందుచేత పిల్లల తిండి విషయంలోకాని, కట్టుబొట్టు విషయంలోకాని పెద్దల జోక్యాన్ని వారు సహించలేకపోతున్నారు. ఒకచోట గతిలేక తప్పనిసరిగా వుండవలసివచ్చినపుడు పెద్దలే సర్దుకుపోయి, పిల్లల విషయంలో జోక్యం చేసుకోకుండా, చూసీ చూడనట్లువుంటే ఏ గొడవలు లేకుండా ఆ యింట్లో కొన్నాళ్ళు వారు వుండగలుగుతారు. ఈ రోజులలో కొత్తగా జనరేషన్ గేప్ అనే పదం ఒకటి వినిపిస్తోంది. పిల్లల్ని ఏమైనా అన్నా మీ రోజులువేరు

మీకాలం వేరు, పాత చింతకాయపచ్చడి రోజులు పోయేయి. అమ్మాయిలు చంద్ర మండలంవెళ్ళి వస్తున్నారని పెద్దలకే పాఠాలు చెబుతారు. వృద్ధులు, పెద్దవాళ్ళు పిల్లల ఇంట్లో వారితో వుండవలసి వచ్చినప్పుడు, వారిమాటకు గౌరవం లేనప్పుడు పరిస్థితుల బట్టి సర్దుకుపోవడం మంచిది. ఒకచోట వున్నప్పుడు జిహ్వాచాపల్యాన్ని కూడా అదుపులో పెట్టుకొని, వీలైనంత తక్కువ మాట్లాడుతూ, శక్తివుంటే ఆడవాళ్లు ఇంట్లో పనిలోను, మగవారు బయట బజారు పనులలోను పిల్లలకు సాయం చేస్తే వారూ సంతోషిస్తారు. ఒక వయసు వచ్చేక, అంటే రిటైర్మెంట్ అయాక మనసును ఆధ్యాత్మిక రంగంవైపు మరల్చి, చెడు వినవద్దు చెడు కనవద్దు, చెడుమాట్లాడవద్దు అనే సూక్తులు గుర్తించుకొని ఆచరిస్తే వారి జీవితం హాయిగా గడుస్తుంది. లేకపోతే కష్టాలు తప్పవు.

(ఆంధ్రభూమి దినపత్రిక - ప్రియదర్శిని - 24-9-2003)

❋ ❋ ❋

ముద్దుకూ హద్దుండాలి !

ము ము ముద్దంటే చేదా! నీకా ఉద్దేశం లేదా! అని పూర్వం సినిమాలో పాట వుంది. ఆ రోజులలో కుర్రకారుల్ని ఆ పాట ఎంతో ఉర్రూతలూగించింది. పాట అంతలా ఉర్రూతలూగించినా ఆ కాలపు హీరో ఆ అమ్మాయిని ఒక ముద్దయినా పెట్టుకోలేదు. కానీ ఈ కాలంలో సినిమాలో అలాటి వినసొంపైన పాటలు లేకపోయినా హీరోగారు హీరోయిన్ని ఎక్కడకావలిస్తే అక్కడ ముద్దుపెట్టుకొని హీరోయిన్‌ని హత్తుకు పోతున్నాడు. హీరోయిన్‌కూడా కురచగుడ్డలతో బాగానే సహకరిస్తోంది. రామాయణంలో పిడకల వేటలా పిల్లల ముద్దుగురించి చెప్పబోయి, పెద్దల ముద్దులలోకి పొరపాటున వెళ్ళేను. అందుకే ముద్దుకు హద్దుండాలి.

విజయవాడలో మేమున్నపుడు మా పక్క పోర్షన్‌లో ఒక కుటుంబం వుండేది. వారికి ఒక కొడుకు కూతురు వుండేవారు. ఇద్దరు పిల్లలు చూడముచ్చటగా వుండేవారు. వారిని ఆ తల్లిదండ్రులను ఎంతో అపురూపంగా పెంచేవారు. ఆ అమ్మాయి, అబ్బాయి కూడా కాలేజీ, ఇల్లు తప్ప వారికి ఏమీ తెలియవు. పొరపాటున కూడా ఇరుగు,పొరుగు ఇంటికికానీ, పక్కనున్న మా యింటికి కానీ వచ్చేవారు కాదు. వారు ఇంట్లో వున్నా మాటలు కూడా గట్టిగా వినిపించేవికావు. తండ్రికి ఏదో ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం అవడంవలన ఉదయం ఎనిమిది గంటలకు బయలుదేరి రాత్రి ఎనిమిదిటికి ఇల్లు చేరేవారు. వారానికొకసారి కూరలు ఇంటికి కావలసిన సామాన్లు తెచ్చి ఇంట్లో అతను పడవేస్తే, ఆ ఇల్లాలు ఉదయం నుండి సాయంత్రం వరకు ఇంటి చాకిరీ చేస్తూ నీళ్ళు మోస్తూ పిల్లలకు అన్నీ అందిస్తూ ఎంతో గారాబంగా పిల్లల్ని పెంచేవారు.

అబ్బాయి ఇంజనీరింగు చదువుతున్నా, అమ్మాయి ఇంటర్మీడియట్ చదువుతున్నా చదువు తప్పా ఇంట్లోపూచిక పుల్ల ఇటునుంచి అటు పెట్టేవారుకాదు. తల్లి,

తండ్రి కూడా వారికి ఎటువంటి పనీ చెప్పేవారు కాదు. పైగా మంచినీళ్ళు దగ్గర నుండి వారికి అందించేవారు. బట్టలు ఉతుకుతూ బండెడు చాకిరి ఇంట్లో చేస్తున్నా కూతురుకాని, కొడుకుకాని తల్లిపై జాలిపడి సాయంచేస్తానని అనకపోవడం చాలా ఆశ్చర్యం కలిగించేది. కరంటుబిల్లు కట్టాలన్నా టెలిఫోను బిల్లు కట్టాలన్నా ఆ ఇంటి యజమానికి వీలుకాకపోతే అతని భార్య వెళ్ళి కట్టేవారు కాని పిల్లలువెళ్ళి కట్టకపోవడం చాలా ఆశ్చర్యాన్ని కలిగించేది.

మా ఇంట్లో మా పిల్లలు వారికన్నా చిన్నయినా అన్ని పనులలో సాయంచేసేవారు. కుళాయివస్తే వాళ్లే సెలవురోజులలో బిందెలు, బకెట్లు నింపేవారు. ఏది అవసరమైనా, ఇంట్లో లేకపోయినా తెమ్మంటే పక్క బజారులో వున్న పచారి కొట్టుకు వెళ్ళి కావలసిన సామాన్లు తెచ్చిపెట్టేవారు. ఘోషాస్త్రీలవలె ఆ పిల్లలిద్దరూ ఇంట్లో అలా వుండడం చూడలేక ఒకసారి మావారు ఊరుకోకుండా పిల్లల్ని మీరు అంత గారాబంగా పెంచుతున్నారు. రేపు జీవితంలో దెబ్బతింటారు చూసుకోండని చిన్న మాట అన్నారు. దానికి ఆ పిల్లలతండ్రి నవ్వి, మా పిల్లలకు సైకిలు కూడా రాదండి. దానికితోడు వారికి టాన్సిల్సు ఆపరేషన్ చేయించాము. ఎండలో ఎక్కువగా తిరిగితే మంచిదికాదని అన్ని పనులు మేమే చేసుకొంటాము. అయినా మనకి ఓపిక ఉండగా పిల్లల్ని కష్టపెట్టడమెందుకండీ అనడంతో మేమిద్దరం అవాక్కయ్యేము.

ఏదో గుండె, ఊపిరితిత్తులు ఆపరేషన్ చేస్తే అపురూపంగా చూసినట్లు, ఎప్పుడో పిల్లలకు టాన్సిల్సు ఆపరేషన్ చేయించామని అందుకు వారిని బయటకు పంపకుండా అపురూపంగా ముద్దుచేసే ఆ తల్లిదండ్రులకు జోహారులర్పించేము. ఇంట్లోను, చుట్టుప్రక్కల ఎవరితోను మాట్లాడని వారు కాలేజీలో ఎలా చదువుతున్నారో, సాటి పిల్లలతో ఎలా మెలుగుతున్నారో తలచుకుంటే అర్థమయ్యేది కాదు. సెలవు రోజులలో ఉదయం 9-10 గంటలకు నిద్రలేచేవారు. ఇలా పెరిగిన వారు రేపు భవిష్యత్తులో అమ్మాయికి పెళ్ళయితే అత్తవారింట్లో ఎలా వుంటుందని, అబ్బాయి ఇంజనీరింగ్ పూర్తిచేసేక ఉద్యోగవంవస్తే ఎలా చేస్తాడని, అమ్మ నాన్న అక్కడ తోడు వుండరు కదా అని ఆలోచనవచ్చి మా వారితో అంటే కందకి లేని దురద కత్తిపీటకెందుకు అని నన్ను ఎగతాళిచేసేరు.

కొందరు పిల్లల్ని ఎంతో అపురూపంగా చూసుకొని ముద్దుగా, గారాబంగా పెంచుతారు. ఎంత గారాబం, ముద్దువున్నా వారికి లోకజ్ఞానం కలిగేటట్లు చేయాలి. కష్టం, సుఖం తెలియాలి. డబ్బువిలువ తెలియాలి. బంధుత్వాలు, స్నేహాలు తెలియాలి. నలుగురితో కలిసి మెలిసి తిరగాలి. సరదాగా అందరితో మాట్లాడాలి. నన్ను ముట్టుకోకు నా మాలకాకి అన్నట్లుగా మెలగకూడదు. అలా అతి ముద్దుగా పెరిగితే బయట లోకం తెలియక సులువగా మోసపోతారు. కూరగాయలు, పళ్ళు అమ్మేవారు వెర్రి బాగులవారని తెలిస్తే పది రూపాయలు ఖరీదుచేసేది పాతిక రూపాయలకు అంటకట్టడమే కాకుండా పనికిరానివి కూడా అంటకడ్తారు. తల్లి తండ్రీ పిల్లలను

తమతో బజార్లకు, బంధువులింటికి, స్నేహితులింటికి తీసుకువెళ్ళి మంచి, చెడు అన్నీ చెప్పాలి. ఎవరితో ఎలా మెలగాలో, ఒకరింటికి వెళ్ళినపుడు ఎలా ప్రవర్తించాలో ఎలా మాట్లాడాలో అన్నీ నేర్పించాలి. అలా నేర్పిస్తేనే పిల్లలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతారు. లేకపోతే కూపస్థ మండూకాల్లా తయారవుతారు.

కొందరు తమపిల్లలు బాగా చదువుతున్నారని, మంచి మార్కులు తెచ్చుకొంటు న్నారని పొంగిపోతూ గర్విస్తారు. కాని లోకజ్ఞానం లేకపోతే పైసాకి పనికిరారని వారికి తెలియదు. కొందరు డబ్బుందని పిల్లలు అడిగిందే తడవుగా కొండమీద కోతినైనా తెచ్చి ఇచ్చి గొప్పగా వారి పిల్లల గురించి చెప్పుకొంటారు. ముద్దుకు హద్దుండాలి. నలుగురితో పిల్లల్ని కలిసిపోనివ్వాలి. ఆడుకోనివ్వాలి. ఆటపాటలకు, చదువులకు ఆస్తులు, అంతస్తులు పనికిరావు. అలా నలుగురితో కలసిమెలసి తిరిగిన వారే జీవితంలో రాణిస్తారు. గొప్పవారవడానికి అవకాశం వుంది. అందుచేత పిల్లల్ని అతి ముద్దుచేసి చెడగొట్టవద్దు. ముద్దుకు హద్దుండాలి.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 25-5-2003)

❁ ❁ ❁

రోజులు మారాయి

మా చిన్నతనంలో వేసవి శెలవులు వస్తున్నాయంటే పండగ, సంబరంగా వుండేది. వేసవి శెలవు లివ్వగానే అమ్మమ్మగారింటికి వెళ్లడం, అక్కడ శెలవులకి మా పిన్ని,దొడ్డమమ్మగారి పిల్లలు రావడం, మా మామయ్య పిల్లలు అంతా కలియడం బలే సందడిగా వుండేది. సాధారణంగా అంతా వేసవి శలవులలోనే తప్పక కలిసేవారు. ఆ రోజులలో అభిమానాలు, ఆప్యాయతలతో ఒకరినొకరు పలుకరించుకొని పొంగి పోయేవాళ్లం. మా అమ్మమ్మ తాతగారి సందడి ఇంతా అంతా కాదు. మా అమ్మమ్మ అత్త, అమ్మవాళ్ళంతా వంటయింటికే అంకితమై రకరకాల వంటలుచేస్తూ అతుక్కు పోయేవారు. మా తాతగారు అందరికీ మనుమలు, మనవరాళ్ళు వచ్చేరని చెప్పి మురిసిపోతూ తాటిముంజులు, ఈతకాయలు, చెరుకుముక్కలువంటివి తెప్పించే వారు. ఇంట్లో పిండివంటలతోపాటు మధ్యమధ్య తాతగారు తెప్పించినవి తింటూ వుండేవాళ్ళం. పిల్లలంతా కలిస్తే అదొకవేడుక. ఎండగా వున్నప్పుడు ఇంట్లోకూర్చుని, అష్టా చెమ్మా, పులిమేక, వైకుంఠపాళి, చింతపిక్కలు, గచ్చపిక్కలతో ఆటలాడుకొని కొంత సేపు తగవులాడుకొని మరల కలసిపోవడం ఒక ఆనందం. తాతగారు కాళ్లుపట్టించు కొని కథలుచెబుతూ చదరంగంవంటి ఆటలునేర్పి హాస్యాలు చేసేవారు. మామిడిపళ్లు వస్తే తియ్యగా వున్నాయోలేదో రుచి చూడమని ఒకపండు యిచ్చేవారు. మామిడి పండుపుల్లగావున్నా అలా చెబితే కొనరేమోనని తియ్యగా బాగున్నాయని చెప్పి అబద్ధ మాడి పళ్ళు కొనిపించుకుని తినేవారం. ఆ రోజులు తలచుకుంటే ఆశ్చర్యంతోపాటు నిజంగా ఈ జన్మలోనే జరిగినవేనా అనిపిస్తుంది.

సాయంత్రమయ్యేసరికి నాలుగుస్తంభాలాట,దొంగాట, కోతి కొమ్మాచ్చాట, జూర్బాల్, బిళ్లకర్ర వంటి ఆటలు ఆడుకునేవాళ్లం. ఆడపిల్లలైతే చెమ్మచెక్క, తొక్కుడు బిళ్ల, వొప్పులగుప్ప వయారిభామ, దొంగాటలాటి ఆటలు ఆడేవారు. ఒక్కొక్కసారి తమాషాకి మామయ్య కూతుళ్ళు, అక్కవాళ్ళతో ఆడారి ఆటలు ఆడటం, వారితో మధ్యలో గొడవపడటం, పెద్దవాళ్ళతో అక్షింతలు వేయించుకోవడం భలే తమషాగా వుండేది.

ఆ రోజులలో సీలింగుఫేన్లు వుండేవి కాదు. ఒక టేబుల్‌ఫ్యాను మాత్రం యింట్లోవుండేది. భోజనాల టైములో తాతగారు ఆ ఫేను తన గదిలోనుంచి తెచ్చి హాలులో వుంచి మరల దాన్ని భద్రంగా తన పడకగదిలో దాచేవారు. రాత్రయ్యేసరికి ఏడుగంటలకే పిల్లలకు భోజనాలుపెట్టి వాకిట్లో మంచాలువేసి పక్కలువేసేవారు. రాత్రి అమ్మమ్మ పక్కలోనో, దొడ్డమ్మపక్కలోనో చేరితే మంచి మంచి కథలుచెప్పేవారు. నీతిపద్యాలు శ్లోకాలు చెప్పేవారు. లేకపోతే ఎక్కాలు అప్పచెప్పమని పిల్లలకు పోటీ పెట్టేవారు. పది సంవత్సరాలలోపు వయసులో నేర్పిన సుమతీశతకపద్యాలు, వేమన పద్యాలు, కృష్ణశతకపద్యాలు ఇంకా గుర్తున్నాయి. ఆ వయసులో చూసిన దృశ్యాలు, విన్న పద్యాలు, కథలు మనోఫలకం మీద అలా వుండిపోతాయి. అందుకే పూర్వం రోజులలో యైదు సంవత్సరాల వయసులోనే గురుకుల విద్యకి పంపేవారు. గురువులు చెప్పిన పాఠాలు బాగా ఒంటపట్టి కంఠస్తం వచ్చి జీవితాంతం మరచిపోయేవారు కాదు. ఆ రోజులలో టీవీలు కాని, టేపురికార్డర్లు కానీ యింకా లేకపోవడంవల్ల పెద్దవాళ్లు చెప్పినమాటలు, కథలు నీతులపైనే మనసు లగ్నము చేసుకొని వినడం జరిగేది. కనీసం ఫ్రిజ్ కూడా ఇంట్లో వుండేదికాదు.

కొత్తకుండలో నీరు త్రాగితే తియ్యగా మట్టివాసనతో కొత్త రుచులనిచ్చేది. సాయంత్రంవేళ ఏటిఒడ్డున షికారు, తోటల వెంటబడి తిరుగుతూ మామిడికాయలు, ఉప్పు, కారం అద్దుకుతినడం ఆనందంగా వుండేది. తాతగారు అప్పుడప్పుడు ఎక్కడ నుంచో జీడిపళ్ళు, పనసపళ్లు, తెప్పించేవారు. పాలేరు పనసపండుచేతికి నూనె వ్రాసుకొని కోసి పనసతొనలు తీస్తూ వుంటే వింతగా చూస్తూ పండు వలవడం పూర్తయ్యేసరికి మూడువంతులు తొనలు పిల్లలంతా కలిసి ఆరగించేవాళ్లం. ఆరోజు లలో తిళ్లు, ఆ రుచులు తలచుకొంటే ఇప్పటికీ నోరు వూరుతుంది. అన్నీ తాజా కూరలు, తాజాపళ్ళు, తాజా పాలు అన్నీ తాజాగా లభించడంవలన రుచికి రుచితో పాటు ఆరోగ్యం కూడా లభించేది. డాక్టర్ల అవసరం ఎప్పుడోకానీ, వుండేదికాదు. చిన్నచిన్న రుగ్మతలేమైనా వచ్చినా అమ్మమ్మ తాతగారు మిరియాల కషాయం, కరక్కాయ, తేనె, వాము, మెంతులుతో లేహ్యాలు తయారుచేసి గృహవైద్యం చేసేవారు. రోగాలు అలాగే తగ్గిపోయేవి.

శలవులలో పిల్లలంతా పదే పదే సినిమా చూపించమంటే మామయ్య ఒకటో, రెండో సినిమాలు చూపించేవారు. తాతగారు, మా అత్త కాశీమజిలీకథలు, మదన

కామరాజుకథలు చెప్పేవారు. తాతగారు కాశీమజిలీ కథలు చదవమని ప్రోత్సహించే వారు. ఆ కథలు చదవడంవలన విజ్ఞానము, వినోదముతోపాటు చక్కని తెలుగు భాష వచ్చేది. కాశీమజిలీ కథలు వింటున్నా చదువుతున్నా ఎంతో ఆనందంగా వుండి ఏవేవో వింత లోకాలోకి విహరింపచేసేది. ఆ మధురస్మృతులు తలచుకొంటేనే ఒడలు గగుర్పొడుస్తుంది.

రోజులు మారేయి. వేసవి శలవులొస్తున్నాయంటే నేడు జనం హడలిపోతు న్నారు. ఒకపక్క హడలెత్తిస్తున్న మండుటెండలు, మరొకవైపు నీళ్ళసమస్య, మరొకవైపు కరెంటుకోత, దానికితోడు పిల్లల అల్లరి భరించడం కష్టంగా వుంటోంది. పిల్లలకు పళ్లు, పాలు అక్కర్లేదు. మాగీలు, రస్నాలు, కూల్‌డ్రింకులే కావాలి. ఆటలు, పాటలు ఆ కథలు అక్కర్లేదు. టీవి ఉంటేచాలు. రిమోట్‌పట్టుకొని మూడేళ్లపిల్లాడి దగ్గర్నుంచి టివికి అతుక్కుపోతారు.

పిల్లల అల్లరి భరించలేక పెద్దవాళ్లు వారికి లొంగిపోయి వారిష్టప్రకారమే నడచుకునే రోజులు వచ్చేయి. రోజులు మారాయని గడిచిన రోజులే మంచివని తలపోస్తూ కాలం గడపడంకన్నా మనం చేసేది లేదు. ఒకరోజు తల్లిదండ్రులు పిల్లలకి వేసవి సెలవులిస్తే బాగుండునని తలపోసేవారు.

కాని నేడు ఎంత వేగిరం స్కూళ్లు తెరుస్తారా ! పిల్లలను స్కూలుకు తరిమేద్దామని పిల్లల అల్లరి భరించలేక తల్లిదండ్రులు వాపోయే రోజులువచ్చాయి.

(ఆంధ్రభూమి దినపత్రిక - ప్రియదర్శిని - 5-6-2003)

❋ ❋ ❋

ఆయుష్షు పెరగడం శాపమా ?

ఈమధ్య హైదరాబాద్‌లో ఒకరింట్లో ఒక ఫంక్షన్‌కి వెళ్లడం జరిగింది. స్త్రీలంతా వ్రతపూజలో నిమగ్నమై వున్నారు. చిన్నపిల్లలంతా ఆడుకొంటున్నారు. ఆ రోజు వర్కింగ్‌డే అవడంవలన ఉద్యోగస్తులు, స్కూలు కాలేజీకి వెళ్లే పిల్లలు రాలేదు. సీనియర్ సిటిజన్‌లు మాత్రం అక్కడ పదిమందివరకు చేరాము. మా కుటుంబంలో వయో వృద్ధులైన మా బాబాయి ఇంతలో అక్కడికి మా పిన్నితో కలసి వచ్చారు. మేమంతా లేచి నిలబడి నమస్కరించి సగౌరవంగా ఆయనకి మా పిన్నికి స్వాగతం పలికి కూర్చోవడానికి కుర్చీలు చూపించేము. మా పిన్నిని కొందరు ముత్తయిదువులువచ్చి లోనికి తీసుకెళ్లేరు. మా బాబాయికి ఎనభై ఐదేళ్లు వుంటాయి. ఇప్పటికీ చేతికర్ర అవసరంలేకుండా నడిచి వెళ్తూవుంటారు. పెళ్ళిళ్లకు, పంక్షన్లకుఓపిగ్గా వస్తూవుంటారు.

కొంతసేపు దేశరాజకీయాలపై చర్చసాగింది, తరువాత సినిమాలు, టీవిలపై చర్చ వచ్చి నేటియువత పెడదారి పట్టడానికి పిల్లలకు పెద్దలపై గౌరవం లేకుండా పోవడానికి ఒకకారణమని, అనారోగ్యానికి ఇంట్లో ఇడియట్ బాక్సు కారణమని ఒకాయన ఆవేశంగా తన ఆవేదన వెళ్లబుచ్చారు. మరొకాయన ఈ కాలం పిల్లలు

పెద్దవాళ్లని పట్టించుకోవడంలేదని, కొడుకులున్నా వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలు, తప్పడంలేదని వాపోయారు. మరొకాయన దానికి వంతపలుకుతూ పిల్లలు ఏ అమెరికాలోనో విదేశాలలోనో వుంటూ దగ్గరలేకపోతే ఆ దారివేరు. కొందరు దురదృష్టవంతుల పిల్లలు ఇండియాలో వుండి కూడా పిల్లలతో వుండకుండా ఈమధ్య మనవాళ్ళ కుటుంబాలలో కూడా ఈ జాడ్యం మొదలైంది. అన్నారు.

అప్పటివరకు మౌనంగావున్న మా బాబాయి ఒక్కసారి పెదవి విప్పారు. అందరూ పిల్లల్ని తప్పుపడుతున్నారుకానీ అసలు విషయం ఆలోచించడంలేదు. ఈ రోజుల్లో ఎనభైఏళ్ళకిపైగా బ్రతికేవారి సంఖ్య పెరుగోతంది. భారతేదశంలో సగటు అయుర్దాయం పెరగడంవలన రిటైర్డు ఉద్యోగస్తులకు పెన్షన్లు ఇవ్వడానికి గవర్నమెంట్ భయపడుతోంది. ప్రతీఇంట్లో వయసుమళ్లినవారి సంఖ్య పెరుగుతోంది. ప్రతి ఇంట్లో నలభైదాటకుండా పిల్లలకు అనారోగ్యాలు, బీపీ, షుగరు, థైరాయిడ్ వంటి వ్యాధులతో బాధపడుతున్నారు. వారికీ ఓపికలు వుండడంలేదు. వారిని తప్పుపట్టడం కూడా మంచిదికాదు. 60-70 ఏళ్లు వస్తున్న పిల్లలుమాత్రం ఇంకెన్నాళ్ళు చాకిరీ చేస్తారు. అది కూడా మనం ఆలోచించాలి అని అనడం చూసి అక్కడ వున్నవారంతా విని అవాక్కయ్యాం.

కొంతసేపటికి ఆశ్చర్యంనుంచి తేరుకొని కనిపెంచి పెద్దవాళ్ళని చేసిన తల్లిదండ్రులని అవసరానికి ఆదుకోని కొడుకులుండి ప్రయోజనం ఏమిటి ? పున్నామ నరకం నుంచి తప్పిస్తాడని భ్రమతో కదా ఆడపిల్లలున్నా కొడుకుకోసం తపించి పూజలు, వ్రతాలుచేసి కన్నవారెందరో వున్నారు. నేడు ఈ ఉద్యోగాలు, పిల్లల చదువుల వల్ల తెల్లవారుజామున లేచి పిల్లల్ని, భర్తని సాగనంపేసరికి ఇల్లాలిప్రాణం తలనుంచి తోకకి వస్తోంది. పిల్లల్ని బాగా చదివంచాలని తాపత్రయంతో ఇంటికి వచ్చిన దగ్గరనుంచి వాళ్ళతో మరల కుస్తీ పట్టాలి. భార్యభర్తలిద్దరూ ఉద్యోగస్తులైతే ఇక వారి గురించి మాట్లాడుకో అక్కర్లేదు. ఇక ఇంట్లో పెద్దవాళ్ళంటే వారి మంచి చెడ్డలు ఎవరు చూస్తారు? అన్నారు మా బాబాయి.

ఇంతలో మరో పెద్దాయన కలుగజేసుకొని నేను మీతో ఏకీభవించనందుకు క్షమించండి. ఆ రోజులలో కట్టె పొయ్యిలపై ఆడవాళ్లు వంటచేసి పెట్టేవారు. నేడు అన్నీ వంట పరికరాలు వచ్చాక సుఖంమరిగి, టీవీ చూసుకుంటూ ఇంట్లోపనులు మానుకొని కోరి రోగాలు తెచ్చుకుంటున్నారు. డెబ్బై ఏళ్ళపైబడ్డ నా భార్య ఇంకా వంటా వార్పూచేస్తుంది. కానీ మా కోడలు పైపై పనులు చేసేసరికి నాలుగుసార్లు నడుంవాల్చి సాయంత్రమయ్యేసరికి అలసిపోయినట్లు అవుతుంది. వాళ్లాయన వచ్చేసరికి స్నానం చేయకుండా మాసిన చీరతో దర్శనమిస్తుంది. అలా వుండకూడదని చెప్పినావినదు. ఒక్క కొడుకు అవడంవల్ల ఇష్టం వున్నా లేకపోయినా ఆ పంచనే పడి సర్దుకుపోయి వుంటున్నాము అని నిట్టూర్పు విడిచాడు.

మా మేనత్త ఒకామె వుండేవారు. ఆమెకున్న ఒక్క కొడుకుని జాగ్రత్తగా చదివించి ఇంజనీర్‌ని చేశారు. ఆమె ఏరికోరి దగ్గర బంధువుల అమ్మాయిని కోడలుగా తెచ్చుకుంది. రెండేళ్లు అత్తగార్ని బాగానే చూసుకుంది. తర్వాత పుట్టింటికి పురిటికి వెళ్ళి కొడుకుని కని బారసాలయ్యేక అత్తగారింట్లో వుంటే తను కాపురానికి రానని భర్తకి తాకీదు ఇచ్చింది. కోడలు పిల్లాడికి ఐదవ నెలవచ్చినా రాకపోవడంతో అనుమానంవచ్చి ఆ కన్నతల్లి కొడుకుని నిలదీసింది. ఆ అబ్బాయి నీళ్ళు నములుతూ చావుకబురు చల్లగా చెప్పాడు. తల్లికి పక్కవీధిలో వేరొక ఇల్లు అద్దెకు తీసుకొని ఇంట్లోనుంచి పంపాక ఆ కోడలు మరలా ఇంట్లో అడుగుపెట్టింది. ఆ ముసలి తల్లి ఒంటరిగా కాలం వెళ్లబుచ్చుతోంది.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 5-2-22008)

❀ ❀ ❀

ప్రేమంటే ఇదేనా ?

ఈ మధ్య చిన్నపిల్లల అల్లరి భరించడం చాలా కష్టంగా వుంటోంది. ఏడాది లోపు పిల్లలకు పాలు పట్టడంచేత కాక పిల్లాణ్ణి చంకలో వేసుకొని తిరుగుతూ టేపు రికార్డరు పాటలు వినిపించి, టీవి ప్రోగ్రాములు చూపించి తల్లులు నానా అవస్థపడడం చూసేను. అలాగే రెండుమూడేళ్ళ పిల్లలకు అన్నం తినిపించడానికి రోడ్లమీద, మిద్దెల మీద పిల్లలను తిప్పుతూ అన్నం తినిపించడం లేకపోతే వారికిష్టమైన టీవీ ప్రోగ్రాములు పెట్టి తినిపిస్తున్నారు. అంటు సొంటూ అన్నీ మరచిపోయి కలగాపులగం చేయడం చూస్తూవుంటే గట్టిగా నెత్తిమీద మొట్టాలని పిస్తుంది.

మా అమ్మాయిల్ని ఎంతోక్రమశిక్షణతో పెంచి పెద్దచేసి పెళ్ళిచేసి పంపించేను. నా పిల్లలు పెళ్ళయ్యే వరకు నా ఎదుటనిలబడి ధైర్యంగా మాట్లాడేవారు కాదు. అటు వంటిది నా మనుమడు నాకు ఎంతో యిష్టమైన గాజుబొమ్మ పగలగొట్టేడని కోపంతో వాణ్ణి రెండు కొట్టేసరికి మా అమ్మాయి ఎదురుగావచ్చి వెధవ బొమ్మ పోతే పోయింది దానికోసం చంటివాణ్ణి కొడతారా! వాళ్ళనాన్నగారు, బాబాయిలు తెచ్చిన ఖరీదైన బొమ్మలు, నాలుగువందలు, ఐదువందలుయిచ్చి కొన్నవి వాడుకొన్ని గంటల్లో పాడుచేసినా ఎన్నడూ వాడివొంటిపై చేయివేయలేదు. ఎప్పుడో కొన్న పాతగాజుబొమ్మ కోసం వాణ్ణి కొట్టేరని మా అమ్మాయి కంట తడిపెట్టుకొంటే దాన్ని సపోర్టుచేస్తూ, నా శ్రీమతి నామీద విరుచుకుపడడం నన్ను చాలా ఆశ్చర్యపరిచింది.

అప్పుడు నా కర్థమైంది. నేను ఉద్యోగంలో రిటైర్ అవడంకాదు. యింట్లో కూడా నా విలువ తగ్గుతోందని గ్రహించేను. వేసవి సెలవుల్లో పిల్లలు వస్తున్నారంటే ఆనందంగా వుండేది కానీ మనుమల అల్లరి తలచుకుని భయపడేకొద్దీ వచ్చినప్పుడల్లా ఇంట్లో కొన్ని వస్తువులు నాశనంచేసి వెళ్లేవారు. వారికి భోజనం తినిపించడానికి, మరిపించడానికి ఇంట్లో ఎక్కడో మారుమూల దాచిన వస్తువులుతీసి వారికి చూపించి

వాళ్ళచేతులలో పెట్టేవారు. ఇంట్లో టేపురికార్డరు, టీవి, నా పెన్ను, కొన్ని పుస్తకాలు, షోకేసులో కొన్ని బొమ్మలు, ఫోటో ఆల్బమ్‌లు, ఫోటో ఫ్రేములు ఒకటేమిటి వాళ్ళు ఏమి కావాలని అడిగితే అవి తెచ్చి వాళ్ళ తల్లులు వారికి అందిస్తూ వుంటే నా ఒంటి మీద తేళ్లు, జెర్రులు పాకుతున్నట్లు వుండేవి. ఒక్కొక్కసారి బాధ భరించలేక బయటకు వెళ్ళిపోయేవాణ్ణి. ఎన్ని పాడుచేసినా సహించేను కానీ, ఒకరోజు మధ్యాహ్నం పుస్తకం చదివి పక్కన పెట్టుకొన్న కళ్ళజోడుతో ఆడి పగలగొట్టడంతో వెర్రి కోపంతో పిల్లల్ని కొట్టాను.

ఆ రోజు ఇంట్లో అలకలు,యుద్ధ వాతావరణంతో వంట, వార్పు లేకుండా అంతా నాపై కత్తికట్టేరు. నేను ఎంతో శాంతంగా, ఓర్పుగా, నా పిల్లల్ని, భార్యని కూర్చోబెట్టి పిల్లల్ని మరీ అంత గారాబంగా చేయవద్దని, కొన్ని వస్తువులు వారి చేతికివ్వద్దని,ముట్టుకోనివ్వద్దని వారికి చెప్పేవిధంగా చెప్పి చిన్నప్పటి నుంచి క్రమ శిక్షణ నేర్పమని గంటసేపు లెక్చరిస్తే, నా యిద్దరు పిల్లలు ముక్తకంఠంతో వచ్చే ఏడాది నుంచి శలవులకు మేము మీ యింటికి రాములెండి. మా మొగుళ్లు మంచివాళ్లు కాబట్టి సమ్మర్ హాలిడేస్‌లో పంపుతున్నారని వస్తున్నాము. అమ్మపదిసార్లు రమ్మనమని ఉత్తరాలు రాయబట్టి, మీరు ఫోన్‌చేసేరని వచ్చాము కానీ గతిలేక రాలేదు అంటూ కళ్ళనీళ్లు పెట్టుకున్నారు. తప్పంతా నాదేతల్లీ అంటూ లెంపలు వేసుకుని యింట్లో విషయాలు కల్పించుకోకుండా గదిలో భగవద్గీత పుస్తకం పట్టుకు కూర్చున్నాను. మాట, మంచి లేకుండా మీరు పుస్తకం పట్టుకూర్చుంటే మమ్మల్నెందుకు రమ్మన్నారు అంటూ ఇంట్లో అంతా ధ్వజమెత్తారు. చేసేది లేక వారి మాటలు, పిల్లల అల్లరి భరిస్తూ గదినుంచి బయటకు వచ్చేను. మా చిన్నతనంలో పెద్దలు కాళ్లు పట్టించు కుంటూ మంచి మంచి నీతికథలు, పద్యాలు చెప్పేవారు. అది గుర్తుకు వచ్చి కథలు చెబుదామని, ప్రయత్నిస్తే 'సుత్తి'అంటూ బయటకు పరుగుదీసేరు. ఈ హైటెక్ పిల్లలకు నా అరవైయైదేళ్ల అనుభవం ఎందుకూ పనికిరాలేదు. వాళ్ళని ఎలా లొంగదీయడమో అర్థంకాక బుర్రగోక్కున్నాను.

మా చిన్నతనంలో అల్లరిచేసేవాళ్లం. కానీ పెద్దవాళ్లు కళ్లు ఎర్రజేసేసరికి గజగజ వణికి పోయేవాళ్లం. గట్టిగా కసరేసరికి తల్లిచాటుకో, అమ్మమ్మ చాటుకో పిల్లిలావెళ్లి దాక్కునేవాళ్లం. కానీ వీళ్లకి ఎవరి దగ్గరా భయం లేదు. నేడు అందరికీ ఒకరిద్దరు పిల్లలవడంవలన వేలకొలది జీతాలతో ఉద్యోగాలు చేస్తున్న కొందరికి డబ్బు, విలువ పిల్లల పెంపకం తెలియడం లేదు. పిల్లలు అడగిన ప్రతీ వస్తువు, వారు కోరినవన్నీ యివ్వడమే గొప్పగా భావిస్తున్నారు. సంవత్సరం పిల్లవానికి వందల ఖరీదుచేసే దుస్తులు, బొమ్మలు కొనిస్తున్నారు. ఎక్కువరోజులు వాటిని వాడకపోయినా ఏమాత్రం బాధకాని చింతకానీ వారికిలేదు. నాలుగేళ్ల పిల్లవాడు డాడీ కారు కొనుక్కుం దాం అంటే లోన్‌పెట్టి కారు కొన్న తల్లిదండ్రులు నేడు వున్నారంటే అతిశయోక్తికాదు. రోజూ మార్నింగ్ వాక్‌కి వెళ్లేటపుడు నేను రోజూ చేతికర్ర తీసుకువెళ్లేవాణ్ణి. ఆ

చేతికర్ర కూడా పెళ్లిలో కాశీ ప్రయాణానికి గొడుగుతోపాటు అది మా మామగారు యిచ్చారు. గొడుగు చాలా కాలం క్రితం చిరిగిపోతే పారేసేను కానీ ఆ చేతికర్రను పెళ్లి గుర్తుగా భద్రంగా దాచి ఈ మధ్యే మార్నింగ్‌వాక్‌కి వెళ్లేటపుడు వాడడం మొదలు పెట్టేను. నేను మధ్యలో ఏదో పనిమీద రెండు రోజులు ఊరేళ్లే సరికి పిల్లలు యిల్లు పీకి పందిరివేసి మూలనున్న చేతికర్ర తీసి దానితో ఆడి రోడ్డుమీద పారేయడంతో ఈ చేతి కర్రను ఎవరో ఎత్తుకెళ్లారు. విషయం తెలిసేక చాలా దుఃఖించేను. నా పిల్లల దృష్టిలో అది ఒట్టి చేతికర్రే. దానికోసం నేను విలపిస్తూ వుంటే అంతా నన్ను పిచ్చివాడిలా చూసేరు.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – మే,2004)

❁ ❁ ❁

ఒకరికి ఒకరై....

మా ఫ్రెండ్ శేఖర్‌ని, అతని భార్య సుగుణని చూస్తూవుంటే ఎంతో ముచ్చటేస్తుంది. వారిద్దరూ ఒకరికోసం ఒకరు పుట్టేరా! అనిపిస్తుంది. ఎందుకంటే ఇద్దరూ ఆనందంగా వుండడమేకాకుండా వారి అభిరుచులు కూడా ఒకటే. ఆరోగ్యానికి ఆరోగ్యం, ఆధ్యాత్మిక చింతనలో అరవై యిదేళ్ల దాటిన శేఖర్, అరవైలోపబడిన సుగుణలనుచూసి ఒకరోజువారి ఆరోగ్యానికి, సంతోషానికి కారణం అడిగేను.

మావాడు నవ్వి, ఇన్నాళ్ల తర్వాత ఈ ప్రశ్న అడుగుతున్నావేమిటి? అన్నాడు. నేను చిరునవ్వుతో మీ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసినవారంతా సంపదతోపాటు రకరకాల రోగాలను జబ్బులను వెంటతెచ్చుకొని రిటైర్ అవుతున్నారుకదా ! అటువంటిది నువ్వుఈ రోజు కూడా ఆరోగ్యంగా నవ్వుతూ వుండడం నాకేకాక నా శ్రీమతికి ఆశ్చర్యంగా వుంటుంది అన్నాను.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యగారిని తొంబైఏళ్లుదాటినా ఉత్సాహంగా ఆరోగ్యంగా వుండడంలో రహస్యమేమిటని అడిగితే. ఎక్కడున్నా వేళకి భోజనం చేయడం నిద్రపోవడం అని సమాధానం చెప్పారట. ఆయన తొంభై తొమ్మిది ఏళ్లు బ్రతికి ఎన్నో మంచిపనులుచేసి నేటికీ చిరస్మరణీయులయేరు.

మావాడు పనిచేసిన డిపార్ట్‌మెంట్‌లో ఎక్కడికి కాంపుకెళ్లినా మందుతోపాటు ఎన్నోరకాల తినుబండారాలేకాక వాళ్ళ అభిరుచిబట్టి అమ్మాయిల్ని కూడా ఏర్పాటు చేయడమే కాకుండా కొన్ని సమయాలలో పర్సు కూడా అందజేవారట. కానీ మావాడు అటువంటి డిపార్ట్‌మెంట్‌లో పనిచేసినా వీలైనంతవరకు బయట భోజనాలు చేసేవాడు కాదట. చేయవలసి వచ్చినా శాఖాహారము, మితాహారంగానే తీసుకునేవాడట, మందు అమ్మాయిల ప్రలోభాలలో పడకుండా చాలా జాగ్రత్తగా వుండేవాడట. దానికి తోడు అతని అదృష్టవశాన అన్నివిధాల అనుకూలమైన భార్య లభించడంవల్ల, ఆమె కూడా అతనికి సహకరించడం వల్ల వేళకి భోజనంతోపాటు అన్నీ అమర్చి గొంతెమ్మ

కోర్కెలు కోరకుండా సహకరించిందని చెప్పేడు. అతని చేతిలో జీపు, ఇంట్లో పనిచేయడానికి ఆఫీసు ప్యూను వున్నా అవసరానికి తప్పఎప్పుడోకానీ వాడుకొనేవారు కాదట. అందుకు ఆమె సహకారం ఎంతో వుంది, అత్యాశలకు పోకుండా సామాన్యంగా వుండడం ఒక కారణమంటాడు. దానికితోడు యిద్దరికీ బాల్యం నుంచి ఆధ్యాత్మిక చింతన, నీతి నియమాలు, కట్టుబాట్లు వుండడం వల్ల యిద్దరూ వేరొకచోట పెరిగినా వున్నదానితో తృప్తిపొందాలనే నియమంతో హాయిగా కాలం గడిపేవారట.

రిటైర్మెంట్ కాకుండానే ముగ్గురు పిల్లలకి పెళ్లిళ్లు చేసేరు. పిల్లలు కూడా బుద్ధిమంతులు, తల్లిదండ్రులమాట జవదాటని వారవడంవలన ముగ్గురికీ రాజా లాంటి సంబంధాలువచ్చి ఎక్కువ కట్నకానుకలు అవసరంలేకుండానే పెళ్లిళ్లయ్యేయి. వారు పిల్ల పాపలతో కళకళలాడుతూ సంవత్సరానికి ఒకసారి పుట్టింటికి వచ్చివెళ్తూ వుంటారు. అందుకే మావాడి పచ్చటి సంసారాన్ని చూస్తే ముచ్చటేస్తుంది.

కొందరు కక్కుర్తిగా ఊరకేతేరగా వస్తే విపరీతంగా తింటూవుంటారు. అలాగే మందు ఉచితంగా పోస్తున్నారని అదేపనిగా తాగి మందు దాసులవుతుంటారు. మరికొందరు స్వతహాగా శాఖహారులైనా పార్టీలలో విందులలో మాంసాహారాన్నిచూసి జిహ్వాచాపల్యంతో ఆరిగిస్తూ వుంటారు. దీనికి వేళాపాళా వుండదు. యిలా అతిగా భోజనం చేయడం, నేయి, నూనెతీపి వస్తువులు అతిగా తినడం, తగిన వ్యాయామం లేకపోవడం వలన రకరకాల జబ్బులు బి.పి, షుగరు, గుండెజబ్బులు శరీరంలో ప్రవేశిస్తాయి. కొందరు స్వంత డబ్బులతో తినరు, త్రాగరుకాని ఎవరైనా ఏర్పాటుచేసిన విందులలో మాత్రం అతిగా సేవిస్తారు. ఇదే అనారోగ్యానికి కారణం.

కొన్ని డిపార్ట్మెంట్లలో ఉద్యోగస్తులు ఎంతో నీతి, నిజాయితీగా వుండాలను కొన్నా మిగతావారు వుండనివ్వరు. సాటి ఉద్యోగులతోపాటు కస్టమర్లు వారిని నిజా యితీగా వుండనివ్వకుండా వారికున్న వీక్నెస్లకోసం వెతుకుతారు. ఒకవేళ వీళ్ళ వలన పనికాకపోతే ఇళ్లకి వెళ్ళి వారి భార్యలకు బహుమతులు, అందజేసి వాళ్ళద్వారా పనులు జరిపించుకోవాలని చూసే ప్రబుద్ధులు కొందరుంటారు. ఏ ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా వుండేప్రభుత్వోద్యోగులను వేళ్లమీద లెక్కించవచ్చు. పూర్వం నిజాయితీపరులు చాలామంది వుండేవారు. కానీ నేడు ప్రజాప్రతినిధులతోపాటు ఉద్యోగస్తులు నీతి, నియమాలకు తిలోదకాలిచ్చి లంచగొండులవుతున్నారు.

అందుకే కొందరు ప్రభుత్వ ఉద్యోగులను చూడగానే జీతం ఎంత? నాతం ఎంతని అడుగుతుంటారు. ఆమ్యామ్యా బరువుపెట్టటడం, బల్లకింద చేయిచాపడం, చేయి తడపడం, దక్షిణ వంటి పదాలెన్నో లంచాలకు ముద్దుగా చెప్తారు.

ఇంతకీ చెప్పేదేమిటంటే మంచి ఆరోగ్యం, ఆనందం కావాలంటే వున్నదానితో తృప్తిపడుతూ, అత్యాశలకి పోకుండా ఊరకే వస్తోందని తేరగా తినకుండా రోజూ నిర్ణీత సమయానికి భోజనంచేసి కష్టపడి పనిచేసి హాయగా నిద్రపోవాలి. డబ్బు సంపాదనే ధ్యేయంగా పెట్టుకోకూడదు. డబ్బు ఒక్కటే సౌఖ్యాన్నివ్వలేదు. ఆరోగ్యమే

మహాభాగ్యం అనే సూక్తి మరచిపోకుండా ఆరోగ్యానికి ప్రాముఖ్యతనిచ్చి మితంగా భోజనం చేయాలి. ఊరకే వస్తున్నాయని ఎక్కువగా తిని, లేని పోని అలవాట్లు చేసుకో కూడదు. ఇంటి ఇల్లాలితో ఇల్లే స్వర్గసీమగా భావించి, హాయిగా కాపురం చేయాలి. వున్నదాంట్లోనే సంతృప్తి చెందుతూ భార్య, భర్త వున్నదాంట్లోనే సంతృప్తి చెందుతూ భార్య, భర్త పాలు, పంచదారలా కలిసిపోతే సమస్యలు వుండవు.

మాశేఖర్‌లా రోజూ ఉదయం, సాయంత్రం వాకింగ్ వెళుతూ, వున్నదాంతో సంతృప్తి చెందుతూ ఆధ్యాత్మిక చింతన అలవాటు చేసుకొని హాయిగా నవ్వుతూ బ్రతకడం నేర్చుకుంటే మేడ్‌ఫర్ ఈచ్ అదర్ మీరూ అవుతారు. ప్రయత్నించండి. సందేహం లేదు.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 17–3–2003)

❀ ❀ ❀

ఈ తిప్పలు తప్పనివా ?

మా కాలనీలో ఒకవృద్ధ దంపతులున్నారు. పెద్దాయనకి 75ఏళ్లు. ఆయన భార్య రంగమ్మగారికి 70 ఏళ్ళు ఉంటాయి. పెద్దాయనికి సుగరు జబ్బువుంది. ఆయన భార్య రంగమ్మగారికి బి.పి. హార్ట్ ప్రాబ్లమ్ వున్నాయి. వారికి ఒక కొడుకు, ఒక కూతురు వున్నారు. కొడుకు బ్యాంకు ఆఫీసర్. అల్లుడు ఎ.జి.ఆఫీసులో సూపరిన్ టెన్‌డెంట్‌గా ఉద్యోగాలు చేస్తున్నారు. బ్యాంకు ఆఫీసరు ఉద్యోగం అవడం వలన కొడుకు ప్రతి మూడు ఏళ్లకు ట్రాన్స్‌ఫర్లు ఉండడం వలన ఒకచోట ఉండకుండా ఊళ్ళు తిరుగుతూ, ప్రస్తుతం విజయవాడలో ఉంటున్నాడు. అల్లుడికి ఎ.జి. ఆఫీసులో ఉద్యోగం అవడంవలన హైదరాబాద్‌లోనే ఇల్లు కొనుక్కొని స్థిరంగా ఉన్నాడు.

పెద్దాయన (నారాయణమూర్తగారు) హెడ్‌మాష్టారుగా ఉద్యోగంచేసి పదవీ విరమణచేసి,స్వంత ఊరుపై మమకారంతో విజయనగరంలో ఇల్లు కొనుక్కొని కాలం వెళ్లబుచ్చుతున్నారు. మాకు వారిల్లు దగ్గరవడంవలన వయస్సులో మాస్టారు పెద్దాయన అవడంవలన మా ఆవిడ తరచు వాళ్లింటికి వెళ్ళి వారి సలహాలు తీసుకొంటూ వుంటుంది. అలా ఆడవాళ్ల పరిచయంతో నాకూ మాస్టారుకూ పరిచయమయింది.

మాస్టారు వయస్సులో పెద్దాయన అయినా క్రమశిక్షణతో పెరగడం, వయస్సులో స్పోర్ట్స్,గేమ్స్ ఆడి ఉండడంవలన మంచి హుషారుగా వుండి మాతో రోజూమార్నింగ్ వాక్‌కి ఈవినింగ్ వాక్‌కి వచ్చేవారు. మంచి కబుర్లు, అనుభవాలు చెబుతూ మమ్మల్ని ఆకట్టుకునేవారు. వయస్సులో మేము ఆయనకన్నా పదిహేనేళ్ళ చిన్నయినా ఆయన హుషారుచూసి, మేము ముందు ఉండేవాళ్లం.

ఒకసారి మాష్టారు ఫెన్షన్ తీసుకోవడానికి బ్యాంకుకి వెళ్లారు. మాస్టారు భార్య రంగమ్మగారికి సడన్‌గా గుండెనొప్పి వచ్చిందని పనిమనిషి కబురు తేవడంతో నేను, మా ఆవిడ పరుగు పరుగున వారింటికవెళ్లాం, అవిడ చెప్పిన ట్యాబ్లెట్స్, వేడి

వేడి కాఫీ అందించాక, మా ఆవిడను వారింట్లో కూర్చోబెట్టి, మాస్టారుకి చెప్పడానికి బ్యాంకుకి వెళ్లాను.

మాస్టారుగారికి ఎంతో ఆతృతగా విషయం చెబితే, ఆయన కంగారుపడకపోగా రెగ్యులర్‌గా మాత్రలే వేసుకోమంటే వేసుకోకుండా టీవీ చూస్తూ ఇరుగు, పొరుగుతో కబుర్లు చెబుతూ కూర్చుంటుంది. అన్ని పనులు చేయడానికి టైం ఉంటుంది. మాత్రలు మింగడానికి ఆవిడకి టైము ఉండదు. మాత్రలు వేసుకోకపోతే అప్పుడప్పుడు గుండె జబ్బు ఉన్నదని గుర్తు చేస్తూ ఉంటుంది. అని అంటూ నాతోపాటు ఇంటికి వచ్చి ఏమే ఇవ్వాళ రామంగారికి, అమ్మాయికి ట్రబుల్ ఇచ్చావా! పాపం చూడు వాళ్ళు భోజనం చేయకుండా నీతో కూర్చున్నారు అన్నారు.

మీకు కొడుకు, కూతురు ఉండగా ఈ వయస్సులో ఇలా ఒంటరిగా ఉండడం బాగలేదు మాస్టారు అన్నాను ఏదోమాట్లాడలని. ఆయన నావైపు ఒకసారి విచిత్రంగా చూసి వెనుకటి ఒకావిడ మా ఆయనే నాకుంటే మంగలి అవసరం నాకేమిటని అందిట. అలా వుంది మా పరిస్థితి. మా అబ్బాయి, అమ్మాయి ఇద్దరూ రమ్మంటారు. తీరా వెళ్లాక అక్కడ పదిహేను రోజులుండేసరికి ఎప్పుడు అక్కడ నుండి బయట పడ్తామా అనిపిస్తుంది. వాళ్ళు ఎంత బాగా చూసినా, నా స్వంత ఇంట్లో ఉన్నసుఖము, ఆనందము నాకుండదు. ఇక్కడ నాకు కావలసిన కూర చేయించుకు తింటాను. పిండి వంటలు తింటాను. కావలసినప్పుడు కాఫీ త్రాగుతాను. అక్కడికి వెళ్లితే వాళ్ళు పెట్టినప్పుడు తినాలి. ఇచ్చినప్పుడు కాఫీ త్రాగాలి. ఇవన్నీ నాకు ఇష్టం లేకే పిల్లలున్నా మా ఇంట్లో మేము ఉంటున్నాము అన్నారు.

ఆయన మాటలు విని నేనూ, నా శ్రీమతి ఇద్దరం అవాక్కయ్యాము. మా ముఖాలు చూసిన మాస్టారు భార్య రంగమ్మగారు అసలు అదికాదు పద్మా. మా కోడలు దగ్గర శుచి శుభ్రత తక్కువ. ఉదయమే లేచి నోట్లో బ్రస్ పెట్టుకుని వంట ఇంట్లోకి వెళ్లి స్టౌ వెలిగిస్తుంది. స్నానం చేయకుండా వంట చేస్తుంది. నేను వంట చేస్తానంటే పిల్లలకి నచ్చదు. వాళ్లయనకి నచ్చదంటుంది. మాస్టారు సుగరుపేషంటు కదా! ఉదయమే టిఫిన్ లేక చోడిపిండి జావో ఇవ్వాలి. పిల్లలు స్కూలుకి వెళ్లే వరకు ఏమీ ఇవ్వదు. పిల్లలు స్కూలునుండి వచ్చి డ్రస్సు మార్చుకోకుండా బూట్లు విప్పకుండా, కాళ్ళుచేతులు కడుక్కోకుండా సరాసరి వంట గదిలోకి వెళ్లి అన్నీ తీసుకు తింటూ ఉంటారు. మా కోడలు టీవీ చూస్తూనో, ఇరుగుపొరుగు వారితో మాట్లాడుతూ ఇవేవీ పట్టించుకోదు. పిల్లలు మా మాటలు వినరు. దానికి తోడు మేము మా అబ్బాయి ఇంటికి వెడితే పిల్లల గది మాకు ఇవ్వడంవలన పిల్లలు ఇబ్బంది పడుతూ ఈ ముసలాళ్ళు ఎప్పుడు వెళ్ళి పోతారా అని ఎదురుచూస్తూ ఉంటారు అని చెప్పి నిట్టూర్చారు.

ఇక అమ్మాయి కథకూడా చెప్పు అన్నారు మాస్టారు నవ్వుతూ. రంగమ్మగారు నవ్వుతూ మీరు చెప్పక్కరలేదు. అమ్మాయి కథ చెబుతాను అంటూ ప్రారంభించారు.

మా అమ్మాయికి మడి, తడి, ఆచారం, పూజలు, పునస్కారాలు అన్నీ కావాలి. శుచి, శుభ్రతకూడా ఎక్కువే. కానీ మా అమ్మాయికి దురదృష్టంవల్ల మా అల్లుడు, మా మనవలకి అన్నీ తక్కువే. మా అల్లుడు ఆలస్యంగా లేచి బ్రష్ నోట్ల పెట్టుకుని అరగటం పేపరు చదువుతాడు. ఒక్కొకసారి ముఖం కడుక్కోకుండానే బెడ్‌కాఫీ తాగుతాడు, ఆలస్యమైతే స్నానం చేయకుండానే భోజనంచేసి ఆఫీసుకు వెల్తాడు. ఆఫీసు నుండి బూట్లయినా ఇప్పకుండా సరాసరి వంట ఇంట్లోకి వెళ్లి వంటలన్నీ రుచి చూస్తూ వుంటారు. ఇంటికి వెద్దవాళ్ళు అత్తామామలు, బంధువులు వచ్చారని కూడా పట్టించుకోకుండా ప్రవర్తిస్తాడు. పిల్లలకు తండ్రిపోలిక వచ్చింది. ఉదయమే లేచిన దగ్గరనుండి ముఖము కడుక్కోవడానికి, స్నానం చేయడానకి మా అమ్మాయిని వేధించుకుతింటారు. టిఫిన్‌కి, భోజనాలకి మాత్రం పిలవకుండానే హాజరవు తారు. తండ్రి ఎంత మొండో, పిల్లలు అంత మొండి, అమ్మాయిని వేధించుకుతింటారు. టిఫిన్‌కి, భోజనాలకి మాత్రం పిలవకుండానే హాజరవుతారు. తండ్రి ఎంత మొండో, పిల్లలు అంతమొండి. అమ్మాయి రమ్మనమని, ఉండమని తాపత్రయపడుతుంది. అక్కడ వాతావరణంలో వారం రోజులు మించి ఉండలేకవస్తాము. మేము వస్తూ ఉంటే అమ్మాయి కళ్ళనీరు పెట్టుకుని "పుణ్యంకొద్దీ పురుషుడు దానంకొద్దీ బిడ్డలు, అని పెద్దలు ఊరకే అనలేదమ్మా! అంటూ వాపోతూ వుంటుంది. అని చెప్పి పెద్ద నిట్టూర్పు విడిచేరు.

రామంగారూ! ఈ ముసలాల్లిద్దరూ ఒంటరిగా పిల్లలకు దూరంగా ఎందుకు ఉంటున్నారో అర్థము చేసుకున్నారనుకుంటాను అన్నారు మాస్టారు మా ఇద్దరు ముఖాలు చూస్తూ–

నేనూ, నా శ్రీమతి ఒకరి ముఖాలు ఒకరు చూసుకొని ఈకాలం పిల్లలు అసలు మాట వినడంలేదు. వారుచేసే అల్లరికి అంతూ పొంతూ ఉండడంలేదు. గుడ్డిలో మెల్ల నయం అన్నట్లు మగపిల్లలమీద ఆడపిల్లలు కొంత బెటరు అన్నా మా మనవలు, మనవరాళ్ల అల్లరి గురించి తలచుకుని. రంగమ్మగారు నవ్వుతూ లేచి కూర్చుని థాంక్సు పద్మా. రామంగారూ, మీకు ట్రబుల్ ఇచ్చాను. మాస్టారు వచ్చేరుకదా! నాకింకేమీ ఫర్వాలేదు. మీరు ఇంటికి వెళ్లండి. అనడంతో మెల్లగా లేచి ఇంటి ముఖము పట్టేము.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 2007)

❁ ❁ ❁

నవ్వుతూ బ్రతకాలి

నవ్వడం, నవ్వించడం ఒక కళ, నవ్వితే భోగం, నవ్వకపోతే రోగం అన్నాడు ఒక సినీకవి. నవ్వుతూ బ్రతకాలిరా! నవ్వుతూ చావాలిరా ! అని కూడా అన్నాడు మరొక సినీకవి.

ఈ మధ్య చాలా మంది డాక్టర్లు కూడా నవ్వుతూ, సరదాగా గడిపేస్తే సగం రోగాలు పోతాయి. దరికికూడా రావంటున్నారు. అందుకే మన రచనలలో, సినిమాలలో హాస్యానికి చాలా ప్రాధాన్యం ఉంది. ఈ మధ్య కొన్ని పట్టణాలలో బ్యూటిక్లినిక్స్‌లా అక్కడక్కడ లాఫింగ్ క్లబ్బు అని కూడా పెట్టి బాగా డబ్బులు దండుకొంటున్నారు.

ప్రతి ఒక్కరూ హ్యాపీగా, ఆనందంగా ఉండాలనే అనుకొంటారు. కానీ మన చుట్టు ప్రక్కలవారు, మన చుట్టుప్రక్కల వాతావరణం మనల్ని సంతోషంగా ఉండ నివ్వవు. మనిషిలో ఉండే ఈర్ష్య, అసూయ, ద్వేషాలు ఒక కారణమైతే అసంతృప్తి, లేమి రెండవ కారణము. పక్కవారు, ఎదుటివారు పచ్చగావుంటే ఓర్వలేనివారు ఎందరో ఉన్నారు. ఇంట్లో పండంటి కాపురాన్ని చెడగొట్టి, తల్లి పిల్లల మధ్య, అత్తా కోడళ్ల మధ్య భార్యాభర్తల మధ్య తండ్రీ కొడుకుల మధ్య చిచ్చుపెట్టి కాపురాలు కూల్చి వినోదించేవారు ఎందరో ఉన్నారు. ఒకొక్కసారి ఇరుగు పొరుగు మధ్య కూడా కలతలు సృష్టించి వినోదించే రాక్షస ప్రవృత్తి కలవారు మన మధ్య ఉన్నారు. భగవంతుడు మనకిచ్చిన వివేకాన్ని, బుద్ధిని వినియోగించుకొని, కొంచెం సంయమనం పాటిస్తే గొడవలకు తావుండదు. కానీ కోపము, అహంకారం వలన ఎన్నో అనర్థాలు వచ్చి సంసారాలలో కలతలు రేపి సంతోషాన్ని మాయం చేస్తోంది.

పరుగెత్తుతూ పాలు త్రాగడం కన్నా నిలబడి నీళ్ళు త్రాగడం మేలని మనపెద్దలు ఎంతో అనుభవంతో చెప్పారు. అయినా దూరపుకొండలు నునుపని కొందరు దూర ప్రాంతాలకు మరి కొందరు డబ్బు సంపాదనకు విదేశాలకు వెళ్లి సంసార సుఖాలను, ఆనందాన్ని దూరం చేసుకొంటున్నారు. డబ్బు ఎప్పుడైనా సంపాదించుకోవచ్చుకాని పోయిన వయస్సును మరల ఎవ్వరూ సంపాదించుకోలేరు. డబ్బు ఒక్కటే ఆనందాన్నిస్తుందని అనుకోవడం వారి తెలివి తక్కువ తనమే. అభిమానాలు, ఆత్మీయతలు, అనురాగాన్ని, ప్రేమని పోగొట్టుకుంటున్నారని వారు గ్రహించడంలేదు. మనిషికి తృప్తి వుండాలి. తృప్తిలేకపోతేనే ఆనందం దూరమవుతుంది. భార్యాపిల్లల్ని, కన్నతల్లి దండ్రులను మాతృదేశములో వదలి విదేశాలకుపోయి ఎంత సంపాదిస్తే మాత్రం ఆ ఇంట సంతోషం, ఆనందం వెల్లి విరుస్తుందా ?!

సంపాదనలో పడితే తృప్తి వుండదు. లక్షసంపాదిస్తే కోటి సంపాదించాలని, పదికోట్లు సంపాదించాలని, ఒక ఇల్లువుంటే ఇంకా అందమైన భవంతి ఉండాలని కోరికలతో సతమతమవుతూ, భార్యాపిల్లలతో కలిసివుండక ఆనందాన్ని దూరం చేసుకొంటున్నవారు అనేకమంది ఉన్నారు. దానికి తగ్గట్లు నేడు సినిమాలు, టీవీ సీరియల్స్ కూడా కోరికలకి ఆజ్యం పోస్తున్నాయి. పూర్వపు రోజులలో (10–20ఏళ్ళ క్రితం) అమ్మాయిలు పెద్దలు నిర్ణయించిన సంబంధాలనే చేసుకొని నూటికి తొంభై మందికి పైగాహాయిగా సుఖంగా కాపురాలు చేసేవారు. నేడు పెద్దల మాటల్ని పెడ చెవినిపెట్టి ప్రేమ వివాహాలు చేసుకొని పట్టుమని పదేళ్ళు కాపురం చేయడంలేదు. ఉద్యోగాలుచేసే భార్యాభర్తలు ఏదో ఒక కారణంతో నూటికి యాభైమంది విడిపోతు

న్నట్లు చెబుతున్నారు. డబ్బు సంపాదనలోపబడి భార్య ఒకచోట, భర్త ఒక చోట ఉద్యోగాలు చేస్తూ వారనికో, నెలకో ఒకసారి కలుసుకొని అనుభవించ వలసిన వయస్సులో ఆనందాన్ని దూరం చేసుకొంటున్నారు.

నేడు ఉద్యోగాలుచేసే మహిళలలోనూటికి యాభై, అరవై శాతం చదువుకున్నా మని ఉద్యోగాలు చేస్తున్నారు కానీ భర్త సంపాదన చాలదని, కుటుంబం గడవదని కాదు. సంపాదన ఎక్కువవడంతో సుఖాలకు అలవాటుపడి రిమోట్ కంట్రోల్‌తోనే) కోరి రోగాలు తెచ్చుకొంటున్నారు. ఫర్లాంగు దూరం నడవవలసివచ్చినా కారో, మోటారు సైకిలో లేనిదో వెళ్ళడంలేదు. అపార్ట్‌మెంట్‌లో ఫస్టుఫ్లోర్‌లో ఉంటే మెట్ల మీద నుండి వెళ్లకుండా లిఫ్టు ఎక్కి వెళ్తున్నారు.

ఆఫీసులో కుర్చీలకు అతుక్కుపోయి, ఇంటికి వచ్చి డైనింగు టేబులు భోజనానికి అలవాటై, 30,40 ఏళ్ళవయస్సులోనే క్రింద మటం వేసుకొని కూర్చొని దేవునికి దణ్ణం పెట్టుకోలేక పోతున్నారు. పట్టుమని పదినిమిషాలు క్రింద కూర్చొని మెడిటేషన్ చేయలేక పోతున్నారు.

కొందరు డబ్బు ఎక్కువై విలాస జీవితానికి అలవాటుపడి (ఆడ,మగ) క్లబ్బులు, పబ్బులంటూ తిరుగుతూ త్రాగుడుకు బానిసలై దేశ సంస్కృతిని మంటకలుపు తున్నారు. పాశ్చాత్య నాగరికత పెరిగి కట్టు, బొట్టులో ముఖ్యంగా మహిళలలో చాలా మార్పు వచ్చింది. విచ్చలవిడితనం పెరగడం, మంచి చెడు నీతి, శీలము గురించి చెప్పేవారు లేకపోవడంతో ఎయిడ్స్‌వంటి రోగాలు కొత్తగా యువతని పట్టి పీడిస్తున్నాయి. నవ్వుతూ బ్రతకాలంటే కొంత క్రమశిక్షణ కావాలి. శ్రీ రామకృష్ణ పరమహంస శ్రీ వివేకానందుడు, శ్రీ రమణమహర్షి, శ్రీ ఆది శంకరాచార్యులు శ్రీ సాయిబాబా బోధలువంటివి వినాలి. చదవాలి. పిల్లలను చదివించాలి. తల్లిదండ్రులే పిల్లలకు ఆదర్శమై ప్రథమ గురువులుగా వ్యవహరించాలి. అలాచేస్తే పిల్లలతో పాటు మనము నవ్వుతూ హాయిగా గడపవచ్చు.

(ధ్యానమాలిక – సెప్టెంబరు 2008)

❋ ❋ ❋

నమ్మకాలతో నష్టపోవద్దు !

ఈమధ్య ఒక ఊళ్లో ఒక ఇంటివారి కోడలు జేష్ట నక్షత్రంనాడు ఆడపిల్లని కన్నదని పుట్టింటినుంచి తీసుకురాకుండా కొడుకుని కూడా వెళ్లనీకుండా కట్టడి చేశారట. ఇంతకీ కారణం ఏమిటంటే కోడలు పురుడయేక మామగారికి జబ్బుచేసి మంచం పడ్డారుట. ఇరుగుపొరుగు, బంధువులు, వియ్యాలవారు ఎంత నచ్చచెప్పినా వినకుండా మూర్ఖంగా ఆ కోడలిని అత్తగారింట్లో అడుగు పెట్టనీయలేదుట. ఈ ఇరవై ఒకటవ శతాబ్దంలో ఇలాటివి వినడానికే వింతా వుంటుంది.

మేము కర్నూలులో వున్నప్పుడు ఒక ఇంట్లో అద్దెకుండేవాళ్లం. ఇల్లు అన్ని విధాలా సౌకర్యంగా వుండి బాగుండేది. మా ఇంటిపక్క పోర్షన్‌లోనే యింటి యజమానులుండేవారు. వారింట్లో ఏదో శుభకార్యం జరుగుతూవుంటే వాళ్ల బంధువు ఒకాయన వాళ్లింటికి వచ్చి ఇంటి వాస్తుబాగాలేదు. కొన్ని మార్పులుచేస్తే బాగుంటుందని మాట జారివెళ్లేడు. మా యింటి యజమాని మంచి వ్యాపారం చేస్తూ బాగా అభివృద్ధిలోకి వచ్చేడు. నిజానికి వారికి ఏ లోటూలేదు. ఆయన తండ్రికి డెబ్భై సంత్సరాలుంటాయి. అతనికి పక్షవాతంవచ్చి మరణించేడు. ఆ సంఘటనతో మా యింటి యజమానికి వాస్తుమీద నమ్మకం ఏర్పడి, ఎంతో సదుపాయంగా వున్న ఇల్లుని, కాంపౌండు గోడని అన్నీ పగులగొట్టి లక్షరూపాయలు వ్యయంచేసి, ఎవరు చెప్పినా మాటవినకుండా ఇల్లు ఇరుకుచేసి పాడుచేసాడు. ఆ దెబ్బతో మేము ఇల్లు ఖాళీచేసి వేరే ఇంటికి మారిపోయాము. తరువాత ఆ ఇంటి యజమాని ఇల్లు ఖాళీచేసి అద్దె ఇంటికి వెళ్ళిపోయేడు. కారణమడిగితే వాళ్ళమ్మాయికిపెళ్లి సంబంధం తప్పిపోయిందని స్వంత ఇల్లు వదలి అద్దె యింటికివెళ్ళేడట.

వాళ్లు ఇల్లు కట్టుకొన్నాక పది సంవత్సరాలపాటు హాయిగా, ఆనందంగా ఆ యింట్లో గడిపేరు. డబ్బు అనవసరంగా ఖర్చుచేసి సుఖంగా వున్న ప్రాణాన్ని దుఃఖాన పెట్టుకొన్నారు. పూర్వం లేదుకానీ ఈ మధ్య ప్రతివారికీ వాస్తు పిచ్చి పట్టుకొంది. ఇంట్లోనే కాకుండా ఆఫీసుల్లో కూడా ఈ జాడ్యం ప్రవేశించి ఏ చిన్నతేడా వచ్చినా వాస్తనే భ్రమతో తల్లడిల్లిపోతున్నారు. అనుమానం పెనుభూతమని అందుకే అంటారు.

ఈమధ్య మా బంధువులలో ఒకరు ఇల్లు బాగా కట్టుకున్నారు. వాళ్ల పిల్లలకి ఉద్యోగం రాలేదని ఎవరికో చెబితే ఇంటివాస్తు చూపించమన్నారు. వాస్తు గురించి ఎవరినో సంప్రదించేసరికి కొన్ని మార్పులు చేర్పులు చెప్పడంతో యాభైవేలు ఖర్చుచేసి చేయించేరు. అయినా వాళ్ళబ్బాయిలకి ఉద్యోగంరాలేదు. అదృష్టం, నుదిటి వ్రాతబట్టి జరుగుతాయి. కానీ పిడుక్కి బియ్యానికి ఒకేమంత్రం అన్నట్లు అన్నిటికి వాస్తు అనుకుంటే వున్నదాన్ని పోగొట్టుకోవడమే అవుతుంది.

ఇంకా కొందరికి చాదస్తం ఎలా వుంటుందంటే ఎవరైనా తుమ్మితే బయటకు వెళ్లరు. అలాగే మంచి శకునం చూసికాని బయటకు బయలుదేరరు. ప్రయాణాలకు మంచి, చెడు చూసిబయలుదేరడం మంచిదేకానీ, ఒక్కొక్కసారి మనమనుకున్న రోజుకు, ముహూర్తానికి రైల్లో రిజర్వేషను దొరకదు. అప్పుడు తప్పనిసరిగా ప్రయాణాన్ని వాయిదా వేసుకోవలసి వస్తుంది. కొన్నిరైళ్లు వారానికి ఒకటి రెండుసార్లు నడుస్తాయి. అలాంటప్పుడు మంచి రోజని కూర్చుంటే కుదరదు. భగవంతుడికి దండం పెట్టుకొని తప్పనిసరిగా ప్రయాణం సాగించవలసి వస్తుంది. పట్టు, విడుపు వుండాలి కాని మూర్ఖంగా చాదస్తంగా వుండడంవలన లాభంకన్నా నష్టమే ఎక్కువ జరుగుతుంది.

అన్ని మంచిచెడ్డలు, జాతకాలుచూసి మంచి ముహుర్తంలో అందరికీ వివాహాలు చేసినా కొందరి కాపురాలు మధ్యలోనే ఏదో ఒక కారణంతో చెడిపోతు న్నాయి. భార్యాభర్తలు గొడవలు పడి విడిపోవడమో, భర్త ఏ యాక్సిడెంటులోనో మరణించి భార్య విధవలు అవడంలాంటివి ఎన్నో చూస్తున్నాము. అందుచేత పెద్దలు చెప్పిన విషయాలను గౌరవించాలి కానీ నూటికి నూరుపాళ్లు నమ్మడం అవివేకం.

తలమీద బల్లిపడిందని, తలపై కాకి తన్నిందని మృత్యువుకి భయపడి మంచం ఎక్కినవారున్నారు. దేనికైనా మూఢనమ్మకం, చాదస్తం పనికిరాదు. భగవంతుడు ప్రతివారికీ ఆలోచనాశక్తి ఇచ్చాడు కాబట్టి, మంచి చెడు విచక్షణా జ్ఞానంతో ఆలోచించి ప్రవర్తించాలి. ఎవరో చెప్పేరని గుడ్డిగా నమ్మి తొందరపడి నిర్ణయానికి రాకూడదు.

మానవులై పుట్టేక జబ్బులు రాకమానవు. కష్టాలు రాకమానవు. కష్టసుఖాలు కావడి కుండలు లాటివని మన పెద్దలే చెప్పారు. చీకటి వెనుక వెలుగులా వచ్చి పోతుంటాయి. అంతేకానీ ప్రమోషన్ రాలేదనో, అబ్బాయికి ఉద్యోగం రాలేదనో, అమ్మాయి పెళ్ళి సంబంధం తప్పిపోయిందనో మనస్తాపానికి గురై తొందరపడి బంగారం లాంటి ఇళ్లను పాడుచేసుకోకూడదు.

ఒకవేళ ఏమైనా చెడు నక్షత్రంలో పిల్లల పుడితే శాంతిచేసి రుద్రాభిషేకం, శ్రీ సత్యనారాయణ వ్రతం వంటివి చేయించాలికానీ కోడలుని విడిచిపెట్టడం మహాప రాధం, పాపం కూడా! ఈ మధ్య మరల చేతబడులని, చిల్లంగి, బాణమతి అనే పేర్లు వినిపించి ప్రజలను భయభ్రాంతుల్ని చేస్తున్నారు. ఈ మూఢనమ్మకాలతో కొందరు పిరికిగా ఆత్మహత్యలకు కూడా పాల్పడుతన్నట్లు తెలుస్తోంది.

ఒకవేళ ఇంట్లో ఏదైనా నష్టం జరిగితే కొత్తగా పెళ్ళయిన కోడలిమీదో లేక యింటికి కొత్తగా వచ్చిన జంతువునో అనడం పరిపాటి. అందుకే కోడలు వచ్చిన వేళ, గొడ్డొచ్చిన వేళని హేళనగా అంటారు. ఎక్కువగా ఈ నిందలు స్త్రీలపైనే వేస్తూ వుంటారు. సాంప్రదాయాలు, ఆచారాలు గౌరవించండి కానీ గుడ్డిగా నమ్మి నష్టపోవద్దు.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 27-11-2002)

ఒకరికి ఒకరై...

మా ఇంట్లోకి అద్దెకు కొత్తగా పెళ్లైన ఓ జంటవచ్చి కాపురం పెట్టారు. ఆ జంట చూడముచ్చటగా ఉంది. ఒకరికోసం ఒకరు పుట్టేరా అన్నట్లు ఉన్న ఆ జంటను ఏర్చి కూర్చిన పెద్దలను అభినందించాలి. పెళ్ళి కుదిరన వెంటనే కాపురం పెట్టడానికి ఇళ్లవేట మొదలెట్టి, అద్దెకు పోర్షన్ ఖాళీగా ఉందని తెలిసి మా ఇంటికి వచ్చారు. చిన్న పోర్షన్, రెండు గదులు, వంటిల్లు, భార్యాభర్తలకైతేనే సరిపోతుంది. ఎక్కువ మంది ఉంటే కష్టమని మా నాన్నగారు అందరికీ చెప్పినట్టే చెప్పేరు. ఆ అబ్బాయి సిగ్గుపడుతూ వచ్చేనెల ఆరవ తారీఖున నా పెళ్ళండి. ఈ సంవత్సరం డబుల్

ఆషాడాలు వస్తున్నాయట. పెళ్ళయ్యాక టైం ఉండదు. వెంటనే కాపురం పెట్టాలి. అందుచేత వెంటనే ఇల్లుచూసుకొని రమ్మనమని మావాళ్ళు చెప్పారంటూచెప్పేసరికి మేమంతా నవ్వుకున్నాం. తరువాత ఇల్లుచూసి బాగుందని చెప్పి అడ్వాన్స్ ఇచ్చి వెళ్ళి పోయాడు.

కొత్త జంటను వాళ్లమ్మగారు తీసుకొచ్చి మా ఇంట్లో కాపురం పెట్టించి రెండు రోజులుండి ఆసాఢమాసం వస్తోంది కొత్తకోడలు, అత్తగారు ఒక గుమ్మం దాటకూడదని చెప్పి, అమ్మాయిని మాకు అప్పగించి చిన్నపిల్లలు కొంచెం జాగ్రత్తగా చూడండి అంటూ వెళ్ళారు. మా ఇంట్లోకి వస్తూ ఒక గోనె మూటతో సామాన్లు, సూట్‌కేసు, బెడ్‌హోల్డాల్‌తో దిగేరు. అబ్బాయి సూట్‌కేస్ బేగ్,మడత మంచం వాళ్ళ ఫ్రెండ్ ఇంట్లో పెట్టానని చెప్పి తీసుకువచ్చాడు. వాళ్ళమ్మగారు ఒక పరుపు, మంచం, ఫ్యాను, కొని ఇచ్చి వెళ్ళారు. వాళ్ళమ్మగారు ఊరు వెళ్ళాక భార్యాభర్తలిద్దరూ ఒకరోజు బజరుకెళ్ళి ఇంటికి కావలసిన వంటసామాగ్రి అన్నీ తెచ్చుకొన్నారు. ఇద్దరూ కలసి సామాన్లు ఇంట్లో సర్దుకున్నారు.

కిరోసిన్ స్టౌమీద వండుకోవడం చూసి మా అమ్మగారు మా ఇంట్లో ఉన్న పాత గ్యాస్‌స్టౌ సిలిండర్ ఇచ్చారు. ఆ జంట ముఖం ఒక్కసారి మెర్క్యురీ ల్యాంప్‌లా వెలిగిపోయింది. గ్యాస్‌కి అప్లై చేశాను. మూడునెలలో వస్తుందని చెప్పారు, అంటీ చాలా థాంక్స్ అంటూ పొంగిపోయారు. వారి అన్యోన్య దాపంత్యాన్ని చూసి ఒకరోజు అమ్మగారు మీది మేనరికమా అని అడిగేరు. ఆ అమ్మాయి నవ్వి, లేదాంటీ మాది దూరపు సంబంధమే. ఇంట్లో ఇద్దరమే ఉన్నాం కాబట్టి త్వరగా కలిపిసోయాం అంది సిగ్గుపడుతూ.

ఆ అబ్బాయి ఆఫీసు దగ్గరే కావటంవల్ల మధ్యాహ్నం ఇంటికి భోజనానికి వచ్చి వెళ్ళేవాడు. సాయంత్రం ఐదు గంటలకి ఆఫీసునుండి ఇంటికివచ్చి భార్యను సినిమాకో షికారుకో తీసుకెళ్ళేవాడు. బజారునుండి నెలసరుకులు ఇంటికి కావలసినవి తెచ్చుకొంటే ఆ అబ్బాయే పొట్లాలు విప్పి అన్నీ డబ్బాలలో పోసి అల్మారలో సర్దేవాడు. కూరలుతెస్తే భార్యస్నానంచేసి వచ్చేలోపు ఏ కూరవండాలో నిర్ణయించుకొని ఆ కూరని కడిగి ముక్కలు తరిగి వండటానికి రెడీ చేసేవాడు. కొన్నికూరలు ఎలా వండాలో తెలయక ఇద్దరూ ప్రయోగాలు చేస్తూ వాదులాడుకొంటూ వండుకుతినేవారు. ఒక్కోసారి మా ఇంటికి ఆ అమ్మాయివచ్చి, మా అమ్మగారిని అడిగి తెలుసుకొని కమ్మగా కూర వండిపెడితే, ఆ రోజు ఆ అమ్మాయి వంటని మెచ్చుకుని ఆకాశానికి ఎత్తేవాడు.

ఆ కొత్తకాపురం చూస్తూ ఉంటే మాకుచాలా వినోదంగా ఉండేది. భార్యాభర్తలిరువురూ అంత అన్యోన్యంగా ఆనందంగా ఉంటే సమస్యలే వుండవనిపించింది. నేడు చదువుకుని ఉద్యోగాలుచేస్తున్న భార్యాభర్తలిరువురూ, ఒక్కొక్కసారి ప్రేమించుకొని పెళ్లి చేసుకొన్న జంటలు కూడా పెళ్ళిచేసుకున్నాక వంటింటిపని, వంటపని భార్య

డ్యూటీ అని ఆ చాయలకు భర్తలు వెళ్లరు. భార్యకు వంటపని ఇంటి పనులలో సాయంచేయరు. ఆఫీసులో ఇద్దరూ కష్టపడిపనిచేసి వచ్చినప్పుడు సహజంగా ఇద్దరూ అలసిపోతారు. ఇంటిపని చేయడానికి ఎవరికైనా చికాకుగానే ఉంటుంది. కానీ స్త్రీ ఉగ్యోగస్తురాలైనా ఇంటికివచ్చి పిల్లల సంరక్షణ, వంట, ఇంటిపని చేయక తప్పదు. పురుష పుంగవుడు తన అహంకారాన్ని కొంతవదులుకొని భార్యకు చిన్న చిన్నపనులలో సాయంచేసినా ఆ ఇల్లాలు ఇంటిని స్వర్గసీమగా మారుస్తుంది.

కొందరు పురుషులువారి పనేవారు చేసుకోవడానికి బద్ధకించి అన్నిటికి భార్యల పైనే ఆధారపడి, బతుకుతూ ఉంటారు. భార్యే బట్టలు ఉతకాలి, ఇస్త్రీ చేయించాలి. బట్టలు వేసుకోవడానికి అందించాలి. కొందరికైతే బట్టలుతొడిగి, బూట్లు కూడా పాలిష్ చేసి అందించాలి. తాగిన ఎంగిలి కాఫీ కప్పులు కూడా తీసి లోపల పెట్టరు. పైగా భార్యలపై కేకలువేసి, విసుక్కుని తిడుతూ ఉంటారు. ఇంట్లో సాయం చేయక పోగా భార్యల్ని వేధించేవారు చాలా మంది ఉన్నారు. నేడు చదువుకొని ఉద్యోగాలు చేస్తున్న చాలామంది మహిళలు పురుషాహంకారాన్ని సహించ లేక ఎదిరిస్తున్నారు. కొందరైతే బరితెగించి విడాకుల దాకా వెళ్తున్నారు.

భార్యభర్తలు తోటికోడలు సినిమాలో పాటలాగా ఆడుతు పాడుతు పనిచేస్తుంటే అలుపూ సొలుపేమున్నది ఇద్దరు కలిసి చేయి కలిపితే ఎదురేమున్నది అంటూపాడు కొంటూ కలిసిపనిచేసుకొంటే ఆ ఇంట్లో ఆనందమే తాండవిస్తుంది. ముఖ్యంగా ఉద్యోగాలుచేస్తున్న భార్యాభర్తలు ఒకరెక్కువ తక్కువ అని అనుకోకుండా ఇద్దరు పాలు నీళ్లలా కలిసిపోయి నవ దంపతులలా కాపురం చేయాలి. ఒక్కోసారి బాలెన్సు తప్పి కోపం అదుపుతప్పి ఇంట్లో ప్రవర్తించి భార్యను నొప్పిస్తే, కోపం తగ్గాక మంచి మనసుతో భార్యకు సారీ చెప్పి ఆమెను ఆప్యాయంగా దగ్గరకు తీసుకొని ఆమె వెంట ఉండి కొన్ని పనులలో సాయంచేస్తే ఆమె కోపాన్నంతా మరచిపోయి చేరువవు తుంది.

అలాగే పిల్లలకు చదువు చెప్పడంలో వారికి కావలసిన పనులు చేయడంలో సాయం చేస్తే శ్రీమతి ఉబ్బితబ్బిబ్బవుతుంది. పెళ్ళిచేసుకుని ఇల్లు చూసుకొని చల్లగా కాలం గడపాలోయ్ ఎల్లరు హాయిగ ఉండాలోయ్ అని పాడుకొంటూ భార్యాభర్తలు ఉంటే సంసార జీవితం సాఫీగా సాగుతుంది. అందరూ మేడ్ ఫ్ ఈచ్ అదర్‌లా ఉంటారు.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 2006)

❀ ❀ ❀

ఆడవాళ్లూ మీకు జోహార్లు

శ్రీమతి పుట్టింటికి వెల్తూ జాగ్రత్తలెన్నో చెప్పి అంపకాలు చేసివెళ్ళింది. స్వయంగా వంటచేసుకొని తినమని హోటలు కూడు తినవద్దని, ఆరోగ్యం పాడు

చేసుకోవద్దని ఒకటికి నాలుగు సార్లు హెచ్చరించి వెళ్లింది. శ్రీమతి అలా చెప్పి వెళ్తూ వుంటే చాలా లైటుగా తీసుకొని చాటుగా నవ్వుకొన్నాను. శ్రీమతి పుట్టింటికి వెళ్ళి వారంరోజులు దాటింది. మొదట నాలుగురోజులు హుషారుగా ఆడుతూ, పాడుతూ కేరింతలు కొడుతూ వంట చేసుకుతిన్నాను. ఈ మధ్య చాలా రోజులై వంట అలవాటు తప్పిపోయినందున ఒకరోజు కూరలో ఉప్పుఎక్కువ, పులుసులో పులుపు ఎక్కువ ఒకసారి కూర మాడి పోవడం ఇలా రోజూ ఏదో ఒకటి జరగడంతో వంటంటే చికాకు వేయసాగింది.

పనిమనిషి ఇంట్లో అన్ని పనులలో సాయం చేస్తున్నా వండుకోడానికి బద్దకం వచ్చి రెండు పూటలకు ఒక్కసారే కుక్కర్లో అన్నం వండుకొని, ఇంట్లోవున్న పచ్చళ్లు, పెరుగుతో కొన్నాళ్లు కాలక్షేపం చేసాను. పెళ్లికాక పూర్వం వంట చేసుకొని తినేవాణ్ణి కాబట్టి ఎప్పుడూ ట్రబుల్ అనిపించలేదు. ఈ మధ్య సుఖం మరిగి శ్రీమతి చేతివంటకు అలవాటై స్వంతంగా వండుకొన్ని వంటలు రుచించడంలేదు. అప్పుడనుకొన్నాను శ్రీమతి ఈజ్‌గ్రేట్. హేట్సాఫ్ టు శ్రీమతి అనుకొని ఆవిడ ఇంకా ఐదునెలలు దాటితే కాని పుట్టింటినుంచి రాదని గుర్తుకువచ్చి ఒక్కసారి నీరసంగా ఈజీచైర్‌లో కూలబడ్డాడు.

మనిషి ఇంట్లో వున్నప్పుడు కంటే లేనప్పుడే వారి విలువ తెలిసివస్తుంది. శ్రీమతి తెల్లవారుజామున లేచి ఇంటి పనులు చేసుకొని, ఉదయమే లేపి కాఫీ ఇచ్చి, అన్నీ చేతికి అందించి ఉదయం టంచనుగా తొమ్మిదిన్నరకు పప్పు, కూర, పచ్చడి లేక పులుసుతో కమ్మగా వండిపెడితే త్రేనుస్తూ ఆఫీసుకి వెళ్లేవాడు. పొరపాటున ఎప్పుడైనా కూరలోనో పచ్చడిలోనో ఉప్పు, కారం లాంటివి ఎక్కువైతే ఆ రోజు ఆమె బుర్ర తినేసేవాడు. సాయంత్రం ఇంటికివచ్చేసరికి కాఫీ, టిఫిన్‌తో శ్రీవారికోసం ఎదురుచూసే శ్రీమతిని తలచుకొనేసరికి ఆమంటే ఎంతో జాలి, బాధ కలిగి ఆమె విలువ తెలుసొచ్చింది.

ఒకరకంగా చెప్పాలంటే ఈకాలం ఆడవాళ్లు చాలా అదృష్టవంతులు. వారు కాపురానికి వచ్చేసరికి ఇంట్లో గ్యాస్‌పొయ్యిలు, కుక్కర్లు, ఫేన్లు అన్నీ అమర్చి వుంటున్నాయి. మా చిన్నతనంలో మా అమ్మగారు వంట చేయడానికి పడే అవస్థ చూసేసరికి ఆమెపై జాలి కలుగుతుంది. ఆ రోజులలో కుక్కర్లు, గ్యాసు పొయ్యిలు లేవు. వంట చేయడానికి కట్టెల పొయ్యిలు, బొగ్గుల కుంపట్లే వాడేవారు. తెల్లవారి లేచి వాటిని ముట్టించడానికే చాలా టైముపట్టేది. ఇంట్లో మేము ఆరుగురు అన్నదమ్ములు, ఒకచెల్లి వుండేవారం. ఇంతమందికీ కట్టెల పొయ్యిమీద, బొగ్గుల కుంపటిపైనే వంటచసి పెట్టేది. దానికితోడు ఆ రోజులలో బంధువుల తాకిడి ఎక్కువగా ఉండేది. పిండి, పచ్చళ్లు రుబ్బుకోడానికి రుబ్రోలు, ఇంట్లో వుండేది. గ్రైండరు వంటి సామాగ్రి వాళ్లెరుగరు. అయినా ఇసుమంతైనా విసుగు, అదుపులేకుండా కూర, పప్పు, పులుసుతో కమ్మగా భోజనం పెట్టేవారు.

సాయంత్రంవేళ ఇంటికి పిల్లలు ఆకలితో వస్తారని అప్పుడప్పుడు టిఫిన్ కూడా చేసి పెట్టేవారు. పండగలు, పబ్బాలు వస్తే ఆడవాళ్లు పడే అవస్త వర్ణనాతీతం. తెల్లవారుజామున లేచి పిల్లలకు అభ్యంగన స్నానాలు చేయించి, అప్పుడు వాళ్ళు స్నానంచేసి, మడిగా, శుచిగా పిండివంటలతో వంటలుచేసి దేవునికి నైవేద్యంగా వుంచి ఇంట్లో అందరికి భోజనాలు పెట్టేవారు. వాళ్ళ ఓపిక, సహనం తలచుకొంటే ఒడలు గగుర్పొడుస్తుంది.

పిల్లలు అల్లరిచేసి,కొట్టుకొని తిట్టుకొంటూ వుంటే ఎంతో ఓర్పు, సహనంతో వారిని ఓదార్చి మంచిమాటలు చెప్పి అక్కున చేర్చుకొనేవారు. విశ్రాంతి తీసుకోడానికి ఫేనులు కూడా వుండేవి కావు. వంట వండి అలసిపోతే మరల స్నానంచేసి, తాటాకు విసనకర్రతో విసురుకొనేవారు. ఆరోజులలో అంత పనిచేసి అలసిపోయినా చెరగని చిరునవ్వుతో ఎంతో ఉత్సాహంగా కనిపించేవారు. ఆ రోజులేవేరు. ఆ మనుషులే వేరు. తలచుకుంటే అంతా ఒక కలలా అనిపిస్తుంది.

వారం రోజులు ఇంట్లో ఒక్కణ్నీ వుండే సరికి ఎంతో వెలితి కనిపించి మనసంతా చికాకుగా ఉంది. భగవంతుడు పక్షపాతంతోనే స్త్రీని సృష్టించేడనిపిస్తుంది. స్త్రీ చదువుకొని ఉద్యోగం చేస్తున్నా ఇంట్లో వంట, వార్పూ, పిల్లల్ని కనిపెంచడం ఏమీ తప్పడంలేదు. అన్నీవారే చేసుకోవాలి. పెళ్లాం ఉద్యోగంచేస్తున్నా ఇంటి పనిలో కానీ వంటపనిలోగాని భార్యకి సాయం చేయడానికి చాలామంది మగవారికి ఇష్టం వుండదు. పైపెచ్చు కాఫీ దగ్గరనుంచి అన్నీ అందించి భర్తకే సేవచేయాలి. పిల్లల పెంపకం బాధ్యత ఎప్పుడూ స్త్రీలదే కాబట్టి అది ఎలాగూ ఆమెకు తప్పదు.

శ్రీమతి వారంరోజులు ఊళ్లో లేకపోయేసరికి ఆమెపై నాకు విపరీతమైన జాలి, అభిమానం, గౌరవం కలిగి ఆమెను అభినందించేను. పెళ్లయ్యేకే ఆడవారి విలువ తెలిసింది. ఆడవాళ్లూ మీకు జోహార్లు అనుకొంటూ ఈ రోజు వుడికీ వుడకని మెతుకులు తిని ఆఫీసుకు బయలుదేరేను.

(ఆంధ్రభూమి దినపత్రిక - ప్రియదర్శిని - 2006)

❀ ❀ ❀

అభిరుచే అభివృద్ధికి సోపానం

ఈ రోజులలో ఎవరినైనా మీ హాబీలేమిటని అడిగితే ఎక్కువమంది సినిమాలు, టీవలు చూడడమని టక్కున సమాధానం చెప్తారు. పూర్వపు రోజులలో ముఖ్యంగా స్త్రీలు కుట్లు, అల్లికలు, పుస్తకపఠనం, ఇంటిని శుభ్రంగా అలంకరించడం, కొందరు కథలు, నవలల రాయడం, పెయింటింగ్స్ వేయడంలో నిమగ్నులై కాలాన్ని సద్వినియోగం చేసుకునేవారు. నేడు ప్లిలలకు పెద్దలకు పూర్వంలా చేతినిండా పనిలేక పోయినా క్షణం తీరుబడి లేకుండా వుంటున్నారు. ఏ ముహూర్తన టీవీలు వచ్చాయో గానీ ప్లిలలకు, పెద్దలకు అందరకు సోమరితనం బాగా అలవాటైంది. ఆటలు

ఆడుకునే, పాడుకొనే వయసులో పిల్లలు కూడా ఆటపాటలు మాని స్కూళ్ళనుండి రాగానే టీవీలకు అతుక్కుపోతున్నారు.

మా నాన్నగారికి చిన్నతం నుండి పోస్టల్ స్టాంపుల సేకరణ, పాత నాణెముల సేకరణ, కథలు, వ్యాసములు రాయడం హాబీగా వుండేది. మా నాన్నగారు పన్నెండేళ్ల ప్రాయంలో వాళ్ళస్కూలు టీచరు ఈ హాబీల గురించి చెప్పి ప్రోత్సహించేరుట. ఆనాటినుంచి ఈనాటి వరకు మా నాన్నగారు ఆ హాబీలను విడనాడలేదు. ఈ రోజు ఆయనకు ఎనభై నాలుగు సంవత్సరాలు వచ్చినా ఈ మధ్య విశాఖపట్నంలో జరిగిన నుముస్మేటిక్ అండ్ ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్‌లో పాల్గొని తాను సేకరించిన పాతనాణెములు, పోస్టల్ స్టాంపులు కవర్లు, కార్డులు ప్రదర్శించేరు. ఈ హాబీ చాలా వినోదాన్ని కలిగించడమేకాకుండా ఎంతో విజ్ఞానాన్ని కలిగిస్తుంది. పోస్టల్ స్టాంపులలో ఎందరో మహానుభావులు, త్యాగధనులు, భారతదేశ కీర్తిని నలుమూలలా చాటిన మేధావులు, సైంటిస్టులు, గాయకులు మహర్షులు, రాజకీయ నాయకులు వంటి మహనీయుల చిత్రాలే కాకుండా భారతదేశంలో ప్రసిద్ధిచెందిన దేవాలయాలు, కోటలు, విద్యాలయాలు, భవనాలు, పూల, పండ్లరకాలు, జంతువులు, పక్షులు, మన సంస్కృతిని తెలియజేసే అనేక చిత్రాలను పోస్టల్ స్టాంపులద్వారా మన ప్రభుత్వం విడుదల చేయడం ఎంతో గర్వించదగ్గ విషయం. స్టాంపులు చూడముచ్చటగా వుండ డంతో చాలామంది వాటిని కొని పదిలంగా దాచుకుంటున్నారు. ఆ హాబీవున్న వారి సంగతి చెప్పనే అక్కర్లేదు. ఎక్కడ కొత్తరకం స్టాంపు కనిపించినా తీసిదాస్తారు.

అలాగే స్వాతంత్ర్యానికి ముందు, తరువాత రిజర్వు బ్యాంకువారు అనేకరకాల నాణేలను, కరెన్సీని విడుదలచేసారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా కానీ, అర్ధణా, అణా, బేడ, పావలా, అర్ధరూపాయి, రూపాయి వంటి నాణెములు చెలా మణిలో వుండేవి. బహుశా 1954వ సంవత్సరంలో భారత ప్రభుత్వం కొలతలు, తూకముతో పాటు దేశకరెన్సీ, నాణెములను కూడా ఇప్పుడు వున్న దశాంశ పద్ధతి లోకిమార్చింది. అప్పటినుంచే తూనికలలో వీశెలనుంచి కిలోగ్రాములకు, కొలతలలో శేరునుంచి లీటరుకు, గజమునుండి మీటరకు మార్చబడింది.

నాణెములలో నయాపైసా, రెండు, మూడు, ఐదు, పది, ఇరవైఐదు, యాభై పైసలు, ఒకరూపాయి, రెండు రూపాయల నాణేలు వచ్చి పాతనాణేలకు, పద్ధతికి స్వస్తి పలికేయి. పాతనాణెములు, కరెన్సీ దాచినవారు నేటి తరానికి వాటినిచూపి విలువను తెలియజేస్తున్నారు. కరెన్సీ,నాణెములలో కూడా నేడు ఎన్నో నాయకుల బొమ్మలతోపాటు ముఖ్యమైన సందర్భాలలో దాని ప్రత్యేకత తెలుపుతూ క్విట్ ఇండియా, యాభై సంవత్సరాల స్వాతంత్ర్యం, ఫుడ్ అండ్ అగ్రికల్చర్, ఫేమిలీ ప్లానింగ్, క్రీడలు మొదలైన సంఘటనలు తెలియజేస్తూ అనేకరకాల నాణెములు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ హాబీ వున్నవారు వాటిని సేకరించి భద్రపరుస్తారు. ఈ హాబీలవలన ఎన్నో విషయాలు, వారి చరిత్ర, దేశంలో జరిగే ఎన్నో సంఘటనల గురించి

తెలుసుకోవడానికి అవకాశం కలుగుతుంది. చిత్రలేఖనం, నృత్యం, సంగీతం, ఎన్నో రకాల వాయిద్యాలు, క్రీడలు, కథలు, వ్యాసాలు వ్రాయడం, గార్డెనింగు మున్నగు విషయాలలో పెద్దలు, బాల్యంలోనే చిన్న పిల్లలకు చెప్పి ప్రోత్స హిస్తే పిల్లలు ఆకర్షితులై మంచి హాబీలను నచ్చినవి ఎన్నుకొని వారు ప్రయోజకులవు తారు. ఈ హాబీలు వలన ఆరోగ్యంతోపాటు ఎంతో విజ్ఞానాన్ని పొంది, హుషారుగా వుండి జీవితంలో ఎంతో రాణిస్తారు.

పిల్లలకు చిన్నతనం నుంచే ఉత్తరాలు వ్రాయడం, వ్యాసరచన, డిబేట్లలో పాల్గొనేటట్లుచేస్తే వారిలో పిరికితనం పోయి ధైర్యవంతులుగా తయారవుతారు. కొందరు రకరాల అగ్గిపెట్టెలు, సిగర్‌లైటర్లు, వాచీలు, పెయింటింగులు, బొమ్మలు, వింత వస్తువులు, అరుదైన వస్తువులు, గవ్వలు, రాళ్లు, గ్రీటింగు కార్డులు, శుభలేఖలు వంటివి సేకరించి గిన్నిస్‌బుక్, లిమ్కాబుక్ రికార్డుల వంటివాటిలోకి ఎక్కి ప్రపంచ దృష్టిలోకి వెళ్లి పేరు తెచ్చుకుంటున్నారు.

ఈ హాబీలు వినోదం, విజ్ఞానం అందించడమేకాకుండా ఒక్కోసారి ఎంతో సంపదని కలుగజేస్తాయి. కొందరు ధనికులు మోజుపడి సేకరించిన విలువైన వస్తువులు, పోస్టల్‌స్టాంపులు,నాణెములు, పెయింటిగ్సు వగైరాలను లక్షలు ఖరీదుపెట్టి కొంటున్నట్లు తెలుస్తోంది. విదేశీయులలో ఈ మోజు ఎక్కువ. కొందరు మహానుభావులు వ్రాసిన వుత్తరాలు, వారు వినియోగించిన వస్తువులు సేకరించిన వస్తువులులు లక్షలు, కోట్ల రూపాయలతో కొందరు విదేశీయులు కొనడం, అమ్మడం గురించి వార్తాపత్రికలు చదివేవారికి తెలిసిన విషయమే. అందుచేత మంచి హాబీలను పెద్దలు ప్రోత్సహించి, వారికి సహకరిస్తూ వుంటే పిల్లలతోపాటు పెద్దలకు కూడా మంచి కాలక్షేపంతోపాటు ఆరోగ్యం, వినోదం, విజ్ఞానం కలగడమే కాకుండా కీర్తిప్రతిష్టలను కూడా సంపాదించి పెడతాయి.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 2007)

❁ ❁ ❁

ఇదో పెళ్లి కథ

కాలింగ్‌బెల్ అదేపనిగా మ్రోగడంచూసి పేపరు చదువుతున్న వెంకట్రామయ్యగారు వెళ్లి తలుపుతీసి, ఎదురుగా వున్న కొత్త వ్యక్తిని చూసి ఆశ్చర్యపోతూ ఎవరు కావాలని అడిగారు. వచ్చిన కొత్త వ్యక్తి ఎగాదిగా నాలుగువైపులా చూసి వెంకట్రామయ్యగారు కావాలని చెప్పడంతో మరింత ఆశ్చర్యపోతూ నేనే వెంకట్రామయ్యను లోనికిరండి అని ఆ కొత్త వ్యక్తిని ఆహ్వానించాడు. ఆ వ్యక్తిలోనికి వచ్చి సోఫాలో చతికిలపడి ఇల్లంతా పరికిస్తూ 'నాపేరు లక్ష్మీ నరసయ్య, విజయవాడ నుంచి వస్తున్నాను. అక్కడ నేను ఎలక్ట్రానిక్ గూడ్స్ బిజినెస్ చేస్తూ వుంటాను. కొండపల్లి దగ్గర పాతిక ఎకరాలు మాగాణి భూమి వుంది. వ్యవసాయం కూడా చేస్తూ వుంటాను.

నాకు ఒక అబ్బాయి, అమ్మాయి వున్నారు. అబ్బాయేమో బి.కాం చదివి నాతోపాటు బిజినెస్, వ్యవసాయంలో సాయంచేస్తాడు. ఇక మా అమ్మాయి నీరజ ఎం.టెక్ కంప్యూటర్ ఇంజనీరింగ్ చదివి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తోంది అని చెప్పడంతో అతని రాకకు అర్థంకాక వెంకట్రామయ్యగారు దిక్కులు చూడసాగారు.

ఇంతలో వాళ్ళమ్మాయి రెండు కప్పుల కాఫీ అందించడంతో ఇద్దరూ కాఫీ తీసుకుని త్రాగుతూ ఆ వచ్చిన వ్యక్తి మీ అమ్మాయా అని అడిగాడు.

వెంకట్రామయ్యగారు మా అమ్మాయి లక్ష్మి. ఎం.సి.ఏ చేస్తోంది. మా అబ్బాయి ఎం.టెక్ పాసై స్టేట్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. మాకూ ఇద్దరు పిల్లలు అని క్లుప్తంగా చెప్పారు.

చల్లకి వచ్చిముంత దాచడం ఎందుకన్నట్లు నేను వచ్చిన పని చెబుతున్నాను. అమెరికాలో మీ అబ్బాయి, మా అమ్మాయి ఇద్దరూ ఒక కంపెనీలోనే ఉద్యోగాలు చేస్తున్నారట. ఇద్దరూ ఒక ఇంట్లోనే వుంటున్నారు. ఇద్దరూ ప్రేమించుకొని పెళ్లి చేసుకోవాలని నిర్ణయానికి వచ్చారు. పెళ్ళి పెద్దలతో జరిపించుకోవాలని ఉద్దే శంలోవుండి ఇంకాపెళ్లి చేసుకోలేదు. మీ అబ్బాయికి మీ దగ్గర భయం అవడంవలన మీకు చెప్పడానికి భయపడుతున్నాడట. మా అమ్మాయి అన్నీ వివరంగా ఈ ఉత్తరంలో వ్రాసింది. మీరే చదవండి అని ఉత్తరం అందించాడు. వెంకట్రామయ్యగారికి మతి పోయినంతపనై ముఖానికి పడుతున్న చెమట తుడుచుకుని ఉత్తరం చదివాడు.

నాన్నగారికి, నీరజ నమస్కరించి వ్రాయునది. ఇక్కడ నేను హాయిగా వున్నాను. అక్కడ మీరు, అమ్మ అన్నయ్య క్షేమమని తలుస్తాను. ఎన్నో రోజులనుంచి మీకొక విషయం చెప్పాలనుకుంటున్నాను. ఎలా చెప్పాలో తెలియక ఇన్నాళ్లూ మీకు చెప్పలేదు. విశాఖపట్నం నుంచి వచ్చిన అబ్బాయి శ్రీకాంత్ ఎం.టెక్. పాసై ఇక్కడ మా కంపెనీ లోనే ఉద్యోగం చేస్తున్నాడు. చాలా మంచివాడు. రెండు సంవత్సరాలనుంచి అతనితో కలసి పనిచేస్తున్నాను. ఒకరంటే ఒకరం ఇష్టపడ్డాము. ఇద్దరూపెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాము. శ్రీకాంత్ వాళ్ళ నాన్నగారికి పెళ్ళి విషయం చెప్పడానికి భయపడతున్నాడు. వారికి కులం పట్టింపువుందిట. ఎలాగైనా వారిని ఒప్పించి పెద్దల సమక్షంలోనే మా ఇద్దరి వివాహం జరగాలని మా కోరిక. అందుకు ఆడపిల్ల తండ్రిగా నువ్వు విశాఖపట్నంలో వారింటికి వెళ్ళి విషయం చెప్పి పెళ్లికి ఒప్పించ వలెను. మీ ద్వారా అయితే తొందరగా పనవుతుందని శ్రీకాంత్ ముందుగా మీకు తెలియజేయమన్నాడు. విశాఖపట్నం వాళ్ళ అడ్రస్సు, శ్రీకాంత్ ఫోటో మీకు పంపు తున్నాను. అమ్మకు అన్నయ్యకు చూపండి. మీరు మమల్ని క్షమించి ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నాను

ఇట్లు – నీరజ.

వెంకట్రామయ్యగారికి చెమటలు పట్టడంతో లోపలికివెళ్లి భార్యకు ఉత్తరం చూపించి తలపట్టుకున్నాడు. వెంకట్రామయ్యగారి భార్య లలితమ్మగారు ఉత్తరం చదివి భర్తతో డ్రాయింగ్‌రూములోకి వచ్చి ఎదురుగా సోఫాలో కూర్చున్న లక్ష్మీ

నరసయ్యగారిని చూసి,'మాకుఒక్కగా నొక్క కొడుకు. వాడిమీద ఎన్నో ఆశలు పెట్టుకొని కష్టపడి చదివించాము. ఇంకా మా అమ్మాయికి పెళ్ళిచేయాలి. మా అబ్బాయికి కులాంతర వివాహంచేస్తే అమ్మాయికి పెళ్లిచేయడం కష్టమవుతుంది. అయినా మాకు ఆస్తిపాస్తులు లేవు. మీ అమ్మాయికి వేరే సంబంధంచూసి చేయండి. అంతే కానీ ఈ పెళ్ళికి మేము ఒప్పుకోము. అంటూ కన్నీళ్ళు పెట్టుకొన్నారు.

లక్ష్మీనర్సయ్య అమ్మాయి రాసిన ఉత్తరం తీసుకొని కండువా దులుపుకొని భుజంపై వేసుకొని నిలబడి అమ్మా! ఇంతవరకు వచ్చేక పెళ్ళి ఆగడమంటూ జరగదు. పిల్లలు ఇద్దరూ ఇష్టపడి ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోవడానికి ఇష్టపడి మన పెద్దరికం నిలిపి మనమీద బాధ్యత పెట్టారు. మీరు వచ్చినా రాకపోయినా మా అమ్మాయిని మీ అబ్బాయితో విజయవాడలో వివాహము జరిపిస్తా. మీ మర్యాద కాపాడుకొని మీరువస్తే అక్షింతలువేసి దీవించవచ్చు. ఏ విషయం ఆలోచించి నాకు వారంరోజులలో తెలపండి. ఇక శలవు. వస్తాను అంటూ గాలివానలా వచ్చి వెళ్లాడు.

వెంకట్రామయ్యగారు, లలితమ్మగారు తలపట్టుకొని చాలాసేపు దుఃఖించి కొడుకు శ్రీకాంత్‌కి ఫోను చేశారు. కొడుకు శ్రీకాంత్ ఆ అమ్మాయిని తప్ప ఎవరినీ పెళ్లి చేసుకోనని, క్షమించమని చెప్పడంతో ఒక ఆలోచన వచ్చి, నలుగురిలో నవ్వుల పాలు అవడం ఇష్టంలేక కూతురు భవిష్యత్తు భగవంతునికి వదలి, పెళ్ళికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చి శుభలేఖలు అచ్చువేయించి పంచి, కులాంతర వివాహమైనా తప్పనిసరి పరిస్థితులలో ఒప్పుకొని పెద్దరికం నిలబెట్టుకోడానికి పెళ్లి జరిపిస్తున్నామని, తప్పక అందరూ పెళ్ళికి రావాలని సంజాయిషీ చెప్పుకుంటూ అందర్నీ పెళ్ళికి ఆహ్వానించి ఘనంగా పెళ్ళి జరిపించారు. శుభమస్తు !

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 2007)

❋ ❋ ❋

కొత్తదనం కోరుకుంటున్న నేటితరం

ఏమిటీ తండ్రీ కొడుకులిద్దరూ అంతగట్టిగా మాట్లాడుకుంటున్నారు అంటూ వెంకట్రామయ్యగారు నవ్వుతూ రామారావు గారింట్లో అడుగుపెట్టారు. 'రా! బాబూ రా! మంచి టైముకు వచ్చావు. ఈ కాలం కుర్రాళ్ళకి డబ్బంటే లక్ష్యం లేకుండా పోయింది. డబ్బు విలువ అసలు తెలియడం లేదు. హీరోహోండా బండి కొని ఇంకా సంవత్సరంకాలేదు. మరేదో కొత్తమోడల్ మోటారుసైకిలు వచ్చిందని దీన్నిచ్చి కొత్తబండి కొంటానని ఇంట్లో గొడవచేస్తున్నాడు. మా చెల్లి, నేనూ వద్దంటున్నాము. ఆ మధ్య ఇలాగే సంవత్సరం క్రితం రెండువేలు ఇచ్చి కొన్న రిస్టువాచీ ఐదువందలకి అమ్మి మూడువేలిచ్చి కొత్తవాచీకొన్నాడు. మనం వాచీయో, సైకిలో కొనుక్కుంటే జీవితాంతం వాడుకునేవారం. పాతదైనా ఇంట్లో వస్తువు అమ్మడానికి బాధగా వుండేది. సెల్‌ఫోన్లు అలాగే మార్చి కొత్తవీ కొంటున్నారు.

వెంకట్రామయ్యగారు నవ్వుతూ రోజులు మారేయిరా నాయనా, మనం ఉద్యోగంలో చేరినపుడు మూడువందలు జీతంవస్తే గొప్పగా వుండేది. ముప్పయి ఏళ్లు సర్వీసుచేస్తే అతికష్టంమీద ఇరవైవేలు జీతం అయింది. కానీ ఇప్పుడు కుర్రాళ్లకి ఉద్యోగంలో చేరేసరికే నెలకి ముప్పయివేలు, ఏభైవేలు జీతాలు వస్తున్నాయి. వాళ్లకి ఆ డబ్బు ఎలా ఖర్చుచేయాలో తెలియడంలేదు. అప్పటికీ ఐదురూపాలకి వచ్చే కప్పు కాఫీ స్టారు హోటల్స్‌కి వెళ్లి ముప్పై రూపాయలిచ్చి త్రాగి వస్తున్నారు. ఈ రోజుల్లో మందు బాబులకి డబ్బు ఖర్చవుతుంది. కానీ మనటోటివాళ్లకి వృధాగా ఖర్చుచేస్తే బాధ కలుగుతుంది అన్నాను.

ఈ మధ్య చాలామంది ఇల్లు కట్టుకొని లేక కొనుక్కుని ఇంటికి కావల్సిన హంగులన్నీ ఏర్పాటుచేసుకుని, హాయిగా వుంటూ మరో మోడల్ ప్లాటుచూసో, ఇల్లు చూసో కొత్త ఇల్లు కొనడానికో మోజుపడి కొంటున్నారు. పాత ఇల్లు అద్దెకివ్వడమో, అమ్మడమో చేస్తున్నారు. టీవీలు వచ్చిన కొత్తలో అంతా బ్లాక్ అండ్ వైట్ టీవీలు కొన్నారు. కలర్ టీవీలు వచ్చాక వాటిని అమ్మి కొత్తగా కలర్ టీవీలు కొన్నారు. తర్వాత వీడియో కాసెట్లు, వీసీపిలు, సీడీలు, విసిడీలు, డీవిడీలు కొని విసిపి కాసెట్లను అటకెక్కించారు. టీవీలలో కొత్త మోడల్స్ కొత్త టెక్నాలజీతో వచ్చిన వాటిని చాలామంది కొత్త కలర్ టీవీలైనా చౌకగా అమ్ముకుంటున్నారు.

ఇంతవరకు బాగుంది. ఈమధ్య కొందరు ప్రేమించి పెళ్లిచేసుకున్న జంటలు ఐదారు సంవత్సరాలు కాపురంచేసి మోజు తీరాక విడాకులు తీసుకుని విడిపోతున్నారు. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలుచేస్తున్న జంటలే ఎక్కువగా విడిపోతున్నారు. విడిపోయి కొన్నాళ్లు ఒంటరిజీవితం అనుభవించి మరల వివాహం చేసుకోవడానికి ముందు కొస్తున్నారు. ఒకనాడు మగవాడికి భార్య చనిపోయినా, భార్య విడిచిపెట్టినా మరల పెళ్లి సమస్యగా వుండేది కాదు. పిల్లనివ్వడానికి ఆడపిల్లల తండ్రులు క్యూలో నిలబడేవారు. మగమహారాజులా దర్పంగా పెళ్లి చేసుకునే వాడు భర్తచనిపోయిన విధవ స్త్రీని, భర్త వదిలేసిన విడాకులు తీసుకున్న స్త్రీని ఏ మగాడు ముందుకు వచ్చి వివాహం చేసుకోవడానికి ఇష్టపడే వారు కాదు. కానీ నేడు వస్తువుల్ని మార్చినట్లుల భార్యను వదిలేసి రెండవ పెళ్లికి సిద్ధమవుతున్నారు.

అవివాహితే భార్య కావాలని కోరుకోవడం లేదు. విధవ స్త్రీయైనా, విడాకులు తీసుకున్న స్త్రీ అయినా నచ్చితే వివాహం చేసుకుంటున్నారు. మరికొందరు కొత్తదనం కోరుకుని విడిపోయి మరొకర్ని వివాహం చేసుకుంటున్నారు. ఈరకమైన నాగరికత ఈ మధ్య హైదరాబాద్, బొంబాయి, బెంగుళూరు, ఢిల్లీ, చెన్నై వంటి నగరాలలో బాగా కనిపిస్తోంది. కొందరు పత్రికల్లో పబ్లిగ్గా ప్రకటనలు ఇచ్చి మరీపెళ్లి చేసుకుంటున్నారు. కొన్ని పత్రికలలో ఈ వింత ప్రకటనలు (రెండవ పెళ్లికి ఆశపడే స్త్రీ పురుషులు) చాలా మంది ఇవ్వడం ఆశ్చర్యాన్ని కల్గిస్తోంది. కొందరు ఇరుగుపొరుగువారిపై మోజుపడి బంగారంలాంటి కాపురాల్ని అనురాగ దాంపత్యాన్ని వదులుకొని పాశ్చాత్య

నాగరికత మోజులోపడి కొట్టుకుపోతున్నారు. ఉద్యోగాలు చేస్తున్న స్త్రీ పురుషులు ఇంట్లో భర్త లేక భార్యతో కన్నా ఎక్కువ కాలం ఆఫీసులో గడపడంవలన ఒకరికి తెలియకుండా ఒకరు ఆకర్షితులై వివాహితులు, అవివాహితులు కూడా సన్నిహితులై తర్వాత వివాహితులవుతున్నారు. కొందరు వివాహం చేసుకోకుండా అక్రమ సంబంధాలతో జీవితాన్ని వెళ్లబుచ్చుతున్నారు. పిల్లల కోసం పెళ్లి, అనుభవించడానికి జీవితం అనే పంథాలో యువత నడుస్తోంది. బాయ్‌ఫ్రెండ్స్, గర్ల్‌ఫ్రెండ్స్ సంస్కృతి నేడు యువతలో పెరగడంతో హైస్కూలు, కాలేజీలో చేరగానే అబ్బాయిలు, అమ్మాయిలు చెట్టాపట్టాలేసుకు తిరుగుతూ సినిమా హీరోహీరోయిన్లని అనుకరిస్తూ సరదాలు తీర్చుకుంటున్నారు.

ఈ విషసంస్కృతిని ఆపడం నేటి తల్లిదండ్రులకు, గురువులకు సాధ్యం కావడంలేదు. దావానలంలా, చాపకింద నీరులా అంతటా ఇది వ్యాపిస్తోంది. ప్రస్తుత విద్యావిధానం, సినిమాలు టీవీ విన్యాసాలు మారనంతకాలం పెడత్రోవ పడుతున్న యువతను బాగుచేయడం సాధ్యంకాదు. ఫేమిలీప్లానింగ్, ఎయిడ్స్ పేరుతో చదువు కంటే ముందు ప్రకటనలద్వారా చిన్నారుల మనస్సుల్లో సెక్సుపై కుతూహలం కలిగిస్తున్న పద్ధతి మారి చిన్నారులకు బాల్యంలోనైనా కనీసం నీతి శతకాలు, రామాయణం, భారత, భాగవత కథలు చెప్పి ఉత్తములుగా తీర్చిదిద్దాలి.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 2006)

❁ ❁ ❁

స్వర్గం మన చేతిలోనే !

నా కర్మకాకపోతే బోలెడు సంబంధాలు, ఆస్తిపరులు, లాయర్లు, ఇంజనీరు సంబంధాలువస్తే కాదని మిమ్మల్ని పెళ్ళి చేసుకోవడం ఏమిటి? ఎర్రగా బుర్రగా ఉన్నారని చూసేను కానీ ఆస్తిపాస్తులు ఉద్యోగం గురించి ఆలోచించలేదు. గొర్రెతోక బెత్తెడన్నట్లు అగ్రికల్చర్ ఆఫీసర్‌గా పాతికేళ్ళు, ఎ.డి.ఏగా ఎనిమిదేళ్ళు వెలగబెట్టి రిటైరయ్యారు. వయసులో వున్నప్పుడు ముద్దు ముచ్చట తీరలేదు. ఇప్పుడేమో ఓపిక లేదు అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతూ దీర్ఘాలు తీస్తూ భర్త వెంకట్రామయ్యని దెప్పి పొడవటం లక్ష్మమ్మకి అలవాటు. రోజుకొకసారైనా ఈ మాటలు అనందే లక్ష్మమ్మకి పొద్దుపోదు.

వెంకట్రామయ్యకి చెవిలో జోరీగలా పోరుతూ ఉంటే విని విని పోనీ ఇప్పటికైనా మించిపోయిందేంలేదు. నాకు విడాకులు ఇచ్చి నీకు కావలసిన వాణ్ని కట్టుకో. నీ కోరికలు అన్నీ తీర్చేవాడు వస్తాడు అనేవారు ఒళ్ళుమండి.

ఈ జన్మకంత భాగ్యమా ! నా నుదుట సుఖపడే యోగం ఆ బ్రహ్మరాయలేదు. లేకపోతే అందరిలాగే ఉండేదాన్ని. ముచ్చటగా ముగ్గురు పిల్లల్నికన్నా ఒక్క కొడుకు నివ్వకుండా ముగ్గురూ ఆడపిల్లలే పుట్టాలా? నా తోటికోడళ్లు ఈ రోజు ఒంటినిండా

బంగారాలు సింగారించుకొని కార్లలో తిరుగుతూ వుంటే మీరు మాత్రం ఆ డొక్కు స్కూటరు మీదే తిప్పేరు కానీ హీరో హోండా హోండా మోటార్‌సైకిలైనా కొన్నారు కాదు. జీవితం అనుభవించాలండీ. భయపడతూ ఉంటే అడుగు ముందుకువెయ్యలేరు. పిల్లల చదువులు, తరువాత పెళ్ళిళ్లు, పురుళ్లు పుణ్యాలతోనే జీవితం గడిచిపోయింది. ఇక ఎప్పుడు మనం సుఖపడ్తామండీ అంటూ నిట్టూర్పు విడిచారు లక్ష్మమ్మ.

ఇలా అసంతృప్తితో జీవించేవారు నేడు చాలామంది మనకి కనిపిస్తూఉంటారు. జీవితంలో ఏ లోటూ లేకపోయినా ఎన్ని సుఖాలున్నా అసంతృప్తితో అలమటిస్తూ ఉంటారు. నిజానికి లక్ష్మమ్మకి ఏ లోటూలేదు. అనురాగంగా, ప్రేమగా చూసే భర్త ఉన్నాడు. ఉండటానికి ఇల్లు ఉంది. తినటానికి తిండి, కట్టుకోటానికి బట్టకి లోటు లేదు. ముగ్గురూ అమ్మాయిలే అయినా అందంగా ఉండటంవల్ల, పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తిచేయటంవల్ల ఎక్కువ కష్టపడకుండానే పెళ్ళిళ్లు అయ్యాయి. వారి అదృష్టం కొద్దీ ముగ్గురు అల్లుళ్లు మంచివారే. ఒక్కపైసా వీరి నుంచి ఆశించరు. వారు చాలా ఆనందంగా జీవిస్తున్నారు. నిజానికి లక్ష్మమ్మకి ఏంలోటు లేకపోయినా లక్ష్మమ్మకి భర్తని సాధిస్తేకానీ నిద్రపట్టదు. వెంకట్రామయ్య ఇలా అనుకుంటూ ఉంటాడు. భగవంతుడు అన్నీ ఇచ్చి తృప్తి అనేది మాత్రం ఇవ్వడం మరచిపోయాడు. అందుకే నీకు ఎన్ని ఉన్నా సంతృప్తిలేదు. లేని వాటి కోసం అలమటిస్తూ ఉంటావు. వున్నవాటితో సంతృప్తి చెందవు. కొందరి జీవితాలు ఇంతే అని.

జీవితం ఆనందంగా మధురంగా సాగాలంటే ఉన్నదానితో తృప్తి పడటం నేర్చుకోవాలి. మనకన్నా ఉన్నతంగా అన్నివిధాలా బాగున్నవారిని చూసి ఈర్ష్య పడకూడదు. మనకన్నా తక్కువగా వున్నవారిని, కష్టాలలో ఉన్నవారిని చూసి వారికన్నా ఎన్నో రెట్లు మనం బాగున్నామని తృప్తి పడాలి. ముఖ్యంగా తోటికోడళ్ళతో, స్నేహితులతో పోల్చుకుని వారు మనకన్నా ఉన్నత స్థితిలో ఉన్నారని బాధపడకూడదు. మన పూర్వజన్మసుకృతం వల్ల మనకి లభించిన దానితో తృప్తిపడాలి. దేశంలో ఉన్న ఎందరో అభాగ్యులకన్నా మనం ఉన్నతంగా ఉన్నందుకు తిండిబట్ట లోటులేనందుకు గర్వపడాలి. అప్పుడే అందం ఆనందం కలుగుతుంది. తృప్తి లేక జీవితంలో చాలా మంది అశాంతితో అలమటిస్తున్నారు. వారు సుఖంగా ఉండరు. ఎదుటి వారిని సుఖంగా ఉండనివ్వరు. అన్నీ ఉన్నా ఏదో లేదని లక్ష్మమ్మ అలమటిస్తూ ఉంటుంది. కొందరి దృష్టిలో డబ్బు ఎక్కువంటే సుఖం ఉంటుందనుకొంటారు. కార్లు,మేడలు, హోదా ఉంటేసుఖంగా బతుకున్నారనుకొంటారు. కానీ మంచి మనసుతోవున్న దానితో తృప్తిపడితే ఆనందానికి లోటు వుండదు. ఉన్నదానితో తృప్తితపడితే స్వర్గసీమ మనింట్లోనే కనిపిస్తుందనటంలో సందేహంలేదు.

(ఆంధ్రభూమి దినపత్రిక - ప్రియదర్శిని - 26-4-2007)

❀ ❀ ❀

మీ సంపాదన ఎవరికోసం ?

ఈమధ్య డబ్బు సంపాదన పిచ్చి రోజురోజుకి ఎక్కువవుతోంది. కావలసినంత ఆస్తి, డబ్బు, సంపద, హోదావున్నా అయినవాళ్లను, కన్నవాళ్లను వదలి యింకా డబ్బు సంపాదించాలని విదేశాలకు, అమెరికా, ఆస్ట్రేలియా, దుబాయి, ఇరాన్ ఒకటేమిటి ఎక్కడ అవకాశంవస్తే అక్కడకు స్వదేశాన్ని, మాతృదేశాన్ని వదలి వలసలు వెళ్ళిపోతున్నారు. వెళ్లేటప్పుడు ప్రతీ ఒక్కరూ అక్కడ నాలుగైదు సంవత్సరాలువుండి రెండుచేతులా సంపాదించి, స్వదేశానికి తిరిగివచ్చి కాలుమీద కాలు వేసుకుని కూర్చుని తింటామని కబుర్లుచెప్పి వెళ్ళి అక్కడే స్థిరనివాసం ఏర్పాటుచేసుకున్నవారు రోజు రోజుకి ఎక్కువతున్నారు.

కొందరు పిల్లలు పెద్దవాళ్లకిష్టంలేకపోయినా మభ్యపెట్టి, తియ్యని కబుర్లుచెప్పి అమెరికా వంటి దేశాలకు వెల్లడం, మలర తిరిగి రాకపోవడం జరుగుతోంది. కొందరు పెద్దవాళ్లకి వాళ్లపిల్లలు విదేశాలలో వున్నారంటే గొప్పగా వుంటుంది. మా అబ్బాయి అమెరికాలో వున్నాడు. మా అల్లుడు దుబాయిలో వున్నాడని గొప్పగా చెప్పుకుంటూ ఆనందిస్తారు. వారికి వున్నది ఒకరు, ఇద్దరూ పిల్లలైనా తినడానికి వుండడానికి కావలసినంత ఆస్తిపాస్తులున్నా, మంచి ఉద్యోగంవున్నా పిల్లల్ని ప్రోత్స హించి, విదేశాలకు పంపే తల్లిదండ్రులున్నారు. నాకు తెలిసిన మిత్రునికి ఒక అబ్బాయి, అమ్మాయి వున్నారు. ఒకరిని డాక్టరు, మరొకర్ని ఇంజనీర్ చేయాలని కలలుకని, అమ్మాయిని డాక్టర్, అబ్బాయిని ఇంజనీరింగ్ చదివించేడు. ఇల్లు, భూములు ఆస్తి అన్నీ వున్నాయి. అయినా వారిద్దరు పిల్లల్ని విశ్వప్రయత్నంచేసి మొదట వీసా రాకపోతే ఎందరో దేవుళ్లకు మొక్కుకున్నారు. చివరకు వారి ఆశ ఫలించి అమెరికా ఇద్దరూ వెళ్ళేరు.

రెండు సంవత్సరాలు గడచేసరికి వారికి పిల్లలు దగ్గరలేనిలోటు తెలిసింది. తరువాత మెల్లగా పిలిపించి ఇద్దరకు పెళ్ళిళ్లుచేసి పంపించారు. అక్కడ ఐదేళ్ళు వుండివస్తామని చెప్పినవారు పది సంవత్సరాలు దాటినారాలేదు. ఇక్కడ ఇల్లు, భూములు, తోటలుచూసి ఇవి ఎవరికోసం, ఎందుకోసం అనీ రోజుకొకసారైనా కన్నీరు కారుస్తాడు. తండ్రి యిచ్చిన ఆస్తిని తన తెలివితేటలతో నాలుగింతలు పెంచేడు. కానీ వుండి అనుభవించడానికి పిల్లలుదగ్గరలేరు. దానికితోడు బెంగతో కొత్తగా బ్లడ్ ప్రెషర్, సుగరు వ్యాధులు వచ్చేయి. తరగని ఆస్తివున్నా తినడానికి, అనుభవించడానికి నోచుకోలేదని బాధపడతూ వుంటాడు. ఇటువంటివారు నేడు దేశంలో చాలామంది వున్నట్లు తెలుస్తోంది.

వీరిసంగతి ఇలావుంటే కొందరు మధ్య తరగతి కుటుంబీకులు, కాయకష్టంతో బ్రతికేవారు మనదేశంలో కన్నా అరబ్‌దేశాలు, ఆఫ్రికన్ దేశాలు వంటి విదేశాలలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చుని, ఆస్తి కూడబెట్టవచ్చునని విదేశాలు వలసలు వెళ్లే వారున్నారు. వారు కాయకష్టంతో సంపాదించి ఇంటికి పంపిస్తూ వుంటే ఇక్కడ

జల్సాగా హాయిగా కూర్చుని తింటూ వుంటారు. కాని వారి జీవితమాధుర్యాన్ని కోల్పోతున్నారు. అనుబవించే వయసులో భార్య ఒకచోట, భర్త ఒకచోట వుంటే వారి జీవితం నరకమే! కానీ కొందరు ఉద్యోగ వ్యామోహంలో విదేశీ వ్యామోహంతో, ధన వ్యామోహంతో కన్నవారిని, కట్టుకున్నవారిని కూడా స్వదేశంలో విడచి, విదేశాలు వెళుతున్నారు. వాళ్లువిదేశాలలో కొన్ని సంవత్సరాలుండి, డబ్బు కూడబెట్టుకుని మిగతా జీవతాన్ని సుఖంగా బ్రతకాలని కలలుకంటారు. అనుభవించే వయసులోను, జీవిత మాధుర్యాన్ని, అందాల్ని చవిచూడవలసిన రోజులలో డబ్బుకోసం భార్య ఒకచోట, భర్త ఒకచోట వుంటేవారి జీవితం వ్యర్థమని చెప్పాలి.

జీవితంలో క్షణంగడిస్తే తిరిగిరాదు. మనదికాదు. వయసులోను, యవ్వనంలో వున్న కోరికలు, వయసుడిగిన తరువాత వేలు, లక్షలు ఖర్చుచేసినా లభించవు. పోయిన వయసు తిరిగిరాదు. అందుచేత కొత్తగా పెళ్ళిచేసుకున్న భార్యాభర్తలు వున్నదాంట్లోనే తృప్తిగా బ్రతకడం నేర్చుకోవాలి. ఒకవేళ విదేశాలకు వెళ్ళవలసివస్తే, భార్య, భర్తలు ఇద్దరూ కలిసి వెళ్ళాలికాని, ఒక్కరు వెళ్ళి, భార్య ఒకచోట, భర్తఒక చోట వుండడం భావ్యంకాదు. కొన్నాళ్లు ఎడబాటు భరించవచ్చుకానీ ఏళ్ళతరబడి ఎడబాటు మంచిదికాదు. డబ్బు సంపాదించినా ఆరోగ్యంతోపాటు నైతిక పతనానికి దారితీస్తుంది. పూర్వపు రోజులలో ఉమ్మడి కుటుంబాలవలన భయము, భక్తి వుండేవి. ఈరోజు వేరింటి కాపురాలవలన, మనచుట్టూ వుండే వాతావరణ ప్రభావంవల్ల ఒంటరి జీవితం గడపడం చాలా కష్టం. డబ్బు సంపాదనే ధ్యేయంగా పెట్టుకోకుండా జీవితమాధుర్యాన్ని కూడా చవిచూడాలి. అది లేనప్పుడు సంపాదన వ్యర్థం. ఇది ఎవరికోసమో ఎందుకోసమో ఒకసారి ఆలోచించండి !

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 28–10–2003)

❁ ❁ ❁

మంచి మనసుండాలి !

మా అన్నయ్యగారి ఇద్దరు పిల్లలు ఈ మధ్య మా ఇంటికివచ్చి బాబాయిగారూ మా పెద్ద మామయ్యకి షష్టిపూర్తి చేయాలనుకొంటున్నాము. పెద్దవారు మీరొచ్చి మాకు అన్నివిధాల సాయంచేయాలన్నారు. నేను ఆశ్చర్యంగా వారిద్దరివైపు చూసి మీ పెద్దమామయ్యకి ఇద్దరు తమ్ముళ్ళున్నారు కదా ! వారు పూనుకొని చేస్తే బాగుంటుంది కానీ చిన్నవాళ్ళు మీకెందుకు యాతన అన్నాను.

మీకు తెలియనిదేముంది. పెద్దమామయ్యకి పిల్లలు లేరు. దానికితోడు వాడి ఆరోగ్యం బాగులేదు. పాపం అతనికి ఏ సరదాలు తీరలేదు. చిన్నమామయ్య, బుచ్చి మామయ్యలకి చెబితే మేము ఇప్పుడు ఖర్చులలో వున్నాము. తీరుబడిలేదు. ఇటువంటివి ఏమీ పెట్టకు అని నిర్మొహమాటంగా చెప్పారు. అందుకే మేమే పూనుకొని అన్నీ శాస్త్రోక్తంగా చేయాలను కొంటున్నాము అన్నాడు పెద్దబ్బాయి.

దానికి ఖర్చులెంత అవుతాయో అన్నీ కనుక్కున్నారా! అన్నాను. రెండో అబ్బాయి ఉత్సాహంగా, గణపతిహోమం, ఆయుష్షుహోమం, పూజ (షష్టిపూర్తి తతంగం) సత్యనారాయణవ్రతం, రుద్రాభిషేకం, సూర్యనమస్కారములు అన్నీ యధావిధిగా చేయడానికి ఐదుగురు పండితులు వస్తానన్నారు. బయటవాళ్ళు కాకుండా దగ్గర బంధువుల్ని మాత్రమే పిలిస్తే ఏభైమందివరకు అవుతారు. మొత్తం ముప్పై, నలభైవేల మధ్యలో అవ్వచ్చని అంచనా. మేము ఇద్దరం ఆ ఖర్చు భరించి రేపు వచ్చే అరవయ్యవ పుట్టినరోజునాడు జరిపించాలనుకొంటున్నాం అన్నారు.

రామలక్ష్మణుల్లా వున్న ఆ ఇద్దరన్నదమ్ముల్ని చూస్తే ముచ్చటవేసింది. ఇంత మంచి మనసు వారికున్నందుకు వారిని ఆశీర్వదించి, అభినందించాను. మా అన్నయ్య వదినల పెంపకానికి పొంగిపోయాను. డబ్బున్నంత మాత్రాన అందరికీ మంచి పనులు చేయాలని సంకల్పం కలుగదు. నిజానికి డబ్బు ఎక్కువైవారు ఈ సత్కార్యానికి పూనుకోలేదు. ఇంకా వారి పిల్లలు కాలేజీలలో చదువుకొంటున్నారు. అయినా వారి పెద్ద మామయ్యకి పిల్లలు లేకపోవడంవలన ఇంట్లో ఏ శుభకార్యం చేసుకోలేదని సత్సంకల్పంతో పిల్లలు మామయ్యకి షష్టిపూర్తి జరిపించాలని అనుకోవడం ఈ రోజుల్లో గొప్పవిశేషమే! కన్న తల్లిదండ్రులకు పుట్టినరోజులు జరపనివారు, బట్టలు కొని కనీసం తీపి తినిపించని కొడుకులున్న ఈ రోజుల్లో ఇంత మంచి మనసుతో ఒక మామయ్యకి మేనల్లుళ్ళు షష్టిపూర్తి మహోత్సవం జరపడం నిజంగా అభినందించ దగ్గ విషయం అనుకున్నాను.

తర్వాత ఆలోచిస్తూ– అందుకే పెద్దలు పుణ్యంకొద్దీ పురుషుడు, దానంకొద్దీ బిడ్డలు అంటారని అనుకున్నాను. ఇంతలో నాకు నా స్నేహితుడు సీతారామయ్య గుర్తు వచ్చాడు. అతనికి ముగ్గురు కొడుకులు, ముగ్గురు కూతుళ్ళు వుండి దిక్కుమాలిన చావు వచ్చింది. అతను ప్రభుత్వ ఉద్యోగంచేసి కొడుకుల్ని లాయరు, ఇంజనీరు, బ్యాంకు ఉద్యోగస్తుల్ని చేసి, ముగ్గురమ్మాయిల పెళ్ళిచేసాడు. అతని దురదృష్టమేమిటో కానీ రిటైర్మెంట్ అయిన రెండేళ్లకే అతని భార్య చనిపోయింది. పెద్దకోడలు గయ్యాళి అవడంవలన అక్కడ నుంచి ఏడాది తిరక్కుండానే రెండవ కొడుకు ఇంటికి వచ్చాడు. వారింట్లో ఆరు నెలలు వుండేసరికి విసుగుపుట్టి మూడవ కొడుకుఇంటికి వచ్చాడు. చిన్నకోడలు స్వయాన మేనకోడలు అవడంవల్ల రెండేళ్లు మామాగారిని బాగానే చూసుకుంది. కానీ బ్యాంకులో పనిచేస్తున్న ఆ అబ్బాయికి హైదరాబాద్ బదిలీపై వెళ్ళడంతో సీతారామయ్యకి కష్టాలు మొదలయ్యాయి. అక్కడ అపార్ట్‌మెంట్ చిన్నదని తండ్రిని స్వంత ఇంటిలోనే వుండమని అతనికి పెన్షన్ వస్తుంది కాబట్టి దానితో ఒక వంటమనిషిని పెట్టుకొని తింటూ వుండమన్నారు. ఊళ్లో వుంటున్న ఒక అమ్మాయిని అల్లుడ్ని అప్పుడప్పుడు సీతారామయ్య మంచిచెడ్డలు చూస్తూ వుండమని చెప్పి మూడవ కొడుకు హైదరాబాద్ వెళ్ళిపోయాడు. ఒక సంవత్సరం అలా గడిచింది. ఒకరోజు ఉదయం పనిమనిషి వచ్చి ఎంతసేపు తలుపుకొట్టినా తీయకపోవడంతో

ఆ ఊళ్లో వున్న అతని అమ్మాయికి, అల్లుడికి విషయం చెప్పగానే ఇరుగుపొరుగు సాయంతో తలుపులు బద్దలుకొట్టి లోనికి వెళితే మంచంపై శవమైపడివున్న సీతరామయ్య కనిపించాడు. ఏ అర్థరాత్రో గుండెనొప్పి వచ్చి చనిపోయివుంటాడని అనుకున్నారు. పిల్లలుండి అతని బ్రతుకలా అయిందని, వాపోయారు.

ఇటువంటి కొండుకులున్న ఈ రోజులలో బాల్యంలో తాతగారింట్లో సెలవు రోజులలో మామయ్యతో గడిపిన మధుర క్షణాలను ఆటలను గుర్తుచేసుకుని పిల్లలు లేని మామయ్యను, అత్తను అరవై ఏళ్ళ వయసులో వారిని ఆనందింపచేయడం ఎంతో హర్షదాయకం. స్వంత అన్నదమ్ములుండి, ఆర్థికస్తోమత వుండి వారు మాట వరసకైనా ముందుకు రాకపోవడం విచారిందగ్గ విషయం. ఆప్యాయతలు అను రాగాలు అంతరిస్తున్న ఈరోజుల్లో మంచి మనసుతో శుభకార్యం చేస్తానని ముందుకు వచ్చిన అమృతమూర్తులు మా అన్నయ్య పిల్లలనుకొన్నాను.

వృద్ధాప్యంలో కన్నతల్లిదండ్రులని కొడుకులు సరిగా చూడకపోవడంతో నేడు వృద్ధాశ్రమాలు, అనాధాశ్రమాలు కిటకిటలాడుతున్నాయి. పిల్లలకి స్కూళ్లలో, కాలేజీ లలో సీట్లు దొరకనట్లే వృద్ధులకి ఆశ్రమాల్లో సీట్లు దొరకడంలేదు. ఇక్కడా డొనేషన్లు మొదలయ్యాయి. దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవడం మంచిదన్నట్లు బ్రతికి వుండగానే దానధర్మాలు, పుణ్యకార్యాలు చేయడం మంచిది. ఆస్తులు, ధనం కూడబెట్టి పిల్లలకివ్వడం వలన ప్రయోజనం శూన్యం. ఈ తరంవారు పిల్లలనుంచి ఏమైనా ఆశిస్తే అది అత్యాశే అవుతుంది.

(ఆంధ్రభూమి దినపత్రిక - ప్రియదర్శిని - 11-12-2007)

❀ ❀ ❀

కంటే కూతుర్నే కనండి !

ఇది చూసి సినిమా టైటిల్ అనుకోవద్దు. అక్షరలక్షలు చేసే మాట. దేశ జనాభా లెక్కలు చూస్తూంటే పెళ్ళి కాబోయే యువకులకు గుండెలు గుభేలుమంటు న్నాయి. మరల కన్యాశుల్కం రోజులు వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదంటున్నారు లుబ్ధా వధాన్లు వంటివారు. ఇంకా కొందరు మరో అడుగు ముందుకెళ్ళి పంచ పాండవులను ద్రౌపది కట్టుకొన్నట్లు ముగ్గురో, నలుగురో ఐదుగురో కలిసి ఒక అమ్మాయిని పెళ్ళి చేసుకొనే రోజులు వచ్చినా రావచ్చునని దిగులుపడుతున్నారు. ఇప్పుడే పిల్లనివ్వక పెళ్ళిళ్లు కాక 30-40 మధ్య వయసు యువకులు అనేకమంది రోడ్లపై తిరుగు తున్నారు. నిరుద్యోగులై పెళ్లి కాలేదంటే అది వేరే విషయం. ఉద్యోగం పురుష లక్షణమని వుద్యోగాలుచేస్తున్న కొందరు మగరాయుళ్ళకు పెళ్ళి కావడం లేదంటే ఆలోచించవలసిన విషయమే.

మాకు తెలిసిన వాళ్ళబ్బాయి పెళ్ళికి వెళ్ళాను. ఆ పెళ్ళిలో ఇద్దరు ముగ్గురు నన్ను కలిసి పెళ్లికూతుళ్లు ఎవరైనా ఉంటే చెప్పు. మంచి పెళ్ళికొడుకులు ఉన్నారని

చెప్పడం వింటే ఆశ్చర్యం వేసింది. అంతకు ముందు ఆడపిల్లల తల్లిదండ్రులు, వారి బంధువులు పెళ్ళికొడుకుల కోసం వేటాడేవారు. కానీ నేడు కాలం మారి పోయింది. పెళ్ళికొడుకుల తల్లిదండ్రులు, వారి బంధువులు అబ్బాయికి ముప్పై ఏళ్ళు దాటినా పెళ్ళిచేయలేక పోతున్నామని దిగులు పడుతున్నారు. కొందరు కట్న కానుకలు వద్దని అమ్మాయిని చేసుకొంటామని ముందుకు వచ్చినా, అబ్బాయిలో ఏదో లోపముందేమోనని అనుమానంతో పెళ్ళిళ్లు కావటంలేదు. అబ్బాయి బాగా చదువుకొని ఏ సాఫ్ట్‌వేర్ ఇంజనీరో అయితే పెళ్ళిళ్ళవుతున్నాయి. కానీ మామూలు ఇంజనీరింగ్ చదివిన వారికి పెళ్ళిళ్లు కావడం కష్టంగా ఉంది.

ఈ మాత్రం ఆమాత్రం చదువుకొని ఉద్యోగం చేస్తున్న పిల్ల కూడా నేడు గొంతెమ్మకోర్కెలు కోరడం విచిత్రం, తల్లిదండ్రులు సంబంధాలు చూసి పెళ్ళి చేసే రోజులు అంతరిస్తున్నాయి. అమ్మాయిలు చదువుకోవడం, ఉద్యోగాలు చేయడంతో వారికి ఆర్థిక స్వాతంత్ర్యంతోపాటు స్వేచ్ఛగా జీవించడానికి అలవాటుపడుతోంది. స్త్రీ పూర్వంలా వంటింటి కుందేలు కాదు. అబ్బాయిల కంటే అమ్మాయిలే బాగా చదువుకోవడంవల్ల మెరిట్‌వల్ల, రిజర్వేషన్‌వల్ల వారిలోనే ఎక్కువమంది ఇంజనీర్లు, డాక్టర్లు, ఆఫీసర్లు, ఐఎ ఎస్‌వంటి పరీక్షలు పాసై వివిధ హోదాలుగల ఉద్యోగాలు చేస్తున్నారు. వారికి పెళ్ళి చేయాలంటే వారికన్నా ఎక్కువ చదువుకున్న వాడు, హోదా గల ఉద్యోగం కలవాడు కావాలని సహజంగా అమ్మాయిలు అనుకొంటున్నారు. కనీసం ఈక్వల్ క్వాలిఫికెషన్ ఉన్నవాడైనా భర్తకావాలని ఆశించడం సహజం.

కానీ నేడు అమ్మాయిలు ఉన్నత హోదాలలో ఉండటం, అబ్బాయిలు తక్కువ హోదాలలో ఉండటం వల్ల పెళ్ళిళ్ళకు ఆటంకం ఏర్పడి చదువుకున్న అమ్మాయిలు ఉద్యోగాలు చేస్తున్న అమ్మాయిలు ఒక్కోసారి ప్రేమమైకంలో పడి కులాంతర వివాహాలు చేసుకొంటున్నారు. ఎక్కువమంది తన ఆఫీసులో పనిచేస్తున్న కొలీగ్‌లనే ఇష్టపడి పెళ్ళి చేసుకొంటున్నారు. మరి కొంతమంది మరొకడుగు ముందుకు వేసి పెళ్ళైన అమ్మాయిలు కూడా ఆఫీసులో కలిపి పనిచేస్తున్న కొలీగ్‌లతో సన్నిహితం ఏర్పడి భర్తకు విడాకులు ఇచ్చి పెళ్ళి చేసుకొంటున్నవారు ఈ మధ్య ఎక్కువయ్యారు.

పూర్వం రోజుల్లో కోటికో లక్షకో ఒకరు విడాకులు తీసుకొనేవారు. స్త్రీలు చదువుకొని ఉద్యోగస్తులయ్యాక నూటికి ఇద్దరు,ముగ్గురు భర్తలకు విడాకులిచ్చి మళ్లీ పెళ్ళి చేసుకొన్నవారు తారసపడుతున్నారు. ఎంత డబ్బు సంపాదిస్తున్నా నేడు ఒక్కరూ ఇద్దరూ పిల్లల్నే కనడం సామాన్యమైపోయింది. ఇంకా కొందరు ఉద్యోగస్తులైతే పిల్లలకోసం ఆలోచించడం లేదు. వద్దనుకొనే వారూ ఉన్నారు.

ఆడపిల్ల పుడితే మహాలక్ష్మిఅని మన పెద్దలు చెప్పినా, ప్రభుత్వం ఎన్నో రాయితీలు ప్రకటించినా నేటికీ భ్రూణహత్యలు పెరగడం, ఆడపిల్ల పుట్టగానే చెత్త కుండీలో పడవేయడమో, పీక నులిమి చంపడం వంటి కిరాతక చర్యలవల్లనే నేడు స్త్రీ జనాభా తగ్గిపోతోంది. పూర్వపు రోజులలో తరచూ యుద్ధాలలో అనేకమంది

పురుషులు చనిపోతూ ఉండటంవల్ల కూడా స్త్రీ జనాభా తక్కువైనా సమతుల్యమయ్యేది. నేడు యుద్ధాలు వంటివి లేకపోవడం వల్ల పురుషజనాభా పెరుగుతూనే వుంది. భారతదేశంలో ప్రతీ ఒక్కవెయ్యిమంది పురుషులకు 927 మంది స్త్రీలు మాత్రమే ఉన్నట్లు జనాభా లెక్కలు తెలియజేస్తున్నాయి.

గుడ్డిలో మెల్లలా ఇతర రాష్ట్రాలైనా పంజాబ్, మహారాష్ట్ర, బీహార్, గుజరాత్‌లతో పోల్చుకుంటే మన రాష్ట్రంలో స్త్రీ జనాభా వెయ్యికి 940 మంది ఉన్నట్లు అంచనా. పూర్వపు రోజులలో పిల్లలులేని వారు దత్తత చేసుకుంటే మగపిల్లల్నే చేసుకొనేవారు. కానీ నేడు దత్తత చేసుకొనే వారు ఆడపిల్లల్నయినా ఏవగించుకోకుండా దత్తత చేసు కోవడం విశేషం. కొడుకులకన్నా కూతుళ్ళకే అభిమానాలు ఎక్కువ ఉంటాయని, వృద్ధాప్యంలో, ఆపదలో కొడులకన్నా కూతుళ్లే ముందుండి సేవలు చేస్తున్నారని అనుభవజ్ఞులు అంటున్నారు. ఎంతమంది కొడుకులున్నా ఒక్క కూతురు ఉండాలని చాలా మంది ఆశిస్తూ ఉంటారు. నాకు తెలిసిన ఒక డాక్టర్‌గారికి వరుసగా తొమ్మిది మంది కొడుకులు పుట్టినా కూతురు కావాలని పదవ సంతానానిగా కూతుర్ని పొందేరు.

పాత రోజులలో వరుసగా నలుగురైదుగురు కూతుళ్ళు పుట్టినా, కొడుకు కోసం (పున్నామనరకం నుండి తప్పిస్తాడని ఆశతో) పూజలు, వ్రతాలుచేసి కన్నవారూ ఉన్నారు. ఇద్దరూ, ముగ్గురూ అమ్మాయిలైనా, అబ్బాయిలైనా తృప్తిపడి ఫుల్‌స్టాప్ పెట్టడం మంచిది. గర్భవతులైన వారు తప్పనిసరి పరిస్థితులలో తప్ప స్కానింగ్ జోలికి పోకూడదు. ఆడైనా, మగయినా భగవంతుడిచ్చిన సంతానమని తృప్తిపడి, కంటే ఆ ఆనందంవేరు. ఆడపిల్ల పుడితే మహాలక్ష్మి ఇంటికి వచ్చిందని వేడుకగా సంబరం జరుపుకొంటే ఏ సమస్యలూ ఉండవు.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 2006)

❋ ❋ ❋

క్రమశిక్షణ కావాలి

హైద్రాబాద్ ట్రాన్స్‌ఫర్ అవడంవలన, అక్కడ ఇల్లుకోసం అన్వేషిస్తూ వుంటే, మా కొలీగ్ తనువుంటున్న ఇంటి దగ్గర్లో ఒకపోర్షను కాళీవుందంటే, ఆ ఇల్లు అద్దెకు తీసుకొన్నాను. ఒకరోజు మా మిత్రుడు యింట్లో వాళ్ళ అయిదేళ్ళ బాబు పుట్టినరోజు సందర్భంగా అందరకు పార్టీ అరేంజ్‌చేసాడు. సాయంత్రం చుట్టుపక్కల వారు, పిల్లలతో కేక్‌కట్ చేయడం అన్నీ అయ్యాక రాత్రి మా ఆఫీసుస్టాఫ్‌కి వేరేగా పార్టీ యిచ్చేడు.

నేను మామూలు పార్టీ అనుకొని ఆ రాత్రి వారింటికి వెళ్లాను. అట్టహాసంగా మందు, అవి ఏర్పాటుచేసి చాలామంది పేకాటకి కూర్చున్నారు. నాకు ఆ వాతావరణం నచ్చక నేను వెళ్లాలనుకుంటూ వుంటే మా ఫ్రెండ్ బలవంతంచేసి, మీకోసం సాఫ్ట

డ్రింక్స్, వెజిటేరియన్‌ఫుడ్ కూడా ఏర్పాటుచేసాను. వుండమని బలవంతంచేయడంతో యిష్టం లేకపోయినా ముళ్లమీద కూర్చున్నట్లు కూర్చున్నాను. నాకు తోడు యింకా యిద్దరు జతకావడంతో వాళ్లతో కబుర్లలో పడ్డాను. యింతలో మా ఫ్రెండు కొడుకు అక్కడికి వచ్చేడు. ఆ బాబుని మా ఫ్రెండు ఒళ్లో కూర్చుబెట్టుకుని పేకాట ఆడుతూ సిగరెట్లు కాలుస్తున్నాడు. నాకు ఎందుకో ఆ దృశ్యం చాలా ఎబ్బెట్టుగా కనిపించి, మా ఫ్రెండుతో ఇటువంటి చోటికి పిల్లల్ని రానివ్వకూడదు. వస్తే వాళ్లకి చిన్న తనంనుంచే వ్యసనాలకు అలవాటుపడతారన్నాను.

మా ఫ్రెండ్ నా మాటలకు నవ్వి, మా నాన్న ఇవేవీ మొప్పకపోయినా నాకు ఈ అలవాట్లు రాలేదా ! వీటికి ఒకరు మొప్పక్కర్లేదు మా బాబూ చూడండి, సిగరెట్టు ఎంత బాగా కాలుస్తాడో అని అతని నోటిలో సిగరెట్టు బాబు నోట్లోపెట్టాడు.

వాడు నవ్వుతూ రెండు దమ్ములులాగి తండ్రికి సిగరెట్లు అందించేడు. తరువాత మందు త్రాగుతావా నాన్నా అంటూ గ్లాసు బాబు నోటికి అందించి ఆనందించేడు. నాకు అతని చర్య వింత గొలపడమే కాకుండా రాక్షసకృత్యంగా గోచరించిది.

నాకు నా బాల్యం గుర్తుకువచ్చింది. నా పదేళ్ల వయసపుడు కిళ్లీ తింటూ వుంటే ఆ నాన్నగారు చూసి చదువుకొనే పిల్లలు కిళ్లీలు, తమలపాకులు వేసుకోకూడ దని చెప్పేరు. ఒకసారి మా నాన్నగారు ఊళ్లోలేని సమయంలో ఒక స్నేహితుడు ప్రోద్బలంతో కీళ్ళి వేసుకున్నాను. కిళ్ళీ నములుతూ కబుర్లు చెప్పుకొని ఇద్దరు వస్తూ వుంటే అప్పుడే ఊరునుంచి వచ్చిన నాన్నాగారి కంటపడ్డాను. ఇంటికి వచ్చేక మా నాన్నగారు పిలిచి, ఊళ్లో లేనని కిళ్లీ కొనుక్కుని తింటావా అని చితకబాదేరు. భువనేశ్వర్‌లో ఇంజనీరింగు చేరిన తరువాత కాలేజ్ ఫంక్షన్‌లో పార్టీ అయేక సిగరెట్టు, కిళ్లీ యిచ్చేరు. నా యిద్దరు మిత్రులు ఇచ్చిన సిగరెట్లు, పారేయడం ఎందుకు, కాల్చి రెండు దమ్ములుపీల్చి పారేద్దామని చెప్పి నన్ను బలవంతంచేసారు. నేనూ వారితోపాటు కిళ్ళీ వేసుకుని సిగరెట్టు ప్రప్రథమంగా కాల్చేను. మా నాన్నగారికి నేను సిగరెట్ కాల్చిన సంగతి తెలిసింది. నేను శెలవులకు ఇంటికి వెళితే సిగరెట్లు కాలుస్తున్నట్లు తెలిసింది నిజమా ! అని అడిగారు.

నేను నసుగుతూ కాలేజ్ ఫంక్షన్‌లో యిస్తే అందరితోపాటు నేనూ ఒక్కసారే కాల్చేను. మళ్ళీ ఎప్పుడూ కాల్చలేదని చెప్పేను.

నాన్నగారు కోపంగా మందు పోస్తే ఈసారి పార్టీలో మందు కూడా తాగుతావా అని అడిగేరు.భయంతో వణుకుతూ త్రాగను. మరి ఎప్పుడూ సిగరెట్టు కూడా కాల్చను అని అన్నాను. దేవుడు మీద ఓట్టేసి మరల ఎప్పుడూ సిగరెట్టు వైపు చూడనని మాట యివ్వు అన్నారు.

ముచ్చెమటలు పోయడంతో నాన్నగారికి మాట యిచ్చి బయటపడ్డాను. అటువంటి క్రమశిక్షణతో పెరిగిన నేను మాఆఫీసులో కొలీగ్ ప్రవర్తన చూసి ఆశ్చర్య పోవడమే కాకుండా ఎంతో జుగుప్సాకరంగా పీలయ్యేను.

పెద్దవాళ్ళ నడత బాగుండక వారికి దుర్వసనాలుంటే నూటికి తొంభై మంది పిల్లలకు ఆ అలవాట్లు వస్తాయి. ఈ అలవాట్ల వలన ధనవ్యయంతోపాటు ఆరోగ్యాన్ని కూడా హరిస్తుంది. పదిహేనళ్ళ తరువాత నా కొలీగ్‌ని ఒక పెళ్లిలో కలిసేను. అతని పిల్లల చదువుసంధ్యల గురించి అడిగేను. అతను వికారంగా నవ్వి నామీద ఒక ఆకు ఎక్కువ చదివేడు అన్నాడు. నాకు అర్థంకాక క్వశ్చన్ మార్కు ముఖంపెట్టడం చూసి మావాడు ఇంటర్ నాలుగుసార్లు తప్పి నాకున్న వ్యసనాలుకాక చిల్లర దొంగ తనాలు కూడా నేర్చుకున్నాడని వివరంగా చెప్పెసరికి నేను అవాక్కయ్యాను. మరి అతని భవిష్యత్తు అన్నాను. ఏం ఫర్వలేదు. రాజకీయ నాయకుడవుతాడు. ఏదో పార్టీ కార్యకర్తగా ఇప్పుడు తిరుగుతున్నాడు. ఇంతకు ముందు కన్నా నయమే. ఇంతకు పూర్వం ఒకసినిమా హీరో అభిమానసంఘానికి ప్రెసిడెంటని సినిమాహాళ్ల చుట్టూ తిరిగేవాడు అన్నాడు.

మీ ఆరోగ్యం బాగాలేదా ! ఏభై ఏళ్ళకే ముసలితనపు చాయలు కనిపిస్తున్నాయని అడిగేను. అతను విరాగిలా నవ్వి, ప్రస్తుతానికి త్రిగుణాలు మాత్రమే వున్నాయి. అదే సుగరు, బీపీ, హార్ట్ ట్రబుల్. ఈ మధ్యనే బైపాస్ చేయించేను. మా ఆవిడకి ప్రస్తుతం బి.పి.షుగరు రెండూవచ్చేయి. మా అమ్మాయికి పెళ్ళిచేసేము. అబ్బాయి లిద్దరూ పనికి రాకుండా పోయేరు. పెద్దవాణ్ణి ఒక ఆటోమొబైల్ వర్క్‌షాపులో మెకానిక్‌గా చేర్పించేను. మూడుసార్లు కాపీ కొట్టినా టెన్త్ పూర్తిచేయలేకపోయేడు. డబ్బు సంపాదించినా మనశ్శాంతి లేదని వాపోయేడు. క్రమశిక్షణ జీవితానికెంత అవసరమో, మా నాన్నగారిని మనసారా తలచుకొని అభినందించాను. ఈనాడు నేను ఆరోగ్యంగా వుండడానికి, ఈ ఉన్నతస్థితిలో వుండడానికి, నా పిల్లలు వున్నతంగా ఎదగడానికి కారకులైన కన్నతండ్రి ఋణం తీర్చుకోలేము. ఆయనను మరువలేము. ఆయనకు సదా కృతజ్ఞుణ్ణి.

(ఆంధ్రభూమి దినపత్రిక - ప్రియదర్శిని - 11-5-2003)

❁ ❁ ❁

శీలానికి విలువుందా !

నేను ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లో అంటే నాకు పదిహేడేళ్ళ ప్రాయంలో ఏమీతోచక వీధి అరుగుమీద నిల్చుని కాలక్షేపానికి వచ్చీపోయేవారిని చూస్తున్నాను. ఇంతలో మా ఎదురింటి అమ్మాయి బిచ్చగాడికి బిచ్చంవేయడానికి బయటికి వచ్చింది. అదే సమయంలో నన్ను మా మేనత్తగారు చూసేరు. అంతే! ఇంట్లోకిపిలిచి కమ్మగాచివాట్లు పెట్టేరు. చదువుకొనే వయసు, భవిష్యత్తు చాలా వున్న నేను అలా అమ్మాయిల వంకచూడడం తప్పని, శీలానికి వున్న ప్రాముఖ్యత, వంశగౌరవం మా కుటుంబంలో బాగా చదువుకొని అభివృద్ధికి వచ్చి పెద్దపెద్ద హోదాలో వున్నవారి లిస్టులన్నీ ఏకరువుపెట్టి, మరల అమ్మాయిలవంక చూడద్దని హెచ్చరించేరు. నేను చూడలేదని, అందుకు బయట నిలబడలేదని ఎంత మొత్తుకున్నా

నా మాట వనలేదు. ఆ రోజులలో అంటే (1958)లో మగవారిని కూడా శీలము విలువ తెలియజేసి అదుపులో పెట్టేవారు. ఇక ఆడపిల్లల సంగతి చెప్పనవసరంలేదు. ఓణీవేసు కున్న దగ్గరనుండి చదువుకు స్వస్తిచెప్పించి ఇంట్లో కూర్చోపెట్టేవారు. పరాయి మగ వాడితోకానీ వయసులోవున్న కుర్రవాడితోగాని మాట్లాడితే పెద్ద గొడవ చేసేవారు. అమ్మాయిల పెంపకం అలా వుండేది.

కానీ ఈ రోజు మగ, ఆడ తేడా లేకుండా విచ్చలవిడిగా తిరుగుతున్నారు. చదువుల పేరుతో స్త్రీ పురుష భేదం లేకుండా బయట పై వూళ్లో వుండి చదువు కుంటున్నారు. చదువుల వరకు బాగానే వుంది కానీ ఫ్యాషన్ వెర్రిలోపడి బిగుతు దుస్తులు, మిడీలు, జీన్‌పేంట్స్, స్కర్టులు వంటివి ధరించి విచ్చలవిడిగా అమ్మాయిలు తిరగడంతో ఈవ్‌టీజింగ్ వంటివి నేడు ఎక్కువయ్యాయి. ఈ మధ్య కాలేజీ అబ్బా యిలు, అమ్మాయిలు మరొక అడుగు ముందుకేసి బోయ్‌ఫ్రెండ్స్, గర్ల్‌ఫ్రెండ్స్ పేరుతో కలిసి తిరగడం సామాన్యమైంది. ఈ సంస్కృతికి నేడు వచ్చే సినిమాలు ఆజ్యం పోస్తున్నాయి.

కాలేజీ లైఫంటే అమ్మాయిలు, అబ్బాయిలు కలిసి తిరగడమని, ప్రేమించు కోవడమని,చదువు పూర్తి కాకుండానే పెద్దల నెదిరించి పెళ్ళి చేసుకోవాలని, మనసు, ప్రేమ అంటూ నేటి యువతీ యువకులకు హితబోధ చేస్తున్నాయి. నేడు వచ్చే సినిమాలన్ని అనుకరిస్తూ, వారిలా దుస్తులు ధరిస్తూ పిచ్చెక్కిపోతోంది నేటి యువత. నేడు సినిమాల్లో వచ్చే బూతు డైలాగులు, వారి శృతిమించిన శృంగారచేష్టలు యువతను ఆకట్టుకొంటున్నాయి. తెలిసీ తెలియని వయసు పొంగులో అబ్బాయిల తీయని మాటలకు ఆకర్షితులై అనేమంది యువతులు సంఘం కట్టుబాట్లు, శీలము విలువ మరచి పెళ్లి కాకుండానే అన్నిరకాల సుఖాలకు అలవాటు పడుతున్నారు. ఈ మధ్య ఒకసినిమాలో ఒక అమ్మాయి ముందు శోభనం చేసుకొని తర్వాత పెళ్లి చేసుకుందామని డైలాగు చెప్పింది.

కొన్ని సినిమాటైటిల్స్, సినిమా స్క్రీన్ అంత వాల్‌పోస్టర్స్ చూస్తుంటే సెన్సారు బోర్డుఅనేది ఒకటి ఈ దేశంలో బ్రతికివుందా అనిపిస్తుంది. తెలుగులో నేడు నటిస్తున్న నటీమణులు సిగ్గు, బిడియం వంటివి అటకెక్కించి సినిమాలలో నటించడానికి వచ్చినట్లు కనిపిస్తోంది. జుగుప్సాకరంగా కనిపించే పాత్రలలో నటించడమే కాకుండా పైన ఒక్క గుడ్డపీలిక, క్రిందనొక గుడ్డపీలిక కట్టుకొని ఎగిరి గెంతులువేస్తూ హీరోల క్రిందా మీద పడుతూ, పైకి క్రిందకుపాకుతూ ముద్దులు పెట్టించుకుంటూ నటిస్తూ వుంటే చూసేవారికి సిగ్గువేసి తలలు వంచుకుంటున్నారు. యువతకు మాత్రం బ్రాందీ, విస్కీలా కిక్కిచ్చి మత్తెక్కిస్తున్నాయి.

ఈమధ్య కొన్ని సర్వేలలో తేలినదేమిటంటే యువత శీలానికి అర్థం తెలియ కుండా ప్రవర్తిస్తున్నారని 50% పైగా పెళ్ళి కాకుండానే రతి సుఖాలని పొందుతున్నా రని ఢిల్లీ, ముంబై, కలకత్తా, హైదరాబాద్ వంటి నగరాలలో అబార్షన్ల సంఖ్య

పెరుగుతోందని, కాలుజారిన అమ్మాయిల కోసం ప్రత్యేకంగా అబార్షన్ల కోసమే కొన్ని నర్సింగ్‌హోమ్‌లు, క్లినిక్‌లు కొత్తగా వెలుస్తున్నాయని, డాక్టర్లు బాగా డబ్బు చేసుకుంటున్నారని వార్తలు ఈ మధ్యపలు పత్రికలలో ప్రచురితమయ్యాయి.

ఎయిడ్స్ ప్రకటనలు, కుటుంబ సంక్షేమ పథకాల ప్రకటనల హోరు కూడా నేటి యువతలో ధైర్యాన్ని కలుగజేసి కాలుజారడానికి అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఒక్కొక్కసారి ప్రేమలు ఒలకబోస్తూ, మాట్లాడే బాయ్‌ఫ్రెండ్స్ వలలో పడి కొందరు బెదిరింపులతో యువతులు మగవారికి లొంగిపోతూన్నరు. అన్యం పుణ్యం ఎరుగని టీనేజ్‌లోవున్న ఆడపిల్లలు కొందరు సినిమా ప్రభావంతో ప్రేమపేరుతో మోసపోయి, వ్యభిచార గృహాలకు తరలించబడితే, మరికొందరు ఆత్మహత్యలు చేసు కుంటున్నారు. కొందరు రహస్యాన్ని దాచి తరువాత వివాహాలు జరిపించినా కట్టుకొన్న భర్తకు గత చరిత్ర తెలిస్తే వారి వివాహ బంధాలు తెగిపోతున్నాయి.

కొందరు యువతలు ఎంతో బుద్ధిగా, శ్రద్ధగా చదువుకుంటున్నా, కొందరు శాడిస్టు యువకులు,పొగరుబోతులు వారిని సవ్యంగా చదువుకోనీయకుండా అల్లరి చేసి వారిని వశం చేసుకోవాలని ప్రయత్నించి విఫలులైతే నరహంతకులుగా మారి గుంటూరులో అనంతలక్ష్మిని, విజయవాడలో శ్రీలక్ష్మిని మట్టుపెట్టినట్లు మట్టు పెడ్తారు. కాని కొందరు శాడిస్టులు కసితో కోపంతో వారి ముఖాలపై, అంగాలపై యాసిడ్‌పోసి కక్ష తీర్చుకుంటున్నారు. వీరికి తగిన కఠినమైన శిక్షలు లేకే విజృంభించి స్త్రీల మాన ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

మనదేశంలో రానురాను పాశ్చాత్య నాగరికతపై మోజు పెరిగి పెళ్లికి ముందు ప్రేమలు, డేటింగులు, ప్రేమవివాహాలు, విడాకుల సంస్కృతి పెరుగుతోంది. పిల్లలకు విద్యార్థి దశలో పూర్వకాలంలోలా మరల నీతి శతకాలు చదివించడం, రామాయణం వంటి కావ్యాలను పిల్లలకు బోధిస్తేకానీ శీలము విలువ వారికి తెలియదు. ఒకనాడు శీలానికి ఎంతో విలువనిచ్చిన మన దేశం ఈ రోజు యిలా పతనంచెందడం ఆశ్చ ర్యాన్ని కలిగిస్తుంది. పాశ్చాత్యులు మనదేశం గురించి గొప్పగా విని మనదేశానికి వచ్చి మన నాగరికతను చూసి విస్తుపోతున్నారు.

పిల్లల్లో సత్ప్రవర్తన కలిగించడానికి పెద్దలు నడుం బిగించాలి. తల్లిదండ్రి, గురుకుల పాత్ర చాలావుంది. విద్యాలయాలలో,కళాశాలల్లో ప్రేమను ప్రోత్సహించే సినిమాలు, టీచర్లు, లెక్చరర్లను జోకర్లుగా చూపించే సినిమాలు సెన్సారువారు నిషేధించాలి. ఈ మధ్య వచ్చిన సినిమాలన్నీ ప్రేమ పైత్యాన్ని పెంచి పోషించి యువతను రెచ్చగొట్టినవే తప్ప మంచి సినిమా ఒక్కటీ రాలేదు. దీనికి ప్రభుత్వం బాధ్యత కూడా వుంది.ఇప్పటికైనా అంతా కళ్ళు తెరచి పట్టించుకోకపోతే ముందు తరంవారు ఇంకా అధోగతి పాలయ్యే ప్రమాదం వుంది.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 11-7-2004)

❀ ❀ ❀

ఇదేనా మన ప్రగతి ?

ఇప్పుడే ఈ రోడ్డుమీద నడవడానికి రోడ్డు దాటడానికి ఇంత కష్టపడవలసి వస్తోంది. మరో పదేళ్లు పోతే అసలు రోడ్డు మీద మనుషులు నడవడానికి ఎంత ఇబ్బంది పడాలో ఆలోచిస్తూంటే భయం వేస్తోంది బాబూ! అంటూ లక్ష్మమ్మగారు దీర్ఘాలు తీస్తూ మా ఆవిడ సుభద్రతో అంటూ ఉంటే కుతూహలంగా వారి సంభాషణ వినసాగాను.

ఈ మధ్య ఆటోలు, మోటారు సైకిళ్లు విపరీతంగా పెరిగాయి. ఈ విజయ నగరం మహాపట్టణంలోనే ఇలాగుంటే హైదరాబాద్, ముంబయి, కోల్‌కతా వంటి మహానగరాలలో పరిస్థితి ఇంకెలా ఉంటుందో ఊహించడానికే భయంగా ఉంది అంది మా ఆవిడ సుభద్ర.

ఈ ట్రాఫిక్‌తోనే చస్తుంటే పైగా ప్రతీవాళ్ళు చేతిలో సెల్‌ఫోన్లతో రోడ్డుమీద నడుస్తూ మాట్లాడుకొంటూ, ఎదురువచ్చే వాళ్ళను ఆడ, మగ తేడా లేకుండా గుద్దు కుంటూ వెళ్ళిపోతూ ఉంటారు. రోడ్డుమీద తప్పితే వాళ్ళకు మాట్లాడుకోడానికి టైము ఉండదనుకుంటా, ఇకవస్తాను వదినా...చీరలు చాలా బాగున్నాయి. నువ్వు పొడుగ్గా ఉంటావు కాబట్టి ఆ రోజ్‌కలర్ శారీ కట్టుకుంటే నువ్వు అదిరిపోతావు. నీ సెలక్షన్ సూపర్ అంటూ మంచి కాంప్లిమెంట్ ఇచ్చి వెళ్ళేరు పక్కింటి లక్ష్మమ్మగారు.

ఆవిడ మాటలు విన్నాక మా ఆవిడకొన్న ఆ రోజ్‌కలర్‌శారీ కట్టుకుంటే ఎలా ఉంటుందో చూడాలని కుతూహలం కలిగి వెళ్ళి వెంటనే ఆ చీర ఒకసారి కట్టుకుని చూపించమని మా ఆవిడ సుభద్రను ఒప్పించి ఆ చీరలో ఆవిడను చూసి మురిసిపోయాను.

మా ఆవిడ నా ఆనందాన్ని చూసి రోజూ ఆ ట్రాఫిక్‌లో స్కూటర్‌మీద ఆఫీసుకు ఎలా వెళ్తున్నారండీ! ఒక్కరోజు బజారుకెళ్ళి వచ్చేసరికి మా తలప్రాణం తోకకి వచ్చింది అంది గోముగా వయ్యారాలు వొలకబోస్తూ.

ఈ రోజుల్లో బయటికి వెళ్ళినవారు ఇంటికి తిరిగివచ్చేరకు ఇంట్లో వారికి బెంగగా ఉంటుంది. దానికితోడు టీవీ అన్‌చేసినా, న్యూస్‌పేపర్ చూసినా యాక్సిడెంట్ల గురించి తెగచెప్పడంతో అందరిలోనూ భయం పెరుగుతోంది. దానికి తోడు ఈ మధ్య హత్యలు, మానభంగాలు ఆత్మహత్యలు కూడా పాపం పెరిగినట్లు పెరిగిపోతు న్నాయి. ప్రస్తుత జనాభా పెరుగుదల చూస్తూవుంటే ముందు తరాలవారు కొన్ని రకాల పండ్లు, కూరగాయలు రుచిచూడరేమో ననిపిస్తోంది. రోజురోజుకి చెట్లు, అడవులు తరగిపోతున్నాయి. కొన్ని రకాల పక్షులు, జంతువులు నేడు కనుమరుగవు తున్నాయి. ఒకప్పుడు నిత్యం రొదచేసి, వెంటిలేటర్‌లో గడ్డిపుల్లలతో గూళ్ళు కట్టుకుని అరిచే పిచ్చుకలు కనిపించడంలేదు. కోయిలలు, రామచిలుకలు, మైనగోరలు వంటివి ఎక్కడో కాని కనిపించడంలేదు. మా చిన్నతనంలో కొంగలు,కొన్ని రకాల పక్షులు

సాయంత్రం వేళ ఆకాశంలో గుంపులు గుంపులుగా రకరకాల డిజైన్లలో కన్పించి ఆ దృశ్యం చూడడానికి చాలా మనోహరంగా ఉండేది. ఋషి పక్షులు, గబ్బిలాలు వంటివి ఊరి చివర పెద్దపెద్ద వృక్షాలకు వేలాడుతూ, ఎగురుతూ వినోదాన్ని కలిగించేవి. నేడు రాబంధులు మచ్చుకు కూడా కన్పించడంలేదు.

నేడు రియల్‌ఎస్టేట్ బిజినెస్ పేరుతో, అపార్ట్‌మెంట్ కల్చర్‌తో ఎక్కడా పచ్చని మొక్క కనిపించకుండా తోటల్ని, వృక్షాల్ని ధ్వంసం చేస్తున్నారు. ఇప్పటికే మామిడి పండు, వెలగపండు, పనసపండు, నేరేడుపండు వంటివి అపురూప మయ్యాయి. కల్లుకోసం ఇంకా కొన్నిపల్లెల్లో అక్కడక్కడ తాటి, ఈతచెట్లు కనిపిస్తున్నాయి. లేకుంటే అవీ ఈపాటికి కనుమరుగయ్యేవి. గుమ్మపాలంటే ఈ రోజుల్లో పల్లెటూరి జనానికే తెలియిన పరిస్థితి ఏర్పడింది. పాల ప్యాకెట్లు, సైకిల్ పాలు వచ్చాక పాలు ఎలా ఉత్పత్తి అవుతున్నాయో కూడా పట్నవాసులకు తెలియని పరిస్థితి ఏర్పడింది. కొన్ని రకాల పక్షుల్ని జంతువుల్ని పెద్దపెద్ద నగరాలలో ఉన్న జూలలో చూడాల్సిందే. పాము, తేలు, నక్క, తాబేలు, చివరకు నిత్యం కనిపించే పిల్లి నేడు కన్పించక పోవడంతో పిల్లలకు పుస్తకాలలో బొమ్మలు చూపించి చెప్పాల్సివస్తోంది. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే పది సంవత్సరాల తరువాత పరిస్థితి ఆలోచించడానికే భయం వేస్తోంది.

ఇప్పుడే అంటే 2007 సంవత్సరంలోనే మంచినీళ్లు, కొనుక్కుని తాగే పరిస్థితి దేశంలో చాలా నగరాలలో, ఊళ్ళలో ఉంది. ఇప్పుడున్న జనాభాకే రోజుకి ఒక గంట రెండు గంటలకు మించి మంచినీళ్లు సరఫరా చేయలేక పోతోంది ప్రభుత్వం. మంచినీళ్ల పరిస్థితి ఎలా ఉన్నా ప్రతీ ఊళ్లో ప్రతీ ఫర్లాంగుకి ఒక బ్రాందీ షాపు కొత్తగా వెలుస్తున్న మందు బార్లు మన ప్రగతికి నిదర్శనంగా కనిపిస్తున్నాయి.

మేం ఉద్యోగంలో చేరిన ఏడాది అంటే 1966లో మా ఆఫీసులో నలభై మంది స్టాఫ్ ఉంటే అందులో ఇద్దరే మందు రుచి చూసిన వాళ్ళుండేవారు. నేను రిటైర్ అయిన సంవత్సరం అంటే 2000లో మా ఆఫీసు మూడు వందలమంది స్టాఫ్ ఉంటే అందులో 270 మంది మందు రుచిచూసామని చెప్పడం విని ఆశ్చర్య పోయాను. నేడు పార్టీ అంటే కాలేజీ స్టూడెంట్స్, దగ్గర్నుంచి ఉద్యోగస్తుల దాకా మందుతో కూడిన పార్టీలే తప్ప మామూలు సాదాసీదా పార్టీలులేవు.

పూర్వం మన దేశంలో అమ్మాయిలు, గృహిణులు మందు ముట్టేవారు కాదు. ఈ మధ్య పార్టీల్లోనూ, బార్లల్లోనూ కొందరు మందు తాగడం విశేషం. మనదేశ ప్రగతిని గొప్పగా చెప్పుకోవచ్చు.

(ఆంధ్రభూమి దినపత్రిక - ప్రియదర్శిని - 3-6-2007)

❀ ❀ ❀

అమ్మాయిలతో అగచాట్లా !

ఒకనాడు అబ్బాయిల్ని పెంచడం కష్టం. అమ్మాయిల్ని సులువుగా పెంచవచ్చు. చెప్పినమాట వింటారు. పెళ్ళిచేస్తే అత్తవారింటికి వెళ్తారు. పెళ్ళికి కట్నంయిస్తే బాధ్యత తీరుతుంది అనుకునేవారు. నేడుకాన్వెంటు చదువులు, ఎంసెట్ కోచింగులు, రెసిడెన్షియల్ స్కూళ్ళు, కాలేజీలు వచ్చేక ఆడ, మగ తేడా లేకుండా పిల్లల చదువుల ఖర్చులు పెరుగుతున్నాయి. ఆడపిల్లలు, మగవాళ్ళతో సమానంగా పోటీపడి చదువు కోవడమే కాకుండా ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. అంతవరకు బాగానే వుంది కానీ ఈమధ్య అమ్మాయిలు బరితెగించి, విచ్చలవిడిగా తిరగడం, బాయ్‌ఫ్రెండ్స్, ప్రేమ వ్యవహారాలు, అబార్షన్లు, ఆత్మహత్యలే వెగటు కలిగిస్తున్నాయి.

మధ్యతరగతి తల్లిదండ్రులు పిల్లలపై ఎంతో ఆశలు పెట్టుకొని వారి చదువుల కోసం తలకుమించిన భారమైనా మోస్తూ ప్రొఫెషనల్ కాలీజీలలో చదివిస్తూంటే, అమ్మాయిలు, అబ్బాయిలు, ఈడియట్‌బాక్సు, సినిమాలకు ఆకర్షితులై, ఆడ, మగ చెట్టాపట్టాలేసుకుతిరుగుతూ ప్రేమ, దోమ పేరుతో చదువులు, భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నాచు.

సినిమాల పిచ్చి, ఈడియట్ బాక్సులో సినీ హీరోలతో ఇంటర్వ్యూలు ఈ మధ్య వెగటు కలిగిస్తున్నాయి. రెండు సినిమాలలో యాక్టుచేసి అమితమైన ప్రచారంతో ఈమధ్య హీరోలు ఏదో ఒక పేరు చెప్పుకొని ఊళ్ళమీదపడుతున్నారు. ప్రజలు వారికి బ్రహ్మరథం పడుతున్నారు. కొన్ని టీవీఛానళ్లు మరికొంచెం ముందుకుపోయి, కాలేజీ అమ్మాయిలతోను, అబ్బాయిలతోను సినీహీరోలతో ఇంటర్వ్యూలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఇంటర్వ్యూలలో అబ్బాయిలకన్నా అమ్మాయిలే ఎక్కువమంది పాల్గొనడమే కాకుండా ద్వంద్వార్ధాలతో మాట్లాడడం, హీరోతో మాట్లాడడంవల్ల జన్మధన్యమైనట్లు మాట్లాడడమేకాకుండా హీరోకిష్టమైతే వారితో గడపడానికి ఎటువంటి అభ్యంతరం లేదని ప్రకటిస్తున్నారు. సిగ్గు బిడియం విడిచి పిచ్చి ప్రశ్నలు వేయడమే కాకుండా ఆ హీరోల మీదపడి ముద్దుపెట్టుకొన్న కొందరమ్మాయిల్ని చూస్తువుంటే వారి తల్లితండ్రులు ఎలా భరించగలుగుతున్నారో అర్ధం కావడంలేదు.

ఇంకా కొందరు సినీహీరోలతో బుల్లితెర మీద ఇళ్ళదగ్గర నుండి ఫోన్లలో మాట్లాడే టీనేజి అమ్మాయిలు, ఒక్కొక్కసారి పెళ్ళయిన మహిళలు కూడా అడిగే ప్రశ్నలు, పొగిడే పొగడ్తలు, హీరోపై సిగ్గువిడిచి ఒలకబోసే ప్రేమ సంబాషణలు వినడానికి ఎబ్బెట్టుగావున్నా ఈ మధ్య చాలా టీవీ చానళ్లతో ఇటువంటి ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. ఫోన్లో టీవిలో హీరోతో మాట్లాడడం పెద్ద లాటరి తగిలి లక్షలు వచ్చినట్లు జనం ఫీలవడం చూస్తుంటే మన సమజాం ఎక్కడికి పోతోందో అర్థం కావడం లేదు.

ఈడియట్ బాక్స్‌కి కొన్ని ప్రోగ్రాములకు సెన్సారుబోర్డు అవసరం వుందని పిస్తోంది. ఇప్పుడు ప్రస్తుతం సినిమాలకున్న సెన్సారు పిప్పులాంటిది కాకుండా ప్రజా

శ్రేయస్సుకోరి, నీతి, నిజాయితీగా వ్యవహరించే సెన్సారుబోర్డు కావాలి. లేకుంటే ఈకాలం టీనేజి పిల్లల్ని కంట్రోల్‌చేయడం కష్టమవుతుంది.

ఈమధ్య పొరుగూరులో చదువుకునే అమ్మాయిల్ని, అబ్బాయిల్ని కొందరిని చూసి ముక్కుమీద వేలు వేసుకోవడలసివస్తోంది. విశాఖపట్నం నుంచి తుని రోజూ కొందరు అబ్బాయిలు, అమ్మాయిలు కాలేజీలో చదువుకోడానికి ఉదయం ట్రైన్‌లో వెళ్లి,సాయంత్రం ట్రైన్‌లో మరల తిరిగివస్తూ, వుంటారు.రైల్వే ప్లాట్‌ఫారంమీద, ట్రైన్‌కంపార్ట్‌మెంట్‌లోచుట్టువున్న సమాజాన్ని మరచి వారు మాట్లాడుకునే మాటలు, వేసుకునే జోకులు, ఒకరిమీద ఒకరుపడి మాట్లాడుకోవడం,చేతులుకలపడం, రాసుకుని పూసుకుని కూర్చోవడం, ఇంకా కొందరు తెగించి ఒకరిఒడిలో ఒకరుపడుకొని పరాచికాలాడుకోవడం చూచేసరికి అమ్మాయిలెంత ఫార్వర్డుగా వున్నారో అనిపించింది. అమ్మాయిలు భయపడకుండా అంత ధైర్యంగా పబ్లిక్ ప్లేసులో కూడా ఎలా తిరగ గలుగుతున్నారో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. జనరేషన్ చాలా ఫాస్టుగా వుంది. అంటే ఇదేనేమో అని పిస్తోంది.

ఒకనాడు తల్లిదండ్రులు అబ్బాయిల ప్రవర్తనకే భయపడే వారు. కానీ నేడు అమ్మాయిల తెగింపు, విచ్చలవిడి తనానికి భయపడే రోజులు వచ్చాయి. అమ్మాయిలు పూర్వపురోజుల్లో పెద్దలు వారికి కొని యిచ్చే బట్టలు యిష్టపడి కట్టుకునేవారు,. కానీ నేడు ఫ్యాషన్ పేరుతో కురుచదుస్తులు, ఒంటికిపట్టే బిగుతు దుస్తులు ధరించి సినీతారలను అనుకరించడానికి తంటాలు పడుతున్నారు. అరిటాకు వెళ్లి ముల్లుమీదపడ్డా, ముల్లువచ్చి అరిటాకుమీదపడినా నష్టపోయేది అరిటాకేనని మనవాళ్ళు ఆడవారి జీవితాన్ని అరిటాకుతో ఎప్పుడో పోల్చేరు. చదువుకుంటున్న అమ్మాయిలపై, ముఖ్యంగా పొరుగూరులో చదువుకుంటున్న అమ్మాయిలపై తల్లిదండ్రి వారి నడవడిని శ్రద్ధగా పరీక్షించడం మంచిది. లేకుంటే టీనేజ్‌లో తెలియకుండానే గోతిలో పడే ప్రమాదంవుంది, ఆలోచించండి.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 2004)

❁ ❁ ❁

నీతితెలియని నేటి యువత

నేడు నైతికవిలువలుపడిపోవడంవలన రకరకాల కొత్తజబ్బులు, రోగాలు ప్రవేశించి మనుషుల్ని పిప్పిచేస్తున్నాయి. పూర్వం ఇంట్లో అమ్మమ్మలు, తాతలువంటి వారు వుండి బాల్యంలో పిల్లలకు నీతిశతక పద్యాలు, నీకథలు చెప్పేవారు. అవి విన్నవారు అందరూకాకపోయినా కొందరైనా వంటబట్టించుకొని నీతిగా మెలిగేవారు. కానీ నేడు ఉమ్మడి కుటుంబాలు పోయి ఆదర్శ కుటుంబాలు రావడం వలన ఇంట్లో పెద్దవాళ్లే కరువవుతున్నారు. దానికితోడు కాన్వెంటు చదువులొచ్చేక పిల్లలకు క్షణం తీరికలేకుండా వుంటున్నారు. ఇక వారికి నీతికథలు చెప్పేవారు లేరు, వారికి వినే

ఓపికాలేదు. ఏమాత్రం సమయం చిక్కినా పిల్లలు టీవి ప్రోగ్రాములకి ఆకర్షితులై బుల్లితెరలకు అతుక్కుపోతున్నారు.

ఇక నేడు వచ్చే సినిమాల గురించి చర్చించడం దండగ. సెక్సు, హింస ప్రసక్తితప్ప వేరే కథాంశం వుండడంలేదు. టీనేజి ప్రేమలు, ప్రేమాలయాలుగా మారిన విద్యాలయాలు, గురువులను, తల్లిదండ్రులను చులకనచేసే డైలాగుతో వచ్చే సినిమాలతో నేటి యువత రెచ్చిపోయి, ఎంతో నీతిబాహ్యంగా, అసహ్యంగా, జుగుప్సా కరంగా వెకిలిచేష్టలతో ప్రవరిస్తున్నారంటే ఏమాత్రం అతిశయోక్తిలేదు.

ఒకనాడు స్త్రీ మెడలో నల్లపూసలు, మాంగల్యం, కాలి వేళ్లకి మట్టెలు కనిపిస్తే ఎంత అల్లరిచేసే కుర్రకారైనా అటువంటి స్త్రీలను గౌరవించి అభిమానించేవారు. నేడు వయసులో తారతమ్యంలేకుండా ఆరుసంవత్సరాల వయసు అమ్మాయిల నుంచి అరవైఏళ్ళ ముదుసల్ని కూడా విడిచిపెట్టకుండా ఏడిపించి అల్లరిచేస్తున్నారు. పెళ్లయిన స్త్రీలను గౌరవించడంపోయి కొత్తగా ఆంటీ అనిపిలుపుతో వెంటపడి కుర్రకారు అల్లరి చేస్తుంటే ఆశ్చర్యంగా చూడవలసి వస్తోంది. అమ్మాయిల్ని ఏడ్పించడం, అల్లరి చేయడం, సభ్యత లేకుండా ప్రవర్తించడం, పిచ్చిముదిరితే అత్యాచారాలు చేయడం ఒకరకమైన జబ్బు, రోగం క్రిందే పరిగణించాలి.

ఈమధ్య నాగరికత పెరగడంవలన ప్రతీ ఇంట్లో ఫోన్లు వుండడంతో కొందరు అబ్బాయిలు ఫోన్‌చేసి ఆడగొంతు వినబడగానే వయసుతో నిమిత్తంలేకుండా అసభ్య కరంగా మాట్లాడమే కాకుండా ఏవేవో బూతుకబుర్లు చెప్పి సరదా తీర్చుకుంటూ వుంటారు. రాంగ్‌నెంబరని ఫోను పక్కకి పెట్టిన కూడా వేధింపులకు గురిచేస్తూ వుంటారు. ఇదీ ఒకరకమైన జబ్బుగా ఇంగ్లీషులో పేర్కొన్నారు.

ఇంకా కొందరు బాత్‌రూమ్‌ల గోడలపైన, టాయిలెట్ గోడలపైన వివిధ అకృతులలో బొమ్మలుగీసి, ముఖ్యంగా స్త్రీల నగ్న చిత్రాలను గీచి రకరకాల బూతు మాటలు, వినలేని చదవలేని రాతలు వ్రాస్తూ వుంటారు. ఈ మధ్య ఈ జబ్బు బాగా ముదిరి ట్రైన్ కంపార్ట్‌మెంట్లలో, టాయిలెట్‌లలో కనిపిస్తున్నాయి. ఒక ఆధునిక రోగి వ్రాసిన మాటలు మచ్చుకి ఇక్కడ ఉదహరిస్తున్నాను. యవ్వనాన్ని వృధా చేసుకోకు. కోరికలను, వాంఛలను తీర్చుకోడానికి మంచి గర్ల్‌ఫ్రెండ్‌ను చూసుకో. గర్భమొస్తుందని భయపడకు, మాత్రలు, కండోమ్‌లు మనకి వున్నాయి. జీవితాన్ని అనుభవించు, పిల్లల్ని కనడానికి మాత్రమే పెళ్ళిచేసుకో అని వ్రాసేదు. నేటి యువకులు విద్యార్థులు ఇంత ఫాస్టుగా వుంటే వారికి సెక్సు ఎడ్యుకేషన్‌నని, ఎయిడ్స్ గురించి ప్రభుత్వ పాఠశాలల్లో పాఠాలు బోధించడం దండగనిపిస్తోంది.

కుటుంబ నియంత్రణ సాధనాల ప్రకటనల ధర్మమాని సెక్సు ఎడ్యుకేషన్ ఆటోమేటిగ్గా పదేళ్లలోపు పిల్లలనుంచే అలవడుతోంది. దానికితోడు ఈ మధ్య ఎయిడ్స్ వ్యాధి ధర్మమాని కండోమ్‌ల వేషాలు, తోరణాలు, రకరకాల జుగుప్సాకర ప్రకటనల హోరుతో చంటిపిల్లవాడికి కూడా కండోమ్ అంటే ఏమిటో దేనికి ఉపయోగిస్తారో

తెలిసిపోయింది. విద్యార్థులచేత కండోమ్‌లు పంచిపెట్టించడం మరీ అసభ్యంగావుంది.

బ్రహ్మచర్యం, మనోనిగ్రహం, శీలము గురించి ప్రబోధించవలసిన కాలంలో యువతకు కండోములు పంచి, ఎయిడ్స్‌ని నివారించమని ప్రబోదిస్తే వారు సంఘం, కట్టుబాట్లు మరచి వావివరసలు మరచి జీవితమంటే సెక్సులో ఆనందించడమే అనుకొని విచ్చలవిడిగా ప్రవర్తించే ప్రమాదముంది. ఇప్పటికే యువత తప్పుదారిన ప్రవర్తిస్తోంది. వారిని ఆపలేక తల్లిదండ్రులు సతమతమవుతున్నారు. అటువంటి సమయంలో ఎయిడ్స్ పేరిట చౌకబారు ప్రచారం సాగిస్తే మన హిందూ నాగరికత మంటకలిసి, పాశ్చాత్య ధోరణికి జనం అలవాటుపడతారు.

ఇప్పటికే దేశంలో నాగరికత పెరిగి స్త్రీలకట్టు, బొట్టు, తీరులో చాలామార్పు వచ్చింది. స్త్రీ స్వేచ్ఛంటూ విచ్చలవిడితనం కన్పిస్తోంది. పెద్దలు చేసే సాంప్రదాయమైన పెళ్ళిళ్ళు నచ్చక ప్రేమ వివాహాలు, కులాంతర వివాహాలు ఎక్కువవుతున్నాయి. ఈ రోజు కుటుంబ సంక్షేమ పద్ధతులు, ఎయిడ్స్ నిరోధక సాధనాలు వివాహితలకన్నా అవివాహితులకు ఎక్కువ ఉపయోగపడుతున్నాయంటే అతిశయోక్తి లేదనుకుంటాను.

నేడు యువత ఇప్పటికే తప్పుతోవ పట్టివున్నారు. సెక్సు ఎడ్యుకేషన్, ఎయిడ్సు ఎడ్యుకేషన్ పేర పాఠాలు బోధించడం ప్రారంభిస్తే పాఠశాలలు, కళాశాలలు వ్యభిచార గృహాలుగా మారినా ఆశ్చర్యపోనక్కరలేదు. అత్యాచారాలు పెరిగినా ముక్కుమీద వేలు వేసుకునే పనివుండదు. వింత జబ్బుని అదుపు చేయడానికి ప్రయత్నించాలి కానీ జబ్బు ముదిరే ప్రయత్నం చేయకూడదు.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 26–2–2003)

❋ ❋ ❋

సుఖ సంసారం

ఏమిటలా ఆశ్చర్యంగా చూస్తున్నారు? ఇది ప్రియదత్త పత్రిక. కాని సమరం గారి సుఖసంసారం మాత్రం కాదు. భార్యాభర్తలు సుఖంగా సంసారం చేసుకోడానికి పండంటి కాపురానికి పద్దెనిమిది సూత్రాలు చెప్పడమే నా అభిమతం.

1. భార్యా భర్తలు పెళ్ళయ్యే ముందు ఒకరి నొకరు బాగా అర్థము చేసుకొని ఒకమాట మీద నిలబడాలి. ఒకరిమీద ఒకరికి గౌరవము వుండాలి. ఒకరు ఎక్కువ ఒకరు తక్కువనే భావన మనసులోనికి రానివ్వకూడదు.

2. భార్య, అత్తింటి వారినందర్నీ గౌరవించినట్లే, భర్త కూడా ఆమె పుట్టింటి వారిని గౌరవించాలి. భార్య ముందు ఆమె పుట్టింటి వారిని కించపరచి హేళన చేయకూడదు. అగౌరవ పరచకూడదు.

3. డబ్బు విషయములో ఇద్దరూ ఖచ్చితంగా వ్యవహరించాలి. దాపరికాలు వుండకూడదు. ఖర్చు విషయములో ఇద్దరికీ ఒక అవగాహన వుండాలి. భర్తకివచ్చే

ఆదాయము భార్యకు చెప్పి దుబరా ఖర్చులు చేయకుండా సంపాదనలో కనీసం నాలుగవవంతైనా పొదుపు చేయాలి.

4. భార్యకు, భర్త ఇల్లు అందంగా వుంచడానికి సహకరించాలి. ఇద్దరూ కలసి పని చేసుకోకపోతే సంసారపు బండి సజావుగా నడవదు. 'ఆడుతు,పాడుతు పనిచేస్తుంటే అలుపూ సొలుపూ వుండదు. ఇద్దరు కలసి...అలాగే ఇంట్లో అన్ని పనులలో ఒకరినొకరు సహకరించుకొని తృప్తిగా కలసి మెలసి వుంటే రోజూ పండగ లాగే వుంటుంది.

5. భార్యా భర్తలిద్దరూ ఉద్యోగస్తులైతే ఇద్దరూ ఆఫీసు పనులలో అలసిపోయి వుంటారు కాబట్టి ఇద్దరికీ ఓర్పు, సహనం అవసరం. ఒకరి నొకరు సహకరించుకొని తృప్తిగా కలసి మెలసి వంటా వార్పు చేసుకొంటూ సరదాగా కాలక్షేపం చేయాలి.

6. సినిమాలకు, షికార్లకు షాపింగుకు కలసి వెళ్తూ, అప్పుడప్పుడు భోజనం. టిఫిన్ బయటచేసి వస్తూ వుంటే ఉద్యోగస్తులైన భార్యాభర్తలకు కొంత రిలీఫ్ వుంటుంది.

7. పిండిని బట్టె రొట్టె అన్నట్లు మనకి వచ్చే సంపాదనను బట్టే ప్లాన్ చేసుకొని డబ్బు ఖర్చుచేయాలి. ఆర్భాటాలకు, ఆడంబరాలకు పోయి అనవసరపు ఖర్చులు చేయకూడదు.

8. అప్పుచేసి పప్పుకూడు పనికిరాదు. వీలైనంత వరకు దాచుకొన్న డబ్బు తోనే కావలసినవస్తువులు కొనుక్కోవాలి. ఇన్‌స్టాలుమెంట్ మీద, స్కీములపైనా చౌకగా వస్తువులు వస్తున్నాయని అనవసరమైనవి కొనుక్కొని, ఇల్లంతా సామాన్లతో నింపుకొని సమస్యలు కొని తెచ్చుకోకూడదు.

9. భార్యాభర్తలిద్దరూ పొదుపు పాటిస్తూ ఆదాచేసిన డబ్బుతో పుట్టిన రోజు, పండుగ సమయాలలో సర్ప్రయిజ్ గిఫ్టులొకరికొకరు ఇచ్చుకుంటూ వుంటే మంచి థ్రిల్‌గా వుంటుంది. గిఫ్టు ఇద్దరికీ ఉపయోగకరమైనదిగా వుండాలి.

10. శలవురోజులలోను, తీరిక సమయాల్లోను భార్యా పిల్లలతో ఆనందంగా గడపాలి. అంతేకానీ శలవు రోజు వచ్చిందని, భార్యా పిల్లలను విడచి ఊరు మీద పడి ఏ సినిమాకో పేకాటకో చెక్కేయ కూడదు.

11. పొగత్రాగడం, త్రాగుడు, జూదం వంటి వ్యసనాలకు దూరంగా వుండాలి. త్యాగ గుణము అలవరచుకొని, ఒకవేళ దుర్వ్యసనాలుంటే వాటికి స్వస్తి చెప్పి ఇంటిని స్వర్గ సీమగా మార్చుకోవాలి.

12. భార్య తరపు బంధువులింటికి వచ్చినా, భర్త తరపు బంధువు లింటికి వచ్చినా, భార్యా భర్తలిద్దరూ వారికి స్వాగతం పలికి, సాదరంగా ఆదరించి గౌరవిం చాలి. ఇరువర్గాల వారిని సమభావంతో చూడాలి. అప్పుడే ఒకరిమీద ఒకరికి ప్రేమ పెరుగుతుంది.

13. ఆరోగ్యమే మహాభాగ్యము కాబట్టి శుచి శుభ్రత పాటిస్తూ పళ్ళు, కూరలు, పాలు సమృద్ధిగా తీసుకొంటూ పిల్లలకు అన్నీ తినడం అలవాటు చేయాలి. అప్పుడే డాక్టరు ఖర్చు తగ్గుతుంది.

14. 'ఇల్లుని చూసి ఇల్లాలినిచూడు' 'ఇల్లే కోవెల ఇల్లాలే దేవత' అని అంటారు కాబట్టి దాన్ని సార్థకం చేసుకోవడానికి ఇంటి ఇల్లాలు ప్రయత్నం చేయాలి.

15. ఇంటిపట్టునే వుండే భార్యకి విశ్రాంతి, మార్పు కావాలని కోరుకొంటుంది. కాబట్టి భర్త ఆమెను అర్ధము చేసుకొని పుట్టింటికి అప్పుడప్పుడు పంపిస్తూ వుంటే 'వారిరువురి మధ్య అనురాగ బంధం పెరుగుతూ వుంటుంది. 'తల్లి వున్నప్పుడే పుట్టిల్లు పాలున్నప్పుడే వరవాణ్ణమని మరచిపోకూడదు.

16. ఏదైనా విషయాలలో భార్యభర్తలిద్దరికీ వాగ్వివాదాలు వస్తే, భార్యో భర్తో ఇద్దరిలో ఒకరు తగ్గి మౌనంవహిస్తే సమస్యలు ఉత్పన్నంకావు. తరువాత వాతావరణం చల్లబడ్డాక పొరపాటుచేసిన వారు తప్పు ఒప్పుకొని క్షమాపణ కోరడంలో తప్పులేదు. పంతాలకు పట్టింపులకు పోయి జీవితాన్ని నాశనం చేసుకోకూడదు.

17. భార్య కాని భర్తకాని పరాయి వాళ్ళ ముందు ఒకరినొకరు చులకనచేసి మాట్లాడుకోరాదు. అలా చేసినట్లయితే వారిలో అంతరాలు పెరిగి చిలికి చిలికి గాలి వానయ్యే ప్రమాదం వుంది.

18. కష్ట సమయాలలోను, ఏదైనా సమస్యలెదురైనపుడు ఒకరినొకరు ఓదార్చు కొని సముదాయించుకోవాలి. మంచి మాటలు, చల్లని కబుర్లతో బాధని మరిపింప జేయాలి. అంతేకాని సమయము వచ్చిందనలి ఒకరు నొకరు చులకనచేసి చెప్పుకో కూడదు. తెలివైన వారు సుఖ సంసారానికి మెరుగులు దిద్దుకోవాలి.

ఇలా చెప్తూ పోతూవుంటే లక్షవరకు చెప్పవచ్చు ముందు వీటిని మీరు ఆదరించి, అర్ధము చేసుకొంటే మిగతా సూత్రాలు మరొకసారి చెప్తాను.

(ప్రియదత్త సకుటుంబ సచిత్రవారపత్రిక - 18-7-2001)

❀ ❀ ❀

దిగజారుడుతనం

వంద సంవత్సరాలు బ్రిటీషువారితో పోరాడి స్వాతంత్ర్యం సంపాదించుకొన్నాం స్వాతంత్ర్య సమరంలోఎంతోమంది ఎన్నో రకాల త్యాగాలుచేసి అసువులు బాశారు. మనదేశానికి స్వాతంత్ర్యంవచ్చి 62 సంవత్సరాలు అవుతోంది. దేశంలో అన్నిపార్టీల నాయకులు పేదలని ఉద్ధరించడానికే పుట్టామని, వారిని అభివృద్ధి చేయడమే లక్ష్య మని చెప్పి ఓట్లు దండుకోడానికి చేపలు పట్టడానికి ఎరవేసినట్లు ఆకర్షిత పథకాలు, సబ్సిడీలు ప్రకటిస్తున్నారు. సాధ్యాసాధ్యాల గుఇరంచి ఆలోచించడంలేదు. దేశాభ్యు దయం కన్నా వారికి పదవే ముఖ్యం. పదవినలంకరించడానికి ఎన్ని జిమ్మిక్కులైనా చేస్తారు. వారి జేబుల్లోంచి పైసా ఇవ్వక్కర్లేదు కాబట్టి, ప్రజల సొమ్మేకాబట్టి ఎన్నివేల

కోట్ల రూపాయలు వృధాగా ఖర్చయినా వారికి చీమకుట్టినట్లు కూడా ఉండదు. ప్రాంతీయ పార్టీలు వచ్చాక దిగజారుడుతనం మరీ ఎక్కువయింది.

లేకుంటే ఈ రోజు మార్కెట్లో ముప్పయి రూపాయలకు కిలోబియ్యం అమ్ముతూ ఉంటే కిలో రెండు రూపాయలకు ఎలా ఇస్తారు?

దేశంలో కరెంటుకోత ఉండి పొరుగు రాష్ట్రాలలో కరెంటుకోత పాటిస్తూ రోజుకు 5-6 గంటల కరెంటులేమితో బాధపడుతూ ఉంటే ఉచిత కరెంటు ఇవ్వడం ఎంతవరకు న్యాయం ?

రాష్ట్రంలో ఒకప్పుడు ముప్పయివేల బోర్లు, పంపుసెట్లు ఉంటే గత అయిదేళ్ళలో వీటి సంఖ్య లక్షాయాభైవేలకు పెరిగినట్లు తెలుస్తోంది. కరెంటు ఆదా, విద్యుత్‌శాఖకి వచ్చే నష్టాన్ని లెక్కకి తీసుకోకపోయినా భూగర్భజలాలు అడుగంటం వలన భావి తరాలకు సరిపడేనీటిని ముందుగా వాడుతున్నట్లు తెలుస్తోంది. ఉచిత టి.వి.ఈలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమో ఎప్పుడైనా ఆలోచించారా!

ఇప్పుడొస్తున్న కొత్తపార్టీలు ముందూ వెనుక చూడకుండా నూరు రూపాయలకు 25 కిలోల బియ్యం, కిలోనూనె, కిలో కందిపప్పు, కిలో చింతపండు వంటి ఇంటి సామగ్రిని పేదలకు అందిస్తామని చెప్పడం విడ్డూరంగా కనిపిస్తోంది.

అంటేసుమారు వెయ్యి రూపాయలు ఖరీదు చేసే సామగ్రిని నూరు రూపాయ లకే అందిస్తారన్నమాట. ఇవికాక దీపం పథకాలు, పావలా వడ్డీకే ఋణాలు యిచ్చే పథకాలు, అందరికీ ఉచితవిద్య, ఆరోగ్య శ్రీపథకం పేరుతో పేదలకు ఉచితవైద్యం, ఉచితంగా ఇళ్ళస్థలాలు, ఇంకా ఎన్నోఎన్నెన్నో ప్రజలకి తెలియని సబ్సిడీ పథకాలు అనేకం అమలులో ఉన్నాయి.

కులాంతర వివాహాలు చేసుకుంటే రాయితీ, హాజ్‌యాత్రలకు వెళ్ళే ముస్లీంలకు రాయితీ, ఇప్పుడు కొత్తగా బెత్లెహేం. ఇవికాక రిజర్వేషన్ల పేరుతో దేశంలో ఎన్నో కులాల వారికి, (కొత్తగా మతాల వారికి) రకరకాల పేరుతో ఎన్నో రాయితీలు కల్పిస్తున్నారు. సందట్లో సడేమియా అన్నట్లు ఈ మధ్య రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి తదితరులకు జీతభత్యాలు లక్షలలో పెంచుకున్నారు.

అయిదేళ్ళు ఎన్నికయిన ప్రతీ ఎం.పీ., ఎమ్.ఎల్.ఏ.లు జీవితాంతం ఫించనుతోపాటు, సకలభోగాలు అనుభవించడానికి బిల్లులు ఆమోదించేసుకున్నారు. ఇటువంటి ప్రతిపాదలనకు దేశంలో అన్ని పార్టీలు ఏకమై ఒక్కటవుతాయి. పక్షపాతం లేకుండా సుప్రీంకోర్టు జడ్జీలకు, హైకోర్టు జడ్జీలకు జీతభత్యాలు పెంచారు.

నేరగాళ్ళకు, నేరచరితులకు, గూండాలకు ఎలక్షన్లలో సీట్లు ఇవ్వవద్దని సుప్రీం కోర్టు ఆదేశించినా దేశంలో ఏ ఒక్కపార్టీ ఆమోదించలేదు. అన్ని పార్టీలు ఎంతో ఐకమత్యంతో మెలగి నేరగాళ్ళకి శిక్షపడకుండా చేయడమే కాకుండా వారి కొమ్ముకాసి వారికి పదవులు కట్టబెట్టడం గొప్పవిశేషమే.

నేడు కోర్టులలో, బయట విచారణలో నేరస్థులని నిరూపణ జరిగినా మంత్రులు ముఖ్యమంత్రుల రాజీనామా చేయమని నిర్మొహమాటంగా చెప్పడం మనదేశానికే చెల్లింది. కనీసం ఎమ్.ఎల్.ఏ. కాని ఒక ముఖ్యమంత్రి ఆరునెలలు పాలించి ఈ మధ్య ఎలక్షన్‌లో ఓడిపోయికూడా కుర్చీ దిగనని భీష్మించుకోవడం అందరికీ తెలిసిందే!

ఒకనాడు శ్రీమతి ఇందిరాగాంధీ, కోర్టులో తన ఎన్నిక చెల్లదని తీర్పుఇస్తే, పదవికి రాజీనామా చేయకపోగా దేశంలో ఎమర్జెన్సీ విధించి నవ్వులపాలయినా, మరల దేశాధినేతగా ఎదగడం మనకళ్ళతో చూసినదే.

రాజకీయాలలో సిగ్గు, బిడియం వుండవు. ఈరోజు ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా చలామణి అవుతున్న మాయావతిపై ఎన్నికేసులున్నా, ఎన్ని నేరాలు చేసినా ముఖ్యమంత్రిగా చలామణి అవుతున్నారు. దేశంలో రాజకీయపార్టీకి నీతి,నియమాలు లేవు. నిర్దిష్ట ప్రణాళికలేదు. పార్లమెంట్‌లో మెజారిటీ నిరూపణ కోసం బహిరంగంగా కొందరు ఎమ్.పీలకు డబ్బు, మరికొందరికి కోరిన పదవులు కట్టబెట్టి రాజరికాన్ని ఏలుతున్న ప్రభుత్వం గురించి అందరికీ తెలిసినదే !

నేరచరితలున్నవారే పదవులకు, డబ్బులకు కక్కుర్తిపడి ప్రజాద్రోహం చేస్తారు. ఒకవైపు దేశములో విపరీతంగా త్రాగుడుకు (మద్యాన్ని) ప్రోత్సాహమిస్తూ, విరివిగా మందు దుకాణాలు, బార్‌లు తెరుచుకోవడానికి ప్రోత్సాహిస్తూ, నిబంధనలను అతిక్రమిస్తున్నారు. కిలోరెండు రూపాయల బియ్యం, నూరు రూపాయల వంట సామగ్రి ఇవ్వడం ప్రజలను బద్ధకస్తులుగా, త్రాగుబోతులుగా మార్చడానికి ఉపయోగపడుతుంది. కానీ దేశాభివృద్ధికి తోడ్పడదు. ప్రపంచ బ్యాంకుల నుండి లక్షల కోట్లతో అప్పులు తెస్తూ దేశాన్ని తాకట్టు పెట్టడం మంచిదికాదు.

ప్రస్తుత పరిస్థితులలో రోజు వారి కూలీ సంపాదన నూరు రూపాయలకు ఎవ్వరికీ తక్కువలేదు. ఎక్కువమంది రోజుకు నూట యాభై రెండువందల వరకు సంపాదిస్తున్నారు. ఒక్కరోజు సంపాదనతో నెలబత్తెం సబ్సిడీలో ప్రభుత్వం ఇస్తే పనీపాట లేకుండా మిగతా రోజులు సినిమాలకు, షికార్లకు, త్రాగుడుకు మిగతా వచ్చే సంపాదనని వెచ్చిస్తూ పతనమయే ప్రమాదం ఉంది. నెలకి నాలుగురోజులు పనిచేస్తే చాలనడంవల్ల మిగతా రోజుల్లో పనిసరిగ్గా సాగక వ్యవసాయరంగం, కొన్ని పరిశ్రమలు మూతపడిన ఘనత ప్రభుత్వానికి వస్తుంది.

సబ్సిడీలు విరివిగా ఇవ్వడం వలన ప్రస్తుతం ఓట్లు సంపాదించి కుర్చీ ఎక్కినా మాతృదేశానికి ద్రోహం చేసిన వారిగా చరిత్రలో మిగిలిపోతారు. దేశ భవిష్యత్తు దెబ్బ తింటుంది. సబ్సిడీలు ఇవ్వడం వలన దేశములో పేదరికం పోదు.

(దివ్యధాత్రీ మాసపత్రిక – మార్చి 2009)

❁ ❁ ❁

పచ్చదనమే ఆరోగ్యం

పక్కింట్లో చెట్టు నరుకుతున్నట్లు చప్పుడు కావడంచూసి పెరట్లోకి వెళ్ళి చూశాను. బంగారంలాంటి మామిడి చెట్టును కొట్టేస్తున్నారు. ఎందుకండీ ఆ చెట్టును కొట్టేస్తున్నారని అడిగాను. 'రోజూ తెగ ఆకులు రాలిపోవడంతో తుడిచి ఎత్తి పారవేయ డం ఒక పెద్ద పనండీ' అన్నాడు పక్కింటాయన.

కాలనీలోనే మరొక ఇంట్లో చెట్లు నరుకుతూ ఉంటే ఎందుకనడిగితే, 'ముందు రెండు గదులు కట్టి బిల్డింగు ఎక్స్‌టెండ్ చేద్దామనుకుంటున్నామండీ' అన్నారు. రోడ్డు పక్కనే ఉన్న మహావృక్షాలను ఒకరోజు నరకడం చూసి ఎందుకు ఆ వృక్షాలను తెగనరుకుతున్నారని అడిగితే రోడ్డు వెడల్పు చేస్తున్నామని సమాధానం వచ్చింది. ఊరు చివర కార్తీకమాసం వస్తే పిక్నిక్ జరుపుకునే మామిడితోటలో చెట్లన్ని నరకడం చూసి ఆశ్చర్యంగా అడిగితే, దీనిని ఒక రియల్ ఎస్టేట్ వారు కొనుక్కున్నారని, ప్లాట్లు చేసి ఇండ్లస్థలాలుగా అమ్ముతారని చెప్పాడు.

కొత్త కొత్త ప్రాజెక్టులు, పరిశ్రమలు, కర్మాగారాలకోసం ప్రభుత్వం వారే దగ్గరుండి కొన్నివేల ఎకరాల అడవులను స్వయంగా నరికిస్తే, అక్రమ కలప వ్యాపా రులు, అడవులలో నివసించే కొండజాతి వారు వ్యవసాయం కోసం నిత్యం కొన్నివేల ఎకరాల అడవులను కైంకర్యం చేస్తూ ఉంటారు. మనకి స్వాతంత్ర్యం వచ్చిన నాటికి మనదేశ జనాభా నలభైకోట్లు అయితే ఈ అరవై ఏళ్ళలో నూరుకోట్లు జనాభా దాటింది, కానీ కొన్ని లక్షలఎకరాలు అడవులు ఈ అరవై సంవత్సరాలలో అంతరించి పోయాయి.

ఫిబ్రవరి మాసంలో ఇంత విపరీతంగా ఎండలు కాస్తున్నా యుంటే ఇది స్వయంకృతాపరాధమే. వాతావరణంలో విపరీతంగా కార్బన్‌డైయాక్సైడ్ పెరిగిపో తోంది. ఇదికాక రోజురోజుకు పెరిగిపోతున్న వాహనాల కాలుష్యం, పరిశ్రమల కాలుష్యంతో వాతావరణం విపరీతంగా వేడెక్కిపోతోంది. మనచుట్టూ చెట్లు ఉంటే కనీసం కార్బన్‌డైయాక్సైడ్‌నైనా స్వీకరించి మనం పీల్చడానికి ఆక్సిజన్ ఇచ్చేది. పెద్ద పెద్ద పట్టణాలు, నగరాలలో ఫిబ్రవరి నెలలోనే వడదెబ్బకు గురి అవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. వాతావరణ కాలుష్యం వలన బి.పి., గుండెజబ్బులు, డయా బెటిస్ వంటి వ్యాధులు కూడా వస్తున్నాయని ఈమధ్య ఒక సర్వేలో తేలింది.

ప్రతీ సంవత్సరం కొన్ని వందలకోట్ల రూపాయలు వ్యయంచేసి వనమహోత్స వాలు చేసి మొక్కలు నాటుతున్నారు. నాటిన మొక్కల్లో ఒకశాతం కూడా బ్రతికి చెట్టయిన దాఖలాలులేవు. పట్టించుకునే నాదుడే లేడు. మొక్కుబడిగా చెట్లునాటించ డమే ప్రభుత్వం బాధ్యత. ఇలా ఎన్ని కోట్ల రూపాయలు ప్రజాధనం వృధా అయిందో ఆ పెరుమాళ్ళకే ఎరుక. అడవులు, చెట్లు నరికివేత వలన నేడు తుఫాను, డిప్రెషన్ వస్తేనే వర్షాలు కురుస్తున్నాయి. ఋతుపవనాలు బలహీనమై తగిన వర్షాలు

కురవడంలేదు. నదులలో, ఏటిలో బిల్డింగులు కట్టడానికి విపరీతంగా ఇసుకతవ్వి రవాణా చేయడం వలన గోదావరి, కృష్ణానదులలోనే జనవరి నెలలోనే నీళ్ళు లేకుండా దర్శనమిస్తున్నాయి. ఫ్రీ కరెంటు పేరుతో రాష్ట్రంలోనే అదనంగా కొన్ని లక్షల బోర్లు కొత్తగా తవ్వి భూగర్భ జలాలు వినియోగించడంతో భూగర్భజలాలు అంతరించి భవిష్యత్తును అంధకారం చేసే ప్రమాదం కనిపిస్తోంది.

మంచినీళ్ళ వ్యాపారం అభివృద్ధి చెంది, త్రాగునీటి కోసం ప్రజలు పడే కష్టాలు అపరిమితం. కుళాయిలలలో మంచినీళ్ళు రోజువిడిచి రోజుకి ఒక గంట ఇవ్వడం జనవరి నెలలోనే మొదలయింది. ఇప్పటి వరకు త్రాగునీటికే వున్న ఇబ్బందులు, ముందు ముందు వ్యవసాయానికీ వచ్చే సూచలున్నాయి. లక్షల కోట్లు వినియోగించి ఎన్ని ప్రాజెక్టులు కట్టినా నదులలో నీళ్ళు లేనప్పుడు, సకాలంలో వర్షాలు లేనప్పుడు నిరుపయోగమే !

వాతావరణ కాలుష్యాన్ని, వాహన కాలుష్యాన్ని కొంతవరకైనా నివారించకపోతే ముందు ముందు సూర్యప్రతాపం పెరిగి ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురికావడమే కాకుండా, కొత్త కొత్త రోగాలు పుట్టుకువస్తాయి. ఈ దేశాన్ని ఆ భగవంతుడే ఇక పాడాలి!! సర్వేజనాః సుఖినోభవన్తు!

(ధ్యానమాలిక – ఆధ్యాత్మికమాసపత్రిక – ఏప్రిల్ 2009)

❁ ❁ ❁

నాగరికతతో వస్తున్న అనారోగ్యాలు

ఈ మధ్య ఎవరి ఇంటికి వెళ్ళినా 30–40 సంవత్సరాలు రాకుండానే వయసు మళ్ళినవారిలా కనిపించడమే కాకుండా బీపీ, షుగర్, హార్ట్ కంప్లయింట్, క్యాన్సర్, లేకుంటే నడుమునొప్పి, మోకాళ్ళ నొప్పులని చెబుతున్నారు. పూజచేయాలన్నా, ఒకవేళ క్రింద కూర్చొని భోజనం చేయాలన్నా స్థిరంగా మటంవేసుకొని కూర్చోలేక నానా అవస్థ పడుతున్నారు. ఇంకా కొందరిళ్ళలో పెళ్ళయి పదేళ్ళయినా పిల్లలు పుట్టలేదని సంతాన సాఫల్య ఆసుపత్రుల వెంట తిరుగుతున్నారు. చాలామంది బాగా చదువుకొని ఉద్యోగాలుచేస్తూ భార్యభర్తలిరువురూ సంపాదిస్తున్నారు కానీ పూర్వమువలె ఆనందంగా ఉండలేకపోతున్నారు. ఈ కష్టాలు చాలవన్నట్లు ఈ మధ్య ఉగ్యోగాలుచేసే భార్యభర్తలు కొందరు పెళ్ళయిన కొన్ని నాళ్ళకే విడాకులు తీసుకోవడం ఎక్కువైంది.

ఈ రోజు ఎవరింటికి వెళ్ళినా చివరకు గుడిసెలలో కూడా ఈడియట్ బాక్సు (టీ.వీ) సెల్‌ఫోన్, గ్యాస్‌స్టౌ, కుక్కరు, సీడీప్లేయర్ వంటివి దర్శనమిస్తున్నాయి. బ్యాంకులు, ఆఫీసుల వాళ్ళు విరివిగా అప్పులిస్తూ ఉండడం వలన స్కూటరో, కారో అవసరమున్నా లేకపోయినా కొనుక్కుంటున్నారు. అలాగే డబ్బెక్కువగా ఉండడం వలన, బ్యాంకులు లోన్లు విరివిగా ఇస్తున్నాయని ఇండ్లస్థలాలు, అపార్ట్‌మెంట్‌లు కొనుక్కుంటున్నారు. నాకు తెలిసిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లయిన ఇరువురు భార్యభర్తలు

హైద్రాబాద్‌లో మూడు అపార్ట్‌మెంట్లు కొన్నారు. భార్యకు ముప్పై, అయిదు, భర్తకి నలభై వచ్చాక వారికి సంతానం కావాలనుకొని, సంతానం కోసం పరితపిస్తూ ఇప్పుడు నర్సింగ్ హోమ్‌ల వెంట తిరుగుతున్నారు. కానీ కడుపు పండలేదు.

ఈ రోజులలో రకరకాల రోగాలు రావడానికి , కొందరికి సంతానం కలగక పోవడానికి పెరుగుతున్న నాగరికత ప్రభావం చాలా వుంది. రిమోటు కంట్రోల్‌తోనే చాలా పనులవడం వలన పురుషులు, స్త్రీలు అని బేధంలేకుండా కూర్చున్న దగ్గర నుండి లేవకుండానే టీవీలు, ఫ్యాన్లు, డీవీడీలు వంటివి ఆపరేట్ చేస్తున్నారు. రోజుకు పర్లాంగు దూరమైనా నడవకుండా స్కూటర్లు, కార్లు, బస్సులు, ఆటోలలోనే ప్రయాణిస్తున్నారు. ఆఫీసులలో కుర్చీలకు అతుక్కుపోయి ఈ రోజులలో చాలామంది కంప్యూటర్లతోనే కాపురాలు చేస్తున్నారు. ప్యూను తెచ్చిన కాఫీ, ఫలహారాలు అక్కడనే సేవించి ఒళ్ళు పెంచుకొని రోగాలు తెచ్చుకొంటున్నారు.

చాలామంది స్త్రీలు (గృహిణులు) ఇళ్ళల్లో కూర్చొని 'ఈడియట్' బాక్సులలో సీరియళ్ళు చూస్తూ టెన్షన్లు పెంచుకొంటూ, వంటచేసుకోవడానికి బద్దకించి హోటళ్ళు బజారులో అమ్మే ఫాస్ట్‌ఫుడ్స్ తింటున్నారు. కొందరు రెండు, మూడు రోజులకు సరిపడా కూరలు, పులుసు, పచ్చళ్ళు వంటివివండుకొని మంచుపెట్టె (ఫ్రిజ్) లలో దాచుకొని తింటున్నారు. ఇవికాక ఈమధ్య కొత్తగా హాఫ్‌బాయిల్డ్ ఫుడ్స్, ఇన్‌స్టెంట్స్ ఫుడ్స్ మార్కెట్లోకి రావడంతో చాలామంది ఇల్లాళ్లకు వంటపని తేలికై టీవీలో కార్యక్రమాలు చూడడానికి బోలెడు టైము చిక్కుతోంది.

తాజా పాలు, తాజాపళ్లు, తాజా కూరలకు నేడు మనం నోచుకోలేక పోయినా దొరికిన వాటిని కూడా వండుకొని తినడానికి బద్ధకం ఎక్కువవడం వలనే రోగాలు వస్తున్నాయి. టీవీల వలన కళ్ళకు జబ్బులు రావడమే కాకుండా అందులో వచ్చే సినిమాలు, సీరియళ్లు, యాడ్స్ చూస లేనిపోని ఉద్రేకాలకు పోయి యువతే కాకుండా కొందరు మహిళలు సంసారాల్లో చిచ్చులు రేపుకొని, విడాకుల దాకా పోతున్నారు. నేడు సెల్‌ఫోన్లు వాడకం పెరిగి కొత్త కొత్త జబ్బులు వస్తున్నాయి. ఇంట్లో ల్యాండ్ ఫోన్ ఉన్నప్పుడు కాలేజీ అమ్మాయిలకు, అబ్బాయిలకు మాట్లాడుకునే స్వేచ్ఛ ఉండేది కాదు. సెల్‌ఫోన్లు వచ్చాక బాయ్‌ఫ్రెండ్స్, గరల్ ఫ్రెండ్స్ సంస్కృతి బాగా పెరిగింది. నేడు చేతిలో పుస్తకాలు లేని స్టూడెంట్స్‌ఉన్నారు కాని, సెల్‌ఫోన్‌లేని స్టూడెంట్ లేదంటే అతిశయోక్తి కాదుకొంటాను.

సెల్‌ఫోన్ వాడకం పెరిగాక దానిలో వచ్చే రేడియో దార్మికశక్తి వలన చెముడు, మెదడు వ్యాధులు, గుండెజబ్బులు, క్యాన్సర్లు వస్తున్నాయని తెలిసింది. వయసులో వున్న భార్యాభర్తలకు ఈ మధ్య సంతానం కలుగకపోవడానికి సెల్‌ఫోన్లు కొంత కారణమని కొత్తగా కనుగొన్నారు. పురుషులలో వీర్యకణాల ఉత్పత్తిపైనా, స్త్రీలలో అబార్షన్లు అవడానికి కూడా సెల్‌ఫోన్లు కారణమవుతున్నాయని, దీనివలన గర్భనిరోధక మాత్రలు వాడకం, ఆలస్యంగా అంటే ముప్పై అయిదు దాటాక సంతానం కనాలను

కొనేవారు, శరీరశ్రమ లేకుండా పనిచేసే వారు ఈ ఇబ్బందులకు ఎక్కువగా గురవుతున్నారు.

వాతావరణ కాలుష్యంతో నగరాలు వేడెక్కిపోతున్నాయి. విరివిగా ఏసీలు, కూలర్లు, రూమ్‌హీటర్లు వాడకంతో స్వచ్ఛమైన గాలి పీల్చడానికి కూడా నేడు ప్రజలు నోచుకోవడంలేదు. పసుపు, కుంకుమ, కుంకుడు కాయలు, సున్నిపిండి వంటివి మరచి నేటిమహిళలు షాంపూలు, క్రీములు, బ్యూటీ క్లినిక్‌లు, హెయిర్‌డైలకు అలవాటుపడి సహజ సౌందర్యాన్ని కోల్పోతున్నారు. పట్టణాలలో ఉన్న చెట్లను నరికి బిల్డింగ్‌లు కట్టడం, రియల్ ఎస్టేట్ వ్యాపారంతో ఊరి చివరవున్న తోటలు, చెట్లు కూడా అంతరించిపోతున్నాయి. నేడు రోగాలకు మందులతోపాటు, త్రాగడానికి నీటిని, పీల్చడానికి గాలిని కొనుక్కొనే రోజులు వస్తున్నాయంటే ఆశ్చర్యపోవచ్చు.

(ధ్యానమాలిక - ఆధ్యాత్మికమాసపత్రిక - డిసెంబరు 2008)

❀ ❀ ❀

అల్లుడు మారిపోయేడు

మా అన్నయ్య కూతురు నీరజ పెళ్లి శుభలేఖ చూసి ఆశ్చర్యపోయేను. పదిహేను రోజుల క్రితం విజయవాడలో కలిసినపుడు సంబంధాలు చూస్తున్నాం. ఇంకా ఏదీ కుదరలేదు. అమ్మాయి పొడుగవడం ఒక సమస్యగా వుంది అని చెప్పాడు.

మా అన్నయ్యంటే మా దొడ్డమ్మ కొడుకైనా మా యింట్లో పెద్దవాడవడం వలన అంతా అన్నయ్యనే పిలచేవారం. అతనికి ఒక అమ్మాయి, అబ్బాయి అమ్మాయి ఎం.సి.ఏ. ప్యాసయింది. అందంగా పొడుగ్గా సన్నగా నాజూగ్గా వుండి ఈ కాలానికి తగ్గట్టుగ అలంకరించుకొని చూసిన వారికి అమ్మాయి భేషుగ్గా వుందనిపిస్తుంది. ఎత్తు ఐదడుగుల ఎనిమిదంగుళాలవడం ఒకటే ఆమెకు డిస్క్వాలిఫికేషన్ అబ్బాయి పొట్టిగా ఐదడుగుల రెండు అంగుళాలు ఎత్తు. ఇంజనీరింగు రెండవ సంవత్సరం చదువుతున్నాడు. అమ్మాయిది తండ్రి పోలికైతే అబ్బాయిది తల్లి పోలిక చూసిన వారంతా రివర్స్‌గా వుంటే ఎంత బాగుండేదనుకుంటారు.

న్యూస్‌పేపర్లో పెళ్లి యాడ్ చూసి, పెళ్లి ఫిక్సుచేసుకున్నారు. అబ్బాయి అమెరికా పెళ్లికొడుకు. ఆరడుగుల ఎత్తుగా వుండి అందంగా వుండడం, కాన్పూరులో ఐఐటిలో ఇంజనీరింగు డిగ్రీ చదివి అమెరికా వెళ్లి అక్కడ ఎమ్మెస్‌చేసి మంచి సాఫ్ట్‌వేర్ కంపునీలో ఉద్యోగం రావడంతో అమెరికాలోనే సెటిలయ్యారు. అమెరికానుంచి వచ్చి నెల రోజులైనా సరైన అమ్మాయి దొరక్కఅమెరికా వెళ్లిపోదామనుకుంటున్న సమయంలో మా అన్నయ్య కూతురు నీరజనుచూసి ఇష్టపడడంతో పదిరోజుల టైములో పెళ్లి నిశ్చయించి పెళ్లి హడావిడిగా జరిపించారు.

పెళ్లిపీటలపై కూర్చున్న దంపతులను చూసి అంతా మేడ్‌ఫర్ ఈచ్ అదర్ అని పొగడ్తలతో ముంచెత్తారు. శలవు పూర్తికావడం వలన కొత్త పెళ్లికొడుకు రమేష్

అమెరికా వెళ్లిపోయాడు. మూడు నెలల తర్వాత అమ్మాయి నీరజను అమెరికాకు విమానం ఎక్కించారు. అమెరికాలో ఇద్దరూ సుఖంగా ఆనందంగా ఉంటున్నట్లు వారానికోమారు ఫోనుచేసి నీరజ తల్లిదండ్రులతో మాట్లాడేది.

నీరజ పెళ్లినుంచి తిరిగివచ్చిన మరునాటి నుంచి నా భార్య లక్ష్మి మీ అన్నయ్య గారు ముందూ వెనుక చూసుకోకుండా, వారి మంచి చెడ్డలు తెలుసుకోకుండా పేపర్లో ప్రకటనచూసి అలా హడావిడిగా పెళ్లి చేయడం నాకు నచ్చలేదు. ఈకాలం అమెరికా కుర్రాళ్లను అసలు నమ్మడానికి వీలులేదు. పెళ్లంటే నూరేళ్ల పంట. పూర్వం మనవాళ్లు చవటలనుకొన్నారా? మూడు తరాల చరిత్ర తెలుసుకుని మరీ పెళ్లి చేసేవారు. నేడు ఇన్‌స్టెంట్ కాఫీలా ఇన్‌స్టెంట్ పెళ్లిళ్లు జరిగిపోతున్నాయి అంటూ గొణుక్కోవడం నాకు చిరాకు కలిగించింది. విని విని ఒకరోజు విసుక్కుని వయసు వచ్చింది కానీ నీకు బుద్ధి రాలేదని, నోరుమూసుకొని వుండుమని గట్టిగా కేకలేసాను.

నీరజ పెళ్లయి సంవత్సరం దాటింది. అప్పుడప్పుడు ఫోన్లు చేస్తూ వుండేది. మా అబ్బాయి ఆఫీసు పనిమీద మూడు నెలలు స్టేట్స్ వెళ్తున్నాడంటే నీరజ ఎడ్రస్సు తెలుసుకొని చూచి రమ్మన్నాను. మూడు నెలల తర్వాత అమెరికా నుంచి ఒంటరిగా రాకుండా నీరజతో కలసి వచ్చాడు. ఇద్దరినీ చూసి ఆశ్చర్యపోయాము.

అమెరికాలో నీరజ భర్త రమేష్ అంతకు ముందే వేరొక అమ్మాయిని పెళ్లి చేసుకొని ఆమెతో కాపురం చేస్తున్నాడట. ఒక కొడుకు కూడా వున్నాడట. ఇండియాలో తల్లిపోరు పడలేక మరల నీరజను పెళ్లిచేసుకొని అమెరికా తీసుకెళ్లాడట. సున్నిత మనస్కురాలైన నీరజ ఈ విషయం తల్లిదండ్రులకు తెలియనీకుండా చాలా జాగ్రత్త పడి ఇన్నాళ్లు కాలక్షేపం చేసిందిట. మా అబ్బాయిని చూడగానే కథంతా చెప్పి గొల్లుమని ఏడ్చి, మా అబ్బాయి వెంట ఇండియా వస్తాననడంతో వెంటతీసుకు వచ్చాడు.

ఈ విషయం వింటే బీపీ, షుగరు, హార్టు జబ్బులతో బాధపడే మా అన్నయ్య వదిన తట్టుకోలేరని నీరజను ఢిల్లీలో మా ఇంట్లోనే వుంచుకొని ఆమెను ఓ ఉద్యోగంలో చేర్పించి అమెరికా నుంచి ఫోను చేసనట్లు ఢిల్లీ నుంచి వైజాగ్‌కు ఫోను చేయించి మా అన్నయ్య, వదినలు సంతోషంగా వుండేటట్లు చేసారు. కాలం ఎప్పుడూఒకలా వుండదు. నీరజ పక్కింట్లో వుంటున్న అబ్బాయితో ప్రేమలో పడింది. ఆ అబ్బాయి ఎం.బి.ఏ చదివి ఒక మంచి ప్రైవేటు కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. మూడు సంవత్సరాలనుంచి ఆ అబ్బాయి మాకు బాగా తెలుసు. నీరజ కథను విని అంగీకరించడంతో మా కుటుంబ సభ్యులంతా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చి వారిద్దరికీ రిజిస్టరు మేరేజ్ జరిపించాము. నీరజ, ఆమె భర్త మా ఇంటిపక్కనే ఆనందంగా కాపురం వుంటున్నారు. నీరజ పెళ్లి విషయం, నీరజ మాతో ఢిల్లీలో వుంటున్న విషయం మా అన్నయ్య వాళ్లకి ఎలా చెప్పాలో తెలియక తికమకపడ్డాము.

కాగల కార్యం గంధర్వులు తీర్చినట్లు ఒకరోజు నీరజవచ్చి వాళ్ళ పిన్ని చెవిలో తను తల్లి కాబోతున్నట్లు శుభవార్తను చెవిని వేసింది. ఇక మా కాళ్లు చేతులూ మొదట ఆడలేదు. చివరకు తేరుకొని ఇక ఆలస్యం చేయకుండా మా అన్నయ్య వాళ్లకు నీరజ విషయం చెప్పాలని నిశ్చయించుకొని నేను నా శ్రీమతి లక్ష్మిని తీసుకొని వైజాగ్ వెళ్లాను. మొదట మా అన్నగారికి చెప్పి, ఏడవ మాసం వచ్చాక డెలివరీకి పంపుతానని, ఈలోపు మెల్లగా జరిగిన విషయం వదినకి చెప్పమని ఢిల్లీ తిరిగి వచ్చాము.

ఏడవ మాసం వచ్చేక నీరజను, కొత్తభర్తను వైజాగ్‌కు తీసుకెళ్లి మా అన్నయ్య వదినలకు అప్పగించి మా భారం దించుకున్నాము. మా వదిన మా ఆవిడను పక్కకు పిలిచి అదేమిటి అల్లుడు మారిపోయినట్లున్నాడు, పెళ్ళి ఫోటోలోలా లేడని అమాయకంగా అడిగిందిట. మా అన్నయ్య అసలు విషయం వదినకు చెప్పలేదని గ్రహించి ఆ రాత్రి కథను కంచికి చేర్చి సస్పెన్సుకు తెరదించాము.

(ఆంధ్రభూమి దినపత్రిక - ప్రియదర్శిని - 24-2-2005)

❀ ❀ ❀

అభిమానాలు - ఆప్యాయతలు

ఒకనాడు ఇంటికి ఎవరైనా బంధువులు, స్నేహితులు వస్తున్నారంటే ఇంటిల్లి పాది పొంగిపోయి, వారిని సాదరంగా ఆహ్వానించి అభిమానించేవారు, కానీ నేడు ఇంటికి ఎవరైనా బంధువులు స్వంత తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అప్పచెల్లెళ్ళు వచ్చినా ఎందుకు వచ్చేర్రా బాబూ! ఎప్పుడు వెళ్ళిపోతారో అని ముఖ్యంగా పిల్లలు, ఒక్కొక్కసారి పెద్దలు కూడా నేడు అనుకొంటున్నారు. ఆలి వంక వారు ఆత్మబంధువు లని గుడ్డిలో మెల్ల నయమైనట్లు వారిని మాత్రం అభిమానంగా ఆ ఇంటి ఇల్లాలు ఆదరిస్తుంది. ఇది ఈ కాలం తీరుగా మారింది.

మా తమ్ముడు ఎన్నాళ్లనుండో మమ్మల్ని రమ్మనమని పిలుస్తున్నాడు. వాడు ఎక్కడో తమిళనాడులో అరక్కోణంలో వుంటున్నాడు. వాడి పెళ్ళయి పదిహేను సంవత్సరాలుపైబడినా ఏదో ఒకటి రెండుసార్లు తిరుపతి వెళ్ళినపుడు వాడి ఇంటికి వెళ్ళేము కానీ ప్రత్యేకంగా వెళ్ళి వుండడానికి కుదరలేదు. మా నలుగురు అన్నదమ్ము లలో నేను ఇంటికి పెద్ద అవడంవలన, వాళ్ళ చదువులకు సహాయం చేయడం వలన తమ్ముళ్ళంతా నన్ను గౌరవిస్తారు. వెళ్తే ఎంతో ఆప్యాయతగా ఆదరించి అభిమా నంగా చూస్తారు.

ఈమధ్య రిటైర్‌అయాక కాళీగా వుండడం, పిల్లలపెళ్ళిళ్లై అంతా ఎవరి మానాన్నవాళ్ళు వేరే ఊళ్ళల్లో వుండడంతో మా ఇద్దరికీ తీరిక చిక్కి ఒకసారి అరక్కో ణంలో వున్న మా తమ్ముడింటికి వెళ్ళి నాలుగురోజులుండి తిరుపతి, తిరుత్తణి, కంచి వంటి పుణ్యక్షేత్రాలు ఒకసారి దర్శించి రావచ్చని ప్లాను వేసుకొని తమ్ముడికి

వస్తున్నట్లు ఉత్తరం వ్రాసేను. ఆ రోజులలో వస్తే ఎవరూ ఊళ్ళో ఉండరని, స్నేహితుడి పెళ్ళికి విజయవాడ వెళ్తున్నట్లు తరువాత వారంలో రమ్మనమని వ్రాసేడు. అలాగే ప్రోగ్రామ్ ఎరేంజి చేసుకొని శ్రీమతితో కలిసి వెళ్ళేను. మా తమ్ముడు కొత్తగా పిల్లలకోసం కంప్యూటరు కొన్నాడు. మా మరదలు అక్కపిల్లలు అమెరికాలో వున్నారుట. ఈ మెయిల్ ముచ్చట్లు చాటింగు అంటూ పిల్లలు, మా మరదలు, తమ్ముడు అంతా లీనమైపోయేరు. తరు వాత ఏవో టీవీసీరియల్స్ వస్తూవుంటే తమ్ముడు, మరదలు టివిపెట్టుకొని మేము దూరం నుండి వాళ్ళింటికి వాళ్ళకోసం వచ్చేమని మరచిపోయి ఆ ప్రోగ్రాములో మునిగిపోయేరు. ఇక ఇద్దరి పిల్లలసంగతి చెప్పనే అక్కర్లేదు. ఆడుకొన్నంతసేపు కంప్యూటర్‌తో ఆడుకొని తరువాత భోజనాలుచేసి చదువులో నిమగ్నమయేరు.

నాకూ నా భార్య లలితకి ముందునుండి కబుర్లంటే ఇష్టం. మా తమ్ముడు ఎప్పుడూ ఎక్కువగా మాట్లాడేవాడు. మా మరదలు మాటలు తక్కువే. అయినా ఇంతకుముందు వాళ్ళింటికి వెళ్ళినప్పుడు ఎంతో ఆదరాభిమానాలతో ఆదరించి మాట్లాడేరు. కానీ ఈసారి వారిలో చాలా మార్పు కనిపిస్తోంది. నాకే చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. పిల్లలయితే ఇంటికి ఎవరో బంధువులు వచ్చినట్లు చూస్తున్నారు. కానీ స్వంత పెదనాన్న, పెద్దమ్మ వచ్చినట్లు చూడడంలేదు. రాగానే ఒక చిరునవ్వు మాత్రం ముఖాన పులుముకొని పలుకరించేరు. తరువాత మరి మాటా మంతీలేదు. ఆ రాత్రి మా ఇద్దరికి ఎందుకు వాళ్ళింటికి వచ్చేమా అని బాధపడి విచారించేము. మరుసటి రోజు ఉదయమే లేచి తిరుత్తణీ వెళ్ళి వస్తామని బయలుదేరాము. ఆదివారమయితే తమ్ముడు కూడా వెంటవాస్తనని చెప్పేడు. అయినా కొన్ని గంటలైనా ఆ ఇంటి నుండి బయటపడవచ్చని బయలుదేరి తిరిగివచ్చేము.

అక్కడ మా తమ్ముడి ఇంట్లో వారంరోజులుందామని వెళ్ళేము కానీ మాకు వాళ్ళ ప్రవర్తన నచ్చక, ఇక అక్కడ వుండడానికి ఇష్టపడక నాలుగవరోజే తిరుపతి ప్రయాణమై వెళ్ళిపోతూ వుంటే తమ్ముడు మాత్రం ఇంకా నాలుగు రోజులుంటారను కొంటున్నాము, అప్పుడే వెళ్ళిపోతున్నారా! అని బాధపడ్డాడు. మరదలు మాత్రం మొక్కుబడిగా మా శ్రీమతికి బొట్టుపెట్ట చీర, జాకెట్టు పెట్టి ప్రయాణంలో పనికి వస్తాయని రెండు యాపిల్సు ఇచ్చింది. పిల్లలిద్దరూ స్కూలుకి వెళ్ళే తొందరలో వున్నారు. వెళ్తున్నామని చెబితే బయటకు రాకుండా లోపల నుండే ఓ.కె.బాయ్ బాయ్ అని అరిచేరు.

చిరునవ్వుతో అందర్నీ ఆశీర్వదించి వాళ్ళింటినుండి బయటపడి ఊపిరి పీల్చుకొన్నాము. ఇకమీదట వెళితే పిలల దగ్గరకు తప్ప ఎక్కడికీ వెళ్ళి వుండకూదని నిర్ణయించుకొన్నాము. రాను రాను కాలంతోపాటు అభిమానాలు, ఆప్యాయతలు తగ్గిపోతున్నాయి. ఈ రోజులలో ఎవరింటికి వెళ్ళినా టివిలకు అతుక్కుపోయి ఇంటికి వచ్చేవారిని సరిగా ఆదరించి పలుకరించడంలేదు. ఇది చాలదన్నట్లు ఈ మధ్య

కొత్తగా కంప్యూటర్లు ఒకటి ఇంటింటా వచ్చిపడుతున్నాయి. దానితో అంతా బిజీ అయిపోతున్నారు. ఈ కాలం వారికి ఇది బాధ కలిగించకపోయినా, పాత తరం వారికి ఈ విషయాలు బాధకలిగిస్తాయి.

(ఆంధ్రభూమి దినపత్రిక - ప్రియదర్శిని - 28-4-2003)

❋ ❋ ❋

విచిత్ర వివాహాలు

మా ఆఫీసులో కొత్తగా ఒక అబ్బాయి సాఫ్టువేర్ ఇంజనీరుగా చేరాడు. ఇల్లు కావాలంటే మా ఇంటిదగ్గరే పక్కనే ఒక అపార్ట్‌మెంట్ ఖాళీగా వుండడం వలన చూపిస్తే అందులో వారు దిగేరు. కొత్తగా పెళ్ళియిన జంట. ఇంకా పిల్లా పీచులేరు. ఒకరోజు సాయంత్రం వారింటికి రమ్మని పిలిస్తే వెళ్ళేము. మేరేజ్ డే అని చెప్పి స్వీటు, హాటు,ఐస్‌క్రీం అన్ని ఇచ్చి హడావిడి చేసేరు. మా ఆవిడ అక్కడ వారి ముచ్చట్లుచూసి మీరూ వున్నారూ ఎందుకు? మీకు పెళ్ళిరోజే గుర్తుండదు. దేనికైనా పెట్టి పుట్టాలి అంటూ దెప్పిపొడిచింది.

వారం రోజుల తరువాత మరలా ఆ కొత్తజంట వాళ్ళింటికి రమ్మనమని పిలిచారు. ఆకేషన్ ఏమిటని అడిగేసరికి 'మారేజ్‌డే'అన్నారు. నేను అవాక్కయి కొశ్చిన్ మార్కుముఖంపెట్టేసరికి ఆ అబ్బాయి తన కథ చెప్పేడు. వారిది ప్రేమవివాహం అవడంవలన ఇంట్లో పెద్దలు అంగీకరిస్తారో లేదోనని మొదట గుడిలో పెళ్ళి చేసుకున్నారుట, తరువాత ఎవరో రిజిష్టరు మేరేజి చేసుకోవటం మంచిదని చెబితే రిజిష్టరు మారేజ్ చేసుకున్నారుట. ఆ తరువాత పిల్లల వ్యవహారం తెలుసుకున్న పెద్దవాళ్ళు నలుగురిలో పరువు పోకుండా అందరిసమక్షంలో పెళ్ళి జరిపించాలని, వైభవంగా పెళ్ళిచేసేరుట. ఆ విధంగా వారికి మూడుసార్లు వివాహం జరగడంవలన ముచ్చటగా మూడు పెళ్ళి రోజులు జరుపుకుంటున్నట్లు గొప్పగా చెప్పి రెండు నెలల తరువాత రాబోయే మూడో పెళ్ళిరోజుకి కూడా తప్పక రావాలని పిలిచేరు.

వాళ్ళ సరదా, ముచ్చట చూసి మా ఆవిడ ఇంటికి వెళ్ళేక ఈసారైనా మన పెళ్ళిరోజు గుర్తుపెట్టుకుని వాళ్ళకోసమైనా పార్టీకి పిలవండి. లేకపోతే మన పరువు పోతుంది ఇండైరెక్టుగా నన్ను ఇకమీదట ఖచ్చితంగా పెళ్ళిరోజు జరుపుకోవాలని హెచ్చరించింది. ఈ మధ్య కొందరు పుట్టిన రోజులు కూడా రెండుసార్లు జరుపు కుంటున్నారు. తిథి ప్రకారం ఒకసారైతే ఇంగ్లీషు తారీఖుల ప్రకారం ఒకసారి జరుపుకుని ఆనందిస్తున్నారు. నేడు ఒకరు, ఇద్దరూ పిల్లలవడం వలన అన్నీ వేడుకగా జరుపుకొంటున్నారు.

అసలు మన పూర్వీకులు వివాహాలు ఎనిమిది రకాలుగా పేర్కొన్నారు. 1. అర్షవిధి 2. అసురవిధి 3. బ్రహ్మవిధి 4. పైశాచకవిధి 5. దైవవిధి 6. గాంధర్వవిధి 7. రాక్షసవిధి 8. ప్రాజాపత్యవిధి. ఈ రోజులలో అక్కడక్కడ అసురవిధిలో అంటే

కన్యాశుల్కం తీసుకుని జరిపించే వివాహం, బ్రహ్మవిధిలో అంటే శక్తికొలది వధువుని అలంకరించి కట్నకానుకలిచ్చి వివాహం జరిపించడం సామాన్యంగా కనిపిస్తోంది. ఈ మధ్య ప్రేమవివాహాలు పెరిగేక గాంధర్వ విధి పెళ్ళిళ్ళు కూడా బాగా జరుగుతున్నాయనే చెప్పాలి. రాక్షస విధి పెళ్ళిళ్ళు కూడా అప్పుడప్పుడు జరుగుతున్నాయి.

మనదేశంలోనే వివిధ ప్రాంతాలలోచిత్ర విచిత్రమైన ఆచారాలు వున్నాయి. కొన్ని ప్రాంతాలలో అటవికులు, కొండవారిలో మారు మనువు అంటే పెళ్ళికి వధువుకి ఎవరు ఎక్కువ బంగారం పెడితే వారిని పెళ్ళి చేసుకునే ఆచారం వుంది. ఒక సారి పెళ్ళయేక వేరొక మగాడు ఎక్కువ బంగారు ఇస్తానంటే కట్టుకున్న మొదటి మొగుణ్ణి వదిలి కొత్తవాణ్ణి పెళ్ళి చేసుకుంటుంది. వారి కులాచారం ప్రకారం వారికిది తప్పు కాదు. ఒక్కొక్కసారి ఏడు, ఎనిమిది మనువులు చేసుకున్నవారిని కూడా నేను చూసేను. దీనిని మారు మనువుంటారు. ఇంకా కొన్ని ప్రాంతాలలో పెళ్ళికి ముందు అమ్మాయి రజస్వల కాగానే ఆ ఊరి రాజు లేక జమిందారు దగ్గరకు ముందు పంపిస్తారు. ఆ జమిందారో, రాజో ఆ అమ్మాయిని అనుభవించి కానుకగా కొంత సొమ్ము అమ్మాయి తండ్రికి ముట్టజెప్తాడు. ఆ సొమ్ముతో తరువాత అమ్మాయిని పెళ్లి చేస్తారు. ఇంకా కొన్ని ప్రాంతాలలో అమ్మాయికి ఒక అబ్బాయితో వివాహం జరిపించాక, వివాహం జరిపించిన పురోహితునితో మొదటి రాత్రి నిద్రచేయాలని ఆచారం వుంది. ఇటువంటి ఆచారాలు ఇప్పుడిప్పుడే తగ్గుతున్నాయి.

కొన్ని కొండ ప్రాంతాలు, అటవికులలో స్త్రీకి స్వేచ్ఛ ఎక్కువగానే వుందనిపిస్తుంది. తనకి నచ్చినవాణ్ణి, మెచ్చినవాణ్ణి, వీరుణ్ణి, పరాక్రమవంతుణ్ణి వలచి వివాహం చేసుకునే స్వేచ్ఛవుంది. అదే విధంగా ఒకవేళ పెద్దలు నిర్ణయించిన పెళ్ళి చేసుకున్నా, భర్త నుండి శరీర సౌఖ్యము, తృప్తి లభించకపోతే కట్టుకున్న భర్తను విడిచిపెట్టి వేరే మనువు చేసుకోవచ్చు. నేడు భార్యభర్తల మధ్య అనురాగం లేకపోయినా, భర్తభార్యను హింసించి కొట్టినా, భార్య కోరిక మేర తృప్తి కలిగించకపోయినా నేడు కొందరు భార్యాభర్తలు విడాకులు తీసుకుని జీవిస్తున్నట్టే. అటవికులలో పూర్వం నుండి ఇటువంటి ఆచారం వుండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

బహుభార్యాత్వం అటవికులలో కొన్ని ప్రాంతాలలో వుంది. ముస్లింలలో బహు భార్యాత్వం తప్పులేదు. కానీ హిందూసమాజం ఒప్పుకోదు. బహు భర్తలను స్త్రీ పొందడం, భారతంలో ద్రౌపది విషయంలోనే కనిపిస్తుంది. కానీ ఏ ప్రాంతంలోనూ ఈ ఆచారం వున్నట్లు కన్పించదు. అటవికులలోనూ ఎక్కడా ఉన్నట్లు ఆధారాలు లేవు. ఒకనాడు కన్యాశుల్కంతో మగ్గిన దేశం నేడు వరకట్న సమస్యతో వేగిపోతోంది. స్త్రీ ఉద్యోగంచేసి సంపాదిస్తున్నా వరకట్న సమస్య తీరకపోవడం, డాక్టరు ఇంజనీరింగు చదివిన అమ్మాయిలకు లక్షలు కట్నం ఇచ్చి పెళ్ళి చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 2006)

❁ ❁ ❁

కొని తెచ్చుకొంటున్న కొత్త రోగాలు

ఈమధ్య ఎవరింటికి వెళ్లినా బీపీ, షుగరు, కేన్సరు, హార్టు ప్రాబ్లమ్ లేకుంటే చికెన్‌గున్యాతో బాధపడుతున్నాము. కీళ్ళనొప్పులు, లేచి నిలబడలేక పోతున్నాము. నడవ లేకపోతున్నాము. ఈ మాయదారి రోగాలు ఎలా వస్తున్నాయో అర్థం కావడం లేదని వాపోవడం చూస్తుంటాము. ఒకరకంగా చెప్పాలంటే పూర్వంకన్నా తిండి బాగానే తింటున్నారు. రకరకాల పళ్ళు, కూరలతో సమృద్ధిగా తింటున్నారు. తిండిలో లోపంలేదు. అయినా రోగాలు మాత్రం పెరుగుతున్నాయి. పాతరోగాలే కాకుండా కొత్త కొత్త రోగాలు పుట్టుకొస్తున్నాయి. కారణం ఊహిస్తే దీనికంతా పెరుగుతున్న నాగరికతే అని చెప్పాలి.

నాగరికత మోజులో సుఖాలకు అలవాటుపడి కూర్చున్న చోటునుంచి లేవ కుండా అంతా రిమోట్ కంట్రోలుతోనే పనులు చేస్తున్నారు. కాలినడక, సైకిలువంటివి మరచిపోవడంవలన కార్లు, స్కూటర్లు, మోటారు బైకులపైనే ప్రయాణిస్తున్నారు. మోటారు వాహనాలతో వాతావరణ కాలుష్యం పెరుగుతోంది. శరీరానికి తగిన వ్యాయామం లేక రకరకాల రోగాలు వస్తున్నాయి. పట్టణాలలో మోటారు వాహనాలతో పాటు పారిశ్రామిక వాడలవలన, పచ్చని చెట్లు అంతరించి అంతస్తుల భవనాలు కిక్కిరిసి వుండే జనసంఖ్య కూడా రోగాలకు కారణమవుతోంది. దానితోడు రోడ్డుపక్కన గల మిఠాయి అంగళ్లలో, బళ్లపై తయారుచేసి అమ్మే తినుబండారాలు, కొత్త రుచులు అందించే చాట్ మసాలాలు, నూడిల్స్, నోరూరించే మిరపకాయ బజ్జీలు, గోలీ కప్పులు ఇవన్నీ తినడానికి రుచిగా వున్నా అనారోగ్యానికి హేతువులవుతున్నాయి. సెల్‌ఫోన్లు ఎక్కువగా వాడడంవలన రేడియేషన్ ప్రభావం వుంటుందంటున్నారు. సినిమా స్టార్లతో హోరెత్తిస్తున్న ప్రకటనలు చూసి త్రాగే కూల్‌డ్రింకులు రోగకారకాలని తేలింది.

ఇవికాక అన్నిటికీ ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరిగింది. ఏ ఫంక్షన్‌కైనా అన్నింటికీ ప్లాస్టిక్ కంటె యినర్సునే ఉపయోగిస్తున్నారు. యూజ్ అండ్ త్రో అని ఆనందిస్తున్నారు. ఈ ప్లాస్టిక్ వస్తువులలో ఎంత దుమ్ము పేరుకుని వుంటుందో ఎవ్వరూ ఆలోచించడంలేదు. ఈ మధ్య పెళ్ళిళ్లలో అరటి ఆకులకు బదులు అరటి ఆకులను పోలిన ప్లాస్టిక్ ఆకులు ఉపయోగిస్తున్నారు. హోటళ్ళలో ఇది వరకు ప్లేట్లలో అరిటాకు ముక్కో అడ్డాకు ముక్కో వేసి వేడివేడి ఇడ్లీ, దోసె ఇచ్చేవారు. ఇప్పుడు పాలిథిన్ షీట్లువేసి టిఫిన్ ఇస్తున్నారు. పార్శిళ్లు ఇవ్వడానికి వేడివేడి పదార్థాలుప్లాస్టిక్ సంచులలోవేసి పాక్‌చేసి ఇస్తున్నారు. దీంతో వేడికి ప్లాస్టిక్ కరిగి ఆ పదార్థాలు విష పూరితంగా మారే ప్రమాదం వుంది. కానీ నేడు అంతటా ప్లాస్టిక్‌మయంగానే కనిపి స్తోంది. దీని గురించి ఎవరూ పట్టించుకోవడంలేదు. పళ్లు, కూరలు మార్కెట్ నుంచి తెచ్చుకోవడానికి ప్లాస్టిక్ కేరీ బ్యాగులు వాడవచ్చుకానీ వేడి పదార్థాలకోసం వాడ కూడదు.

దీనికి తోడు నేడు పంటలు పండించడానికి పండిన పంటలు (పళ్లు, కూర గాయలు) నిల్వ వుంచడానికి క్రిమకీటక నాశక మందులు విపరీతంగా వాడుతున్నారు. నీటితో ఎంత బాగా కడిగినా, ఉడికించినా ఇంకా కొంత భాగం విషపూరిత పదార్థం కాయగూరలలో, పళ్లల్లో మిగిలివుంటుంది. మనకి తెలియకుండా శరీరంలో చేరి సమయం చూసుకుని రోగ కారణమవుతుంది. ఎక్కువ దిగుబడి రావాలని, కొన్ని రకాల ఎరువులు పంటలకోసం, పాలు ఉత్పత్తి గుడ్ల ఉత్పత్తి పెరగాలని కొన్ని రకాల రసాయనాలు పాడి పశువులపైన పెంపుడు కోళ్లపైన వాడడంవలన ఉత్పత్తులు పెరిగినా కొన్ని రకాల రోగాలకు కారణమవుతోంది.

ముఖ్యంగా పట్టణాలలో నగరాలలో స్వచ్ఛమైన గాలి,నీరు లభించడంలేదు. మనిషి ఆరోగ్యంగా బ్రతకడానికి ఇవి రెండూ ముఖ్యం. తరువాత కల్తీ నూనెలు, కల్తీఆహార పదార్థాలు, కల్తీవస్తువులు, వంటకాలకోసం ఉపయోగించే కొన్ని రంగులు హాని కలిగిస్తాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే ధూమపానం మత్తుపదార్థులు,పాన్‌పరాగ్, మద్యమాంసాలుతో కోరి తెచ్చుకున్న జబ్బులు కొన్నివున్నాయి. తినే తిండి ఎలావున్నా శరీరానికి తగిన వ్యాయామం వుండాలి. ఆఫీసులో, ఇంట్లో కూర్చుని స్కూటర్లుకార్లలో తిరిగేవారికి తగిన శరీర వ్యాయామం లేక రోగాలు వస్తున్నాయి. మార్నింగ్ వాక్, ఈవినింగ్ వాక్, ఎక్సర్‌సైజులు, యోగా వంటివి రెగ్యులర్‌గా చేస్తే రోగాలకు దూరంగా వుండవచ్చు. శరీరానికి తగిన వ్యాయామం లేకపోతే స్త్రీ పురుష భేదము లేకుండా రోగాలు వచ్చి చేరతాయి.

ఈ మధ్య ప్రకటనలు చూసి, అరనిమిషంలో దోశి, ఇడ్లీ, వడ, కూర, చెట్నీ అంటూ ఎగబడి మార్కెట్లకి వెళ్లి ఇన్‌స్టంట్ ఫుడ్స్‌తెచ్చుకుంటున్నారు. హాఫ్ బాయిల్డ్ ఫుడ్స్ కూడా కొనితెచ్చుకొని శ్రమ లేకుండా ఇంట్లో తినడం కూడా రోగాలకి కారణమే రుచికి బాగున్నా శుచి, శుభ్రత కరువవడం వలన వెంటనే కాకపోయినా కొంతకాలాని కైనా చెడు ప్రభావం శరీరంపై వుంటుంది. కోరి రోగాలు తెచ్చుకున్నట్లు కొనుక్కు న్నట్లు అవుతుంది. వీలైనంతవరకు హోటళ్లతిండికి, ఇన్‌స్టంట్ ఫుడ్స్‌కి దూరంగా వుండడమే మంచిది.

ఆకుకూరలు చౌకగా వుంటాయని ఆరోగ్యానికి మంచిదని చాలామంది తింటారు. ఆకుకూరలు సరైనవి అయితే ఆరోగ్యానికి మంచిదే. కానీ ఆకుల వెనుక భాగంలో పురుగులు గుడ్లుపెట్టి వుంటాయి. కొన్ని ఆకులకు తెగులు వచ్చిఎర్రని మచ్చలు ఏర్పడతాయి. వీటి నివారణ కోసం కీటకనాశిని మందులు వాడతారు. అందువల్ల ఆకుకూరలు కొన్నవారు గుడ్లు కనిపించిన ఆకులు, మచ్చలు కనిపించిన ఆకులు తొలగించి నీటితో బాగా కడిగి ఉపయోగించాలి. ఆకుకూరలేకాకుండా ఏ రకం కూరలైనా నీటితో బాగా కడిగి పుచ్చులేకుండా చూసి వంటచేయాలి.

ఇంట్లో ఫ్రిజ్, ఓవెన్ వంటివి వున్నాయని వండుకున్న వంటలు అందులో నిల్వ వుంచుకొని రోజుల తరపడి తినకూడదు. ఒకటి రెండు రోజులకన్నా

నిల్వవుంచిన పదార్థాలు తినడం మంచిదికాదు. ఒకసారి వండిన పదార్థాలు మళ్లీ మళ్లీ వేడి చేసుకొని తినడం మంచిది కాదు. కాఫీ, టీలు రోజూ లిమిటెడ్‌గా ఒకటి రెండుసార్లు మించి తాగడం మంచిదికాదు. అదేపనిగా టీవీచూస్తూ భోజనం చేయడం కూడా మంచిదికాదు. భోజనం చేసేటపుడు తినే ఆహారంపై మనసువుంటే ఆరోగ్యాన్ని కలిగిస్తుంది. అరిటాకు, విస్తరాకులలో అప్పుడప్పుడు భోజనం చేయడం వలన ఆకులలో వుండే కొన్ని పదార్థాలవలన ఆరోగ్యం కలుగుతుంది. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు చెప్పారు. వారి మాటలు కొట్టివేయకుండా జాగ్రత్త వహిస్తే మంచిది.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 2006)

❁ ❁ ❁

శిక్షలు కఠినంగా వుండాలి

'వినాశకాలే విపరీతబుద్ధి' అని మనపెద్దలు చెప్పిన మాటలు మరపురానిది. 'కంచే చేనుమేయడం' అనే సామెత కూడా నేటి అధ్యాపకులకుసరిపోతుంది. కలియుగ ప్రభావం, దారుణం, ఘోరం కాకపోతే ఒక స్కూల్లో అధ్యాపకవృత్తి చేపట్టిన గురువు క్లాసులో పద్దెనిమిదిమంది పిల్లలపై అత్యాచారం జరపడం, అందులో కొందరు గర్భవతులైనట్లు వచ్చిన వార్తలు వింటూవుంటే, ఒళ్లు గగుర్పొడుస్తోంది. ఇంకొక టీచరు గుట్టు రట్టుకాకుండా 10–15 ఏళ్లనుంచి స్కూల్లో చదివే విద్యార్థినులపై అత్యాచారంచేస్తూ తప్పించుకు తిరుగుతున్నాడట. విద్యాలయాలు నేడు ఇంతగా భ్రష్టుపట్టడానికి కారణం మన ప్రభుత్వ నిర్వాకమనేచెప్పాలి. ఓనమాలు రానివాళ్లని టీచర్లుగా నియమించడం, వారి పూర్వచరిత్ర, నడవడిక తెలుసుకోకుండా ఉద్యోగా లిచ్చి, వారికి స్వేచ్ఛ నిచ్చి గాలికి వదిలేస్తున్నారు. జీతాలు తీసుకుంటూ అనేకమంది టీచర్లు స్వంత వ్యాపారాలు, వ్యవసాయాలు చేసుకుంటూ కొందరు కాలక్షేపం చేస్తుంటే మరికొందరు కామక్రీడలు విద్యాలయాలలో సాగించి సెక్సు ఎడ్యుకేషన్ అడక్కుండానే పిల్లలకు అందిస్తున్నారు.

బోధన చేసే గురువులే ఇలా ప్రవర్తిస్తుంటే సాటి విద్యార్థులు, వయసు వేడిలో తప్పులు చేయడంలో తప్పేముంది? విద్యార్థులకు వెలుగు చూపించవలసిన గురువులు పిల్లల జీవితాలు అంధకారమయం చేస్తుంటే అధికారులు, రాజకీయ నాయకులు గుడ్లప్పగించి చూస్తున్నారు. మిగతా రాష్ట్రాలతో పోల్చుకుంటే రాష్ట్రంలో టీచర్లు మెరుగేననిపిస్తోంది. ఎందుకంటే ఎక్కువగా ఆశ్రమ పాఠశాలల్లోనే కొందరు టీచర్లు అత్యాచారం చేస్తున్నట్లు బయటపడ్డాయి. ఆ మధ్య ఇంకొక విచిత్రమైన వార్త విన్నాను. ఒక కాలేజీలో లెక్చరరు కౌగిలింతకు కొన్ని మార్కులు, ముద్దుకు కొన్ని మార్కులు, ఏకంగా శరీరం అప్పగించినవారికి ఇన్ని మార్కులని చార్టుపెట్టుకొని సరదాలు తీర్చుకున్నాడట, ఇవన్నీ చూస్తుంటే మనం ముందుకుపోతున్నామో, అధః పాతాళానికి పోతున్నామో అర్థం కావడంలేదు.

ఇటువంటి అనర్థాలన్నిటికీ మూలకారణం, దేశంలో సరైన శిక్షలు అమలు చేయకపోవడమే! ఇటువంటి నరరూప రాక్షసులను నాలుగు రోడ్ల మధ్య నిలబెట్టి, రాళ్ళతో కొట్టి అందరూ చూస్తుండగా ఉరితీయాలి. సరైన కఠినశిక్షలు లేక రోజు రోజుకి అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వంవారు కళ్లుతెరచి కఠిన చర్యలు తీసుకోకపోతే దేశ గౌరవం మంటగలుస్తుంది.

ఆమధ్య ఒకవిదేశీ మహిళలను మానభంగంచేస్తే, ఈ మధ్య కారు డ్రైవరే హైదరాబాద్‌లో ఒక మహిళా ఆఫీసర్ని రేప్ చేసినట్లు సంచలనవార్త ఈ వార్తలకు అంతూపొంతూ వుండడంలేదు. 'కర్రలేనివాని గొర్రె కరిచె' అనే సామెతను మా చిన్నతనంలో చెప్పేవారు. ఆ సామెత నిజమనిపిస్తోంది. అత్యాచారాలకు సరైన శిక్షలు లేకే నేడు పెరిగిపోతున్నాయి. పసికందులపై, మైనరు బాలికపై, అరవై ఏళ్ళ ముదుసలిపై ఒకరేమిటి తండ్రి కూతురుపై మామ కోడలుపై వావివరసలు చూడకుండా కామంతో కళ్లు కనిపించక అత్యాచారాలు చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు.

నేడు వచ్చే సినిమాలు, బుల్లిపెట్టి విన్యాసాలు ఇవి చాలక ఈ మధ్య ఇంటర్నెట్ బ్రౌజింగులు అన్నీ యువతని పెడదారిలో పెట్టడమేకాకుండా పెళ్లయినవారు, నడి వయస్కులు కూడా పెడత్రోవ పడుతున్నారు. పూర్వం బ్రిటిష్‌వారి పాలనలో ఉద్యోగస్తులకి కొన్ని అర్హతలు పాటించేవారు. గర్ల్స్ స్కూల్లో పనిచేయడానికి నలభై సంవత్సరాలు దాటిన పురుషులనే సెలక్టుచేసి అధ్యాపకులుగా నియమించేవారు. నైట్‌వాచ్‌మెన్ ఉద్యోగం ఇవ్వడానికి నలభై సంవత్సరాల పైబడ్డవారికే ఇచ్చేవారు. ఈ కాలంలో పద్దెనిమిది ఏళ్ల నుంచి ముప్ఫై ఏళ్లలోపువారే ఎక్కువమంది వాచ్‌మెన్ ఉద్యోగాలు చేస్తున్నారు. బాధ్యత కలిగి వుంటారని వయసుమీరినవారికి ఆ ఉద్యోగాలు ఇచ్చేవారు ఈ రోజు నిబంధనలకు తిలోదకాలిచ్చి ఇష్టమైనవారిని, సిఫార్సులతో డబ్బుతో ఉద్యోగాలు సంపాదించుకునేవారే ఎక్కువవడంతో క్రమశిక్షణ లోపించి, అత్యాచారాలు వంటివి పెరుగుతున్నాయి.

టీచర్లలో నైతికప్రవర్తన లేనందునే సెవెన్త్ క్లాసు చదివే విద్యార్థినీ విద్యార్థులు కూడా ప్రేమలో పడుతున్నారు. పూర్వపు రోజులలో కాలేజీలో అడుగుపెట్టేకే నూటికి ఒకరో ఇద్దరో ప్రేమ వ్యవహారాలు సాగించేవారు. నేడు హైస్కూలు చదువులు పూర్తి కాకుండానే సెవెన్తు క్లాసు నుంచి ప్రేమలు మొదలై, టెన్త్ వచ్చేసరికి పరిపక్వమై ఇంట్లోనుంచి లేచిపోతున్నారు. నేడు అమ్మాయిలకి స్వేచ్ఛ పెరిగింది. ఒకప్పుడు అబ్బాయి ఎంత ఎరవేసినా అమ్మాయిలు పడేవారుకాదు. శీలానికి చాలా విలువిచ్చేవారు. నేడు ఫేమిలీ ప్లానింగ్, ఎయిడ్స్ ప్రచారం ఎక్కువవడంతో కాలుజారే అమ్మాయిల సంఖ్య పెరుగుతోంది. పెళ్లి కాకుండానే సెక్సులో పాల్గొనడం తప్పులేదని విస్తృతంగా చర్చలు, ప్రచారం ఈ మధ్య సాగడం యువతికి మరింత బలాన్ని చేకూరుస్తోంది.

ప్రేమ, దోమ అని ముందు కొందరు అబ్బాయిలు, అమ్మాయిలకు ఎరవేసి లొంగని పక్షంలో బెదిరించి లొంగదీసుకోవమో, లేక అత్యాచారంచేసి కోరిక తీర్చు కోవడమే జరుగుతోంది. విద్యార్థులను క్రమశిక్షతో సన్మార్గంలో నడిపించవలసిన ఉపాధ్యాయులే గడ్డితిని అక్రమంగా అభం, శుభం తెలియని అమాయక అమ్మాయిల్ని వేధించి అత్యాచారం చేసి వారిని గర్భవంతులనుచేయడం జాతికే తీరని మచ్చ. అవమానకరమైన విషయం. ఇటువంటివారిని కోర్టులు, కేసులపేరుతో నాన్చకుండా వెంటనే కఠినంగా శిక్షించాలి. అప్పుడే మిగతావారికి కనువిప్పు కలుగుతుంది. లేకుంటే అత్యాచారాలకు అంతం వుండదు.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 2006)

❁ ❁ ❁

'టీవీ' జబ్బు సోకిందా ?

భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగస్థులైతే ఆఫీసులో అలసిపోవడంవలన ఎప్పుడైనా మెస్సుపైనో, హోటల్‌పైనో ఆధారపడితే తప్పులేదు. కానీ ఉద్యోగం సద్యోగం లేకుండా ఇంట్లో కూర్చుని టివి చూస్తూ వంటవార్పూ చేయకపోవడం నేరం. వంట, ఇంటి పనులు చేసుకోవడం వలన శరీరానికి తగిన వ్యాయామం వుండి ఆరోగ్యాన్ని కలుగ జేస్తుంది. బయట వండిన పదార్థాలు తరచుగా తినడానికి అలవాటుపడిన రోగాలు తప్పవు.

"ఏం వదినా ఎప్పుడు వచ్చావు హైదరాబాద్‌నుండి. ఇప్పుడు మీ కోడలికి ఎలాగుంది? ఏమిటి అసలు జబ్బు అని అడిగేరు పక్కింటి మహాలక్ష్మిగారు హైదరా బాద్ వెళ్ళివచ్చిన అనూరాధ గారిని పలకరించి.

ఉదయమే వచ్చాను. మా కోడలికి ఒళ్ళుబాగావచ్చింది. ఆరునెలలో పది కేజీల బరువు పెరిగింది. మావాడు ఏడాది క్రితమే ఉద్యోగం మారేడు. కొత్త ఆఫీసు వాళ్ళు మధ్యాహ్నం అక్కడే ఆఫీసులో ఫ్రీలంచ్ పెడ్తారుట. అందుచేత మధ్యాహ్నం ఇంట్లో భోజనంచేయదు. రాత్రివేళ ఇంటి భోజనం, మనుమలు యిద్దరు ఉదయమే టిఫిన్ చేసి బాక్సులోఅన్నం పట్టుకెళ్తారు. ఎనిమిది గంటలకు పిల్లలు, ఎనిమిదన్నరకు అబ్బాయి ఆఫీసుకువెళ్తాడు. పనిమనిషి వచ్చి అంట్లగిన్నెలుంటే తోమి, ఇల్లు ఊడ్చి, బట్టలు ఉతికి వెళుతుంది. మా కోడలు ఉదయంతొమ్మిది నుండి సాయంత్రం పిల్లలు వచ్చేవరకూ టీవి రిమోట్ పట్టుకొని హాల్లో దివాన్‌కాట్‌మీద దొర్లుతూ టీవీలో సీరియళ్ళు, సినిమాలు చూస్తే వుంటుంది.ఇది వరకు మా అబ్బాయి ఇంట్లో మధ్యాహ్నం భోజనం చేసేటప్పుడు వంట, వార్పూ చేసేది. అబ్బాయి ఆఫీసులో భోజనం అవడం వలన వంట చేయడానికి బద్ధకం వస్తోందట. దానికితోడు ఈమధ్య కొత్తగా వాళ్ళ వీధిలోఒక మెస్సుపెట్టేరుట. ఇంట్లో కుక్కర్లో బియ్యంపడేసుకుని, కూర, సాంబారు, పప్పు మెస్సునుండి తెప్పించుకుని తింటున్నారుట. అందుచేత తెప్పించుకుని తింటు

న్నారుట. అందుచేత తరచు మెస్సునుండి టిఫిన్లు, అన్నం తప్ప మిగతా ఐటెమ్స్ తెచ్చుకు తినడంతో ఇంట్లో పనిపాటు లేక టీవీతో పొద్దస్తమానం కుస్తీపట్టడంతో లేని జబ్బులు, కొత్తజబ్బులు వస్తున్నాయి అన్నారు.

ఇంతకీ డాక్టర్లు ఏంజబ్బని తేల్చారు. అని అమాయకంగా అడిగేరు మహాలక్ష్మి గారు. అదే మా వారు చెప్పేరు. దీన్ని టివీ గున్యా అంటారు. దీని లక్షణం బరువు పెరగటం, బీపీరావడం, తలనొప్పిమొదలై తరువాత కళ్ళజోడురావడం దీని లక్షణా లట, కొందరికి సుగర్, కంప్లైంటు కూడా వస్తుందిట అన్నారు. మహాలక్ష్మీగారు నవ్వుతూ ఈమధ్య వచ్చే కొత్తజబ్బుల పేర్లు నవ్వు తెప్పిస్తున్నాయి. చికెన్‌గున్యా, డెంగ్యూ ఫీవర్ కాకుండా కొత్తగా టీవీ గున్యా ఒకటన్నమాట. అన్నారు ఆశ్చర్యపోతూ.

ఈ కాలంలో సదుపాయాలు పెరిగి ఆడవాళ్ళు వంట చేయడానికి గ్యాసు పొయ్యి, ప్రెషర్ కుక్కర్, మిక్సీలు, గ్రైండర్లు, ఫ్రిజ్‌లు ఓవెన్లు, ఎన్ని సదుపాయాలు వచ్చినా ఇంట్లో వంట వండుకని తినడానికి బద్దకించిన, బద్ధకిస్తున్న స్త్రీలు క్షమార్హులు కారు, భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగస్థులైతే ఆఫీసులో అలసిపోవడం వలన ఎప్పుడైనా మెస్సుపైనో,హోటల్‌పైనో ఆధారపడితే తప్పులేదు. కానీ ఉద్యోగం సద్యోగం లేకుండా ఇంట్లో వుంటూ వంటవార్పూ చేయకపోవడంనేరం,వంట,వార్పు వలన ఇంటిపనులు చేసుకోవడం వలన శరీరానికి తగిన వ్యాయామం వుండి ఆరోగ్యాన్ని కలుగజేస్తుంది. తెలివైనవారు ఇప్పటికైనా మేలుకొని టీవీ గున్యా జబ్బు రాకుండా జాగ్రత్త పడడం మంచిది. (ఆంధ్రభూమి దినపత్రిక - ప్రియదర్శిని - 22-6-2006)

❋ ❋ ❋

వైద్యమూ వ్యాపారమే......!

ఏవండీ! ఇది విన్నారా! బ్రహ్మానందంగారి భార్య సుజాతకి కేన్సరని ఇక్కడ డాక్టర్లు చెబితే ఆవిణ్ణి హైద్రాబాదు, బొంబాయి తీసుకువెళ్లి అన్నిరకాల టెస్టులు చేయించి యాభైవేలు ఖర్చుపెడితే ఆవిడకు కేన్సరులేదు గీన్సరులేదు. కొద్దిగా అల్సరు సిమ్‌టమ్స్, కనిపిస్తున్నాయి. కాఫీ, టీ, పులుపు కారాలు తగ్గించమని పంపించేరుట అంటూ శ్రీమతి ముఖం తుడుచుకుంటూ చెప్పింది.

ఆవిడ ఒకరకరంగా అదృష్టవంతురాలు. ఆ డాక్టర్లెవరో మంచివాళ్లులా వున్నారు. కొందరు డాక్టర్లయితే అది కేన్సరు రోగమని నమ్మించి లక్షో, రెండు లక్షలో చార్జిచేసి ఒక సంవత్సరపాటు ట్రీట్ మెంటు చేసి, ప్రతినెలా హైదరాబాదు రమ్మనమని, తరువాత రోగము తగ్గిందని చెప్పి పంపించేవారు. అన్నాను ఎక్కడో విన్న వార్తను ఆధారం చేసుకొని, పూర్వపు రోజులలో అంకితభావంతో డాక్టర్లు పని చేసేవారు. ఎంతో మేధావంతులు, విజ్ఞానవంతులు డాక్టరు కోర్సు చదివేవారు. వారిని ఎంతో శ్రద్ధగా పట్టుదలతో చక్కని డాక్టర్లుగా తీర్చిదిద్దాలని అప్పటి ప్రొఫెసర్లు గురువులు కూడా భావించి వారిని తీర్చిదిద్దేవారు. నేడు డబ్బుతో కొనుక్కునే చదువులు

వచ్చాక రిజర్వేషన్ చదువులు వచ్చేక మేదస్సుతో చక్కని డాక్టర్లు, ఇంజనీర్లు కావలసిన మేధావులు గుమాస్తాలుగానో, లేక పొట్టకూటికోసం సామాన్య ఉద్యోగాలుచేసి బ్రతుకుతున్నారు. మా చిన్నతనంలో మాయింటికి ఒక ఆయుర్వేద వైద్యుడు వచ్చేవారు. చేతినాడి చూసి రోగనిర్ధారణచేసి మందు యిస్తే ఇట్టే తగ్గిపోయేది. అలాగే ఆడవాళ్ళ చేతి నాడిచూసి గర్భవతో కాదోచెప్పేవాడు.

నేడు ఏదైనా తలనొప్పి, జలుబుచేసి డాక్టరు దగ్గరకు వెళితే నాలుగు రకాల మందులు రాయడమో బ్లడ్‌టెస్టు, యూరిన్‌టెస్టు, స్కానింగు అని నాలుగు రకాల టెస్టులు చేయించిన తరువాతే. మామూలు తలనొప్పి, జ్వరమని తేల్చి మందులు రాసే డాక్టర్లున్నారు. నేడుచాలామంది డాక్టర్లకు వృత్తి ధర్మంకన్నా ధనార్జనే ముఖ్య మవడం వలన అవసరం వున్నా లేకపోయినా రకరకాల టెస్టులు చేయించడం సర్వ సాధారణమైంది. పాపభీతికాని, రోగిపై జాలి, కరుణ కూడా చూపని డాక్టర్లు నేడు అనేకమంది వున్నారు. కొందరు డాక్టర్లకు రోగనిర్ధారణచేసే ధైర్యం, నిర్ధారణ చేయగల సామర్థ్యం లేక రకరకాల టెస్టులు, మందులు రాసి రోగులపైప్రయోగాలు జరుపుతూ చెలగాటమాడుతూ వుంటారు. అవసరం వున్నా లేకపోయినా ప్రసూతి నొప్పులు వచ్చి, సహజమైనరీతిలో ప్రసవమయే మహిళలకు నేడు సిజేరియన్ ఆపరేషన్లు చేసి యింటికి పంపుతున్నారు.

ఒకరకంగా ఆలోచిస్తే మనతరం కొంతవరకు అదృష్టవంతులమనే చెప్పాలి. ఎందుకంటే ముందు ముందు వచ్చే డాక్టర్లు, కాబోయే డాక్టర్లకు చదువు చెప్పే ప్రొఫెసర్లుకాని, వైద్యవృత్తి నేర్చుకోడానికి సరియైన హాస్పిటల్స్, రోగులు కూడా కరువై, అద్దెపేషంట్లు అద్దె ప్రొఫెసర్లు, నర్సులతో కొన్ని వైద్య కళాశాల్లో వైద్యులను తయారు చేస్తున్నారని ఈమధ్య న్యూస్‌పేపర్లలో వచ్చిన వార్తలు చాలామంది చదివే వుంటారు. పూర్వకాలంలో డాక్టర్లు చదివేవారికి ఎనాటమీ తెలియాలని శవాలను కోసి పరీక్షించడానికి ఒక్కొక్కరికి ఒక శవముయిచ్చేవారుట. నేడు కొన్ని కళాశాలల్లో పదిమందికి ఒక శము పరిక్ష నిమిత్తము యిస్తున్నారట. కొత్తగా వచ్చే కళాశాలల్లో చదివే విద్యార్థులకు పుస్తక పరిజ్ఞానము కూడా వుంటుందో వుండదో అని అనుమానం వస్తోంది.

మా చిన్నతనంలో ఎల్ఐఎమ్, ఎంబిబిఎస్ చదివిన డాక్టర్లు, పేషెంట్లు చెప్పిన బాధల ననుసరించి రోగనిర్ధారణచేసి మంచి మందులు యిచ్చేవారు. ఎంతో ధైర్యంగా ఎంతో చాకచక్యంగా ఆపరషన్లు కూడాచేసేవారు. ఈ రోజు స్పెషలిస్టులు ఎక్కువై పోవడంవల్ల చిన్న చిన్న వాటికి కూడా ఫలానా స్పెషలిస్టు దగ్గరికి వెళ్ళమని డాక్టర్లు పంపడంవల్ల రోగులుపడే యిబ్బందులు వర్ణనాతీతంగా వుంటున్నాయి. కొందరు డాక్టర్లు అవసరం వున్నా లేకపోయినా స్పెషలిస్టులకు రిఫర్‌చేసి, చేయి దులుపుకోవడం బాధాకరంగా వుంటుంది. ఈ మధ్య చాలా వార్తా పత్రికలలోను, బుల్లితెరలలోను కొన్ని నర్సింగ్‌హోమ్‌లు, హాస్పిటల్స్ ఇచ్చే ప్రకటనలు చూస్తే ఒకవైపు నవ్వు తెప్పిస్తూ

ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. అన్నిరకాల రోగుల పరిక్షలకు ప్రత్యేక తగ్గింపు ధరలు ప్రకటిస్తున్నాయి. కొన్నిపరీక్షలు చేయించుకొంటే కొన్ని రాయితీలు ప్రకటిస్తున్నారు. వేలు, లక్షలు నేడు రోగాలకు ఖర్చువుతున్నా, కార్పొరేట్ హాస్పిటల్సు గుంజుతున్నా ఎప్పుడూ జనాలతో హాస్పిటల్స్ కిటకిటలాడడం గమనార్హం.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 2005)

❁ ❁ ❁

పవిత్రత ఎక్కడ వుంది ?

ఇంట్లో కూర్చుని పదినిమిషాలు దేవునికి దణ్ణం పెట్టుకొందామంటే ప్రశాంత వాతావరణం కనపడక, ఇంట్లో టీవీ మోత,పిల్లలగోల, ఆడవాళ్ల కబుర్లతో విసుగు కలిగి దగ్గరలోవున్న అమ్మవారి దేవాలయానికి వెళ్లేను. అక్కడ దేవాలయ ప్రాంగణంలో నలుగురు కూర్చుని రాజకీయాలు మాట్లాడుతూ కనిపించేరు. దేవాలయానికి వచ్చిన మరో నలుగురమ్మలక్కలు తీరిగ్గా కూర్చుని పిచ్చాపాటి మాట్లాడుకుంటూ కనిపించేరు. గుడిపూజారి తీరిగ్గా పేపరు చదువుకుంటూ కనిపించేడు. ఐదు నిమిషాలు కళ్ళు మూసుకొని దణ్ణంపెట్టుకొని తీర్థానికి చేయిజాస్తే, న్యూస్‌పేపర్‌లో నిమగ్నమైన పూజారి తీర్థమంత్రమైన అకాల మృత్యుహరణం, సర్వవ్యాధి నివారణం, సర్వపాప క్షయకరం, దేవతా పాదోదకం పావనం శుభం అనకుండా చేతిలో ఒక ఉద్దరిణలో తీర్థంపోసి నెత్తిన శఠగోపంపెట్టి, పేపరులో లీనమయ్యేడు.

పూజారి చర్య నాకు చాలాబాధ కలిగించింది. ఇంతో అంతో తెలిసినవాడినై నందున ఆ మంత్రం నేనే చెప్పుకొని తీర్థంతీసుకున్నాను. అదే ఏ వి.ఐ.పినో తెలుసున్న ధనవంతుడో గుడికి వస్తే, చిరునవ్వుతో సగౌరవంగా ఆదరించి, దేవునికి నామ గోత్రాలు చెప్పి హారతియిచ్చి, మంత్రం చెబుతూ మూడుసార్లు తీర్థం అందిస్తాడు. మామూలుగానైతే ఒక్కసారి మొక్కుబడిగా వచ్చిన భక్తులకు తీర్థం యిస్తారు. అంతేకానీ పవిత్రమైన దేవాలయములో కూడా భగవంతుని సమక్షంలో ఈ పక్షపాతబుద్ధి, ఈ తారతమ్యం ఏమిటా అని బాధ కలిగిస్తుంది.

ప్రసిద్ధిచెందిన పెద్ద పెద్ద దేవాలయాలకు వెళితే, పెద్ద పెద్ద క్యూలలో గంటల తరబడి నిలబవితేనేగానీ దైవదర్శనం కాదు. పవిత్ర దినాలలో, పండగరోజులలో రద్దీ ఇంకా ఎక్కువవుంటుంది. అటువంటప్పుడు దేవుణ్ణి కొన్ని సెకండ్లు దర్శించడమే గగనమవుతుంది. అలాటప్పుడు తీర్థం ఒకసారి యిచ్చినా తప్పులేదుగానీ గుడిలో భక్తులు లేనప్పుడు ఒక్కరికి తీర్థం మూడుసార్లు ఇవ్వడానికి బద్ధకించే వారిని ఏమనాలో తెలియక నాలో నేనే గొణుక్కున్నాను.

తిరుపతి, విజయవాడ, అన్నవరం, సింహాచలం వంటి పుణ్య క్షేత్రాలలో గంటలతరబడి క్యూలో భక్తులు నిలబడి దైవదర్శనం కోసం ప్రాకులాడుతూంటే, విఐపిల కోసం క్యూలనాపి దైవదర్శనం చేయించి సగౌరవంగా పంపడం ఇంకా

ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. వి.ఐ.పీలకోసం ఏదో ఒక టైము నిర్ణయించి ఆ టైములోనే వారికి ప్రవేశం కల్పిస్తే ఎవరికీ ఇబ్బంది కలుగదు. ఎవరూ బాధపడరు. గంటల తరబడి క్యూలో నిలబడిన భక్తులను నిర్లక్ష్యం చేసి వారికి స్పెషల్ ట్రీట్‌మెంట్ యిచ్చినప్పుడే బాధ కలుగుతుంది. వి.ఐ.పీలు, రాజకీయ నాయకులు కూడా కాస్త విజ్ఞతతో వ్యవహరించి భక్తులకు ఇబ్బంది కలుగనివ్వకూడదు. కానీ స్వార్థచింతన ప్రబలడం వలన భక్తులు యిక్కట్లు ఎవరూ పట్టించుకోరు.

ప్రశాంతత, పవిత్రతకోసం నేడు దేవాలయాలకు వచ్చినా అక్కడ అది కానరావడంలేదు. ఎక్కడో కొన్ని దేవాలయాలను వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. కొన్ని దేవాలయాలకు వెళ్తే భక్తులను ప్రశాంతంగా రెండు నిమిషాలైనా దణ్ణం పెట్టుకోనీ కుండా దక్షిణ వేయండని, దక్షిణ దక్షిణ అనే చెవులో జోరీగలా వేదిస్తూ వుంటారు. ఉత్తరదేశంలో పవిత్రమైన చాలా దేవాలయాలలో పూజారి నోట వేరే మంత్రాలేమీ వినిపించవు కానీ దక్షిణ అనే పదాలు మాత్రం వినిపిస్తాయి. మన రాష్ట్రంలో దేవాదాయ శాఖవారి ధర్మమా అని పూజారులు దక్షిణ అడగకపోయినా, దేవాలయ సిబ్బంది మాత్రం హుండీని చప్పుడు చేస్తూ దక్షిణ హుండీలో వేయమని అరుస్తూ వుంటాడు. ఎంతో డబ్బు ఖర్చుపెట్టుకొని, ఎన్నో ప్రయాసలుపడి అతికష్టంతో దైవదర్శనానికి వస్తే ఒక్క నిమిషమైనా ప్రశాంతంగా దైవాన్ని దర్శించి దండం పెట్టుకోవడానికి అవకాశం వుండకపోవడం ఎంతో బాధ కలిగించే విషయం.

కొన్ని దేవాలయాలలో దేవాలయ పవిత్రత కాపాడడానికి కొందరు అధికారులు, కార్యనిర్వాహకులు, పూజారులు అమిత శ్రద్ధ తీసుకొని కృషిచేస్తారు. వారిని తప్పక అభినందించాలి కానీ అటువంటి అధికారుల్ని, సిబ్బందిని వేరేచోటికి బదిలీ చేసి ప్రభుత్వం గొప్పతనాన్ని చాటుకుంటుంది. చాలా దేవాలయాలలో ఇచ్చట కొబ్బరి చెక్కలు కొట్టవద్దని, చెప్పులు పెట్టవద్దని బోర్డుపెట్టినా ప్రసాదాలు తిని చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేయడం, తిని ఆ కొబ్బరి డొక్కులను అక్కడే వదలడం, ప్రసాదాలుతిని ఆకులు, కాగితాలు, ప్లాస్టిక్ చెత్తా అక్కడే వదలి చెత్తకుండీలు వున్నా ఉపయోగించని అనాగరికులు చాలామంది వుండడం విచారకరం. దేవాలయ పవిత్రత, శుభ్రతకాపాడడం ప్రతీభక్తుని బాధ్యత. ఇంకా కొందరు ఇంగిత జ్ఞానం లేకుండా దేవాలయ ప్రాంగణంలో చీట్లపేకాట ఆడడం, ధూమపానం చేయడం, జర్దాకిల్లీలు నమిలి ఉమ్మడం చేసేవారిని చూస్తే భగవంతుడు వారిని ఎలా క్షమిస్తాడో అనిపిస్తుంది.

దేవాలయ పవిత్రత, ప్రశాంత వాతావరణం కలిగించడానికి దేవాలయ పూజారి, భక్తులు, కార్యనిర్వాహక సిబ్బంది అందరూ సహకరిస్తేనే చేకూరుతుంది. ఇరుకు ఇళ్లు, అపార్ట్‌మెంట్లలో మగ్గిపోయేవారికి ఒక్కసారి ప్రశాంతంగా పవిత్రంగా దేవాలయానికి వెళ్లి ఐదునిమిషాలు దైవదర్శనం చేసుకొని దైవాన్ని స్మరించుకోడానికి, ప్రశాంతంగా ధ్యానం చేయడానికి తగిన ఏర్పాట్లు దేవాలయంలో వుండాలి. దానికి

భక్తులు, గుడిపూజారి, సహకరించనిదే దేవాలయానికి పవిత్రత చేకూరదు. హృదయం నిర్మలంగా, పవిత్రంగా వుంటే మనిషికి ఏ ప్రదేశమైనా దేవాలయం గానే కనిపిస్తుంది. ప్రతీ మనిషి చెట్టు, రాయి అన్నీ దేవతా రూపాలుగానే కనిపిస్తారు. మనిషి అంత ఎత్తుకు ఎదకలిగితే అతను ఎక్కడ వుంటే అదే దేవాలయముగా బాసిస్తుంది.

(ఆంధ్రభూమి దినపత్రిక - ప్రియదర్శిని - 28-1-2003)

❀ ❀ ❀

టీవీలేని జీవితమా !

కాఫీలేకపోతే బ్రతకవచ్చు, భోజనం లేకపోతే బ్రతకవచ్చు, మందులేకపోయిన బ్రతకవచ్చు. స్వంత భార్య లేచిపోయి ఎదురింటాయనతో కాపురంపెట్టినా సహించ వచ్చు. కానీ పదవి లేక పోతే బ్రతకలేను అని ఒక సినిమాలో రాజకీయనాయకుని వేషంలో నాగభూషణంగారన్నట్లు గుర్తు. కానీ నేడు టీవీ లెకపోతే బ్రతకలేను, బ్రతుకు వృధా అంటున్నారు కొందరు మహిళామణులు.

రామనాథంగారికి శ్రీకాకుళం ప్రమోషన్‌మీద ట్రాన్స్‌ఫర్ అవడంతో హైదరాబాద్ నుంచితప్పనిసరి పరిస్థితిలో రాకతప్పలేదు. సకల సౌకర్యాలు వున్న ఇల్లు కావాలని శ్రీమతి కండిషన్ పెట్టడంతో నెలరోజులువెతికిఊరి చివర కొత్తగా కట్టిన కాలనీలో వాస్తుబాగుండి అన్నిరకాల సదుపాయాలు వున్న ఇల్లు తీసుకున్నారు. ఇల్లు త్వరగా పూర్తిచేయడానికి డబ్బు అవసరమంటే ఆరునెలలు అద్దె ముందుగా ఎడ్వాన్సుగా చెల్లించారు. ఇంటికి అన్ని హంగులు రావడంతో హైదరాబాద్ వెళ్ళి ఇల్లు ఖాళీచేసి శ్రీమతిని తీసుకువచ్చారు రామనాథంగారు. ఇల్లు, గాలి, వాతావరణం చూసి తెగ మురిసిపోయింది ఆ ఇల్లాలు. రామనాథంగారు సంతోషించారు. మరుసటి రోజు ఉదయమే జవాన్లని పిలిచి ఇంకాటీవీ బిగించలేదేమని అడిగారు. వాళ్ళు నీళ్ళు నములుతూ ఇది కొత్తగా కట్టిన కాలనీ అవడంవల్ల ఇంకా కేబిల్ కనెక్షన్ ఈ ఏరియాలో లేదు. టీవీ యాంటిన్నా వుంటే బిగిస్తాము అనడంతో ఆవిడగట్టిగా గావుకేకపెట్టారు.

ఆ కేక విన్న భర్త రామనాథంగారు ఇరుగుపొరుగు ఇళ్లలో వారు భయంతో బయటకువచ్చారు. రామనాథం భార్య రేణుక కళ్ళు చింతనిప్పుల్లా వుండడం చూసి ఏమయింది మేడమ్ అన్నారు. ఇంకేమిటి కావాలి, కనీసం టీవీకనెక్షన్ లేని ఈ అడవిలో నన్ను పడేసారు. నేను ఎలా చచ్చేది. తేజ, జెమినీ, ఈటీవీ,స్టార్ అన్నిట్లో మొత్తం తొమ్మిది సీరియల్స్ రోజుకు చూస్తున్నాను. అన్ని సీరియల్స్ ఇప్పుడు మంచి థ్రిల్లింగుగా ఎంతో సస్పెన్సుతోవున్నాయి. నిన్న ప్రయాణంలో ఒకరోజుసీరియల్స్ పోయాయని బాధపడదుతూ వుంటే ఇక్కడ కేబుల్ కనెక్షన్ లేదు. టీవీరాదని చావుకబురు చల్లగా చెప్పారు. మీ ఆఫీసు జవాన్లు, మీకు ఏమైనా బుద్ధి, జ్ఞానం వుందా! ఇలాటి పనికిమాలినచోటా ఇల్లు తీసుకునేది. టీవీ కనెక్షను లేకపోతే క్షణం

ఈ ఇంట్లో వుండను. ఏహోటల్లోనైనా రూమ్ బుక్ చేయండి. వెంటనే వేరేచోటికి ఇల్లు మార్చండి. అంటూ డ్రైవర్ని కేకేసి జీపు ఎక్కి ఏదైనా మంచి హోటలుకి పోనీ అని హుకుం జారీచేసేరు రేణుకాదేవి.

ఇంట్లో జవాన్లు, చుట్టుపక్కల ఇళ్లవాళ్ళు, ఏదో సినిమా చూస్తున్నట్లు బొమ్మల్లా నిలబడిపోయారు. అవమానభారంతో సిగ్గుతో రామనాథంగారు కుంచించుకుపోయి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి తలుపువేసుకున్నారు. ఆఫీసులో గుమాస్తాలు అంతా ఆలోచించి డిష్ యాంటిన్నా ఒకటి కొనితెచ్చి కొత్త ఇంట్లో బిగించి, కొత్త ఆఫీసరుగారికి టీవీ అన్‌చేసి చూపించి, మేడమ్‌గార్ని హోటలురూమ్ నుంచి తీసుకువస్తామన్నారు. రామనాథం గారికి లాడ్జికి వెళ్లే ధైర్యంలేక నమ్మకమైన ఇద్దరు గుమాస్తాలను, డ్రైవరుని పంపించి దిగులుగా కూర్చున్నారు. వస్తూ వస్తూ రాత్రి డిన్నరుకి భోజనం కూడా హోటలునుంచి తెచ్చి మేడమ్‌గారిని సురక్షితంగా ఇంటికి చేర్చి ఆఫీసు స్టాఫంతా ఆ రాత్రికి శెలవు పుచ్చుకున్నారు.

రామనాథంగారు తుఫాను భీభత్సం తగ్గినందుకు సంతోషించారు. కానీ ఆయన సంతోషం ఎక్కువసేపు వుండకుండానే ఇందులో జెమిని, తేజ, టీవీఛానల్స్ రావడంలేదు. నేను ఇంటర్‌స్టింగుగా సీరియల్సు చూసేది ఆ రెండు ఛానల్సులోనే, వద్దన్నా వినకుండా ప్రొమోషన్ వచ్చిందని చంకలు గుద్దుకుంటూ ఈ వూరు వచ్చి తగలడ్డారు అంటూ రుసరుసలాడుతూ బెడ్‌రూమ్‌లోకివెళ్ళి తలుపులు బిగించి పడుకున్నారు మేడమ్ రేణుకగారు.

రామనాథంగారు తల రెండు చేతలతో పట్టుకు కూర్చున్నారు.

ఇది ఒక ఇంటి భాగవతం కాదు. చాలా ఇళ్లలో ఈ మధ్య టీవీ అనే ఈడియట్ బాక్సువలన భార్యభర్తల మధ్య సఖ్యత చెడిపోట్లాడుకుంటున్నారు. టీవీల వలన పిల్లల చదువులు పాడవుతున్నాయని పిల్లల్ని హాస్టల్సులో కొందరు చేరుస్తున్నారు స్పోర్ట్సచానలు కావాలని ఒకరు, కార్టూన్ నెట్‌వర్కు కావాలని ఒకరు, సీరియల్స్, చూడాలని, సినిమాలు చూడాలని నిత్యం పిల్లలు పెద్దలు కొట్టుకుని, తిట్టుకుని అలిగేవారు ప్రతీ ఇంట్లో పెరుగుతున్నారు. ఇంటికి వచ్చిన ఫ్రెండ్స్‌ని బంధువర్గాన్ని టీవీలో వచ్చే ప్రోగ్రాములలోమునిగి సరిగా గౌరవించడంలేదని చాలామంది నేడు వాపోతున్నారు. టీవీలో వచ్చే చానుల్సుతరచు భర్తమారుస్తూ తనకి ఇంటరెస్టింగు ప్రోగ్రాములు చూడన్విడంలేదని ఒకామె పుట్టింటికి పోతే, మరొకామె ఆత్మహత్య చేసుకుంది. ఇంకో ఇల్లాలు ఈ భర్తకు విడాకులివ్వడానికి సిద్ధపడింది. ఇవన్నీ జరుగు తున్న నిజాలు.

ఇడియట్ బాక్సులో కొన్నిదృశ్యాలు చూసి పిల్లల్లో వయసుతో నిమిత్తం లేకుండా ప్రేమలు పుట్టుకువస్తున్నాయి. కొత్తకొత్త ఫేషన్లు చిగురిస్తున్నాయి. సీరియల్స్‌లో హీరోయిన్సు కట్టిన చీరలకు, నగలకు అలంకరణకు ఉపయోగించిన కర్టెన్లు వంటి సామాగ్రికి విపరీతమైన డిమాండ్ పెరిగి సేల్స్ పెరుగుతున్నట్టు మార్కెట్ వర్గాలు

చెబుతున్నాయి. మంచి కన్నా చెడే ఎక్కువవడంవల్ల చక్కని తెలుగు భాషని మరచి యాంకర్లు వినిపిస్తున్న తెలుగు భాషపై పిల్లల యస్.ఎం.ఎస్.లు ఫోను కాల్సుతో విపరీతంగా బిల్లులు పెరుగుతున్నాయి. భర్త, తమ్ముడు, చెల్లి, తండ్రి పక్కనున్నారని కూడా మరచి కొందరు మహిళామణులు యాంకర్సుతోను, సినిమా హీరోలతోను వారి ప్రేమను వ్యక్తం చేయడం ఆశ్చర్యాన్ని కలిగించి, ముక్కున వేలేసుకునేల చేస్తోంది. కొందరి సంభాషణ వినడానికి చాలా ఎబ్బెట్టుగా వుంటుంది. టీనేజ్‌పిల్లల్లా కొందరు గృహిణులు ఫరాయివారితో సిగ్గువిడచి మాట్లాడడం విడ్డూరంగా వుంటోంది. ఇలాంటి వింతలు ఎన్నిచెప్పుకున్నా వీటికి అంతు కనిపించదు.

ప్రజల బాగోగులు ఎలావున్నా టీవీలు మాత్రం వాళ్ళ ప్రోగ్రాములతో బంగారాన్ని పండించుకుంటున్నారు. కొందరిని బంగారంతో ఆకర్షిస్తున్నారు. టీవీలతో ఇంట్లో వాతావరణం కాలుష్యంపెరుగుతోందని , కొందరి సంసారాల్లో చిచ్చులు రేగుతున్నా యని వేరే చెప్పనక్కర్లేదనుకుంటాను.

(ఆంధ్రభూమి దినపత్రిక - ప్రియదర్శిని - 2006)

❀ ❀ ❀

ఈ ప్రశ్నకు బదులేది ?

నా పద్దెనిమిదవ ఏట పెళ్ళయింది. కాపురానికి వెళ్ళాను. మాది వ్యవసాయ కుటుంబం. మా వారికి ముగ్గురు అప్పచెల్లెళ్ళు, ఒక అన్నయ్య, మా బావగారు మా పెళ్ళికి ముందే మా మావగారితో గొడవపడి ఆస్తిపంచుకొని కొన్ని భూములు అమ్ముకొని వ్యాపారం చేయడానికి పట్నంలోకాపురం పెట్టారు. నా పెళ్ళయ్యేసరికి మా పెద్ద ఆడపడుచు ఒక్కరికే పెళ్ళయింది. తరువాత మా మావగారు ఇద్దరు ఆడపడుచులకు పెళ్లిళ్లుచేసి అత్తవారింటికి పంపారు. ముగ్గురు ఆడపిల్లల పురుళ్లు, పుణ్యం అన్నీ ఆ ఇంటి కోడలిగా సక్రమంగా నెరవేర్చాను. నాకూ ఇద్దరు పిల్లలు పుట్టారు. మా వారు పెద్దగా చదువుకోకపోవటంవల్ల మా మావగారికి చేదోడు వాదోడుగా ఉంటూ వ్యవసాయం, తోటలు చూసుకునేవారు.మా పిల్లలుఐదవ తరగతి వరకు ఊళ్లో వున్న ఎలిమెంటరీ స్కూల్లోనే చదివారు. మేం ఎలాగూపెద్ద చదువులు చదువుకోలేదు కాబట్టి నా పిల్లలనైనా మంచి చదువులు చదివించాలనే తలంపుతో రోజూ మా శ్రీవారిని పోరేదాన్ని.

రోజూ మావారిని పోరగా పోరగా ఒకరోజు తెగించి వాళ్ళ నాన్నగారితో మాట్లాడి ఒప్పించి, ఇరవైమైళ్ళ దూరంలో ఉన్న పట్టణంలోకాపురం పెట్టడానికి ఒప్పు కున్నారు. పెళ్ళయిన పన్నెండేళ్ళ తరువాత వేరింటికాపురం మొదలయింది. పేరుకు వేరింటి కాపురమేకానీ ఏడాదికి 7-8 నెలలు మా అత్తగారు, మావగారువచ్చి మా దగ్గరే వుండేవారు. స్కూళ్ళకి సెలవులిస్తే మరల అంతా ఆ పల్లెటూరు వెళ్ళేవాళ్లం. నా అదృష్టమో పిల్లలఅదృష్టమోకానీ ఇద్దరుపిల్లలు కూడా మెరిట్‌లోపాసై ఇంజ

నీరింగ్‌లో సీటు సంపాదించి ఇద్దరూ ఇంజనీర్లయ్యారు. మా మావగారికి ఓపిక తగ్గడంతో వ్యవసాయాన్ని కౌలుదారుని కప్పగించి మా అత్తగారు, మావగారూ మా దగ్గరే వుంటున్నారు.

మా పిల్లలు ఇద్దరికీ ఉగ్యోగాలు రావడం, మా అమ్మాయిని కోరి మా బంధువులలో ఒకరుపెళ్ళిచేసుకోవడంతో సునాయాసంగా మా అమ్మాయిపెళ్ళి జరిగింది. రెండేళ్ళ తరువాత అబ్బాయికీ పెళ్ళి చేశాం. అసలు కష్టాలు మాకు ఇప్పుడే ప్రారంభమయ్యాయి. మా మావగారి వయసు తొంభై సంవత్సరాలు. మాఅత్తగారి వయసు ఎనభైనాలుగు. అత్తగారికి పదేళ్ళకిందట పక్షవాతంచ్చి కోలుకోవడం వల్ల మెల్లగా నడిచి తన పనులు చేసుకొంటారు. కానీ వంటా వార్పూ చేయలేరు. మా మావగారికి తొంభై ఏళ్ళు వచ్చినా తన పనులు తాను చేసుకొంటూ చేతికర్రసాయంతో ఇంటా బయట తిరిగేశక్తి ఉంది. నా పెళ్ళయిన దగ్గరనుండి అత్తమావలకి సేవలు చేస్తూ వారిని కనిపెట్టుకొని ఉంటున్నాను.

ఇవాళ నాపిల్లలు పెద్దవాళ్ళయ్యారు. కూతరుకి ఇద్దరు పిల్లలు. కొడుక్కి ఒక కొడుకు. నాకు నా మనవలతో మనవరాళ్లతో ఆడుకోవాలని, వారితో కొన్నాళ్లు గడపాలని ఉంటుంది. కానీ ఈ ముసలి అత్తగారిని, మావగారిని విడిచి వెళ్లలేక పోతున్నాను. దానికితోడు ఈ మధ్య నాకు కొత్తగా బీపీ, మా వారికి షుగరు వచ్చాయి. మా వారికి అరవై, నాకు యాభై ఐదేళ్లు వచ్చాయి. ఏ సరదాలు, ముచ్చట్లులేవు. పిల్లల దగ్గరకు వెళ్ళలేక పోతూన్నాం. నాబాధ ఎవరితో చెప్పుకోలేక మీకు రాస్తున్నాను. నా సమస్యకి పరిష్కారం చెబుతారని ఆశిస్తాను.

ఈ ప్రశ్నని ఒక ఉత్తమ ఇల్లాలు అడిగింది. వృద్ధాప్యంలో ఉన్న కనిపెంచిన తల్లిదండ్రులు ఒకపక్క, కన్న పిల్లలు ఒక పక్క ఉన్నప్పుడు కొందరు మహిళలకు ఈ సమస్య తప్పదు. స్వార్థపరులు, తెగింపు వున్న స్త్రీలైతే అత్తమామలకి ఎప్పుడో టాటాచెప్పి, మొగుణ్ణి తీసుకుని పిల్లల దగ్గరికి వెళ్ళిపోయేది. ఈమె పూర్వకాలపు మర్యాదగల కుటుంబంలో పుట్టి పెరగడంవల్ల అంతవయసు వచ్చినా అత్తమామలను అభిమానంగా చూసుకుంటూ వారి మంచి చెడ్డల కోసం పాకులాడటం ఈ రోజుల్లో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

అమ్మా నాన్నా ఇంక మీరెప్పుడు సుఖపడతారు. మీ జీవితంలో మూడు వంతులు అప్పుడే వారి సేవలో గడిచిపోయింది. ఇప్పటికైనా వాళ్ళని ఎవరికైనా అప్పగించి వస్తే బాగుంటుంది అని పిల్లలంటున్నారుట. కానీ చూసి చూసి ఇన్నాళ్ళు కనిపెట్టుకొని సేవలుచేసి చివరిదశలో వారిని వదిలి వెళ్ళడానికి ఆ ఇల్లాలికి మనసు అంగీకరించటంలేదుట. ఈ మధ్య ఆయుష్షు పెరిగి ఇలాటి వృద్ధ దంపతులు, అక్కడక్కడ కనిపిస్తున్నారు. మింగలేక కక్కలేక కొందరు బాధపడుతూ జీవిస్తూ వుంటే కొందరు తెగించి వృద్ధాశ్రమాలలో చేర్పించి చేతులు దులుపుకుంటున్నారు. ఈ సమస్యకు పరిష్కారం చెబితే ఆ ఇల్లాలు సంతోషిస్తుంది. వీలైతే స్పందించండి.

(ఆంధ్రభూమి దినపత్రిక - ప్రియదర్శిని - 9-7-2008)

❀ ❀ ❀

యువతా... ఎటు నీ పయనం ?

శతాబ్దకాలంలో దేశంలో పెనుమార్పులొచ్చాయి. రాజకీయాలలో స్వార్థం పెరిగింది. విద్యారంగం పూర్తిగా రాజకీయమైంది. రాష్ట్రంలో ఈరోజు ఇంజనీరింగ్ కాలేజీలకు కొదవలేదు. కొత్త కొత్త మెడికల్ కాలేజీలూ వస్తున్నాయి. బిల్డింగులు లేకపోయినా, హాస్పిటల్స్,పేషెంట్లు లేకపోయినా, చెప్పడానికి ప్రొఫెసర్లు లేకపోయిన కాలేజీలు నడుస్తున్నాయి. స్టూడెంట్లకి డిగ్రీలువస్తున్నాయి. కొత్తకొత్త డాక్టరు, ఇంజనీర్లు ప్రతీ సంవత్సరం వస్తున్నారు. ఆ మధ్య బెంగుళూరులో పేరున్నపెద్ద సాఫ్ట్‌వేరు కంపెనీలో పనిచేసే కొందరు ఇంజనీర్లు రాసిన లీవు లెటర్లు ప్రతికలకు విడుదల య్యాయి. మెరిట్‌లో పాసయిన ఇంజనీర్లుకు లీవు లెటరు రాయడం చేతకాక కాగా అవి అన్నీ వేరే అర్థాలు వచ్చేటట్లు వుండడం విశేషం. ఈ కాలం పిల్లలకు తెలుగు ఎలాగూరాదు. ఇంగ్లీషుకూడా అంతంత మాత్రమే వచ్చునని తెలుసుకోవాలి.

పిల్లలకు మూడవ ఏడు రాకుండానే ఈ కాలంలో తల్లిదండ్రులు ఏ స్కూల్లో చేర్పించాలి, చదివించాలని ఆతృతతో విపరీతంగా డొనేషన్స్‌కట్టి ఖరీదైన కాన్వెంటు స్కూళ్ళల్లో చేర్పిస్తున్నారు. బండెడు హోమ్‌వర్క్‌తో, ఒకటవ క్లాసునుండి కంప్యూటర్లతో కుస్తీపడుతూ బాల్యంలోనే కళ్ళుజోళ్ళు నడుం నొప్పులు తెచ్చుకుంటున్నారు. ఫిజికల్‌గా ఆడేఆటలు తగ్గిపోయి బొద్దూడని పిల్లలు కూడా నేడు సెల్‌ఫోన్లుతో కంప్యూటర్లతో ఆటలు ఆడుకొంటున్నారు. వీటికితోడు ప్రతీ ఇంట్లోవుండే ఈడియట్ బాక్సు ఎలాగు తోడు వుంటుంది.

పెద్దవాళ్లకి తల్లికి, తండ్రికి పిల్లల్ని పక్కన పడుకోబెట్టుకుని నీతికథలు చెప్ప డానికికాని, నీతిపద్యాలు, శతకపద్యాలు చెప్పడానికి కానీ టైము వుండడంలేదు. ఈ రోజుల్లో కొందరు పేరెంట్స్‌కే నీతి పద్యాలు,నీతికథలురావు. పూర్వపు రోజులలో లాగా ఇంట్లో అమ్మమ్మలు, నాయనమ్మలు, తాతలు లేకపోవడం కూడా పిల్లలకు పెద్దలోటుగా వుంటోంది. సెక్యులరిజంపేరుతో, కాన్వెంటు చదువులవడంవలన పిల్లలకు రామాయణ, భారత కథలు కూడా తెలియడంలేదు. మిడిమిడి జ్ఞానంతో సినిమాలలో రాముడు, కృష్ణుడు, యముడుతో హాస్యం కోసం తీసే కథలు, పాటలు విని యువత మనపురాణ గ్రంథాలకు హేళనచేసే స్థితిలో వున్నారు.

నేడు టీవీలో వచ్చే ప్రోగ్రాములు, సినిమాలు యువతను రెచ్చగొడుతున్నాయి. కానీ మంచిని నేర్పడంలేదు. హైస్కూలు, కాలేజీలో చేరగానే గరల్‌ఫ్రెండ్స్, బోయ్ ఫ్రెండ్స్ సంస్కృతి పెరిగింది. కేంటీన్‌లకు, సినిమాలకు, షికార్లకు కలసి తిరగడం గొప్పగా ఉంది. మొదట ఫ్రెండ్‌షిప్‌తో మొదలై మెల్లగా ప్రేమలో పడడం, డేటింగులు వంటిపాశ్చాత్య నాగరికత మోజులోపడి కొట్టుకుపోతూ చదువుకునే వయసులో ప్రేమ పాఠాలు నేర్చుకుని ఇటు తల్లిదండ్రులకు అటు దేశానికి తీరని తలనొప్పి కల్గిస్తున్నారు. ఈ మధ్య వాలెంటేన్స్‌డేకి యువత ఇస్తున్న ప్రాముఖ్యత చూస్తూవుంటే మనదేశం ఎటుపయనిస్తోందో అర్థంకావడంలేదు. చదువు పూర్తిచేసుకుని వాళ్ళ

స్వంత కాళ్లపై నిలబడ్డాక ప్రేమ, పెళ్లి అని ఆలోచనచేయాలి కానీ, తల్లిదండ్రులపై ఆధార పడుతున్న దశలో ప్రేమ, పెళ్ళి గురించి ఆలోచించడం తప్పు. కారెక్టర్‌కి మన భారతీయులు ఎక్కువ విలువ ఇస్తారు. ఆడయినా, మగయినా శీలానికి విలువ ఇవ్వాలి. ఈమధ్య కొత్తగా ఒక స్లోగను వినిపస్తోంది. పెళ్లికి ముందు సెక్సు తప్పు లేదు. కోరికలు తీర్చుకోవచ్చు, పెళ్లిచేసుకున్నాక పిల్లలు కనవచ్చు అని కొత్తథీరీ తయారుచేసి, ప్రేమించి పెళ్ళిచేసుకోవడం, రెండు మూడునెలలో సంవత్సరాలో కాపురాలు చేయడం, విడాకులు తీసుకొని మరొకపెళ్లి చేసుకోవడం జరుగుతోంది. ఇది పూర్తిగా పాశ్చాత్య నాగరికత. మన హిందూ సంప్రదాయంలో ఒకసారే పెళ్ళి చేసుకోవాలి. అందుకే మనకి శ్రీరామచంద్రుడు ఆదర్శమూర్తి.

తల్లిదండ్రులతో ఎలా మెలగాలి, గురువుగారితో ఎలా మెలగాలి. అన్నదమ్ము లతో ఎలా మెలగాలి, భార్యతో ఎలా వుండాలి, వదినగారితో ఎలా వుండాలి, విద్యార్థి దశలో ఎలా మెలగాలి అన్నవిషయాలు మన భారత, రామాయణాల్లో వివిధ పాత్రల ద్వారా వివరంగా చెప్పడం జరిగింది. కానీ మన దురదృష్టం వలన, సెక్యులర్ ముసుగులో మన యువతకు ఏవీ అక్కరకు రాకుండా పోయాయి. వారికీ నేడు వచ్చే సినిమాలు, టీవీలే ఆదర్శమయ్యాయి. స్టూడెంటంటే జల్సాచేయడం అనే భావన వచ్చింది. అందుకే నేడు కొత్తగా అమ్మాయిలు, అబ్బాయిలు కలిసి పబ్బులు, క్లబ్బుల వెంట తిరుగుతూ, అర్థనగ్నంగా తయారై విద్యార్థి దశలోనే మందుకు కొందరు బానిసలవడం చూస్తూ వుంటే బాధ కలుగు తుంది. హైద్రాబద్, బొంబాయి, బెంగుళూరు, కలకత్తా వంటి నగరాలలో యువత పోకడలు చాలా కలకలం సృష్టి స్తోంది. మొక్కపుడు వంచాలి కానీ మానయ్యాక వంచడం కష్టం. డ్రగ్సు, మందు, మగువకి అలవాటుపడితే యువత పతనానికి పరాకాష్ఠగా చెప్పవచ్చు. పెద్దలు పిల్లలకు అతి స్వేచ్ఛ ఇవ్వడం మంచిదికాదు.

(ఆంధ్రభూమి దినపత్రిక – యువభూమి – 22-4-2009)

❁ ❁ ❁

మంచి రోజులు వస్తున్నాయ్ !

పెరుగుట తరుగుట కొరకే అని శతకకారుడు చెప్పినట్లు, ఏదైనా అతి అయితే రోతపుట్టి మరల మామూలుగా జీవించడం మొదలుపెడతారు. ఆఫీసులలోలోన్లు ఇస్తున్నారని, బ్యాంకులు విరివిగా లోన్లు ఇస్తున్నాయని, ఏదో బండి వుంటే దానికి ఆఫీసు వాళ్ళు మెయింటెనెన్స్ అలవెన్సుగా కొంత సొమ్ము వస్తుందని ఈ మధ్య స్కూటర్లు, మోటారు సైకిళ్లు కార్లు విపరీతంగా కొనడంతో రోడ్లపై ట్రాఫిక్ స్తంభించి పోతోంది. పాదచారులు నడవడానికి పడే ఇబ్బంది వర్ణనాతీతం. నగరాలలో రోడ్డు దాటడమంటే పెద్దప్రళయం. ప్రాణాలను గుప్పిట్లోపెట్టుకొని వెళ్లాల్సిందే. నగరాలేకాక పట్టణాలలోను నిత్యం చూస్తున్న దృశ్యమే ఇది.

కొత్తగా ఈమధ్య ఆటోల బెడద ప్రతీ ఊళ్లోపెరిగింది. ఒక్కొక్క ఆటోలో 8 నుంచి 10 మంది వరకు మనుషులను ఎక్కించుకొని రోడ్డుపై నృత్యం చేస్తూ దూరి పోతూవుంటారు. మనుషులు, సైకిలిస్టులు వారికి కనబడరు. వారిని రాసుకుంటూ వెళ్లిపోతూ వుంటారు. ఒకప్పుడు లారీ డ్రైవర్లే యమదూతలని చెప్పుకునేవారు. నేడు ఆటోడ్రైవర్లు ఆ కోవకే చెంది రోజూ యాక్సిడెంట్లు చేసి ఎందరినో యమపురికి పంపుతున్నారు.

పది సంవత్సరాలనుంచి స్కూటర్ని నడుపుతూ నడక మరచిపోయిన నాస్నేహితుడు రామారావు సైకిలుపై ఇంటికి రావడం చూసి ప్రపంచంలో ఎనిమిదవ వింత చూస్తున్నట్లు చూస్తూ వుండిపోయాను. నా ఆశ్చర్యాన్ని గమనించిన రామారావు పాట పాడుతూ ఇంట్లోకి అడుగుపెట్టాడు. నేను వాడి స్టయిల్‌చూసి 'నీ స్కూటరేమైంది, సైకిలుమీద వచ్చావని'అడిగాను. వాడు నావైపు గర్వంగా చూసి స్కూటరు అమ్మేసాను. ఇక ఆఫీసుకి బస్సులో, చిల్లర తిరుగుళ్లకు సైకిలు అన్నాడు నవ్వుతూ. ఏమిటంత సద్బుద్ధి పుట్టింది. అని అడిగాను. ఈ మధ్య ఒంట్లో బాగాలేక డాక్టరు దగ్గరకెళితే కొంచెం బి.పి., షుగరు లక్షణాలు కనిపిస్తున్నాయి. అందువల్ల ఫుడ్ హేబిట్సు కొంచెం మార్చుకుని బాడీకి ఎక్సర్‌సైజు కావాలని అన్నాడు. రేపటి నుంచి నీతో మార్నింగ్ వాక్‌కి రావాలను కంటున్నాను. స్కూటరు ఎదురుగా వుంటే నడపాలనిస్తుందని అమ్మకానికి మెకానిక్ షాపులోపెట్టి ప్రస్తుతానికి సెకండ్‌హేండ్ సైకిలు కొన్నాను అన్నాడు ఎంతో త్యాగం చేసినవాడిలా ఫోజుపెట్టి.

నీలాగ కొందరైనా మారితే కొంత ట్రాఫిక్ కంట్రోలై దేశం బాగుపడుతుంది. అని అనుకున్నాను మనసులో. ఈ మధ్య తరచూ భూకంపాలు, వరదలు, తుఫానులు, సునామీలు వంటివి ప్రపంచమంతా రావడంతో జనంలో భయం, భక్తి పెరిగాయి. ఏ దేవాలయానికి వెళ్లినా భక్తులు కిటకిటలాడుతున్నారు. తరచు విష్ణు సహస్రనామ పారాయణ, లలితాసహస్ర పారాయణాలు చేస్తూ కనిపిస్తున్నారు. ఆధ్యాత్మిక ప్రవచనాలకు, ఉపన్యాసాలకు ప్రాముఖ్యతనిస్తూ భక్తులు కనిపిస్తున్నారు. ఎప్పుడూ టీవీ ప్రోగ్రాములకు, సీరియల్స్‌కి అతుక్కుపోయి బయట కనిపించని కొందరు ఈ మధ్య బయట కనిపిస్తే కారణమడిగితే వారు చెప్పిన సమాధానం విని నివ్వెరపోయాను. ఒకరింట్లో పన్నెండేళ్ల లోపు యిద్దరి పిల్లలకు కళ్లజోడు రావడం, మరొకరింట్లో మంచి మెరిట్‌లో రాంకు సంపాదించాల్సిన అబ్బాయికి రేంకు రాకపోవడంతో టీవీ చూడకుండా త్యాగం చేసామని చెప్పడం విశేషం.

టీవీ కార్యక్రమాలు చూడ్డం తగ్గితే ఇంట్లో అనురాగాలు, ఆప్యాయతలు, పెరగడమేకాక పిల్లలు బాగా చదివి అభివృద్ధిలోకివస్తారు. బాల్యంలోనే కళ్లజబ్బులు రావు, ఇంటికి వచ్చిన అతిథుల్ని సాదరంగా ఆహ్వానించి ప్రేమతో మాట్లాడి, వారిని గౌరవించినవారవుతారు.లేకుంటే ఇంటికి వచ్చినవారితో మాట్లాడకుండా టీవీ ప్రోగ్రాములో లీనమై వారిమనసునొప్పించి అగౌరవ పర్చడం జరుగుతుంది.

ఈ మధ్య మా ఆఫీసులో మా కొలిగ్‌ని కాఫీ త్రాడానికి కేంటిన్‌కి వస్తావా అని అడిగితే చిరునవ్వుతో 'కాఫీ, టీలు మానేసేనోయ్' అనడంవిని ఆశ్చర్యపోయాను. కారణమడిగితే ఆరోగ్యం కోసం యోగా నేర్చుకోడానికి 'ధ్యానమండలి'లో పదిరోజులు క్లాసులకి వెళ్లాడుట. భార్యా భర్తలిరువుర్ని రమ్మని చెప్పి ఆధ్యాత్మిక బోధతో పాటు యోగా కూడా నేర్పించి ముందు కాఫీ, టీ, సిగరెట్, మందు వంటివి విడిచిపెట్టడమే కాకుండా మాంసాహారాన్ని, మసాలాలను విసర్జించి శాఖాహారాన్నే భుజించమని చెప్పారట. ఈ మధ్య అనేక రకాల దీక్షలు చేస్తూ పలువురు యాత్రలు చేసిరావడం కూడా శుభపరిణామంగా కనిపిస్తోంది. ఇలాంటి మార్పు కొందరిలో వచ్చినా మంచి పెంపొంది ఆదర్శవంతమైన పౌరులుగా మారి భారతదేశం మరల పూర్వఔన్నత్యాన్ని పొందుతుంది. రాబోయే రోజులు మంచిరోజులు కావాలని ఆశిద్దాం.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 23–1–2006)

❁ ❁ ❁

కౌన్సిలింగ్ సిత్రాలు......

మా పొరుగింటి వారూ మేమూ చాలా స్నేహంగా ఉంటాం. వాళ్ళకు రెండు కుక్కలు ఉన్నాయి. ఉదయమే చెయిన్ ఊడదీసి ఆ రెండు కుక్కల్ని వీధిలోకి వదులుతారు. అవి ఇటూ అటూ పరుగెత్తి మా గేటు దగ్గరికి వచ్చికాలెత్తి ఉచ్చలుపోసి వెళ్తాయి. ఛీఛీ అని అదిలించినా అవి ప్రతిరోజూ అలవాటుగా మా గుమ్మం ముందే ఉచ్చలు పోస్తున్నాయి. ఒక్కోసారి దొడ్డికి కూడా వెళ్తాయి. మేము మా పొరుగింటి వారితో స్నేహంగా ఉంటాము కాబట్టి వారికి ఈ విషయం ఎలా చెప్పాలో తెలియక ఇంట్లో అంతా బుర్రలు బద్దలు కొట్టుకుంటున్నాము. మీరు ఈ విషయంలో తప్పక సాయం చేస్తారని ఆశిస్తున్నాను. అని ఒక సోదరి అడిగింది.

మనుషుల విషయంలో కన్నా కుక్కల వంటి పెంపుడు జంతువుల మీద కొందరికి మమకారం ఎక్కువగా ఉంటుంది. మీ కుక్కలిలా చేస్తున్నాయంటే వారు కోపగించు కోవచ్చు. మీరు తెలివిగా చాలామంది మార్నింగ్‌వాక్ వెళ్తూ కుక్కల్ని వెంట బెట్టుకొని స్టైల్‌గా తీసుకువెళ్తారు. మీ కుక్కలు అందంగా ఉండి బాగుంటాయి కదా! మీరు మార్నింగ్ వాక్ అలవాటు చేసుకొని మీ వెంట కుక్కల్ని తీసుకువెళ్తే బాగుంటుందని ఉచిత సలహా ఒకటి ఇవ్వండి. ఒకవేళ మీ అదృష్టం బాగుండి వారలాచేస్తే వారి వెంట కుక్కలు బయటికి వెళ్ళి మలమూత్రాలు బయట విడిచే ఛాన్సు ఉంది. మీ సమస్య పరిష్కారమవుతుంది. అని చక్కని సలహా అందించారు. ఒకపాఠకుని ప్రశ్నకు.

మనం నిత్యం చిత్రవిచిత్రమైన ప్రశ్నలు సెక్స్ గురించి, భార్యాభర్తల తగవులు, విడాకులు, కోర్టు వ్యవహారాలు, ఉద్యోగ సమస్యలు, ప్రేమ వ్యవహారాలు, డాక్టర్ల

సలహాలు, రకరకాల సమస్యలకుసంబంధించిన ప్రశ్నలు దినపత్రికలు, వారపత్రికలలో పాఠకులు అడగటం, ఓపిగ్గా పరిష్కార మార్గాలు పత్రికలవారుచెప్పడం పరిపాటి. కొన్ని ప్రశ్నలు, సమాధానాలు కూడా పాఠకులు చదవడానికి ఆసక్తి, కుతూహలం కలిగించంవల్లనే నేడు అన్ని రకాల పత్రికలలో ఇటువంటి శీర్షికలు పెట్టి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. ఎక్కువగా ప్రేమ వ్యవహారాల మీద,సెక్స్‌కి సంబంధించి అడిగిన ప్రశ్నలు ఒక్కోఆసరి నవ్వు పుట్టించి పాఠకుల్ని చదివింపజేస్తాయి.

తరచూ మన పత్రికలలో కనిపించే ప్రశ్న నా వయసు 13సం|| నేను ఎయిత్ క్లాసు చదువుతున్నాను. నేను మా ఎదురింటి అబ్బాయిని ప్రేమిస్తున్నాను. అతను టెన్త్‌క్లాసు చదువుతున్నాడు. అతనూ నన్నుప్రేమిస్తున్నాడు. ఒక్కరోజు అతన్ని చూడ కుండా ఉండలేను. అతన్నే పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాను. కళ్ళుమూసినా తెరిచినా చివరికి పుస్తకం తీసి చదవాలన్నా అతని రూపమే పేజీల్లో కనిపస్తోంది. నాకు చదువుకోవాలని లేదు. అతన్ని పెళ్ళిచేసుకోవాలని ఉంది. కానీ మా కులాలు వేరు. పెద్దవాళ్ళు పెళ్ళికి ఒప్పుకోరని భయం వేస్తోంది. వాళ్ళపెళ్ళికి ఒప్పుకోకపోతే నాకు ఆత్మహత్యే శరణ్యం. నాకు సరైన దారి చూపగలరని మీకు రాస్తున్నాను.

'నేను మా పిన్ని కొడుకు ఇద్దరం కలిసి చదువు'కొన్నాం. అనుకోకుండా ఒకరి కొకరు ఆకర్షితులమై తప్పుచేశాం. నేను ఆతన్నే పెళ్ళి చేసుకోవాలనుకొంటున్నాను మీ సలహా అంటూ ఈ మధ్య రకరకాల అక్రమ సంబంధాల గురించి కౌన్సిలింగ్‌కు ప్రశ్నలు గుప్పిస్తున్నారు.

అన్నాచెల్లెళ్లు తండ్రీ కూతుళ్లు, మామా కోడళ్ళు కాక మరికొందరు భార్యకు తెలియకుండా, ఆఫీసులలో, ఇరుగు పొరుగు వాళ్లతో అక్రమ సంబంధాలు రోజురోజుకు మన దేశంలో పెరుగుతున్నాయేమో ననిపిస్తోంది.కొందరు కుర్రకారు నేను ఒక ఆంటీతో కలిశాను. ఎయిడ్స్ వస్తుందేమోనని భయంగా ఉందని ప్రశ్నలు తరచు పత్రికలలో కనిపిస్తున్నాయి. ఒకసర్వేలో పెళ్లి కానివారు 30% వరకు పెళ్ళైన వారు 40% వరకు అక్రమ సంబంధాలు పెట్టుకొని సెక్స్ సుఖాలు అనుభవిస్తున్నారని వెల్లడించడం భారతీయులకు ఆశ్చర్యం కలిగించే విషయం. పత్రికలు నిర్వహించే కౌన్సిలింగ్‌లో ప్రశ్నలు బట్టిచూస్తే సర్వే వార్తలు నిజమమేమోనని పిస్తుంది.

నేటి సమాజంలో ఈ దిగజారుడు తనానికి కారణం ఊహిస్తే ఇంట్లో పెద్దవారు లేకపోవడం, ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై భార్యాభర్తలు వేరింటి కాపురం ఉండటం, భార్యాభర్తలిరువురూ ఉద్యోగస్తులవడం, నేటి చదువులలో నీతి బోధలు, నీతి శతకాలు వంటివి బాల్యంలో చెప్పకపోవడం, అమ్మ, తాతయ్యల అనురాగం, ఆత్మీయత, ప్రేమ లాంటివి తెలియక పిల్లలు తప్పులు చేస్తున్నారు. సరైనసమయంలో మంచి చెడూ పిల్లలకి చెప్పేవారు లేకే కొందరు పిల్లలు గాడి తప్పుతున్నారు. మధ్య

పానం, ఫ్యామిలి ప్లానింగ్ కూడా ఒకరకంగా అక్రమ సంబంధాలకు కారణమవు తోంది.

మొత్తం మీద కౌన్సిలింగ్‌కి అడిగే ప్రశ్నల వలన అడిగిన వారికి సమాధా నాలు వలన ప్రయోజనం ఎంత ఉందో తెలీదుగానీ వారూ అడిగే ప్రశ్నలు సమాధా నాలు పాఠకులకు ఉత్సాహాన్ని కలిగించి మనోరంజకంగా ఉన్నాయనడం అతిశయోక్తి కాదనుకుంటాను. అన్ని రకాల పత్రికలలో ఈ రకపు శీర్షికలు నేడు నిర్వహిస్తున్నా రంటే ఎక్కువమంది పాఠకుల ఆదరణేనని వేరే చెప్పనక్కర్లేదు. కౌన్సిలింగ్‌లో సిత్రాలు సూసి మీరూ ఆనందించే ఉంటారనుకొంటాను.

(ఆంధ్రభూమి దినపత్రిక - ప్రియదర్శిని - 7-6-2007)

❋ ❋ ❋

వయసు తేడాతో ఇబ్బందులు...

మా తమ్ముడు కూతురుకు మాకు తెలిసిన మంచి పెళ్లి సంబంధం చెప్పాము. ఫోటోలు నచ్చడం, జాతకాలు కుదరడంతో పెళ్లి చూపులకు ఏర్పాటు చేసాము. అబ్బాయి మంచి కంపెనీలో బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా ఉద్యోగం చేస్తున్నాడు. అబ్బాయికి ఒక అన్నయ్య, చెల్లి వున్నారు. ఇద్దరికీ పెళ్ళిళ్ళు అవడంతో ఉద్యోగరీత్యా ఒకరు బొంబాయిలో మరొకరు చెన్నైలో వున్నా తండ్రి ఇంకా సర్వీసులో వుండడం, అన్నీ బాగుండడంవల్ల మా తమ్ముడుకూతురు సుశీల అదృష్టవంతురాలని మురిసిపోయాము.

పెళ్లి చూపులవడం, బాగా తెలిసినవాళ్ళవడం వల్ల పెళ్లి చూపులు అయిన వెంటనే మగ పెళ్ళివారు అమ్మాయి నచ్చిందని చెప్పి వెళ్లేరు.మేమంతా సంతోషంగా కబుర్లు చెప్పుకుంటూ వుంటే మాశ్రీమతి నన్ను పక్కకి పిలిచి, సుశీలకి ఈ సంబంధం ఇష్టంలేదట అని చల్లగా చెప్పడంతో ఒక్కసారి నిర్ఘాంతపోయాను. కొంతసేపటికి నోట మాట రాలేదు. షాకునుంచి కొంతపేటికి తేరుకొని 'అమ్మాయి ఎవరినయినా ప్రేమించిందా ? అని అడిగాను.

అటువంటిదేమీలేదు. మన పిల్లలు ఇంకా అంత ఎత్తుకు ఎదగలేదు. అమ్మ, నాన్నతో మాట్లాడడానికే భయపడే సుశీలకీ అంత ధైర్యం ఎక్కడిది ? అబ్బాయికి, తనకి వయసు ఎనిమిది ఏళ్ళు తేడా వుంది. అంతవయసు తేడా ఇష్టంలేదట. రెండు మూడేళ్ల వయసు తేడా అయితే బాగుంటుందని చెబుతోంది. మన కుటుం బంలో 10-12 సంవత్సరాల తేడా వున్నవారు కూడా హాయిగా వుండి కాపురాలు చేస్తున్నారని, మనిద్దరికీ ఎనిమిదేళ్లు తేడా అయినా హాయిగా ఆరోగ్యంగా సుఖంగా వున్నామని ఎన్నోవిధాల నచ్చచెప్పేను. కానీ సుశీల ఒప్పుకోవడం లేదని బాధగా

చెప్పింది. నేను ఆలోచనలో పడ్డాను.ఇంతలో మరల శ్రీమతే కలుగజేసుకొని సుశీలను మీ దగ్గరకే పంపుతాను. మీరే మాట్లాడండి అని లోనికెళ్లింది. సుశీలని పిలిపించి నచ్చచెప్పడానికి ప్రయత్నించి విఫలుడయ్యాను. అమ్మాయి చెప్పిన మాటలు నన్ను కూడా ఆలోచింపచేసాయి. మా తమ్ముడు, మరదలుకు పది సంవత్సరాల తేడా. మా తమ్ముడు ఆఫీసులో పని, టెన్షన్లతో త్వరగా వృద్ధాప్య లక్షణాలు వచ్చేయి. మా మరదలు చూడడానికి చిన్నపిల్లలా వుంటుంది. మా తమ్ముణ్ణి జుత్తుకు రంగు వేసుకోమని చెబితే, తలకు రంగువేసుకుంటే వయసు తగ్గుతుందా? ఈ వయసులో నన్ను ఎవరు చూడాలంటూ ఆమెతో అడ్డంగా వాదిస్తాడు. ఆఫీసులో పనులు, టెన్షన్లవల్ల ఇద్దరూ కలిసి సినిమాలకి,షికార్లకి వెళ్ళరు. పెళ్ళిళ్లు, ఫంక్షన్లు వచ్చినా మరదల్ని పిల్లల్ని పంపుతాడుకానీ తను ఎక్కడికిరాడు. ముద్దు ముచ్చట సరదాలు తక్కువ ఆవాతారణంలో పెరిగిన పిల్లవడంవల్ల వయసుతేడా ఎక్కువగా వుండడానికి ఇష్టపడ డంలేదని అర్థం చేసుకొన్నాను.

దానికితోడు పూర్వపు రోజులలో 16-18 సంవత్సరాలకే ఆడపిల్లలకు, 25-30 సంవత్సరాలలోపే మగపిల్లలకు వివాహాలవడంవల్ల వయసు తేడా పది సంవత్సరాలున్నా కనిపించేదికాదు. దానికితోడు పెళ్లయిన నాలుగైదేళ్ళలోనే ముగ్గురు, నలుగురు సంతానాన్ని కనడంతో స్త్రీలే పురుషులకన్నా పెద్దవాళ్ళలా కనిపించి వయసు తేడా కనిపించేది కాదు. ఆ రోజుల్లో స్త్రీలు అమాయకురాళ్లవడంవల్ల భర్తకు విధేయత కనబరుస్తూ కాపురం చేసేవారు.

నేడు సమాజంలో ఎక్కువమంది స్త్రీలు, పురుషులతో సమానంగా చదువుకోవడంవలన, సరిసమాన వయసుగల పురుషుడు భర్తగా లభిస్తే వారి అభిరుచులు, కోరికలు ఒక్కలా వుంటాయని భావిస్తున్నారు. సినిమాకెళ్లాలన్నా హోటలుకి వెళ్లాలన్నా ఇద్దరూ చెట్టాపట్టాలేసుకొని వెళ్లడానికి ఉత్సాహం వుంటుంది. అదే వయసు తేడా వుంటే మగవాడు భార్యతో బయలుదేరడానికి ఉత్సాహం చూపక బద్ధకిస్తాడు అలాగే వారి కోరికలు, ఆలోచనలలో తేడా వుంటుంది. ఒక వయసు వచ్చేసరికి ఆఫీసులో బాధ్యతలతో ఇంటికివచ్చి భార్య అందించే కాఫీ ఫలహారాలు సేవించి హాయిగా విశ్రాంతి తీసుకోవాలని భర్త అనుకుంటే అందుకు విరుద్ధంగా భర్తతో కలిసి హాయిగా సినిమాకెళ్లి అక్కడి నుంచి హోటలుకి వెళ్లి తిరిగివస్తే బాగుంటుందని భార్య అనుకుంటుంది. ఇలా ఇద్దరి ఆలోచనలు వేరుగా వుండడంతో గిల్లికజ్జాలతో మొదలై, కోప తాపాలు, పట్టుదలతో ఇంట్లోవాతావరణం వేడెక్కి మనఃశాంతి కరువై ఎడముఖం పెడముఖంతో జీవించే జంటలు అనేకమంద వున్నారు. దీని ప్రభావం ఇంట్లో ఎదిగే పిల్లలపై తప్పక వుంటుంది.

ఒక్కొక్కసారి నలభైఏళ్ల వయసుకే స్త్రీలు ముసలివారుగా మారిపోయి భక్తి వైరాగ్యాలలో పడతారు కొందరు పురుషులు అరవై నిండినా ఉత్సాహంతో జుత్తుకు నల్లని రంగువేసుకొని హుషారుగా కనిపిస్తుంటారు. దానికితోడు నేడు వచ్చే కల్తీ ఆహారం, కల్తీ వాతావరణం గాలితో నలభై నిండకుండా ఆడ మగ బి.పి, సుగరు, కాన్సరు, హార్టు ప్రాబ్లమ్స్ అంటూ మంచాలెక్కుతున్నారు. ఈకాలంలో లేటు మేరేజస్ వల్ల ఆనందంగా అనుభవించవలసిన క్షణాలు తగ్గిపోతున్నాయి. భార్యాభర్తలిద్దరూ ఆరోగ్యవంతులైతే కొంతకాలమైనా శారీరక సుఖాలు పొందుతారు కాని ఇరువురిలో ఏ ఒక్కరు అనారోగ్యవంతులైనా వారి జీవితం చీకటిగా మారుతుంది.

ఆ రాత్రి తెల్లవార్లు దీర్ఘంగా ఆలోచించి తెల్లవారేక కారాలు మిరియాలు నూరుతున్న మా తమ్ముణ్ణి శాంతింపజేసి అమ్మాయి సుశీల చిన్నపిల్లయినా దూర దృష్టితో ప్రస్తుత కాలాన్నిబట్టి ఆలోచించిందని, ఆమె ఆలోచన హర్షించదగినదేనని మా తమ్ముడుకు నచ్చచెప్పి ఒప్పించేసరికి నా తల ప్రాణం తోకకి వచ్చింది.

మరీ రెండుమూడేళ్ల వయసు తేడా అనుకోకుండా నాలుగైదు ఏళ్ల వరకు అబ్బాయికి, అమ్మాయికి వయసు తేడా వుండాలని, అలావుంటే ఆ జంటలు చూడ ముచ్చటగొలవడమే కాకుండా అన్యోన్యంగా దాంపత్యం కొనసాగించి ఆదర్శ దంపతు లవుతారు. ఎప్పుడైనా పురుషుని వయసే అమ్మాయికన్నా ఎక్కువ వుండాలి. ఎందు కంటే స్త్రీలు ఏభై ఏళ్లకే ముసలివారై సంతానం కనే యోగ్యత కోల్పోతారు. కానీ పురుషులు 70-80 ఏళ్లయినా సంతానాన్ని కనే యోగ్యత వున్నట్లు ఎన్నో సందర్భా లలో రుజువయింది.

(ఆంధ్రభూమి దినపత్రిక - ప్రియదర్శిని-2007)

❋ ❋ ❋

విలువ తెలిసి మసలుకో!

ఈ మధ్య చెప్పుతెగితే మీరు కుట్టించడానికి చెప్పులు కుట్టే ఆసామి దగ్గరకు వెళ్లేను. రెండు మేకులు కొట్టి చెప్పుఇచ్చేడు. అతని చేతిలో ఒక రూపాయిపెట్టేను. అతను దాన్ని పరీక్షగాచూసి ఎవరైనా ముష్టివాడికి దానం చేయండి. అంటూ పొగ రుగా నా చేతిలో తిరిగిపెట్టేసరికి నేను అవాక్కయై కొంతసేపటికి తేరుకొని మరి ఎంతేమిటి అడగ్గా రెండు రూపాయలకి తక్కువ తీసుకోనని కరాకండిగా చెప్పాడు.(2005)

మరోసారి ఇలాగే జేబులోవున్న చిల్లరడబ్బుల్లో అర్థరూపాయి వుంటే బిచ్చ గాడికి వేస్తే చెల్లవని తిరిగిచ్చేడు. ఇంకోసారి దేవాలయంలో పళ్లెంలో దక్షిణగా పూజారి విచిత్రంగా నా ముఖంవైపు చూసాడు. పావలా, పదిపైసలు, ఇరవైపైసలు,

నాణేలుచూసి చాలారోజులైంది. ప్రభుత్వం చెల్లవని ప్రకటించకపోయినా వాటికి విలువలేదని ప్రజలే తిరస్కరిస్తున్నారు.

ఆరోజులలో (1966) నేను ఉద్యోగంలో చేరినపుడు నెల జీతం మూడువందల ఇరవై ఐదు. ఇద్దరు తమ్ముళ్లు అనకాపల్లి కాలేజీ హాస్టల్లో వుంటుంటే ఖర్చుల నిమిత్తం నెలకి 150 రూ.లు పంపేవాణ్ణి. మిగతా సొమ్ముతో నేను విజయవాడలో వుంటూ అపుడపుడు పరీక్ష ఫీజులకు, పుస్తకాలకు అదనంగా డబ్బు పంపడం జరిగేది. మంచి భోజనం పెరుగుతో నెలకి నలభై ఐదురూపాయలు రెండుపూటలా పుల్ భోజనానికిచార్జి చేసేవారు. టిఫిన్, ఇడ్లీ, దోశె, కాఫీ తాగితే అర్థ రూపాయి ఖర్చయ్యేది. కాలేజీలో చేరేవరకు చెప్పులు వేసుకోలేదంటే ఈ కాలం పిల్లలకు ఎగతాళిగా వుంటుంది. ఉద్యోగంలో చేరిన ఆరునెలల తర్వాత వాచీ కొనుక్కున్నానంటే ఆశ్చర్యపోతారు.

1969లో నా పెళ్లయిన కొత్తలో ఇద్దరమే కదా పావుకేజీ వంకాయలు, పావు కేజీ టమోటాలు కొనాలంటే కిలో ఐదుపైసలు, టమోటాకిలో పదిపైసలు చెప్పడంతో అవసరం లేకపోయినా కిలో తెచ్చేసరికి మా ఆవిడ చూసి నవ్వింది. ఆరోజులు మరల రావనిపిస్తుంది.

కాలేజీలో చదువుకునే రోజులలో టీతాగడానికి పదిపైసలు జేబులో వుండేవి కావు. అలా పెరగడంవలనే డబ్బు విలువ బాగా తెలిసి జీవితంలో జాగ్రత్తగా ఖర్చు పెట్టడం నేర్చుకున్నాను. రాబడి మించి ఖర్చు ఎన్నడూ చేయలేదు. అలాచేయగా మిగిలిన డబ్బులే పిల్లల చదువులకు, పెళ్లిళ్లకు అక్కరకొచ్చాయి.

ఎంతో డిసిప్లేన్‌తో పెంచి పెద్దచేసి పెళ్లిచేసి పంపించిన పిల్లలు ఈ మధ్య శలవుల్లో వచ్చినపుడు వాళ్లుచేసిన ఖర్చులు చూసి ఆశ్చర్యపోయాను. పదకొండు రోజుల పురిటిగుడ్డుకి రెండువందల యాభైరూపాయలతో గౌనుకొని తెచ్చేరు బాగుంది. కానీ బిడ్డకి మూడు నెలలు దాటితే అది పనికిరాదు. పిల్లలు ఆడుకునే బొమ్మలు మూడువందలిచ్చి కొన్నారు. అంతంత ఖర్చుచేస్తుంటే చూడలేక అలాదండగ ఖర్చులు పెట్టవద్దని మందలించాను. దానికి మా పిల్లలు ముగ్గురూ పెద్దలెక్చరిచ్చారు. మాకు ఎలాగూ ఏ ముద్దు ముచ్చట తీరలేదు. కాలేజీలో చదివేటప్పుడు కూడా నూట యాభైరూపాయ లకు మించి డ్రస్సు కొనలేదు. కాన్వెంట్లలో చదివించలేదు. వాళ్ల నాన్నలు సంపాదిస్తు న్నారు కాబట్టి ప్లిలలనైనా సుఖపడనివ్వండి అన్నారు.

వారి మాటలు విని వారు చాలా ఎత్తు ఎదిగిపోయారని గ్రహించాను. నేను విజయవాడలో వుండేటప్పుడు ఆడపిల్లలకు చదువుతోపాటు సంగీతం రావడం మంచిదని పిల్లలకు సంగీతం నేర్పించేవాణ్ణి. మా స్నేహితులు మా పిల్లల్ని అభినందిం

చారు. తర్వాత కాలేజీ చదువుల్లో పడ్డాక సంగీతం మరచిపోయారు. పెళ్ళయ్యేక కనీసం జోలపాటలు కూడా పాడకపోవడం చూసి నేను సంగీతం నేర్పించడానికి ఖర్చుచేసిన డబ్బంతా వృధాచేసానే అనిపించింది.

ఏదైనాపిండిబట్టి రొట్టె చేసుకోవాలిగానీ గొప్పలకి, షోకులకి పోయి డబ్బు వృధా చేసుకొని తర్వాత విచారించకూడదు. దేనికైనా డబ్బే ప్రధానం. ప్రపంచమంతా డబ్బుతోనే శాసించబడుతోంది. డబ్బులేకపోతే ఒకరోజు మానవుడు జీవించలేడు. వచ్చిన డబ్బును ముందు వెనుక ఆలోచించి రేపు అనేది ఒకటుందని గుర్తుపెట్టుకొని ఖర్చు చేయాలి. తేనెటీగ తేనెను కూడబెట్టినట్లు పైసాపైసా కూడబెడితే భవిష్యత్తు బాగుంటుంది. కొందరు వున్ననాడు డబ్బు జల్సాచేసి లేనిరోజు పస్తులు వుంటారు. అది మంచి పద్ధతికాదు. డబ్బుంటే సినిమాలకి వెళ్ళవచ్చు. ఇంకేమైనా ప్రోగ్రాములకు వెళ్లవచ్చు. కానీ అప్పుచేసి ఏ జల్సాలు చేయకూడదు. తిండి, బట్టకు మొదట ప్రాధాన్యం ఇవ్వడం అవసరం. ముఖ్యం. ఇది గుర్తించి మసలుకుంటే సమస్యలు లేకుండా హాయిగా జీవించవచ్చు.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 2005)

❁ ❁ ❁

చుట్టపు చూపు

నేడు కన్నపిల్లలే చుట్టపు చూపులా వచ్చి తల్లిదండ్రులను చూసి వెళ్తున్నారంటే అతిశయోక్తి లేదనుకొంటాను. ఒకనాడు ఉమ్మడి కటుంబాలున్న రోజులలో పిల్లలు తల్లిదండ్రులతో, అత్తమామలతో, తాత అమ్మమ్మ, నాయనమ్మలతో కలిసివుండేవారు. కలిసి వుండడంవలన ప్రేమానురాగాలు, అభిమానాలు పెరిగేవి. వావి వరుసలు తెలిసేవి. పిల్లలు తప్పుచేస్తే పెద్దలు సరిదిద్దేవారు. మంచి, చెడు, చెప్పి నీతిబోధలు చేసేవారు. ఎవరి దగ్గర ఎలా మెలగాలో, పెద్దలను ఎలా గౌరవించాలో చెప్పి పిల్లల్ని మంచి క్రమశిక్షణలో పెంచి పెద్దచేసేవారు. దానికితోడు ఆ రోజులలో పాఠశాల పాఠ్యాంశాలలో కూడా రామాయణ, భాగవత కథలు చోటు చేసుకునేవి. పిల్లలకు సుమతీశకం,కృష్ణశతకం, వేమనశతకం, కుమారశతకం ఆడపిల్లలకు కుమార శతకంను, మగపిల్లలకు బర్తృహరి నీతిపద్యాలు మున్నగునవన్నీ నేర్పించి భావిపౌరు లుగా తీర్చిదిద్దేవారు. అందుకే ఆనాడు ఈనాటిలా ప్రజలు బరితెగించలేదు. హింసాత్మక చర్యలకు ఎక్కువగా పూనుకునేవారు కాదు. నేడు మానభంగాలు, హత్యలు అత్యంత సామానున్యమయ్యాయి.

మా చిన్నతనంలో అంటే చదువకునే రోజులలో ఊళ్లో హరికథ, బుర్రకథ వంటివి జరిగినా, పురాణకాలక్షేపం జరిగినా పెద్దలు పిల్లల్ని ప్రోత్సహించి తీసుకువెళ్లే

వారు. వారికి రామాయణ, భారత కథలతోపాటు లోక జ్ఞానానికి పనికివచ్చే అనేక సంగతులు తెలిసేవి. నేడు ఎక్కడైనా ఒక హరికథ, బుఱ్ఱకథ వంటివి జరిగితే పట్టు మని పదిమంది పెద్దలు కూడా రావడంలేదు. ఇక పిల్లల సంగతి చెప్పడానికే ముంది? నేడు పెద్దా, పిన్నా అంతా ఇంట్లో ఈడియట్ బాక్స్ అనబడే బుల్లితెరలకు అతుక్కుపోతున్నారు.

ఈ మధ్య మన దేశంలోనే ప్రఖ్యాతిగాంచిన ఒక మహానుభావుడు మా వూరు వచ్చి ఆధ్యాత్మిక ప్రవచనాలు చెప్పారు. ఆ ఆధ్యాత్మిక సభకు అత్యధిక సంఖ్యలో స్త్రీలు, అరవైలు దాటిన పురుషులు వచ్చేరు కానీ ఒక్క యువకుడు కానరాలేదు. కొందరు యువతులు మాత్రం వచ్చారు. ముఖ్యంగా నేటి యువతకే ఈ ఆధ్యాత్మిక ఉపన్యాసాలు, ప్రవచనాలు ఎక్కువగా ఉపకరిస్తాయి. రేపటి పౌరులు కావలసిన నేటి బాలలు సినిమా వ్యామోహం, క్రికెట్ వ్యామోహం, టీవీ వ్యామోహాలలో పడి అతి విలువైన వారి కాలాన్ని వృధా చేసుకుంటున్నారు. విద్యార్థులకు పరీక్షల కాలం, స్కూళ్లు తెరచిన రోజులలో పిల్లలు యిటువంటి కార్యక్రమాలకు రాలేదంటే మనం బాధపడకూడదు. కానీ శలవురోజులలో పరీక్షలయేక యిటువంటి మహత్కార్యము జరుగుతున్నప్పుడు పెద్దలు తమవెంట పిల్లలను తీసుకురావాలి. ఇప్పటికే ఆ సుత్తి ప్రోగ్రాములకు ఎవరు వస్తారనే పిల్లలు లేకపోలేదు. వారికి సదభిప్రాయం కలిగించి, ప్రోత్సహించి తీసుకువచ్చి రుచి చూపిస్తే వారే అందులో మాధుర్యాన్ని చవిచూస్తారు. మన ముందు తరంవారు పోతన భాగవతము, నన్నయ్య, తిక్కనల భారతము, పెద్దన్న, శ్రీనాధుల వంటి కవితా చాతుర్యాన్ని చదవగలరా? వినగలరా? అర్థం చేసుకోగలరా! ఆలోచిస్తే ఆ మహానుభావుల గ్రంథాలు ముందు ముందు గ్రంధాలయా లలో కూడా వుంటాయా! వుండవా! అనే పరిస్థితి కనిపిస్తోంది. ఎందుకంటే రోజు రోజుకు తెలుగు చదివేవారు, తెలుగు భాషయందు ఆసక్తి కలవారు కరువవుతున్నారు. ఒకవేళ తెలుగు నేర్చినా సినిమా తెలుగుభాష వస్తుంది కానీ కవితలు అర్థం చేసుకొనే భాషరాదు.

ఇక పిల్లలు పెద్ద చదువులు చదివి ఉద్యోగరీత్యా ఇతర రాష్ట్రాలకు, యితర దేశాలకు వెళ్లినవారి సంగతి చెప్పనే అక్కర్లేదు. పిల్లలు ఇంట్లో తెలుగు భాష మాట్లాడ గలిగినా, రాయడం, చదవడం వారికిరాదు. పెద్దలు వారికి నేర్పించడంలేదు. నేడు ఆంధ్రప్రదేశ్‌లో పెరిగి చదువుతున్న విద్యార్థులకే చాలామందికి తెలుగు చదవడం, రాయడం రాదంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. చాలా పాఠశాలల్లో తెలుగు బోధన జరగడం లేదు, నేర్పడంలేదని వింటే విస్తుపోతాం, ఇది నేటి తెలుగు భాషా పరిస్థితి.

వివిధ దేశాలలో, రాష్ట్రాలలో పెరిగిన పిల్లలు సంవత్సరానికోమారు చుట్టపు చూపుగా వచ్చి పుట్టింట్లో, అత్తింట్లో పదేసి రోజులుండి వెళ్తున్నారు. అందువల్ల

వారికి అభిమానాలు, ఆప్యాయతలు వుండడంలేదు. డబ్బు సంపాదిస్తూ వుండడం వల్ల విరివిగా ఖర్చు చేస్తున్నారు కానీ డబ్బుకి దొరకని ప్రేమానురాగాలను పంచలేక పోతున్నారు.

అపురూపంగా సంవత్సరానికి ఒకసారి వచ్చే కొడుకైనా, కూతురైనా నేడు వచ్చినవాళ్లని అతి మర్యాదగా గౌరవంగా అంటే వారికి వి.ఐ.పి.ట్రీట్‌మెంట్ యిస్తున్నారు. దానితో అత్తాకోడళ్ళు అనుబంధంకానీ, తల్లీకూతుళ్ళ అనురాగంగానీ, తండ్రీ కొడుకుల ప్రేమలుకానీ కానరావడంలేదు. తాతలకు, అమ్మమ్మలకు మనుమలతో ఆడుకోవడానికి కానీ కబుర్లు చెప్పుకోడానికి కానీ వీలుపడడంలేదు. పిల్లల దగ్గరకు పెద్దవాళ్ళు ఒకవేళ తెగించి వెళ్లినా అక్కడ ఇరుకు యిళ్లల్లో, కొత్త ప్రదేశాలలో కొత్త వాతావరణంలో ఇమడలేక పదిరోజులుండి చుట్టపు చూపుగానే చూసి వస్తున్నారు. స్వంత మనమలు, ప్లిలు కూడా పరాయివారిగానే చూస్తున్నారు. కానీ వారిని యింట్లో కుటుంబ సభ్యులుగా పరిగణించడంలేదు. పిల్లలు ఒక్కొక్కసారి తాతా మీరెప్పుడు మీ ఊరు వెళ్తున్నారని అడుగుతున్నారు కూడా.

ఆ మధ్య మా స్నేహితుని యింటికి వాళ్ళ పిల్లలువస్తే మాతో వాళ్లింటికి చుట్టాలొచ్చేరని చెప్పేసరికి ఎవరో దూరపు బంధువులొచ్చారను కొన్నాము. తీరా చూస్తూ వాళ్ళబ్బాయి, కోడలు, మనుమలే. వాళ్ళమ్మాయికి పెళ్ళయింది. పెళ్లయేక అత్తగారింటికి వెళ్ళమంటే, నాకు వాళ్ళింటికి వెళ్ళే అవసరం లేదు. నా భర్త దగ్గరకు ఢిల్లీ వెళ్తానుకానీ వాళ్లింటికి వెళ్ళి వుండను. మీకు భారమనుకుంటే ఢిల్లీలో నా భర్త దగ్గర దిగబెట్టమని తెగేసి చెప్పేసరికి ఆ కన్నవారు నిశ్చేష్టులై వియ్యాలవారి ముందు తల వంచుకున్నారు.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 2005)

❁ ❁ ❁

ఉత్తమ ఇల్లాలు !

మా శ్రీవారు ఆఫీసునుంచి ఇంటికి వచ్చి పదిరోజులు ఢిల్లీలో ట్రైనింగుకు వెళ్లాలి. తప్పించుకుందామంటే కుదరలేదు అన్నారు. ఢిల్లీ అయితే నేనూ వస్తాను. అక్కడ మా దొడ్డమ్మ కూతురు శైలజవుంది. ఇద్దరం కలిసి ఆడుకున్నాం. డిగ్రీవరకు చదువుకున్నాం. పెళ్ళయిన దగ్గరనుంచి ఢిల్లీ రమ్మంటోంది. దాని పెళ్ళయి పదేళ్ళవుతున్నా వెళ్ళి చూడలేకపోయాను. ప్లీజ్ నన్నూమీతో ఢిల్లీ తీసుకెళ్లండి. ఆ చుట్టుపక్కల ప్రదేశాలు కూడా చూసివద్దాం అన్నాను బ్రతిమాలుతున్నట్లుగా.

శ్రీవారు ఏ కళలోవున్నారో ఒకే చేయడం వెంటనే ఢిల్లీ వెళ్ళడం జరిగింది. మా రాకతో మా అక్క శైలజ, బావగారు పొంగిపోయారు. మావారు ట్రైనింగుకి

హాస్టలు ఫెసిలిటీ వున్నా ఉదయమే ఇంట్లో 8 గంటలకు బయలుదేరి రాత్రి 8 గంటలకు వచ్చేవారు. మా బావగారి ఆఫీసు దగ్గరవడంవల్ల ఉదయం 8-30కి టిఫిన్‌చేసి వెళ్ళి మరల లంచ్‌కి ఇంటికివచ్చి ఒకటిన్నరకు ఆఫీసుకెళ్ళేవారు. సాయంత్రం 6గం.కు టంచనుగా ఆఫీసునుంచి తిరిగి వచ్చేవారు. మా అక్కయ్యకు ఇద్దరు పిల్లలు అమ్మాయి లత ఉదయమే 7 గం.లకు స్కూలుకెళ్లి మధ్యాహ్నం 2గం.కి వచ్చేది. అమ్మాయి నాల్గవ తరగతి, అబ్బాయి 2వతరగతి చదువుతున్నారు. ఢిల్లీ వాతావణంవల్ల యాపిల్ పండురంగు బుగ్గలతో బొద్దుగా ముద్దుగా కనిపించారు.

వారి సంసారాన్ని చూసి నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. శైలజ తెల్లవారు జాము 5గం.లకు నిద్రలేచి రాత్రి 11 గం.లకు నిద్రపోయేవరకూ ఒక యంత్రంలా అలా పనిచేస్తూనే వుండేది. నిజంగా మగమహారాజు అంటే ఎలా వుంటాడో బావ గార్ని చూశాక తెలిసింది.

మా అక్క ఇంట్లో ఇంటెడు చాకిరీ చేస్తూ మధ్యలో బావగారికి సేవలు చేస్తూ పిల్లలకు చదువు చెబుతూ వారి టిఫిన్లు, భోజనాలు చూస్తూ వారి సంరక్షణచేసి స్కూలుకు పంపేది. ఇంట్లో పచారి సామాన్లు, కూరగాయలు తెచ్చుకునేది. బావగారికి చెప్పినా ప్రయోజనం వుండదని అన్నీ తనే స్వయంగా చేసుకునేది. పనిమనిషి గిన్నెలు తోమి, ఇల్లు ఊడ్చిపోయేది. బట్టలు శైలజక్కే రోజూ వాషింగ్‌మెషిన్‌లో వేసి ఉతికి ఆరవేసేది. శని, ఆదివారాలు శలవురోజులవడంవల్ల అంతా టాక్సీ తీసుకొని పిక్నిక్‌లా సైట్ సీయింగ్‌కి వెళ్ళి ఢిల్లీలో చూడవసలిన ప్రదేశాలన్నీ చూశాము. మా శైలజక్క ఓర్పు, సహనం ఓపిక చూసేక ఆమెకు జోహార్లర్పించకుండా వుండలేక పోయాను. పూర్వం పతివ్రతా స్త్రీలు వంటింటి కుందేళ్లుగా భర్తలకు సేవచేస్తూ జీవించేవారని విన్నాను. కాని నేడు ఢిల్లీనగరంలో పదేళ్లనుంచి కాపురముంటూ ఇంటి ఇల్లాలుగా చరణదాసిగా, ఆదర్శగృహిణిగా వుంటూ చిరునవ్వుతో కాపరం చేస్తున్న మా అక్కఅంతలా ఎలా మారిపోయిందో ఎలా ఎదిగిపోయిందో నాకు అర్థం కాలేదు. ఒకరోజు మాటలలో నీకు మీ నాన్నగారు సుగుణ, సుశీల, సీత, ధాత్రి వంటి పేరేదైనా పెట్టవలసిందే అన్నాను. శైలజ నవ్వి వూరుకొంది.

నేనే వుండబట్టలేక బావగారు ఇంటి గురించి, నీ గురించి ఏమీ పట్టించు కోకుండా తన లోకంలో తను వుంటుంటే నీకు ఎలా ఆయనకి సేవలు చేయబుద్ధవు తుందే అని అడిగాను. శైలజక్క నా ముఖంలోకి కోపంగా చూసి మీ బావగారు అలా కన్పిస్తున్నారుగానీ నేనంటే ఆయనకి పిచ్చిప్రేమ. అభిమానం, ఒక్క ఘడియ నన్ను విడిచి వుండలేరు. ఆయన తిండి అలవాట్లు బద్ధకం అవీ వారి అమ్మగారు చేసిన గారాబంవలన వచ్చాయి. ఆయన్ని మార్చడం కష్టమని తెలిసి, నేనే ఈ

జీవితానికి అలవాటుపడ్డాను. ఏదో రోజు ఆయనే మారతారనుకొంటున్నాను. మన ఇంటిపనులు మనం చేసుకోవడంలో తప్పులేదనుకుంటాను. మా చుట్టుపక్కల వాళ్లలో చాలామంది స్త్రీలు ఉద్యోగాలు చేస్తూ ఇంట్లో చాకిరీ చేసుకునే వాళ్ళని చూస్తే వారి కన్నా నా జీవితమే వేయి రెట్లు హాయి అనిపిస్తుంది. జీవితంలో సంతృప్తి వుండాలని మా నాన్నగారు ఎప్పుడూ అనేవారు. ఆ తృప్తి నాకు ఈ రోజు వుంది అంది పెద్ద వేదాంతిలా.

హేట్సాఫ్ శైలజక్కా! నిన్ను చూసి చాలా నేర్చుకున్నాను. వైజాగ్‌లో మా శ్రీవారు నాకు అన్ని పనులలో సాయం చేస్తున్నా నేను చిరాకుపడుతూ ఆయన్ని వేధిస్తుంటాను. ఇప్పుడు బావగారిని చూసేక మా ఆయన చాలా అమాయకడని పిస్తోంది. నిజంగా ఆయనే దేవుడే అంటూ పొంగిపోయాను.

మా శ్రీవారి ట్రైనింగ్ పూర్తవడంతో ఆగ్రా, బృందావన్, మధుర చూసి అక్క బావలకు వారి ఆతిథ్యానికి, ఆదరణకు థాంక్సు చెప్పి వైజాగ్ బయలుదేరాము. శైలజక్కలాంటి ఇల్లాళ్లు ఇంకా వుండబట్టే భారతదేశ మహిళలకు నేటికీ ఇంకా గౌరవం, కీర్తి లభిస్తున్నాయని అనిపించింది. అక్కకు మరొకసారి జోహార్లు మనసులోనే అర్పించుకొన్నాను.

(ఆంధ్రభూమి దినపత్రిక - ప్రియదర్శిని - 2005)

❁ ❁ ❁

ఇంటి బడ్జెట్ ఎలా పెరుగుతోంది ?

వెంకట్రామయ్యగారు తెచ్చిన సరుకులు చూసి, లక్ష్మమ్మగారు ఆశ్చర్యంతో రెండువేలు తీసుకువెళ్ళి చెప్పిన సరుకులు అన్నీ తేలేదేమని భర్తను ప్రశ్నించింది. ముఖానికి పట్టిన చెమటను తుడుచుకుంటూ నువ్వూ బజారుకొచ్చి వుంటే ఏమి కొనాలో ఏవి వద్దో నిర్ణయించుకునేదానివి. పప్పులు, బియ్యం, ఫ్యాన్సీ వస్తువులు అన్నింటికీ రెక్కలు వచ్చి ఆకాశాన్నంటుతున్నాయి. కూరలు కొందామని మార్కెట్‌కి వెళితే ఇరవై పాతికకి ఏదీ తక్కువలేదు. ఇక సామాన్యుడు ఈ ఇండియాలో బ్రతకడం కష్టం అంటూ పెద్దగా నిట్టూర్పు విడిచేరు.

పూర్వపు రోజులలో అయితే సంవత్సరానికి ఒకసారి మార్చినెలలో పార్ల మెంటు, అసెంబ్లీలలో దేశబడ్జెట్ ప్రతిపాదించేటప్పుడు మాత్రమే ధరలు పెరిగేవి. బడ్జెట్ వస్తుందని కొందరు ముందుజాగ్రత్త కూడా పడేవారు. కానీ నేడు ధరలు పెరగడానికి బడ్జెట్‌తో సంబంధంలేదు. నెల నెలకు రెక్కలు వస్తూవుంటాయి. వస్తువు లపై వుండే ఎంఆర్‌పికి కంట్రోలు లేకపోవడం ఎంఆర్‌పిని పెంచి ఏవో ఆఫర్లని గిఫ్ట్‌లని, ఇది ఫ్రీ అది ఫ్రీ అంటూ రకరకాల ప్రకటనలతో సబ్బులు, టూత్‌పేస్ట్‌లు, కాఫీ, టీ, వంటివి అమ్ముకుని డబ్బు చేసుకుంటున్నారు.

మన నెలసరి బడ్జెట్ పెరగడానికి టీవీలో వచ్చే ప్రకటనలు కూడా ఒక ముఖ్య కారణం. టీవీలో న్యూస్‌పెట్టినా సీరియల్ చూడాలన్నా సినిమా చూడాలన్నా ప్రకటనలతోనే సగం సమయాన్న మ్రింగి, ప్రేక్షకుల హృదయాలలో కొన్ని ప్రకటనలు ముద్రవేసుకుని వుండిపోతాయి. అవసరం వున్నా లేకపోయినా ప్రకటనలు చూసి కొన్ని వస్తువులు కొనడం జరుగుతున్నది. ఒక గద్వాల్ చీరకొంటే రెండు గద్వాల్ చీరలు ఉచితం అని ప్రకటన వినగానే ఒకసారి చూసివస్తే వచ్చిన నష్టమేమని ఎందరో మహిళలు షాపుకివెళ్ళి అవసరంలేనివి కొని బడ్జెట్ పెంచుకుంటూ వుంటారు.

టీవీలు వచ్చిన కొత్తలో సినిమా ఖర్చుతగ్గుతుందని అంతా టీవీలు కొనుక్కునారు. కేబుల్ నెట్‌వర్క్ వచ్చాక కేబుల్ కనెక్షన్‌కి నెలకి 150 నుండి రెండు వందల దాకా కడుతూ, కొత్తసినిమాలువస్తే థియేటర్‌కి వెళ్ళి టిక్కెట్‌రేట్లు ఎంత పెరిగినా ఎగబడి చూస్తున్నారు. పూర్వం స్త్రీలు రాసుకుంటే ఫేసు పౌడరు లేదా శీతాకాలంలో స్నో రాసుకునేవారు. నేడు ప్రకటనల హోరు చూసి రకరకాల క్రీములు, తలనూనెలు, షాంపూలకు విపరీతంగా ఖర్చుచేస్తున్నారు. ఇంకా కొందరు బ్యూటీ క్లినిక్‌లకెళ్ళి సౌందర్యాన్ని పెంచుకొని, బడ్జెట్‌కు గండికొడుతున్నారు. ఒకనాడు దోమల నివారణకు ఆరు నెలలకో సంవత్సరానికో సాంబ్రాణి పొగ ఇంట్లో పెట్టేవారు. కానీ నేడు ప్రతినెల దోమల నివారణకోసం ఆలౌట్, జెట్, పేరుతో నెలకు 60–70 రూపాయలు ఖర్చుచేస్తున్నారు.

పిల్లల కోరికలు సరదాలు తీర్చడానికి వారడిగిన బ్రాండ్లు, చాకెట్లు, బిస్కెట్లు కొనేసరికి సామాన్యుడికి తలప్రాణం తోకకి వస్తుంది. టీవీలలో ప్రకటనల హోరు చూసి స్త్రీలు వాడే దుస్తులకు, వస్తువులకు మార్కెట్లో గిరాకీ బాగా పెరుగుతోందని, మహిళలు ప్రకటనలు చూసే ఎక్కువగా ఖరీదు చేస్తారని మార్కెటింగ్ సర్వే భోగట్టా. దీనినిబట్టి చూస్తే నెలసరి బడ్జెట్ మహిళల మూలంగానే ఎక్కువగా పెరగుతోందని తెలుస్తోంది. పూర్వపు రోజులలో ఒకవాచీ, సైకిలు, స్కూటరు, కారువంటివి కొంటే జీవితాంతం వాడుకునేవారు. కాని నేడు ఈప్రకటనల హోరుతో కొత్తవాటిపై మోజుతో కొని ఒకటి రెండేళ్ళలో వాటినిఅమ్మి కొత్తవి కొనడానికి వెనుకాడడంలేదు.

ఇక పిల్లల చదువల విషయానికి వస్తే ఖర్చులకు అంతం వుండదు. కాన్వెంటు చదువులవడంవలన యూనిఫామ్, సాక్సు, బూట్లు, బుక్స్, ట్రాన్స్‌పోర్టు ఖర్చులు చూస్తూవుంటే మతిపోతుంది. పూర్వం చదువుకునే రోజులలో కాలేజీలో టెక్నికల్ కోర్సుకు అయిన ఖర్చు ఇవాళ కాన్వెంటులో నాల్గవ తరగతి చదువుకి అవుతోందంటే అతిశయోక్తికాదనుకొంటాను. నేడు ఎంసెట్ కోచింగులకు, ఇంజనీరింగ్, మెడికల్ కోర్సువంటి చదువులకు లక్షలలోనే ఖర్చు అవుతోంది. అంటే సామాన్యుడు, మధ్య తరగతివాళ్ళు చదువుకోవడానికి అనుకూలంగా లేవు. రిజర్వేషన్ల పుణ్యమా అని

మధ్యతరగతవాళ్ళు మెరిట్‌తో మంచిమార్కులు సంపాదించినా ఇంజనీరింగు, మెడిసిన్ వంటి విద్యలు వారికి గగనకుసుమాలే అవుతున్నాయి. అన్నింటికి రిమోట్ కంట్రోల్ సౌకర్యం వుండడంతో కూర్చుని లేవకుండా రిమోట్ కంట్రోల్‌కి అవాటుపడి బద్ధకం పెంచుకుని, సుఖాలకి అలవాటుపడి అనారోగ్యముకొని తెచ్చుకుంటున్నారు. సెల్‌ఫోన్లు వచ్చేక జనంలో మరీబద్ధకం పెరిగిపోయింది. అవసరంవున్నా లేకపోయినా ప్రతివారు సెల్‌ఫోన్‌లో గంటలతరపడి మాట్లాడుతూ అనవసరంగా బడ్జెట్ పెంచు కుంటున్నారు. పూర్వం లాండ్‌ఫోను ఒకటే వున్నప్పుడు అవసరానికే ఫోను మాట్లాడే వారు. నేడు సెల్‌ఫోన్లు వచ్చాక ఒకఫేషన్ వెర్రిగా అందరి చేతుల్లో కనిపిస్తున్నాయి. స్టూడెంట్సు చేతులలో ఎక్కువగా కన్పించడం మరీ ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఈమధ్య టీవీ ప్రోగ్రాముల పుణ్యమా అని ఎస్.ఎం.ఎస్‌లు ఎక్కువై బడ్జెట్‌ను పెంచుతున్నాయి.

పూర్వం రోజులలో ప్రయాణాలకు తప్పనిసరిగా మంచినీళ్ళు వారితో తీసుకు వెళ్ళేవారు. నేడు మినరల్‌వాటర్ బాటిల్సుకు, కూల్‌డ్రింక్స్‌కు అలవాటుపడి మంచి నీళ్ళను మోసుకెళ్ళకుండా కొనుక్కుని అక్కడే త్రాగి ఖాళీసీసాలు వదిలివస్తున్నారు. ఇంట్లో క్షణకాలం ఫేను లేకపోయినా, ఫ్రిజ్ లేకపోయినా నేడు గడవడంలేదు. మనుషులున్నా లేకపోయినా చాలా ఇళ్ళల్లోఫేన్లు తిరగుతూ వుంటాయి. ఇవన్నీ బడ్జెట్ పెరగడానికి మార్గాలే. పొదుపు అనేది మరచిపోయే రోజులు వచ్చాయి. ఇన్ కంటాక్సు పుణ్యమా అని ఇన్సూరెన్సు, పోస్టల్ డిపాజిట్లు వంటి సేవింగ్సు చేస్తున్నారు. కానీ లేకుంటే ఆ మాత్రం సేవింగ్సు కూడా చేసే స్థితిలో సామన్యులు, మధ్యతరగతి వారు లేరు.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 2004)

❁ ❁ ❁

ఎమ్.ఆర్.పి. దోపిడీ ఇకవద్దు...

ఎమ్.ఆర్.పి.అంటే మేక్జిమమ్ రిటైల్‌ప్రైస్ అనే ముద్రతో వస్తువు ఖరీదు తెలియచేయడానికి ఆ వస్తువుపైన ముద్రించబడి వుంటుంది. మనం మార్కెట్లో సబ్బులు, టూత్‌పేస్టు, మందులు, కాఫీ, టీ, బ్లేడ్లు, పుస్తకాలు ఒకటేమిటి అన్నిటిపై వస్తువు ఖరీదు ఎం.ఆర్.పి అని ముద్రించడం దానిని చూసి మనం ఖరీదు చెల్లించి వస్తువు తీసుకోవడం మామూలుగా జరుగుతున్న విషయం, కానీ కొన్ని వస్తువులపై 10% మరికొన్ని వస్తువులపై 20% ఇంకా కొన్ని వస్తువులపై 50%కూడా తగ్గించి ఎమ్.ఆర్.పి రేటుకన్నా తక్కువకి మార్కెట్లో అమ్మడం, మనం కొనడం కూడా ఒక్కొక్క సారి జరుగుతూ వుంటుంది. అలా కొన్నవస్తువులు అసలు ధర ఎంత వుండి వుం టుందో తెలియక ఒక్కొక్కసారి కొనుగోలుదారుడు జుత్తుపీక్కోవలసి వస్తుంది.

ప్రభుత్వంవారు సదుద్దేశముతోనే ఎమ్.ఆర్.పి. ధరప్రతీపేకెట్‌పై విధిగా ప్రకటించాలని బిల్లు ప్యాసు చేసింది. అంతవరకు బాగానే వుంది కానీ ఏ వస్తువుకు ధర ప్రభుత్వము నిర్ణయించకుండా మేనుఫేక్చరు చేసే కంపెనీవారికే ఆ నిర్ణయం వదలడంవల్ల వారు పావలా వస్తువును పది రూపాయలు ఎమ్.ఆర్.పిగా ముద్రించి మార్కెట్లో విడుదల చేస్తున్నారు. హోల్‌సేల్ వర్తకుడు కొంత పర్సంటేజి తగ్గించి రిటైల్ వర్తకుడుకిస్తే, రిటైల్ వర్తకుడు అతని లాభాన్ని చూసుకుని 10%;20% డిస్కౌంట్ పేరుతో కొనుగోలుదారుడికి వస్తువులు అమ్ముతున్నాడు. అసలు వస్తువు ఖరీదు ఎంత వుంటుందో కొనుగోలుదారుడికి తెలియడంలేదు. ఎమ్.ఆర్.పి.ధర కన్నా తగ్గించి ఇచ్చేదని మురిసిపోతూ వస్తువుల్ని ఇంటికి తీసుకుపోతూ వుంటారు.

ఇంకా కొందరు కుచ్చుటోపీ వేయడానికి మార్కెట్లో వారికి అమ్ముడుపోని వస్తువుల్ని కొన్నింటిని నిత్యం డిమాండ్ వుండే వస్తువులతోపాటు ధర తగ్గించకుండా ఉచితంగా కానుకగా యిస్తూ వుంటారు. అంటే టూత్‌పేస్ట్ కొన్నవారికి టూత్‌బ్రష్, సబ్బులు కొన్నవారికి దువ్వెన, కాఫీ పేకట్లతోపాటు మసాలా పౌడర్లు, బాల్‌పెన్లు, ప్లాస్టిక్ డబ్బాలు, స్టీలుగిన్నెలు ఉచితంగా యిస్తూవుంటారు. ఈ మధ్య మార్కెట్లో కొన్నివస్తువులు సబ్బులు, పౌడరు డబ్బాలు, అగరుబత్తి వంటివి ఒకటికొంటే మరొకటి ఉచితంగా యిస్తున్నారు. అంటే ఆ వస్తువు దానిపై వున్న ఎం.ఆర్.పి కన్నా సగం ధరకు మనకి వస్తోందన్నమాట. దీపావళి టపాకాయలు, మందుగుండు సామాన్లు పేకట్లపై ముద్రించిన ఖరీదుతో సంబంధం లేకుండా ఒక్కొక్కసారి నాలుగవ వంతు రేటున ఇచ్చిన సందర్భాలున్నాయి. అంటే పేకింగ్స్‌పై 120 రూపాయలు ముద్రించి వుంటే ముప్పయి రూపాయలకు కొనుగోలుదారుడికి అమ్మితే దాని అసలు ఖరీదు పదిరూపాయలు మించి వుండదని మనం సులువుగా గ్రహించవచ్చు.

ఎం.ఆర్.పి.ముద్రించడానికి అనుమతించిన ప్రభుత్వము వారు కొంత శ్రద్ధ తీసుకొని మందులు, నిత్యావసర వస్తువులు సబ్బులు, టూత్‌పేస్టులు, కాఫీ, టీ, నూనె పేకెట్లు ఇంకా ముఖ్యమైన వస్తువులకు కొన్నిరేట్లు నిర్ణయించి వీటికి ఇంతకన్నా ఎం.ఆర్.పిరేటు వుండకూడ దని నిర్ణయిస్తే కొనుగోలుదారుడు కొంతదోపిడీనుంచి రక్షించబడతాడు. లేకుంటే వినియోగదారుడు,మధ్య తరగతి కుటుంబీకులు మార్కెట్ మయాజాల దోపిడీకి గురై అమితంగా నష్టపోతారు. ఈరోజు అయోడైజ్డ్ సాల్టు పేరుతో ఉప్పును ఎన్నో కంపెనీలవారు పేక్‌చేసి అమ్ముతున్నారు. ఎం.ఆర్.పి. రేటు ఏడు రూపాయలనుంచి పన్నెండు రూపాయల వరకు కంపెనీబట్టి ముద్రిస్తున్నారు. అలాగే కొన్నినూనెల పాకెట్ల ధరలు కూడా అర్థంకాని విధంగా వుంటున్నాయి. మెడికల్‌షాపులో కొనే మందులు, మాత్రలు, ఇంజక్షన్లకయితే ఎమ్.ఆర్.పిపై టేక్సు

కూడా వసూలు చేస్తుంటారు. నూటికి తొంభై షాపులలో బిల్లులు కూడా ఇవ్వరు. అడిగితే వారి ముఖాన్ని ఒకసారి చూసి బిల్లు యిస్తారు.

ఎమ్.ఆర్.పి. రేటుపై ప్రభుత్వంవారు శ్రద్ధ తీసుకొని, చట్టాన్ని సవరించి కొన్ని వస్తువులనైనా సరియైన రేటు నిర్ణయించకపోతే కొనుగోలుదారుడు దోపిడీకి ఇంకా గురియై నష్టపోతాడు.

(ఆంధ్రభూమి దినపత్రిక – ప్రియదర్శిని – 2004)

❋ ❋ ❋

పెరిగే ఖర్చుకు కారకులెవరు ?

ఒకనాడు ఫిబ్రవరి, మార్చి నెలలు వస్తున్నాయంటే ప్రభుత్వం బడ్జెట్ వలన ధరలు కొన్ని వస్తువులకు పెరుగుతాయని ముందు జాగ్రత్తగా ఆ వస్తువులు కొని నిలువ చేసుకొనేవారు. కానీఈనాడు బడ్జెట్ ప్రమేయం లేకుండానే ప్రతీనెలా పెట్రోలు, గ్యాను, నిత్యం వాడుకొనే వస్తువులు, సబ్బులు, టూత్‌పేస్టులు,డిటర్జెంట్లు ఒకటేమిటి అన్నీ పెరుగుతూనే వున్నాయి. ధరలు పెరిగినంత వేగంగా జీతాలు పెరగడంలేదు. బ్యాంకులో దాచుకొన్న సొమ్ముకు ప్రతీ సంవత్సరం వడ్డీలు తగ్గుతున్నాయి.

పూర్వపు రోజులలో కుటుంబ సమేతంగా అంటే అరడజనుమంది కలిసి వెళ్ళినా సినిమాకు వందరూపాయలు లోపు అయేది. ఈ రోజుఇద్దరు వెళితే వంద రూపాయలు ఖర్చు అవుతోంది. పిల్లల కాన్వెంట్ చదువులు, ఫీజులు, యూనిఫారాలు, పుస్తకాలు తరువాత కాలేజీ చదువులంటే ఎమ్‌సెట్ కోచింగులు, డొనేషన్లుతో మధ్య తరగతి కుటుంబీకులు అల్లాడిపోతున్నారు.

మాకు తెలిసిన ఒకాయన ఒక కార్పొరేషన్‌లో మేజెజరుగా చేసి ఐదు ఏళ్ళ క్రితమే రిటైరయేరు. కార్పొరేషన్ సర్వీసు అవడంవలన వారికి పెన్షన్ వుండదని, దానికి బదులు గ్రాట్యుటీ, సిసిఎఫ్ బెనిఫిట్స్ ఎక్కువగా వస్తాయని ఆ డబ్బుని బ్యాంకులో వేసుకొంటే నెలకి పదివేలు తక్కువలేకుండా వడ్డీ వస్తుందని, కాలు మీద కాలు వేసుకొని తినవచ్చని గొప్పగా కబుర్లు చెప్పేవారు. ఆయన ఈ మధ్య మా యింటికి వచ్చి తన ప్లానింగు, బడ్జెట్లు అన్నీ తలకిందులయేయని, బ్యాంకు వడ్డీలు పోటీపడి ఈనాలుగు ఏళ్ళలో తగ్గించడంవలన నెలకి చేతికి పదివేలు వస్తుందనుకొంటే ఇప్పుడు చేతికి ఆరువేలు రావడం గగనంగా వుందని చెబుతూ బాధపడ్డారు.

సివిలైజేషన్ పేరుతో నేడు ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి. పూర్వం ఆవుపాలు, గేదెపాలు లభించిన రోజులలో ఒట్టి, పాలు త్రాగినా రుచిగా వుండేవి. పేకెట్ పాలు వచ్చేక త్రాగడానికి అందులో బోర్నవిటా, హార్లిక్స్, బూస్ట్ లాంటివి కలుపుకొంటేనే కాని తాగలేని పరిస్థితి వచ్చింది. ఫ్యాషన్లు, ప్రకటన హోరుతో స్త్రీల

ముఖసౌందర్యానికి, శరీర సౌందర్యానికి ఈమధ్య రకరకాల క్రీములు, లోషన్ల వాడుక ఖర్చుచాలామంది ఇళ్లలో పెరిగేయి. పూర్వం నెలకొకసారి మంగలి ఖర్చు మగవారికి మాత్రమే వుండేది. నేడు బ్యూటీక్లినిక్‌లకు వెళ్లడం, అందాలకు మెరుగులు దిద్దు కోవడం ఈమధ్య ఫ్యాషనవడంతో ఖర్చులు పెరుగుతున్నాయి. జుత్తుకు రంగు వేసుకోవడంతో ఆడా, మగా పోటీపడుతున్నారు.

పులినిచూసి నక్కవాత పెట్టుకొన్నట్లు అవసరంవున్నా లేకపోయినా ప్రతీ ఇంట్లో టెలిఫోను, ఈమధ్య సెల్‌ఫోన్లు కూడా పెట్టుకొని అనవసరపు ఖర్చులు పెంచుకొంటు న్నారు. పూర్వం పిల్లలకు పావలా, అర్ధరూపాయియి ఇచ్చి చాక్లెట్ కొనిస్తే సరిపోయేది. కానీ నేడు ఫైవ్‌స్టార్, చాకోబార్‌లు వంటివి వచ్చేక ఐదు రూపాయలు తక్కువ చాక్లెట్ బజారులో దొరకడంలేదు.

ఒకప్పుడు దోమలబారి నుండి తప్పించుకోడానికి దోమతెరలను వాడడం, రాత్రివేళ ఫ్యాను స్పీడుగా పెట్టుకొని కప్పుకొని పడుకోవడం చేసేవారు. కానీ నేడు దోమల కోసం ప్రత్యేకంగా అమ్మే కాయల్స్, మేట్స్, క్రీములువంటివి తప్పనిసరిగా వాడుతున్నారు. ప్రతీవారు కారప్పొడి, సాంబారుపొడి, మసాలా పొడి వంటివి కూడా ఇంట్లో తయారుచేసుకోవడం మానివేశారు. మరికొందరు ఇల్లాళ్లు, భార్యా భర్తలు ఇద్దరూ ఉద్యోగస్తులైన వారు మరికొంచెం ముందుకువెళ్ళి ఇడ్లీ మిక్సు,దోశె మిక్సు, ఉప్మామిక్సు, వడమిక్సులాటివి కూడా కొనుక్కొని ఇంట్లో మిక్సీలు, గ్రైండర్లున్నా పిండి రుబ్బుకోవడం మానేస్తున్నారు. పచ్చళ్ళు, ఊరగాయలు కూడా నేడు మార్కెట్లో విరివిగా లభ్యం అవుతున్నాయని, రుచిగా వుంటున్నాయని ఇంట్లో తయారు చేసుకోకుండా బజార్లపైనే ఆధారపడటం వలన తెలియకుండానే ఖర్చులు పెరుగు తున్నాయి.

పూర్వపు రోజులలో పనిమనుషులు అంట్ల గిన్నెలు తోమడానికి బూడిద, పొయ్యిబుగ్గి, కొబ్బరిపీచు వంటివి ఉపయోగించి గిన్నెలు శుభ్రంగా తోమేవారు. నేడు విమ్‌పౌడర్, సబ్బులు, ప్లాస్టిక్ బ్రష్‌లు వంటివి మార్కెట్లోకి వచ్చేక అవి కొనకుండా అంట్ల గిన్నెలు పనిమనుషులు కూడా తోమడం మానివేశారు. ఇలా ఒక దానికొకటి ఖర్చులు పెరుగుతూ నెలసరి ఖర్చుల బడ్జెట్‌ని మించిపోవడంతో సామాన్యులు, మధ్యతరగతి వారు చాలా అవస్థపడుతున్నారు.

పిండిని బట్టి రొట్టె అన్నట్లు ఆదాయాన్ని బట్టి ఖర్చులు పెట్టాలి. కుటుంబంలో ఒక్కరివలన సాధ్యంకాదు. భార్య, భర్త ఒక మాటమీద నిలబడి నెలజీతం రాగానే ఆ నెలలో కొన్ని ఖర్చులు, నెలసరకులకు, ఇంటి అద్దె, బియ్యం, కరెంట్, టెలిఫోను బిల్లు అన్నీ లెక్కవేసి తప్పనిసరిగా వాటికి ముందు బడ్జెట్ కేటాయించి ఏ ఏ ఖర్చులు ఆ నెలలో తగ్గించుకోవచ్చో ప్లాను వేసుకోవాలి. ఒక్కొక్కసారి పండగలు, పిల్లల స్కూలు, కాలేజీ ఫీజులు వగైరాలు కూడా వుంటాయి. కాబట్టి దానికి తగ్గట్టు ప్లాను చేసుకోవాలి.

ఎదిగిన పిల్లలుంటే వారికి కూడా ఆదాయం వివరాలు తెలియజేసి చక్కగా ప్లాను చేయాలి. పై సంపాదన కోసం ప్రయత్నిస్తే ఏదో ఒక రోజు పరితపించ వలసి వస్తుంది. ఈ మధ్య మాకు తెలిసిన వాళ్ళమ్మాయి కొత్తగా కాలేజీలో చేరింది. ఆ అమ్మాయి వాళ్ళ నాన్నని మోపెడ్‌కొనమని అడిగింది. కాలేజీ దగ్గరే కదమ్మా మోపెడ్ ఎందుకు దండగమ్మా అని అంటే ఆ అమ్మాయి మీరు అన్నింటికి అలాగే అంటారు. నా ఫ్రెండ్సంతా ఎంచక్కా స్కూటర్లు మీద వస్తున్నారు. నాకు సిగ్గుగా వుంది. పోనీ ఒక సెల్‌ఫోనైనా కొంటారా! అదీ కొనరా అంటూ నిలదీసింది. మేమూ ఆశ్చర్యంతో ఆ అమ్మాయిమాటలకు అవాక్కయేము.

నేడు పిల్లలు చాలా ఫాస్టుగా వున్నారనడానికి, ఖర్చులు ఎలా పెరుగుతున్నాయో తెలుసుకోవడానికి ఈ ఒక్క ఉదాహరణ చాలనుకొంటాను.

(ఆంధ్రభూమి దినపత్రిక - ప్రియదర్శిని - 16-10-2003)

❁ ❁ ❁

ఆరాధ్య దేవతలు !

ఒక ఆదివారం ఏమీ తోచక మా స్నేహితుడు రాజారావు ఇంటికి బయలు దేరాను. వారి గుమ్మంలో కొందరు పిల్లలు అడుతూ కనిపించేరు. నాలుగేళ్ళ నుండి అంతా పదేళ్ళలోపు వయసువారే. వారిని, వారి ఆటలను చూస్తూ నిశ్చేష్టుడనై, కొంతసేపు నిలబడిపోయాను.

ఒకడు నేను చిరంజీవిని అంటూ ఫైట్సు చేస్తున్నాడు. వయసు ఆరేళ్ళ లోపు వుంటుంది. మరొకడు నేను ఎవరనుకొన్నావు. ఎన్.టి.ఆర్.ని ఎగిరి ఫైట్సు చేస్తున్నాడు. ఈ అబ్బాయికి ఆరేడేళ్లుంటాయి. ఇంకొక హీరో అందర్లోకి పెద్దవాడు పదేళ్ళు వుంటాయి. నేను నాగార్జునని అంటూ ఒక ఎనిమిదేళ్ళ వయస్సున్న పిల్లతో డ్యూయెట్ పాడుతూ డాన్సు చేస్తున్నాడు. 'డాన్సుబేబీ డాన్సు' ప్రోగ్రాములు చూస్తున్నట్లు న్నారు. స్టెప్పులు బాగానే వేస్తూ, సినిమా హీరో హీరోయిన్లలా హత్తుకుపోతూ తన్మయ త్వంగా డాన్సుచేస్తున్నారు. వారిని ఏమనాలో తెలియక మా ఫ్రెండు వస్తే లోపలికి నడిచేను.

ఒక్కసారి నా బాల్యం గుర్తుకు వచ్చి, గతంలోకి పయనించేను. అయిదారేళ్ళ వయసంటే ఆ కాలంలో ఒకటవ తరగతి, రెండవ తరగతి చదివే వయసు, సినిమాల గురించి బొత్తిగా తెలియదు. ఊళ్ళో రెండు సినిమా థియేటర్లు, వున్నా పెద్దవాళ్ళే సంవత్సరానికి ఒకటో, రెండో సినిమాలు చూసేవార. వారు తీసుకు వెళితే వారి వెనక సినిమాకి వెళ్ళి చూసేవాళ్ళం. అందుచేత సినిమా పరిజ్ఞానం తక్కువగానే ఉండేది. సినిమా చూసినా, రెండు రోజులలో దాని గురించి మరచిపోయేవాళ్ళం.

ఇప్పటిలా అప్పుడు బుల్లితెరలు, సినిమా మేగజైన్లు లేవు. న్యూస్ పేపర్లో సినిమాల గురించి అసలు రాసేవారుకాదు. సినిమా రిలీజైతే ఆ రోజు ఆ సినిమా ప్రకటన కనిపించేది. సినిమా ప్రకటనలు చాలా తక్కువగా వుండేవి. పదేళ్ళలోపు ప్లిలలకు పెద్దలు నీతి శతకాలపద్యాలు, ఎక్కాలు చెప్పి వల్లెవేయించేవారు. ఈ కాలపు పిల్లలకు నీతిశతకాలు కానీ, పురాణ గాధలుకానీ, నీతి కథలుకాని చెప్పేవారు లేరు. వారికి పాఠ్యాంశాలలో లేవు. వారికి బాగా తెలిసినది అర్థమవుతున్నది నేడు సినీజగత్తే! ఎందుకంటే పేపర్లలో ప్రకటనలు, టీవీలలో ప్రకటనలు, టీవి ఆన్‌చేస్తే వచ్చేవి సినిమాపాటలు, సినిమాలే కాబట్టి నేటితరం పిల్లలకు అవే బాగా ఒంటపడుతున్నాయి. సినిమా హీరోలు, హీరోయిన్లనే వారు ఆరాధ్య దేవతలుగా పూజిస్తున్నారు. పది, పన్నెండేళ్ళ వయసు వచ్చేసరికి ప్రతీవారికి అభిమాన నటి, అభిమాన నటుడు ఉంటున్నారు. స్త్రీ, పురుష బేధంలేకుండా ఆడపిల్లలు, మగపిల్లలు సినిమాహీరో, హీరోయిన్ల ఫోటోకార్డులు, గ్రీటింగ్ కార్డులు వారి బొమ్మలున్నవే కొనుక్కుని ఆరాధిస్తు న్నారు. ఒకసారి ఒక నోటుపుస్తకం కొందామని ఒక పుస్తకాల షాపుకి వెళితే అతను సినిమా నటులు అట్టలున్న పుస్తకాలు యిస్తూ వుంటే ఆ ముఖాలులేనిది ఏమైనా ఇమ్మంటే షాపు యజమాని నవ్వి, ఈ రోజు మార్కెట్లో సినిమావాళ్ళ బొమ్మలు, క్రికెట్ ఆటగాళ్ళ బొమ్మలు వున్న పుస్తకాలు తప్పిస్తే వేరే అట్టవున్న పుస్తకాలు స్టూడెంట్స్ కొనరని చెప్పడంతో ఆశ్చర్యపోవడం నావంతయింది.

ఈనాడు సినిమా రిలీజు అయినరోజున అభిమానులు చేసే సందడి, హడావడి చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. ప్రాణాలకు తెగించి కటౌట్లు, బేనర్లు కట్టి పూలదండలు వేసి మురిసిపోతూ వుంటారు. వందలరూపాయలు తగలేసి బ్లాకులో టిక్కెట్లు కొని ఫస్టు షో చూస్తారు. టిక్కెట్లు కొనడానికి దొమ్మిలో ప్రాణాలు పోయినా లెక్కచేయరు. వీరి పిచ్చిచూసి ఈ రోజు 30 రోజుల పండుగలు, 50రోజుల పండుగలు, 75 రోజుల పండుగలు, 100రోజుల పండుగలు ప్రతి సినిమాకి జరిపిస్తున్నారు. సినిమా మొదటిరోజు షూటింగ్ సంబరం, ఆడియో క్యాసెట్టు విడుదల సంబరం అని కూడా బ్రహ్మాండంగా డబ్బుఖర్చుపెట్టి చేయడం, అభిమానులు లక్షల సంఖ్యలో ప్రాణాన్ని కూడా లెక్క చేయకుండా బస్సుటాపుపైన, లారీలలో, ట్రాక్టర్లలో, రైళ్ళల్లో వేలబడి వేలం వెర్రిగా అమూల్యమైన కాలాన్ని వృధా చేసుకొని విద్యార్థులు, పనులు మానుకొని వెళ్ళే రోజువారి కూలీ జనం, తెలియకుండా ఎంతో నష్టపోతున్నారు. కొందరు ప్రాణాలు పోతున్నా లెక్కచేడయం లేదు. సినీహీరో హీరోయిన్లు సంపాదిం చుకో గలిగినంత డబ్బు (నాలుగుతరాలకు సరిపోయేటట్లు) సంపాదించుకుని, వారి ఆస్తిని, డబ్బుని సురక్షితంగా కాపాడుకోడానికి ఇంకా నాలుగింతలు చేసుకోవడానికి రాజకీయ నాయకులుగా అవతరిస్తున్నారు. జనం వేలంవెర్రి చూసి రకరకాల

పండుగలు, వేడుకలు జరుపుకొని వారి ప్రాధాన్యత పెంచుకొంటున్నారు. ఏమీ తెలియని అమాయక పసిపిల్లలు, మొగ్గలుగానే వాడిపోతున్నారు. ఈ తరంవారికి ఆరాధ్య దేవతలుగా సినీ అగ్రనాయికా నాయకులే కనిపిస్తున్నారు. వారికీ బతికి ఉండగానే గుడులు, గోపురాలుకట్టి ఆరాధిస్తున్నారంటేపిచ్చి ఎంత ముదిరిందో పెద్దలు ఆలోచించాలి.

(ఆంధ్రభూమి దినపత్రిక - ప్రియదర్శిని - 2007)

❁ ❁ ❁

అమ్మ

నన్ను అర్జంటుగా వెంటనే బయలుదేరి రమ్మనమని మా డాక్టరు తమ్ముడు ఫోను చేశాడు. విషయమేమిటని తరచి అడిగితే అమ్మ కండిషన్ క్రిటికల్‌గా వుందని, వదిన పిల్లల్ని, కూడా వెంట తీసుకొని బయలుదేరి రమ్మనమని చెప్పాడు. నేను ఆఫీసు నుండి ఇంటికి వచ్చి గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో వెంటనే హైద్రాబాదు బయలు దేరాను. నా మనసంతా అమ్మ జ్ఞాపకాలతో నిండిపోయింది.

నేను సెవెంతుక్లాసు చదువుకొనే రోజులలో నాకు లెక్కలు, ఇంగ్లీషు పేపర్లలో బాగా మార్కులు తక్కువ వచ్చాయని కోపంతో ఆ రోజు మా నాన్నగారు నన్ను బాగా చితగబాదేరు. గదిలో ఒకమూల వెక్కివెక్కి ఏడుస్తూ కూర్చున్న నన్ను చూసి మా అమ్మగారు ఒడిలో చేర్చుకొని తల నిమురుతూ ఓదార్చారు. మా నాన్నగారంటే మా అమ్మగారికి భయమే! అందుకే మా అమ్మగారు ఆయన బయటకు వెళ్ళిన తరు వాత నా దగ్గరకు వచ్చి నన్ను సముదాయించి, తెలియని సబ్జెక్టులు మా బాబాయిల నడిగి తెలుసుకోమని బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోమని ప్రేమతో సలహా ఇచ్చారు.

నేను వెక్కి వెక్కి ఏడుస్తూ నాన్నగారికి నేనంటే ఇష్టంలేదు. అన్నింటికీ ఇలాగే కొడుతూ వుంటారు. నేను అమ్మమ్మ గారింటికి వెళ్ళిపోతానని చెప్పి ఏడ్చాను. మా అమ్మగారు నాకంటి నీరుతుడిచి, నుదిటిపై ముద్దాడి, మీ నాన్నగారికి అందరి కన్నా నువ్వంటేనే ఎక్కువ ఇష్టం. నువ్వు బాగా చదువుకోవాలని మంచి పేరు తెచ్చు కొని, పెద్ద ఉద్యోగం చేయాలని ఆయన కోరిక. మంచి మార్కులు తెచ్చుకొని బాగా చదివితే నువ్వు గొప్ప ఇంజనీరువో, డాక్టరువో, కలక్టరువో అవుతావని నాన్న గారు ఆశపడ్తున్నారు. మరేమీ ఆలోచనలు పెట్టుకోకుండా బుద్ధిగా చదువుకో. ఈ పది పైసలు తీసుకొని చాక్లెట్ కొనుక్కోమని చెప్పి బుజ్జగించి బయటకు పంపించింది.

అమ్మ చూపే ఆదరణ, అభిమానము, అనురాగము, ప్రేమతో పెరిగి చదువు కొని ఈనాడు ప్రయోజకుడనయ్యాను. అవి కాలేజీలో చదువుకొనే రోజులు. సెలవు

లకు ఎప్పుడింటికి వచ్చినా, ఒంట్లో ఓపికలేక పోయినా అమ్మ ఎన్నో రకాల పిండి వంటలు, నాకిష్టమైన కూరలుచేసి కొసరి కొసరి తినిపించేది. ఆ రోజులలో గ్యాస్ పొయ్యి కిరోసిన్ స్టౌలు వుండేవికావు. అయినా కట్టెల పొయ్యిమీదే ఎన్నోరకాలుచేసి పెట్టేది. తల్లి ప్రేమకి నిర్వచనం ఎవ్వరూ చెప్పలేరు.

ఆ రోజులలో నాలో ఇన్‌ఫీరియారిటి కాంప్లెక్సు ఎక్కువగా ఉండేది. నేను నల్లగా వుంటానని అందంగా వుండనని ఫీలింగ్ నాలో ఎక్కువగా వుండేది. నేను దురదృష్టవంతుణ్ణని నాలో నేను పదే పదే అనుకొంటూ వుండేవాణ్ణి. చదువులో ఆటల్లో ప్రజ్ఞ అసలు లేదు. నా తమ్ముళ్ళు చెల్లి నాకంటే బాగా చదివి మార్కులు తెచ్చుకొనే వారు. తెల్లగా అందంగా వుండి బాగుండేవారు.

ఒకసారి వేసవి సెలవులలో మా ఊరు వెళ్ళేను. ఏదో మాటల సందర్భంలో భగవంతుడు ఎందుకో నాకు అన్నీ తక్కువే చేశాడు. తెలివి తేటలు పెద్దగా ఇవ్వక పోయినా అందంగానైనా పుట్టించలేదు. ఇంట్లో ఎవరికీ లేని నలుపురంగు నాకు వచ్చింది. అని బాధపడ్తూ మా అమ్మగారితో అన్నాను.

మా అమ్మగారు నా మాటలు విని ఒక్కసారి నివ్వెరపోయి, అదేం అలా అంటున్నావు. నల్లగా వున్నా అందరికన్నా నువ్వే బాగుంటావు. మన పక్కింటి పిన్ని గారు మాటల్లో మీ పిల్లలందరిలో పెద్దబ్బాయే నల్లగా వున్నా అందంగా వుంటాడని ముఖంలో మంచి కళ వుందని, బాగుంటావని అన్నారు తెలుసా? అన్నారు. నా ముఖంలోకి నవ్వుతూ నావైపు చూశారు. ఆ మాటలు విన్న నాకు వేయి ఏనుగులు బలం వచ్చింది. ఉబ్బి తబ్బిబ్బయ్యాను.

'అమ్మా! నీ మాటలు నిజమేనా ! అని అడిగాను. మా అమ్మగారు నవ్వి, నిజమేరా! నీతో అబద్దం ఆడవలసిన అవసరం నాకేముంది' అన్నారు.నా మనసు ఆనందంతో ఉప్పొంగిపోయింది. తరువాత మరొకసారి సెలవులలో మా పెద్ద మామయ్య గారింటికి వెళ్ళాను. మా మామయ్య కూతురు రమణికూడా నా ముఖం చూసి, నల్లగా వున్నా నీముఖంలో మంచి కళవుంది. బావా! మీ ఇంట్లో అందరికన్నా నువ్వే బాగుంటావు అంది నాకు అన్నం వడ్డిస్తూ.

ఆ మాటలతో నా ముఖంలో వెయ్యి ట్యూబులైట్ల కాంతి వెలిగింది. అప్పటి నుండి నేనూ అందగాణ్ణే అని తలపోస్తూ ధైర్యంగా అప్పుడప్పుడు అమ్మాయిలతో మాట్లాడుతూ వుండేవాణ్ణి.

ఇంకొకసారి వేసవి శలవులకు మా ఊరు వెళ్ళాను. మాటల సందర్భంలో మా అమ్మగారు, పక్కింటి పిన్నిగారి కూతురుకి మూడు నెలల క్రిందటే పెళ్ళి అయినట్లు వాళ్ళల్లుడు జీపుయాక్సిడెంటులో మరణించినట్లు చెప్పారు. నాకు చాలా జాలికలిగింది.

ఎంతో బాధపడ్డాను. తరువాత నేను ఆ అమ్మాయిని చూశాను. ఆ అమ్మాయికి పద్దెనిమిది ఏళ్ళు వుంటాయి. కుందనపు బొమ్మలా చూడడానికి చక్కగా వుంది. ఆ అమ్మాయి ఇంటర్మీడియట్ చదువుతూ వుంటే,మంచి సంబంధం వచ్చిందని అబ్బాయి ఇంజనీరని పెళ్ళిచేశారట. కానీ ఆమె కాళ్ళపసుపు పారాణి ఆరక ముందే అతను కన్నుమూశాడు.

నా చిన్నతనం నుండి నాది ఎంతో జాలి మనసు. సినిమాలలో ఏమాత్రం దుఃఖం వచ్చే సీను కనిపించినా, ఎవరైనా కష్టాలతో బాధపడ్తున్నా ముందు నేను వెక్కి వెక్కి ఏడ్చేవాణ్ణి. ఎందుకో ఆ యంగ్ విడోమీద నాకు అత్యంత జాలికలిగింది. బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను. ఆ విషయమే మెల్లగా మా అమ్మగారికి తెలియజేశాను. నాకు ఎవరైనా కష్టాలలో వున్న అమ్మాయిని ఆదర్శ వివాహము చేసుకోవాలని వుంది. మన పక్కింటి వాళ్ళమ్మాయి సుధని మళ్ళీ నేను పెళ్ళిచేసుకొని వితంతువుగా మోడువారిన ఆమె జీవితానికి వసంతాన్ని చేకూర్చాలని వుందని, ఆమె తల్లిదండ్రుల వ్యథ పోగొట్టి ఆమె జీవితానికి వెలుగు చూపించాలను కొంటున్నా నని చెప్పాను.

మా అమ్మగారు ఆశ్చర్యంతో నన్నుజూచి అవాక్కయ్యారు. కొంతసేపటికి తేరుకొని, నీకు అంత ఆదర్శవివాహమే చేసుకోవాలనుకొంటే, కష్టాలలో మ్రగ్గుతున్న మన వేణు మామయ్య కూతురినే పెళ్ళి చేసుకోవచ్చు కదా ! అని అనడంతో ఒక్కసారి నివ్వెరపోయాను. నా మాటలకు నాకే సిగ్గు వేసింది. ఇంకా అప్పటికి నా చదువు పూర్తి కాలేదు. ఉద్యోగం సద్యోగం లేదు. ఇంటికి పెద్ద కొడుకుగా నాకు చాలా బాధ్యతలున్నాయి. అన్నీ మరచి అమ్మతో పెళ్ళి ప్రస్తావన తెచ్చాను. అని అనుకొంటూ ఆలోచనలో పడ్డాను.

పిచ్చి పిచ్చి ఆలోచనలకి ముందు స్వస్తి చెప్పి బుద్ధిగా చదివి, చదువుతున్న చదువేదో పూర్తిచేయి. ఆ తరువాత పెళ్ళిగురించి ఆలోచిద్దువుగాని అంటూ సుతి మెత్తగా మా అమ్మగారు నన్ను మందలించారు. సిగ్గుతో కుంచించుకుపోయి అక్కడ నుండి బయటకు వెళ్ళిపోయాను. మరల అమ్మతో పెళ్ళి ప్రస్తావనతేలేదు. తరువాత అతి కష్టంమీద పోటిటెక్నిక్ చదువు పూర్తిచేసి కాలేజీ చదువు నుండి బయటపడ్డాను. అదృష్టం రావడం వలన చదువు పూర్తికాగానే విశాఖపట్నం ఫోర్టులో నాకు ఉద్యోగం వచ్చింది. వెంటనే ఉద్యోగంలో చేరాను. నాన్నగారి ప్రోద్బలంతో ఏ.ఎం.ఐ.ఇ. పరీక్షకి కట్టి తరువాత అది కూడా పాసయ్యాను.

అమ్మ సలహాతో వేడి నీళ్ళకు చన్నీళ్ళు తోడుగా నాన్నగారికి అన్నివిధాల అండగా నిలచి తమ్ముళ్ళ చదువులకు ఇతోధికంగా సాయం చేశాను.

మా అమ్మగారు బడిలో చదివిన చదువు తక్కువేకాని ఆమెకు అమోఘమైన తెలివి తేటలు. సమయస్ఫూర్తి వుండేది. మంచి మంచి సామెతలు అప్పుడప్పుడు చెబుతూ మమ్మల్ని ఆశ్చర్య చకితులు చేసేది. మొదటి నుంచి నాకు అమ్మే గురువు. దైవం, అమ్మతో చెప్పకుండా ఏ పని చేసేవాణ్ణి కాదు. మొదటి నుంచి నాన్నగారంటే భయం వుండడం వలన అన్ని విషయాలు అమ్మకే చెప్పేవాణ్ణి. మా అమ్మకూడా చక్కని సలహాలిస్తూ నేను ఉన్నతుణ్ణి కావడానికి పెద్దల దగ్గర మెప్పుపొందడానికి వినయవిధేయతలు నేర్పారు. బాల్యములోనే ఆధ్యాత్మిక చింతన అలవాటుచేసి క్రమ శిక్షణతో మంచి అలవాట్లు నేర్పించారు.

ఒకసారి మా చెల్లి మా అమ్మను ఎదిరించి మాట్లాడిందని, నాకు కోపమువచ్చి ఆమెను గట్టిగా మందలించి తిట్టాను. మా చెల్లి నన్ను అనరాని మాటలు అని తనని కొట్టడానికి తిట్టడానికి నాకు హక్కులేదంది. ఆ రోజు నేనెంతో బాధపడి ఏడ్చాను. మా చెల్లి అందరికన్నా చిన్నది. ఎంతో గారాబంగా పెరిగింది. నాకు మా చెల్లంటే ఎంతో ప్రేమ, ముద్దు. ఆమె చిన్నతనంలో ఎక్కువమోసి ఎత్తుకొని ఆడించింది నేనే! తరువాత ఉద్యోగంలో చేరాక కూడా చెల్లికోసం ఆమె అడిగిన వస్తువులన్నీ తెచ్చి ఇచ్చేవాణ్ణి. మా అమ్మగారు, నాన్నగారు కూడా అంతగారాబం చేయవద్దని నన్ను అంటూ వుండేవారు. అంత ప్రేమగా మురిపెముగ చూసుకొన్న నా చెల్లి నన్ను అన్ని మాటలనేసరికి నా మనసు గాయమయింది. ఎంతో అవమానముతో కృంగిపోయాను. మా చెల్లితో మాట్లాడ్డం మానివేసేను. ఇంట్లో మిగతా వారితో కూడా ముభావంగా వుండడం మొదలెట్టేను. మా అమ్మగారు నా ప్రవర్తన కనిపెట్టి, ఒకరోజురాత్రి నేను ఒంటరిగా వుండడం చూసి, ఆమె నా దగ్గరికి వచ్చి, నాచేతులు పట్టుకొని, ఇంటికి పెద్దవాడివి, అందరకు చెప్పవలసిన వాడవు నువ్వు. ఇలా కోప గించుకోవడం తగదు. తమ్ముళ్ళు తప్పుచేసినా, చెల్లి తప్పుచేసినా దయతో నువ్వు వారిని క్షమించాలి. వారిపై కోపగించుకొని పంతాలు, పట్టింపులు నీ బోటివాడికి తగవు. చెల్లి అన్నమాటలకు నువ్వు బాధపడి దానిపై కోపగించుకొని మాట్లాడడం మానివేశావు. నీ ప్రర్తన నాకు బాధకలిగిస్తోంది. నువ్వు దానితో మాట్లాడి పూర్వమువలె ప్రేమగా తోడుంటానని నాకు ముందు మాట ఇవ్వు అంటూ ఆమె నాచేతఒట్టు వేయించుకొన్నారు. మా అమ్మ సహనశాలి. దయామయి. అమ్మ ప్రేమ అందరికీ కావాలి. అమ్మ మాట జవదాటని నేను మా చెల్లిని అక్కున చేర్చుకొని తరువాత అమ్మ మాటను అక్షరాలా పాటించాను.

నాకు ఇరవై ఏడేళ్ళు నిండేయి. మా అమ్మగారికి నాకు పెళ్ళిచేసి కోడలుని తెచ్చుకోవాలని తాపత్రయం పెరిగింది. మా నాన్నగారికి ఇక రెండేళ్ళు మాత్రమే

సర్వీసువుంది. అప్పటికే ఆడపిల్లలు గల తండ్రులు మా ఇంటి చుట్టూ తిరుగుతూ వాళ్ళమ్మాయిని మా ఇంటికోడలు చేసుకోమని సంబంధాలు చెప్తున్నారు. మా వేణు మామయ్య కూడా ఆమధ్యవచ్చి వాళ్ళమ్మాయిని కోడలుగా చేసుకోమని చెప్పి వెళ్ళేడుట. మా అమ్మగారికి మా మామయ్య కూతురు లక్ష్మి అంటే ప్రాణమని ఇష్టమని నాకు తెలుసు. వాళ్ళు ఆర్థికంగా ఇబ్బందులలో వున్నారు. వాళ్ళమ్మాయిని పెళ్ళిచేసుకుంటే అమ్మ సంతోషిస్తుంది. దానికి తోడు వారికి సహాయం చేసినట్లు వుంటుంది. నేనూ ఆదర్శంగా కట్నం లేకుండా పెళ్ళి చేసుకోవాలనుకొన్న నా కోరిక నెరవేరుతుందని అనుకొన్నాను.

ఈమాటే మా నాన్నగారికి పెళ్ళిప్రస్తావన వచ్చినపుడు చెప్పాను. ఆయన కొంతసేపు మౌనంగా వూరుకొని, అన్నీ ఆలోచించే చెప్తున్నావా అన్నారు.నేను కొంతసేపు ఆలోచనలో మునిగి మరల తేరుకొని, వాళ్ళమ్మాయిని పెళ్ళిచేసుకొంటే వారికి సహాయం చేసిన వారమవుతామని, ముఖ్యంగా అందరూ మెచ్చుకొంటారని అన్నాను మెల్లగా నీళ్ళు నములుతూ.

నీ ఉద్దేశ్యం బాగానే వుంది. అంతా మెచ్చుకుంటారు. కొంచెం మన పరిస్థితి కూడా ఆలోచించు. ఇంకా మీతమ్ముళ్ళు చదువులు పూర్తి కాలేదు. చెల్లెలు పెళ్ళి చేయాలి. ఇప్పటివరకు మనకంటూ ఒక స్వంత ఇల్లులేదు. మనం ఒక గూడు ఏర్పరచుకోవాలి. నువ్వనుకొన్నట్లు మీ మామయ్య కూతుర్నే పెళ్ళిచేసుకొంటే, వారి స్థితి గతులు బాగులేనందున వారి కష్టాలు చూడలేక, ఇక్కడ నీ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించలేక మధ్య అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోతావు. బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి రా! తొందరలేదు అని చెప్పి నాన్నగారు అక్కడ నుండి నిష్క్రమించారు.

నేనూ తీవ్రంగా ఆలోచించాను. మా న్నాగారు చెప్పింది సబబుగానే తోచింది. మా అమ్మగారు నా మనసు గ్రహించారు. బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి రమ్మన మని ఇది జీవితసమస్యని తొందరపడి ఒకనిర్ణయానికిరావద్దని మా అమ్మగారు హెచ్చరించారు.

నాలుగు నెలలు తీవ్రంగా నాపెళ్ళి గురించి,ఆలోచించాను. తమ్ముళ్ళ చదువులు, చెల్లెలి పెళ్ళి నా ముందు గోచరమయ్యేయి.నాన్నగారిది గుమాస్తా ఉద్యోగం అవడం వలన రిటైరయ్యాక ఎక్కువ డబ్బులు రావని తెలిసేక, నాన్నగారు చెప్పినట్లు కొత్త సంబంధం చేసుకోవడమే ప్రస్తుత పరిస్థితులలో మేలనిపించింది. వెంటనే నాన్నగారికి, మీ ఇష్టప్రకారమే మీకు నచ్చి సంబంధం ఏదైనావుంటే వెంటనే రాయండి. పెళ్ళి చూపులకి వస్తానని ఉత్తరంరాసి పడేశాను.

తరువాత పెళ్ళిచూపులు చూడడం, నిర్మలతో నా పెళ్ళి జరగడం అన్నీ సినిమాలో సన్నివేశాలులా జరిగిపోయాయి. మా అమ్మగారు పెళ్ళయిన కొత్తలో

కొన్నాళ్ళు మనసులో బాధపడినా వచ్చిన కోడలు నచ్చడం వలన,అన్ని విధాలా మా అమ్మగారికి చేదోడు, వాదోడుగా వుండడంతో, ఆమెను మురిపించడంతో ఆమె సంతోషించారు. నేనూ చాలా ఆనందించాను. ఇంటికిపెద్ద కోడలుగా వచ్చినందులకు ఆమె నాకు అన్ని విధాలా చేదోడు వాదోడుగా వుండడం వలన నా బాధ్యతలు చక్కగా నిర్వర్తించ కలిగాను. నా జీవితం సఫలమైనట్లు ఫీలయ్యాను. మా అమ్మగారు చాలా ఆనందించారు.

భగవంతుని దయవలన తమ్ముళ్ళంతా బాగా చదువుకొని వృద్ధిలోకి వచ్చారు. చెల్లిలికి మంచి సంబంధం చేసి అత్తగారింటికి పంపించాము. నాన్నగారు రిటైరయ్యాక అన్ని విధాలా సదుపాయంగా వుంటుందని వైద్య సహకారం వుంటుందని ఎక్కువగా మా డాక్టరు తమ్ముడు వాళ్ళింట్లోనే వుండేవారు. మా అమ్మగారు మాత్రం అప్పుడప్పుడు అందరిళ్ళకి వచ్చి కొన్నాళ్ళువుండి మనమలు, మనమరాళ్ళతో కాలక్షేపం చేసేవారు.

కాలచక్రం గిర్రున తిరుగుతోంది. అమ్మకి అనారోగ్యంగా వుందంటే హైద్రాబాదు వెళ్ళిచూసి వచ్చాను. అమ్మబాగా నీర్సంగా కనిపించింది. మా డాక్టరు తమ్ముడు దగ్గర వుండి అన్నిరకాల పరీక్షలు జరిపించాడు. చివరకు అమ్మకు లివరు వ్యాధిగా గుర్తించారు. వైజ్ఞానిక రంగంలో ఎంత ప్రగతిసాధించినా ఇంకా కొన్ని రకాల రోగాలకు సరియైన మందులు కనిపెట్టలేదని, అటువంటి రోగాలువస్తే కొన్ని నెలలు మాత్రమే జీవిస్తారని, ఆ రోగానికి తగిన మందు లేదని, భగవంతుడే ఆమెను కాపాడాలని డాక్టర్లన్నారు. మా అమ్మగారి ఆరోగ్యం కుదుటపడాలని మేమంతా భగవంతుని ప్రార్థించాము. భగవంతుడు మా మొర ఆలకించి ఆమెకు మరో నాలుగు సంవత్సరాలు ఆయుర్దాయాన్ని ప్రసాదించాడు.

మా డాక్టరు తమ్ముడు, మా అమ్మగారికి వైద్యం చేసే స్పెషలిస్టులు కూడా మా అమ్మగారి పరిస్థితి చూసి ఆశ్చర్యపోయారు.

ఒక్కొక్కసారి మనకి తెలియని, కనిపించని దివ్యశక్తి ఏదో వెనుకవుండి ఇటువంటి చిత్ర విచిత్రాలుచేస్తూ వుంటుంది. భగవంతుడు మా యందు దయవుంచి చల్లగాచూడబట్టే మాఅమ్మగారు జీవించేరని మా మొర ఆలకించాడని మా నమ్మకము.

ఎవరైనా ఉన్నతులుగా, రాణించడానికి బాల్యములోతల్లి, వయసులో వుండగా తండ్రి, వివాహమయ్యాక భార్య వెనక వుండి కృషిచేస్తారని చెప్తారు. నూటికి నూరుపాళ్ళు ఇది సత్యం తల్లి, బిడ్డకు ఉగ్గుపాలు పడుతున్న దగ్గర నుండి పాలనా చూస్తూ, మలమూత్రాలు ఎత్తి శుభ్రపరుస్తూ చిన్న జలుబు చేసినా కంగారుపడి అహర్నిశలు సేవలుచేసి అడుగడుగునా పిల్లల శ్రేయస్సు కాంక్షిస్తూ వారిని ఉన్నతులను చేయాలనే తపనతో జీవితాన్ని ధారపోసి, కొవ్వొత్తిలా కాంతిని వెదజల్లుతూ తాను కరిగిపోతూ వుంటుంది కన్నతల్లి. ప్రపంచములో ఎవరి ఋణమైనా తీర్చుకోవచ్చు కాని తల్లి ఋణము తీర్చుకోలేరు. అందుకే తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలని చెప్తారు.

అమ్మమాటలో తీయదనం, అలుపెరుగక ఆమె వంట ఇంట్లో పిల్లలకోసం చేసే వంటకాలు, సరిగా తినకపోతే కొసరి కొసరి బ్రతిమాలి కడుపునిండా తినిపించడం, తనకి ఒంట్లో బాగులేకపోయినా, అనారోగ్యంతో సతమతమవుతున్నా బయటకి చెప్పకుండా పిల్లల అభివృద్ధిని కాంక్షిస్తూ పిల్లలకి సేవ చేయడం ఒక్కమాతృమూర్తికే చెల్లుతుంది. త్యాగ గుణం ఒక్క అమ్మకే వుంటుంది. ప్రీతితో చేయించుకున్న నగలు మా చదువులకోసం ఒకొక్కటీ హారతి కర్పూరంలా హరించినా ఆమెముఖంలో ఎన్నడూ బాధ కనిపించలేదు. నాకు చిన్నదెబ్బ తగిలిందని తెలిస్తే పరుగెత్తుకొని వచ్చేది అమ్మ. వయసు మళ్ళినా ఇంటికివెళ్తే పెద్దబ్బాయికి ఇది ఇష్టమని, అది ఇష్టమనిచెప్పి ఓపిక లేకపోయినా లేని ఓపిక తెచ్చుకొని ఇంట్లో మరదళ్ళ సాయంతో వండి వడ్డించి పెట్టేది అమ్మ. శాంతమూర్తి అమ్మ. దయాశాలి అమ్మ. త్యాగమూర్తి అమ్మ అటువంటి అమ్మ మా నుండి దూరమవుతుందంటే భయంగా వుంది. ఫోన్‌లో సరిగానే విన్నాను. అమ్మకండిషన్ క్రిటికల్‌గా వుందని, వెంటనే బయలుదేరి రమ్మన మని చెప్పాడు. మా అమ్మగారు ఇంకా కొన్నాళ్ళు బ్రతికి వుంటే బాగుండుననిపిం చింది. భగవంతుని అదే కోరుకున్నాను. మా అమ్మ తప్పక బ్రతికి వుంటుందనే ఆశతోనే గోదావరి ఎక్‌ప్రెస్ నుండి దిగి ఆటోలో ఇంటికివెళ్ళాను.

వీధి గుమ్మంలోనే పరిస్థితి అర్థమైంది. ఇంటిచుట్టూ, ఇంటిముందు బంధువులతో నిండివుండడంతో అనుమానంతోనే గుమ్మంలో అడుగుపెట్టాను. అమ్మ శవాన్ని పెట్టుకొని అంతా రోదిస్తూ నా రాకకోసం నిరీక్షస్తున్నారు. ఒక్కసారి ఆదృశ్యాన్ని చూసి కట్టుఉ తెగి వచ్చిన దుఃఖముతో 'అమ్మా! అంటూ ఆమె పాదములపై పడి ఎంతో విలపించాను. ఎంత విలపించినా అమ్మ మరి తిరిగి రాదుకదా!

"అమ్మ మాట వినుము అన్నివేళలయందు జయము నీకు కలుగు శంక వలదు
అమ్మ మాట నమ్మి ఔన్నత్య మందితి అనుభవమ్ముతోడ అందు దీని."

(మాఅమ్మ రాజేశ్వరిగారి పాదపద్మములకు ఈ కథ అంకితం.)

(ప్రియదత్త సకుటుంబసచిత్రవారపత్రిక - 29-05-2002)

❀ ❀ ❀

హేట్సాఫ్ టు శ్రీమతి

'కార్యేషు మంత్రి, భోజ్యేషు మాతా, శయనేషు రంభ, క్షమయా ధరిత్రి'..అని భార్య గుణగణాలు ఎలా వుండాలో మన పూర్వీకులు నిర్వచించారు. జీవితంలో చక్కని అనుకూలవతియైన భార్యను పొందడం కూడా అదృష్టంగానే చెప్పాలి. 'మేరేజస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్' అని పెద్దలు ఎప్పుడో చెప్పారు. మనగవారు మంచి భార్య కావాలని ఎలా ఆశిస్తారో, ఆడవారు కూడా మంచి భర్త లభించాలని, అతను ధనవంతుడు, గుణవంతుడు కావాలని అభిలషిస్తారు. కానీ అందరికీ ఇది గగన

కుసుమమే! పుణ్యంకొద్దీ పురుషుడు, దానం కొద్దీ బిడ్డలు అని కూడా మనవాళ్ళు చెప్తుంటారు.

నేను ఈ మధ్య సంక్రాంతి పండుగలకి ఇంటికి వెళ్ళినపుడు మా అమ్మగారు నా పెళ్ళి ప్రస్తావన తెచ్చారు. నాకూ పెళ్ళి చేసుకోవాలని, భార్యతో అచ్చట్లు ముచ్చట్లు తీర్చుకోవాలని కోరిక వుంది. ఆఫీసు నుండి ఇంటికి వస్తే ఏదో వెలితిగా ఫీలవుతున్నాను. ఆఫీసు నుండి అలసివచ్చిన నాకు, ఇంటికి వచ్చేసరికి గుమ్మందగ్గరే చిరునవ్వుతో స్వాగతం పలుకుతూ ఆదరించి, కప్పుకాఫీ అందించి సేద తీర్చే భార్య కావాలని చాలాసార్లు కలలు కన్నాను. కానీ నాకు వున్న బాధ్యతలు పెళ్ళి తలంపును కొన్నాళ్ళు దూరంగా వుంచేయి. ఇంజనీరింగు, మెడిసన్ చదువుతున్న తమ్ముళ్ళిద్దరున్నారు. పెళ్ళి చేయవలసిన చెల్లెలు ఒకామెవుంది. నాన్నగారిది గుమాస్తా ఉద్యోగం అవడం వలన ఆయన తమ్ముళ్ళని పెద్దగా చదివించే స్థితిలో లేరు. నేను సాయం చేయకపోతే వారి చదువులు అర్ధాంతరంగా ఆగిపోతాయి. వారిని చదివించి నా కన్నా వారిని ఉన్నతులను చేయాలని నా జీవితాశయం.

నా చిన్నతనంలో చాలామంది పెళ్ళి చేసుకున్నాక భార్యలు సహకరించనందున వేరింటి కాపురాలు పెట్టించడం, ఇంట్లో దేనికో దానికి చీటికి మాటికీ పోట్లాడుకోవడం, ఏవో గొడవలతో వారి కుటుంబాలు అశాంతితో అలమటించడం నా కనులారా చూడడం వలన నాకు వచ్చే భార్య ఎటువంటిది వస్తుందోనని భయంతో పెళ్ళి చేసుకోడానికి సాహసించలేకపోతున్నాను.

నాకు పాతికేళ్ళు నిండేయని, ఇక ఆలస్యం చేయడం తగదని మా అమ్మగారు కొంచెం ఘాటుగా ఉత్తరం రాసేసరికి నాలో వేడి పుట్టింది. వెంటనే మంచి సంబంధం ఏదైనా వుంటే వచ్చి పెళ్ళిచూపులు చూస్తానని మా నాన్నగారికి ఉత్తరం రాసిపడేశాను. వారం రోజుల తరువాత తునిలో ఒక మంచి సంబంధం వుందని వెంటనే పెళ్ళి చూపులకోసం బయలుదేరి రమ్మనమని నాన్నగారు ఉత్తరం రాశారు. నేను, మా అమ్మగారు నాన్నగారు,చెల్లెలితో కలసి తుని వెళ్ళి అమ్మాయిని చూశాము.

అమ్మాయి లక్షణంగా చూడముచ్చటగా వుంది. బి.ఏ. ఫైనల్ ఇయరుచదువుతోంది. తెల్లగా నాజూగ్గా, సన్నగా, పొడుగ్గా, సన్నజాజి తీగెలా ఎంతో అందంగా వుంది. మా వాళ్ళందరికి అమ్మాయిని చూడగానే నచ్చింది. అమ్మాయి పేరు కూడా మృదుమధురంగా 'మంజుల'అని చెప్పారు. పెళ్ళి కూతుర్ని చూసి అంతా రాత్రి టాక్సీలో ఇంటికి తిరిగి వచ్చాము. ఇంట్లో అంతా పెళ్ళి కుదిరినట్లు, ముహూర్తాల గురించి, కట్నకానుకల గురించి ఏవేవో మాట్లాడుకుంటున్నారు. మా చెల్లి నా దగ్గరకివచ్చి అన్నయ్యా మాకు మంచి వదిన దొరికినందుకు ప్రెజెంటేషన్ ఏమిస్తావని

అడిగింది. నేనునవ్వుతూ, నాకు అసలు అమ్మాయినచ్చలేదు. నేను ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకోవడంలేదని చెప్పాను. సీరియస్‌గా అడుగుతున్నాను. జోక్‌చేయకు అంది.

నిజమేనమ్మా! నేనూ సీరియస్‌గా చెప్తున్నాను. ఎందుకో ఆ అమ్మాయి నాకు తగిన భార్యగా అనిపించడంలేదు. అన్నాను. అంతే మా చెల్లి ఒక్కసారి అవాక్కయై మరల తేరుకొని, అమ్మా! అన్నయ్యకి పెళ్ళికూతురు నచ్చలేదుటే అనిగట్టిగా కేక వేసింది. వంటగదిలో నుండి మా అమ్మగారు పరుగెత్తుకొంటూ వచ్చారు. నా ముఖంలోకి ఆశ్చర్యంగా చూస్తూ నిజమే చెప్తున్నావా? అని అడిగారు.

జౌను నిజంగానే చెప్తున్నాను. అమ్మాయి బాగుంది కాని నాకు భార్యగా తగదనిపిస్తోంది. ఆ అమ్మాయి నా పక్కనుంటే కాకి ముక్కుకి దొండపండులా వుం టుంది. అందుకే నాకు ఇష్టంలేదు! అన్నాను. మా అమ్మగారు ఆశ్చర్యంగా నావైపు చూసి, ఎవరైనా అందమైన పెళ్ళాం కావాలని కోరుకుంటారు. కానీ నీ మాటలు విచిత్రంగా వున్నాయి అన్నారు.

ఇంతలో మా నాన్నగారు అక్కడికి వచ్చి, వాడి ఉద్దేశ్యం బహుశా భార్య రూపవతీ, శతృహుః అని ఆలోచించివుంటాడన్నారు. మరల మా నాన్నగారే కల్పించు కొని ఒక రకంగా ఆలోచిస్తే మనం అలాంటి అమ్మాయిని మనింటి కోడలుగా తెచ్చుకున్నా ఆ అమ్మాయి సుఖపడదు ! అన్నారు.

'ఎక్జాట్లీ నాన్నగారూ! నా ఉద్దేశం కూడా అదే! అందుకే ఆ అమ్మాయిని నేను పెళ్ళిచేసుకోవడం లేదని' నిక్కచ్చిగా చెప్పేశాను. ఒక్కసారి ఇంట్లో అందరి ముకాల్లో సంతోషం మాయమై నిశ్శబ్దం చోటు చేసుకుంది.

కాలచక్రం గిర్రున నాలుగు నెలలు తిరిగింది. ఒకరోజు నాన్నగారి నుండి పెళ్ళిచూపులకు రమ్మనమని, మంచి తెలిసిన సంబంధం వచ్చిందని వ్రాశారు. నేను శలవుపెట్టి, ఉద్యోగానికి కొత్తగా ఇంటర్వ్యూకి వెళ్తున్నట్లు ఒకరకమైన పిరికి తనంతో పెళ్ళి చూపులకు బయలుదేరాను. ఈ సారి నా వెంట అమ్మ, నాన్నగారు పెళ్ళిచూపులకు శ్రీకాకుళం వచ్చారు. మా చెల్లికి పరీక్షలవడం వలన మా వెంట ఆమె రాలేదు.

మేము అమ్మాయి వాళ్ళింటికి వెళ్లగానే వారు సాదరంగా ఆదరించి మర్యాద చేశారు. కాఫీ, పలహారాలు పూర్తయ్యేక అమ్మాయిని తీసుకువచ్చి చూపించారు. పెళ్ళికూతురు చామనఛాయ రంగులో చిరునవ్వు ముఖం, సోగకళ్ళతో నాకళ్ళకు అందంగా కన్పించింది. "తావలచినది రంభ, తామునిగింది గంగ" అని మనవాళ్ళు ఊరకే అనలేదు. అమ్మాయి చదువు కూడా నా కోరిక కనుగుణంగా టెన్త్‌క్లాసు వరకే చదివింది. మా అమ్మగారు అడిగిన ప్రశ్నలకు చక్కగా సమాధానం చెప్పింది.

పాట పాడమంటే, తీయని కంఠంతో సీతమ్మ మాయమ్మ, శ్రీరాముడు మాకు తండ్రి అని మృదుమధుర స్వరంతో ఆలపించింది.

ఎందుకో మా తొలిచూపులలోనే ఆమె నాకు తగినభార్య అనిపించింది. ఇంటికి చేరగానే, అమ్మాయి నచ్చిందని, మిగతా విషయాలు మీరు చూసుకోమని చెప్పి ఆ రాత్రే విజయవాడ తిరిగి వచ్చాను

ఒక్కొక్కసారి పెళ్ళి గురించి ఆలోచిస్తే ఎంతో సంభ్రమాశ్చర్యాలు కలుగుతాయి. ఒక ఇంట్లో ఒకరకమైన వాతావరణంలో సుమారు ఇరవై సంవత్సరములు పెరిగిన అమ్మాయి, ముక్కు ముఖం తెలియిన వ్యక్తితో పెద్దల ఆశీర్వచనాలతో మూడు ముళ్ళు పడగానే, కన్నవారిని, పుట్టి పెరిగిన ఊరిని వదలి వచ్చి కొత్త ఊళ్ళో, కొత్త మనుషుల మధ్య, కొత్త వాతావరణంలో భర్తతో అతనే సర్వస్వమని నమ్మి అతనితో కాపురం చేస్తుంది. అనతి కాలములో అందరిలో కలిసిపోయి, ఆ కుటుంబంలో ముఖ్యస్థానాన్ని సంపాదిస్తుంది. మన హిందూ సాంప్రదాయం ప్రకారం ఇలా పెళ్ళిళ్ళు చేసినా నూటికి తొంభై తొమ్మిదిమంది హాయిగా కాపురాలు చేసుకుంటున్నారు.

విదేశాలలో, నేడు మనదేశంలో కూడా ప్రేమించి పెళ్ళిచేసుకొంటున్నారు. ప్రేమించి పెళ్ళిచేసుకున్న జంటలు కూడా నూటికి తొంభై శాతం మించి సరిగా కాపురాలు చేయడంలేదు. భార్యభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేసేవారే ఎక్కువ మంది విడాకులు తీసుకొని విడిపోతున్నారు. అందుకే తగిన భార్య దొరకడం కూడా పూర్వ జన్మ సుకృతంగా భావిస్తారు.

సుశీలతో నా వివాహము వైభవంగా జరిగింది. కొందరు తల్లిదండ్రులు పిల్లలు పుట్టగానే చక్కటి పేర్లు పెడ్తూ వుంటారు. నా భార్యకు సుశీల అనే పేరు ఆమె గుణగణాలకు సరిపోయేటట్లు మామగారు ఆమెకు పెట్టారు. పెళ్ళయ్యాక మొదటి రాత్రినాడే సుశీలకి మా కుటుంబంలో అందరి గురించి చెప్పి, ఐదు సంవత్స రాల వరకు కొంచెం ఓపిక వహించ, కొన్ని కోరికలు, సుఖాలను పరిత్యజించి, త్యాగం చేయవలసి వస్తుందని, తమ్ముళ్ళ చదువులు, చెల్లెలు పెళ్ళి అయాక జీవితం ఆనందంగా గడపవచ్చని అంతవరకు నాతో సహకరించవలసినదిగా నా సహధర్మ చారిణియైన సుశీలని అర్థించాను. ఆమె నన్ను అర్థంచేసుకుని, నా అడుగుజాడలలో నడుస్తానని మాట ఇచ్చింది. ఆమె మాటతో నాకు కొండంత ధైర్యం వచ్చింది.

మొదట తిరుపతి వెళ్ళి వెంకన్న దేవుని దర్శించుకుని, అక్కడనుండి హనీమూన్‌కి భూతల స్వర్గాన్ని మైమరిపించే మైసూరు, బెంగుళూరు, ఊటీ తీసుకు వెళ్తానని ఆమెకు చెప్పి, ఆమె భయము, బిడియము పోగొట్టి ఆమెను నా స్వంతం చేసుకున్నాను. పెళ్ళి తతంగాలు పూర్తయ్యేక ఆచారాల మేరకు ఏనాళ్ళకు మూడు

రోజులు మా ఇంట్లోను మా అత్తగారింట్లోను వేడుకగా జరిపించారు. తరువాత మా హనీమూన్ విషయము మెల్లగా మా అమ్మగారికి చెప్పాను. పక్కనే వున్న నా చెల్లెలు నా మాటలువిని, ఇప్పటికే బోలెడు ఖర్చులయ్యాయి. వాళ్ళిచ్చిన కట్నం డబ్బులు చాలక ఐదువేల వరకు నాన్నగారు అప్పుచేయవలసి వచ్చింది. ఇప్పుడు బెంగుళూరు, మైసూరు వెళ్ళకపోతే ఏం? అంటూ నిలదీసింది.

ఆమె మాటలతో నాలో ఉత్సాహమంతా ఎగిరిపోయింది పక్కనున్న మా అమ్మగారు మాట్లాడకపోవడంతో వెనుతిరిగి వెళ్తూవుంటే 'బాబూ! చెల్లి చెప్పినట్లు ఇప్పుడు చాలా ఖర్చుల్లోవున్నాం కాబట్టి, తిరుపతి వెళ్ళి దేవుణ్ణి చూసి వచ్చేయండి. తరువాత ఎప్పుడైనా తీరిగ్గా మీరనుకున్నట్లు మైసూరు, బెంగుళూరు వెళ్ళిరండి. అన్నారు అలాగే అని చెప్పి పాలిపోయిన ముఖంతో నా శ్రీమతికి ఈ విషయం మెల్లగా చెప్పలేక చెప్పాను.

సుగుణాలరాశియైన నా సుశీల నన్ను అర్థం చేసుకొని కినుకవహించకుండా చిరునవ్వుతో, అలాగే చేద్దాం ! దాని గురించి విచారించకండి' అని నన్ను ఓదార్చింది. ఆమె మాటలు నాకు పన్నీరు జల్లుగా అనిపించి ఆనందాన్ని కలిగించింది.

మా తిరుపతి యాత్ర పూర్తయ్యాక మా అమ్మగారు విజయవాడ వచ్చి మా చేత కొత్త కాపురం పెట్టించారు. మా అమ్మగారు నాలుగురోజులుండి వెళ్ళిపోయారు. మా హనీమూన్ ఆనందాన్నంతా ఇంట్లోనే జరుపుకున్నాము. నాకు చిన్నప్పటినుండి పిల్లలంటే మక్కువ. నా బాల్యంలో మా తమ్ముళ్ళు, చెల్లిని ఎత్తుకొని ఆడించేవాణ్ణి. మా అమ్మగారు నా సరదా చూసి, తొందరగా పెళ్లిచేసుకుంటే మనింట్లో కూడా ఒక పసికూన వస్తుంది కదరా !అంటూ వుండేది.

అందుకే ఒకరోజు మాటలలో సుశీలతో ఇలా అన్నాను. ముచ్చటగా ముగ్గురు పిల్లల్ని కని ఇమ్మన్నాను. అందులో ఇద్దరు కొడుకులు. ఒక కూతురు కావాలని చెప్పాను. సుశీల ముఖం సిగ్గుతో ఎర్రబడింది. తలదించుకొని తనలో తాను ముసి ముసి నవ్వులు నవ్వుకొనడం చూసి! ఏం నా కోరిక నీకు దురాశగా కనిపిస్తోందా! నాకు ఇద్దరు కొడుకులు పుడితే ఒకణ్ణి ఇంజనీరు, మరొకర్ని డాక్టరు చేస్తానని సగర్వంగా చెప్పాను. అంతా మీ చేతులలో వున్నట్లే మాట్లాడుతున్నారు. మరి అమ్మాయి సంగతి చెప్పలేదేమిటి? అని అడిగింది. నవ్వుతూ.

అమ్మాయికి గ్రాడ్యుయేషన్ పూర్తి కాగానే మంచి సంబంధం చూసి పెళ్ళి చేస్తాను. అన్నాను గర్వంగా. నా శ్రీమతి ఇల్లు అదిరిపోయేటట్లు గట్టిగా నవ్వింది. నేనూ ఆమె నవ్వుతో శృతికలిపాను. అలూ లేదు. చూలులేదు. కొడుకుపేరు సోమ లింగమని ఊరకే అనలేదు. వెనుకటికి మనలాటి వాళ్ళని చూసే ఆ సామెత పుట్టి వుంటుంది. అంది వెటకారంగా.

నేను కొంటెగా, "ఆలు లేకపోవడమేమిటి? చూలేలేదు. చూలు వస్తే ఎంతసేపు కావాలి పిల్లలు కనడానికి అన్నాను.

నా మాటలకు సుశీల సిగ్గుతో మెలికలు తిరిగి పడకగదిలోకి తుర్రుమంది. నేనూ ఆమెను అనుసరించాను.

సుశీల పాలల్లో పంచదారలాగ నాలో బాగా కలిసిపోయింది. కష్టసుఖాలలో నాతో కలిసి సమంగా పంచుకోసాగింది. ఒకసారి బీరువా కొందామని డబ్బులు కూడ బెట్టాము. మా డాక్టరు తమ్ముడు ఏవోపుస్తకాలు కొనుక్కోవాలని డబ్బు కావాలని ఉత్తరంరాస్తే సుశీల ముందు వెనక ఆలోచించకుండా వెంటనే తమ్ముడికి డబ్బులు పంపేవరకు ఊరుకోలేదు. ఇంకొకసారిలాగే గ్యాస్‌స్టవ్ కొందామని డబ్బులు కూడ బెడితే ఇంజనీరింగు చదువుతున్న తమ్ముడు స్టడీటూరు వెళ్తున్నానని ఉత్తరం రాసే సరికి తనే ముందుగా డబ్బుతెచ్చి పంపించేటట్లు చేసింది.

ఇలా చెప్పాలంటే సుశీల చేసిన త్యాగాలు, ఆమె ప్రదర్శించిన అభిమాన జల్లులు చాలా ఉన్నాయి. మా పెళ్ళయి మూడు సంవత్సరాలయింది. కానీ నా శ్రీమతికి నా చేత్తో ఒకవిలువైన వస్తువు కూడా కొనలేదు. ఏదో బంగారు నగ కొని కానుకగా ఆమెకివ్వాలని తలంపుకలిగి ఆమెను అడిగాను. ఆమె సంతోషించి శ్రావణ మాసం వరలక్ష్మీ వ్రతానికి నల్లపూసల గొలుసు చేయించమని కోరింది.

నేనూ ఆమెకి నల్లపూసలు చేయించి కానుకగా ఇవ్వాలనుకున్నాను. 'తానొకటి తలచిన దైవమొకటి తలచినట్లు' మా చెల్లిలి దగ్గరనుండి ఉత్తరం వచ్చింది. ఉత్తర సారాంశమేమంటే, నా పెళ్లికి నాన్నగారు చేసిన అప్పు ఇంకా తీరలేదని, నెలనెలా వడ్డీలు కడ్తున్నారని, ఆ అప్పు తొందరగా తీరిస్తే బాగుంటుందని, నాన్నగారు ఉత్తరం రాయడానికి సందేహిస్తున్నారని, అందుకే తను ఉత్తరం రాసినట్లు, తప్పక అప్పుతీర్చే టట్లు చూడమని వ్రాసింది.

నేను అంతవరకు తమ్ముళ్ళ చదువులకు వారి హాస్టలు ఖర్చులు, కాలేజీ ఫీజు పంపుతున్నాను కానీ ఇంటికి పైసా పంపడంలేదు. మా నాన్నగారు ఎన్నడూ అడగలేదు. తప్పనిసరి పరిస్థితులలో మా అమ్మగారే చెల్లితో ఉత్తరం వ్రాయించి వుంటారని గ్రహించాను. ఆలోచనతో సతమతమౌతున్న నా దగ్గరికి 'శ్రీమతి కాఫీ కప్పుతో వచ్చి, 'ఎందుకలా దిగులుగా కూర్చున్నారు. ఇక ఒక సంవత్సరములో మన కష్టాలు గట్టెక్కుతాయి. వచ్చే సంవత్సరం ఎలాగూ మీ డాక్టరు తమ్ముడ చదువు పూర్తి అవుతుంది కాబట్టి మనకి కొంత భారము తగ్గుతుంది కదా! అని సముదాయించి నల్లపూసలు కావలిస్తే వచ్చే సంవత్సరం చేయించుకోవచ్చు. ముందు అప్పు తీరే మార్గము చూడండి. అనవసరంగా వడ్డీలకు డబ్బుపోస్తున్నారు. అని సలహా ఇచ్చింది.

ఆమె ఔదార్యానికి నా కళ్ళు చెమర్చాయి. ఆమెను ప్రేమతో కౌగిలిలో చేర్చి ముద్దుల వర్షం కురిపించాను.

మా పెళ్ళయిన ఐదు ఏళ్ళలో నా శ్రీమతి నాకు బహుమానంగా ముగ్గురు పిల్లల్ని కని చూపించింది. నా కోరిక మేరకు కాకుండా ముగ్గురూ అమ్మాయిలే అవడం విశేషం. మూడవ సారి కూడా ముచ్చటగా అమ్మాయి పుట్టడంతో ముందు వెనుక ఆలోచించకుండా, పెద్దలు వారించినా వినకుండా ఫుల్‌స్టాప్ పెట్టాము. పున్నామ నరకం సంగతి ఎలాగవున్నా, ఇక్కడ నరకాన్ని అనుభవించడానికిఇష్టం లేక మరి కొడుకు కోసం చూడకుండా, ముందు చూపుతో ఆలోచించి మంచి నిర్ణయిం తీసుకున్నాము.

ముగ్గురూ ఆడపిల్లలైనా ముత్యాల్లాంటి పిల్లలు పుట్టారు. వారిని చూశాక నాకు కొడుకుల్లేరని చింత కలుగలేదు. కానీ మాపై సానుభూతి చూపేవారు మాత్రం ఎక్కువయ్యారు. మా చెల్లెలు పెళ్ళికాగానే ఇక మా అమ్మాయిల పెళ్ళిళ్ళకోసం వారికి మూడవ సంవత్సరం వచ్చిన దగ్గరనుండి ప్లాన్‌చేసి వాళ్ళ పెళ్ళిళ్ళకోసం డబ్బు దాచడం ప్రారంభించాము. నా శ్రీమతి సహకారం లేనిదే నేను అడుగు ముందుకు వేయలేను. అందుకే ఆమె అంటే నాకు ఇష్టం. ఎన్ని కష్టాలు వచ్చినా చిరునవ్వు ముఖంతో ఎంతో ధైర్యంగా ఎదుర్కొని నన్ను ముందుకు నడిపించే శ్రీమతికి నా జోహార్లు. "హేట్సాఫ్ టు శ్రీమతి."

(ప్రియదత్త సకుటుంబ సచిత్రవారపత్రిక - 13-2-2002)

❋ ❋ ❋

లోకం పోకడ

శ్రీవారిని అప్పుడే ఆఫీసుకి సాగనంపి, ఇల్లు ఊడుద్దామని చీపురుపట్టుకొనే సరికి ఇంటిముందు ఆటోఆగింది. "ఈ టైమప్పుడు ఎవరొచ్చేరబ్బా!" అనుకుంటూ బయటకు వెళ్ళి చూసేరికి సంచి పట్టుకుని ఆటోలో నుండి మా చెల్లి పద్మ దిగింది. నేను ఆశ్చర్యంగా దాన్ని చూస్తూ ఏమిటి చెప్పా చెయ్యకుండా ఇలా ఉడిపడ్డావు? కాకినాడ నుండేనా రావడం? అంటూ కుశల ప్రశ్నలువేసి మంచినీళ్లు అందించాను.

పద్మ మంచినీళ్లు త్రాగి గ్లాసు పక్కనపెట్టి, 'అక్కా మన లక్ష్మికి మంచి పెళ్ళి సంబంధం వుంది. ఆ విషయం చెప్దామనే ఇలా పరుగెత్తుకు వచ్చాను." అంది.

నేను నవ్వుతూ ఉత్తరం రాయవచ్చు గదా! ఇంత హడావుడి ఎందుకు అన్నాను. అక్కా చాలా మంచి సంబంధం. వాళ్ళకి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు. వాళ్ళ పెద్దబ్బాయి ఇంజనీరింగు చదివి, ఎలక్ట్రిసిటీ బోర్డులో ఉద్యోగం చేస్తున్నాడు.

రెండవ అబ్బాయి ఇంజనీరింగు చదువుతున్నాడు. వాళ్ళమ్మాయిలు ఇంటర్మీడియట్, టెన్త్ క్లాసు చదువుతున్నారు. తండ్రికి బ్యాంకులో ఉద్యోగం, అబ్బాయి కూడా చక్కగా వుంటాడు. మన లక్ష్మికి అన్నివిధాల అనుకూలమైన సంబంధం! అంటూ మాటల పోగైన మా చెల్లి పద్మ నాన్‌స్టాపుగా గబగబా చెప్పి, వచ్చిన పని అయిపోయినట్లు నా ముఖం చూసింది.

నేను మాట్లాడకుండా ఆలోచించడం చూసి, ఏమిటక్కా ఆలోచిస్తున్నావు ? ఈ సంబంధం గరించి వినగానే నువ్వు ఎగిరి గంతేస్తావనుకుని వచ్చాను. అబ్బాయి ఇంజనీరు అవ్వడం వలన చాలామంది ఎగరేసుకు పోవడానికి రెడీ ఉన్నారు అంటూ నా ముఖంలోకి చూసింది.

నేను నవ్వి పిచ్చిపిల్లా ! ఎంతో అభిమానంతో అంత దూరం నుండి మా అమ్మాయికి సంబంధం చెప్పడానికి వచ్చావు. నాకు సంతోషంగా వుంది. ఇంకా మేము దాని పెళ్ళి గురించి ఆలోచించలేదు. దానికితోడు అబ్బాయి ఇంటికి పెద్ద వాడంటున్నావు. ఇంటికి పెద్ద కోడలునై నేనెంత సుఖపడ్డానో నీకు తెలుసు కదా! మరలా అన్నీ తెలిసిన మా అమ్మాయిని మరొక ఇంటికి పెద్ద కోడలుగా పంపమం టావా? దానికి తోడు అబ్బాయి వయస్సు ఇరవై తొమ్మిది అంటున్నావు. మన లక్ష్మి బియస్సీ చదివింది కానీ దాని వయస్సు ఇంకా ఇరవై కూడా నిండలేదు. అంత వయసు తేడాతో ఇవ్వడం ఇష్టంలేదు. వయసు తేడా ఐదేళ్ళలోపు ఉంటే బాగుంటుంది. అన్నాను.

మా పద్మ నవ్వి,నీకూ బావకి పదకొండేళ్ళు తేడా కదా! అయినా మీ ఇద్దరికీ ఏం తక్కువయింది? నిజం చెప్పాలంటే నీ కన్నా బావే హుషారుగా కనిపిస్తున్నారు. నీకు ముగ్గురూ ఆడపిల్లలే కాబట్టి బాగా ఆలోచించు. పిల్లనచ్చితే వాళ్ళు కట్నం కూడా ఎక్కువ అడగకపోవచ్చు. అబ్బాయి తల్లి, తండ్రి మాకు బాగా తెలుసు. చాలా మంచివాళ్ళు తరువాత మీ ఇష్టం! అంది గట్టిగా నిట్టూరుస్తూ.

ఇప్పుడే కదా చెప్పావు మీబావగారు ఆఫీసు నుండి వచ్చాక అన్ని విషయాలు మాట్లాడుకుందాం. ఇక భోజనం చేద్దామా అని మాట మార్చాను. పద్మ చిన్నబుచ్చు కుని అయితే బట్టలు మార్చుకుని వస్తానని లోనికి వెళ్ళింది. భోజనాలయ్యాక పద్మ, నేను మంచంపై వాలి చిన్ననాటి కబుర్లు చెప్పుకున్నాం. ప్రయాణం చేయడం వలన అలసిపోయినట్లుంది. పద్మ వెంటనే నిద్రలోకి జారుకుంది.

నేను ఎంత ఇటూ అటూ దొర్లినా నాకు నిద్ర రాలేదు. మనసు మెల్లగా గతంలోకి పరుగెత్తింది. అప్పుడు నావయసు పద్దెనిమిది. టెన్తు క్లాసు ప్యాసయి ఇంట్లో కూర్చున్నాను. మా బాబాయి చెప్పాడని మా నాన్నగారు ముందూ వెనక

ఆలోచించకుండా నారా యణ మూర్తిగారితో నా పెళ్ళిజరిపించారు. మా అత్తగారురుక్మిణమ్మ. మామగారు కృష్ణమూర్తి గారు ఇద్దరూ పెద్దకోడలుగా నన్ను వారింటికి హృదయపూర్వకంగా ఆహ్వానించారు. ముగ్గురు మరుదులు మౌళీ, శ్రీకాంత్, అనంత్, ఆడపడుచులు వల్లి,శ్రీలత కూడా నన్ను వదినా అంటూ ఆప్యాయంగా పిలుస్తూ చుట్టూ తిరిగేవారు.

నా పెళ్ళికి నా మరుదులు ఇద్దరూ కాలేజీలోనూ, ఒక మరిది, ఇద్దరు ఆడపడు చులు హైస్కూల్లోనూ చదువుతూ వుండేవారు. మా వారికి రాజమండ్రిలో ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం అవడం వలన మేమిద్దరం రాజమండ్రిలో వుంటూ వుండేవాళ్ళం. మా మామయ్యగారు ఉద్యోగరీత్యా విజయనగరంలో వుంటూవుండే వారు.

నా పెళ్ళయ్యేక మా పెద్ద, మరిది ఇంజనీరింగ్‌లో సీటురావడం, రెండవ మరిదికి మెడిసిన్‌లో సీటు రావడంతో మా అత్తగారు మురిసిపోయి, కోడలు ఇంటికి వచ్చిన వేళా విశేషం అంటూ నన్ను ఎంతో గౌరవంగా అభిమనాంగా చూసేవారు.

మా ఆడపడుచులిద్దరికీ మా అత్తగారు నన్నుపొడుగుతూ వుంటే సహించలేక పోయేవారు. ఇప్పటి నుండి అలా చూస్తే ఆవిడ నెత్తికెక్కి కూర్చుంటుంది. జాగ్రత్తగా వుండమ్మా? అంటూ మా పెద్ద ఆడపడుచు వల్లి పెద్ద ఆరిందలా వాళ్ళమ్మగార్ని హెచ్చరించింది.

మా మరుదులు ముగ్గురూ మాత్రం ఎంతో అభిమానంగా మాట్లాడి వారికన్నా వయసులో చిన్నదానినైనా వదినెగా నన్ను ఎంతో గౌరవించేవారు. ముగ్గురు పిల్లలు ఒక్కసారి కాలేజీ చదువుకు రావడంతో మామగారి గుమాస్తగిరి సంపాదన చాలక పెద్ద కటుంబం అవడం వలన ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనేవారు.

మొదటి నుండి మా వారిది చాలా జాలి గల మనసు. దానికి తోడు వాళ్ళన్న దమ్ములన్నా, అప్పచెల్లెళ్ళన్నా అమితమైన ప్రేమ. వారికి ప్రాణంపెట్టేవారు. అలాగే వాళ్ళమ్మ భక్తి, గౌరవాలతో చూసేవారు.

వారి (మా) కుటుంబం చూసి నేను ముచ్చటపడి సరదాదా వాళ్ళతో కలసి పోయేను. నేను శ్రీరామచంద్రుడ్ని మా తమ్ముళ్ళు లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు, నువ్వు సీతమ్మవి. నా తమ్ముళ్ళు నా మాట జవదాటరని, అంటూ ఎంతో గర్వంగా మురిసిపోయేవారు. మావారు విశాఖపట్నంలో చదువుతున్న ఇద్దరు తమ్ముళ్ళకి కావలసిన డబ్బు పంపించి వారికి చదువు చెప్పించేవారు. మిగతా సగభాగం అంటే అప్పట్లో వెయ్యి రూపాయలతో మా ఇల్లు గడుపుకోవలసి వచ్చేది. గుట్టుగా రెండో కంటికి తెలియకుండ ఉన్న డబ్బుతో కోరికలను అదుపులో పెట్టుకుని కాల క్షేపం

చేసేవాళ్ళం. మేము పొదుపుచేసి గుట్టుగా కాపురం చేసుకుంటూ వుంటే కొందరు మమ్మల్ని పిసినారివారని, కక్కుర్తివాళ్ళని ఎగతాళి చేసేవారు. ఎవరో ఏదో అంటే బాధ వుండేది కాదు కానీ అన్నీ తెలిసిన స్వంత ఆడపడుచులు ఇంటికి వచ్చినప్పుడల్లా వారికి ఖరీదైన బట్టలు కొనలేదని, వారికి సినిమాలకు తిప్పలేదని అన్నప్పుడు బాధ కలిగింది. ఏ పండగలొచ్చినా, శ్రావణ మాసం వచ్చినా అత్తవారింటికి రమ్మనమని పిలిచేవారు. పుట్టింటికి వెళ్ళి నాలుగు రోజులుండి రావాలని కోరికవున్నా వీలుపడేది కాదు.

పెళ్ళయిన ఆరేళ్ళలో ముగ్గురు ఆడపిల్లలు పుట్టారు. పురిటికి వెళ్ళినపుడు పుట్టింట్లో మూడు నెలలు వుండడమే ఎంతో గగనంగా ఉండేది. మామూలు రోజుల లోనూ, పండగ రోజులలోనూ అత్తయ్యగారు, మరుదులు చూపించే ఆత్మీయత, అభిమానంతో పుట్టింటికి వెళ్ళాలనే కోరికను మనసులోనే అణచుకొనేదాన్ని. నా భర్త నారాయణమూర్తి చూపే ప్రేమానురాగాలు, అభిమానంతో మా ఆడపడుచులు నన్ను ఈసడించుకున్నా భరిస్తూ ఇంట్లో నవ్వుతూ వుండేదాన్ని.

మరుదులు ఇద్దరి చదువులు పూర్తయి ఉద్యోగంలో చేరడంతో ఊపిరి పీల్చుకుని అమ్మయ్య! ఇక కష్టాలు గట్టెక్కాయని అనుకునే సరికల్లా పెద్ద ఆడపడుచు వల్లి పెళ్ళి కుదిరింది. ఆమెకు పెళ్ళిచేసి, రెండు పురుళ్ళు పోసి పంపించేసరికి రెండవ ఆడపడుచు శ్రీలతకి పెళ్ళి కుదిరింది. ఆమెపెళ్ళిచేసి అత్తవారింటికి పంపించే సరికి మాకు నీరసం వచ్చింది. కష్టపడి ఆడపడుచుల పెళ్ళిళ్ళు దగ్గరుండి చేయించి, పురుళ్ళకి సాయంచేసి అన్ని సేవలు చేసి అచ్చట్లు ముచ్చట్లు తీరిస్తే ఈరోజు నోరారా ఒదినా అని పిలవడానికి ఇద్దరాడపడుచులు బాధపడేవారు.

మరుదులిద్దరూ డాక్టరు, ఇంజనీరు అవడం వలన పెద్ద సంబంధాలు వచ్చి, ఇద్దరికి పెళ్లిళ్ళు జరిగాయి. తోటికోడళ్లిద్దరూ బాగా కలవారి పిల్లలవడం వలన, బాగా చదువుకున్న పిల్లలవడం వలన తోటి కోడళ్ళు అత్తవారింటికి వచ్చినా తనకి మాత్రం వంటడ్యూటీ, ఇంటి పనులు తప్పేవి కావు.

తరువాత మూడవ మరిది అనంత్‌కి కూడా బ్యాంక్‌లో ఉద్యోగం రావడంతో అతనికి పెళ్ళిచేసి పంపించారు. ఇంటికి పెద్ద కోడలుగా వెళ్ళినందుకు మరుదులు, ఆడపడుచులు అందరి పెళ్ళిళ్ళు జరిగి అంతా హాయిగా ఉన్నందుకు మెల్లగా ఊపిరి పీల్చుకునేసరికి తన పిల్లలు కాలేజీ చదువులకొచ్చి ఎదిగి కూర్చున్నారు. పిల్లలకు కనీసం గ్రాడ్యుయేసన్ అయినా పూర్తయ్యేవరకు పెళ్ళిళ్ళు చేయకూడదని నిర్ణయించు కొని వారిని చదివిస్తోంది.

కాలచక్రం, గిర్రున పదేళ్ళు తిరిగింది. ఇంట్లో చాలా మార్పువచ్చింది. మరుదుల పెళ్ళిళ్ళు అయ్యాక పూర్తిగా మారిపోయారు. పూర్వపు అభిమానాలు,

ఆప్యాయతలు ఇప్పుడు లేవు. కలసినప్పుడల్లా వాళ్ళ పెళ్ళాల గొప్పలు, పిల్లల గొప్పలు వారు చెప్తూ వుంటే వినడానికే టైము సరిపోయేది. వాళ్లు ఉద్యోగాలలో చేరి పది సంవత్సరాలు పూర్తికాకుండానే అప్పుడే హైద్రాబాదులో ఒకరు, విశాఖపట్నంలో ఒకరు అపార్టుమెంట్లు కొనుకున్నారు. మూడవ మరిది ఉద్యోగం బ్యాంకులో అవడం వలన అతనూ ఇల్లుకొనుక్కునే ప్రయత్నంలో ఉన్నాడు.

మామగారు రిటైరయ్యాక విజయనగరంలోనే వున్న స్వంత ఇంట్లోనే ఉంటూ, అప్పుడప్పుడు కొడుకుల దగ్గరికి వెళ్ళి కొన్నాళ్ళు వుండి వస్తున్నారు. అత్తగారికి నేనన్నా, మా వారన్నా, పిల్లలన్నా అమితమైన ప్రేమ, అభిమానం, జాలి, చిన్నవాళ్ళు అప్పుడే ఇళ్ళు కొనుక్కుంటూ వుంటే, పెద్దవాడిగా ఇల్లు, వాకిలీ లేదని బాధపడేవారు. ఆమె ఆశీస్సులుంటే చాలని, అవే పదివేలని అనుకుంటూ మామగారు పాత ఇల్లయినా మాకు ఇవ్వకుండా వుంటారా! అని ఆలోచిస్తూ పక్కకి తిరిగి చూసేసరకి పక్కలో పద్మ కనిపించలేదు. ఆత్రుతగా లేచి ప్రక్కగదిలోకి వెళ్ళిచూచేసరికి మా అమ్మాయితో పద్మ కబుర్లు చెప్తూ కనిపించింది.

'ఏం అపుడే నిద్రలేచావు. ఇంకా రెండు గంటలే కదా అయింది' అని అడిగాను. పద్మ నవ్వి, నువ్వు హాయిగా నిద్రపోతున్నావు. నాకు మెలకువ వచ్చి చాలా సేపు దక్కులు చూసి లేచి ఇటు వచ్చాను.' అంది. నా ముఖం ! నేను నిద్ర ఎక్కడ పోయాను ? ఏదో ఆలోచిస్తూ దొర్లుతున్నాను అన్నాను. అయితే ఈ సంబంధం ఇష్టమేనా? అని మరలా పద్మ అడిగింది. నేను నవ్వి "పెళ్ళిళ్ళ పేరయ్య లాగున్నావే. అయినా నా ఉద్దేశ్యంలో ఈడూ-జోడూ-బాగుంటే వారి సంసారాలు బాగుంటాయి. ఇద్దరికీ వయసు తేడా ఎక్కువ వుంటే ఇద్దరి ఆలోచనలు ఒకరకంగా వుండక సంసారపు బండి ఒడిదుడుకులతో మా సంసారంలా నడుస్తుంది. నా పిల్లలకు గొప్ప సంబంధాలు చేయలేకపోయినా, వయసు తక్కువ తేడా ఉన్నవారికే ఇచ్చి పెళ్ళి చేయాలనుకుంటున్నాను. మా అమ్మాయిల్ని మాత్రం ఇంటికి పెద్ద కోడులుగా పంపదల్చుకోలేదు. మీ బావగారు వచ్చినా ఇదే విషయం చెప్పదల్చుకున్నాను అని దృఢంగా చెప్పేవారికి మా అమ్మాయి లక్ష్మి, చెల్లి పద్మ కూడా ఒక్కసారి నిశ్చేష్టులై నా వంక వింతగా చూశారు.

పద్మముఖం చిన్నబుచ్చుకుని మరునాడు ఉదయమే కాకినాడ వెళ్ళిపోయింది.

తరువాత సంవత్సరానికి మా పెద్దమ్మాయి లక్ష్మికి నా కోరిక మేర నాలుగు సంవత్సరాల వయసుతేడా వుండి, బ్యాంకులో ఉద్యోగం చేస్తున్న అబ్బాయి దొరక డంతో అతనితో పెళ్ళి నిశ్చియించాము. వారు లక్షరూపాయలు కట్నం అడగడం వలన, పెళ్ళి ఖర్చులకు సుమారు యాభైవేలు అవసరమని తేలడం వలన, అవసరానికి ఆదుకోలేకపోతారా అని కొంత సొమ్ము తమ్ముళ్ళని అడగాలని నారాయణమూర్తి

తమ్ముళ్ళ దగ్గరికి వెళ్ళాడు. శ్రీకాంత్, మౌళీ, అనంత్, కూడా కొత్తగా ఇళ్ళు కొనుక్కుని చిన్నచిన్న మార్పులు చేయడం వలన చాలా డబ్బులు ఖర్చయ్యాయి. ప్రస్తుతం ఏమీ సాయం చేయలేమని ముగ్గురూ ముక్తకంఠంతో 'సారీ అన్నయ్యా అన్నారు.

ముఖం పైసా అంత చేసుకుని వచ్చిన నారాయణమూర్తిని చూసిన శారద జరిగిన విషయం ఊహించింది. ఆమెలో ఉక్రోషం పొంగుకు వచ్చింది. మా తమ్ముళ్ళు లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు, నేను శ్రీరామచంద్రుడ్ని అంటూ ఆనాడు కాలరు ఎగరవేశారు. ఆర్జించిన ధనమంతా పైసా దాచకుండా తమ్ముళ్ళను చదువులకు, పెళ్ళిళ్ళకు ఖర్చుచేశారు. ఇప్పటికైనా గ్రహించారనుకుంటూ లోకమంటే ఏమిటో! ఈ రోజుల్లో ఎవరూ ఏమీ చేయరండీ అంటూఎత్తిపొడిచి పొంగివచ్చే దుఃఖాన్ని ఆపుకోలేక బావురుమని ఏడుస్తూ గదిలో మంచంపై వాలిపోయింది. నారాయణమూర్తి నిరుత్తరుడై దిక్కులు చూస్తూ లోకంపోకడ గురించి మొదటిసారి ఆలోచనలపడ్డాడు.

(ప్రియదత్త సకుటుంబ సచిత్రవారపత్రిక -6-4-2003)

❁ ❁ ❁

అమెరికా అల్లుడు

రవిని వాళ్ళ ఆఫీసువాళ్ళే అమెరికాలో నూజెర్సీకి ఆఫీసు పనిమీద ఆరునెలలు పంపిస్తున్నట్లు విని అతని తల్లిదండ్రులు ఎంతో మురిసిపోయారు. ఎందుకంటే వాళ్ళమ్మాయి రేఖకి పెళ్ళి జరిగి రెండు సంవత్సరాలైంది. ఆ అమ్మాయి అమెరికాలో న్యూయార్కులో వుంటోంది. ఎప్పుడైనా ఫోనుచేసి మాట్లాడుతుంది కాని పెళ్ళయ్యాక, ఒకసారి కూడా ఇండియా రాలేదు. అబ్బాయి అమెరికా వెళ్తున్నాడంటే వాళ్ళక్కయ్యని ఒకసారి చూసి వస్తాడని, దానికి తోడు అక్కడ ఆరునెలలపాటు వుంటాడని తెలిసి ఎంతో పొంగిపోయారు.

రఘురామ్, రాజ్యలక్ష్మిగార్లకు రేఖ, రవి అనే ఇద్దరు పిల్లలు. ఇద్దరూ కష్టపడి పోటీగా చదివి ఎంసెట్‌లో మంచి ర్యాంకులు సంపాదించి ఇంజనీరింగ్ చదివి మెరిట్‌లో పాసయ్యారు. రఘురామ్‌గారు ఏ.జి.ఆఫీసులో అకౌంట్స్ ఆఫీసరుగా హైద్రాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. అక్కడే ఆనందనగర్‌లో స్వంత ఇల్లుకట్టు కొని స్థిరపడ్డారు. అమ్మాయి రేఖని చదువు పూర్తికాగానే పెళ్ళిచేయాలని అనుకుంటూ వుండగా, అమెరికాలో కంప్యూటర్ ఇంజనీర్‌గా అయిదు సంవత్సరముల నుంచి ఉద్యోగం చేస్తున్న అబ్బాయి ఒకడున్నాడని, అతనిఇక ఇంజనీరింగు చదివిన అమ్మాయి కావాలని చూస్తున్నాడని, అతను వచ్చే నెలలో ఇండియా వస్తున్నాడని, ఇండియా వచ్చి, అమ్మాయిని చూసి, పెళ్ళిచేసుకొని వెంటనే అమెరికా తీసుకువెళ్తాడని, అక్కడ

అతనికి గ్రీన్‌కార్డు వుందని అంటూ అతని వివరములు వారిదూరపు బంధువులెవరో చెప్పడంతో విని, అమ్మాయి కూడా అమెరికా వెళ్ళాలని కాంక్షిస్తూ వుండడం వలన వారి అంతస్తుకి మించిన సంబంధమే అయినా అమ్మాయి సుఖపడ్తుందని అమెరికా సంబంధమే వాళ్ళమ్మాయికి చేశారు. తరువాత వారి అల్లుడు తల్లి తండ్రి కూడా ఏదో మంచి ఉద్యోగం వచ్చిందని చెప్పి ఇండియా విడిచి సౌదీఅరేబియా వెళ్ళి పోయారు. అల్లుడుగారి తల్లిదండ్రులు ఇండియాలో లేకపోవడం వలన ఎన్నిసార్లు రమ్మని చెప్పినా అల్లుడుకాని, అమ్మాయికాని పెళ్ళాయ్యాక ఇండియా రాలేదు. అందుచేత రఘురామ్, రాజ్యలక్ష్మిగార్లకు కొడుకు రవి అమెరికా వెళ్తున్నాడంటే అమితానందముతో పొంగిపోతున్నారు. రవి అమెరికా వెళ్ళాడు. ఆఫీసు పని మూలంగా నెలరోజులదాకా అమెరికాలో వున్నా వాళ్ళక్కరేఖని కలియడానికి వీలుపడలేదు. నెలరోజుల తర్వాత ఒకరోజు వీలుచూసుకొని ఆమెనుకలిశాడు. ఆమెను కలిశాక అన్ని విషయాలతో వివరంగా వాళ్ళమ్మగారికి ఉత్తరమురాశాడు. రాజ్యలక్ష్మిగారు ఉత్తరము ఆతృతగా విప్పిచదివారు.

ప్రియమైన అమ్మకు, నమస్కరించి రవి రాయునది. ఇక్కడ నాకు అన్ని విధములా సౌకర్యముగా వున్నది. ఇక్కడ అన్ని రకముల వస్తువులు దొరుకుతున్నాయి. ఖరీదు మాత్రము ఎక్కువ. క్రిందటి వారము న్యూజెర్సీ వెళ్ళి అక్కని కలిశాను. అక్క బాగా చిక్కిపోయి దిగులుగా వున్నట్లు కనిపించింది, నన్నుచూసి చాలా పొంగి పోయింది. పూర్వము వున్న హుషారు చలాకీతనము లేదు. అక్కడ ఉద్యోగము చేస్తున్నట్లు చెప్పింది. బావగారు కనిపించలేదు. ఆఫీసు పనిమీద ఏదోఊరు వెళ్ళారని అక్క చెప్పింది. అక్క ఒంట్లోబాగోలేదని ఏదో దిగులుతో బాధపడ్తున్నట్లు నాకు అనుమానంగా వుంది. ఎంత అడిగినా ఏమీ చెప్పలేదు. మరల వచ్చే నెలలో వెళ్తాను. వెళ్ళివచ్చాక మీకు వివరములు రాస్తాను. మీరేమీ దిగులుపడకండి. నాన్నగారికి నా నమస్కారములు, మీ ఆరోగ్యముజాగ్రత్త. మరల అక్కని కలిశాక అన్ని విషయము లతో వివరంగాఉత్తరము రాస్తాను. –ఇట్లు రవి.

ఉత్తరము చదివిన రాజ్యలక్ష్మిగారు పొంగివస్తున్న దుఃఖము ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడ్చారు. ఆమెకి ఏమిచేయాలో తోచలేదు. ఎన్నోరకాల ఆలోచనలు చుట్టు ముట్టాయి. అప్పటి వరకూ కూతురు కాపురము గురించి ఎన్నో తీయనికలలు కన్నారు. రఘురామ్ గారికి ఇంకా మూడేళ్ళ సర్వీసువుంది. రిటైర్ అయ్యాక అమెరికా వెళ్ళి కూతురు దగ్గర కొన్నాళ్ళువుండి, అక్కడి ప్రదేశాలుచూసి రావాలని కలలు కంటున్నారు. అబ్బాయి రవికి కూడా మద్రాసులో టాటా కన్సెల్టెన్సీలో మంచి

ఉద్యోగము రావడముతో అతనికి కూడా త్వరలో వివాహము జరిపించి, వారిద్దరూ 'రామా కృష్ణా' అనుకొంటూ హాయిగా కాలక్షేపము చేయాలని, శేషజీవితాన్ని ఆనంద ముగా గడపాలని ఊహాలోకాల్లో విహరిస్తున్నారు. రఘురామ్ గారు ఊళ్ళోలేరు ఆడిట్ పార్టీతో విశాఖపట్నం వెళ్ళారు. వారం రోజుల దాకారారు. రాజ్యలక్ష్మిగారి కన్నా రఘురామ్ గారికే రేఖ అంటే అత్యంత ప్రేమ. ముద్దు కూడా. ఆడపిల్లకి తండ్రి మీద, మగపిల్లాడికి తల్లిమీద ఎక్కువ ప్రేమ వుంటుందని చెప్తూ వుంటారు. రేఖను అతను పువ్వుల్లో పెట్టిపెంచారు. ఎక్కువ కట్నకానుకలకాసించకుండా అమెరికా అల్లుడు వస్తున్నాడంటే ఇద్దరూ రేఖ అదృష్టానికి మురిసిపోయారు. కానీ అబ్బాయి రవి ఉత్తరములో ఏదో అపశృతి వున్నట్లు తోచింది. రాజ్యలక్ష్మిగారికి ఎంత ఆపు కుందామన్నా దుఃఖము ఆగడంలేదు. ఓదార్చడానికి భర్తకూడా దగ్గరలేదు. ఈ విషయాన్ని భర్తకి ఎలాచెప్పాలో అమెకి అర్థముకావడములేదు. రఘురామ్‌గారికి బ్లడ్‌ప్రెషర్, సుగరు రెండూవున్నాయి. అతడు చాలా సున్నిత మనస్కుడు. నిద్రలో కూడా చీమకి అపకారము చేయడు. మంచి వాళ్ళకే భగవంతుడు కష్టాలు కలుగజేస్తూ వుంటాడు. రోగాలువస్తే మందులు వేసుకొని ఉపశమనం కలిగించుకోవచ్చు కానీ భార్యాభర్తల మధ్యచిచ్చు రగిలితే బ్రతుకంతా అంధకారబంధురమే అవుతుంది. రేఖ జీవితానికి ఏమీ కాకూడదని వారిద్దరూ అన్నివిధాలా సుఖముగా కాపురము చేయాలని వేయిదేవుళ్ళకి రాజ్యలక్ష్మిగారు మొక్కుకున్నారు.

రఘురామ్ క్యాంపు నుంచి తిరిగివచ్చారు. కానీ ఆయనకి రేఖ విషయము తెలియనీయలేదు. కానీ రఘురామ్‌గారికి భార్య ఒంట్లో ఏదో అనారోగ్యముతో బాధపడుతుందని అనుమానము కలిగి, డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళాడు. డాక్టరు ఆమెను పరీక్షించి కొద్దిగా బ్లడ్‌ప్రెషర్ వున్నట్లు తెలిపాడు. నీరసంగా ఇద్దరూ ఇంటికి తిరిగివచ్చి ఒకరికొకరు ఓదార్చుకున్నారు. బాగా డబ్బులున్న వారికి రావల్సిన రోగాలు మనకి వచ్చాయేమిటా అని ఇద్దరూ కొంతసేపు జోకులు వేసుకుని నవ్వుకొన్నారు.

నెలరోజుల తర్వాత మరలా రవి దగ్గరనుంచి పెద్ద ఉత్తరం వచ్చింది. మధ్యలోనాలుగుసార్లు ఫోన్లు చేసినా తండ్రి ఆందోళన చెందకుండా రేఖ సురక్షితంగా వుందని మాత్రమే చెప్పాడు. భయంతో వణుకుతున్న చేతులతో ముఖానికి పట్టిన చెమటను పైట చెంగుతో తుడుచుకొని మెల్లగా ఉత్తరాన్ని చదవసాగారు రాజ్యలక్ష్మి గారు.

ప్రియమైన అమ్మకు, రవి నమస్కరించి రాయునది. ఇక్కడ నేను క్షేమముగా వున్నాను. ఇక్కడ అక్క జీవితము కుక్క చింపిన విస్తరిలా వుంది. బావగారు మనం

అనుకున్నట్లు ఉత్తముడు కాదు. అతనికి లేని వ్యసనము లేదుట. అతనికి అమెరికాలో అంతకు ముందే ఒకామెతో వివాహము జరిగిందట. కాంట్రాక్టు మేరేజి చేసుకున్నాడట. ఇంకా మూడేళ్ళ వరకూ అతనికి ఆమెతో సంబంధముంటుందని, అంతవరకూ వేచివుండమని అక్కకిచెప్పి, అక్కని వేరే ఇంటిలోవుంచి, అతను అమెరికా అమ్మాయితో కాపురంచేస్తున్నాడట. అందుకు అక్కకి అతనిమీద అసహ్యము కలిగి, అతనికి చెప్పకుండా ఉద్యోగంలో చేరింది. ఉద్యోగము చేయవద్దని కొన్నాళ్ళు అక్కని వేదించాడుట. అక్క అతన్ని లక్ష్యపెట్టక పోవడంతో అతను కోపముతో ఈ మధ్య అక్క దగ్గరకు రావడం మానివేశాడట. ఆత్మాభిమానం గల అక్క ఈ విషయా లన్నీ మనకితెలిస్తే సున్నితమనస్కులైన నాన్నగారు, నువ్వు తట్టుకోలేరని, ఈ రహస్యాన్ని దాచివుంచి, ఫోనులో మనతోనవ్వుతూ కబుర్లు చెప్తూ ఆ దావాలనాలన్ని ఆమె కడుపులో దాచుకుంది. అందుచేతనే మనకెవరికీ అక్క జీవితముపై అనుమానం కలుగలేదు. ఆ అమ్మాయి అంటే బావగారి మొదటి భార్య అక్కడ డాక్టరుగా వుండి లక్షలు సంపాదిస్తోందిట. ఆమెకు ఒక కొడుకు కూడా పుట్టాడుట. అందుచేత ఐదు సంవత్సరాలైన తరువాత కాంట్రాక్టుమేరిజి రద్దు చేసుకుంటాడని నమ్మకంలేదని అక్క చెప్పింది. బావగారు ఈ మధ్య చుట్టపు చూపుగా నెలకో రెండునెలలకో ఒకసారి వచ్చి, ఈ విషయాన్ని బయటకు రానివ్వద్దని బెదిరించి, వెళ్తున్నారట. అక్కకి అతనంటే విరక్తి కలిగి, స్వతంత్రంగా ఒంటరిగా బ్రతకాలని నిశ్చయించుకొని అక్కడే ఉద్యోగములో చేరి జీవిస్తోంది. నాతో ఇండియా రమ్మనమని చెప్పాను. కానీ అక్క వినడం లేదు. ఇండియావస్తే మనబంధువులందరూ వారు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేక, వారు అనే సూటిపోటీ మాటలు భరించడం కష్టమని తలపోస్తోంది. అందుకే అమెరికాలోనే ఒంటరిగా వుండాలనుకుంటున్నట్లు చెప్తోంది. అక్క జీవితము చూస్తువుంటే నాకే బాధ కలుగుతోంది. ఇంత మంచి అక్కకి అలాటి దుష్టుడు, దుర్మార్గుడైన భర్త ఎలా దొరికాడా అని ఆశ్చర్యం కలుగుతుంది. భగవంతుడు మనల్ని ఎందుకిలా పరీక్షిస్తున్నాడో అర్థము కావడంలేదు. మనము అక్క పెళ్ళి విషయములో తొందరపడి నిర్ణయము తీసుకున్నామేమోననిపిస్తోంది. అమెరికా మోజులోపడి చాలా మంది వైవాహిక జీవితాలు ఇలాగే వున్నట్లు ఇక్కడికి వచ్చేక తెలిసింది. ముఖ్యంగా మన తెలుగువారు ఈ మధ్య అమెరికా పెళ్ళికొడుకనగానే వారి పుట్టుపూర్వోత్తరాల గురించి కాని, అతను చదివిన చదువు గురించికాని, చేస్తున్న ఉద్యోగము గురించి కానీ సరిగ్గా తెలుసుకోకుండా పిల్లలనిచ్చి పెళ్ళిచేస్తున్నారు. కొందరైతే కేవలం ఫోటోలు చూసి, పిల్లల్ని ఒకర్ని ఒకరు చూసుకోకుండానే పెళ్ళి ముహూర్తాలు పెట్టుకొని

పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారు. కొందరు ఇక్కడ బట్లరు, టాక్సీ డ్రైవరు ఉద్యోగాలు చేస్తున్న వారు కూడా అమెరికాలో కంప్యూటర్ ఇంజనీరనో లేక ఏదో హోదాగల ఉద్యోగము చేస్తున్నట్లు చెప్పి నమ్మించి ఎక్కువ కట్నకానుకలతో అమ్మాయిల్ని పెళ్ళి చేసుకొని అమెరికా తీసుకువచ్చినట్లు తెలిసింది. ఇంకా కొందరు కీచకులు పెళ్ళి చేసుకువచ్చి భార్యచేత ఇక్కడ వ్యభిచారం చేయిస్తున్నారట. కొందరు అమెరికా పెళ్ళి కొడుకు విద్యావంతురాలు అక్కర్లేదనిచెప్పి ఇండియాలో పెళ్ళిచేసుకొని వచ్చి ఇక్కడ వారిని వంట మనుషులుగా, పనిమనుషులుగా వారిని ఉపయోగించుకుంటు న్నారుట. ఇవన్నీ వింటూవుంటే ఒడలు గగుర్పొడుస్తోంది. ఈనాడు ప్రతివారు మా అమ్మాయి అమెరికాలోవుంది, అబ్బాయి అమెరికాలో ఉన్నాడని చెప్పుకొని మురిసి పోతున్నారు కాని వారికి ఇక్కడ జరుగుతున్న చీకటి గాథలు గురించి తెలియవు. అక్కలాటి అభాగినులు చాలామందే వున్నారుట. అక్కే ఈ విషయం స్వయంగా చెప్పింది. కొందరైతే రెండవ భార్యగానో, ఇంట్లో పనిమనిషి, వంటమనిషిలా బ్రతు కుతూ గుట్టుగా కాపురము చేస్తున్నారుట. ఇక్కడ ఎవరూ ఇలాటి విషయములు పట్టించుకోవడములేదు. మనది సంప్రదాయమైన కుటుంబం అవడం వలన, బయట ప్రపంచము గురించి ఎక్కువ తెలియకపోవడం వలన మన పరిధిలోనే మనము ఆలోచిస్తూ బాధపడ్తున్నాము.

ఈ విషయమునాన్నగారికి చెప్పావా ? అక్క. చెప్పవద్దన్నది. ఇక్కడ నా ఆఫీసు పనిపూర్తి కాగానే అంటే మరో మూడు నెలల్లో ఇండియా వస్తాను. అక్కని ఎలాగైనా ఒప్పించి, ఆఫీసుకి సెలవుపెట్టించి, నాతో ఎలాగైనా హైద్రాబాదు తీసుకు వస్తాను. అంతవరకు ఓపిక పట్టి నాన్నగారికి ఈ విషయము తెలియనీయవద్దు. ఈ వయసులో ఆయన తట్టుకోలేరు. మేము ఇండియా వచ్చాక ఆలోచించి, తగిన సమయంచూసి నాన్నగారికి చెప్తాము. అన్నీ తెలిసి చదువుకున్న మనలాటి వారమే అమెరికా మోజులోపడి తప్పటడుగు వేశాము. అన్నివిధాలా బాగా తెలిసిన వారైతేనే దూరసంబంధాలు విదేశీ సంబంధాలు చేయాలి. లేకపోతే పవిత్రమైన వివాహ సంబంధాలు మధ్యలోనే తెగిపోయి జీవితాలు మోడులవుతాయి. అక్కకోసము నువ్వు దిగులు పడకు. అక్క ఇక్కడ చాలా ధైర్యంగా వుంది. నన్నూ చూశాక అన్నీ మరిచిపోయి హాయిగా నవ్వుతోంది. తప్పకుండా అక్కనినాతో హైద్రాబాదు తీసుకువస్తాను. నువ్వు ధైర్యముగా వుండు. మీ ఆరోగ్యాలు జాగ్రత్త. ఇక వుంటాను. –ఇట్లు నీ రవి

రాజ్యలక్ష్మిగారు ఉత్తరము పూర్తిగా చదివి, రేఖని తలచుకొని చాలాసేపు దుఃఖించి, అలాగే నిద్రపోయారు. సాయంత్రము భర్త ఇంటికి వచ్చేసరికి ఆమె

ముఖము పొంగి బాగా ఉబ్బి ఉంది. అద్దములోచూసుకొని భయపడుతూనే భర్తకి కాఫీ అందించారు.

రఘురామ్‌గారు కాఫీ కప్పు అందుకొని, భార్యముఖములో దీనత్వముచూసి, “రాజ్యం ఏమైంది? ఒంట్లో నలతగా వుందా?” అని ప్రేమతో పలుకరించారు.

రాజ్యలక్ష్మిగారు ముఖము తిప్పుకొని, వచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ “పిల్లలిద్దరూ అమెరికాలో వున్నారు. వాళ్ళని చూడాలని వుందండీ! అంటూ భర్త ఒడిలో తల దాచుకుని బావురుమన్నారు.

ఆమె బాధచూసి అతనికి అశృనయనాలై రాజ్యం, ఆడదానివి కాబట్టి నువ్వు బయటికి చెప్పి ఏడ్చావు. నాకూ ఈమధ్య పిల్లల్ని చూడాలని హృదయము తహ తహ లాడుతోంది. కానీ మనసులోనే కోరికని, అదిమి పెట్టుకొని పైకి గంభీరంగా కనిపిస్తున్నాను. మన రవికి ఈ రోజే ఫోనుచేసి, వాడు ఇండియా తిరిగి వచ్చేటప్పుడు అమ్మాయి రేఖని కూడా వాడితో తీసుకు రమ్మనమని చెప్తాను. అమ్మాయిని చూసి చాలా రోజులైంది. అని ఆమె తల నిమిరి ఆమెను ఓదార్చరు.

రాజ్యలక్ష్మిగారు ఆ ఓదార్పు వాక్కులతో కళ్ళనీళ్ళు తుడుచుకొని దీనవదనంతో కాఫీ కప్పు తీసుకుని లోనికి వెళ్ళి, భగవంతునికి మనసులోనే నమస్కరించి దుఃఖ భారాన్ని కొంత దిగమ్రింది ఊరట చెందారు.

(ప్రియదత్త సకుటుంబ సచిత్రవారపత్రిక 21-8-202)

❁ ❁ ❁

మావద్ద లభించు గ్రంథములు

1. వ్రతకథలు - పూజలు

శ్రీ వినాయక వ్రతం	వెల రూ.5
శ్రీ విఘ్నేశ్వరపూజా-పుణ్యాహవాచనం	20
శ్రీ విఘ్నేశ్వరపూజ (కాణిపాకక్షేత్రమాహాత్మ్యంతో)	9
లక్ష్మీగణపతి పూజాకల్పం	...
వరలక్ష్మీ వ్రతం	5
కేదారేశ్వర వ్రతం	5
త్రినాధ వ్రతం(కలర్)	5
త్రినాధవ్రతం(సాదా)	3
క్షీరాబ్ధి వ్రతం	5
మంగళ గౌరీవ్రతం	9
వైభవలక్ష్మీ వ్రతం ఫోటో యంత్రంతో	15
శ్రీలక్ష్మీ కుబేర వ్రతం (ఫోటో యంత్రంతో)	15
కనకమహాలక్ష్మీ వ్రతం (కామేశ్వరీపాటతో)	15
సంతోషీమాతా వ్రతం	15
ఏడు శనివారాల వ్రతం	15
సత్యనారాయణవ్రతం	15
శ్రీ సువర్చలాహనుమద్దీక్ష	15
శివదీక్ష	9
మార్గశిర లక్ష్మీవారాలవ్రతం	...
శ్రీ వేంకటేశ్వర (దీక్ష) గోవిందమాల	...
కాత్యాయనీ వ్రతం	15
సౌభాగ్య గౌరీవ్రతం	15
తిరుప్పావై (ధనుర్మాసవ్రతం)	30
స్త్రీల వ్రతకథలు	25
స్త్రీలవ్రతకథలుస్థూలాక్షరి(నేదునూరిగంగాధరరావుగారి)	45
స్త్రీలపాటలు (కామేశ్వరీపాటతో)	27
సర్వదేవతా పూజావిధానం	15
ఆరువ్రతాలు	25
ధన్వంతరీ వ్రతకల్పం	9
రాహుకాలంలోదుర్గాదేవీపూజా	9
పార్వతీ నిత్యపూజ	9
తులసి నిత్యపూజ, తులసీఉపయోగాలు	9
శ్రీ చక్రపూజ	9
శ్రీ చక్ర రహస్య విజ్ఞానమ్	30
శ్రీచక్ర పూజావిధానం(పెద్దది)	30
లక్ష్మీ - గౌరీ నిత్యపూజ	9
శ్రీలలితా నిత్యపూజ(లలితాసహస్రనామస్తోత్రంతో)	9
శ్రీ గాయత్రీ నిత్యపూజ	9
అన్నపూర్ణ నిత్యపూజ	9
శ్రీ బాలాత్రిపురసుందరీ నిత్యపూజ	9
శ్రీ సరస్వతీ నిత్యపూజ	9
మహిషాసుర మర్దనీపూజ	9
రాజరాజేశ్వరీ నిత్యపూజ	9
శ్రీ దుర్గానిత్యపూజ	9
కాలభైరవ నిత్యపూజ	9
శివపూజ	9
వీరభద్ర పూజ	9
ఆంజనేయ నిత్యపూజ	9
నాగేంద్ర స్వామి పూజ	9
సుబ్రహ్మణ్య నిత్యపూజ	9
రామదేవుని కథ	9
శివదేవుని కథ	9
విష్ణుపూజ (విష్ణుసహస్రనామస్తోత్రసహితం)	9
శ్రీకృష్ణ పూజ, గోపూజ	9
లక్ష్మీనరసింహపూజ	9
రాఘవేంద్రపూజ	9
విశ్వకర్మపూజ	9
శనైశ్చరపూజ	9
వేంకటేశ్వరపూజ	9
బ్రహ్మంగారి నిత్యపూజ	9
సూర్య నిత్యపూజ	9
నవగ్రహ నిత్యపూజ	9
సకలదేవతా అష్టోత్తర శతనామావళీపూజ	9
పంచాయతన పూజ	45
రుక్మిణీ కల్యాణం	15
అష్టనాగపూజ	30
ఏ దేవునికి ఏపుష్పాలతో పూజించాలి?	30
ఏ దేవునికి ఏప్రసాదం నైవేద్యం పెట్టాలి?	30
ఏదేవునికి ఏవిధముగాదీపారాధనచెయ్యాలి?	30
ఏదేవునికి ఎన్ని ప్రదక్షిణలుచేయాలి ?	30
సంకష్టహరచతుర్థి శ్రీమహాగణపతి వ్రతం	20
పంచముఖ ఆంజనేయనిత్యపూజ	15
హనుమద్ వ్రతం	30
28 వ్రతములు	99
పూజలు ఎందుకుచేయాలి ?	30
కలశపూజలు (9ఒకేసారి)	150
కలశపూజలు (విడివిడిగా)	150
ఉమామహేశ్వర వ్రతం	30

2. స్తోత్రాలు-సుప్రభాతములు సహస్రనామములు

శ్రీ లలితా విష్ణు సహస్రనామస్తోత్రాలు	31
సర్వదేవతా స్తోత్రమంజరి	99
సకలదేవతా అష్టోత్తరశతనామావళిః (63)	20
విష్ణుసహస్రనామస్తోత్రమ్ (క్రౌన్)	20
లలితా సహస్రనామ స్తోత్రమ్(క్రౌన్)	30
లలితా సహస్రనామములు	18
లక్ష్మీ సహస్రనామములు	18
దుర్గా సహస్రనామములు	18
ఆంజనేయ సహస్రనామములు	18
శివ సహస్రనామములు	18
విష్ణు సహస్రనామములు	18
గణపతి సహస్రనామములు	18
సుబ్రహ్మణ్య సహస్రనామములు	18
గాయత్రి సహస్రనామములు	18
లలితావిష్ణు సహస్రనామస్తోత్రాలు	18
శ్రీరామా సహస్రనామములు	18
లక్ష్మీనృసింహసహస్రనామములు	18
సరస్వతి సహస్రనామములు	18

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

లక్ష్మీగణపతి సహస్రనామములు	**18**
సూర్యసహస్రనామములు&ఆదిత్యహృదయం	**18**
శ్రీవేంకటేశ్వరసహస్రనామములు	**18**
మణిద్వీపవర్ణన (పెద్దది)	**18**
సంధ్యావందనం	**18**
మంత్రపుష్పమ్	**18**
హనుమాన్ చాలీసా	**7**
(పాకెట్) మణిద్వీపవర్ణన	**7**
ఆరు చాలీసాలు	**9**
శివారాధన (శివస్తోత్రాలు)	**7**
వేంకటేశ్వర సుప్రభాతం (పాకెట్)	**7**
ఆరుదండకాలు	**5**
వేంకటేశ్వర గోవిందనామములు	**5**
అష్టలక్ష్మీ స్తోత్రమ్ కనకధారాస్తోత్రమ్	**7**
దేవీఖడ్గ మాలాస్తోత్రమ్(మహిషాసురమర్దనీ స్తోత్రంతో)	**7**
నమశ్శివాయ గేయామృతం	**5**
బాలాత్రిపుర సుందరీ స్తోత్రకదంబం	**81**
సుందరకాండ (పాకెట్)	**9**
భగవద్గీత మూలం	**18**
రామరక్షాస్తోత్రమ్	**18**
స్తోత్ర రత్నావళి	**30**
పురాణపండలలితా-విష్ణు సహస్రనామస్తోత్రమ్ (మినీ)	**8**
పురాణపండ లలితాసహస్రనామస్తోత్రమ్ (మినీ)	**8**
పురాణపండ విష్ణు సహస్రనామస్తోత్రమ్	**8**
పురాణపండ ఆదిత్య హృదయం	**8**
మంత్రపుష్పం (మినీ)	**8**
శివానందలహరి-సౌందర్యలహరి	**30**
కుజదోషం	**9**
కాలసర్ప దోషం	**9**
మీ అప్పులు తీరాలా?	**9**
దృష్టిదోషాలు నివారణ	**9**
సర్వదేవతా ధ్యానశ్లోకములు	**9**
పంచసూక్తములు	**9**
సంధ్యావందనం	**9**
శ్రీరామదూతంశిరసానమామి(తాత్పర్యంతో)	**9**
రుద్రనమకమ్-చమకమ్	**9**
మన్యుసూక్త-మంత్రపారాయణం	**9**
గాయత్రీమంత్రాలు	**9**
పంచరత్న స్తోత్రాలు	**9**
కరావలంబ స్తోత్రాలు	**9**
దశావతార స్తోత్రాలు	**9**
అష్టోత్తర శతనామస్తోత్రాలు	**9**
భుజంగ స్తోత్రాలు	**9**
ప్రాతఃస్మరణాలు	**9**
జపమంత్రాలు	**9**
సర్వదేవతా సుప్రభాతములు	**9**
ద్వాదశ నామస్తోత్రాలు	**9**
కుమారస్వామి స్తోత్రమాల	**9**
సుదర్శన స్తోత్రమాల	**9**

హయగ్రీవ స్తోత్రమాల	**9**
దక్షిణామూర్తి స్తోత్రమాల	**9**
పంచముఖఆంజనేయస్తోత్రమ్	**9**
దండక రత్నాలు	**9**
ద్వాదశ జ్యోతిర్లింగాలు-పంచారామాలతో	**9**
శ్రీసూక్తం పురుష సూక్తం	**9**
పంచ అధర్వణ శీర్షములు	**9**
ప్రార్థనా శ్లోకములు	**9**
గణపతి స్తోత్రమాల	**9**
శ్రీ గురుగీత	**9**
సర్వదేవతా కవచములు	**9**
సర్వదేవతా అష్టకములు	**9**
హిందూ సంస్కృతిసంప్రదాయాలు	**9**
విష్ణు స్తోత్రమాల	**9**
దేవీ స్తోత్రమాల	**9**
శివస్తోత్రమాల	**9**
విష్ణు స్తోత్రములు	**9**
భర్తృలహరి సుభాషితాలు	**9**
నవవిధ భక్తిమార్గాలు	**9**
నవదుర్గలు	**9**
దశమహావిద్యలు	**9**
తిరుపతి వెళదాం	**9**
నవగ్రహస్తోత్రమాల	**30**
మహాన్యాసమ్	**30**
సుందరకాండ గానామృతం	**30**
సంధ్యా వందనం (పెద్దది)	**30**
పురాణపండ రాధాకృష్ణమూర్తిగారి సంకలనం	
లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (హిందీ) ,,	**36**
లలితావిష్ణు సహస్రనామస్తోత్రములు (ఇంగ్లీషు) ,,	**36**
స్థూలాక్షరిలలితావిష్ణుసహస్రనామస్తోత్రములు(పత్రికసైజ్)	**81**
మూకపంచశతీ	**81**
పురాణపండవారి సౌందర్యలహరి (శ్లోకతాత్పర్యసహిత విపులవ్యాఖ్యతో)	**108**
గోమాతపూజావిధానము	**7**
ఆనందసిద్ధి - శ్రీదేవీ స్తోత్రమాల	**108**

3. శ్రీ సాయి దత్త గ్రంథములు

శ్రీ సాయిబాబా సచ్చరిత్ర	**99**
సంపూర్ణ శ్రీ గురు చరిత్ర	**99**
బొమ్మల గురుచరిత్ర	...
బొమ్మల సాయిచరిత్ర	...
బాలలబాబా శ్రీ సాయిచరితం	**9**
శ్రీ సాయిఆరాధన-షిర్డీవైభవం	**99**
శ్రీసాయిసన్నిధిద్వారకామాయిలీలలు	....
శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర (క్రౌన్)	**50**
శ్రీ గురుచరిత్ర (క్రౌన్)	**50**
దాసగణకృత శ్రీసాయి చరిత్ర	**30**
నవనాథ చరిత్ర	**90**
శ్రీ సాయిచరిత్ర(బైండు)ప్రయాణపుపారాయణగ్రంథం	**50**
శ్రీ గురుచరిత్ర (బైండు) ప్రయాణపుపారాయణగ్రంథం	**50**

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

సత్యదత్తవ్రతం దత్తాత్రేయ పూజాకల్పం,సహస్రంతో	15
అనఘాదేవీ వ్రతం	15
శ్రీ సాయిసచ్చరిత్ర గానామృతం	15
శ్రీ గురుచరిత్ర గానామృతం	45
భక్తుల ప్రశ్నలకు బాబా జవాబులు	25
మనసులోనిప్రశ్నకుశ్రీసాయిబాబాజవాబులు	25
అక్షరక్రమములో శ్రీసాయిసూక్తులు	25
శ్రీసాయి అష్టోత్తరశతనామావళీమాహాత్మ్యం	25
శ్రీ సాయిపూజాకల్పం (సహస్రంతో)	15
శ్రీ సాయిభజనమాల	15
శ్రీ సాయి భజన్స్	15
శ్రీ సాయిభక్తి గీతాలు	15
శిరిడిహారతులు (భావంతో)	15
ప్రతిగురువారంసాయినిత్యపూజ	8
"శ్రీసాయి"కోటి	15
"శ్రీసాయిరామ్"కోటి	12
ద్వారకామాయి భక్తిగీతాలు	9
శ్రీ సాయిబాబా భక్తిమాల	9
శ్రీలక్ష్మి సాయిభక్తిమాల	9
శ్రీ ద్వారకామాయిభక్తిమాల	9
శ్రీ శిర్డీభక్తిమాల	9
శ్రీ సాయిబాబా భక్తిమాల	9
శ్రీ సాయినాథ స్తోత్రమంజరి	9
శ్రీ సాయివేయినామాలు	4
శ్రీ సాయి సహస్ర నామావళి	9
శ్రీ సాయి చాలీసా-సుప్రభాతం	9
శ్రీ సాయినాధ చాలీసా	9
శ్రీ సాయి హారతులు (పాకెట్)	9
శ్రీ సాయి నిత్యపూజ (పాకెట్)	9
శ్రీ దత్తాత్రేయ నిత్యపూజ F	9
శ్రీ సాయి సూక్తులు	9
శ్రీ సాయి స్తవనమంజరి	9
శ్రీసాయి నక్షత్రమాలిక	9
హిందీ శ్రీ సాయి హారతులు	10
భక్తుల సందేహాలకుబాబా సమాధానాలు	45
శని సింగణాపూర్ క్షేత్రమాహాత్మ్యం	45
శ్రీ షిర్డీసాయి లీలామృతం (VG)	25
ఇంగ్లీషు శ్రీ సాయిహారతులు	10
షిరిడి దర్శనం-శ్రీసాయి వైభవం	90
సాయిపూజావిధి	30
సాయిమహిమ	....
సాయిసత్యవ్రతం	15
సాయి అనుగ్రహమ్	116
నవగురువారాల వ్రతకల్పము	12
శ్రీదత్తలీలామృతము	72
హృదయంలో సాయి	12
శ్రీషిరిడీసాయి లీలామృతం(శ్రీసచ్చరిత్ర)	81

4. జ్యోతిషాలు

'శుభసమయ' గంటల పంచాంగం	30
సనాతన వైదిక బ్రాహ్మణ పంచాంగం (వంగిపురపువారి పత్రికసైజ్‌పంచాంగం)	69
'కాలచక్రం' గంటలపంచాంగం (గార్గేయ)	50
చిత్రాలగురుమూర్తిగుప్తాపంచాంగము	50
గ్రహభూమి పంచాంగము (గార్గేయ)	116
శ్రీచక్ర పంచాంగము(రాష్ట్రతొలిమహిళపంచాంగకర్త)	30
వేంకట్రామా&కో సిద్ధాంతుల రేలంగితంగిరాలవారి గంటలపంచాంగము	30
తంగిరాల పెద్దపంచాంగం	39
కాలచక్రం జ్యోతిష క్యాలండర్	20
గ్రహబలం క్యాలండర్(శ్రీనివాసగార్గేయ-భక్తిటివి)	20
శుభలగ్నం (తంగిరాల) క్యాలండర్	20
శుభమస్తు (పిడపర్తి) క్యాలండర్	20
సాదా క్యాలండర్	5
పాకెట్ క్యాలండర్	10
తాజకనీలకంఠీయమ్	100
40 రోజుల్లో జ్యోతిషంనేర్చుకొనండి	207
40 రోజుల్లో సాముద్రికంనేర్చుకొనండి	150
కేరళ జ్యోతిష రహస్యాలు	150
జ్యోతిష బ్రహ్మ రహస్యాలు	150
మానసాగరి జాతకపద్ధతి	150
వరాహమిహిర జాతకపద్ధతి	150
వధూవర వివాహమైత్రిద్వాదశకూటములు	81
సింపుల్ రెమిడీస్	....
హోరాసార	.....
శంభు హోరప్రకాశిక	.....
పూర్వ పరాశరి	100
పరాశర జ్యోతిషవిజ్ఞాన సర్వస్వం	200
1940-60వరకు పాతపంచాంగములు	225
ప్రశ్న సింధు	90
నక్షత్ర విశేష ఫలితాలు	36
సర్వార్థ ఫలచంద్రిక	90
సూర్యసిద్ధాంత పంచాంగగణితంచేయడంఎలా?	150
దృక్సిద్ధాంత పంచాంగగణితం చేయడంఎలా?	150
ఆయుర్దాయ నిర్ణయం	36
పంచప్రాచీన జ్యోతిషాలు	36
జాతక గణిత ప్రవేశిక	30
భృగు సూత్రాలు	36
జ్యోతిషమర్మబోధిని	45
జ్యోతిష ప్రశ్నోత్తరమాల	45
ముహూర్తం నిర్ణయించడంఎలా?	45
జాతక మకరందం	30
జ్యోతిష సరస్వతి	30
మీజననకాల విశేషాలు	30
ముహూర్త విజ్ఞాన భాస్కరం	30
జ్యోతిష స్వయంబోధిని	30
శుభముహూర్త శిరోమణి	30

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

నక్షత్ర ఫలమంజరి	30	జాతక రహస్యాలు	250
పంచాంగం చూసే విధానం	30	జాతకమార్తాండం (కొండపల్లి)	250
సర్వార్థ జ్యోతిషం	30	జ్యోతిషవిద్యాప్రకాశిక (కొండపల్లి)	250
ప్రాథమిక జ్యోతిషం	30	గురుశుక్ర ప్రభావము చంద్రకళానాడీ	90
నవరత్నములు శుభయోగములు	30	శనిగ్రహరెమిడీస్	90
జ్యోతిషభావఫలచంద్రిక-1	...	జాతకసుధాసారము-జాతకమోక్షప్రదాయిని	90
శుభశకునాలు	20	నాడీజ్యోతిషం	45
హస్తరేఖాఫలితాలు	30	వివాహజ్యోతిషమంజరి	45
సంఖ్యల్లో భవిష్యత్	30	గార్గేయం మీ గ్రహబలం రెమిడీస్	....
ముహూర్త దీపిక	81	మీ పుట్టినతేదీనిబట్టి మీ జీవితరహస్యాలు	
పుట్టుమచ్చలు ఫలితాలు	20	(న్యూమరాలజీ లైఫ్‌గైడ్)	81
కలలు ఫలితాలు	20	నక్షత్రపారిజాతం (గోరసవీరభద్రాచార్య)	45
నిత్యజీవితంలో అదృష్ట సంఖ్యలు	9	లగ్నపారిజాతం (గోరసవీరభద్రాచార్య)	45
నిత్యజీవితంలో నక్షత్రాలు	9	గౌతమసంహిత	45
జాతక చక్రం వేయడం ఎలా?	30	హోరరత్నమాల	45
మానసాగరి(ప్రాచీనజ్యోతిషగ్రంథం)		**బి.వి.రామన్ గారి గ్రంథములు**	
-పుచ్చాశ్రీనివాసరావు	250	జ్యోతిష విద్యారంభం	50
జ్యోతిషశాస్త్ర చిట్కాలు	90	గ్రహభావ బలములు	50
గుప్తా శతాబ్ది పంచాంగం(1940-2050)	900	కాలచక్రదశ	50
ప్రశ్నచండేశ్వరమ్	45	అనుభవ ప్రశ్నాజ్యోతిషం	50
జాతకాలంకారం	36	జ్యోతిషశాస్త్రంలో వాతావరణ భూకంపాలు	50
జ్యోతిష వైద్య రత్నావళి	36	పురోగామి జాతకం	50
ద్వాదశభావ ఫలచంద్రిక	250	భావార్థరత్నాకరం	75
జాతకచక్రం మీరే వేసుకోవచ్చు	30	భారతీయజ్యోతిష సర్వస్వం	75
జ్యోతిష శతయోగరత్నావళి		అష్టకవర్గ పద్ధతిః	75
(నూరుయోగాలఫలితాలు)	90	జ్యోతిషశాస్త్రంలో సందేహాలు,సమాధానాలు	75
అంగసాముద్రికం	30	ప్రశ్నతంత్ర	75
హస్త సాముద్రికం	40	ముహూర్తం	75
వధూవర గుణ సమ్మేళనం	....	విశిష్ట జాతకములు	125
లాల్ కితాబ్	81	భారతీయఫలితజ్యోతిషం	125
జాతకరాజము	36	300 ముఖ్యమైన యోగములు	125
శకునశాస్త్రం	36	జాతకంపరిశీలించడంఎలా ?	250
ఆధునికప్రశ్నశాస్త్రం	100	రాష్ట్రపతి అవార్డుగ్రహీత, మహామహోపాధ్యాయ, వాచస్పతి	
పరాశరజ్యోతిష ప్రశ్నజ్యోతిషం	150	శ్రీ మధురకృష్ణమూర్తిగారి గ్రంథములు	
అష్టకవర్గు	45	బృహత్పరాశరహోరాశాస్త్రము-1	రూ.200
బృహత్జాతకం(ప్రాచీనప్రతికిపునర్ముద్రణ)	200	బృహత్పరాశరహోరాశాస్త్రము-2	200
లగ్నరత్నాకరం	36	బృహత్పరాశరహోరాశాస్త్రము-3	200
షట్పంచాశిక	120	బృహత్పరాశరహోరాశాస్త్రము-4	200
40 రోజుల్లో సంఖ్యాశాస్త్రం	150	భావార్థరత్నాకరము	75
40 రోజుల్లో నక్షత్ర (నాడీ) ఫలితములు	207	ముహూర్త చింతామణి	150
కె.పి.జ్యోతిషం (పరిచయం)	45	స్వప్న శాస్త్రము	30
ముహూర్తచింతామణి	81	శతయోగమంజరి	75
సూర్యచంద్ర గ్రహణములు	45	వ్రతనిర్ణయకల్పవల్లి	250
ప్రసిద్ధవ్యక్తుల జాతకాలు (వేరేకొండప్ప)	150	వాస్తుశాస్త్రవివేకము-1	150
అదృష్టరెమెడీస్	99	వాస్తుశాస్త్రవివేకము-2	150
ములుగువారిరాశిఫలితాలు(12రాశులువారికి)	36	వాస్తుశాస్త్రవివేకము-3	150
ములుగువారిరాశిఫలితాలు విడివిడిగాఒక్కొక్కటి	10	వాస్తుశాస్త్రవివేకము-4	150
గ్రహసంచార ఫలనిర్ణయదీపిక	36	అనుభవసులభవాస్తు - 1	75
జ్యోతిష రెమిడీస్	300	అనుభవసులభవాస్తు - 2	125

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

5. వాస్తులు

40 రోజుల్లో "వాస్తువిద్య" నేర్చుకొనండి	180
వాస్తుశాస్త్ర రహస్యములు (బైండు)	108
వాస్తునుబట్టి మీ ఇల్లు	30
మీరూ మీ వాస్తు	30
గృహవాస్తు చిట్కాలు	30
వాస్తు పూజ	30
వాస్తు సూత్రములు	30
వాస్తుశాస్త్ర రహస్యాలు	30
వాస్తు సూక్తులు	10
గృహవాస్తు వర్గులు	90
డోలనవిద్య ఉపయోగాలు (డౌజింగ్)	36
విశ్వకర్మవాస్తు శాస్త్రరీత్యా మీ ఇంటి ప్లానులు	45
విశ్వకర్మ వాస్తు శాస్త్రరీత్యా మీ ఇండ్ల ఆయములు	81
విశ్వకర్మ వాస్తు శాస్త్రం(చిత్రాల)	....
ప్రాచీన వాస్తుశాస్త్రములు	36
ఆధునిక గృహవాస్తు	81
శుభవాస్తు	207
శుభవాస్తు సలహాలు	36
వాస్తుయంత్ర రత్నావళి	90
వాస్తుశాస్త్రం	45
హౌస్ ప్లాన్లు	30
గృహవాస్తుసారం	30
గృహవాస్తు చంద్రిక	30
గృహవాస్తు దర్పణం	30
జ్యోతిష - గృహవాస్తు చంద్రిక	....
వాస్తురత్నాకరం (కొండపల్లి)	...
వాస్తు శిరోమణి ,,	...
శ్రీకృష్ణవాస్తు ,,	....
పంచవాస్తు పారిజాతం ,,	90
వాస్తుడిండిమమ్ ,,	45
వాస్తుదుందిభి ,,	90
విశ్వకర్మవాస్తుశాస్త్రము ,,	...
కృష్ణవాస్తుశాస్త్రము	45
శల్యవాస్తు,జలవాస్తు(దంతూరిపండరీనాథ్)	81
మయవాస్తు (గోరసవీరభద్రాచార్య)	120

6. మంత్రశాస్త్రాలు

శ్రీ లక్ష్మీ తంత్రమ్	360
శ్రీ గురు తంత్రం	108
సర్ప (నాగ)తంత్రం	250
మంత్రమహోదధి (స్త్రీదేవతాఃకల్పమ్)	360
మంత్రమహోదధి (పురుషదేవతాఃకల్పమ్)	360
శ్రీ దుర్గ తంత్రమ్	200
మంత్రసిద్ధి	90
మంత్రసాధన	45
తంత్రజాలం	45
యక్షిణీ తంత్రం	45
పాశుపత తంత్రం	90
మంత్రానుష్ఠాన చంద్రిక	45
సర్వదేవతా మంత్రకవచములు	45
మంత్రాక్షరాలరహస్యం(బీజాక్షరనిఘంటువు)	45
సర్వదేవతా మంత్రరత్నావళి	45
దత్తాత్రేయ మూలికాతంత్రమ్	45
సదాచార దీపిక	45
గాయత్రీ తంత్రమ్	108
గుప్త సాధన తంత్రం	45
యంత్రసిద్ధి	333
మంత్రశక్తి	45
దత్తాత్రేయ తంత్రవిద్య	45
మంత్రశాస్త్రం (గ్రంథము)	250
తాంత్రిక పంచాంగం	45
హవన తంత్రం	250
పంచదశ మహాఖడ్గ తంత్రం	90
మహాశక్తి మంత్ర తంత్ర రహస్యాలు	150
ప్రత్యంగిరాకృత్యాతంత్రం	360
షోడశనిత్యతంత్రం	250
శాక్తేయతంత్రం	250
యోగినీ-వామకేశ్వరతంత్రం	45
రుద్రయామళతంత్రం	250
ప్రపంచసారతంత్రం	45
బదనిక తంత్రమ్	45
ఉచ్ఛిష్ట గణపతి తంత్రమ్	45
రుద్రాష్టాధ్యాయః	90
పరశురామతంత్రమ్	108
లక్ష్మీప్రత్యంగిరా తంత్రమ్	250
గంధర్వ తంత్రమ్	45
హిరణ్యశూలినీ తంత్రమ్	250
మాయాప్రత్యంగిరా తంత్రమ్	250
శ్రీ విశ్వరూప ప్రత్యంగిరా తంత్రమ్	250
కామధేనువు తంత్రం	360
శూలినీదుర్గాతంత్రం	360
సౌందర్యలహరి (మంత్రయంత్రరత్నావళి)	45
మహామంత్రశాస్త్రసంగ్రహః	150
యంత్ర మంత్ర తంత్ర	45
శూలినీదుర్గాతంత్రం (చిన్నది)	100

7. గ్రంథాలు - ఆరాధనలు

భగవద్గీత శ్లోక తాత్పర్య సహితం	45
గణేశ ఆరాధన 1	90
గణేశోపాసన 2	90
నవగ్రహారాధన	144
నవగ్రహవైభవం	90
నవగ్రహ రెమెడీస్	90
నవగ్రహ వేదం	90
శనిగ్రహారాధన	90
ఆదిత్యారాధన	90
సుబ్రహ్మణ్యారాధన	90
శ్రీ శివ ఆరాధన	90
లక్ష్మీ ఆరాధన	90

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

హనుమదారాధన	90
లలితారాధన	90
శ్రీ చక్రారాధన	...
గాయత్రీ ఆరాధన	90
వీరభద్రారాధన	90
కాలసర్ప యోగం	90
నిత్య జీవితములో రుద్రాక్షలు	90
నిత్య జీవితములో నవరత్నాలు	90
సుందరకాండ వచనం	90
వేదసూక్తములు	90
అష్టాదశపురాణములు	...
వేమన పద్యసారామృతం	90
పండగలు పర్వదినాలు	90
కుజగ్రహారాధన	90
భైరవారాధన	90
సూక్తిరత్నాలు	90
మనుధర్మ శాస్త్రం (వచనంలో...)	144
పురాణపండ రామాయణం	90
పురాణపండ భారతం	90
పురాణపండ భాగవతం	90
శ్రీ లక్ష్మీసన్నిధి	90
సర్వదేవతా స్వరూపుడు వేంకటేశ్వరుడు	90
హనుమచ్చరిత్ర	90
పంచముఖ హనుమత్ వైభవం	45
శ్రీ దేవీ సప్తశతి	90
మానవధర్మాలు	.....
గరుడపురాణం	36
మాఘపురాణం	30
శివపురాణం	30
వైశాఖపురాణం	30
స్థూలాక్షరి మాఘపురాణం	45
స్థూలాక్షరి శివపురాణం	45
స్థూలాక్షరి వైశాఖపురాణం	45
కార్తీక పురాణం	25
సర్వకార్యసిద్ధికి రామాయణపారాయణ	45
మహామృత్యుంజయఅమృతపాశుపతమ్	150
పెద్దబాలశిక్ష	36
గాయత్రీ మహిమ	30
మత్స్య యంత్ర మహిమ	45
పురాణనామ చంద్రిక	......
వేదమంత్ర సంహిత	108
వృక్షదేవతలు	36
హనుమద్విజయం	30
హనుమద్వైభవమ్	30
యాజుష స్మార్త సంస్కార చంద్రిక	150
సనాతనవైదిక బ్రాహ్మణస్మార్తాగమకల్పమ్	150
నవగ్రహ దర్శనమ్	90
నిత్యజీవితంలో నవగ్రహాలు	90
సాలగ్రామములు	90

చతుర్వేదములు	108
సహస్రలింగార్చన	120
బృహత్ శివ స్తోత్ర రత్నాకరము	200
బృహత్ దేవీ స్తోత్రరత్నాకరము	200
బృహత్ విష్ణు స్తోత్రరత్నాకరము	200
కేదారనాథ్ బదరీనాథ్ యాత్రాగైడు	36
పంచమవేదం మహాభారతం	81
దేవుళ్ళు డాట్ కామ్	81
తాళపత్ర సమాహార గోపురం	144
శ్రీ హయగ్రీవ ఆరాధన	90
శ్రీలక్ష్మీనరసింహ ఆరాధన	90
దైవారాధన	90
(సూరి) వాల్మీకి రామాయణం	90
గణపతిభాష్యం	90
దక్షిణావృత శంఖములు	45
108 దివ్యదేశాల విష్ణుక్షేత్రదర్శని	30
ధర్మసింధువు(కేస్‌బైండింగ్)	240
గీతారాధన	90
యజుర్వేద ఉపనయనవివాహప్రయోగమంజరి	90
శ్రీ శివగీత	108
భారతీయ శైవక్షేత్రయాత్రాదర్శిని	100
చిలుకూరి బాలాజీచరిత్ర	30
నవయోగులు	90
ఆంధ్రప్రదేశ్‌లోనిదర్శించవలసిన ప్రముఖదర్గాలు	90
సకలదేవతా అష్టోత్తరశతనామావళి(పెద్దది)	
-(108 అష్టోత్తరశతనామావళులతో)	90
భగవత్‌స్తుతి	90
సూర్యోపాసన	30
8. వైద్య గ్రంథాలు	
ఆహారం ఆరోగ్యం	30
మూలికావైద్య చిట్కాలు	30
ఆయుర్వేద వైద్య చిట్కాలు	20
ఆయుర్వేద వైద్యం	30
గృహవైద్య రహస్యాలు	30
ఆయుర్వేద వైద్యచింతామణి - సెట్	...
గృహవైద్యసారం	30
హోమియోవైద్యం (ద్వాదశలవణచికిత్స)	45
ప్రకృతివైద్యం	30
ఆహారం-వైద్యం	81
సంపూర్ణ ఆయుర్వేద-చిట్కా వైద్యం	81
ఆయుర్వేదమ్	30
అనుపానతరంగిణి	....
ఆయుర్వేద మూలికావైద్యదీపిక	90
దుంపకూరలు, ఆకుకూరలు, కాయగూరలు	
వాకడం - ఉపయోగాలు	90
ఆకుకూరలు	...
వనమూలికావైద్యం	300
ఏకమూలికావైద్యం	90
అష్టాంగ హృదయం(4భాగాలు)	1200

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

రహస్యసిద్ధయోగవైద్యసారమ్	90
ప్రాథమిక హోమియోవైద్యం	90
ఒబెసిటి	90
హెల్త్‌గైడ్	90
ఆయుర్వేదం-జీవనవేదం	90
ఫుడ్‌థెరపి	90
న్యాచురల్‌థెరపి	90
సంపూర్ణఆరోగ్యానికి 20ని॥	90
కీళ్ళనొప్పులు మీ సమస్యలైతే...	90
యోగామంత్ర	90
యోగా సండే టు మండే	90
హెర్బల్ మెడిసిన్-హెల్త్‌టుడే	90
హెల్త్‌ఫైల్	108
9. అయ్యప్ప - భవానీ రకాలు	
శ్రీ అయ్యప్ప లీలామృతం	25
శ్రీ అయ్యప్ప ఆరాధన	45
శ్రీ అయ్యప్ప యాత్రా విశిష్టత	45
శ్రీ అయ్యప్ప భజనపాటలు	45
శ్రీ అయ్యప్ప పూజాకల్పం	15
శ్రీ అయ్యప్ప భక్తి గీతాలు	15
శ్రీ అయ్యప్ప దీక్ష F	9
శ్రీ అయ్యప్ప భజనమాల F	9
శ్రీ అయ్యప్ప నిత్యపూజ P	9
శ్రీ అయ్యప్ప నిత్యనియమావళి P	6
శ్రీ భవానీ లీలామృతం(దుర్గాభవానీదీక్ష)	25
దేవీలీలామృతం	81
శ్రీ దేవీ పూజాకల్పం	15
దేవీ భక్తిగీతాలు	15
జై భవానీదీక్ష F	9
భవానీదీక్ష P	6
దేవీ భక్తిమాల	9
శ్రీ అయ్యప్ప భజనావళి	99
అయ్యప్పపూజావిధి (జేసుదాసుసాంగ్స్‌తో)	15
10. భజనలు - కీర్తనలు	
అన్నమయ్య కీర్తనలు (బిగ్)	15
అన్నమయ్య కీర్తనలు (చిన్నవి)	9
శ్రీరామదాసు కీర్తనలు (బిగ్)	15
శ్రీరామదాసు కీర్తనలు(చిన్నవి)	9
త్యాగయ్య కీర్తనలు	9
సర్వదేవతా మంగళహారతులు	20
వసుంధర మంగళ హారతులు	20
సర్వదేవతా భజనలు	30
జానపదగీతాలు	20
చిట్టి పొట్టి పాటలు	9
జాతీయ గీతాలు	9
శివభక్తి మాల	9
విష్ణు భక్తిమాల	9
దేశభక్తి గీతాలు	30
సౌభాగ్య దేవతా మంగళహారతులు	30

పండుగలు-పుణ్యక్షేత్రాలు భక్తిగీతాలు	30
గొబ్బిళ్ళపాటలు,లాలిపాటలు,కోలాటపాటలు	30
గానవిద్యాబోధిని	90
అన్నమయ్య సంకీర్తనలు	90
పెళ్ళిపాటలు-స్త్రీలపాటలు	30
భక్తానంద భజనకీర్తనలు(ఓల్డ్‌సినీస్టైల్)	30
సర్వదేవతాభక్తిమణిమాల	30
బతుకమ్మ ఉయ్యాల పాటలు(జానపదగీతాలు)	30
11. హిట్స్ సాంగ్స్	
ఘంటసాల భగవద్గీత	15
ఘంటసాల సుమధురగీతాలు	90
పి. సుశీల సుమధురగీతాలు	90
ఎస్.పి. బాలు సుమధురగీతాలు	90
ఎస్.జానకి సుమధురగీతాలు	90
వేటూరి సుందరరామమూర్తిహిట్స్	90
సిరివెన్నెల సీతారామశాస్త్రి హిట్స్	....
సినీభక్తిగీతాలు	90
12. స్త్రీలకు ఉపయుక్త పుస్తకములు	
శ్రీకాంతామణి వంటలు (వెజ్)	45
శాకాహార వంటలు	20
మాంసాహారవంటలు	20
చిట్టిచిట్కాలు	20
అందానికి చిట్కాలు	20
పిల్లల పేర్లు (పెద్దది)	20
పిల్లల పేర్లు (చిన్నది)	9
లేటెస్ట్ ఎంబ్రాయిడరీ శారీబోర్డర్స్	30
లేటెస్ట్ ఎంబ్రాయిడరీ డిజైన్స్	30
చిన్నారులకు చిరుతిళ్ళు	20
పసందైన ఫాస్ట్‌ఫుడ్ వంటలు	20
పలావ్‌లు, ఫ్రైడ్ రైస్‌లు, వెరైటీరైస్‌లు	20
వేపుళ్ళు-ఇగుర్లు	20
శ్రీకాంతామణి వంటలు (నాన్‌వెజ్)	45
ఇంగ్లీషులోఆడపిల్లలపేర్లు	36
ఇంగ్లీషులో మగపిల్లలపేర్లు	36
బ్రేక్‌ఫాస్ట్ వంటలు	20
పండుగలలో చేసుకొనే పిండివంటలు	20
మైక్రోవోవెన్ వంటలు	81
సర్వదేవతాభక్తిమాల	30
పిల్లలపేర్లు (బాబు)	30
పిల్లలపేర్లు (పాప)	30
మోడ్రన్ మెహంది (గోరింటాకు డిజైన్స్)	30
వివిధ రకాలు	
ఎందరోమహానుభావులు	150
యోగాసనాలు	30
సూర్యనమస్కారములు	30
పొడుపుకథలు (పెద్దది)	20
పొడుపు కథలు (చిన్నవి)	5
కాలజ్ఞాన తత్త్వాలు	20
హిందీ-తెలుగు-స్వబోధిని	15

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.

ఇంగ్లీషు-తెలుగు-స్వబోధిని	15
జనరల్ నాలెడ్జ్	15
నూరు ఎక్కాలు	7
1-100 టేబుల్ బుక్	7
శ్రీరామకోటి	25
శ్రీశివకోటి	25
మేజిక్	20
అంకెలతో గారడీ	20
ప్రేమకథలు	20
యువతరంగాలు (యువతరంకోసం)	20
ప్రేమా నీకు జోహార్లు (లవ్‌డిక్షనరీ)	20
హృదయస్పందన (కవితలు)	20
వాత్స్యయన కామసూత్రాలు	30
ఎ.పి.టూరిస్ట్ గైడు	30
ఇంద్రజాల రహస్యాలు	25
మహేంద్రజాల రహస్యాలు	25
విజయం మీదే	30
కలిసి జీవిద్దాం	30
నాదబ్రహ్మోపాసన (ధ్యానం+సంగీతంమేలు కలయిక)	90
శరీరభాష (బాడీ లాంగ్వేజ్)	90
క్రియాయోగం	30
ఆనందంగా జీవిద్దాం	81
హరిశ్చంద్ర నాటకం	45
మ్యాజిక్‌గైడ్-ట్రిక్కులు,తమాషాలు-కపటిప్రపంచం	90
చదరంగం	90
వాత్సాయనకామసూత్రాలు	90
పంచసాయకం	90
రతిరహస్యాలు	90
అనంగరంగం (కంభంపాటి స్వయంప్రకాష్)	90
శృంగారకేళి (కంభంపాటి స్వయంప్రకాష్)	90
మార్షల్‌ఆర్ట్స్ (కరాటే,కుంగ్‌ఫూనేర్చుకోండి)	90
మంత్రశాస్త్రమహోదధి	90
అసతోమయ సద్గమయ	36
గాయత్రీవిజ్ఞాన్	90
చింతామణి (నాటకం)	50
పాండవ ఉద్యోగం (నాటకం)	45
బాలనాగమ్మ (నాటకం)	50
కాళహస్తి స్త్రీల వ్రతకథలు	30
కాళహస్తి రామాంజనేయ యుద్ధం(బదిరెడ్డి)	45
కాళహస్తి గోవింద నామాల భగవద్గీత	25
కాళహస్తి గృహవాస్తు చింతామణి	90
కాళహస్తి గృహవాస్తు మర్మాలు (బైండు)	45
కాళహస్తి శివపురాణం	90

కాళహస్తి దేవీభాగవతం	90
కులార్ణవ తంత్రమ్	150
ఆచార్య సిద్ధ నాగార్జునతంత్రం(ఒరిజనల్)	250
యోగాసనాలు (VG/TNL)	30
రామరాయ వాస్తుశాస్త్రం (ముద్రగడ రామారావు)	90
ఎం.ఎస్.ఆర్.హనుమాన్‌చాలీసా	9
ఎం.ఎస్.ఆర్.సుందరకాండ	70
అష్టముఖ గండభేరుండతంత్రం	75
బ్రహ్మంగారిజీవితచరిత్ర (జవంగుల)	75
తరిగొండవెంగమాంబవిరిచిత-శ్రీవేంకటాచలమాహాత్మ్యం	150
శ్రీ ఆదిశంకరాచార్య దివ్యచరితామృతం	36
గీతాంజలి (రవీంద్రనాథ్‌ఠాగూర్)	45
కాశీరామేశ్వర మజిలీ కథలు	75
శ్రీలలితాసహస్రనామము(భాస్కరభాష్యం)	500
శ్రీదేవీభాగవతం బైండు	261
శ్రీశివపురాణం బైండు	260
ప్రకృతిసిద్ధాంతములు-వేదవిజ్ఞానము -ఫలితజాతక సూత్రములు	595
విశ్వకర్మ ప్రకాశము	106
ప్రాచీనవాస్తుశాస్త్రాలు-ఆధునికవాస్తుపరిశీలన	250
గుప్తవాస్తు వాస్తువిజ్ఞానజ్యోతి	150
నారద సంహిత	150
రాహుకేతువులు సమస్త ప్రభావములు	100
అంగారకుడు (కుజుడు)	45
పురోహిత దర్శని (గోరసవీరభద్రాచార్య)	150
విశ్వకర్మవాస్తువిద్యారహస్యములు ,,	225
వాస్తు విజ్ఞాన చంద్రిక	,,100
మహాదశా పారిజాతం	,,100
25సం॥ పంచాంగం (2000-2025)	,,250
Latitude - Longitude (English)	,, 50
జాతక నారాయణీయం(వాద్రేవువారివి)	రూ.150
వాస్తు నారాయణీయం ,,	120
యోగావళీఖండం ,,	120
ముహూర్త సింధువు ,,	150
జయభారతి (పురాణపండశ్రీనివాస్)	21
జయహే...జయహే... ,,	27
జయతు...జయతు... ,,	27
సాయి... ,,	45
శ్రీమాలిక ,,	20
ఆరతిసాయిబాబా ,,	25
అంగారకుడు	45
శుక్రుడు	45
రాహుకేతువుల సమస్త ప్రభావాలు	100

ఈ ధరలు నికరముకాదు, ఎప్పటికప్పుడు మారుచుండవచ్చును.